



వేదాంగాలు


భాష

భాషా చారిత్రిక వ్యాసావళి








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120029009

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

భాషా చారిత్రక వ్యాసావళి

తూమాటి దోణప్ప
ఆంధ్ర విశ్వవిద్యాలయం : వాల్తేరు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ : : హైదరాబాదు.

విజ్ఞప్తి

ఆంధ్ర సారస్వత పరిషత్తు లక్ష్యములలో పండిత సారస్వత, ప్రజా సారస్వత, బాల సారస్వతములను విద్వాంసులచే వ్రాయించి ప్రకటించుట ముఖ్యమైనది. ఆ వరుసలో సుప్రసిద్ధ పరిశోధక పండితులైన డా. తూమాటి దొణప్పగారి 'భాషా చారిత్రక వ్యాసావళి' ని పండిత సారస్వతముగా ప్రచురించుచున్నాము.

డాక్టర్ తూమాటి దొణప్ప గారు ఆంధ్ర విశ్వవిద్యాలయములో ప్రొఫెసరుగా పనిచేయుచున్న ప్రసిద్ధ భాషావేత్తలు. వీరు తెలుగు భాషా చరిత్రకు సంబంధించిన అమూల్యములైన వ్యాసములను భారతి, సాహితి, ఆంధ్రప్రదేశ్ మొదలైన పత్రికలలో చాల ప్రకటించినారు. వీరి వ్యాసములన్నియు భాషాస్వరూపమును తెలిసికొనగోరు జిజ్ఞాసువులకు పరమప్రయోజనకరములని వేరుగా చెప్పనక్కర లేదు. ఆంధ్రదేశమున భాషాశాస్త్రమును మథించిన విద్వాంసులు చాల కొద్దిమంది మాత్రమే కలరు. వారిలో డా. దొణప్పగారు ప్రథమ గణ్యులు.

ఈ సంపుటియందు వారి 'నన్నయ్య-అన్యదేశ్యాభాసములు', 'శ్రీనాథ యుగము—అన్యదేశ్యములు', 'ఆంధ్రభాష—హకారాది పదములు', 'తెలుగులో బుడతకీచు నుడులు', 'మరాఠీలోని తెలుగు నుడులు', 'తెలుగునందలి కృతకప్రామాణిక రూపములు' అను వ్యాసములు వారి పరిశోధనాపాటవమునకు నికషాయమాణములు. వారికి గల బహుభాషాపాండిత్యమునకు ఈ వ్యాససంపుటి ఉచిత నిదర్శనము.

కోరిన వెంటనే విలువగల తమ వ్యాసములను ప్రకటించుట కనుమతించి యిచ్చిన డాక్టర్ తూమాటి దొణప్ప గారికి కృతజ్ఞతలు తెల్పుకొనుచున్నాము. ప్రత్యేక దృష్టితో ఉత్తమ గ్రంథములను ప్రచురించుచున్న పరిషత్తునకు ఆంధ్ర పాఠకలోకము సంపూర్ణముగ సహకరించి చేయూత నొసగగలదని ఆశించుచున్నాము.

గడియారం రామకృష్ణశర్మ
ప్రధాన కార్యదర్శి.

తొలి పలుకు

శబ్దస్వరూప నిరూపణము భాషా విజ్ఞానములో ఒక భాగము. ఈ ఏకదేశమునకు రేఖామాత్రముగా చిత్రించు వ్యాససంపుటి 'భాషా చారిత్రక వ్యాసావళి'. తెలుగునందలి దేశ్యేతర పదజాలము అట్టుపుట్టానవాళ్లను నిర్ణయించుటకు చేసిన పరిశ్రమమునకు ఫల మీ సంపుటియందలి ముఖ్యవ్యాసములు.

అప్పుడప్పుడు వివిధ పత్రికలలో ప్రకటితములైన నా వ్యాసములు చెల్లాచెదరుగా నుండుటను చూచిన సహవ్రతులగు మిత్రులు కొందఱు వానిని పుస్తకరూపమున సంగ్రథనము సేయుట అవశ్యకమని సూచించుచు వచ్చిరి. ఎప్పటికప్పుడు ఏవేవో చిక్కులు వచ్చిపడుట వలన ఆ సూచన కార్యరూపమును దాల్చుట కింతకాలము పట్టినది.

ఇవి సామాన్యులకొఱ కుద్దేశింపఁబడినవి కావు. వీని పరిమిత ప్రయోజనములు వేఱు, ప్రజాసారస్వముతోపాటు పండిత సారస్వతమును ప్రచురించుట ధ్యేయముగాఁ గలిగిన హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తువారు ఈ సంపుటిని తమ ప్రచురణముగా ముద్రింతుమని ముందునకు వచ్చిరి.

వీనిని ఉన్నవి ఉన్నట్లుగా అచ్చునకిచ్చితిని. పత్రికలలో వచ్చిన అచ్చుతప్పులతోపాటు క్రొత్తవి కొన్ని ఈ సంపుటిలో వచ్చి చేరినవి ప్రెస్సొకచోట, దూరముగా నే నొకచోట ఉండుటవలన ప్రూఫులు సరిచూచికొనుటకు వలనుపడినది కాదు. అచ్చుతప్పులను, అసలుతప్పులను పాఠకులు అవలీలగా గుర్తింపఁగలరని నా నమ్మకము.

కృతి స్వీకృతి కంగీకరించిన శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి, ప్రచురణకర్తలగు ఆంధ్ర సారస్వత పరిషత్తువారికి, పరిషత్కార్యదర్శి శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారికి, సాహితీ ముద్రణాలయము వారికి, కొంతవరకు ప్రూఫులుచూసిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యవిద్యాకళాశాల ప్రాధ్యాపకులు శ్రీ కే. కే. రంగనాథాచార్యులు గారికి కృతజ్ఞతాభివందనములు.

వాల్తేరు, తూమాటి దోణప్ప.

5-11-72.

విషయసూచిక

1.	'నన్నికవిద్వయము' – అన్యదేశ్యాభాసములు	–	1
2.	నన్నయ – అన్యదేశ్యాభాసములు–I	–	32
3.	నన్నయ – అన్యదేశ్యాభాసములు–II	–	62
4.	వికృతి వివేక కర్తృత్వము	–	85
5.	ఆంధ్రభాష – హకారాది పదములు	–	96
6.	శ్రీనాథయుగము – అన్యదేశ్యములు	–	145
7.	తెలుగులో బుడతకీచు నుడులు	–	214
8.	మరాఠీలోని తెలుఁగు నుడులు	–	302
9.	తెలుఁగునందలి కృతకప్రాణిక రూపములు	–	330

'నన్నికవిద్వయము' – అన్యదేశ్యాభాసములు

'గుఱు తెలిఁగి వస్తు చయమున
కొఱఁగెడు నా దీపవర్తియును బోలె నిజ
మ్మెఱిఁగి కృతివస్తు సమితికి
వఱలఁగ మదినెఱుఁగు విబుధవర్గముఁ దలఁతున్'

–నన్నెచోడుని కుమారసంభవము, (1) 1–26

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు "సత్కవిరాజోక్త కుమార సంభవ మహాకావ్యంబు" న అంతరములగు కొన్ని ఆధారముల మూలమున నన్నెచోడకవి కాలమును నిర్ణయముసేయ సమకట్టుట ప్రశస్త ప్రయత్నము. అందులో నన్నెచోడకవి ప్రయుక్తపద సంబంధి చర్చయొక భాగము (2). కాని, ఈ చర్చారీతి శాస్త్రీయ పద్ధతులలో సాఁగనందున వారి ఉద్యమము నిర్దిష్టార్థ సాధకము కాకపోయినది. కైపు, తరవారి, బాఁకు–ఈ మూఁడు పదము

---

1. పరిశీలించిన కుమారసంభవప్రతులు :
   i. మానవల్లివారి ప్రతి :
   మొదటి భాగము, వేపేరి, టి. వి. చెంగల్వరాయ నాయకర్ అర్ఫనేజ్, ముద్రాక్షరశాల చెన్నపట్టణము. 1909.
   రెండవ భాగము, జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1914.
   ii. మదరాసు విశ్వవిద్యాలయ ప్రతి, శ్రీకోరాడ రామకృష్ణయ్య సంపాదితము, 1948.
   iii. వావిళ్ళవారి ప్రతులు, 1953, 1961 ముద్రణలు.
2. 'నన్నెచోడుఁడు తురుష్కుల అనఁగా అల్లాయుద్దీను, మాలిక్ కాఫర్ మొదలైన వారిదండ యాత్రలకు అనంతరుఁడా ముందువాఁడా యను ప్రశ్నకు అనంతరుఁ డేమోయని అతఁడు ప్రయోగించిన కొన్ని పదములచే తోఁచుచున్నది. అది (1) బాఁకు, (2) కైపు,(3) తరవారి (శ్రీవేదము వేంకటరాయశాస్త్రి,ఎం. ఏ. గారి 'నన్నెచోడుని కవిత్వము",ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి బహూమతినందిన గ్రంథము, మదరాసు.1959; పుటలు 91, 92).

లును అన్యదేశ్యములను భావనతో వారు తమ చర్చను ఎత్తుగడ చేసి "మఱి యిది (కైపు) పూర్తిగా ఆంధ్రదేశీయమా లేక తురుష్కులయనంతరము మన భాషలోనికి వచ్చినదా యనునదే ప్రశ్న" (3). అను అస్తినాస్తి విచికిత్సలోపడి, "వీనిని (కైపు, బాఁకులను) త్రోసి పుచ్చినను తరవారి శబ్దమును ప్రయోగించిన యొక పద్యము అల్లావుద్దీను చక్రవర్తిని గూర్చిన శ్లోకమును స్మరింపఁ జేయుట చిత్రము" (4) అని కొంత కొన సాగించి, చివరచివరకు "పై పదములు అన్యదేశ్యములైనను కాకపోయినను, నన్నె చోడుని కాలము తారీఖులతో కుదరకపోయినను, కాకతీయ సామ్రాజ్య పతనమునకు మాత్రము చాలముందేయని తోఁచుచున్నది" (5) అని అసలు ప్రతిపాదనమును సవసవగా జాఱవిడిచిరి. శ్రీశాస్త్రిగారు ఇదమిత్థమ్మని నిర్ధారింప లేక ఇట్లు అర్ధాంతరముగా వదలిన దుర్బల వాదమును పూజ్యులు శ్రీ దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డిగారు చేపట్టి, (6) పూర్వోక్త పదములను అన్యదేశ్యములని అవిమర్శముగా అంగీకరించి, వానిని సమర్థించుటలో పోయిన పోకలు ససిగా లేవని నిరూపించుటకు ఈవ్యాసము దిష్టము.

నన్నె చోడునితో పాటు అథర్వణుఁడును నన్నయకు సమకాలికుఁడనిగదా శ్రీరెడ్డిగారి దృఢవ్రతము. అన్యదేశ్యప్రయుక్తిచే నన్నెచోడుని యెక్కుయు, 'అన్యదేశీయ" పదప్రయుక్తిచే అథర్వణుని యొక్కుయు అర్వాక్కాలికత స్థాపితమగునేమో యని వారి అదుర్దా. స్వపక్ష స్థాపనాభినివేశముతో శ్రీ రెడ్డిగారు నన్నయకృతిలో కూడ అన్యదేశ్యములు ప్రయుక్తములయినవని నిరూపింప యత్నించుట ఆకాశమున మూఁకలు వేయుట. నన్నయ భారతమున "గాడీ" అను "తురుష్క" భాషాపదము ప్రయుక్తమయినదను వీరి ప్రతిపాదనము దీని ఫలము. "క్రీ. శ. 11 వ శతాబ్దములో అథర్వణాచార్యులు చెప్పినట్లు అన్యదేశీయపదము నింద్యము కాదనుటకు 'గాడి'. 'తరవారి', "కైఁపు", 'బాఁకు'

---

3. పైది, పు. 94.
4. పైది, పు. 95
5. పైది, పు. 97.
6. శ్రీ దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డిగారి 'తెంకణాదిత్యకవి'. తెంకణగ్రంథమాల, ఉలవపాడు, నెల్లూరుజిల్లా, 1960, పుటలు 76-83.

అను నన్ని కవిద్వయ ప్రయోగములు గలవు" (7) అను శ్రీ రెడ్డిగారి మతము సూరిజన సమ్మతము కాదు. అయినను అన్యదేశ్యములను వాడి తీఱవలెనను నిర్బంధము కవులకులేదుకదా! వీనిని పరిహరించి కవితచెప్పిన ఆధునికులెందఱో కలరు. కావున. అన్యదేశ్యములను వాడ నంత మాత్రమున ప్రాచీనులనుట కుదురదు: వాడినవారు అర్వాచీనులు కారనుట అసలే అదుకదు. "తెనుగు భారతములో "తురక' జాతి అన్యదేశీయ పదమును (తురుష్కగా) సంస్కృతీకరించి ప్రయోగించినప్పుడు లేని దోషము ఆ తురష్కభాషయందలి "గాడీలు" అను అన్యదేశీయ శబ్దమును శబ్దశాసనుఁడు ప్రయోగించుటలో దోషము కలదా" (8) అని రెడ్డిగారి ఎదురుసవాలు. భాష పరంపరీణము, పరిణామ శీలము కావున అన్యదేశ్య పదప్రయోగపద్ధతి దోషజుష్టమని రసప్రబుద్ధులు భావింపరు (9). మహాకవి ప్రయుక్తమయినచో కన్నులకద్దుకొనమా? అసలిట్టి అన్యదేశ్యములు నానా రుచిరార్థ సూక్తినిధియగు నన్నయభట్టు రచనలో ఉపయుక్తము కాలేదని పండిత పరిశీలకుల సిద్ధాంతము (10). కాని, శ్రీ వేంకట కృష్ణారెడ్డిగారి సవాలులో రెండుదోషము లున్నవి. ఒకటి ; జాతివాచకమగు 'తురక' పదమును నన్నయ 'తురుష్కగా' సంస్కృతీకరించెననుట. రెండు 'గాడీలు' తురుష్కభాషాపదమనుట. 'తురక' ను 'తురుష్క' గా నన్నయ సంస్కృతీకరింపలేదు రాజతరంగిణి (క్రీ. శ. 1129_1150), కథాసరిత్సాగర (క్రీ శ. 1029_1064), బృహత్సంహిత (క్రీ. శ. 6 వ శతాబ్దము) 'సుశ్రుత సంహిత, మున్నగు గీర్వాణ గ్రంథములలో 'తురుష్క' పదము హెరాళముగా ప్రయుక్తము. కప్పసుత్తం, సమవాయంగసుత్తం (క్రీ. పూ. 300) మొదలగు ప్రాకృత భాషాకృతులయందు మూలరూపములగు తురుక్క', 'తురుక్కీ' పదములు జాతి పర

7. పైది, పు 83. 8. పైది, పు 79.

9. i. 'క్షితిమ్లేచ్ఛ భాషశ్రుతిగ
ర్హితమగునట్లైన నా ధరిత్రిని దానిన్
మతిరోసి విడువఁగూడదు
సతతము వ్యవహార హాని సంధిలు కతనన్' (అప్పకవీయము 1_66)

ii. "అహేయ మన్యదేశీయం యత్తదేవ ప్రయుజ్యతే' (వికృతి వివేకము, సంజ్ఞా, కారిక, 9).

iii. 'ఈ 'తురక' మాటలు అపరిహార్యములు, సరసకవితకు ఆలంబనములు' బాలకవి శరణ్యం పు. 227.).

ముగాఁ గన్పట్టుచున్నవి. 'గాడీ' 'తురుక' పదము కానేకాదు: అరబ్బీ మాట అంతకంటె కాదు. దీని పుట్టు పెంపకములు వేఱు. ఈ తీఱు తెన్నులు వక్ష్యమాణము(11).

నన్నయ భారతములోని 'ఏ నూఱుగాడిదలను' అనుపాఠమే కవిహృదయము. ఈయంశము సూర్యరాయాంధ్ర నిఘంటువున స్పష్టముగా నిరూపితము. ఇట్టిచో 'దూషితకుతర్కవాదులగు శ్రీరెడ్డిగారు 'భాషాకటాక్ష విభ్రమము నా మెఱుఁగారు సదమల శబ్దార్థ శాస్త్రములను' చిన్న చూపు చూచి, పరాస్తమయిన "గాడీలు' అను నడుమంత్రపు పాఠమును పునరుద్ధరింప నడుముకట్టుట సాహితీ తత్త్వ జిజ్ఞాసువుల దురదృష్టము. "గ్రంథాంతరంగిక ప్రమాణములు రెంటిలో భాషావాద చరిత్రను మాత్రమే నమ్మి గణితకవి దేశకాలాది చరిత్రను నమ్మ కూడదనుట పక్షపాత సిద్ధాంతమేకాని, నిష్పాక్షిక సిద్ధాంతము కాఁజాలదు" (12) అని రెడ్డిగారి వితర్కము. యథేచ్ఛసి తథాస్తు ! అట్లని "భాషాచరిత్ర కల్పిత" (13) మనుట విపరీత ప్రతిభాష. భాషాపరిణామరీతులను ప్రాయికముగా ఒక నిర్ణీతరీతిని అనుసరించునని చెప్పవచ్చినది. భాషాచరిత్రకు ప్రబలాధారము గ్రంథస్థమయిన వాస్తవ ప్రయోగపఙ్క్తి. వ్యంగ్య గణితాదుల చరిత్రకు ప్రత్యక్ష

---

10. "నన్నయ కాలమునకుఁ దురుష్కులయు నాంగ్లేయులయు భాషలు తెలుగునఁ బ్రవేశించుట కవకాశము లేకుండుటచేత నన్నయ చింతామణిలో నన్యదేశ్యమును పేర్కొనలేదు. తన భారతమునఁ బ్రయోగింపనులేదు. యయాతి చరిత్ర-మను చరిత్రాదులలో నన్యదేశ్య (తురుష్క) శబ్దములు ధారాళముగా వాడఁబడినవి. కాన నేఁటి వ్యాకరణములలో నన్యదేశ్యము నొక భాగముగా నంగీకరించుట యుక్తము" - కళాప్రపూర్ణ వఝ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారి బాల వ్యాకరణోద్ద్యోతము, సంజ్ఞా సూ. 3, పు. 10, మూలతత్త్వ మిట్లున్నదని యెఱిఁగియు శ్రీ వఝ్ఝలవారు తమ బాలవ్యాకరణోద్ద్యోత పీఠికలో అన్యదేశ్యప్రసక్తిలో విమర్శక మర్యాదల నతిక్రమించి స్వవచో వ్యాఘాతముగా ప్రసంగము నడుపుట శోచనీయము. "అలంతి' విజ్ఞులు వెలిబుచ్చిన అభిప్రాయములను 'సత్యవిదూరము' లను దబాయింపులతో గాక సహేతుకములును, శాస్త్రీయములునునగు సమాధానములిచ్చి సత్యావిష్కరణ మొనర్చుట 'వలంతి' విజ్ఞుల ధర్మము.

11. వివరణకు : ఈ పరంపరలోని ద్వితీయవ్యాసమును చూడ వేఁడికోలు.

12. తెంకణాదిత్యకవి, పు. 103. 13. షైది, పు. 106.

సాక్ష్యము మృగ్యము; అనుమాన ప్రమాణము గౌణపక్షము, అందును, ఈ అను మానమున కాధారములు ఆభాసమాత్రములు. హేత్వాభాసము తత్త్వాన్వేషణమున దుర్బల మనివేత్తల మతము. "గ్రంథాంతరంగిక వ్యంగ్యగణిత చరిత్రకంటె తద్గ్రంథాంతరంగిక భాషాప్రయోగములు ప్రబల ప్రమాణములు కావు" (14) అను రెడ్డిగారి నిర్ణయముపై వ్యాఖ్యాన మనావశ్యము. గణితప్రాధాన్య వాద పక్షపాతము కలదగుటచే ఇది పక్షాభాసము. అయినను తమ నిర్ణయమును సోపపత్తికముగా నిరూపించు భారము అఖిల విద్యానిపుణులగు శ్రీ రెడ్డిగారిది. గణితశాస్త్రమును తప్పనుట సాహసము; సమన్వయక్రమము శాస్త్రీయమా, కాదా అనునదే చర్చ. తెంకణాదిత్యకవి తన కాలాదికములను భంగ్యంతరముగా సూచించెనను ప్రతిపాదనమునకు కేవలముఊహయే ఆధారము. ఉత్తమప్రతిభులగు శ్రీ రెడ్డిగారి ఊహాదోహలమునకీ వ్యంగ్య గణిత సమన్వయము ఉదాత్తమయిన తార్కాణము. నన్నెచోడుని దైవజ్ఞగణిత సూచనలలో వ్యంగ్య వైభవము ఉండవచ్చు; ఉండకపోవచ్చు. దీని బాఁగాములు ప్రస్తుత చర్చలో అప్రసక్తము. అన్యత్ర నన్నెచోడుని కాలము "ఫలానా' యని స్పష్టముగా స్థాపితమయినపుడు ఈ భంగ్యంతర సూచనలు ప్రధాన ప్రతిపాదనమునకు ప్రోద్బలకముగు ఉపలక్ష్య ములు కాఁగలవు గాని, స్వయముగా కవికాలనిర్ణయ సమర్థములు కానేరవు. అది విషయాంతరము.

"కొన్ని దేశ్యములకు సదృశములు పారసీభాషలో కనఁబడుట వింత. ఉదా : బావి-బావులీ-దిగ్గియ దీర్ఘిక యని యర్థము'' (15) శ్రీ వేంకట రాయ శాస్త్రిగారి ఈ ప్రతిపాదనలోని తాత్పర్యమేమో దురూహము. తెలుఁగున 'బావి' దేశ్యము, కాదు; తద్భవము. ప్రాచీను లెవరును దీనిని దేశ్యముగా పేర్కొనలేదు; ఏ ప్రామాణిక నిఘంటువునను ఈ సూచనలేదు. సంస్కృతము నందలి "వాపీ" పదము, ప్రాకృతముల "వావీ" యయి, తెలుఁగునకుగల ప్రాకృతభాషా సాహచర్యము మూలముగా నిది తెలుఁగున "బావి' యయినది. ప్రాకృతాంధ్రములలోని 'వ' - 'బ' ల పరిణామ పద్ధతి ధ్వని సూత్రబద్ధము.

---

14. వైది, పు. 75.

15. వేదము, నన్నె చోడుని కవిత్వము, పు.

సంస్కృతము	ప్రాకృతము	తెలుగు
వణిజ	వణిజ (య)	బలిజ
వాపీ	వావీ	బావి
విస్తార	విత్థార	బిత్తరము
వృషభ	వసభ (హ)-	బసవ
వేత్ర	వేత్త	బెత్తము
వైశ్య	వేస్స	బచ్చు
వ్రీడా	విడ్డా, వీడా	బిడియము

మొదలగునవి పై సూత్రమునకు లక్ష్యములు. 'బావులీ' పారశీక భాషాపదము. నవీనోత్తరాహ భాషలలో బావి (వు) డీ రీ, లీ) పదమునకుఁగల ప్రచుర వ్యవహారమునకు పారసీక భాషా ప్రభావము ప్రబల హేతువు. బావిడీలోని చివరి యక్షరము ప్రత్యయమని హిందీ నిఘంటు కారుల యాశయము. ఏది యెట్లయినను, తెలుఁగున 'బావి" దేశ్యము కాదుగదా! వైదిక సంస్కృతమును ప్రాచీన పారసీక భాషయును జ్ఞాతి భాషలనియు, ఇండో యూరపియను భాషా కుటుంబము లోని ప్రాచ్యశాఖయగు ఇండో-ఇరేనియను భాషాకుటుంబము వీనికి సమీప మాతృకయనియు శాస్త్రిగారెఱుఁగని యంశముకాదు. ఈ రెండు భాషలలోని కొన్ని జ్ఞాతిపదముల (Cognate words) ను పోల్చి, ఈ చూపుతో చూచినచో కల రూపు నిరూపితము కాఁగలదు.

పారసి	సంస్కృతము
అందర్	అంతర
అస్ప	అశ్వ
ఆబ్	ఆపస్
కార్	కార్య
ఖానహ్	స్థాన
ఖుష్క్	శుష్క
గరమ్	ఘర్మ
చర్ ఖ్	చక్ర
-దార్	-ధారీ
దుఖ్ తర్	దుహితృ

సమాజ్	సమస్
బాజు	బాహు
వారిస్	ఔరస
హజార్	సహస్ర

"అన్యదేశీయుల ప్రాచీన చరిత్రను గమనింపని విమర్శలు కొన్ని బయలుదేరుచున్నవి" (16). అని రెడ్డిగారిమందలింపు, కాని, అక్కడే ఉన్నది చిక్కు. మన మెఱుఁగనిదానిపై చేయి వేయుట శ్రేయముకాదు. అయినను, చాపలమనునది ఎంత చెడ్డదో అంతదొడ్డది. దానిని అదపులో పెట్టుట అందఱకును అలవికాని పని, అందును కుఱ్ఱకారునకాతొందఱ కొండంత. సంయమమనునది సాధనమీఁద, సంస్కారముమీఁద అలవడు లక్షణము. తప్పుదారి పట్టినవారిని మందలించుటతో సరిపెట్టుకొనక సరియైన దారియేదో ప్రదర్శించుట విద్యా పరమార్థవేదులగు పెద్దల విధి. అన్యదేశీయముల ప్రాచీన చరిత్ర యెట్టిదో విశదీకరించు పని రెడ్డిగారి మీఁద నున్నది. 'నన్నెచోడకవి ప్రయోగములు (కైపు, తరవారి, జాఁకు) అరబ్బీ, హిందీ భాషలలోనివేయైనను, సంస్కృత ప్రాకృత భాషలలోను, తమిళ, కర్ణా, టాంధ్రభాషలలోను కూడ వ్యవహరింపఁ బడుచుండినవనుట నిఘంటుసమ్మతము" (17). అనుదృఢ విశ్వాసముతో శ్రీ రెడ్డిగారు తమ చర్చకు శ్రీకారము చుట్టిరి. "సవతు లందరు సమానులు కాఁబట్టి 'సవత్-సవతు" కూడ తత్సమానార్థక జాతీయమయినది. క్రీ. శ. 11 శతాబ్దమున తురక పదములు ఆంధ్ర భాషలో లేవనుభ్రమతో పండితులో వ్రాయసకారులో (నన్నయ భారతమున) "గాడీలు" — "గాడిదెలు" 'సవతు – సరియు' అని తుడుపులు పెట్టి మూలపాఠము మార్చినారు (18) 'అని రెడ్డిగారి ఆరోపణము. "దీనిలో (సవతి గంధవారణ బస్తీ) "సవతి బస్తీ' అను రెండు హిందూస్తానీ పదాలు కాఁబోలు కలసిమెలసి యున్నవి" (19) అని రెడ్డిగారి భావన. అనఁగా "సవతు'తో పాటు తెలుఁగులోని 'సవతి' (= తోడి పెండ్లాము) పదమును శ్రీరెడ్డిగారి దృష్టితో

16. తెంకణాదిత్యకవి, పు. 50.
17. పైది, పు. 76.
18. పైది, అనుబంధము, పు. 7.
19. పైది, అనుబంధము, పు. 7.

హిందీ మాట యనుట స్పష్టము. కాని, వేదము వారు పేర్కొన్న క్రైపు, తర వారులుగాని, వేదమార్గాను సారులగు దేవరపల్లివారు తమ వాదబలమునకు వత్తాసిగా శాసన సంపుటములనుండియు, నన్నయ భారతము నుండియు ఎత్తి చూపిన సవతి, సవతులు గాని అన్యదేశ్యములు కావు. 'తరవారి' తత్సమము; "క్రైపు, శుద్ధద్రావిడపిండము; 'సవతి'. 'సవతు'లు తద్భవములు. "గాది' "బాఁకు" లు హింద్వార్య భాషాజన్యములయిన అన్యదేశ్యములు. అయి 'గాదీ' "బాకు, పదఘటితములిట అప పాఠములు. ఇట్లు వీరి అనుమితి కాలంబన ములుగా స్వీకృతములయిన అంశములు భ్రాంతి మూలకములు. శాస్త్రిగారిది సహజభ్రాంతి; రెడ్డిగారిది ఇచ్ఛాజన్య భ్రాంతి. భ్రాంతి మూలకవాదము లెట్టి వింత సిద్ధాంతములకు దారితీయునో వీరు త్రొక్కిన త్రోవలు చక్కని దృష్టాంతములు కాఁగలవు

వ్యుత్పత్తి స్వభావము ననుసరించి అన్యదేశ్యములు రెండురకములు. అరబ్బీ, తుర్కీ పారసీకాద్యన్య సీమలయొక్క వాగ్వ్యవహార రూపములలో స్వతస్సిద్ధములయి వానినుండి ప్రత్యక్షముగాఁగాని, పరోక్షముగా మరాఠీ, హింద్యాది హింద్వార్య భాషా శాఖా జన్యముల ద్వారమున ఁగాని తెలుఁగున ఁజేరినవి ఒక వర్గము. హిందార్య భాషా శాఖా జన్యములయిన నవీనోత్తరాహ భాషలలో నిసర్గములయి, సంసర్గవశమున తెలుఁగున ప్రవేశించినవి రెండవ వర్గము. వెరసి రెండును అన్యదేశ్యములని శాస్త్రమర్యాద. ఇటీవల సంసర్గము కారణముగా తెలుగుఁన ఁజేరిన ఇంగ్లీషు, డచ్చి, బుడతకీచు పదములను సైతము ఈ అన్యదేశ్యములతో కలిపి వ్యవహరించుట లెస్స. తెలుఁగునకు సజాతీయములయిన తమిళ కర్ణాటాది భాషలనుండి ఎరువు తెచ్చిన పదములను అన్యదేశ్యములని వ్యవహరించు సంప్రదాయము లేదు. ఈ భాషలతో తెలుఁగును పోల్చి చూచుదృష్టి ఇప్పుడిప్పుడు కదా మనకు కలుగుట! "కొందఱు పొగడి నంత యత్యుత్తమ మయినది కాక పోయినను, నన్నె చోడుని కవిత్వమన్య భాషాపద దూషితము కానియెడల నుత్తమమయినదనియే చెప్పవచ్చును." (20) అను కందుకూరి వారి అభిప్రాయముతో ఏకీభవించుట కష్టము. ఇట 'అన్య భాషాపదము' లనఁగా తమిళ కర్ణాటాది సజాతీయ ద్రావిడ భాషలనుండి

20. ఆంధ్రకవులచరిత్రము, మొదటిసంపుటము. పు. 198.

ఎరువు తెచ్చిన పదములనియే పంతులవారి ప్రసంగ వైఖరిని బట్టియు, వారొసంగిన ఉదాహరణములను బటియు స్పష్టము. ఇది యిట్లుండ శ్రీ వీరేశలింగము గారి ప్రతిపాదనమును పరామర్శించుచు విమర్శా దర్శక శ్రీ నడకుదుటి వీరరాజు పంతులుగారు, ఇక్కడి 'అన్యభాషా' పదబంధమున కతివ్యాప్తిని పట్టించి, హిందీ, ఆంగ్లాది భాషాపదములను సైతము ఉదాహరించి చేసిన విస్తరము (21) పరిశీలనార్హము. "...ఆంధ్రులు నానా దేశంబుల యందునిలిచి తెలుఁగులె తత్తద్దేశోక్తు లంటఁబలికిన నా శబ్దములన్య దేశ్య జాంధ్రము లయ్యెన్" (22) అప్పకవి నిరూపించిన వానికి, అన్యదేశములకు స్వరూప స్వభావములలో సాపత్యములేదు. సంస్కృత ప్రాకృతముల నుండి వర్ణలోప వర్ణాగమాది పరిణామముల వలన తెలుఁగున జేరినవి తద్భవములు. పరీక్షించు అనునది తత్సమము; పరికించు తద్భవము, పరాకు, పరకాయించుట హింద్వార్య భాషాజన్యము లయిన అన్యదేశ్యములు. ఇట్టివివేచనముతో పూర్వోక్తపదముల పుట్టుమట్టులను పుణికి చూడవలసి యున్నది. ముందు నన్నెచోడ కవిప్రయోగ విషయక పరామర్శ.

తొలుత 'కైపు'ను గుఱించి. ఉద్రేకము, కఠినత, కోపము, ద్వేషము, రోఁత, విజృంభణము, వైమనస్యము అను నర్థముల నన్నెచోడ కవికృతిలో ఈ పదము పదునాలుగు తావుల ప్రయుక్తము. పదస్వరూపార్థ నిరూపణము నిమిత్తము తత్ప్రయోగ సర్వస్వమిట ప్రపంచితము.

1. "...భానుఁగని కై
పున మండెడు సూర్యకాంత పుత్త్రికవోలెన్"
(2-43)

2. "విరహకాలంబు మరు బాణ వితతిఁ గొన్న
గంటు లన్నియుఁ బ్రియుఁ గూడి కైపు మిగిలి
పెనఁగునెడ నెట్ట విరిసెనా వనితమేనఁ
గలయ నవనఖదంతవిక్షతము లడరె (8-178)

3. "మును మిడివైరి వాహినుల
ముట్టి పడల్పడ ద్రేవి గట్టి కై
పునఁ బయికెత్తు వాహకుల
పొంకమఱం దలకొంత గోపి... "(1-42)"

21. విమర్శతరంగిణి. 22. అప్పకవీయము, 1-108.

4. "...నిలిచి
మార్కొను వీరులఁ దాఁకి జ
ర్జరితముగాఁ బడంబొడిచి
చంపక చిత్తము కైవుపోవునే" (11-49)

5. "...సురాసుర వీరులొండరులంగని కైవుమిగిలి
మహాఘోరయుద్ధంబు సేయం దొడంగిన" (11-115)

6. "...జెట్టిగ వీరులై దురము
నేసిరి కైవునవీటెకాఁడనిన్" (11-148)

7. "శరహతి బాహుమూలములు
చక్కనఁ ద్రెవ్విన మానకాదిసూ
కరముల పోలెఁ గోల్మసఁగి
కైవున గొన్ని మదాంధ గంధ సిం
ధురములు తీవ్ర దంతములు
దూఱరయంబున నొత్తియొత్తి...' (11-154)

8. "............సం
గర మొనరింప బూని కడుఁ
గైవున మార్కొని............" (12-42),

9. "...కైవునఁ దాఁకి యేకాదశరుద్రులు
తక్కల భీకరాఖ్యుల గెలిచిరి..." (12-60),

10. "ఘనతర దీర్ఘ దంతములు
కైవున నూఱియు..." (12-72)

11. "...సురశత్రు వృత్రు ప్ర
య్యాలు వడఁ దాఁకు కైవున మ
హాశని జంభునురంబు దాఁకినన్" (12-73)

12. "కరులు దెమల్చి పట్టికొని
కైవునఁ బిట్టునఁ ద్రిప్పి నుగ్గుగా
నరదసమూహివైచి..." (12-172),

13. "కరిశిరమాడ షణ్ముఖుఁడు
గైవున వ్రేయుడుఁ గుంభ మౌక్తికో
త్కరమసుధారఁ బొల్పసఁగె..." (12-182)

14. "కని త్రిపురారినందనుఁడు
కైవున మార్కొని నిల్చి శక్తివై
చిన..." (12-188)

కాని, ముద్రిత పాఠములలో ఏక వాక్యత శూన్యము. ఈ పదము భిన్న ముద్రణములలో భిన్నస్థలముల నిర్బిందుకముగను, సబిందుకముగను అనియత ముగా ముద్రితము. మానవల్లి వారి ప్రతిలో నాలుగుతావుల నిర్బిందుకము; ఎనిమిది తావుల సబిందుకము; ఒకచో 'కైపు' అనీ, మఱొకచో 'కెంపు' అనీ ముద్రితము. వావిళ్ళవారి ప్రతిలో ఎనిమిది తావుల నిర్బిందుకము; అయిదు తావుల సబిందు కము. ఒకచో 'కెంపు' అని పాఠము. మదరాసు విశ్వవిద్యాలయ ప్రతిలో పదునొకొండు తావుల నిర్బిందుకము; మూఁడు తావుల సబిందుకము. ఒకచో 'కైంపు' అని తాళపత్ర ప్రతిలో పాఠమున్నట్లు అధస్సూచిక. ఆ ప్రతియందే అర్థవివరణ పట్టికలో నిర్బిందుక రూపము స్వీకృతము. ఆంధ్రనిఘంటువుల నిర్బిందుక రూపమే ప్రామాణిక పాఠముగా అంగీకృతము. నిర్బిందుకమే సాధుపాఠము. దీనిని అన్యదేశ్యమనుట అభ్యస్తము; అవిచారితరమణీయము. 'నన్నెచోడుఁడు ప్రయోగించిన 'కైపు' ను, మత్తు, మాదక ద్రివ్యము అను నర్థములు కలిగి, అరబ్బీ భాషాజన్యమగు 'కైపు' ను భిన్నవ్యుత్పత్తికములు. మొదటిది శుద్ధదేశ్యము; ప్రాచీనము; రెండవది అచ్చముగా అన్యదేశ్యము, అర్వాచీనము. ఉల్లాసము, పారవశ్యము, మనస్థితి అను మూలార్థములు కలిగిన 'కైఫ్' అను అరబ్బీ భాషాపదము (23) పారసి భాషాముఖమున నవీనోత్తరాహా భాషలలోనికివచ్చి, తద్ద్వారమున తెలుఁగున జొచ్చి 'కైపు' అయినది. భిన్న వ్యుత్పత్తికములగు ఈ పదములు రెండును నిఘంటుకారుల అలసతవలననో, ఏమఱిపాటు వలననో ఏకరూపము (Single entry) క్రింద సంగ్రథితమగుట పెద్దపొరపాటు (24). యాదృచ్ఛికమయిన శబ్దమాత్ర సారూప్యము ఈ పొర పాటుకు మూలము. నిఘంటుకారుల పొరపాటు వలన ఉత్పన్నమయిన ఈ అవ్య వస్థ అంతతో ఆఁగలేదు. మన విమర్శకులను తబ్బిబ్బుపెట్టి, తొందరపాటు నిర్ణ

23. మౌల్వీసయీద్ సాహెబ్ఆన్సారీ, లుగత్ సయీది, పు. 470

24. ఒక్క కాంబెల్ దొరమాత్రము తెలుగున 'మతు' అనునర్థముకల కలుపు, కైపులను అరబ్బీ జన్యత్వము కల గ్రామ్యపదములుగా నిరూపించినాఁడు (చూ A.D. Campbell, A Dictionary of Teloogoo Language Commonly termed the Gentoo, Madras, 1821 ; *P*. 146 *P*. 179 ; ఆంధ్రదీపికా కర్తయును వీనిని గ్రామ్యములుగా పేర్కొనినాఁడు. చూ, చుండూరి రంగనాయకులు శ్రేష్ఠిగారి 'ఆంధ్రదీపిక', చతుర్థముద్రణము, 1895 ; పు. 78, పు. 104).

యములకు మూలమయినది. అరబ్బీ భాషాపదమగు 'కైఫ్', నన్నె చోడకవి ప్రయుక్తమగు 'కైపు' నకు మూలమని వేదమువారు ప్రతిపాదించుటయు, నీరస హేతువులను ఊఁతగాఁగొని దేవరపల్లివారు దీనిని నిర్ధారించుటయు సంభవించినది. పండిత పరిశోధకులపై మనకుఁగల ప్రమాణబుద్ధికిది ఫలమును, ప్రబల నిదర్శనమును. దీనివలన, మన నిఘంటు కర్తల ఉత్తర వాదిత్వమెంత గురుతరమో, మన విమర్శకులకు అప్రమత్తత యెంత ఆవశ్యకమో విశదము కాఁగలదు, శబ్దార్థముల లోని యిట్టి యాదృచ్ఛిక సాదృశ్యము రెండు పదముల సమాన మాతృకత గాని, భిన్న భాషల సాజాత్యమును గాని, వాని పరస్పర పోష్యపోషక భావమునుగాని స్థాపింప సమర్థముకాదు (25). శబ్దార్థ సాదృశ్యముకల 'ఈను–yean', 'ప్రాపు-prop' అను నీ యాంధ్రాంగ్ల పదములు ఈ రెండు భాషలకు నిసర్గ సంబంధమును గాని, సంసర్గ సంబంధమునుగాని నిరూపింపలేవనుట ఉత్తమ జ్ఞానవృద్ధులును, తత్త్వ విస్మృత బుద్ధులును నగువారికి తోఁపక మానదు.

నవీనోత్తరాహ భాషలలో ప్రచుర వ్యవహారముకల 'కైఫ్' అరబ్బీభాషా సంబంధి.

---

25. స్పష్టతనిమిత్తమీవిస్తరము. భిన్నవ్యుత్పత్తికములయిశబ్దమాత్ర సారూప్యముకల పదములజంట లీదిగువ నిరూపితములు.

i. చెవి¹. దేశ్యము, కర్ణము, వీను.
చెవి². అన్యదేశ్యము. తాళపుచెవి; ఇది బుడతకీచు పదము (చూ. భారతి, మే, 1962).

ii. సాని¹. తద్భవము. < ప్రాకృత. సామిణీ < సంస్కృత. స్వామినీ = ప్రభుభార్య; (ఏలికసాని, దొరసాని, నాపసాని, మంత్రసాని, ముదుసలిసాని, మేదరసాని, రెడ్డిసాని—మొ. వానియందలి ఉత్తరపదము).
సాని₂. తద్భవము < ప్రాకృత. సాహణియ = సేనాపతి; సాహణీ= సేన < సంస్కృత సాధన, సాధనీ. తెలుఁగులోని సాహిణము (గుఱ్ఱపుసాల), సాహిణి (మార) (= రథినీపాలుఁడు), సాహిణీ (= గుఱ్ఱపువాడు) పదములు ప్రసిద్ధము. వీనిని దేశ్యములు చూపుటతప్పు; వైకృతము లనుట ఒప్పు. "సాహిణిసాని రౌతునఁగనశ్వారోహకునకుఁదనరు" (సాంబనిఘంటువు, మానవవర్గు, 6వ పద్యము). అల్లసాని, చలసాని, పెమ్మసాని, లక్కమసాని, మొ. గృహనామములలోని ఉత్తరభాగమగు 'సాని', 'సాహిణి'కి వికృతి.

ఉర్దూ : కైఫ్ = ఆనందము, హర్షము; మదము; మాదకద్రవ్య విశేషము;

కైఫ్ = మత్తు; త్రాగుబోతు (మున్షీ ఫాజిల్ సైయెద్ ఇనాయత్ అలీ, పు. 259; మొహమ్మద్ ముస్తఫాఖాన్, ఉర్దూ-హిందీ కోశ్, పు. 137; రామ్‌నారాయణలాల్, ఉర్దూకోశము, పు. 498).

గుజరాతి : కేఫ = మత్తు; మాదక ద్రవ్యము;

కేఫీ = లాహిరి వస్తువుల వాడుకకు అలవాటుపడు (యం. బి. బెల్సారే, గుజరాతీ వ్యుత్పత్తి పదకోశము, పు. 135).

మరాఠీ : కైఫ్ = మత్తు (కులకర్ణి, మరాఠీ వ్యుత్పత్తి పదకోశము, పు. 183)

హిందీ : కైఫ్ = మత్తు, మదము, (శ్యామసుందరదాస్, హిందీ శబ్ద సాగర్ పు. 633).

అరబ్బీభాషతో పోష్యపోషక సంబంధముకల పారసీక భాషలోను ఈ 'కైఫ్' ప్రవేశించినది.

పారసి : కైఫ్ (< అరబ్బీ) = ఆనందము, ఉల్లాసము; భంగును సేవించుటచే కలుగు మత్తు ; మత్తుమందు ;

కైఫ్‌దాన్ = మత్తువస్తువులుంచు పెట్టె; మందుల పెట్టె (Steingass. Persian-English Dictionary, p. 1069)

తెలుఁగున దేశ్యమగు 'కైపు', ప్రాచీన ద్రావిడభాషా పద సంబంధియను వాదమునకు మూదలగా ప్రధాన ద్రావిడ భాషలలోని సజాతీయమగు సదృశ శబ్ద రాశిని పోల్చి చూచుట ఆవశ్యకము. తత్సంబంధి జ్ఞాతి పదముల క్రమసంగ్రంథనమీ క్రిందిపట్టిక.

తెలుగు : కయిపు, కైపు = ఉద్రేకము, ఉన్మాదము, కపటము; కోపము; రోఁత; వైమనస్యము ;

కసరు = కోపపడు, తిట్టు; విసుగుకొను; పొగరు ; వేసరిక ;

కసి = కసి (గాటు)

కసి = ప్రతీకారము ;

కసు = (కసుఁగందు), కసుఁ(గాయ) లేఁత.

"కపటాఖ్య విలసిల్లు గబ్బిగౌరు గబుసు కైపు కిటుకు....డంబనంగ" (1_38 "కల్లనంగ సురాఖ్య చెల్లును, కైవు సారాయి స్థారా నాగరహిఁదనర్చుఁ దద్విశేషంబు" (2_303) అని యిట్లు ఆంధ్ర భాషార్ణవమునం దివి భిన్న పదములుగా భిన్నస్థలముల ఉద్ధృతములు. "మబ్బు లాహిరి కైపు మస్తన మత్తత భాసిల్లు" (సాంబనిఘంటువు, మానవవర్గు, 34)

కన్నడము : కచపు = ఉప్పు, మిరియపు పొడులతో పొగపిన కూరలు ;

కడ్యు, కయి, కయ్యి = చేదు; వైముఖ్యము ;

కయ్పు, కయ్పె (26) = చేదు; ద్వేషము, సరిపడమి ; కాఠిన్యము ;

కస, కసరు, కసి, కసురు = అపక్వము; లేఁత ; ఒగరు; సరిపడమి:

---

26. ప్రాచీనకర్ణాట సాహిత్యమున 'కయ్పు', 'కయ్పె' లకుఁగల ప్రచుర వ్యవహార మీదిగువ ప్రయోగముల మూలమున తెల్లము. పదునాలుగుసారులు 'కైపు' ను ప్రయోగించిన నన్నెచోడుఁడు కర్ణాటభాషా ప్రయోగపక్కికా ప్రియుఁడను పరిశీలకుల నిరూపణము సప్రమాణము.

i. "మధుసీతుం కటుసీదు పోపుళిత కళ్ళత్తుం కరం కయు బర్పుదు మారీచి తొడర్పుళిందె..." (పంపభారతం ఎంబ విక్రమార్జున విజయ, బెళ్ళావె వెంకట నారాయణప్ప సంపాదితము, కర్ణాటక సాహిత్యపరిషత్తు, బెంగళూరు, 1926; చతుర్థాశ్వాస. 88; పు. 114).

ii. "...ఎందుకయ్పెసరం బెరసును డిదభీమసేననను దిగళ్..." (పైది ఆశ్వా. 6, 73 వ పద్యము క్రింది వచనము; కయ్పెసరం = పరుషస్వరము, కఠినోక్తి).

iii. "కయ్పెసరం గళెమ్మనుం తెఱవు బేడ . ." (పైది. అష్టమాశ్వాస. పద్య. 28).

iv. "...కయ్పె సొరెయకుడియేం మిదియేం?' (గదాయుదం, కవిచక్రవర్తి కవి రన్న ప్రణీతం; ఎం.ఏ. రామానుజ అయ్యంగార్ సంపాదితము, మైసూరు, 1928; తృతీయాశ్వాస_61; పు. 35. కయ్పెసొరె = చేదుసొర) ఈపాఠ ములను గూర్చి తెలిపిన మిత్రులు శ్రీ బెళ్ళకూరు రామచంద్రరావు, ఎం.ఏ.,_ ఉస్మానియా విశ్వవిద్యాలయ కర్ణాట భాషోపన్యాసకులు_గారికి నా కృతజ్ఞతాభివందనములు.

కై = చేదు; ఇవన్నియు దేశ్యములుగా కిట్టెల్ నిఘంటువున ముద్దచ్చులో ముద్రితములు. అన్యదేశ్యములును, మాదక వస్తు బోధకములును అగు కైఫీ, కైపు–లు, దేశ్యమగు 'కయ్పు తో కలగాపులగము సేయక వేర్వేఱుగా ఈఁబడినవి (డా. ఎఫ్. కిట్టెల్, కన్నడ నిఘంటు)

తుళు : కస = ఉప్పు; ఒగరు ;

కైపె = అసూయ; ఉత్కంఠ : తీక్ష్ణత.

తమిళము : కచ = వైమనస్యము చెందు; రోఁతపడు ;

కచప్పు = కఠినత్వము; దుఃఖాతిశయము; వైముఖ్యము ;

కచర్, కయర్ =ఒగరుకలది ;

కాయ్ = కోపించు; దూషించు; ద్వేషించు ; హిసించు;

కాయ్‌ప్పు = అరుచి, అప్రియము ; ద్వేషము; నిర్వేదము ;

కై = నొచ్చుకొను; కోపించు; ద్వేషించు; వేసారు ;

కైప్పు = కఠినత్వము ; రోఁత ; విసుగు ; వైముఖ్యము ;

ఉర్దూ నుండి ఎరువు తెచ్చిన 'కైపు' తమిళ నిఘంటువులలో ప్రత్యేకారోపముగా ఉట్టంకితము (Tamil, Lexical)

మలయాళము : కయర్‌క్క = ఎదిరించు ; కలహించు ; గద్దించు; జంకించు :

కైక్క = మచ్చరించు ;

కైప్ప = చేదుసొర ;

కైప్పిక్క = నిర్వేదపడు ; వైమనస్యము చెందు :

కైప్పు = అరుచి, అప్రియము ; ఆవేదన; మచ్చరము ; వైముఖ్యము.

(డా. ఎచ్. గుండర్టు, మలయాళ కోశము.)

కచ, కచప్పు, కేయ్, కయప్పు, కయర్, కయి, కయిపు, కయ్యి, కస, కసరు, కసి, కసు, కసురు, కాయ్, కాయ్‌ప్పు, కై, కైపు, కైప్పిక్క, కైప్పు–మొదలగునవి శబ్దార్థములలో సాదృశ్యము కల సజాతీయ శబ్దములు ; ప్రాచీన ద్రావిడ *కచ్ –/*కయ్–ధాతునిష్పన్నములు. ఒగరు, లేఁత, సరిపడమి–అనునవి మూలార్థములు. –చ–/స–ఌ –య–ల మార్పు ద్రావిడ భాషలలో సర్వసాధారణమగు ధ్వనిపరిణామము. లక్ష్యములుగా ఈక్రింది యుదాహరణములను పరిశీలింపుఁడు.

	తమిళము	కన్నడము	తెలుగు
1.	పెయర్	పెసర్, హెసరు	పేరు (నామధేయము)
2.	ఉయిర్ (= గాలిని గట్టిగా పీల్చు).	ఉసిర్. ఉసుర్ (=ఊర్చు; ఊర్పు).	ఉసురు (=ప్రాణము)
	ఉయిర్పు (శ్వాసము, గాలి	ఉసురు (=ప్రాణము)	ఊర్చు, ఊర్పు, నిట్టూర్చు, నిట్టూర్పు.
	(గాలి, ప్రాణము అను మూలార్థములు కల *ఉచ్-/* ఉయ్-ధాతునిష్పన్నములు).		
3.	మయక్కమ్ =అలసత; అజ్ఞానము; మాంద్యము; మైకము)	మయక (=మత్తు; మాంద్యము ; మూర్ఛ;	మయికము.
	మయరి (= కలత పడిన వాడు);	మసక, మసకు(=ధూసర వర్ణము) ;	మచ్చ
	మయర్ (=తబ్బిబ్బు పడు; తెలివితప్పు, నిశ్చేష్టత)మయర్పు,	మాసర (=బూడిద రంగు);	మసక, మసర.
	మయర్వు (=అజ్ఞానము, దిగ్భ్రమ) :	మాసలు (=ముఱికి);	మసక మసక.
	మాయ్ (=అదృశ్యమగు; సూర్యుడస్తమించు); మాయ్పు,	మాసు (=మాసిపోవు; ముఱికియగు)	మసి
	మాయ్వు (అదృశ్యము, తిరోధానము)		మాయు.
			మాపటిప్రొద్దు. మాపు (= సాయం సంధ్య)
	మై (=చీకటి;నలుపు):	మైక.	మైకము.
	మైప్పు (=నలుపు)		
	(మచ్చ, మఱుగు అను మూలార్థములుకల *మచ్-/*మయ్-ధాతు నిష్పన్నములు).		

	తమిళము	కన్నడము	తెలుగు
4.	పచ్చై (= ఆకుపచ్చదనము; పచ్చి: లేఁత);	పచ్చ, పచ్చనె, పచ్చు పచ్చె, (= పసుపు రంగు; పసిమి	పచ్చ పచ్చన, పచ్చని, పచ్చి, పచ్చిక
		పసి, పసుర్ (= లేఁత)	పసి (= శైశవదశ)
	పయిర్ (= పైరు);	పసిరు (= పైరు), పైరు	పయిరు, పైరు.
	పైమ్మై (= పచ్చరంగు; పచ్చదనము);	పసర్, హసరు, హసురు (= ఆకుపచ్చరంగు; క్రొత్త; లేఁత);	పసరు
	పైదు (= నూతనత్వము; పచ్చదనము);	హసు (= లేఁత; మృదువైన);	పసపు, పసుపు
	పైదల్ (= శిశువు);	పసుళె (= శిశువు);	పసిఁడి (= పచ్చని లోహము)
	పైయల్ (= బాలుఁడు)	హసుళ, హసుళె (= శిశువు)	పయిఁడి, పహిండి, పైఁడి
	పైయన్ (= కొడుకు);		పైప (= బాలుఁడు) పెయ్య, పేయ (= లేగదూడ) పైదలి (= జవరాలు)

(లేఁత, క్రొత్త, పచ్చరంగు అను మూలార్థములుగల *పచ్-/* పయ్— ధాతు నిష్పన్నములు, పూర్వోక్త పదములతో ఏకాచ్క పరిమితమగు ప్రథమ భాగమే మూలధాతువు; తక్కినది ప్రత్యయము. మూలధాతువు అర్థవంతము; సామాన్యార్థ బోధకము. ప్రత్యయముల కర్థ మిదమిత్థమని నిర్ణయింపలేముకాని మూలధాతువునకు చేర్పఁబడినపుడు విశేషార్థస్ఫూర్తిని కలిగించును. చోడకవి ప్రయుక్తమగు కైపు దేశ్యమనుట కింతచాలు. శ్రీ వేంకటరాయ శాస్త్రిగారి 'కైపు' ను యుద్ధవీరుల త్రాగుడుతో ముడివెట్టఁజూచిన ఉజ్జాయింపు సమన్వయమును వాగ్యోగవిదులు యోగ్యముగా పరిగణింపఁజాలరు.

ఇఁక, 'తరవారి' తత్త్వవిచారమిట్లు : 'తరవారి' (27) పదము నన్నెచోడుని కృతిలో మూఁడుతావుల కిన్పట్టుచున్నది. మొదటి రెండుచోటుల సభంగశ్లేష :

"ఇలఁ జిత్రము తారకకర
తలసంగతమైన ఘోరతరవారి సొరన్
నిలుపగుఁ దనుఁ జొరకడరినఁ
చలమునుక యగున్విరోధి తతికబ్భవా" (4-14)

"భూరి తరవారి వారిరు
హారావానంత నాగహారి భూధర ల
క్ష్మీరమణీ శోభితుఁడై
నీరధిపతిఁ బోలె వాహినీ విభుఁడగుటన్" (11-15)

"ముంచిరి శరవర్షంబుల
జించిర దృఢకవచసమితిఁ జేద్వాడి రిపులన్
ద్రుంచిరి పజతర వారుల
నించిరి తమకీర్తి దిశల నెఱయఁగ సుభటుల్"

(11-116)

'తరవారి' పదప్రయుక్తిచే నన్నెచోడుఁడు అల్లా-ఉద్-దీన్ఖిల్జీ (క్రీ. శ. 1296. 1316) కి అనంతరుఁడగుననికదా వేదము వారి వాదము. మఱి,

---

27. 'నన్నికవివ్వయము' వారి ప్రయోగ సామ్యములను ఎత్తిచూపుట యన్న శ్రీ చే. వేం. కృ. రెడ్డిగారికి అమితప్రీతి.

"వారణ హస్తానుకారంబులగు వారి
ధారలు గురియు దుర్వారఘోర
తరవారివాహ ప్రకరములు వారింప
సురనివహంబుతో సురగణేశు

సైన నోర్వను శక్తమైన..." (ఆది. 8-251) అను నన్నయ ప్రయోగము శ్రీ రెడ్డిగారి చూపున కానినట్లులేదు. ఇందుపై ఏదో యొక కల్పనచేసి చమత్కరించెడి వాడు. వాస్తవమునకు నేనిటీవలి దాఁక ఈ ప్రయోగమును గమనించియుండ లేదు. మొన్న మొన్న కాకినాడ, ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమునందలి భారతము తాళ పత్ర ప్రతులను పరిశీలించుచుండఁగా దైవికముగా నిది నాకంటఁబడినది.

"తునిసిన బాహా మస్తక
తను చరణంబులును బాణ తరవారి గదా
ధనువులుఁ (28) గిరీటకంకణ
కనదంగదములును దలముగా ధరఁదొరఁగెన్"

(భారతము, భీష్మ. 2–134)

అని మూలము (29) లో లేని 'తరవారి' పదమును ప్రయోగించిన తిక్కన (క్రీ.శ. 1200–1270) యు అల్లా–ఉద్–దీనున కర్వాచీనుఁడగునని తీర్మానించుట హాస్యాస్పదముకాదా? దీని తద్భవ రూపమగు 'తరవరి' భాస్కర రామాయణములో ప్రయుక్తము.

"పినతండ్రి చావుఁగని య
ద్దనుజుఁడు యూపాక్షుఁడంతఁ దరవరిఁగొనుచున్
దనరథము డిగ్గి సింహ
ధ్వని యెసఁగన్ ద్వివిదుఁడాఁకె దర్పమెలర్పన్"

(భాస్కర రా. యు. 1193)

ఇది అయ్యలార్యుని భాగమునందలిది అయ్యలార్యుఁడు క్రీ. శ. 1350 ప్రాంతము వాఁడని పరిశోధకుల నిర్ణయము.

"ఈ పదము (తరవారి) సంస్కృతమేని అమరకోశమునలేదు. (30)" అని వేదము వారి ఆక్షేపము. ఇది అమరమున లేని మాట వాస్తవము. ఇదొక్క

---

28. "తునిసిన మస్తక బాహా–తను చరణంబులును బాణ తరవారి గదాధనువులు..." అని ప్రాచీన ముద్రితప్రతుల, కొన్ని తాళపత్రప్రతుల పాఠము.

29. "కాంచనేషు తనుత్రేషు కిరీటేషు ధ్వజేషు చ॥
శిలానా మివశైలేషు పతితా నామభూత్స్వనః॥
పతితా న్యుత్తమాంగాని బాహవశ్చ విభూషితాః॥
వ్యచేష్టంత మహీం ప్రాప్యశతశోఽథసహస్రశః॥"
అని వ్యాసభారతమూలము (శ్లో. లు 8, 9; అధ్యా. 55; భీష్మపర్వ., భాండార్కర్ ప్రాచ్య పరిశోధక సంస్థ, పూనావారి భారత ప్రతి, పుటలు 290, 291)

30. వేదము – నన్నెచోడుని కవిత్వము పు. 95.

చేనా ? అమరసింహుని సంకలనమున లేని సంస్కృత పదములు వేనకు వేలు ఉన్నవి. అపారమయిన గీర్వాణభాషా పారావారమును ఆపోశనము పట్టెదనని అమరసింహుఁడు ప్రతిన పూనలేదు.

"సమాహృత్యాన్య తంత్రాణి సంక్షిప్తైః
ప్రతిసంస్కృతైః
సంపూర్ణముచ్యతే వర్గైర్నామలింగాను శాసనమ్"

అని అతఁడు తన కోశపరిమితి ప్రయోజనములను గూర్చి అవతారికలో స్పష్టపఱిచి 'శేషంతుజ్ఞేయం శిష్టప్రయోగతః' అని చివరిమాట చెప్పి ఊరుకొన్నాఁడు.

'తరవారి' సంస్కృత పదముగా ప్రామాణిక నిఘంటువులు పెక్కింట ఉట్టంకితము.

1. Sans'krit Worterbuch, otto Bohtiingk und Rudolf Roth: St. Petersburg, 1855; column, 268.

2. శబ్దకల్పద్రుమ, సర్. రాజారాధా కాంతదేవ బహద్దరు; పు. 592 : తరం సమాగత విపక్షబలం వారయతీతి తరవారిః ।

3. సంస్కృత శబ్దార్థకల్పతరుః, ముడుంబై తిరువేంకటాచార్య కృతము, చెన్నపట్టణము, 1872; రచన 1830: పు. 229: తరవారిః ఇకారాంతః పుంసి ॥అమరః॥ ఖడ్గే; ఆచార్యులుగారు చూచిన అమరకోశప్రతులలో 'తరవారి' పదఘటిత పాఠముండినదనుటకు ఉపపత్తులు లేవు. అమర వ్యాఖ్య (31) లో ఈ పట్టున ఉదాహృతమయిన 'తరవారి' పదము ప్రమాదవశమున ఆచార్యులుగారి పద పట్టికలోఁ జొరఁబడినదేమో ?

4. వాచస్పత్యమ్, తారానాథ తర్క వాచస్పతి; 1873; సంపుటము, III పు. 3243 తరవారిః పుం. తరం శత్రూణాం గతిమ్ వారయతి...ఖడ్గభేదే... అసిశబ్దే.

31. భానోజీ దీక్షితుల వ్యాఖ్యలో 'తరవారి' పదముట్టంకితము.

5. సర్వశబ్దసంబోధిని, పరవస్తు శ్రీనివాసాచార్యకృతము. విశాఖపట్టణము, 1875; పు 351; తరవారిః ఇ. పుం. ఖడ్గః.

6. సర్ మోనియర్ – మోనియర్ – విల్యమ్స్, సంస్కృతాంగ్ల కోశము. ఆక్స్ఫర్డు, 1899; పు. 438.

7. వామన శివరామఆప్టే, సంస్కృతాంగ్ల కోశము, బొంబాయి, 1890; పు. 469.

8. పండితకులపతి జీవానంద విద్యాసాగర, శబ్దసాగర, కలకత్తా, 1900; పు. 306 వీనిని మించిన కోశములు సంస్కృతమున లేవు. పై పెచ్చు నవీనోత్తరాహభాషా నిఘంటువుల నీ 'తరవారి' సంస్కృతమూలకముగా ప్రదర్శితము.

అస్సామీ : తరోవాల్ < సం తరవారిః (హేమచంద్రబారువా, హేమ కోష్, సిబ్ సాగర్, 1955; పు 459).

ఒడియా : తరబార్, ఁరబారి, తరవార < సం. (జి. సి. ప్రహరాజ్, పూర్ణచంద్ర ఒడియా భాషాకోష్, ఉత్కలసాహిత్య ప్రెస్, కటక్, 1932; పుటలు 3377, 3379).

గుజరాతీ : తర్వార, తల్వార < సం. తరవారి. తర్వారియో, విణ. తరవారితో పోరాడెడి (ఎం. బి. బెల్సారె, గుజరాతీ వ్యుత్పత్తి పదకోశము, అహమ్మదాబాదు, 1895; పుటలు 344, 345).

నేపాలీ : తర్వార్. తల్వార్ < సం. తర (ల) వారిః (సర్. ఆర్. ఎల్. టర్నర్, నేపాలీ నిఘంటువు. లండన్, 1931; పు. 275).

మరాఠీ : తర్వార్. తల్వార్ (కులకర్ణి, మరాఠీ వ్యుత్పత్తి పదకోశము, బొంబాయి, 1946; పుటలు 366, 368).

32. కూచిమంచి సుబ్బారావుగారి హిందూస్తానీ - తెలుగునిఘంటువు (కాకినాడ, 1924; పు. 282) లో 'తరవారి' పారసి మూలకముగా ప్రదర్శితమగుట విచార్యము.

హిందీ ; తర్వారి < సం. (శ్యామసుందరదాస్, హిందీశబ్దసాగర్, కాశీ నాగరీ ప్రచారిణీసభా, 1926; పు. 1370; కాలికాప్రసాద్, బృహత్ హిందీకోశ్. పు. 551). (32) ప్రసిద్ధములైన ఉర్దూ నిఘంటువులలోనిది హిందీజన్యముగా నిరూపితము. (33)

ఆంధ్రనిఘంటువు లన్నింటను 'తరవారి' తత్సమముగా ఉల్లేఖ్యము. కందుకూరి పరిష్కృతమగు ఆంధ్రాంగ్ల ప్రౌణ్యము, ద్వితీయ ముద్రణము (1903) న పట్టాకత్తి యను నర్థమున 'తరవారి' తెలుఁగు పదముగా ప్రదర్శితమగుట ప్రమాదము. (చూ. పు. 512) ప్రౌణ్యమిశ్ర భాషా నిఘంటువు మాత్రము తర్వారు, తలవారులను అన్యదేశ్యములుగా పేర్కొనినది. తర్వార్, తల్వార్ - లు తెలుఁగున కిటీవల ఎరువు తెచ్చిన అన్యదేశ్యములు. పూర్వోక్తములగు సంస్కృతాది భాషాకోశము లిటీవలివనియు, సంస్కృతమున 'తరవారి' ప్రాచీనతను స్థాపింపఁజాలవనియు ఎదురు వాదము. అట్లయిన నీక్రింది ప్రాచీనకోశ వ్యవహారములు గమనార్హములు.

పంద్రెండవు శతాబ్ది ప్రథమపాదము వాఁడగు ధనంజయుని నిఘంటువున 'తరవారి' గ్రంథస్థము. ధనంజయుఁడు కర్ణాట జైనుడని పరిశోధకుల తలంపు.

"కాక్షేయకోఽసిర్నిస్త్రింశః కృపాణః
కరవాలకః
తరవారిర్మండలాగ్రః ఖడ్గనామావళిం విదుః"
(ధనంజయ నిఘంటు, ప్రథమపరిచ్ఛేద. శ్లో 87).

"ఋష్టిః ఖడ్గస్తరవారి కౌక్షేయకౌ చ నందకః..." ఇతి రభసః' - అను శ్లోక భాగము భానోజీదీక్షితుల (17 వ శతాబ్ది) అమరవ్యాఖ్యాసుధ-రామా

33. i. షేక్ ఘులాంఅలీ బర్కత్ అలీ, జెదీద్‌లుగత్ ఉర్దూ, లాహోరు, పు. 117.
ii. మున్షీఫాజిల్ సైయెద్ ఇనాయత్ అలీ, లుగత్ ఉర్దూ, మర్కంటైల్‌ప్రెస్, లాహోరు, 1928; పు. 99.
iii. ఫిరోజుల్ లుగత్, న్యూతాజ్ ఆఫీస్, ఢిల్లీ; పు. 209.
vi. రామ్‌నారాయణ్‌లాల్, ఉర్దూ - ఇంగ్లీషుకోశము, అలహాబాదు, 1956, పుటలు 195, 203.

క్రమి (34) లో ఉదాహృతము. ఇచ్చట రభసయనఁగా రభసపాలుని కోశమని యర్థము. సర్వానందుని (క్రీ. శ. 1159) అమరకోశ టీకా సర్వస్వమునందును, "అమర శుభాంకహలాయుధ గోవర్ధన రభసపాలకృత కోశాన్" అని మేదినీ కోశమునందును కోశకారుఁడుగా స్మరింపఁబడుటచే రభసపాలుఁడు పంద్రెండవ శతాబ్దికి పూర్వుఁడని నిర్ధారితము. 'తరవారి' పద వ్యవహారము పదునొకొండవ శతాబ్దినాఁటికే కలదనుటకు 'హారకస్తరవారిః స్త్రీ యష్టిశ్చాసిమృదౌ వృధా' అను యాదవ ప్రకాశుని వైజయంతి ప్రమాణమును శ్రీవేంకటకృష్ణారెడ్డిగారీ వరకే చూపినారు.

"నిస్త్రింశః కరవాలః ఖడ్గః కౌక్షేయకః
కృపాణస్స్యాత్
ఋష్టిరసి చంద్రహాసౌ తరవారిమండలాగ్రంచ"

(హలాయుధుని అభిదాన రత్నమాలా, భూమికాండం, శ్లో. 318) భట్టహలాయుధుఁడు మాన్యఖేటాధీశ్వరుఁడగు ముమ్మడికృష్ణుని (క్రీ. శ. 940_956) ఆస్థానపండితుఁడు. ఈ యభిధాన రత్నమాలకు కర్ణాటకరచనలో టీక రచించిన ఇమ్మడి నాగవర్మ (35) (క్రీ. 1145) హేమచంద్రుని (క్రీ. శ. 1088_1172) కించు మించు సమకాలికుఁడు. అభినవ పంప బిరుదాంకితుఁడగు నాగచంద్రుని (క్రీ. శ. 1100 కు పూర్వుఁడు) రామచంద్ర చరిత పురాణమున (36) "తరవారి యిందిజియె లోహిత వారిగణానవారిదళ్" అని తరవారి పదము ప్రయుక్తము.

---

34. నామలింగానుశాసనమ్, నిర్ణయసాగర్ ప్రెస్. 1944; పు. 293.

35. అభిధానరత్నమాల, మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణ, 1940. ననదవోలి బౌద్ధాచార్యుల తోడి వాదము సందర్భమున మల్లికార్జున పండితారాధ్యులు.
'అమరసింహ హలాయుధాది నిఘంట్ల
నమరెడు పాణినీయాది శాస్త్రముల
హరుఁడజ నిటలజుండను సూక్తి గలదె'
(పండితారాధ్య చరిత్ర, వాదప్రకరణము పు. 615) అని హలాయుధుని స్మరించినట్లు పాల్కురికి సోమనాథుఁడు వ్రాయుటచే హలాయుధుఁడు పండితారాధ్యులకు ప్రాచీనుండయిన ప్రసిద్ధ కోశకారుఁడనుట స్పష్టము.

36. రామచంద్ర చరితపురాణం, కర్ణాటక సాహిత్యపరిషత్తు, బెంగుళూరు, 1921; 13_61; పు. 388.

బాణభట్ట రచితమగు హర్షచరితము ఆఱవ ఉచ్ఛ్వాసమున ఖడ్గార్థమున 'తరవారి' పదముపయుక్తము. హర్షవర్ధనుని (క్రీ. శ. 606–645) ఆస్థానకవి యగుటవలన బాణభట్టు ఏడవుశతాబ్దివాఁడనుట నిర్వివాదము. ఆ ఘట్టమిది :

"నాగవన విహార శీలంచ మాయా
మాతంగాంగాన్నిర్గతా
మహాసేన సైనికావత్సపతిం న్యయంసిషుః।
అతిదయిత లాస్యస్యచ శైలూషమధ్యమ ధ్యాస్య
మూర్ధాన మసిలతయా మృణాలమివాలు నాదగ్ని
మిత్రాత్మజస్య సుమిత్రస్య మిత్రదేవః।
ప్రియతంత్రీ వాద్యస్యాలాబూ వీణాభ్యంతర
శుషిరనిహిత నిశిత తరవారి యో

గాంధర్వచ్ఛాత్రచ్ఛద్మానః
చిచ్ఛిదురశ్మకేశ్వరస్య శరభస్యశిరోరిపుపురుషాః"

(హర్షచరితమ్, షష్ఠఉచ్ఛ్వాసః, కాశీనాథ పాండురంగపరబ్ సంశోధితమ్, 1925 పు. 198) 'తరవారి రేకధారః ఖడ్గః' అని మహాకవి చూడామణి శంకర కవి రచిత సంకేతాఖ్యవ్యాఖ్య (చూ. పైది. పు. 199). అనఁగా ఒక వాయదార గల ఖడ్గమని భావము. ముప్పదియంగుళములకు మించిన పెద్దకత్తియని సర్వశబ్ద సంబోధినీ కారులు. ఉపలభ్యమయిన ఈసాక్ష్యము మేరకు 'తరవారి' ఏడవు శతాబ్ది నాఁటికే వ్యవహారమున నుండినట్లు స్పష్టము. తత్పూర్వ మెంతకాలము నుండి వ్యవహృత మగుచుండినదో పర్యాప్త పరిశీలనమునఁగాని నిర్ణాయకము కాదు. (37)

వాద సౌలభ్యముకొఱకై 'తరవారి' పదము ఏదో యొకకాలమున సంస్కృతములో చేరిన కాకితమువంటి (< పారసి కాగజ్) పారసీపదమో, దీనారము

37. 'గౌడవహో' లో 'తరవారి' పదము ప్రయుక్తమయినదని మిత్రులు శ్రీ టి. వి. యం. అయ్యవారు–బళ్ళారి, వీరశైవకళాశాలలో ఆంధ్రోపన్యాసకులు — గారు చెప్పిరిగాని ఆ కృతిని చూచుట తటస్థపడ లేదు. ప్రాకృతమున 'తరవారి' కలదని సూ. ని., సం. 3, పు. 679; "పరితః శిథిలోదగ్ర తరవారి తటిల్లతాః" అను పరమానందభారత (22–39) పాఠము అర్వాచీనమనుటచే ప్రస్తుతచర్చకు ఉపకారికాదు. ఈ క్రింది అరబ్బీ, పారసీ కోశములలో 'తరవారి' పదము కన్పట్ట లేదు.

వంటి (< Gk. Dinarious) గ్రీకుపదమో, హంవీరవంటి (< అరబ్బీ, అమీర్ = కోటీశ్వరుఁడు; ఉన్నతాధికారి; ప్రభువు) అరబ్బీపదమో కాకూడదా అని అంగీకరించుటకును అవకాశములేదు. అతి ప్రసిద్ధములైన అరబ్బీ, పారసి కోశములలో 'తర (ల) వారి' పదము మృగ్యము. (38) కాఁగా, 'తరవారి' అన్యదేశ్యము కాదనుట ఉత్తరపక్షము.

"ఈ నన్నిచోడకవి తెనుగు కావ్యమును పఠించిన దాక్షిణాత్య పండితుఁడు యాదవ ప్రకాశుఁడు తన సంస్కృత నిఘంటువులో పై హిందీ (తరవారి) తెలుఁగు (జొన్నలు) పేర్లను పేర్కొనియుండఁగా భాషావాదులీ వైజయంతి ప్రమాణముల నైనను చూడక తత్కాల నిర్ణయము చేయుట సబబుకాదు. ఈ వైజయంతీ నిఘంటుకారుఁడగు యాదవప్రకాశ పండితుఁడు క్రీ. శ. 11

38. i. John Richardson, A Dictionary of Persian, Arabic and English, Dedicated to the king of England. Clarendon Press, Oxford MDCCL XXVII (1777 A. D.) ii. Francis Johnson, Persian, Arabic and English Dictionary, Allen & Co, London, 1852. iii. మున్షీ మొహమ్మద్ పాద్‌షా, 'ఫర్హంగ్ ఆనందరాజ్' (విజయనగరము మహారాజా శ్రీఆనందగజపతి నామాంకితమయిన అరబ్బీ, తుర్కీ, పారసీకకోశము) మున్షీ నవీల్ కిస్వారి ప్రెస్, లక్నో, 1889. iv. William Thomson, 'Hazmul Arbiya' Arabic - Urdu Dictionary. v. మౌల్వీసయీద్ సాహేబ్ అన్సారీ, 'లుగత్ సయీది' (అరబ్బీ - పారసీకకోశము) ఆజమ్‌ఘడ్, 1936. vi. Steingass, Persian-English Dictionary, 1949. vii. లుగత్ కేష్వారీ, 1959.

పై కోశములను పరిశీలించుటలో తోడ్పడిన మున్షీమొహమ్మద్ సిద్దిక్ ఖాన్, మున్షీ మొహమ్మద్ అబ్దుల్లా కాదిరీసాహెబ్ గార్లకు నా కృతజ్ఞతాభివందనములు.

శతాబ్దములో విశిష్టాద్వైత మతస్థాపకుఁడగు శ్రీమద్రామానుజాచార్యుల విద్యా గురువు కాబట్టి, తన్నిఘంటు ప్రయోగములైన 'తరవారి-జొన్నలు' 'అను హిందీ - తెనుగు పదములు క్రీ. శ. 11 శతాబ్ది ప్రయోగము లగునేగాని భాషా వాదులన్నట్లు క్రీ. శ. 13 శతాబ్ది ప్రయోగములగుటకు వీలులేదు.(39) అని భాషావాదుల మనుకొనువారికి దేవరపల్లి వారి ఎచ్చరిక. "క్రీ. శ. 1050-1100 ప్రాంతమునందలి యాదవప్రకాశ పండితుని 'తరవారిః' అను వైజయంతీనిఘంటు తురుష్కపద ప్రయోగమును భాషావాదులు చూచియున్నచో, ఇట్టి బాధ్యతారహిత సిద్ధాంతములు నిర్ణయించెడివారు కారేమోకద" (40) అని శ్రీ రెడ్డిగారి మతొక చురక. రెడ్డిగారూహించినట్లు 'తరవారి' హిందీకి గుత్తమాట కాదు ; జొన్నలు తెలుఁగున దేశ్యపదముకాదు. 'తరవారి' సంస్కృత పదమనీ. బాణోచ్ఛిష్టమనీ ఇంతదనుక ప్రదర్శితము. 'జొన్నలు' సంస్కృతము నందలి 'య (యా) వనాళ' పదజన్యమగు ప్రాకృత 'జొణ్ణలిఆ' వికృతి, 'జొన్నలు' తెలుఁగున తద్భవము. జొన్నలు తెలుఁగు నాటికే పరిమితమయిన పంటకాదు. మైసూరు లోను, మరాఠ్వాడాలోను, మధ్యప్రదేశములోను మస్తుగా పండెడిపంట. యాదవ ప్రకాశుని నన్నిచోడ కవికావ్య పఠనమును 'వైజయంతి' లో వీనిఉనికికి హేతు వుగా పేర్కొనుట మిథ్యావాదము. కోశకారుఁడయిన యాదవ ప్రకాశుఁడు అతి ప్రసిద్ధములయిన హర్షచరితమును, హలాయుధుని అభిధాన రత్నమాలను చూడ లేదనుట సాహసము. 'జొణ్ణలియా' ధాన్యవాచకముగా హేమచంద్రుని దేశి నామమాల (3-50) లో "జోవారోఇ జొణ్ణలియా" అని పఠితము. "జొణ్ణ లియా జోవారోధాన్యమ్" అని దేశీనామమాలా వృత్తి. సంస్కృతములో కేవలము నైఘంటుకములుగాఁ గన్పట్టుచున్న 'జోన(ల)ళ', 'జోనా(ల)ళ' 'జొన్నాలా' పదములు, సంస్కృతమునందలి ఇంగాల (<అంగార), మోర (< మయూర), సహార (< సహకార) మొదలగువాని కుదురునకుఁ జెంది నవి, ఇంగాలాదులు ప్రాకృత పదములు; ప్రాకృతములనుండి సంస్కృతమునకు ఎరవు తెచ్చినవి. సంస్కృత కోశకారులు సంస్కృతేతర భాషాకావ్య పఠనము వలన ప్రభావితులయి తత్ప్రయుక్తములగు పదములను తమ కోశముల స్వీక

39. తెంకణాదిత్యకవి, పుటలు 82, 83.

40. పైది, పు 104.

రింతురనుట అశాస్త్రీయము. చివర, శ్రీ శాస్త్రిగారు పేర్కొనిన సాహిత్య దర్పణ శ్లోకముసంగతి.

"సన్ధౌ సర్వస్వహరణం విగ్రహే ప్రాణనిగ్రహః
అల్లావదీననృపతౌ నసంధిర్న చ విగ్రహః" (41)

ఇది విశ్వనాథ కవిరాజ (క్రీ. శ. 1350) కృతమగు సాహిత్యదర్పణమున గుణీభూత వ్యంగ్యము, అస్ఫుటభేద వివరణమునొద్ద నుదాహృతమయిన లక్ష్యము. సంధియందు సర్వస్వహరణము విగ్రహమునందు ప్రాణనిగ్రహము. అల్లావదీన నృపతిపట్ల సంధి విగ్రహములు పనికిరావు అని దీనిభావము. సంధి విగ్రహములు కాక, తక్కిన ఉపాయములు ప్రవర్తించునని గుణీభూత వ్యంగ్యము; వ్యుత్పన్నులకుకూడ ఝటితిస్ఫూర్తి కలుగదుగాన అస్ఫుటము ఈ శ్లోకమును-

"ఇలఁ జిత్రము తారక కర
తల సంగతమైన ఘోరతరవారిసొరన్
నిలుపగుఁ దనుఁ జొరకడరినఁ
దలమునుక యగు న్విరోధితతికబ్జభవా"
(కు. సం. 4-14)

అను పద్యముతో పోల్చి "ఈ శ్లోకమునకీ పద్యము మెఱుఁగై అందుచేత తర్వాతిది కావచ్చు" (42) నని వేదమువారి ఊహాపోహలు. శ్లోక ప్రతిపాదక విషయము గుణీభూత వ్యంగ్యము, అస్ఫుటము. పద్య ప్రతిపాద్యము ఘోర+తరవారి, ఘోరతర+వారి అను విఋపులమీఁద ఆధారపడిన సంభంగశ్లేష; శబ్దచమత్కారము. కావున రెంటికిని పోలికలేదు. ఈ భావము వీరిద్దఱిదికాక ప్రాచీనుఁడగు మఱొకకవిది కాకూడదా ? ఈ యిరువురును విడివిడిగా తమతమ ప్రతిభావిభవముల కనుగుణముగా అనుకరించి యుండరాదా ? "లేక ఘుణా

41. సాహిత్యదర్పణమ్, చౌఖంబా సంస్కృతసీరీస్, వారణాసి, 1955; చతుర్థపరిచ్ఛేద. కారికా 24; పు 286.
42. వేదము-నన్నెచోడుని కవిత్వము, పు. 97.

క్షర న్యాయమున అల్లాయుదీను నెఱుఁగకయే కవికి ఆభావము స్ఫురించి యుండ వచ్చు (43)" నని శ్రీశాస్త్రిగారే మార్గాంతరమును సూచించిరికదా !

ఇఁక, 'బాఁకు' (44) ను గుఱించి రెండుమాటలు. కుమారస్వామి సేనానిగా దేవసేన తారకునిపై 'కూచి' చేసిన సందర్భమున 'నిజాధీశ్వరుల కుత్సాహంబుగా వీర పురుషులు మహోత్సాహంబులు పలుకు' ఘట్టమునందలిది ఈ క్రిందిపద్యము.

"పోరఁ బాఁకు దాల్చి నీరు గొన్నటు ప్రతి
బలమునెల్లఁ బాయవడఁగ దోలి
గొడగు క్రిందిరూపుఁ బొడిచి జయంబు నీ
కిత్తు నధిప నన్ను నింతనమ్ము"

(కు. సం. 11-37; మదరాసు విశ్వవిద్యాలయప్రతి, 1948; మానవల్లి ప్రతి, 1914). 'పోరబాఁకు దాల్చి' అని వావిళ్ళవారి 1953 ప్రతి, 'పోరబాఁకుఁ దల్చి' అని వావిళ్ళవారి 1961 ప్రతి. వావిళ్ళవారి ప్రతులలో '-బాకు' కు పూర్వముండవలసిన అఱసున్న అచ్చులో ఎగిరిపోయినది. 'పోరఁబాఁకుదాల్చి' అను పాఠము సరిగా లేదని వేదమువారి వాదము. పాఁకుఁదల్చి (= పాఁకును త్రోసి) యనుటలో దూరాన్వయదోషమున్నదని 'పోర బాఁకు' దాల్చి' అను వావిళ్ళవారి దురన్వయ పాఠమును శ్రీ శాస్త్రిగారంగీకరించిరి.

"పోరను మృత సంజీవని
కారణమున నిహతులయ్యుఁ గారసురవరుల్
వారల నోర్వఁగ మనకతి
భారము దుర్వార వీర్యబలయుతులగుటన్"

---

43. పైద్ని, పు. 97.

44. ''బాఁకు' - ఇందులకు కవిత్రయ ప్రయోగము శబ్దరత్నాకరమీయలేదు' (పు 92) అనుటలో శ్రీ వేంకటరాయశాస్త్రిగారి భావమేమో స్పష్టపడలేదు. కవిత్రయమువారు 'బాఁకు' ను ప్రయోగింపఁగా శ. ర. కారుడు తద్దానిని స్వీకరింపనుపేక్షించెనని శాస్త్రిగారి తలంపు కాఁబోలు! మఱి, నాలుగుపంక్తులకు పిమ్మట 'ఈ బాఁకు శబ్దమెట్టిదేశ్యమో కాని, కవిత్రయమువారుగాని శివకవులు గాని ప్రయోగించినట్లు కానరాదు. పరిశోధింపవలెను, అని వారే వ్రాసిరి (పైద్ని, పు. 92).

(భారత. ఆది. 3-102' ఆనంద ముద్రాక్షర శాలాప్రతి, 1907) అన్న నన్నయ ప్రయోగవైఖరిని పరికించినచో చోడకవి పోకడ గడుసరికూర్పని తేలుసేగాని, విపరీతమనిపింపదు. 'అసురవరులు పోరనునిహతులయ్యు మృతసంజీవని కారణమున (నిహతులు) కారు' అనికదా అన్వయపద్ధతి. పోరను మృత సంజీవని కారణమున నిహతులయ్యు' అని యథాక్రమముగా అన్వయించు రీతివి సాహిత్యపదవి కెక్కిన వారు సమ్మతింతురా ? అసురవరులు మృతసంజీవని కారణమున నిహతులగుట' కలదా? దూరాన్వయ దోషభీతి ఇట్టి దురన్వయములకు దారి తీయుచున్నది. శాస్త్రిగారికి సమ్మతమయిన పాఠమునే అంగీకరించి "పోర బాఁకుదాల్చి... ప్రతిబలమునెల్లఁ బాయవడఁగఁదోలి గొడుగుక్రింద రూపుఁ బొడిచి జయంబు నీకిత్తునధిప నిన్ను నింత నన్ను" అనుచో 'నీరుగొన్నటు' అను భాగము నిరర్థకముకాదా ? "కాని, నీరుగొన్నటుఅనుచో ఉపమకు 'పాకు దల్చి' యన్న నే వాక్యసంపూర్తి (45)" అని శాస్త్రిగారు వ్రాయుట ప్రక్రమ భంగము. శాస్త్రిగారి వాదదౌర్బల్యమునకిది చాలు ! వారి ఎత్తుగడ ఎగిరిపోయి నది. కాని, పట్టు విడుపులుకల శాస్త్రిగారి సహృదయత ప్రశంశాపాత్రము. 'పోఁరబాకు దాల్చు నీరు గొన్నటు...' అనుట కవి హృదయమని నా యూహము. "పాఁకుదాల్చు నీరుగొన్నటు, పోరను ప్రతిబలమునెల్ల పాయ వడఁగఁదోలి గొడుగుక్రింది రూపుఁబొడిచి జయంబు నీకిత్తునధిప నన్ను నింత నమ్ము" అనుఅన్వయము సారస్యము; సముచితము.

పైఁగా, 'పాఁకుదాల్చు' అనునది మన కవిరాజ శిఖామణికి ప్రీతిపాత్ర మయిన పలుకుబడిగా కన్పట్టుచున్నది. చోడకవి ప్రయోగధోరణిని ఆమూల చూడముగా అవలోడనము చేసిన శ్రీ రెడ్డిగారు ఈ పలుకుబడిని గమనింప కుండుట వింత. "భాసురమతి వాల్మీకి - వ్యాసాదులు చనిన జగతి వరకవిదా సింహాసనమెక్కి కవీంద్రుల - దాసులుగానేలిన' (కు.సం. 1-19) కాళిదాసుఁ బని నన్నెచోడునకు ఈడులేని భక్తి తాత్పర్యములు. 'ఈ కుమారసంభవము కాళిదాసు కావ్యమునకుఁ దెనుఁగు కాక'పోయినను, కాళిదాసుని శ్లోకభావ రత్నములను నన్నెచోడుఁడు తనకృతిభూషలో పొదిగి దానికి సరికొత్త కాంతు

45. పైది,, పు 93.

లను సంతరించినాఁడు. పినాకపాణిని పతిగాఁగోరి పాశుపత మంత్రదీక్షను చేపట్టిన పార్వతిని వర్ణించుపట్టున కుమారసంభవ కావ్యమునగల—

"కురులతోఁగూడ విలపిల్లు గిరిజమొగము
జడలుదాల్చినఁ గడు బెడంగడరి పొల్చె
భృంగములు మూఁగి చెలువొందు బిసరుహంబు
పాఁకు దాల్చియుఁ(46) గర మొప్పు భంగివోలె"

(కు. సం. 6–85, మదరాసు విశ్వవిద్యాలయప్రతి) అను తేటగీతి క్రింది కాళిదాసుని శ్లోకమునకు తెలుఁగుసేఁత.

"యథా ప్రసిద్ధైర్మధురం శిరోరుహై
ర్జటాభి రప్యేవ మభూత్త దాననమ్
న షట్పద శ్రేణిభిరేవ పంకజం
సశైవలా సంగమపి ప్రకాశతే"

(సంస్కృత. కు. సం., సర్గ. 5., శ్లో. 9)

వావిళ్ళ, మానవల్లి ప్రతులలో 'పాఁకుదాల్చియు'కు మాఱుగా 'పాఁతుదాల్చియు' అను పాఠాంతరమున్నది. సూ. ని. కారులు, సూ. ని. కార్యాలయమునందలి కుమారసంభవము వ్రాఁతప్రతి ననుసరించి 'పాఁకుదాల్చియు' అనుపాఠమునే స్వీకరించిరి.(47) 'పాఁతు' అనఁగా భూమిలోనగు వానిలోపల దిగినట్టి పర్వతము మొదలగువాని మొదలుఅని యర్థము. 'పాఁతు దాల్చియు' అనుటలో ససిగా అర్థ మొత్తగిల్లదు. బిసరుహంబు 'పాఁతుదాల్చు'ట విపరీతము కాదా ? పాఁతు దాల్చిన బిసరుహమును జడలుదాల్చిన గిరిజమొగముతో పోల్చుట ఏమిసొగసు ? అవిచక్షణులగు అక్షరచణుల వ్రాఁత తప్పుకాక ! శిరోరుహము లిట పాఁకు-శైవలము – తో ఉపమితము. ఇంచుమించు ఇట్టిదే ఇంకొకటి 'పాకు' ఘటిత పాఠము కుమార సంభవమునందలి దక్షాధ్వర ధ్వంసఘట్టమునఁగలదు.

---

46. "పాఁచి దాల్చియు''అని శ్రీ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారి పాఠము. చూ, కుమార సంభవ విమర్శము, మదరాసు విశ్వవిద్యాలయ ప్రకాశితము, 1937; పు. 68.

47. చూ. 'పాఁకు'; సూ. ని. సంపుటి 5, పు. 324.

"....కడినన్న తమ్మిఁ బాఁకడరెనో
దీనవదనంబుపై నెరుల్ వెదజితూల....
దుఃఖాతిశయమునఁ దల్లడిల్లుచున్న
పత్ని వచ్చి పురుష భైక్షంబు వేడుచుఁ
జాలఁదవుల నభవు ద్రమోలబడియె"

(కు. సం. 2_88, మదరాసు విశ్వవిద్యాలయ ప్రతి).

"సరసిజమనువిద్ధం శైవలేనాపిరమ్యం..."(48) అను శాకుంతల శ్లోక భాగ భావమునకు '....కడి నన్నతమ్మిఁ బాఁకడరెనోయన...." అను భాగము అనుకృతి యనుట విదితము. ఇట 'దీనవదనము', 'కడినన్నతమ్మి' తోడను 'వెదజి తూలునెఱులు', 'పాఁకు' తోడను ఉపమితము; ప్రతివస్తూపమ. ఉపమాద్రవ్యముగా 'పాఁకు' కాళిదాసున కింతఇష్టము. కావున "పోరఁబాకుదాల్చి నీరుగొన్నటు...." అనుపాఠమే సాధువనీ, చోడకవి ప్రయోగఫక్కికి సమ్మత మనీ 'సతతాన్వేషిత సన్మార్గులు' గుర్తింపకపోరు. ఛురికార్థకమగు 'బాఁకు' ఘటితపాఠము నంగీకరించినచో అసలన్వయమే కుదురదు. కాఁగా, 'బాఁకు' అనుపదము ప్రయుక్తమయినదను సమస్యయే లేదు.(49) అపపాఠములపై ఆధారపడి, విపరీత ప్రతిపాదనముల సేయుటను విద్వల్లోకము హర్షింపదు.

ఇక్కడితో నన్నెచోడకవి ప్రయుక్త పద సంబంధిచర్చ సరి.(50).

---

48. అభిజ్ఞాన శాకుంతలమ్, ప్రథమోఽఙ్కః, 19.

49. అథవా 'పాఁకుదాల్చి నీరుగొన్నట్లు' = పాఁకుడును వేఱుచేసి నీరు గ్రహించు నట్లు అని శ్రీ వేటూరివారి విఱుపుననుసరించి పక్షాంతరముగా అన్వయించినను తకరారులేదు. ఈ పక్షముననను 'బాఁకు' ప్రసక్తముకాదు.

50. తరువాతి రెండు వ్యాసములలో 'నన్నయ_అన్యదేశ్యాభాసముల' సమీక్ష.

నన్నయ-అన్యదేశ్యాభాసములు-I

ఇఁక నన్నయ ప్రయోగించెనన్న గాడీ, సవతి, సవతుల విషయము. సుభద్రార్జునులకు కృష్ణుఁడు వస్తువాహనాదికములను అరణముగానిచ్చు ఘట్టమున నన్నయ భారతమున ఈ క్రింది పద్యము కలదు.

సీ॥ అవిరళక్షరిత దానార్ద్రి గండస్థల
గజసహస్రంబును గనకరత్న
రచితమై తురగసారథి సహితంబైన
రథసహస్రంబును రమ్యభూష
ణాలంకృత స్త్రీసహస్రంబుఁ గాంచన
శిబికాసహస్రంబుఁ జిత్రలలిత
గతినొప్పునేనూఱు గాడిదలను
సింధుబాహ్లిక కాంభోజ పారసీక
జాతమైనతురగ శతసహస్రము లక్ష
గోధనంబు నధికఘోరవీర
దర్పయుక్తులైన దశలక్షదాశార్హ
వరుల నరణమిచ్చె వామనుండు.

(నన్నయ భారతము, ఆదిపర్వము, అష్టమాశ్వాసము 221 వ పద్యము) "ఏనూఱు గాడిదలను'' అనుచోట అనేక పాఠాంతరములు ముద్రితప్రతుల యందును, తాళపత్రప్రతుల యందును గన్పట్టుచున్నవి. పై పద్యమునందలి క్రీగీటులుగల భాగమునకు—

"తద్దైవాశ్వతరీణాంచ దాన్తానాం
వాతరంహసామ్
శతాన్యం జనశ్శేశీనాం శ్వేతానాం
పంచపంచచ"

(శ్లో. 43, ఏకవింశత్యధికద్విశతతమోఽధ్యాయః, ఆదిపర్వాంతర్గత హరణహారిక పర్వణి, (మహాభారతమ్, భాండార్కర్ ప్రాచ్యపరిశోధక సంస్థవారి ప్రతి పుట 833) అన్నది వ్యాసభారతమూలము.)

ఇచట 'ఏ నూఱు గాడీలు' అను పాఠమే కవిప్రయుక్తమని శ్రీ దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డిగారి ప్రతిపాదనము. "వ్యాసభారతమూలములో 'అశ్వతర' అనుతుల్యసంస్కృతపదమున్నను, తెనుగు కవికి కంచరగాడిద పాఠము దేశీయము కాదనితోచి మార్చియుండుట దోషముకాదు; ఔచిత్యము. తెనుగువాటి పెళ్ళిళ్ళలో 'కంచరగాడిదలు-అరణమిచ్చు' ఆచారము కనబడదు. ఇట్టి మార్పులు నన్నయభారతములో లేకపోలేదు(1)." అని రెడ్డిగారివాదము. ఆంధ్రుల సంప్రదాయములకు విరుద్ధములగు పట్టులందెల్ల నన్నయ మార్పులు చేసినట్లు నిరూపించుట శ్రీరెడ్డిగారి కర్తవ్యము. "...యాదవాగ్రగణ్యులుఁ దాను నగణ్యమహావస్తువాహనంబులు గొని వాసుదేవుఁ డనుజకు నరణమీ నర్థితోఁ జనుదెంచి...."(ఆది 8-215)న ఘట్టమున వస్తువాహనము లొసంగుట సంప్రదాయ విరుద్ధముకాదు. "వినుమటుగాక బల్లిదపు వేసడముల్ వలతేని నిత్తు..." (భారత. అరణ్య. 4-249) అనుటనుబట్టి కంచరగాడిదలను బహూకరించు ఆచారము ఆ కాలమునను వ్యవహారముననుండినట్లు స్పష్టము. అంతే కాదు, జూదమున ధర్మజుఁడోడిన వానిలో "ఖరరాసభ నివహంబులు" (సభా. 2-177)ను కలవు. భారవహనమున, శీఘ్రగమనమున కంచరగాడిదలు పెట్టినది పేరు. (అనాఁడు "...వాయు జవంబులయిన రాసభంబులం బూనిన యరదం బెక్కి..." (ఆది. 6-139) చనుట సర్వసామాన్యము.) "అశ్వాశ్వతర శిబికాందోళకరికరిణీకరభారదానీక వాహనంబులుపిజపెభసంవెలయంగఁ గరమర్థినెక్కి భూచరులు నడవ .... "(కు.సం.11-12) కన్నులారచూచినట్లు వర్ణించినవాఁడు కదా కవిరాజశిఖామణి "పల్లకులన్ మహోష్ట్రముల భద్రగజంబుల నందలంబులన్ - గొల్లెన బండులన్ నడక గుఱ్ఱపుమోటుల వేసడంబులన్ - బెల్లగనెక్కి పౌరజనబృందము..." (జై. భారత. 2-113) వోవుట అనాఁడు విడ్డూరము కాదు. "పలు గుడారంబులు బరువులుమోయ - ఎద్దుల నొంటెల హెచ్చైన యట్టి - వేసడంబుల..." (పల్నాటి. పుట 29) ఉపయోగించుట తెలుఁగునాట క్రొత్తకాదు.

1. శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారి 'తెంకణాదిత్యకవి', పు. 79.

ఇది యిట్లుండనిండు. అపదాదిగా నన్నయ నాఁటిభాషలో సిద్ధదీర్ఘత యుండదు. అమాస, ఇలాయి, ఉపాసము, కటారిగుడారము, జగా, జరీ, తరాజు, తురాయి, తేజీ, దుమారము, నవలా, నేజా, పల్లకీ, బిడాయి, మసీదు, మిటారి, రమారమి, లకోరీ, విలాయితీ, సవారి, హజారము - ఇత్యాద్యపదాది దీర్ఘఘటిత రూపములన్నియును నన్నయ కర్వాచీనములు. "దీర్ఘాణాం హ్రస్వ స్స్యాత్" అను సూత్రము క్రింది "నచదేశ్యపదే" (అజంత పరిచ్ఛేదము. సూత్రములు 47, 48) అను ఆంధ్ర శబ్ద చింతామణి యందలి విశేష సూత్రమును, "నైకవర్ణేన దేశ్యేఽపి హ్రస్వోదేశ్యేతు వాక్వచిత్. తద్భవస్యాపి శబ్దస్యదీర్ఘాంతత్వం క్వచిద్భవేత్" (అజంత పరిచ్ఛేదము 30) అను వికృతి వివేకస్థకారిక యందలి దేశ్యతద్భవరూప సంబంధి భాగమును తదర్వాచీనాంధ్ర భాషాస్థితి ప్రదర్శకములగుటచే నన్నయాథర్వాణికము లగుట అసంభవము. నన్నయాథర్వణుల నాఁటికి దేశ్యతద్భవములలో దీర్ఘాంతత మృగ్యము(2). ఇంతేకాదు. "చిత్రలలితగతి నొప్పు నేనూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజ పారసీకజాతమైన తురగశత సహస్రము..." అను పాఠము పునరుక్తి దోష జుష్టము. మీఁదుమిక్కిలి చిత్రలలితగతి నొప్పునవి సజీవములగు 'గాడిద'లే గాని, నిర్జీవములగు 'గాడీలు'కావు. అయినను ఈ చిల్లరమల్లర సమాధానములు 'గాడీలు' పాఠముపై గాఢవిశ్వాసము కలవారికి సంతృప్తినీయఁజాలవు; సంశయ నివృత్తిని సేయఁజాలవు.

ఇంతకును ఇంత రగడను పెంచిన 'గాడీ' పదము శ్రీ రెడ్డిగారు భావించినట్లుగా 'తురుష్క' భాషాపదము కాదు. అరబ్బీ. తుర్కీ. పారసి భాషలలో ఈ పదము లేనే లేదు. ఉండుట కవకాశమును లేదు. అరబ్బీ భాషలో పరహాను

---

2. నామంబులకు హ్రస్వంబగు; పదాద్యేకాక్షర దేశ్యంబులకుఁ గాదు; పృథా పల్లక్యాదుల కొండె (చిన్నయసూరి, శబ్దలక్షణ సంగ్రహము, ప్రథమ ముద్రణము, 1853; తృతీయపరిచ్ఛేదము, 83, 84, 85 సూత్రములు); నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు; ఏకాక్షరంబులకు హ్రస్వంబులేదు. (బాలవ్యాకరణము, ప్రథమ ముద్రణము, 1858; తత్సమ పరిచ్ఛేదము, 54, 55 సూత్రములు) బాల వ్యాకరణములో దేశ్యభాగమును వదలుట దేశ్యములగు నామములతో తుదిదీర్ఘ ముండదని దీర్ఘ పరిశీలనమువలన తెలిసియా? లేక తత్సమ పరిచ్ఛేదమున దేశ్యపద నిష్పాదనము కూడదనియా?

మూలీయ (Postvelar) వర్ణమగు 'గైన్' (= గ) విశిష్టము; అరబ్బీ వర్ణమాలలో ఏది పందొమ్మిదవది. గదర్, గఫార్, గరీబ్, గలీజ్, గల్లా, గిలాఫ్, గులామ్, గుస్సా, గైర్, లగత్-'గైన్' వర్ణఘటితములగు ఇట్టి పదములన్నియు అరబ్బీలో నిసర్గములు. హనుమూలీయ స్పర్శ (Velar stop) మగు 'గాఫ్' (= గ) పారసి భాషలో విశిష్టము; పారసి వర్ణమాలలో 'గాఫ్' ఇరువదియాఱవది. గజ్, గంజీఫా, గల్లీ, గష్తి, గారా, గిర్దావర్. — గీర్ (=విజేత; ఆలంగీర్. జహంగీర్ మొ.), గుజార, గుమాస్తా, గులాబీ, గోషా — 'గాఫ్' వర్ణఘటితములగు ఇట్టి పదములన్నియు పారసిలో నిసర్గములు. 'గాడీ' పదములోని ఆద్యవర్ణము పారసిలోని 'గాఫ్' తో సదృశము; అరబ్బీలోని 'గైన్' కంటె భిన్నము. అరబ్బీలో 'గాఫ్' లేదు. అరబ్బీ భాషకు విజాతీయమగు వర్ణముతో కూడినది కావున 'గాడీ' అరబ్బీ భాషాపదము కాఁజాలదనుట నిశ్చితము. ద్వితీయవర్ణమగు 'డ' హిందీలో అజ్మధ్యముగా ప్రతివేష్టిత తాడితము (Retroflex flap); నాలుకకొనను వెనుకకు మడచి మూర్ధభాగమును తాడితము సేయఁగా ఉచ్చరితమగు ధ్వని విశేషము; దుస్స్పృష్ట 'డ'కారమనియు, శిథిల 'డ'కారమనియు ప్రాచీన వ్యవహారము. తక్కిన తావుల హిందీలోని 'డ' ప్రతివేష్టిత స్పర్శము (Retroflex stop). తెలుఁగు, సంస్కృతములందలి 'డ' కారము ప్రతివేష్టిత స్పర్శము(Retroflex stop)హిందీయందలి 'డ', 'ఢ'లు పరస్పర పరిపూరక సన్నివేశముల (Complementary distribution) లో వచ్చు ధ్వనులు; ఏకవర్ణకుటుంబకములు. అరబ్బీ; పారసి భాషలలో ప్రతివేష్టిత (మూర్ధన్య Retroflex) వర్ణములగు ట, డ — లు (ఉర్దూ భాషలోనివి 'టే', 'డాల్' అని వ్యవహృతములు; ఉర్దూ వర్ణమాలలో 'టే' అయిదవది; 'డాల్, పండ్రెండవది. ఉర్దూకు మాతృకయగు హిందీనుండి సంక్రమించిన స్వత్వమీ వర్ణద్వయము) లేవు. అసలీ మూర్ధన్య స్పర్శ (Retroflex stop) వర్ణములు భారతీయేతర భాషలలోఁ గన్పట్టవని వేత్తల మతము. టండేల్, టికా, టుక్డా, టూకీ, టోపీ, బేటా, లోటా, ఠికానా, ఠేక్, ఠోకరా, అటారా, మిఠా, డకాయతీ, డాక్, డిబ్బీ, డేరా, డోరీ, డౌల్, ఘడియాల్, ఘోడా, జోడా, నాడా, బిడా, ఖిడ్కీ, ఢలాయత్, ఢీలా, ఢోలక్ — ఇత్యాది మూర్ధన్య వర్ణఘటితములగు రూపము లన్నియు 'ఉర్దూ' లో హిందీనుండి సంక్రమించిన పదములు; కేవల భారతీయములు, అనఁగా అరబ్బీ, పారసి జాసల వాసన సైతము సోఁకనివి.

హిందీ మాతృకగా పురుడు తీర్చికొని, అరబ్బీ, పారసి బాసల పరదాల పొత్తిళ్ళలో పెరిగి ఈ ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డగా పెరిగి పెద్దదయిన ఉర్దూలో కూడ, హిందీలోని పై పదములు వ్యవహృతము లగుటలో వింతలేదు. ఇట్టిచో 'డ' వర్ణఘటితములగు 'గాడీ' త్యాది పదములు వ్యుత్పత్తిపరముగగాని, ప్రవృత్తిపరముగగాని అరబ్బీ, పారసి బాసలలో నుండునని నిష్కర్షించుట నిర్మూలము.

శకటము, సింహాసనము అను నర్థముల 'గాడీ' పదము నవీనోత్తరాహ భాషలలో ప్రచురము. ఒరియా, కాశ్మీరీ, గుజరాతీ, నేపాలీ, బెంగాలీ, మరాఠీ హిందీ భాషలలో 'గాడి', 'గాడీ'; అవధీలో 'గాడా' 'గాడీ', పంజాబీలో 'గడ్డ', "గడ్డీ", సింధీలో 'గాడో', "గడ్డీ సయడే" యని హేమచంద్రుని (క్రీ. శ. 1088–1172) దేశీనామమాల (3). తీర్థకల్పమను జైనమత గ్రంథమున శకటార్థమున "గడ్డ" యను పదము ప్రయుక్తము (4). గౌడ భాషా నిఘంటు నిర్మాతల దృష్టిలో దీనివ్యుత్పత్తి ముత్తెఱఁగులు :

1. గుఱ్ఱమును లాగెడి చిన్నబండి; పెంట మొదలగునవి చేరబోసెడి బండి అను నర్థములుకల సంస్కృత 'గన్త్రికా', 'గన్త్రీ' పదములు 'గాడీ'కి మూలమని కొందఱు (5). "సయడో గంతీ" అని ధనపాలుని (క్రీ.శ. 10వ శతాబ్దము) పాఇఅ లచ్ఛీ నామమాల (6).

2. రథమునందలి గద్దె, ఎత్తయిన ఆసనము అను నర్థములుకల సంస్కృత "గర్త" పదము మాతృక యని మఱికొందఱు (7).

వేఱొకధ్వని పరిణామరీతిననుసరించి తెలుఁగు నందలి 'గద్దిగ (య)', 'గద్దె' రూపములు సిద్ధములు.

---

3. దేశీనామమాలా, మురళీధర పండిత పరిష్కృతప్రతి, కలకత్తా.
4. మునిరతన్ చంద్రజీ మహారాజ్, అర్ధమానధీకోశము, దేశీప్రాకృత విభాగము, సంపుటము v, పు 731.
5. సర్ జార్జి అబ్రహాం గ్రియర్సన్, కాశ్మీరనిఘంటువు, పు. 277.
6. జివరాజ్ దోశీ సంశోధితము, శాదీలాల్ జైన్ ప్రచురితము, 1955; సూత్రము, 963
7. సర్ రాల్ఫ్ లిల్లీటర్నర్, నేపాలీ నిఘంటువు, పు. 140.

3. సంస్కృతమునందలి 'శకటీ' పదమును మూలముగా ప్రదర్శించిన వారు కొందఱు (8). ప్రాకృతమునందలి సగడ, సగడియా, సగడీపదములు సంస్కృత శకట (టీ) పదజన్యములు (9). తెలుఁగు నందలి చెకడా, సగటు, సొగటాలు — శకట పదసంబంధులు. కచడం, కచడా, కచ్చడం, కచ్చడా — లువర్ణవ్యత్యయము కారణముగా "చెకడా" పదమునుండి వికృతి నందినరూపములు. ప్రాకృతమునందలి 'సగడీ' పదములోని ఆద్యక్షరము 'స' లోపింపగా 'గడీ', "గడ్డీ' గాడీ అయి యుండునని మూడవమతమువారి రూపనిష్పాదన ప్రక్రియ కాబోలు ! ఆద్యక్షర మగు 'స' లోపించుట గౌడభాషలలో క్వాచిత్కమగు ధ్వని పరిణామము.

కాఁగా, శాస్త్రసంప్రదాయము మేరకు 'గాడీ' హిందార్య భాషాజన్యమయిన అన్యదేశ్యము, కావున 'గాడీ'ని తురుష్క భాషాపద మనుట వృథా వాదము. "పోనిండు. 'గాడీ' తురుష్క భాషా పదమను వాదమును వదలుకొందము. కాని, ఇది హిందార్య భాషాజన్య మయిన అన్యదేశ్యమనుటలో అభ్యంతరము లేదుకదా ! అట్టిచో 'గాడీ' పదఘటితమగు నన్నయ భారత పాఠసమన్వయమె" ట్లని పూర్వపక్షమువారి ఆక్షేపము. ఇదిగో సమాధానము

'గాడీలు' అను నన్నయ పాఠమును నవ్యలు 'గాడిదలను' గామార్చిరవి కదారెడ్డిగారి వాదము. వీరి వాదమునకు శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు పరిష్కరించిన భారత ప్రతి ఆధారము. మఱి, మేము నన్నయ భారతము తాళపత్రప్రతులను నూఱింటికిపైగా కంటవ తిడికొని పరిశోధించినాము. గుజిలీ ప్రతులు పదునాఱింటిని పరిశీలించినాము, 1901_1959 మధ్య వచ్చిన ముద్రిత ప్రతులను పాతికపైచిలుకు సరిచూచినాము. తాళపత్రప్రతులు పెక్కింట 'ఏనూఱు గాడిదలను' అను పాఠముకలదు. 1907 కు పూర్వము ముద్రిత మయిన భారత ప్రతులలో సర్వేసర్వత్ర 'ఏనూఱుగాడీలు' అను పాఠము కనప్పట్టుచున్నది. 1907 మొదలుగా ప్రచురితములయిన అది సరస్వతీనిలయ, ఆనందముద్రణాలయ, కణ్ణా సెట్టి&కో., చంద్రికాముద్రణాలయ, రామా&కో.,

8. పండిత శ్యామసుందరదాస్, హిందీశబ్దసాగర్, పు. 793.
9. హర్‌గోవిందదాస్ త్రికమ్‌చంద్ సేఠ్, పాఇఅ సద్దమహణ్ణవో, పు. 1071.

వావిళ్ళ, శ్రీకృష్ణ సేవాలయ ప్రతులలో 'ఏ నూఱుగాడిదలను' అనునది అంగీకార్యమయి ప్రామాణిక పాఠముగా వ్యాప్తిచెందినది. 'గాడీలు' పాఠమును స్వీకరించిన ఇటీవలి ప్రతులు అటనట మఱికొన్ని లేకపోలేదు. అనఁగా 'గాడీలు' అనుపాఠమును 'నడుమంత్రపుపాఠ' మని పూర్వవ్యాసమున అభివర్ణితమగుట నష్టము సరిపోయినదికదా! "ఇది (ఏనూఱుగాడీలు) శ్రీ కందుకూరి ముద్రిత పాఠము" అని శ్రీ రెడ్డిగారు వ్రాయుట పాక్షికసత్యము. కందుకూరి వీరేశలింగము పంతులుగారి పుట్టుక (16, ఏప్రిల్, 1848)కు పూర్వము ముద్రితమయిన ఒకటి రెండు ప్రతులలో 'గాడీలు' పాఠమున్నది. ముందు ముద్రితప్రతుల ముచ్చట. వివిధములగు భారత ముద్రణముల యందును, తక్కిన ఆకరముల యందును గల పాఠములు కాలక్రమానుగుణముగా యథలబ్ధిగా నీ దిగువ ప్రదర్శితము. విద్యాక్రమ తత్త్వవేత్తలగు పెద్దలు ఈ క్రింది పాఠముల సరళిని పరికింప వేఁడికోలు.

క్రీ.శ. 1833 (?) "... చిత్రలలితగతినొప్పు నే నూఱు గాడీలు సింధుజ బాహ్లిక కాంభోజ పారసీక జాతమైన తురగ శతసహస్రము..." (పుట 120) మా. వేంకటకృష్ణమాచార్యులు, రా. వెంకట కృష్ణశాస్త్రి తో. విజయరాఘవ కవి ఈ మువ్వురిచే లేఖక ప్రమాదజనిత దోషంబులు వారింపఁబడి ఆలూరి-ఏకామ్ర జోస్యులవారి స్వకీయంబగు జ్యోతిష్కళానిధి ముద్రాక్షరశాల యందును, పువ్వాడ వేంకటరావుగారి స్వకీయంబగు చెన్నపట్టణపు — వర్తమాన తరంగిణీ ముద్రాక్షరశాల యందును ముద్రాక్షరాంకితము సేయఁబడి శాలివాహన శకవర్షంబులు 1755 (10) పరీధావినామ సంవత్సర పుష్యశుద్ధ ౧ సోమవారమున దూర్వాసుల జగన్నాథ సుబ్బారావు ప్రభృతి సమూహమువారి వలన ప్రకటితమయిన ఆంధ్ర భారత ప్రతి, ఆదిపంచకము)

1847. "....గతినొప్పు నే నూఱు గాడీలు ...." (చెన్నపట్టణములోని కాంచీపురము పచ్చయప్ప మొదలారిగారి విద్యాశాలయం దాంధ్ర గీర్వాణ

---

10. 1775 అని యుండవలెను. శక. 1775 తో వలె 1755తో పరీధావి అను రూప సంవత్సరముగా సంపదించుటలేదు పరీధావి, పుష్యశుద్ధ ౧ సోమవారము – క్రీ. శ. 1853, జనవరి, 10 వ తేదీతో సరిపడుచున్నది. (Swami Kannu Pillai Indian Ephemeris, vol VII, 1800–2000)

ప్రధానోపాధ్యాయులయిన వైయాకరణ రామానుజాచార్యుల వారిచేత లేఖక ప్రమాదాది దోషంబులు లేకఁ బరిశోధింపఁబడి, హానరేబిల్ కంపెనీవారి యూని వర్శిటీ యను శాస్త్ర పాఠశాలయం దాంధ్రోపాధ్యాయులయిన ప. చిన్నయగారి చేత సరిచూడఁబడి, దీనికి శాస్త్ర నిబంధనములను మెండుగా నుంచక వైయా కరణ రామానుజాచార్యుల వారిచేతనే భారతవచనంబను పేరుగలదిగాఁ జేయ బడిన ఛాయా వ్యాఖ్యానముతోడ శాలివాహన శక వర్షంబులలో 1769 వదియగు ప్లవంగనామ సంవత్సరాధిక జ్యేష్ఠశుద్ధ ౩ (క్రీ. శ. 1847, మేనెల, 17వ తేదీ) సోమవారంబునందు సరస్వతీపీఠ ముద్రాక్షరశాలయందు అచ్చువేయఁబడిన ప్రతి. ఆదిపర్వము).

1881 "అవిరళ శశిపవనార్ద్రి.... శిబికా సహస్రంబుఁ జిత్రలలిత గతి నొప్పునే నూఱుగాడీలు సింధుజబాహ్లిక....'' (పంచాంగము వారను వ్యవహార నామముగల భద్రాచలం – తిరుమల నరసింహాచార్యులవారిచేఁ బరిష్కరింపఁబడి పిళ్ళారిసెట్టి రాఘవయ్యనాయని వారిచే శ్రీ భారతీనిలయ ముద్రాక్షరశాలయందు 1881 సం॥ ఫిబ్రవరి నెలలో ముద్రితమయి ప్రచురితమయిన ప్రతి.)

1885 'గాడి'. వి. రథవిశేషము (రూ. గాడీ. "చిత్రలలితగతి గతినొప్పు నే నూఱు గాడీలు''. భార. ఆది. ౮. ఆ. – శబ్దరత్నాకరము, ప్రథమ ముద్ర ణము, 1885, పుట 317. "వాస్తవార్థ పరిజ్ఞాన సిద్ధికిని, విశేషపద ప్రాప్తికిని మూలకారణంబగు నాంధ్ర భారతాది గ్రంథ పరిశోధనంబునం దత్యంత సముత్సుకు" (శబ్ద రత్నాకర పీఠిక) లగు బహుజనపల్లి వారును 'గాడీలు' పాఠ మును స్వీకరించుట చింత్యము. శబ్ద రత్నాకరము తరువాతి ముద్రణముల (1912, 1922, 1929, 1937, 1958) యందును మార్పులేదు.

1887. "....శిబికా సహస్రంబు జిత్రలలితగతి నొప్పు నే నూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజపారశీకజాతమయిన..." (పు. 107 ములుకుట్ల విశ్వ నాథ శాస్త్రిలవారిచే పరిష్కరింపబడి, ములుకుట్ల వెంకటప్పయ్య వారిచేతను, పంచాంగం శ్రీకాకుళాచార్యులవారిచేతను. వంకాయల కృష్ణస్వామి శెట్టిగారి చేతను, చిత్తూరు గురుస్వామి మొదలిగారిచేతను, మోపూరు కృష్ణమరాజుగారి కుమారుడగు తుళసి రాజుగారి స్వకీయమగు విబుధమనోహారిణీ ముద్రాక్షరశాల యందు 1887 సం॥లో ముద్రితమయి ప్రచురితమయిన ప్రతి).

1888. 'గాడీ' ఎడ్లనుకట్టు రథము ॥ఉ॥ చిత్రలలితగతినొప్పు నే నూఱు గాడీలు॥ భా. (పు. 186, ఓగిరాల జగన్నాథకవి, గురజాడ శ్రీరామ మూర్తి రచితమగు ఆంధ్రపద పారిజాతమను శుద్ధాంధ్ర నిఘంటువు. పిడుగు వేంకటప్పారావు సంపాదితము, శారదానిలయము, ముద్రాక్షరశాలలో ముద్రి తము, చెన్నపట్టణము, 1888).

1890. "....శిబికా సహస్రంబుఁ జిత్రలలిత గతినొప్పు నే నూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజపారసీక జాతమయిన తురగ శతసహస్రము...." (పు. 101, పండితులచే పరిష్కరింపబడిన ప్రతి ప్రకారం సరిచూడబడి చెన్న పట్టణం — గుజరాతి వీధియందలి వంకాయల కృష్ణస్వామి శెట్టివారిచే స్వకీయ శ్రీరంగవిలాస సరస్వతీ విలాస ముద్రాక్షరశాలలయందు సచిత్రంబుగా ముద్రిం పంబడిన ప్రతి ఆదిపంచకము, 1890).

1891. "...శిబికాసహస్రంబు జిత్రలలితగతి నొప్పునే నూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజపారశీక జాతమయిన..." (సరస్వతీ విలాస ముద్రాక్షర శాలయందు తచ్ఛాలాధికారియగు నేలటూరి వెంకట సుబ్బాశాస్త్రులవారిచేతను, కొండగుంట రాఘవశాస్త్రుల వారిచేతను 1891 లో చెన్నపట్టణమున ముద్రిత మయి ప్రచురితమయిన ప్రతి.)

? "...శిబికా సహస్రంబుఁ జిత్రలలితగతి నొప్పు నే నూఱు గాడీలు సింధుజ బాహ్లిక...." (పు. 101, వెస్టువార్డు కంపెనీవారి గుజిలీప్రతి. విజయ నగర పండితులు శ్రీ ఆదిరాజు భాస్కరశాస్త్రిగారిది).

? "...చిత్రలలితగతినొప్పు నే నూఱు గాడీలు సింధుజ...." (పు. 103) పుట చివరిపంక్తులు, వంకాయల కృష్ణస్వామి శెట్టివారి 1890 ప్రతికంటె భిన్న ముద్రణము, విశాఖపట్టణము, మహారాజా సర్ గోడే నారాయణగజపతి హిందూ రీడింగురూములోని గుజిలీప్రతి).

1893. "అవిరళశక్ర దనార్ద్రి గండస్థల గజ సహస్రంబును...చిత్ర లలితగతినొప్పు నేనూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజపారసీకజాతమైన..." (పు. 101, పండితులచేత పరిష్కరింపఁబడి చెన్నపట్టణము శ్రీమాన్ గుదిమెళ్ళ

వెంకట వరదాచార్యుల వారిచేత వాక్సతీనిలయ ముద్రాక్షరశాలయందు ముద్రిత మయి, ప్రచురితమయిన గుజిలీప్రతి, ఆదిపర్వము, (1893).

? "చిత్రలలితగతి నొప్పు నే నూఱు గాడీలు సింధుజ...." (పు 116, బొబ్బిలిపండితులు శ్రీ అంపోలు అప్పలాచార్యులుగారి యొద్దనున్న గుజిలీ ప్రతి, ఆదిపంచకము; ముఖ పత్రము, తొలిపుటలు లేనందున ప్రకాశకాది వివరములు తెలియవు)

? "శిబికా సహస్రంబుఁ జిత్రలలితగతి నొప్పు నేనూఱు గాడీలు సింధుజ...." (పు. 101, బహు దేశంబులనుండి ప్రాచీన గ్రంథంబు లనేకంబు రావించి.... పండిత సాహాయ్యంబునం బరిష్కరించి... రెండవ పర్యాయము హరి వంశ సహితముగాఁ బందొమ్మిది పర్వంబులును సమగ్రంబుగా నచ్చు గూర్పించి ప్రకటించిన గుజిలీ ప్రతి, వంకాయల కృష్ణస్వామి శెట్టివారిది).

1894. "...మరియు చిత్రవిచిత్రముగా నుండెడి యే నూరుగాడీలను, కృష్ణుడు సుభద్రార్జునులకు యిచ్చె. మఱియు కృష్ణుడు లక్ష గుఱ్ఱములను, సుభద్రార్జునులకు యిచ్చె. ఆ గుఱ్ఱములు సింధుదేశ బాహ్లికదేశ కాంభోజదేశ పారసీక దేశములయందు బుట్టినవి యగును..." (పు. 190, మంత్రి లక్ష్మీనారాయణ శాస్త్రిగారి ఆంధ్ర వచనభారతము, ఆదిపర్వము; చన్నపురి, బరూరు-త్యాగరాయ శాస్త్రులచే స్వకీయ గీర్వాణభాషా రత్నాకర ముద్రాక్షరశాలయందు ముద్రింపబడి, ప్రకటింపంబడిన గుజిలీప్రతి, 1894).

? "...గతినొప్పు నేనూఱు గాడీలు సింధుజ..." (పు. 110, గోదావరి జిల్లా — కొమరరాజులంక వాస్తవ్యులు శ్రీ చిలుకూరి వేంకటశాస్త్రులుగారి యొద్ద నున్న గుజిలీప్రతి, ఆదిపంచకము. ముఖపత్రములేదు.)

? "...చిత్రలలితగతి నొప్పు నేనూఱు గాడీలు సింధుజ..." (పు. 113, అనంతపురము జిల్లా, కల్యాణదుర్గము తాలూకా, అంకంపల్లి వాస్తవ్యులు పాటీలు తిమ్మారెడ్డిగారి యొద్దయున్న గుజిలీప్రతి, ఆదిపంచకము, మొదటి ఆఱు ఆశ్వాసముల భాగము లేదు).

1901. "శిబికాసహస్రంబుఁ జిత్రలలితగతి నొప్పు నేనూఱుగాడీలు సింధుజ బాహ్లీక కాంభోజ పారసీక జాతమైన తురగ శతసహస్రము...." (పు. 230, ఆది. 8_221; రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతుల వారిచేతను రాయదుర్గము నరసయ్య శాస్త్రిలవారిచేతను బరిష్కరింపఁబడి శత ఘంటము వేంకటరంగ శాస్త్రిలవారి పీఠికతో మద్రాసు ఆనంద ముద్రాక్షరశాల యందు ముద్రితమై వేమూరి వేంకట కృష్ణమసెట్టి అన్డ్ సన్సుచే 1901 లో తొలికూర్పుగా ప్రకటితమయిన ఆంధ్ర భారతప్రతి, ప్రథమ సంపుటము, ఆది పంచకము. ప్రత్యేక పద్యపాద విభజనముతో, మంచి గ్లేజుకాగితముల మీఁద ముచ్చటగా అచ్చయిన ప్రతులలో నేను చూచినంతదాఁక ఇదే మొదటిది).

1902. "గాడీ" శబ్దముం గుఱించి: (11) 'గాడీ' శబ్దము హిందూస్థానీ పదము. తురకలీశబ్దముం బలుమాఱు వాడుచుండుట నందఱెఱింగి యుందురు. గాడీయనఁగా నెద్దులనుగట్టు రథము. ఈ పదమును, నన్నయభట్టు భారతములో నాదిపర్వము 8 వ యాశ్వాసములో 221 వ పద్యమున :—

సీ॥ ...చిత్రలలిత । గతినొప్పునే నూఱుగాడీలు....

అని ప్రయోగించియున్నారు. శబ్దరత్నాకరమున నీ పదము దేశియమని వ్రాయఁబడి యున్నను, దీనిం దురకలిప్పుడు వాడుచునే యుండుట హస్తామలకమే. కవిత్రయమువారి కాలముననను, నన్యభాషాపదము లున్నట్టులుగఁ బ్రబల నిదర్శనము."

— పత్రికాధిపతి.

[అముద్రిత గ్రంథ చింతామణి మయూఖము, నెల్లూరు, సంపుటము 15. పు. 32, జనవరి ఫెబ్రవరి సంచిక, 1902].

1903 "...చిత్రలలితగతి నొప్పునేనూఱు గాడీలు..." (పు. 363, నాఁటి ప్రెసిడెన్సీ కాలేజీలో ఆంధ్ర పండితులగు రావుబహద్దరు కందుకూరి వీరేశ

11. ఈ యాకరము ఉనికినిగూర్చి తెలిపినవారు మిత్రులు శ్రీ శ్రీధరమూర్తి, శ్రీబొమ్మకంటి శ్రీనివాసాచార్యులుగార్లు, అముద్రిత గ్రంథ చింతామణిలోని ఈ వ్యాసమును వ్రాసి ఇచ్చిన శ్రీ కూనవులి వెంకటరమణయ్యగారికి కృతజ్ఞతాభివందనములు.

లింగము పంతులుగారు పరిష్కరించిన బ్రౌణ్యము, ఆంధ్రాంగ్ల నిఘంటువు, 1903 ; బ్రౌణ్యము ప్రథమముద్రణము (1852) నందీ పాఠప్రసక్తియే లేదు.)

? "...చిత్రలలితగతి నొప్పు నేనూఱు గాడీలు సింధుజ..." (పు. 130, రెండవభాగము, పెద్దచ్చు ఆదిపర్వము. మొదటి పదునాఱు పుటలు లేవు. క్రింది 1910 ప్రతికంటె ప్రాచీనతర మయిన గుజిలీప్రతి. పశ్చిమాంధ్ర ప్రాంతముల బహుళ ప్రచారములో నుండిన శేషాచార్యులు, మదరాసువారి ప్రతి కానోపు.)

1910"...చిత్రలలితగతి నొప్పు నేనూఱు గాడీలు సింధుజ..."(పు.125, రెండవ భాగము; చెన్నపట్టణము నాతా నమ్మయ్యశెట్టి అండ్ సన్ వారి శ్రీరామానుజ విలాస ముద్రాక్షరశాలయందు 1910 లో ముద్రితమయి ప్రచురిత మయిన పెద్దచ్చు ఆదిపర్వము, గుజిలీప్రతి. ఇదే మా పినతాత శ్రీ తూమాటి భీమప్పగారు (1872–1948) నా చిన్నప్పుడు (1937–1939) పాఠముచెప్పినప్రతి).

1911. "...గతి నొప్పు నేనూఱుగాడీలు సింధుజ బాహ్లిక కాంభోజ పారసీక జాతమైన..." (పు. 230, ఆది 8–221, సుజనరంజనీ, కాకినాడ వారి ప్రతి, 1911).

1915. "...దేశ్యములో, అన్యదేశ్యంబని మఱి యొండు విధంబు గలదు. ఉదా॥ తావు, పైఠాణము, గాడీ ఇత్యాది హిందూస్థానీ పదములును... ఆంధ్రమునందుఁ గవి సంప్రదాయసిద్ధముగాఁ బ్రయోగింపవచ్చును. ... "రమ్యభూషణాలంకృత స్త్రీ సహస్రింబుఁ గాంచన శిబికాసహస్రింబుఁ జిత్రలలితగతి నొప్పు నేనూఱు గాడీలు సింధుజ బాహ్లిక కాంభోజ పారశీక'' — భార. ఆది. 8 ఆ. '' (పు. 16. కల్లూరి వేంకటరామశాస్త్రిగారి బాలవ్యాకరణ గుప్తార్థ ప్రకాశిక - రాజమహేంద్రవరము. 1915).

1923. "ఏనూఱు గాడీలను'' (పు. 68. 'దీర్ఘాణాంహ్రస్వస్స్యాత్ నచ దేశ్యపదే' అను సూత్రముల యొద్ద ఆంధ్రశబ్దచింతామణికి పారనంది రామ శాస్త్రులుగారు చేసిన ఉద్యోతినివ్యాఖ్యలో ఉదాహృతమయిన లక్ష్యము. శ్రీ కాశీ నాథుని నాగేశ్వరరాయ ప్రకాశితము, మదరాసు, 1923.)

1937. "హేయములు గాకయున్నవె యాయా దేశాంతరీయమగు శబ్దం బుల్ తోయలి తలమానికమా!

'యాయెడిని బ్రయోగమునకు నర్హ్హంబులుగన్' ... 'కాంచన శిబికాసహ స్రింబుఁ జిత్రలలితగతి నేనూఱు గాడీలు ... 'ఇవి హిందూస్తాని పదములు' (పు. 17, సంజ్ఞాపరిచ్ఛేదము, నారాయణీయాంధ్రవ్యాకరణము, గాణపత సూత్ర వివరణసహితము, శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రణాలయము, పిఠాపురము 1937).

1937. "అన్యదేశ్యములగు దీర్ఘాంతపదముల తుదిదీర్ఘమునకు హ్రస్వము రాదు. గాడీలు (12) (ఆది viii. - 21) దీనికి 'గాడిదలు', 'గాడ్దలు' అని పాఠాంతరములు కొన్పించుచున్నవి.'' (పు. 1358, రెండవ సంపుటము, డా. చిలుకూరి నారాయణరావుగారి ఆంధ్ర భాషాచరిత్రము. ఆంధ్రవిశ్వకళా పరిషత్ప్రకాశితము, వాల్తేరు, 1937) (12) "నన్నయ కాలమున దీర్ఘాంతములగు దేశ్యపదముల కుదాహరణములు కానరాలేదు'' అని ఇదే సంపుటమున శ్రీ నారాయణరావుగారు వ్రాయుట గమనార్హము. ('నచదేశ్యపదే' అను ఆంధ్రశబ్ద చింతామణి సూత్రమునకు డా. చిలుకూరి నారాయణరావుగారి హృదయము. ఆంధ్ర భాషా చరిత్రము పు. 1634). రమారమి నూఱేండ్ల వ్యవధిలో గతానుగతికముగా "గాడీలు" పాఠమిట్లు స్వీకృతము. ఇదంతయును "గాడీలు'' పదఘటితమే అసలు పాఠమను వాదమునకు సంవాదకమయిన సాధకసామగ్రి. తత్త్వాన్వేషణమున సత్యనిహ్నవనము పనికిరాదు కదా। వాదిప్రతివాదుల అభియోగ నిరూపణముతో తగవు తేలదు; ధర్మాసనము వారి తీర్పుకదా ముఖ్యము.

కాని, ముద్రిత ప్రతుల పాఠములపై కుమ్ములాడుట నిష్ప్రయోజనము. అనేక తాళపత్ర ప్రతులలో గుజిలీప్రతుల పాఠమునకు భిన్నముగా 'ఏనూఱు గాడిదలను' అను పాఠమే కన్పట్టుచున్నది. కర్తృభిప్రేతమగు మూలపాఠమును నిర్ణయించు నిమిత్తము కాకినాడ, తంజావూరు, తిరుపతి, మదరాసు, రాజమహేంద్రవరము, వాల్తేరు। విజయనగరములలోని తాళపత్రప్రతులు నూటికిపైగా పరిచూడఁబడినవి. నేను స్వయముగా పరిశీలించినవి తొంబదికి

12. "ఈ పాఠము అసందర్భము. నన్నయనాఁటికీ పదమేలేదు. 'గాడి' చాల నవ్యమయిన హిందీ పదముగదా'' Marginal Notes by Prof. G. J. Somayaji; డా. చిలుకూరి - ఆంధ్ర భాషా చరిత్రము, పు. 1358.

పై మాట. నా యీ పనికొఱకు సాహితీ బంధువులు పరిశీలించినవి పాతికపై చిలుకు (13). పర్యాప్తమయిన ఈ పరిశీలనము వలని ఫలితములివి :

13. వివిధప్రాంతములలోని తాళపత్ర ప్రతులను పరిశీలించుటలో తోడ్పడియు, స్వయముగా వ్రాసి పంపియు సహకరించిన సాహితీబంధువులు చాలమంది. అందఱకును కృతజ్ఞతాభి వందనములు.

కాకినాడ : ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయము నందలి తాళపత్రప్రతులను పరిశీలించుటలో సంపూర్ణ సహకారమిచ్చిన మిత్రులు శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు, పరిషత్కార్యాలయోద్యోగి శ్రీ కూనపులి వెంకటరమణయ్యగారు.

తంజావూరు : మహారాజా శరభోజీ సరస్వతీమహలు లైబ్రరీ గౌరవ కార్యదర్శిగారు, గౌరవ లైబ్రరీ పండితులు శ్రీ యన్. విశ్వనాథముగారు.

తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధకసంస్థ గ్రంథాలయ అధికారులు, ముఖ్యముగా శ్రీ యన్.సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ఎం.ఏ., క్యూరేటరు, పండిత ఎస్. వి. భాస్కరరావుగారు. అక్కఱగల పాఠములను వ్రాసివంపిన మిత్రులు శ్రీ బూదరాజు రాధాకృష్ణ, ఎం. ఏ., (చీరాల కళాశాలలో ఆంధ్రోపన్యాసకులు), పండిత శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు (తిరుపతి ప్రాచ్య పరిశోధకసంస్థ పండితులు).

మదరాసు : ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయాధికారులు; వలయు పాఠములను వ్రాయించి పంపిన మిత్రులు శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులుగారు, తెలుఁగు భాషాసమితి, మదరాసు.

రాజమహేంద్రవరము : ఆంధ్రేతిహాస పరిశోధకమండలి గ్రంథాలయము, నా ఉద్యమము నెఱిఁగి, ఆనందించి, ఆశీర్వదించిన పూజ్యులు శ్రీ రాళ్ళబండి సుబ్బారావుగారు, ఎం. ఏ., ఎల్. టి. మండలి వ్యవస్థాపకులు; పాఠములను వ్రాసియిచ్చిన మిత్రులు పండిత శ్రీ శ్రీపాద పేరయ్య శాస్త్రిగారు.

గౌతమీ గ్రంథాలయము నందలి తాళపత్ర ప్రతి పాఠములను వ్రాసిపంపిన మిత్రులు, జానపద వాఙ్మయోద్ధారకులు శ్రీ నేదునూరి గంగాధరముగారు.

వాల్తేరు : ఆంధ్రవిశ్వకళా పరిషద్గ్రంథాలయాధికారులు; లిఖితగ్రంథవిభాగ పర్యవేక్షకులు శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మగారు.

విజయనగరము : విజయనగరము మహారాజావారి ఫోర్టులైబ్రరీ ఉద్యోగి శ్రీ జి. సాంబశివరావు; ప్రభుత్వ సంస్కృత కళాశాలా విద్యార్థులు వర్ధిష్ణువులు డి. సత్యనారాయణరాజు, అప్పల నరసింహము.

1. కాకినాడ : ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతులు (సేకరింపఁబడిన మండలముల వారీగా ఉదాహృతములు)

i. నెల్లూరు మండలము :

నెంబరు 11. చిత్రలీలగతినొప్పు నెనూరు గంధసింధురము (254 వ ఆకు మొదటివైపు)

నెం. 30. చిత్రలలితగతినొప్పు నెనూరు గాడిదెలను సింధుబాంహ్లీక (185 వ ఆకు, రెండవవైపు).

నెం. 36. చిత్రలలితగతినొప్పు నెనూరు గాడిదెలును శింధు బాంహ్లీక పారశీయ జాతమైన (156 వ ఆకు).

నెం. 639. చిత్రలలితగతినొప్పు నేనూరు గాంధ్ధర్వహయములు (196వ ఆకు).

నెం. 664. చిత్రలీలగతినొప్పు నెనూరు గాడిబండ్లును (173 వ ఆకు).

నెం. 704. చిత్రలీలగతినొప్పు నెనూరు గాడి బండ్లును సింద్ధు (204 వ ఆకు, రెండవవైపు).

నెం. 750. లలితగతినొప్పు నెనూరు గంధర్వ ఖంబ్బున (204 వ ఆకు).

నెం. 810. చిత్రలలితగతినొప్పు నెనూరు ఖరములు మరి సింద్ధు (176 వ ఆకు, మొదటివైపు).

నెం. 914. లలితగతినొప్పు నేనూరు గాళుల వరశింధు బాంహ్లీక(111వ ఆకు, మొదటివైపు).

నెం. 2310. లలితగతినొప్పు నేనూరు గార్ధభంబులు సింధు (175 వ ఆకు, రెండవవైపు).

నెం. 2644. చిత్రలలితగతినొప్పు నెనూరు గాడిదలును (96 వ ఆకు, మొదటివైపు).

నెం. 4346. చిత్రలలితగతినొప్పు నూరు లోష్ట్రములు.

నెం. 4370. చిత్రలలితగతినొప్పు నెనూరు గాడిదెలును (236 వ ఆకు, రెండవవైపు : పింగళ శ్రావణ శుద్ధ 14 లు).

నెం. 4412. చిత్రలలితగతినొప్పు నెనూరు గాడిదెలుం సింధు బాహ్లీక కాంభోజ (134 వ ఆకు, మొదటివైపు).

ii. చిత్తూరు మండలము :

నెం. 133...(?) సలలితగతినొప్పు నెనూరు గాడెదలును బాంహ్లీక సింధు కాంభోజ (208 వ ఆకు, రెండవవైపు).

నెం. 1633. చిత్రలలితగతనొప్పు నెనూరు శింధు బాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (173 వ ఆకు).

నెం. 2006. అవిరళస్ఫురిత దానార్ద్రి గండస్థల చిత్రలలితగతినొప్పు నెనూరు గంధర్వ హయములు (శార్వరి, వైశాఖ శు ౨ శనివారము).

నెం. 2181. చిత్రలలితగతినొప్పు నెనూరు ఖరములు మరి సింద్దు బాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (210 వ ఆకు, నల భాద్రపద శుద్ధ ౧ శుక్రవారము).

iii. అనంతపుర మండలము :

నెం. 4056. అవిరళస్ఫురిత దానాగ్ర గండస్థల ... చిత్రలలితగతి నొప్పు నెనూరు గాడిదెలున్ సింధు బాంహ్లీక కాంభోజ పారసియ్య జాతమైన (170 వ ఆకు, రెండవవైపు).

నెం. 4091. చిత్ర లలితగతి నెనూరు గాడిలు మరి శింద్దుబాంహ్లీక.

నెం. 4124. గతి నొప్పు నేనూరునాడిలు శింధుజ (181 వ ఆకు- రెండవవైపు).

iv. కర్నూలు మండలము :

నెం. 1329. చిత్రలలితగతి నొప్పు నెనూరు గాడుదులను శింధుబాంహ్లీక కాంభోజ పారశియ్య జాతమైన (151 వ ఆకు, రెండవవైపు; తారణ భాద్రపద శు. ౧౦ లు)

v. గుంటూరు మండలము :

నెం. 3915. చిత్రలలితగతి నొప్పు నెనూరు గార్ధ భంబ్బులు శింధు (170 వ ఆకు, మొదటివైపు; బహుధాన్య పుష్య బ. ౮, ఆదివారము – క్రీ. శ. 1759 జనవరి, 21).

vi. కృష్ణామండలము:

నెం. 979. అవిరళ గణిత ధానార్ధ... జిత్రలలిత గతినొప్పు నెనూరు గాడిదెలను శింధు బాహ్లిక పారశికజాతమైన (137 వ ఆకు; ప్లవంగ, మాఘ శు. ౧౦ సోమవారము; క్రీ. శ 1848 ఫిబ్రవరి, 14).

నెం. 2733. చిత్రలలితగతి నొప్పు నెనూరు గార్ధభంబ్బులు సింధు నెం. 3698. గతి నొప్పు నెనూరు గంధర్వ హయములు బాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (255 వ ఆకు, రెండవ వైపు)

vii. గోదావరి మండలము :

నెం. 1014. చిత్రలలితగతి నొప్పునెనూరు ఖడ్గాదులను సింధుబాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (224 వ ఆకు, రెండవ వైపు; వికారి. కార్తిక శుద్ధ ౭ శనివారము).

నెం. 4550. అవిరళ స్రవిత దానార్ద్రి గండస్థల గజసహస్రంబ్బును... చిత్ర లీల గతినొప్పు నెనూరు గంధర్వహయములు బాంహ్లీక కాంభోజ పారసియ్య జాతమైన (160 వ ఆకు, మొదటి వైపు).

viii. నల్లగొండ(కొలనుపాక) :

నెం. 3452. లలితగతి నొప్పునెనూరు గాడియ్యలను సింధు (135 వ ఆకు, మొదటివైపు).

ix. దక్షిణ దేశము :

నెం. 85. చిత్రలలితగతి నొప్పు నెనూర గాడిదెలను శింధు బాంహ్లీక కాంభోజ పారసియ్య జాతులైన (206 వ ఆకు, మొదటి వైపు).

నెం. 226. చిత్రలలితగతి నొప్పునెనూరు గాడిదెలను (205 వ ఆకు, మొదటివైపు).

నెం. 227. జిత్రలలితగతి నొప్పు నెనూరు గాడిదెలను సింధు బాంహ్లీక కాంభోజ పారసియ్య జాతమైన.

నెం. 309. చిత్రలలితగతి నొప్పు నెనూరు గాడిదులను శింధుబాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (236 వ ఆకు, మొదటివైపు; నళసంవత్సర మాఘ శుద ౭ శెనివారం, తై నెల 26 వ తేది క్రీ. శ. 1797, ఫిబ్రవరి, 4 వ తేదీ).

నెం. 361. జిత్రలీల గతినొప్పు నెనూరు గాడిదెలను సింధు బాంహ్లీక కాంభోజ పారశియ్యజాతమైన (233 వ ఆకు, రెండవవైపు).

x. ఇతరములు (ఏ ప్రాంతమునకు చెందినవో స్పష్టపడని తాళపత్ర ప్రతులు) :

నెం. 669. చిత్రలలితగతి నొప్పు నెనూఱు ఘనగజంబ్బులు సింధు బాంహ్లిక.

నెం. 1473. లలితగతి నొప్పు నెనూరు గాడిదెలను సింద్ధు బాంహ్లీక కాంభోజ పారసియ్య (201 వ ఆకు, రెండవవైపు).

నెం. 1708. అవిరళక్షరిత దనార్ద్రగండ్డ స్థలగజ సహస్రంబ్బును...చిత్ర లలితగతి నొప్పు నేనూఱు గాడీలు ఘన శింధుబాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమైన (180 వ ఆకు).

నెం. 2313. అవిరళగత ధనార్ధ గండస్థల గజసహస్రంబ్బును...లలిత గతి నొప్పు నెనూఱు గాఢభముల సిందుబాంహ్లిక (181 వ ఆకు, రెండవవైపు).

నెం. 2462. ఆవిరళక్షరిత దాద్రక్ష గండస్థల గజ సహస్రంబ్బును... విచిత్రవలగతి నొప్పు నెనూఱు ఘనతరోష్ట్రింబ్బులు బాంహ్లిక కాంభోజ పారశియ్య జాతమయిన (190 వ ఆకు, రెండవవైపు).

నెం. 2545. చిత్రలలితగతి నొప్పు నెనూరు గార్దభంబ్బులు శింద్ధు బాంహ్లిక కాంభోజ పారసియ్య జాతమైన.

నెం. 2630. చిత్రలలితగతి నొప్పు నెనూఱు ఘనలోష్ట్రిలును సింధు బాంహ్లిక (187 వ ఆకు, మొదటివైపు).

నెం. 2639. చిత్రలలితగతి నొప్పు నెనూరు ఘనతరోష్ట్రములను (197 వ ఆకు, మొదటివైపు.)

నెం. ? చిత్రలీలగతి నొప్పు నెనూరు గాడిదెలును (188 వ ఆకు, రెండవవైపు).

నెం. ? చిత్రలలితగతి నెనూరు గాడ్దలు మరి శింధు.

నెం. 4414. (?) చిత్రలలితగతి నొప్పు నెనూరు గాడిదులును సింధు బాంహ్లిక (197 వ ఆకు, రెండవవైపు).

II. <u>తంజావూరు</u> : (మహారాజా శరభోజీ సరస్వతీమహాలు లిఖితగ్రంధాలయమునందలి తాళపత్ర ప్రతులు.)

D. 58. అవిరళక్షరిత దానార్ద్రగండస్థల ... శిబికాసహస్రంబునుం జిత్రలలిత గతి నొప్పు నేనూరు గాడిదలను సింధు బాంహ్లిక కాంభోజ పారశీయ్య జాతమైన తురగ సహస్రమము (M. 26)

D. 59. అవిరళక్షరిత దానాద్రగండస్థల ... శిబికాసహస్రంబుం జిత్రలీలగతి నొప్పు నేనూరు గాడుదులను శింధు బాంహ్లిక కాంభోజ పారశీక జాతమైన తురగతతయుతంబును (M. 27).

D. 60. అవిరళగటిత దానార్ద్ర గండస్థల ... శిబికాసహస్రంబుం జిత్రలీల తగిలి నొప్పు యేనూరు కరభంబులను సింధు బాంహ్లిక కాంభోజపారసింహ్య జాతమైన (M. 28).

D. 63. అవిరళక్షరిత దానార్తగండస్థలి .... కాంచనశిబికా సహస్రంబు చిత్రలీలగతి నొప్పునేనూరు గాంధర్వహయములు బాంహ్లిక కాంభోజ పారశీయ జాతమైన (M. 30)

D. 64. అవిరళక్షరిత దానార్ద్ర .... చిత్రలలితగతి నొప్పు నేనూరు గాడిదలను (M. 31)

D. 65. అవిరళక్షరిత ధానార్ద్ర ... శిబికాసహస్రంబుం జిత్రలలిత గతి నొప్పు నేనూఱు గాడిదలను సింధు బాంహ్లిక కాంభోజ పారశీయ్య జాతంబైన (M. 32, Tel. No. 52.)

D. 68. అవిరళగళిత ... జిత్రలలితగతి నొ ... తలను (M. 35).

III తిరుపతి :

i. (శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధక సంస్థ (Sri Venkateswara University Oriental Research Institute - SVUORI) గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతులు).

Stock No. 558 (a). చిత్రలలితగతి నొప్పు నేనూరు గాడిదలను.

Stock No. 561. చిత్రలీలగతి నొప్పు నెనూరు గాడిదెలను సింధు బాంహ్లీక కాంభోజ (శిథిలప్రతి).

Stock No. 579. చిత్రలలితగతి నొప్పు నేనూరు గాడీలు సింధుజ (అర్వాచీన ప్రతి, 6 నుండి 8 వ ఆశ్వాసము వరకు కలదు.)

Stock No. 1004. చిత్రరచితగతి నొప్పు నేనూరు గాడిదెలనుశింధు).

Stock No. 6780 (a) లలితగతి నొప్పు నెనూరు ఘనతోష్ట్రములు సింధు బాంహ్లీక (అర్వాచీనప్రతి).

Stock No. 7594. కాంచన సిబికాసహస్త్రంబు చిత్రలలితగతి నొప్పునే నూరు ఘనలోష్ట్రములు (అర్వాచీన ప్రతి.)

Stock No. 7696(a). చిత్రలీలగతి నొప్పు నేనూరు గాడీలు మరి శింద్ధు బాంహ్లీక (అర్వాచీనప్రతి,)

ii. మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము(Govt. Oriental Manuscripts Library, Madras) నుండి తిరుపతిలోని (Svuori) కు మార్పిడియైన తాళపత్రప్రతులు.

D. 189. అవిరళస్ఫురిత దానార్ద్రగండ స్థల గజస్రంబును ... జిత్ర లలితగతి నొప్పు నెనూరు ఘన లోష్ట్రములు (Tel. B. 116, 11-5-2, ఆది పర్వము సర్వము. అతినూతన ప్రతి.)

D. 194. అవిరళక్షదిత దానార్ద్ర గండస్థల గజసహస్రంబును ... జిత్రలీలగతి నొప్పు నెనూరు ఘనతోష్ట్రియులు శింధ్ధు బాంహ్లీక (Tel. B. 120, 14-13-15.)

D. 196. అవిరలహరిత దానార్ద్రిగండస్థల గజసహస్రింబులు ... జిత్రలలిత గతి నొప్పు నెనూరు గార్ద్రిభములు సింధు బాంహ్లీక (Tel. B. 122, 14-7-14.)

IV. మదరాసు :

ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము నందలి తక్కిన ప్రతులు :

D. 197. అవిరతక్షరిత దానాద్రన్గండ స్థల గజసహస్రంబులు ... చిత్రలలితగతి నొప్పు నైనూరు గాడిదలును సింధు బాంహ్లీక కాంభోజ పారశీయ జాతమైన తురగశత సహస్రము (భారతము లక్ష్మీప్రతికి ప్రాచీనమగు తాళ పత్రప్రతి.)

D. 164. చిత్రలలితగతి నొప్పు నేనూరు గాడిదలను శింధు బాంహ్లీక పారశియ్య జాతమైన (బ్రౌనుదొర తయారు సేయించిన కాగితపు ప్రతి, ఆది పర్వము అయిదవ ఆశ్వాసము మొదలు పర్వాంతము వరకు కలదు. 'గాధణ ఘంబులు' 'గంధర్వహయములు', 'ఖరములుమరి' - అను పాఠాంతరములును గుర్తింపఁబడినవి)

D. 193. అవిరళగళిత ... సారధి సమేతంబైన ... చిత్రలలితగతి నొప్పు నేనూరు ఖరములు మరి శింధు బాంహ్లీక కాంభోజ పారసిక (బ్రౌను దొర వ్రాయించిన కాగితపుప్రతి, ఆది పర్వము సమగ్రము.)

V. రాజమహేంద్రవరము :

i. ఆంధ్రేతిహాస పరిశోధకమండలి, రాజమహేంద్రివరమువారి గ్రంథాలయము నందలి తాళపత్ర ప్రతులు.

నెం. 53. చిత్రలీలగతి నొప్పు నూరేసి గాడీలు మరి సింధు (117 వ ఆకు).

నెం. 59. చిత్రిలీలగతి నొప్పు నేనూరు గంధర్వహయములు (256 వ ఆకు).

ii గౌతమీ గ్రింథాలయము నందలి తాళపత్రప్రతి.

నెం. 51. అరవిశగళిత దానార్ద్రి గండస్థల గజ సహస్రింబ్బును ... రమ్యభూషణాలంకృత శ్రీ సహస్రింబ్బుల గాంచ్చన శిబికా సహస్రింబ్బుం చిత్రిలలితగతి నొప్పు నేనూరు గాడిదలను సింధు బాహ్లీక కాంభోజ పారశిక జాతమైన (డా. చిలుకూరి నారాయణరావుగారు గంజాముజిల్లాలో సేకరించి గ్రింథాలయమున కిచ్చినది.)

VI. వాల్తేరు :

i. ఆంధ్రి విశ్వకళా పరిషద్గ్రింథాలయము నందలి తాళపత్రిప్రితులు (శ్రీ శేషాద్రి రమణకవులు ఆంధ్రి విశ్వకళా పరిషత్పక్షమున తెలంగాణమున పర్యటించి సేకరించినవి).

Acc. No. 29404. రమ్య భూషణాలంకృతసీ్రి సహస్రింబ్బు గాంచ్చన శిబికా సహస్రింబ్బుం జిత్రిలీలగతి నొప్పు నేనూరు గాదిర ... సిందు బాంహ్లిక కాంభోజ పారసికజాతమైన తురగ శతసహస్రిము.

Acc. No. 29928, కాంచ్చన శిబికా సహస్రింబ్బుం జిత్రిలీలగతి నొప్పునే నూరు గాడిదలను సింధు బాంహ్లీక కాంభోజ పారశియ్య జాతమైన తురగ శతసహస్రిము.

ii. బొబ్బిలి సంస్థానాధీశ్వరులు ఆంధ్రి విశ్వకళా పరిషద్గ్రింథాలయమునకు బహూకరించిన తాళపత్రి గ్రింథ సంచయమునందలి ప్రితులు.

నెం. 61. చిత్రిలలితగతి నొప్పు నెనూరు గాండంబులు సింధుబాంహ్లిక పారశియ్య జాతమైన (188 వ ఆకు మొదటి వైపు, చివరిపంక్తి).

నెం. 73. కాంచన శిబికా సహస్రింబు జిత్రిలలితగతి నొప్పు నెనూరు గంధర్వ హయములు బాహ్లీక కాంభోజ పారశియ్య జాతమైన (209 వ ఆకు, మొదటివైపు).

నెం. 88. చిత్రిలీలగతి నొప్పు నేనూరు గాండంబులును శింధుబాంహ్లీక కాంభోజ పారశియ్య జాతమైన (213 వ ఆకు, మొదటివైపు).

VII. విజయనగరము :

విజయనగరము మహారాజావారి ఫోర్ట్ లైబ్రిరీలోని లిఖితప్రితులు

'అవిరళ గళిత తదానార్ద్రి గండస్థల గజసహ్రింబ్బునుం ... చిత్రిలిలగతి నొప్పు నెనూరు గాత్రిమంబ్బులును శింధువాంహ్లిక కాంభోజ పారసియ్య జాత మైన తురగ సహస్రములు... (141 వ ఆకు, రెండవవైపు).

'అవిరళకలిత దానార్ద్రి గండస్థల గజ సహస్రంబులు...కాంచనసిబికా సహస్రంబు చిత్రలీలగతి నొప్పునేనూరు గాంధర్వహయములు బాంహ్లీకాంబోజ పారశియ్యాజాతులైన తురగ శతసహస్రంబును...." (కాకితప్రతి).

'గాడిదలను' అనుచోట అనేక పాఠాంతరము లున్నట్లు తాటియాకు ప్రతులవలన నిర్ధారితమయినది, ఆ యా పాఠాంతరముల రూపభేదములు, ఆవృత్తియు నిట్లున్నవి.

1.	గాడిదలను (గాడిదలును, గాడిదెలను, గాడిదెలును, గాడుదులును, గాడెదలును, గాడ్దలు, గాదిరలును)....	31
2.	గాడీలు (గాడిబండ్లు, గాడియ్యాలను, గాడిలు, గాళుల, నాడిలు)....	10
3.	గంధర్వహయములు (గాంధర్వ హయములు)...	9
4.	ఘనలోష్ట్రిములు (ఘనతరోష్ట్రింబులు, ఘనతోష్ట్రిములు, ఘనతోష్ట్రియులు, ఘనలోష్ట్రిలు,ఘనలోష్ఠ్రిములు,లోష్ట్రిములు)	8
5.	గార్దభములు (కీరభంబుల, గర్దభముల, గాభణముల...	7
6.	ఖరములు...	3
7.	గాండంబులును...	2
8.	ఖడ్గాదులు...	1
9.	గంధశింధురములు...	1
10.	గ్రామంబులు...	1
11.	ఘనగజంబులు...	1
	మొత్తము	74

తక్కిన ప్రతులలో అష్టమాశ్వాసమో లేక ఏ తత్కథాఘట్టమో ఉన్న ఆకులు లేక పోవుటవలనగాని, పాఠమున్న భాగము చిఱుగుటవలనగాని, చెదలు కొట్టుటవలన గాని, లేక పూర్తి ప్రతి అట్టకట్టి అదుకుకొని పోవుటవలనగాని పాఠముల నెత్తి వ్రాయుట వలనుపడలేదు.

వాస్తవస్థితి యిట్లుండగా "కొందఱు 'ఏనూఱు గాడీలు' తురుష్క పదమును భారతము లక్ష్మీపతి వ్యాఖ్యానుగుణముగా 'ఏనూఱు గాడిదలను' మూలపాఠము గా బోలనుట కలదు. సూర్యరాయాంధ్ర నిఘంటువు 'ఒక ప్రాంత ప్రతిలో గూడ ('గాడీలు,) పాఠమిట్లే యున్నది' అని సూచించియు, తురుష్క పదమును ఆదరించకపోవుట చిత్రము (14)" అని శ్రీ వేంకట కృష్ణారెడ్డిగారనుట మఱీచిత్రము. భారతము లక్ష్మీపతి వ్యాఖ్యానుగుణముగా అర్వాచీన పరిష్కర్తలు 'గాడీలు'ను 'గాడిదలను' గా దిద్దివేసినారని శ్రీ రెడ్డిగారు వ్రాయుట ఆధార రహితము. భారతము లక్ష్మీపతిసోమయాజి (క్రీ.శ. 1780–1830) తణుకు ప్రాంతమువాఁడు, ఆర్వేలనియోగి. సూరమా లక్ష్మీనృసింహ సూరుల కుమారుఁడు. ఆంధ్ర భారతము పదునెనిమిది పర్వములకు వ్యాఖ్య రచించి, యథాశక్తి సాధుపాఠ నిర్ణయము కావించిన మహాపండితుడు(15). ఈయన రచించిన భారత వ్యాఖ్యానము–కూలంకషవ్యాఖ్య–ఏడు సంపుటముల కాగితపు ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమున నుండెడిదఁట! నేఁడు మృగ్యము !! రాజమహేంద్రవరము ఆంధ్రేతిహాస పరిశోధకమండలి వారి గ్రంథాలయమునను, మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునను ఈ వ్యాఖ్యా ప్రతుల కొన్నిభాగములు కలవు. సభాపర్వ వ్యాఖ్యాభాగము 'సారస్వత సర్వస్వము' లో అచ్చుపడినది భారతామ్నాయాప ధానియగు లక్ష్మీపతి వ్యాఖ్యలో 'గాడిదలను, పాఠమే స్వీకృతము. "ఒక ప్రాంత ప్రతిలోఁ గూడ పాఠమిట్లే ('గాడీలు'అని) యున్నది. కాని, దీనికి మూలమగు సం. భారత. ఆది. 247.

14. తెంకణాదిత్యకవి, పు. 73.

15. భారతము లక్ష్మీపతి 18, 19 శతాబ్దములవాఁడని శ్రీ నందిరాజు చలపతిరావు గారును వ్రాసిరి. చూ.భా. లక్ష్మీపతి కృతమగు, శకటరేఫ నిర్ణయమునకు పీఠిక, ద్వితీయముద్రణము, మంజువాణీ ముద్రాక్షరశాల, ఏలూరు, 1924; పుటలు 3, 8.

41 శ్లోకమునుబట్టి 'ఏ నూఱు గాడిదలను' అను భా.ల. వ్యా. (భారతము లక్ష్మీపతి వ్యాఖ్యానము) పాఠమును ముద్రిత పాఠమును యుక్తముగాఁ గనఁబడుచున్నవి. 'గాడీలు' అను పాఠమును గ్రహించినయెడల రథములు రెండు మార్లు చెప్పఁబడుటయు గాడిదలమాట లేకపోవుటయు సంభవించును"(16). అని సూ.ని. కారులు సూచించుట వారి సత్యావిష్కరణ బుద్ధికి తార్కాణము.

సూ.ని. కారుల ఈ సూచననో, లేక పూర్వోక్తమయిన కందుకూరి ప్రతిపాఠమునో పట్టుకొని శ్రీ దేవరపల్లి వారు తమ వాదమును లేవదీసినట్లున్నది. కాని, భారతము లక్ష్మీపతికి పూర్వములగు తాళపత్ర ప్రతులయందును 'గాడిదలను'అను పాఠము కన్పట్టుచున్నది. చెన్నపట్టణము ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము నందలి D. 197 నెంబరుకల ఆదిపర్వము తాళపత్ర ప్రతిచివర 'వజ్రాల వెంకప్ప కొమారుడు రంగయ్య వ్రాశిన ఆదిపర్వం...దుర్మఖి మార్గశిర బహుళ ౧౨ గురువారం' అని ప్రతి లేఖకుని పేరు లిఖితకాలము ఉట్టంకితము. ఈ కాలము క్రీ.శ. 1716 నవంబరు 29 వ తేదీ గురువారముతో సరిపడుచున్నది. ఈ ప్రతి, లక్ష్మీపతికి రెండుమూఁడు తరములు పూర్వతన మనుట నిస్సంశయము. 'గాడిదలను' పాఠఘటితములగు తంజావూరు తాళపత్ర ప్రతులు క్రీ.శ. 1690 ప్రాంతమున లిఖితములు. లక్ష్మీపతి వాసన సోఁకుట కవకాశములేని దక్షిణ దేశమునందలి సర్వ ప్రతులలో 'గాడిదలను' పాఠమే ప్రయుక్తము. ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయమున Acc. 29404 నెంబరుకల తాళపత్ర ప్రతి వ్యయనామ సంవత్సర మార్గశిర బ. ౧౨ జయవారం ది 25 డిశంబ్బరు ఆన 1826 న గోళ్ళమూడి అయ్యవారుగారి ప్రతిలో సత్రమాన సబ్నివీసు భుజంగ రాయఁడు (నందిగామ) వ్రాసికొన్న ఆది పర్వమునందును 'గాడిదలను' పాఠమున్నది. కావున, సంస్కృత మూలానుయాయి యగు భారతము లక్ష్మీపతి వ్యాఖ్యాప్రతి ననుసరించి 'గాడిదలను' అను పాఠమును సృష్టించిరనుట పూర్తిగా నిరాధారము. లక్ష్మీపతి వ్యాఖ్యాప్రతి ననుసరించి తయారయిన తాళపత్ర ప్రతులును లేకపోలేదు: ఇవియన్నియును అర్వాచీనములని వేఱ చెప్పనక్కఱలేదు. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునందలి

16. చూ. 'గాడీ' అను ఆరోపముక్రింద, సూ. ని., సంపుటి 2, పు. 729.

D. 190 నెంబరుకల తాళపత్రప్రతి చివర "వికృతినామ సం. పుష్య బ. ౧౪ బుధవారం వరకు రాపాక సుబ్బన్న, భారతం లక్ష్మీపతిగారి ప్రతినున్న క్రమాన ఆదిపర్వం సంపూర్ణంగా స్వంతానకు వ్రాసుకునెను". అనీ, D. 262 నెంబరు గల తాళపత్ర ప్రతి-శల్య సౌప్తిక స్త్రీ పర్వములు కలదిలో సౌప్తిక పర్వము తుద "నందన కార్తీక బ. ౧౧ ఆదిత్యవారం వరకు రాపాక సుబ్బన్న, భారతం లక్ష్మీపతిగారి ప్రతినున్నక్రమాన యీ సౌప్తికపర్వం..." అని స్త్రీపర్వాంతమున "నందన మార్గశిర శు. ౧౨ అంగారకవారం వరకు భారతం లక్ష్మీపతిగారి ప్రతినున్నక్రమాన రాపాక సుబ్బన్న స్త్రీ పర్వం సంపూర్ణంగా స్వంత్తముకు వ్రాసుకొనెను" అనీ కలదు. పైమూఁడు కాలములును క్రమముగా క్రీ.శ. 1831 జనవరి. 12; 1832 నవంబరు 18; 1832 డిసెంబరు, 4 తేదీలు అయియున్నది (17).

ఆంధ్రభారతము తాళపత్రప్రతు లనేకములను పలుతావులనుండి తెప్పించి, నిశితదృష్టితో పరిశీలించి, పాఠభేదములను తైపారువేసి లభ్యమగు పాఠములలో ఉత్తమమని నిర్ధారితమయిన పాఠముతో, తక్కిన పాఠాంతరముల సూచనతో ఒక ప్రామాణిక ప్రతిని నిర్మించియుంచిన బ్రౌనుదొరగారు (18) భారతము

---

17. Swami Kannu Pillai, op. cit.

18. "...On my first attempt to read the Telugu Mahabharat, in 1826...before studying a poem I had it copied in clear hand, on English paper numbering the verses to facilitate reference...I first had a copy made from any manuscript of tolerable accuracy, the alternate pages being left blank, and the verses duly numbered: then the volume was bound...A clerk sat with the newly written copy ready; and before him were two, each having charge of five or six manuscripts, the oldest I could discover...Each assistant in turn read a stanza, which thus was recited ten or twelve times; the scribe recorded every deviation; Pandits formed their judgements on each line, and then one of them taking the blotted copy, selected the pure text, and dictated it to a reader..." (p. xv, Preface to C.P. Brown's English-Telugu Dictionary. 'Some Account of the Literary Life of Charles Philip Brown (1798-1884).

లక్ష్మీపతి ప్రతిని చూచినట్లు లేదు. బ్రౌనుదొర గుర్తించిన పాఠములలోఁగాని: పాఠాంతరములలోఁ గాని — ఖరములు, గాడిదలను, గాంధర్వ హయములు, గార్దభంబులు అనునవి తప్ప—'గాడీలు' అను పదమే కన్పట్టదు. బ్రౌనుదొర పరిష్కరించి భద్రపరచిన కాగితపు ప్రతులలో 'గాడీలు' పాఠాంతరము గానైనను సూచింపఁబడకుండుటచే బ్రౌనుదొర పరిశీలించిన తాళపత్ర ప్రతులలో 'గాడీలు' పాఠములేదనుట అనుమేయము. కాని, బ్రౌనుదొర యొద్దితాళ పత్రమాతృకలను సైతము సంప్రతించితి మని ప్రకాశకులు సాక్ష్యమిచ్చిన ఆలూరి ఏకామ్రజోస్యుల గుజిలీప్రతి (1853) లో 'గాడీలు, పాఠము స్వీకృతమగుట ఆశ్చర్యకరము. "...నన్నయభట్టారక తిక్కనసోమయాజి శంభుదాసులచేఁ దెనుంగు బాసంజేయంబడి యొప్పుచున్న యాంధ్ర భారతమునందు లేఖక ప్రమాదాదులవలన సంభవించిన వ్యత్యస్త శబ్దప్రక్షిప్త గ్రంథ గ్రంథనాదులను—విరుద్ధయతిగణ ప్రాస సంధ్యాగమ రేఫాది సమావేశాదులను బరిష్కరింపించి సుష్టుగా ముద్రాక్షరాంకితము చేయించవలయునని శ్రీ వేదమూర్తులగు ఆలూరి — ఏకామ్రజోస్యులవారు సాధారణ సంవత్సరము (క్రీ. శ. 1851)లో నుద్యుక్తులయిరి... వెండియు నీ భారత గ్రంథము—బరిష్కరించుటకు వలయు మాతృక లప్పుడప్పుడు మాకు దయ చేయుచు వచ్చినట్టియు—నానావిధ భాషాగ్రంథంబు లపారంబుగ సంగ్రహించి భాండాగారంబుగఁ జేర్చియున్నట్టియు — దద్గ్రంధార్థ సారగ్రహణ కళాకౌశలంబునం బ్రసిద్ధుండయి యున్నట్టియు — నింగిలీషు ప్రభుండునునగు — ఛార్లిస్ ఫిలిప్ — బ్రౌన్ యిస్క్వాయిర్ గారిని... మేమందఱ మమందానందంబున నభినందించుచున్నారము(19).

బ్రౌనుదొర పాఠములు తరువాతి ప్రకాశకులకుగాఁని, పరిష్కర్తలకుఁ గాని నచ్చలేదు కాఁబోలు; వీరు, బ్రౌనుదొర ప్రతులను గమనించినట్లుకూడ కన్పట్టదు. "....పండిత సాహాయ్యంబునం బరిష్కరించి యచ్చుగూర్పించి సులభక్రయంబున నెల్లవారలకు నుపయోగింపఁజేయుట యత్యావశ్యకంబని యెంచి బహు దేశంబుల నుండి ప్రాచీన గ్రంథంబు లనేకంబులు రావించి జాగరూకులమై భగవదనుగ్రహాతిశయంబువలన నే విఘ్నంబును లేక శ్రీ మహాభారతం బను నితిహాసరత్నంబును పదునెనిమిది పర్వంబులును సమగ్రములుగా నచ్చు

19. ఆలూరి—ఏకామ్రజోస్యుల భారతప్రతి (1853) లో ప్రకాశకుల విజ్ఞాపనము.

గూర్పించి ప్రకటించితి మని యెఱింగించుటకు నెల్లజనంబులు దమ యుల్లంబుల నుల్లసిల్లఁ గోరుచున్నాఁడను" (20) అని ఒక ప్రకాశకుని విన్నపము. "ప్రాచీన ప్రతులను బెక్కింటిని సంపాదించి, తగుపండితవర్యులచేఁ బరిశోధన గావింపించి, సాధ్యమగునంత నిర్దుష్టముగా దీనిం బ్రచురింప నారంభించి నారము" (21) అని మఱియొకరి విజ్ఞాపనము. వీరు పరిశీలించిన ప్రతులలో 'గాడీలు' అనుపాఠమే ప్రచురముగా నుండెనేమో? మఱి, యింతమంది పరిష్కర్తలకు, ప్రకాశకులకు ఆధారమయిన 'గాడీలు' పాఠఘటిత ప్రతు లేమయినట్లు? ఇంతకు వీరు పరిశీలించిన 'పాచీన గ్రంథంబులు' 'ప్రాచీన ప్రతులు' తాళపత్ర ప్రతులా? లేక ప్రాచీన ముద్రిత ప్రతులా? ఎటునిర్ణయించుట కును వీరి మాటలు పట్టీయుటలేదు. ప్రాచీనముద్రిత ప్రతులలో 'గాడీలు' పాఠమే యున్నట్లు పాఠభేదప్రదర్శక పట్టికలో వివృతము. ప్రాచీన ముద్రితప్రతులు మాతృకలుగా అవతరించిన తాళపత్రప్రతులును కొన్ని యున్నవను నంశమును ఈ సందర్భమున గమనింప వేఁడికోలు. కాకినాడ, ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రం థాలయమున 4114 నెంబరుకల భారతము, ఆదిపర్వము తాళపత్రప్రతి ఈ కోవకు చెందినది. 'వైయ్యాకరణ రామానుజాచార్యులుగారిచే సంస్కరింపఁబడి, కోడూరు రాఘవాచార్యులుగారు అచ్చుగూర్చిన (భారత ప్రతి, 1847) ప్రతినున్న ప్రకారం ప్రమాదీచనామ సం॥ర అషాఢ శు॥ ౧౨ భానువారము క్రీ. శ. 1853 జూలై, 17వ తేదీ) నాటికి వ్రాసినది', ఈ ప్రతి అనంతపుర మండలమున సేకరింపఁబడినది. ఇట్టి అర్వాచీన తాళపత్రప్రతులు సాధుపాఠ నిర్ణయమున ప్రామాణికములుగావు. పూర్వపరిష్కర్తల గ్రంథపరిష్కార పద్ధతులు 'యావత్తైలం తావద్వ్యాఖ్యానమ్' బాపతుగా ఉన్నట్లున్నది. సుప్రసిద్ధ పరిశోధక పండితులగు శ్రీ తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారి ఈ క్రింది వ్రాఁత ఆయనకు పూర్వముండిన గ్రంథ పరిష్కార రీతులలోని అవ్యవస్థకుఁ గల హేతువులను స్పష్టముగా నిరూపింపఁ గలదు.

"....లేఖక పాఠకుల ప్రమాదాదులవలనఁ గలుగు పాఠభేదము లక్షర వ్యత్యయములు గ్రంథపాతములు మొదలైన వానిచేఁ గలుగు బహు కష్టములను

20. శ్రీమదాంధ్ర మహాభారతపీఠిక, వంకాయల కృష్ణస్వామిశెట్టివారి (1890) ప్రతి.
21. పీఠిక, కాకినాడ-సుజనరంజనీ ముద్రాక్షరశాలలో ముద్రితమయి ప్రచురితమయిన భారతప్రతి (1911).

బట్టి మొట్టమొదటి ముద్రణమునందుఁ దప్పులు పడుట సహజము. ఆ తప్పులు గ్రంథవైపుల్యమును బట్టి పెక్కులగుటయు నైజమే. ఇట్లు కలుగు తప్పుల కుప్పలను తరువాతి ముద్రణములందుఁ బండితులు గొంతకొంత తొలగించుచు వచ్చిన యెడల గ్రంథమింతకుఁ గడు శుద్ధమైయుండును. అయిన నిట్లుగాదయ్యె. ఏలనఁ బండితులు తమకు సందిగ్ధములుగాను మూలమునకు విరుద్ధములుగాను లేక న్యూనములుగాను నున్నట్టి పట్టులందుఁ దమకవనముతోఁ బాఠములను దోఁచినట్లు మార్చియుఁ గూర్చియున్నారు. కావున నీ తప్పులు ప్రథమ ముద్రణము నందలి కష్టబాహుళ్యమును బట్టియు గ్రంథ వైపుల్యమును బట్టియుఁ బెక్కులై యుండుటతో గూడఁ బండితుల సొంత కవనముం పట్టి సవరింపరానంత చిక్కులు నైనవి. దీనిని వ్రాఁతప్రతులను గొని మఱల శుద్ధముగా సవరణ సేయుజాలిన పండితు లిందులకుఁ బూనకుండుటచేతనో, పూనియు దానికి వలయునంత వ్యయ ప్రయాసల కోపమిచేతనో. యోపియుఁ దగిన వ్రాఁత ప్రతులు దొరకమి చేతనో తరువాతి ముద్రణములన్నియు మొదటి ముద్రణము ననుసరించి గతానుగతికముగాఁ దప్పుల కుప్పలైనవి..." (22).

ప్రస్తుత పరిశీలనమునం దుపయుక్తమయిన 74 తాళపత్ర ప్రతులలోని పాఠములలో 'గాడిదలను' పాఠగరితములు 31. 'గాడిదలను' శబ్దము కటువుగా తోఁచుటవలన కాఁబోలు, తత్పర్యా యములగు ఖరములు (3), గంధర్వ హయములు (9), గార్దభములు (7) అను నీ పదఘటితములుగా పందొమ్మిది క్రొత్తపాఠము లవతరించుట। (23) పర్యాయపద ఘటితములతో కలిపి 'గాడిదలను' పాఠములసంఖ్య 50 కి హెచ్చినది. "వ్యాస భారత మూలములో 'అశ్వతర' అను తుల్య సంస్కృత పదమున్నను తెనుగుకవి కీ కంచర 'గాడిద' పాఠము దేశీయము కాదని తోచి, మార్చి

22. పరిష్కర్త విజ్ఞాపన, వేమూరి- వేంకటకృష్ణమసెట్టి & సన్సువారి ఆనంద ముద్రాక్షరశాలా గ్రంథరత్నమాల - భారతప్రతి, ద్వితీయముద్రణము. 1907.

23. "చిత్రలలితగతి నొప్పి నేనూఱు గంధర్వహయముల" = మంచినడకగల యేనూఱు కంచర గాడిదలను-అని చదలువాడ సుందరరామశాస్త్రులు, దండిగుంట సూర్యనారాయణశాస్త్రులు గార్ల భారత సంజీవని వ్యాఖ్య. శారదాంబా విలాస ముద్రాక్షరశాల, మదరాసు, 1915; పు. 614.

యుండుట దోషము కాదు..." అను శ్రీ రెడ్డిగారి యుక్తి, 'గాడిదలను' పాఠమునకుఁగల వ్యవహార బలము సన్నిధిని నిలువనేరదు. 'గాడిదలను' పదముయొక్క అర్థమును కొందఱకు హితవుగా లేనందున గంధ సింధురములు. ఘనగజంబులు, ఘనలోష్ట్రములు ఇత్యాద్యనేక పాఠాంతరములు వెలసినవి. విడిగా పేర్కొనుట పునరుక్తి కావున 'గంధ సింధురములు', 'ఘనగజంబులు'_ "అవిరళక్షరిత దానార్ద్ర గండస్థలగజ సహస్రంబు" న అంతర్భూతములు; పద్యమునందలి పూర్వాపరములు తెలియని లేఖకులు కల్పించిన పాఠాంతరములు ప్రమాణములుకావు. 'ఘనలోష్ట్రములు'ను ఏదోయొక జంతునామముగ ఇటికించు నుద్దేశముతో కల్పితమయిన పాఠము. 'గాడీలు' పాఠమీవరకే పరాస్తము. ఇక, మిగిలిన 'గాండంబులు' 'ఖడ్గాదులు' అనునవి "శ్రీ అయిగిరి వాయనమః" "శ్రీ శారదాంబాయనమః" అను నిట్టి స్థాయిలలోగల లేఖకాధములు కల్పించిన అవ్యక్తపాఠములు (24). పర్యాప్తమయిన ఈ పరిశీలనమువలన 'గాడిదలను' అనుపాఠము కర్త్రభిప్రేత మనుట సయుక్తికము; సత్యమూలకము.

---

24. ఆఁడుభిడ్డకు అరణముగా నీఁబడిన వాని పట్టికలో గ్రామము లేకుండుట లోటుగా భావించి, విజయనగర ప్రతి విలేఖకుఁడు 'చిత్రలీలగతి నొప్పు నేనూఱు గ్రామంబుల'ను సుభద్రకిప్పించినాఁడు.

నన్నయ - అన్యదేశ్యాభాసములు - II

"ఆదిపర్వములో నన్నయభట్టు 'సవతు కావమరేంద్రా - సరియుఁగా వమరేంద్రా' (భారత. ఆది. 3-208 (210) అనుపాఠాంతరములు ప్రయోగించు వట్లు భిన్నముద్రణలు తెల్పుచున్నవి. సవతులందరు సమానులు కాబట్టి, 'సవత్-సవతు' కూడా తత్సమానార్థక జాతీయమయినది. క్రీ.శ. 11 శతాబ్దమున తురకదంపతులు ఆంధ్రభాషలో లేవను భ్రమతో పండితులో, వ్రాయసకారులో, 'గాడీలు - గాడిదెలు : సవతు - సరియు' అని తుడుపులు పెట్టి మూలపాఠము మార్చినారు. (1) అని శ్రీదేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారి మఱియొక ఆరోపణము. అసలీ 'సరియు' పాఠఘటితమగు పద్యము యయాతి స్వర్గచ్యుతి ఘట్టమునందలిది. పుణ్యలోక భోగములను శతసహస్ర సంవత్సరము లనుభవించిన యయాతిని ఎట్టితపమొనరించితివో తెలుపుమని ఇంద్రుఁ డడుగఁగా, యయాతి యొసఁగిన సమాధాన మీ పద్యమున పొందుపఱుపఁబడినది. ఆపద్యమిది :

"సురదైత్య యక్షరాక్షస
నరఖేచరసిద్ధ మునిగణప్రవరుల భా
సుర తపములు నాదగు దు
ష్కర ఘోరతపంబు సరియుఁగావమరేంద్రా"

భారత. తృతీయా. 209 వ పద్యము, ఆనందముద్రాక్షరశాలా ప్రతి, 1907).

ప్రాచీన ముద్రితప్రతులలో 'సవతు' అనుపాఠమును, తాళపత్రప్రతుల యందును. 1907 తరువాతి ముద్రితప్రతుల పెక్కింటను 'సరియు' అను పాఠ

1. శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారి 'తెంకణాదిత్యకవి' - అనుబంధము, పు. 7.

మును కన్పట్టుచున్నవి. 'గాడీ' పదమువలె 'సవతు' సైతము నదుమంత్రముగా సృష్టింపఁబడిన పాఠము. 'సవతు' పదఘటిత పాఠములుగల ఆకరము లీ దిగువ అనుపూర్విగా ప్రదర్శితము.

క్రీ. శ. 1833 (?) 'సవతుకావమరేంద్రా' (పు. 41. తృతీయా. 207. ఆలూరి - ఏకాంబ్రజోస్యుల ప్రతి. (2)

1847, 'సవతుకావమరేంద్రా' (వైయాకరణ రామానుజాచార్యుల సరస్వతీ పీఠముద్రాక్షరశాలా ప్రతి. 1847) (3).

1881. 'సవతుకావమరేంద్రా' (పు, 37, పంచాంగమువారను వ్యవహార నామము గల భద్రాచలం - తిరుమల నరసింహాచార్యుల వారిచేఁ బరిష్కరింపఁ బడి పిళ్ళారిసెట్టి రాఘవయ్యనాయనివారిచే శ్రీ భారతీనిలయ ముద్రాక్షరశాల యందు 1881 సం॥ ఫిబ్రవరి నెలలో ప్రచురింపఁబడిన ప్రతి).

1885. 'సవతు కావమరేంద్రా' (చూ. 'సవతు' అను ఆరోపము క్రింద ఉదాహృతమయిన పాఠము. శబ్దరత్నాకరము, 1885 పు. 1680).

1887. 'సవతుకావమరేంద్రా' (పు. 35, ములుకుట్లవిశ్వనాథశాస్త్రుల వారిచే పరిష్కరింపఁబడి, ములుకుట్ల వెంకటప్పయ్య వారిచేతను, పంచాంగం శ్రీకాకుళాచార్యుల వారిచేతను, వంకాయల కృష్ణస్వామిశెట్టిగారిచేతను, చిత్తూరు గురుస్వామిమొదలిగారిచేతను మోపూరు కృష్ణమరాజుగారి కుమారుడగు తుళసి రాజుగారి స్వకీయమగు విబుధమనోహారిణీ ముద్రాక్షరశాలయందు 1887 సం॥ లో ప్రచురింపఁబడిన ప్రతి.)

---

2. ఈ యీ గుజిలీప్రతుల ప్రకాశకాది విశేషాంశములకు చూ: పూర్వ్యాసము నందలి ముద్రిత ప్రతుల వివరములు.

3. " ... దీనికిగాను యేమితపస్సు చేసితివోయి అనగా విని ఇంద్రునకు ఆ యయాతి యిట్లుచెప్పెను. దేవతలు - దైత్యులు - యక్షులు - రాక్షసులు - మనుష్యులు - వియచ్చరులు - సిద్ధులు - మహర్షులు అనియెడు వీరల తపస్సులు నా తపస్సునకు సరికావు, అని తన తపోమదముచేత పెద్దలైన దేవతలు మొదలైనవారల తపస్సును అవమానించిన యయాతిగర్వమును సహింపక ఇంద్రుండు కోపగించుకొని..." (వైయాకరణ - రామానుజాచార్యుల వచనభారతము, 1847 ; ఆదిపర్వము, తృతీయాశ్వాసము, పు. 102).

1890. 'నవతుకావమరేంద్రా' (పు. 34. చెన్నపట్టణము వంకాయల కృష్ణస్వామిశెట్టివారి ప్రతి. 1890.)

1891. 'నవతుకావమరేంద్రా' (సరస్వతీవిలాస ముద్రాక్షరశాలయందు తచ్ఛాలాధికారి యగు నేలవటూరి వెంకట సుబ్బాశాస్త్రుల వారిచేతను, కొండ గుంట రాఘశాస్త్రుల వారిచేతను 1891 లో చెన్నపట్టణమున ముద్రితమయి ప్రచురితమయినప్రతి.)(8a)

? 'నవతుకావమరేంద్రా' (పు. 34, పైనుండి 23వ పంక్తి, వెస్టువార్డు కంపెనీవారి ప్రతి. ఆదిపంచకము ; విజయనగరము: ఆదిరాజు భాస్కర శాస్త్రులుగారి సొంతప్రతి.)

? 'నవతుకావమరేంద్రా' (పు. 35, పుట పైనుండి 9, 10 పంక్తులు, ఆది, తృతీయా. ఆదిపంచకము. విశాఖపట్టణము. హిందూరీడింగ్ రూము గ్రంథాలయము నందలి గుజిలీ ప్రతి, పైనఉదాహృతమయిన వంకాయల కృష్ణ స్వామిశెట్టివారి ప్రతియందలి పీఠికయును, ఇందలిపీఠికయును సమానములు. అక్షరపరిమాణము. అచ్చుకూర్పు, పుటలసంఖ్యలు - మొదలగు వానిలో రెంటి కివి తేడాలుండుటవలన ఈ రెండును భిన్నముద్రణలు కానోపు! కాని, ఈ రెండిటి పౌర్వాపర్యములు తెలియరాకున్నవి.)

"... ఆ యింద్రుడు నా తపస్సునకు ఆశ్చర్యపడి నీ తపస్సుయొక్క గౌరవమును చెప్పుమనగా - దేవతలు, సిద్ధులు, మహర్షులు మొద లయినవారి తపస్సులు నా తపస్సుతో సరిగావని చెప్పితిని..." (పైది) - అని రెండుతావుల 'సరికావు' అని ప్రయుక్తమగుట గమ నార్హము.

"మహేంద్రా ! దేవగంధర్వ యక్షదానవ దైత్యనరసిద్ధ భూసురముని గణముఖ్యుల తపస్సులు నా యొనర్చిన కఠిన తపంబునకు సరిరా'' వనెను...(పునుగు సీతారామ కవికృతమగు ఆంధ్ర వచన భారతము ఆదిపర్వము. రామాబ్రెన్ వావిళ్ళవారి ప్రతి; 1928, పు. 186).

8(a) నేలటూరి వేంకట సుబ్బాశాస్త్రులుగారు రచించిన తత్త్వబోధినీ వ్యాఖ్యాయుత మగు భారతప్రతిని చూచుట తటస్థింపలేదు.

1893 'సవతుకావమరేంద్రా' (పు. 34, చెన్నపట్టణము గుదిమెళ్ళ వెంకట వరదాచార్యుల వారిచేత వాక్పతీ నిలయ ముద్రాక్షరశాలయందు ముద్రితమయిన గుజిలీ ప్రతి, ఆదిపర్వము).

? 'సవతు కావమరేంద్రా' (పు. 39, బొబ్బిలి పండితులు శ్రీ అంపోలు అప్పలాచార్యులుగారి యొద్దనున్న గుజిలీ ప్రతి ; అతిప్రాచీనము).

? 'సవతు కావమరేంద్రా' (పు. 34, హరివంశసహితముగా బందొమ్మిది పర్వములును క్రమగ్రంథముగా నచ్చుగూర్పించిన వంకాయల కృష్ణస్వామి శెట్టిగారి గుజిలీ ప్రతి, ఆదిపంచకము).

? 'సవతుకావమరేంద్రా' (పు. 37, కొత్తపేట తాలూకా కొమ్మరాజు లంకవాస్తవ్యులు శ్రీ చిలుకూరి వేంకట శాస్త్రులుగారియొద్దనున్న గుజిలీ ప్రతి, ఆదిపంచకము).

1901 'సవతుదావమరేంద్రా' (పు. 76, తృతీయాశ్వాసము, 208. కందుకూరి వీరేశలింగము పంతులుగారు పరిష్కరించిన ఆనంద ముద్రాక్షరశాలా ప్రతి, ఆదిపంచకము, 1901).

? 'సవతుకావమరేంద్రా' (పు. 85, మొదటిభాగము, పెద్దచ్చు ఆదిపర్వము, మొదటి పదునాలు పుటలు లేవు. క్రింది 1910 నాటి పెద్దచ్చు ఆదిపర్వప్రతికంటె ప్రాచీనమైన గుజిలీ ప్రతి. పశ్చిమాంధ్రప్రాంతముల బహుళ ప్రచారములోనుండిన శేషాచార్యులు, మదరాసువారి ప్రతికానోపు).

1910 'సవతుకావమరేంద్రా' (పు. 83, మొదటిభాగము, పెద్దచ్చు ఆదిపర్వము, చెన్నపట్టణము నాతా - నమ్మయ్యశెట్టి అండ్ సన్ వారి శ్రీరామానుజ విలాస ముద్రాక్షరశాలయందు ముద్రితమయి ప్రచురితమైన గుజిలీ ప్రతి 1910).

1911 'సవతుగావమరేంద్రా' (పు. 76, తృతీయా. 208, కాకినాడ - సుజనరంజనీ ముద్రాక్షరశాలయందు ముద్రితమయి ప్రచురితమయిన భారత ప్రతి, ఆదిపర్వము ; కందుకూరివారు పరిష్కరించిన ఆనంద ముద్రాక్షరశాలా ప్రతి (1901) కి మక్కికి మక్కిగా అచ్చయినది).

1913. 'సవతుగావమరేంద్రా' (పు. 74. తృతీయా. 209 ; మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి చేతను, రాజా శ్రీ విక్రమదేవవర్మగారిచేతను పరిష్కరింపఁబడి విన్నకోట అప్పలనరసింహగుప్తచే విశాఖపట్టణము శ్రీశారదా మకుట ముద్రాక్షరశాలలో 1913 లో ముద్రింపఁబడి ప్రకటింపఁబడిన ఆంధ్ర భారతప్రతి ప్రథమ సంపుటము, ఆదిపంచకము)(4).

1915. 'సవతుగావమరేంద్రా' (పు. 208) చదలవాడ సుందరరామ శాస్త్రులు, దండిగుంట సూర్యనారాయణశాస్త్రులుగారల 'భారతసంజీవనివ్యాఖ్యా' యుతమయిన భారతము, ఆదిపర్వము, శారదాంబావిలాస ముద్రాక్షరశాల, మదరాసు వారిప్రతి 1915 ; అధస్సూచికయందు 'సరియు' అనుపాఠాంతరము సూచితము.

1907 నుండి ప్రచురితములయిన ఆదిసరస్వతీనిలయ, ఆనంద, కణ్ణన్ సెట్టికంపెనీ, చంద్రికా, రామా అండ్ కో, వావిళ్ళ, వెస్టువార్డు శ్రీకృష్ణ సేవాలయ ప్రతులలో 'సరియుఁగావమరేంద్రా' యను పాఠము స్వీకృతము. 1925 నాఁటి వావిళ్ళవారి పెద్దచ్చు ఆదిపర్వప్రతి (పు. 206) యందును 'సరియుఁ గావమరేంద్రా' యనుపాఠమే కలదు. నేనుచూచినంతదాఁక 1907 కు పూర్వము లగు భారతముద్రణములయందు 'సరియు', 'గాడిదలను' అను నీ రెండు పదములను పూర్వోక్త సందర్భముల కానరాలేదు. తాళపత్రప్రతుల ముక్కాలు మువ్వీసము 'సరియుఁగావమరేంద్రా' యనుపాఠమే కన్పట్టుచున్నది. దీనికి పర్యాయములగు 'ఈడు', 'సమము', 'సవతు', 'సాటి' - యనుపదములుకల పాఠములును క్వాచిత్కముగ లేకపోలేదు. మేము చూచిన తాళపత్రి ప్రతుల లోని పాఠముల అనువర్ణనమిది. (5).

4. మిత్రులు శ్రీ కొమ్మనమంచి రామకృష్ణారావు, ఎం. ఏ., గారిచ్చినప్రతి.

5. కాకినాడ, తంజావూరు, తిరుపతి, మదరాసు,రాజమహేంద్రవరము, వాల్తేరు, విజయనగరములలోని తాళపత్రి ప్రతులను పరిశీలించుటలో తోడ్పడినవా రెందఱో మహానుభావులు ; అందఱకును వందనములు. వివరములకు చూ. పూర్వవ్యాసమునందలి అధోజ్ఞాపిక, 13.

I. కాకినాద :

ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయము నందలి తాళపత్రప్రతులు (సేకరింపఁబడిన మండలమువారీగా పాఠములు ఉదాహృతములు.)

i. నెల్లూరుమండలము :

నెం. 1. సమముగాదమరేంద్రా (72వ ఆకు, రెండవవైపు).

నెం. 11. సరియుగావమరేంద్రా (88 వ ఆకు, రెండవవైపు)

నెం. 30. సరియుగావమరేంద్రా (63 వ ఆకు, మొదటివైపు)

నెం. 36. సరిగావమరేంద్రా (57వ ఆకు మొదటివైపు)

నెం. 78. సాటిగావమరేంద్రా (95 వ ఆకు, మొదటివైపు)

నెం. 436. సరియుగాదమరేంద్రా (75 వ ఆకు, మొదటివైపు)

నెం. 639. సరియుగావమరేంద్రా (62 వ ఆకు, రెండవవైపు)

నెం. 664. సరిగావమరేంద్రా (64 వ ఆకు, మొదటివైపు)

నెం. 682. సరియుగావమరేంద్రా (65 వ ఆకు, రెండవవైపు)

నెం. 704. సరియుగావమరేంద్రా (66 వ ఆకు, మొదటివైపు)

నెం. 750. సరియుగావమరేంద్రా (74 వ ఆకు)

నెం. 810. సరిగావమరేంద్రా (60 వ ఆకు, మొదటివైపు వికారి, పుష్య శు ౧౦ సోమవారము)

నెం. 914. సరియకావమరేంద్రా (38వ ఆకు, రెండవవైపు)

నెం. 2310. సరియుగామరేంద్రో (60 వ ఆకు, మొదటివైపు)

నెం. 2644, సరియుగావమరేంద్రా (37 వ ఆకు, రెండవవైపు)

నెం. 2646. సరియుగావమరేంద్రా (64 వ ఆకు, రెండవవైపు)

నెం. 3562. సరియుంగావమరేంద్రా (70 వ ఆకు మొదటివైపు)

నెం. 4346. సమముగావమరెంద్రా (74 వ ఆకు, మొదటి వైపు ; సర్వజిత్ భాద్రపద బహుళ ౩ క్రీ. శ. ; 1707 సెప్టెంబరు 3వ తేదీ బుధవారము)

నెం. 4370. సరియుగావమరెంద్రా (80వ ఆకు, రెండవ వైపు ; పింగళ శ్రావణ శు: ౧౪ లు)

ii. చిత్తూరు మండలము :

నెం. 133 (?) సరియుగావ సురేంద్రా (68 వ ఆకు, మొదటి వైపు)

నెం. 1663. సరియుగావ సురేంద్రా (53 వ ఆకు, మొదటి వైపు ; జయ, శ్రావణ శుద్ధ ౧౦ శుక్రవారము)

నెం. 1799. సరియుగావ సురేంద్రా (75 వ ఆకు, రెండవ వైపు)

నెం. 2006. సరియుగావమరేంద్రా (44 వ ఆకు, రెండవ వైపు ; శార్వరి, వైశాఖ శుద్ధ ౫ శనివారము)

నెం. 2026. సరియుగావమరేంద్రా (65 వ ఆకు, మొదటి వైపు)

నెం. 2181. సరిగావమరేంద్రా (78 వ ఆకు ; నళ, భాద్రపదశుద్ధ ౭ శుక్రవారము క్రీ. శ. 1704)

iii. అనంతపుర మండలము :

నెం. 4056. సరియుగావమరెంద్రా (57 వ ఆకు, మొదటి వైపు)

నెం. 4124. సవతుకావమరెంద్రా (65వ ఆకు, మొదటి వైపు ; క్రోధన పుష్య బ. ౪ లు క్రీ. శ. 1866. జనవరి ౯ తనకల్లు పార్నంది వెంకట క్రిష్ణ భొట్లు కుమారుడైన భాస్కరప్ప వ్రాసిన ఆదిపర్వం)

నెం. 4412. సరియుగావమరెంద్రా (46 వ ఆకు, మొదటి వైపు)

iv. కర్నూలు మండలము :

నెం. 1329. సరియు గావమరెంద్రా (53 వ ఆకు, రెండవ వైపు; [illegible] భాద్రపద శుద్ధ [illegible]).

v. గుంటూరు మండలము :

నెం. 3915. సరియు గావమరెంద్రా (70 వ ఆకు; బహుధాన్య, పుష్య బ. ౧. ఆదివారము; క్రీ. శ. 1759 జనవరి 21వ తేదీ; పొత్తూరు పాపన్నకు గొల్లపూడి త్రివిక్రమయ్య వ్రాసి ఇచ్చినది).

vi. కృష్ణా మండలము :

నెం. 979. సరియుగావమరెంద్రా (48 వ ఆకు, రెండవ వైపు ; ప్లవంగ మాఘ శుద్ధ ౧౦, సోమవారము ; క్రీ. శ. 1848 ఫిబ్రవరి, 14వ తేదీ).

నెం. 2733. సరియుగావమరెంద్రా (54 వ ఆకు, మొదటివైపు).

నెం. 3698. సరియుగావమరెంద్రా (76 వ ఆకు, రెండవవైపు).

vii. గోదావరి మండలము :

నెం. 1014. సరియుగావమరెంద్రా (92 వ ఆకు, మొదటివైపు; వికారి కార్తీక శుద్ధ [illegible] శనివారము).

నెం. 1550. సరియుగావమరెంద్రా (52 వ ఆకు, రెండవ వైపు).

viii. [illegible] దేశము :

నెం. 85. సాటిగావమరెంద్రా (69 వ ఆకు, రెండవవైపు).

నెం. 1018. సరియుగావమరెంద్రా (63 వ ఆకు, మొదటివైపు).

నెం. 228. సాటిగావమరెంద్రా (78 వ ఆకు, రెండవవైపు).

నెం. 227. సరియుగావమనరెంద్రా

నెం. 295. సాటిగావమరెంద్రా.

నెం 309. సమముగావమరెంద్రా (80 వ ఆకు. రెండవవైపు) ; నళ సంవత్సర మాఖశుద్ధ ౽ శనివారం, తై నెల 26వ తేదీ ; క్రీ. శ. 1797, ఫిబ్రవరి 4 వ తేదీ).

నెం. 339. సరియుగాడమరెంద్రా (92వ ఆకు, మొదటివైపు).

నెం. 361, సరియుగాదమరెంద్రా (81 వ ఆకు, మొదటివైపు).

ix. ఇతరములు :

(ఏ ప్రాంతమునకు చెందినవో స్పష్టపడని తాళపత్ర ప్రతులు).

నెం. 1195 సరియుగావమరెంద్రా (76వ ఆకు, రెండవవైపు).

నెం. 1473. సరియుగావమరెంద్రా (72వ ఆకు, రెండవవైపు).

నెం. 1656. సరియుగావమరెంద్రా (72వ ఆకు, మొదటివైపు).

నెం. 1707. సరియుగావుసురెంద్రా (68వ ఆకు, మొదటివైపు).

నెం. 1708. సరియుగావమరెంద్రా (63వ ఆకు, మొదటివైపు).

నెం. 1710. సరియుగావమరెంద్ర (80వ ఆకు. రెండవవైపు).

నెం. 2313. సరిగావమరెంద్రా (58 వ ఆకు మొదటివైపు).

నెం. 2462. సరియుగావమరెంద్రా (71 వ ఆకు, మొదటివైపు).

నెం. 2545. సరియుగాదిమరెంద్రా.

నెం. 2630. సరియుగాదమరెంద్రా (62 వ ఆకు, రెండవవైపు).

నెం. 2639. సరియుగాదమరేంద్రా (62 వ ఆకు రెండవవైపు).

నెం. ? సరియుగావమరేంద్ర

నెం. ? సరియుగావమరేంద్రా (64 వ అంకు, రెండవవైపు)

నెం. ? సరియగావమరెంద్రా (71 వ అంకు, రెండవవైపు)

II. తంజావూరు :

మహారాజా శరభోజీ సరస్వతీమహాలు లిఖిత గ్రంథాలయము నందలి తాళపత్రప్రతులు.

D. 58. సరియుగావమరేంద్రా (M. 26)

D. 59. సరియుగావమరేంద్రా (M. 27)

D. 60. సరియుగావమరేంద్రా (M. 28)

D. 64. సరిగావమరేంద్రా (M. 31)

D. 65. సరియుగావమరేంద్రా (M. 32 : Tel No. 52)

D. 68, సాటిగావమరేంద్రా (M. 35)

III. తిరుపతి ;

i. శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధకసంస్థ (Sri Venkateswara University Oriental Research Institute - SVUORI) గ్రంథాలయమునందలి తాళపత్రప్రతులు.

Stock No. 558(a). ఘోర తపమునకు సరిగావమరేంద్రా.

Stock No. 561. దుష్క....ఘోర...

బుతో సరియుగాదపు .... ద్రా.

Stock No. 580. తపంబు సరియుగావమరేంద్రా.

Stock No. 1004. ఘోర తపంబు సరియుగాదమరెంద్రా.

Stock No. 1010. సవతుగావమరేంద్రా.

Stock No. 5964. సంయుగావమరేంద్రా ('సరియు' కు 'సంయు' లేఖక దోషము కావచ్చు.)

Stock No. 6780(a). ఘోరతపంబులు సరియుగావమరేంద్రా.

Stock No. 7594. ఘోరతపంబ్బు సరియుగావమరేంద్రా (అత్యంత శిథిలప్రతి.)

Stock No. 7696(a). దుష్కరతప...బు సరియుగాదమరేంద్రా.

ii. మదరాసుప్రభుత్వప్రాచ్యలిఖితగ్రంథాలయము (Govt. Oriental Manuscripts Library, Madras) నుండి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధక సంస్థ గ్రంథాలయమునకు మార్పిడియైన తాళపత్ర ప్రతులు.

D. 186. దుష్కరఘోర తపంబ్బునకు సరియుగావమరేంద్రా (Tel. B. 119; 11-5-1)

D. 189. నాందగు దుష్కరఘోరతపంబ్బు సరియుగావమరేంద్రా (Tel. B. 116 ; 11–15–2)

D. 194. దుష్కరఘోరతపంబ్బు సరియుగావమరేంద్రా (Tel. B. 120 ; 14-13-15 ; అత్యంతశిథిలప్రతి.

D. 196. దుష్కరఘోరతపంబ్బు సరియుగాదమరేంద్రా (Tel. B. 122 ; 14-7-14).

D. 200. దుష్కరఘోర తపంబ్బు సరియుగా దమరేంద్రా (Tel. B. 126 ; 14-11-7 ; ప్రాచీనప్రతి, అసమగ్రము, ఆదిపర్వమున 2 మొదటి నాలుగాశ్వాసము లున్నవి).

IV. మదరాసు

ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయము నందలి మిగిలిన ప్రతులు.

D. 163. 'సరియుగావమరేంద్రా' బ్రౌనుదొరగారి కాకితపు ప్రతి. ఏడు తాళపత్ర ప్రతులనుండి పాఠభేదముల నెత్తి తామొక సంపుటములను కూర్చి

నట్టు బ్రౌను దొరగారు పేర్కొనినారు. తాళపత్ర ప్రతులనుండి సంగ్రహింపఁబడిన పాఠభేదము లాయా కాగితపు ప్రతుల నడుమఁ జేర్పఁబడినవి. అందు యుక్త పాఠములుగ భావింపబడినవి ఖాళీగానున్న ఎదిరిపుటలయందు గుర్తింపఁబడినవి. ఈ పాఠమునొద్ద పాఠాంతరము లేవియు లేవు(6).

D. 193. 'సరియుగావమరేంద్రా' (కాకితపుప్రతి. పత్రమున కొకే వైపున వ్రాయఁబడినవి; రెండవ వైపున పాఠభేదములు గుర్తింపఁబడినవి. ప్రస్తుతపాఠమునొద్ద పాఠభేదము లేవియు లేవు)

D. 203. 'సరియగావునురేంద్రా' బ్రౌనుదొరగారి కాకితపుప్రతి. ఆది పర్వము ద్వితీయాశ్వాసము 173 వ పద్యమునుండి ఏడవ ఆశ్వాసమువరకు కలదు. పాఠాంతరములులేవు. బ్రౌను దొరగారు పరిశీలించిన ప్రతులలో 'సవతు' లేనట్లేకదా ! (7).

V. రాజమహేంద్రవరము :

i. ఆంధ్రేతిహాస పరిశోధకమండలి, రాజమహేంద్రవరము వారి గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతులు.

నెం. 53. దుష్కరఘోరతపంబు సరియుగావమరేంద్రా (41వ ఆకు).

6. "The Mahabharata now first reduced to numerical arrangement and copied in separate verses and lines by the directions of Charles Philip Brown. The alterations made in this copy show the various readings found in seven (the printed catalogue reads 'some', see p. 174, A Descriptive catalogue of Telugu Manuscripts in the Government Oriental Manuscripts Library, Madras. 1915; Vol. I (Prabhandhas) copies compared by me".

7. "The Telugu Mahabharatamu, Vol. 2nd Beginning at Book I, canto 2, verse 173. Charles Philip Brown. This copy is extremely incorrect but contains some valuable readings only upto the beginning of the 7th canto.

నెం. 54, దుష్కరఘోరతపంబుతో సరియుగావమరేంద్రా (21 వ ఆకు).

నెం. 59. దుష్కరఘోరతపంబు సరియుగావమరేంద్రా (81 వ ఆకు; సిద్ధార్థి సంవత్సర వైశాఖ బ. 3 గురువారము).

ii. గౌతమీ గ్రంథాలయమునందలి తాళపత్రప్రతి.

నెం. 51. దుష్కరఘోరతపంబ్బు సరియకావు నరేంద్రా (79వ ఆకు).

VI. వాల్తేరు :

i. బొబ్బిలి సంస్థానాధీశ్వరులు ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయమునకు బహూకరించిన తాళపత్ర గ్రంథసంచయమునందలి ప్రతులు.

నెం. 61. నాదగు దుష్కరఘోరతపంబు సరియుగావమరేంద్రా (71 వ ఆకు, రెండవ వైపు, నాల్గవపంక్తి; హేమలంబి సంవత్సర మాఘ శుద్ధ ౧౧. సోమవారము; క్రీ. శ. 1838, ఫిబ్రవరి 5 వ తేదీ).

నెం. 73. నాదగు దుష్కర ఘోరతపంబు సరియు గోవమరేంద్రా (69 వ ఆకు రెండవ వైపు, 70 వ ఆకు. మొదటి వైపు).

నెం. 88. దుష్కరఘోరతపంబు సరియు గావమరేంద్రా (56 వ ఆకు మొదటివైపు, ఆఱవ పంక్తి; ప్లవంగనామసంవత్సర చైత్రశుద్ధ ౫ ఆదివారము; క్రీ. శ. 1847, మార్చి 21వ తేదీ).

ii. శ్రీ శేషాద్రి రమణ కవులు ఆంధ్ర విశ్వకళా పరిషత్పక్షమున తెలంగాణమున పర్యటించి సేకరించిన తాళపత్రప్రతి.

Acc. No. 29211. సరియుగాదమరేంద్రా (60 వ ఆకు, మొదటి వైపు, రెండవ పంక్తి).

VII. విజయనగరము :

విజయనగరము మహారాజావారి ఫోర్ట్ లైబ్రరీలోని లిఖితప్రతులు,

'దుష్కరఘోరతపంబునకు సరిగావమరేంద్రా' (తాళపత్రప్రతి, 45 వ ఆకు, రెండవ వైపు).

'దుష్కర్మఘోరతపంబుకీడు గా దమరేంద్రా (కాగితపుప్రతి).

పరిశీలితములయిన, నూఱాఱు తాళపత్రప్రతులలో ఈ పద్యములున్నవి 90 మాత్రమే, 'సరియు' నకు 'ఈడు' 'సమము', 'సవతు', 'సాటి' యను నాలుగు పాఠాంతరములు మాత్రమున్నవి. ఈ పాఠముల వ్యాప్తి యిట్లున్నది.

1. 'సరియు' ఘటితపాఠములు	...	79
2. 'సాటి' ఘటితపాఠములు	...	5
3. 'సమము' ఘటితపాఠములు	...	3
4. 'సవతు' ఘటితపాఠములు	...	2
5. 'ఈడు' ఘటితపాఠము	....	1
	మొత్తము :	90

ఇట్లు తెలుఁగు మాగాణము నాలుగు చెఱఁగుల సేకరించిన తాళపత్ర ప్రతుల పాఠములు 'సరియుఁగా' వను పాఠమే సాధువనుటకు ప్రత్యక్ష ప్రమాణములు. ఈ సత్యమును ప్రత్యాఖ్యానము సేయఁజాలరు కదా! ఇంతేకాదు—

1. "....సురసిద్ధమునీంద్ర తప
శ్చరణలు నా తపముతోడ సరికావంటిన్"

(భారత. ఆది. 3-215)

2. "సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁగావ
యెఱుఁగు మెల్లధర్మంబులకెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు..."

(భారత. ఆది. 4-96)

3. "...దివ్యసభలెల్ల నరే
శ్వర చూచితి నని దీనికి
సరిగా నత్యంత విభవసౌందర్యములన్"
(భారత. సభా. 1-60)

4. "ధరణి హరిశ్చంద్రుఁడు భా
సురయశుఁడయి చేసె రాజసూయంబదియున్
సరిగాదని యేవగతును
సురుచిరవిభవమునఁ బాండుసుత యజ్ఞముతోన్"
(భారత. సభా. 2-117)

...

అను నిట్టి నన్నయ ప్రయోగపఙ్క్తియు ఉపమాన ప్రమాణముగా పై అనుమతికి ప్రోద్బలకము (8) ధీరవిచారుఁడగు '...ఎఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుఁడయిన నన్నయభట్టమహాకవీంద్రు సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁజెందుటయు సాధుజనహర్ష సిద్ధిగోరి'...తత్కవితారీతియుఁ గొంత దోఁపఁ దద్రచనయకా, కవీంద్ర కర్ణపుటపేయముగా' పూరించిన అరణ్యపర్వ శేషమునందును—

'ధనధాన్య పుత్రబాంధవ
జనలాభంబులును దలఁపసరిగావుఁ సుఖం
బునఁ దార్చ, దనదు శత్రులు
ఘనతర దుఃఖములనుండఁగని యలరుటకున్'
—అరణ్య. 5-348

'శరణంబని వచ్చిన భీ
కర శత్రునినయినఁ బ్రీతిగావఁగవలయుం
గరుణాపరుల తెఱంగిది
యిరవుగ సరిగావు దీనికే ధర్మంబుల్'
—అరణ్య. 5-413.

---

8. "కూంతు సరియపోల్వంగాం తలెందు" - దక్షారామశాసనము, క్రీ. శ. 1065. (South Indian Inscriptions, Vol. IV. No. 1007).

అని యిట్లు నన్నయ ప్రయోగపంక్తియే పాటింపఁబడుట ఈ యనుమితికి అదనపు బలము. ఎఱ్ఱనార్యుని ప్రతిజ్ఞలోని ప్రత్యక్షరమును ప్రమాణబద్ధము - మఱియొక విశేషము—

"సురదైత్య యక్షరాక్షస
నరఖేచర సిద్ధ మునిగణప్రవరుల భా
సుర తపములు నాదగు దు
ష్కర ఘోరతపంబు సరియుఁగావమరేంద్రా"

(భారత. ఆది. 3-209)

అని తపోభిమానమున ఇంద్రునితో పలికి ఉత్తమావమానకారణముగా తపః ఫలహాని నందినవాఁడు యయాతి, స్వీయ స్వర్గచ్యుతికి హేతువును తన దౌహిత్రుల కెఱిఁగించు సందర్భమున —

"సురపతి నా తపమున క
చ్చెరువడి నీ తపముపేర్మిఁ జెప్పుమ యనినన్
సురసిద్ధమునీంద్ర తప
శ్చరణలు నాతపముతోడ సరికావంటిన్"

(భారత. ఆది. 3-215)

'అని సరికావు' అను అదే పలుకుబడి యయాతినోట పునరుక్తమగుట గమనార్హము.

ఇంకొకమాట. తెలుఁగునందలి 'సవతు' ప్రాకృతభవమే కాని హిందీ నుండి ఎరవు తెచ్చిన అన్యదేశ్యముకాదు. ఈ 'సవతు' సంస్కృతమునందలి 'సమతా' పదభవమను ఆంధ్రనిఘంటువుల అంచనా సత్య దూరము. (9) ప్రతిస్పర్థి, శత్రువు అను నర్థములుకల సంస్కృత 'సపత్న' (10) పదమీ 'సవతు'

---

9. i. ఆంధ్ర పదపారిజాతము, 1888 ; పు. 768.
ii. బహుజనపల్లి సీతారామాచార్యుల వైకృతదీపిక, తృతీయ ముద్రణము, 1900 ; పు. 110.

(మిగతా 78 వ పేజీలో)

కు అసలు మూలమనుట సత్య సమ్మతము. ప్రాకృతమున 'సవత్త' = సమానము, తుల్యము; విరుద్ధము; విరోధము; అర్ధమాగధీలో 'సవత్త' = విపక్షి పాళీలో 'సవత్త' = వైరము అనునవి సంస్కృత 'సపత్న' పదభవములు. 'సవతి' వైకృతమనుట సర్వలాక్షణిక సమ్మతము. సమానపతిక సపత్ని: 'సపత్ని' సంస్కృతపదము. మహారాష్ట్రి ప్రాకృతమున సఉత్తీ సవత్తిణీ, సవత్తిఆ, సవత్తియా, సవత్తీ; అర్ధమాగధీలో సవత్తియా, సవత్తీ; శౌరసేనీలో సవత్తీ; అపభ్రంశమున సాయత్త; పాళీలో 'సపత్తి' అనురూపములు సంస్కృత సపత్నీ పదజన్యములు. కాఁగా తెలుఁగునందలి 'సవతి', 'సవతు' పదములు ప్రాకృతభవములు. కన్నడ భాషయందలి 'సవతి' పదమును ప్రాకృతభవమని ఏతద్భాషాపండితుల మతము. క్రీ. శ. పదియవశతాబ్ది ప్రథమపాదమునకు చెందిన 'విక్రమార్జునవిజయ' (పంప భారత) మనుకన్నడ కృతియందు తోడిపెండ్లాము అను నర్థమున 'సవతి' పదము ప్రయు

---

iii. బ్రౌన్యము, రివైజ్‌డ్ ముద్రణము, 1903; పు. 1320.

iv. లక్ష్మీనారాయణీయము, 1907; పు, 803.

v. పురుషోత్తమ కవీయము, 1918; పు. 131.

vi. ఆంధ్రవాచస్పత్యము, 1940 పు. 2619.

vii. దేశ్యమని కాంబెల్, 1821; పు. 576.

viii. సమత్వ శబ్దభవమని కవిజనాంజనకారుఁడు, తాళపత్రప్రతి, 16వ ఆకు రెండవవైపు.

10. i. "రిపౌ వైరి సపత్నారి ద్విషద్ద్వేషణ దుర్హృదః"
— అమరకోశః ద్వితీయకాండమ్ క్షత్రియవర్గః శ్లో. 10

ii. "అవాప్య భూమా వసపత్న మృద్ధమ్"
—భగవద్గీతా. 2_8.

క్తము.(11) నవీనోత్తరాహ భాషలలోని సఉత్, సవత్, సవత, సవతి, సౌత్, సౌత,సౌతని, సౌతా, సౌతీ(= సవతి, సపత్ని) పదములు ప్రాకృతజన్యములు; అరబ్బీ, తుర్కీ మొదలగు అన్యదేశభాషలనుండి ఎరవు తెచ్చినవిమాత్రము కావు. ప్రాకృతాదులలోని సవత్త, సవత్తీ పదములు తజ్జన్యపరంపరయగు గౌడీయభాషలలో ధ్వనిసూత్రబద్ధములైన స్వల్పరూపభేదములతోఁ గన్పట్టుట స్వాభావికము. సవత్యాది పదవిషయముగా తెలుఁగు, కన్నడములకును, నవీనోత్తరాహ భాషలకును ఏకమాతృకా భావముతప్ప జన్యజనక భావముగాని, పోష్య పోషకభావముగాని వర్తింపదు. ప్రాకృతములతోడి సంసర్గసంబంధము వలన తెలుఁగు, కన్నడములకును, నిసర్గ సంబంధమువలన హింద్యాదిగౌడీయ భాషలకును 'సవతి', 'సవతు' పదములు సంక్రమించుట. ఇదిచారిత్రక సత్యము, ఇది శాస్త్రీయప్రక్రియ, విశేషించి, ఒక్క హిందీమొగమువవే ప్రొద్దుపొడువలేదు. గౌడభాషలన్నింటను సవత్యాది పదములు ప్రచురవ్యవహారము కలవి. ఈ హిందీ యనఁగా నిన్నా మొన్నటిది; అవధీ, వ్రజ,

---

iii. "తతః సపత్నాపనయ స్మరణానుశయ స్ఫురా
ఓష్ఠేన రామోరామోష్ఠబింబ చుంబన చుంచునా"
—శిశుపాలవధ, ద్వితీయః సర్గః, శ్లో. 14; నిర్ణయసాగర|పెస్ బొంబాయి, 1927.

iv. "కృతప్రణామస్య మహీం మహీ భుజే
జితాం సపత్నేన నివేదయిష్యతః
న వివ్యథే తస్య మనో న హి ప్రియం
ప్రవక్తుమిచ్ఛంతి మృషా హితైషిణః"
— కిరాతార్జునీయమ్, ప్రథమః సర్గః, శ్లో. 2; చౌఖంబా సంస్కృత సీరిస్, వారాణాసి, 1952.

v. "...మానధనాఢ్యుఁడైన భూపతి సహియింపనోపునె సపత్నుల వృద్ధియు నాత్మహానియున్" (ఆంధ్రభారతము సభా. 2-98.)

vi. "అశేష రాజావళిలోన నత్యధికులైన సపత్నుల పేర్మిఁజూచి యేజూవె సహింపనోపక కృశుండ వివర్ణుఁడనైతి నెంతయున్".
(—పైది సభా. 2-114.)

11. "శ్రీయువతియ నావీర
శ్రీయుపతిగె సవతి మాత్సె నెందరి న్నపరు

మైథిలీ భాషాపరమయిన సాహితీ వ్యవసాయమును (12) సైతము హిందీపద్దు క్రింద జమచేసి లెక్కకట్టినను బంగాళీ, మరాఠీభాషలకి దాపింతనమయిన సాహిత్య చరిత్రకలది. పదునైదవు శతాబ్దికిపూర్వము హిందీలో ప్రామాణిక మయిన సాహిత్య మున్నటులు నిర్దుష్టమయిన ఆధారములు మృగ్యము. హిందీలో తీర్చెనన్న అమీర్ ఖుస్రో రచనల అంతు ఇంకను వివాదగ్రస్తము. అమీర్ ఖుస్రోను ఆశ్రయించినను హిందీ పదియవు శతాబ్దికి పోలేదు. 'గ్రంథస్త దశమాటను అటుంచి, హిందీభాషవ్యవహారమాత్రోపయోగిగానైనను ఉండి యుండదా' అని పూర్వపక్షమువారి ఆశంక. ఆనాఁటికి హిందీభాష అలుచూలు లేని సోమలింగము! మాండలికావస్థకు పూర్వదశలో అపభ్రంశస్థాయిలో నుండినది. ప్రమాణములు కావలయునని పట్టు పట్టినచో బండ్లకెత్తుదుము. మీఁదుమిక్కిలి హిందీభాషావ్యవహారమండలమునకు తెలుఁగు కన్నడ సీమల తోడి సంబంధబాంధవములు అర్వాక్కాలికములు. అందును అల్పీయములు. శాతవాహనుల యేలుబడి నాఁటికే తెలుఁగులకు మహారాష్ట్రిప్రాకృతముతో ప్రగాఢమయిన ప్రత్యక్షసంబంధము లుండిన వనుటకు ప్రమాణములు పుష్కలములు. నాఁటి ప్రాకృతభాషా కృతులపై ముఖ్యముగా శాతవాహనచక్రవర్తి

ళ్నాయ వెరసె తెదుకొండు ధ
రా యువతిగె నెగర్ద హరిగ నొర్వనెగండం"
— పంప భారతం ఎంబ విక్రమార్జున విజయ. ఆశ్వా.

11, పద్య 1; పు. 281; బెళ్ళావె – వెంకటనారాయణప్ప సంపాదితము, కర్ణాటక సాహిత్య పరిషత్తు, బెంగళూరు, 1927. పంపఁడు క్రీ. శ. 902-941 ప్రాంతమువాఁడు. అనఁగా నన్నయ (1022-1068) కు నూటేండ్లు పూర్వుఁడు

12. i. "సవతి నహోపి అహితుమ్‌బైరిని" (=నీవు సవతివికావు, పగతురాలవు) – 94వ చౌపాయీ. మాలిక్ మొహమ్మద్ జాయసీ (క్రీ. శ. 1540) కృతమగు 'పద్మావతీ', లక్ష్మీధరపరిష్కృతము, లండన్, 1949;

ii. "మంథరా కహేసి కథా పత సవతి కఇ" (సవతులకు సంబంధించిన నూటాఱు కథలను మంథరచెప్పినది) – తులసీదాస్ (క్రీ. శ. 1575). రామ్‌చరితమానస్, పు. 164; ఈ పైరెండుకృతులును 'అవ్‌ధీ' భాషామయములు.

హాల సంకలితమగు 'సత్తసఈ' పై దిరుగులేని తెలుఁగుముద్ర కలదని సాహితీ సుగతులు శ్రీ తిరుమల రామచంద్రగారి తీర్పు. ఈ చర్చ యంతయు అనుమాన ప్రమాణముగా అంగీకార్యము.

అయిన, 'సరియుఁగా'వను పాఠమును 'సవతుకావు' అని ఏల మార్చిరో నిష్కర్షముసేయుట దుశ్శకము. పూర్వపరిష్కర్తలు చూచిన ఒందురెండు తాళపత్ర ప్రతులలో 'సవతు' అను పాఠము ఉండుటను బట్టి ఆ పాఠమట్లే అంపపరంపరగా తదర్వాచీనప్రతులలో నిర్వహింపఁబడియుండుట సుసంగతము. అర్వాచీనాంధ్ర సాహిత్యమున 'సవతు' పదమునకుఁగల ప్రాచుర్యము (13) మూలమున ఒకరిద్దఱు తాళపత్రలేఖకులీ పాఠమును సృష్టించి యుందురనుటయు సంభవమే; మేము చూచిన నూఱాఱు తాళపత్ర ప్రతులలో రెండంటే రెండు ప్రతులలో 'సవతు' ఘటిత పాఠముండుట ఇతః పూర్వమే నిర్ధారితము. ఇవి రెండును అత్యర్వాచీనములు. పూర్వప్రకాశకులు – పరిష్కర్తలుకారుసుఁడీ- పెక్కురు అవిచక్షణులగు అక్షరచణులు. ప్రధానముగా వారిది వ్యాపారదృష్టి. 'పండితులచేత పరిష్కరింపఁబడిన (పూర్వముద్రిత) ప్రతిప్రకారము సరిచూడఁబడి ముద్రింపఁబడిన' (14) ముద్రణములే తొలిదశలో అధికము. ఆదిలో 'కాపీరైటు' బాధయునులేదు. 'కాపీరైటు హక్కు' సాధారణ న్యాయము (common law)గా ఉండెడిది. ఆ తరువాత తరువాతగాని అది వ్యవస్థాపితమగు చట్టము (Statutory Act) గా రూపొందలేదు. అందుకే ప్రాచీన ముద్రణము

13. i. "నన్నుఁ జూడుమెవ్వఁడు సవతిటు చూడుమింక" (నృసిం. 5-88);
ii. "అనఁగ సవతులేని యభినవాకారంబు..." (భోజరా. 3-224);
iii. "జననాథ నీ ప్రతాపంబునకు సవతెద్ది" (జై. భారత. 8-164);
iv. "క్రమమునఁ జేసిరన్ సవతురామికిరోపి" (చిత్రభారత. 3-69);
v. "మోవిసవతా చివురెక్కడి మాట" (విజయవిలా. 1-117);
vi. "సవతెచ్చటనులేని చౌకట్టు పోగులు" (యయాతి. 4-94);
vii. "సరియుద్ది ప్రతిదిన్ను సవతుపోలిక దొరజత యనఁగా సదృశమున కెనఁగు" (సాంబ నిఘంటువు. స్థావరవర్గు. 64);

14. వంకాయల కృష్ణస్వామి శెట్టివారి భారతప్రతి (1890) ముఖపత్రము.

లంతింత మాత్రముగా వెలయుట ; కాని, అర్వాచీన పరిష్కర్తలగు తంజ నగరము తేవప్పెరుమాళ్ళయ్య, బుక్కపట్టణము రామానుజయ్య, పురాణం సూర్యనారాయణతీర్థులు మొదలగువారు నాఁటి ప్రకాశకులకు నచ్చఁజెప్పి, నన్నయ భారతము తాళపత్రప్రతులను పెక్కింటిని పరిశీలించి పాఠనిర్ణయ మొనర్చినవారగుటచేత తత్పరిష్కృత ముద్రణములయందు 'సరియుఁగా' వను పాఠము కర్త్రభిప్రేతముగా స్వీకృతమయి యుండుట సంభావ్యము. అంతేకాని, హిందీలో ఇదే యర్థముకల 'సవత్' పదము తెనుఁగుల వాడుకలోఁ జేరి శబ్ద శాసన ప్రయుక్తమయినదనియు, క్రీ. శ. 11 వ శతాబ్దమున తురకపదములు ఆంధ్రభాషలో లేవను భ్రమతో పండితులో 'వ్రాయసకారు'లో 'సవతు' ను 'సరియు' అని తుడుపులుపెట్టి మార్చిరనియు వాదించుట సప్రమాణము, సత్య మూలము కాఁజాలదు. ఈ 'సవతు' హిందీపదము కాఁబోలునను దృష్టితో పండితులో, 'వ్రాయసకారు' లో 'సరియు'గా మార్చి యుందురని మాటవరుసకు అంగీకరింతము. ఆ పక్షమున ఆక్షేపములు రెండు. ఒకటి : సవతుకు సమీప వ్యుత్పత్తికమును, రెడ్డిగారి చూపులో 'సవతు' తో పాటు హిందీ నుండివచ్చిన అన్యదేశ్యమును అగు 'సవతి' (= తోడిపెండ్లాము) పదఘటితమగు "నీ సవతికి దాసివై" (భారత. ఆది. 2-7) అను గరుడోపాఖ్యానమునందలి పాఠమును ఆ పండితులో, 'వ్రాయసకారు' లో తుడుపులుపెట్టి దిద్దలేదేల ? ముద్రిత ప్రతుల యందును, తాళపత్ర ప్రతులయందును సర్వేసర్వత్ర "నీ సవతికి దాసివై" అను పాఠము చెక్కు చెదరకుండ కుదురుగా నిలిచియున్నదికదా ; ఇది, ఇట్టి చూపుగల పరిష్కర్తల దృష్టికందలేదని సమర్థింపఁజూచినచో ఒక్కదండముపెట్టి ఊరకుండుట శ్రేయము. ఇఁక రెండవ ఆక్షేపము : నన్నయనాఁటికి తెలుగునఁ అన్యదేశ్యములు చేరుట కవకాశములేదను భ్రాంతికల పండితులో, లేఖకులో నన్నయ కృతిలోఁగల అన్యదేశ్యములనుమార్చి ఆ తావున శుద్ధదేశ్యములను కూర్చిరనికదా శ్రీ రెడ్డిగారి వాద సారాంశము. 'సవతు' స్థానమున వచ్చిన దనుచున్న 'సరియు' శుద్ధదేశ్యమనికాబోలు శ్రీ రెడ్డిగారి భావన ; కాని, 'సరి' యను పదమును దేశ్యముకాదు. 'సవతు'తో పాటు 'సరి' యును తద్భవము:

ప్రాకృతభవము. ప్రాకృతములో సరి, సరిస=సమానము, తుల్యము (15): మాగధీలో శలిశ ; అర్ధమాగధీలో సరి, సరిస, సరిసగ ; సరిసయ ; శౌరసేనీలో సరిస; అవంతిలో సరిచ్ఛ ; శాకారీలో సలిచ్ఛ ; పాలీలో [illegible], సరిస; అపభ్రంశములో సరి ; నవీనార్య భాషలగు నేపాలీ, మరాఠీ, సింహళీ, హిందీ భాషలలో సరస, సరి, సరిస, సరీ - పదములు ప్రాకృతజన్యములు. ఏతద్రూప పరంపరకు సంస్కృతములోని 'సదృశ' పదము మూల మాతృక. 'సరి', 'సవతు'లు రెండును హిందీయందు సమానమయిన వ్యవహారబలముకల పదములు (16). 'సవతు'ను హిందీ పదముగా గుర్తింపగలిగిన భాషాజ్ఞానము కల పండితులకు 'వ్రాయసకారు' లకు 'సరి'యను పదమును హిందీయందు ప్రసిద్ధమను నంశము తెలియకపోవచ్చుననుట బలము చాలని ఆశంక. ఇట్టిచో 'సవతు'ను పెఱికి 'సరి' ని ఇఱికించుట ములువుచ్చి కొఱ్ఱడిచిన చందము కాదా ? కావున నిట 'సవతు : సరియు' అని తుడుపులు పెట్టి మూలపాఠమును మార్చి కూటకరణము చేసిరనుట నిలువనేరని మాట ; ఇట్టు సర్వప్రమాణ సంపన్నమయిన "సరియుఁగా" వను పాఠమే శబ్దశాసనాభిప్రేతమని సిద్ధాంతము.

---

15. 'చేరువ, సమీపము; తోడు; అరాసనము' అను నర్థములతో తెలుఁగుననుఁగల 'సరస' యును 'సదృశ' పదసంబంధి. ప్రాకృతములందలి 'సరస' దీనికి మాతృక; కాఁగా, నిది ప్రాకృతభవము. దీనిని మన నిఘంటుకారులు (శ. ర., 1885; పు. 1076; లక్ష్మినా. పు. 800; ఆంధ్రవాచ. పు. 2606) దేశ్యముగా పేర్కొనుట ప్రమాదము.

"... ప్రాచీ దిఙ్ముఖుఁడైన నాకు సరసన్ ప్రద్యుమ్నుడున్ నీవు
హేలా చాతుర్యము దాపలన్ వలపలన్ లావై పచారింప···"-ఉ. హరి 6-65
"... నా సరసన్ జనించి నిన్
బిలపెడి వీరుఁ డొక్కఁడెస సత్కృతి నొందెడువాఁడు..." —భాగవతము, దశమ. పూర్వ. 154.

16. "ససి సో కలంకి రాహుంహి పూజా
తోహిన కలంక, నకో ఇ సరి దూజా"

(= శశి కళంకమూర్తి, రాహుగ్రస్తుడు; నీవు అకలంకమూర్తివి, నీ సరి రెండవవారు ఏరును లేరు) - 63 వ చౌపాయీ, 7 వ ద్విపదిక, మాలిక్ మొహమ్మద్ జాయసీకృతమగు 'పద్మావతీ లక్ష్మీధర పరిష్కృతము, పు. 95.

వైకృతములుగా సర్వాదరణీయములయిన 'సవతి', 'సవతు' పదములను అన్యదేశ్యములని ప్రతిపాదించు పెద్దలు ప్రాఙ్నన్నయ్యోయుగ (క్రీ.శ. 575_1022) శాసనములయందలి ఆనతి, ఓవజు, కమ్మరి, కొట్టంబు, గొరవ, జాత్ర, జోగి, దేగుళము, దోసము, పున్నమ, బోయ, రాచ, వాడ — మొదలగు వైకృతములనుసైతము హిందీ పదములని రాద్ధాంతముసేయుదురు కాఁబోలు! తెలుఁగు, కన్నడములకు ప్రాకృతభాషలతోఁగల ప్రాచీన సంసర్గ సంబంధమును విస్మరించి, నన్నయాదుల నాఁటికి కాదుగదా నన్నయ కిటీవల నన్నూఱేండ్లకుఁ గూడ పృథగ్భాషగా నిర్దిష్టమయిన మూర్తిని పొందియుండని హిందీ భాషలోని గాడీ, సవత్, సవతి పదములు నన్నయాదుల కాదరణీయములయి వారి రచనల కెక్కియుండునని సిద్ధాంతీకరించుట చరిత్రను తలక్రిందులుసేయుట; శాస్త్రమును పెడదారులు పట్టించుట. లోకవ్యవహారమును, శాస్త్రవ్యవహారమును విపరీతార్థ కల్పనలతో విపర్యయముసేయుట ప్రశస్యముకాదు.

"గ్రంథపరిశీలనము లేని వాదముల క్రమములు; అప్రయోజకములు" అని పూజ్యులు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి ఎచ్చరిక. శ్రీ శాస్త్రిగారు నిసృష్టార్థప్రియులు, మనీషి, విద్యాశ్రమతత్త్వవేత్తలు. "అమలజ్ఞాన సుదీప వర్తిఁగొని వృద్ధాచారులై వేదశాస్త్రము లందున్న సదర్థ మెల్లఁగొని విద్వత్ప్రీతి గావించు" పండిత పరిశోధకులను ఒప్పించుట, మెప్పించుట కత్తిమీఁది సాము. వారి ఒప్పుదలను, మెప్పుదలను పొందుటకే ఈ అల్పపరిశ్రమము. విశేషించి,

"మొదలన ప్రియమయ్యును దుదిఁగరంబు
పథ్యమగుపల్కు ప్రియులందు బలిమినైనఁ
బలుకవలయు మోమోడక ..."

(సభా. 2_192)

అని భారత నీతి. అందువలన ఈ విస్తరము.

వికృతి వివేక కర్తృత్వము

వికృతివివేక మథర్వణకృతము గాదనియు, కవిశిరోభూషణ కర్తయగు
అహోబల పండితుడే దీనిని రచించి గ్రంథప్రామాణ్యసంసిద్ధికయి అథర్వణుని
పేరుపెట్టెననియు పెక్కురు పరిశోధక పండితుల అభిప్రాయము.[1] అంత
రంగికములగు మఱికొన్ని సాక్ష్యముల మూలమున పై అభిప్రాయమును బల
పఱుచుటయే ఈ వ్యాసప్రధానోద్దేశము. ఆద్యః క్రియాస్విత్యాది ఆంధ్రశబ్దచింతా
మణి సూత్రోపదిష్టభావములను విస్తృతముసేయు తలంపుతో వికృతివివేకకర్త
'భావిక్రియాసు యస్య స్యాత్ ఏత్వమేవ ప్రయోగతః.....దోలాభూషోత్తరీ
యాణి వినైత్వం నాస్తి మధ్యయః' (అథర్వణకారికావళి, సంజ్ఞా 14-15 పుటలు,
వావిళ్ళ, 1955) అను కారికలను రచించినాడనుట స్థితస్థాపకాంశము. దోలా
భూషోత్తరీయ శబ్దార్థకములగు ఊయెల, తాయెతు, పయ్యెద- శబ్దములందక్క
తక్కిన నామపదములలో మధ్యగత యకారముమీద ఏత్వ ముండదని దోలే
త్యాదికారిక తాత్పర్యము. దీనిమూలముగా వైయాకరణలోకమున చెలరేగిన
వాదప్రతివాదముల సమీక్ష కిది అవసుకాదు. మీది దోలేద్యాదికారికను, అందును
ముఖ్యముగా భూషాశబ్దార్థకమగు 'తాయెతు'ను గూర్చి చర్చించుటవరకే ఈ
వ్యాసపరిధి పరిమితమయినది.

నా యెఱిగినంతమేర 'తాయెతు' శబ్ద సంబంధి చర్చను సాగించిన లాక్ష
ణికులలో ముద్దరాజు రామన (క్రీ. శ. 1570-1600) మొదటివాడు. "తాయె

---

1. పాడి వేంకటస్వామిగారు, "త్రిలింగ శబ్దానుశాసనము, అథర్వణకారికలు," ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, 211-214 పుటలు. 1911 ఏప్రిల్ నెల 12; కందుకూరి వీరేశలింగము పంతులుగారు, ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమ భా. 256-274 పుటలు, రివైజ్‌డ్ ఎడిషన్; కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు, అథర్వణాచార్యులు, ఆంధ్రవిజ్ఞానసర్వస్వము, మొదటిసంపుటము. 455-461 పుటలు; చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవి తరంగిణి, 3వ సంపు. 75—88 పుటలు.

తును నయ్యేలయు బయ్యేదయును దక్క-గలుగదెత్వంబు మధ్యయకారములకు -దుదనుగ్రియదక్క- నెత్వంబుగదియ దాది—నత్వమొందదు తెనుగుల నబ్జ 2 (కవిజన సంజీవని, ప్రథమ తరంగము, యతిపద్ధతి, 117 వ ప.- వావిళ్ళ, 1930). ఏతద్విషయక పరామర్శ మొనర్చిన తరువాతిలాక్షణికులెల్ల రును భూషాశబ్దమును 'తాయెతు' అనియే అనువదించుచు వచ్చిరి. కాకునూరి అప్పకవి (క్రీ. శ. 1656) "ధరణినయ్యేల పయ్యేద తాయెతు అను-గల యకా రంబులకు వక్రములని జంబు-ముద్దరాజు రామనవాని మూటిని బద-మధ్యయా లని చెప్పె నిమ్మాట మిథ్య" (అప్పకవీయము, 2 ఆశ్వా. 184వ ప...వావిళ్ళ, 1951), "ఊచునెల కాకగుటచేత నయ్యేలయ్యె, బయిని నెదకునిక్క- వక్రోక్తి బయ్యేదయ్యె-బయిని-దల్లికావునకై కట్టదగినయెత్తు—దేలబల్కగ దాయెతు దేశ్యమునను" (పైది. 2-185) అని వ్యాఖ్యానించినాడు. గణపవరపు వేంకట కవి (క్రీ. శ. 1676-1700) "ఊయలపయ్యేద తాయెతుల నడిమియెత్వమునకు యత్వమేత్వమునగు" (ఆంధ్రకౌముది. సర్వలక్షణ శిరోమణి యందలి సీస మాలిక, 25వ పుట, ఆంధ్రసాహిత్యపరిషత్తు, కాకినాడ, 1935) అని వివరించి నాడు. కూచిమంచి తిమ్మకవి (క్రీ. శ. 1700-1757) "తాయతయు నయ్య లయు బయ్యదయు ననంగ-గలుగ దత్వంబు మధ్యయకారమునకు -ననుచు మును ముద్దరాజురామన వచించె-గాని యత్వంబు గృతులందు గలదుశర్వ" (సర్వలక్షణ సారసంగ్రహము, 1-190, మంజువాణీ ముద్రాక్షరశాల, ఏలూరు, 1914) అని రామనను సవరింపనెంచి కావలయు వలయు ప్రయోగముల నెత్తి చూపినాడు. ద్వితింత్రిణీ సీతారామకవి (క్రీ. శ. 19వ శతాబ్ది ?) ఉయ్యేల, తాయెతు, పయ్యేదలను శబ్దంబులందప్పం బమధ్య యకారమునకు నేత్వము లేదు." (కవిజనమండనము, వికృతివివేకటీక, 15వ పు. వావిళ్ళ, 1955) అని వికృతివివేకస్థిత డోలేత్యాదికారికకు అర్థముచెప్పినాడు. చిన్నయసూరి (క్రీ. శ. 1806-1862) యు "ఊయేల పయ్యేద తాయెతులం దిక్క- నామంబు లందు యాకుం దాలవ్యవక్రయోగంబు లేదు" (బాలవ్యాకరణము. ప్రకీర్ణక. 3వ సూ.) అని పూర్వలాక్షణికుల ననువదించినాడు. పాలపర్తి నాగేశ్వరశాస్త్రులు

---

2. తాయెతాది శబ్దోదాహృతులయెడ రామనాదులకృతులలోని పద్యముల పాఠాంతర ప్రదర్శన మిట ప్రసక్తముకాదు—వివరములకు లింగముకుంట తిమ్మకవి కృతసులక్షణ సారము, రావూరి దొరస్వామిశర్మగారిచే పరిష్కృతము, 95-96 పుటలు

(క్రీ. శ. 1869) "ఉయ్యేల–పయ్యెద–తాయెతు అను శబ్దములయందుఁ దక్క మధ్యయకారంబున కేత్వంబులేదు. ఈ మూడుపదములందున్న మధ్య యకార మకారముగా సత్కవిప్రయోగంబులయందొకానొకచోటఁ గానంబడుట వలన నదియు సాధువుగానే గ్రహింపవలయును."—(సటీకాన్ధ్రశబ్దచింతామణి, 14వ పు. పసల—పార్థసారథినాయనిచే విద్వన్మోదతరంగిణీ ముద్రాక్షరశాలలో ముద్రితము, ప్రచురితము, 1869) అని అద్యఃక్రియాస్వితాృది సూత్రమునొద్ద వివరణమువ్రాసిరి. పిల్లలమఱ్ఱి నాగలింగశాస్త్రిలు (క్రీ. శ. 1888) తాతంభట్టు పేర ప్రకటితమయిన సులక్షణసారమను ఛందోగ్రంథమున 'యావడి' యను శీర్షికక్రింద నుదాహృతమయిన 'తాయెతును నుయ్యేలయు...' అను ముద్దరాజు రామన పద్యమునకు వ్యాఖ్యవ్రాయుచు "...తాయెతు నుయ్యేల పయ్యెదయను పదంబు లేకపదంబులని యీ కవికి తాత్పర్యంబు గాన నీ మూఁడు పదముల యందును మధ్యనున్న యకారమేత్వ విశిష్టమైనదేకాని అత్వవిశిష్టంబైనది కాదని యును భూతార్థక్రియాంత్యమందుఁ గనియె వినియె చవియె ననుచోట నటువలెనే అత్వంబు గాదనియుం దాత్పర్యము" అని వివరించిరి. (శ్రీవాణీ వినోద మందిర- కవిరంజనీ, గీర్వాణ భాషారత్నాకరముద్రాక్షరశాలలయందు మదరాసులో 1888వ ముద్రితము, ప్రచురితము. 54–55 పుటలు. తరువాతి ముద్రణము–చెన్నపట్ణం పమ్మి అరుణాచలంశెట్టివారి స్వకీయ శ్రీవేంకటేశ్వర ముద్రాక్షరశాలయందు 1900 లో ముద్రితము, ప్రచురితము—నందును ఇట్లే కలదు. 1924 నాటి వావిళ్ళవారి ప్రతియు దీనికి నకలు.) వెంకయ్య వ్యాకరణమునందును "ఉయ్యేల–పయ్యెద–తాయెతు ఈ మూఁడుశబ్దములయందున్న మధ్య యకార మేత్వముగలది" (తా. వెంకయ్య, ఆంధ్రవ్యాకరణము, సంజ్ఞా. 17. సూ. వావిళ్ళ– 1916) అని వివృతమయినది. 'తాయెతు'ను గూర్చి ఇదీ మన లాక్షణికులు చెప్పిన సంక్షిప్త చరిత్ర.

'తాయెతు' అనఁగా రక్షార్థముగాని, అలంకారారార్థముగాని సిగనో, కంఠముననో, సందిటనో, మొలనో కట్టికొను వస్తువిశేషమని నిఘంటువుల నిర్వచనము. ఆంధ్రనిఘంటువులలో ఈ పదము తాయిత, తాయితు, తాయిత్తు, తాయెత, తాయెతు, తాయెత్తు, తాయెదు, తావితి, తావితు, తావీజు, తావేజు, దాయతి అను

రూపములతో ఉల్లేఖింపబడినది. 3 ఆంధ్రసాహిత్యమున అర్వాచీనములగు రచనలయందే ఇది కన్పట్టుచున్నది. శ్రీనాథకృతముగా 'చెలామణి' యగు చున్న పల్నాటి వీరచరిత్రము దీనికి తొలి ఆకరము. ఆ వెనుక రాయల యుగమునుండియు దీనికి విశేషవ్యాప్తి కలిగినది. కొన్ని ఆకరములను పరిశీలించినచో ఆ యా దేశకాలములలోని దీని వ్యాప్తి తెల్లము కాగలదు. "మేనికి రక్షయైమించు తాయెతులు" (పల్నాటివీర చరిత్ర. 17, పు క్రీ. శ. 1440). "దండడి కడియములు దంట తాయెతులు'' (పై ది. 72, పు.), "తాయెతుల బాహులు'' (మనుచరిత్ర, 6 ఆశ్వా. 44 వ ప. క్రీ. శ. 1509_1530), "మందుల తాయెత్తులు'' (కాళహస్తి మాహా. 3_32, క్రీ. శ. 1509_1530), "సందితాయెతుల దండ'' (అష్టమహిషీకల్యా. 1_49, క్రీ.శ. 1530_1570), "నెలవంక తాయెతుల్'' (ద్వి. పరమయోగి. చతుర్థాశ్వా. 2_74, పు. క్రీ. శ. 1530_1570), "తాయెతులఁజుట్టి'' (చంద్రభానుచ. 1_89, క్రీ. శ. 1585_1614), "తాయెతు చేరుఁజుట్టి" (పై ది. 3_73), "పసిఁడి తాయెతల" (శుక సప్తతి. 1_99, క్రీ. శ. 1650_1790) "పసిండి తాయెతులు'' (రసికజన. 1_83, క్రీ. శ. 1700_1757), "నిగరాల తాయెతుల్". (రాధికాస్వాంతన, 1_88, క్రీ. శ. 1730_1765), "సందిటి తాయెతున్'' (హంసవింశతి, 5_99, క్రీ. శ. 1750_1790, శృంగారకావ్యగ్రంథమండలి, మచిలీపట్టణమువారిప్రతి), "వెంకితాయెతుల్'' (పై ది 5_140), "సందితాయెతుల్'' (పై ది. 5_168), "కేయూరనామంబు తాయెతనంగను'' (ఆంధ్రభాషార్ణవము, 2_150, క్రీ. శ. 1769_1789.) 4

తాయెతు శబ్దమున కప్పకవి సేసిన విఱుపును, చెప్పిన వివరణము శాస్త్రీయరీతికి విపరీతము. అప్పకవి మతమునజేరి కొందఱిద్దానిని దేశ్యముగ

3. గాగరా, పావడ అను నర్థముకల తావేదు, తాబందు రూపములు తఅవిజ్ అను అరబ్బీమూలరూపమునుండి నిష్పన్నములయినటులు ఆంధ్రభాషా చరిత్రకారులు పేర్కొనిరి. చూ. ఆంధ్రభాషాచరిత్రము_మొదటిసంపుటము 583 పు. కాని 'తహబంద్' అను పారశీక పదము వీనికి మూలమనుట యుక్తము. చూ. అందే, పారసి తహబంద్_కుచ్చెళ్ళుపోవి మొలకు కట్టుకొను బట్ట 580 పుట.

4. కొన్ని వ్రాతప్రతులలో తాయత, తాయతి, తాయెద_రూపములును చూపట్టు చున్నవి.

భావించి వ్యవహరించుట అవిచార మూలకము, అప్పకవి సవరణయు, వివరణయు శాస్త్రసమ్మతము కావని ప్రత్యాఖ్యాతము సేయబడినవి. 5 చారిత్రకముగ శబ్దవ్యుత్పత్తిని నిర్ణయించుట రూపసాధన ప్రక్రియా బుద్ధులగు వ్యాకర్తల పనికాదు. 'తాయెతు' రూపనిష్పాదనముపట్ల అప్పకవి ప్రదర్శించిన ప్రక్రియా లాఘవము అతని పాండితీపటిమను ప్రకటించుట వినా, అతని చర్చయంతయు నేలవిడచిన సాముగానున్నది. ఇది దేశ్యము కాదు. దీని పరంపర వేరు. అసలిది అరబ్బీ పదము. "ఈ పదము తెనుగు పదమే కాదని నా భావము. ఇది తావీజ్ అను అరబ్బీపదమైయుండును, ఖురాన్ మంత్రాలను వ్రాసి రక్షగా తురకలు కట్టుకొందురు, దానినే మనవారు స్వీకరించినట్లున్నది" 6. తెనుఁగుతోబుట్టువులగు తమిళాది భాషలయందును ఈ పదమన్యదేశ్యముగను, అర్వాచీనముగను ఉట్టంకింపబడినది. తమిళ్ : తాయిత్తు, వి. (ఉర్దూ – తా'ఇత్) వెండి లేక బంగారుతో జేయబడిన రక్షకవచము ; భూషావిశేషము (మాండలికము) (Tamil Lexicon, 1841 page), కన్నడము : తాతి, తాయత, తాయితి రక్షకవచము (కిట్టెల్ కన్నడ-ఇంగ్లీషు నిఘంటువు 707, 709 పుటలు), కురుఖ్ : తాబిజ్ మొలనో, మణికట్టుననో, కంఠముననో ధరించు రక్షకవచము (గ్రిజ్యార్డు కురుఖ్–ఇంగ్లీషు నిఘంటువు 636 పు.), (బాహుఈ : తావీజ్, తావీత్ రక్షకవచము (అరబ్బీ తఅవీజ్ నుండి) (బాహుఈ–ఇంగ్లీషు నిఘంటువు 287 పు.). అన్నిభాషలలో దీనికి వ్యాప్తిగాని, ఉన్నచోట కావ్యప్రయోగములుగాని లేవు. ఈ పై రూపముల నన్నిటిని బాగుగా బద్ధించి చూచినచో తెనుగునందలి రూపమే కొంతలోకొంత ప్రాతదని తోపక మానదు.

అరబ్బీలో 'తఅవీజ్' అనగా రక్షణార్థము సర్వేశ్వరుని ప్రార్థించుట, ఆశ్రయించుట అని అర్థము. పారసీకుల ఇస్లాము మతావలంబనముతో ఇది వారి భాషలో ప్రవేశించినది. పారసియందును ఇది 'తఅవీజ్' రక్షణార్థము ప్రార్థించుట, ఆశ్రయమును కోరునట్లుచేయుట ; యహూదీ దేశీయులు ధరిం

---

5. శ్రీ వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిగారి ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వము ద్వితీయ సంపుటము 1752–1756 పుటలు.

6. సురవరం ప్రతాపరెడ్డిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, కాకతీయుల యుగము 97 పు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వితీయ ముద్రణము 1950.

చెడి యొకరకపు రక్ష; సమాధి అను నర్థములలో విస్తరించియున్నది. (Steingass పారసీకాంగ్లకోశము 301 పు.) అరబీ పారసీభాషావాహినిలో తల మున్కలుగా మునిగిన ఆధునికములగు ఔత్తరాహభాషలలో ఈ 'తాయెతు' స్థానమును నిరూపించుట అప్రస్తుతముకాదు. హిందీ: తవీజ్, తావీజ్ రక్షా కవచము; మంత్రకవచము; పరమేశ్వరు నాశ్రయించుట (హిందీ శబ్దసాగర్, ద్వి. సంపు, 1405 పు.), ఉరుదూ: తఅవిజ్ సర్వేశ్వరు నాశ్రయించుట, రక్షణ నర్థించుట; రక్షాకవచము (ఉర్దూ ఇంగ్లీషుకోశము. 199, పు.) మరాఠీ: తాబీజ్ రక్షాకవచము (కులకర్ణి మరాఠీ కోశము, 378 పు). నేపాలీ: తాబిజ్ సందిదండ; రక్షాకవచము (టర్నర్-నేపాలీ నిఘంటువు, 2?9 పు). కాశ్మీరీ: తొవిజ్ భూషావిశేషము; ముస్లిం స్త్రీల శిరోభూషణము; తొవ్జి యంత్రవిశేషము; పిశాచాది భయనివారణార్థము ధరించు కాపురేకు (గ్రియర్సన్-కాశ్మీరీ నిఘంటువు. 4 భాగము, 1048 పు.), అస్సామీ: తాబిజ్ సందిదండ; ఆకర్షక కవచము; రక్ష (హేమ చంద్రబారువా-హేమకోష్, 464 పు.). బెంగాలి: తాబిజ్ రక్ష కవచము (బాంగ్లా-ఆంగ్లకోశము, 268 పు.). ఒడియా: తాబిజ బాహుపురి, సందిటగాని కంఠమునగాని ధరించు భూషణ విశేషము (జి. సి. ప్రహరాజ్ - పూర్ణచంద్ర ఉడియా భాషాకోశము, 3వ సంపుటము), బలూచి: తఅవిజ్ (గిల్బర్ట్సన్ - ఇంగ్లీషు, బలూచి నిఘంటువు, 24 పు.). ఇట్లు సోపపత్తికముగా నిరూపితమయినందున దీనిని అన్యదేశ్యమనుటలో విప్రతిపత్తి యుండరాదు.

తెనుగున 'తాయెతు' పుట్టుక నిన్న మొన్నటిది. పదునైదవు శతాబ్దమునకు పూర్వ మిది మన భాషలో నుండెననుట కాధారములు లేవు. ఇదియేకాదు, అరబీ, తురుష్క, పారసీకాద్యన్యభాషాపదము లేవియు ఆనాటి సాహిత్యమునగాని శాసనములగాని కానరావు. "ఆంధ్రుల చరిత్రమునకును నీ పదములకును సంబంధ మున్నదని చెప్పనక్కఱ లేదు. అట్టి యన్యదేశ్యములలోఁ జాల మట్టుకు పాలక పాలిత సంబంధమునుబట్టియు, వాణిజ్యాది సంబంధములనుబట్టియు ముఖ్యముగ హిందూస్థానీ యింగ్లీషు భాషలనుండి తెనుఁగునఁ బ్రవేశించినవి." 7 భిన్న భిన్న భాషావ్యవహర్తలకు రాజకీయార్థిక సాంస్కృతికాది

7. డా. చిలుకూరి నారాయణరావుగారి ఆంధ్రభాషా చరిత్రము, మొదటిసంపుటము. "తెనుఁగునఁ జేరిన యన్యదేశీయ శబ్దజాలము", 575 వ పుట.

సంబంధము లేర్పడినపుడు ఆ యా భాషలలో పరస్పరము భావ వినిమయము, పదవినిమయము సంభవించుట చారిత్రక సత్యము. ఇదియును చిరకాలసాహచర్యమునంగాని సాధ్యపడని పరిణామము. ఒక భాషయందలి ఒకానొకపదము మఱి యొక భాషలో జనుల వ్యవహారవశమున ప్రవేశించి తద్భాషాపర్యాయ శబ్దాభావముననో, నూతనభాషా గత వ్యామోహము మూలముననో కవి పండిత సమ్మతిని బడసి కావ్యముల కెక్కి, లక్షణకర్తల పరిష్కారమును బడుట కెన్ని యంతరువులుండునో భాషాతత్త్వవేత్త లెఱుగని యంశముకాదు. వికృతి వివేకకర్తగా భావింపబడుచున్న అథర్వణుడు పండ్రెండు, పదుమూడు శతాబ్దుల నాటివాడని పరిశోధకుల నిర్ణయము. ఆనాటికి ముస్లిందండు తెనుగుగడపై అడుగుపెట్టలేదు. 8. క్రీ. శ. 1309 నాటికిగాని వారు ఓరుగల్లు పైకి రాలేదు. క్రీ. శ. 1323లో ఓరుఁగల్లు ఢిల్లీ సులతానుల వశమయినది. క్రీ. శ. 1336లో విజయనగర సామ్రాజ్యమునకు శంకుస్థాపన జరిగినది. క్రీ. శ. 1347 లో బహమనీ రాజ్య సంస్థాపనమునయినది. దాదాపు ఇన్నూఱేండ్లు ఈ రెండు రాజ్యములును ఎడతెగని పోరాటములతో వృద్ధిక్షయముల బొందుచు వచ్చినవి. ఈ యుగముననే పారసీకాద్యన్యభాషావ్యవహర్తలతో తెనుగువారికి ప్రత్యక్ష సంబంధ మేర్పడినది. క్రమక్రమముగా తెనుగునాట అన్యదేశ్యభాషలకు—నేటి యాంగ్లమునకువలె—రాజకీయరంగమున ఎనలేని అధికారము సంక్రమించినది. రాజకార్యనిర్వాహకులు పారసీకాది భాషలను విధిగా నేర్చెడివారు. భీమేశ్వర పురాణ కృతిపతియును వీరభద్రేశ వేమపృథ్వీశవుల కనుగు మంత్రియును నగు బెండపూడి 'అన్నయ మంత్రిశేఖరుఁ (క్రీ. శ. 1426–1440) దహమ్మదుసేను వదాన్య భూమిభృత్సన్నిధికిన్ .... పారసిభాష వ్రాసినన్ గన్నులపండువై యమరుఁ గాకిత మందలి వర్ణపద్ధతుల్' (భీమ. 1–74). ఇంతేకాదు. 'అరబీభాష తురుష్కభాష...గాంధార ఘూర్జర భాషల్...మఱియుం భాషావిశేషంబు లచ్చెరువై వచ్చునరేటి యన్నునికి గోష్ఠీ సంప్రయోగంబులన్' (పైది. 1–73). తదనంతరము 'అరబి పారసి గుజరాతి యారె మచ్చ—తెనుఁగు కన్నోజి మొదలుగాఁ దెలిసి వ్రాయ దారి గన్నట్టి...' (యయాతి. 1–47) వారందఱును దమ యేలికల తలపరసి వర్తించుటలో పెట్టినది పేరుగా పొగడ్త నందిరి.

---

8. Dr. N. Venkataramanaiah, Further Sources of Vijayanagara History, Introduction Vol, 1.

తన్మూలమున పారసీకాద్యన్యభాషా పదములు వేయార్లు తెనుగున చోటుచేసికొనినవి. రాగారాగా ప్రభువులును, తదాశ్రితులును వేయించిన శాసనాదులను ఈ పదములు ప్రత్యక్షమయినవి, నూతనప్రియులగు కవులును వీనిని ధారాళముగా తమ కృతుల ప్రయోగించి వీనికి శాశ్వతస్థితిని సంపాదించి పెట్టిరి. లభ్యమగు సాహిత్యమును, శాసన సంచయమును పరికించినచో ఈ యూహాపోహలు యుక్తియుక్తములని నిర్ధారణము కాగలవు.

వాద సౌలభ్యమునకు వికృతి వివేక మధర్వణ కృతమని అంగీకరించి పరిశీలించినను డోలేత్యాది కారికను రచింపవలయుచో అథర్వణున కధమపక్షము నూరు నూటయేబది యేండ్లకు పూర్వమే 'తాయెతు' తెనుగున ప్రవేశించియుండవలెను. అనగా అది పదునొకొండు, పండ్రెండు శతాబ్దులనాటికథ. ఉత్తర హిందూస్థానమున గజినీ (క్రీ. శ. 1001‒1030), గోరి (క్రీ. శ. 1175‒1192) దండయాత్రలు సాగుచుండిన తొలినాళ్ళవి. రాజ్యదాహముతో తహతహలాడు చుండిన ఈ విజేతలకును, సామాన్యప్రజలకును సరాసరి సంబంధము లుండినటులు సాక్ష్యములేదు—వీరందఱును ఆఫ్ఘనులు. ఆనాటి ఆఫ్ఘనుల భాష—భారతీయభాషలను స్వీయప్రభావపరిపుష్టము సేయజాలినంత ప్రత్యేక ప్రతిపత్తి కలదికాదు. అరబ్బు వర్తకులో, తురుష్క యాత్రికులో, పారసీక రాయబారులో తత్పూర్వము వచ్చియుండరాదా యని ఆక్షేపము రానగును. వచ్చినమాట వాస్తవము. పంజాబును పాలించిరన్న రెండవ డరయస్ మొదలగు పారసీక చక్రవర్తుల ఏలుబడి క్రీస్తునకు పూర్వము అయిదాఱు నూరేండ్ల నాటిమాట, ఒకానొక అజంతా చిత్తరువున పారసీక రాయబారియొకడు చిత్రింపబడినాడని పరిశీలకుల నిర్ణయము. ప్రాచీనకాలమునుండియు అరబ్బులు భారతదేశముతో వర్తకము సేయుచుండిరని నిర్ధారింపబడినది. విదేశ వాణిజ్యనిర్వహణమున అరబ్బులు సాటిలేనివారు. ఇస్లాము మతస్వీకారముతో అరబ్బులలో నూతనోత్తేజముదయించినది. వారి నిసర్గత్వమునకు మతవిస్తరణ కాంక్ష, రాజ్య విస్తరణ కాంక్ష తోడుపడినవి. క్రీస్తుశకము ఎనిమిదవు శతాబ్దము నుండియు భారతదేశమున వారి దాడులు మొదలయినవి. దేశ వాయవ్యభాగమున చెదరుచెదరుగా జరిగిన ఈ మెఱపు దాడులు దాదాపు రెండువందలయేండ్లు (క్రీ. శ. 711‒948) కొనసాగినవి. ఇంతచేసి అరబ్బులు సింధునద పరిసరములను దాటి ఈవల కాలిడలేకపోయిరి. వారియేలుబడిక్రిందికి వచ్చిన కొలది

భూభాగమును కొంతకాలమయినను కుదురుగా వారిచేతులలో నుండలేదు. అడప దడప చేతులు మాఱుచుండెడిది. సందుచూసికొని దేశీయ ప్రభువులు అరబ్బుల నెదిరించి పారద్రోలుచుండిరి. 9. ఇంతదీర్ఘకాలము నిరంతర సైనిక సన్నాహములతో సాగినందునను, క్రమక్రమముగా ఖలీఫాల ప్రభ అంతరించి నందునను క్రీస్తు శకము పదియవు శతాబ్దము సరిసగము గడచుసరికి అరబ్బులు భారతరంగమునుండి నిష్క్రమించిరి. భారతదేశమున అరబ్బులు సాధించినది అత్యల్పమయినను, ఆనాటి అరబ్బీ భూగోళశాస్త్రవేత్తలు భారతదేశమునుగూర్చి సేకరించి భద్రపఱిచిన చారిత్రక సామగ్రీ సంపద అమూల్యమయినది. 10 క్రీ. శ. 848 నుండి 1335 దాక సుమారైదు శతాబ్దుల వ్యవధిలో ఇంచుమించు ఇరువదిమంది అరబ్బీ భూగోళ శాస్త్రజ్ఞులు భారతదేశమునుగూర్చి అరబ్బీలో వ్రాసిరి. 11 పదియవు శతాబ్దాంతముమేర వీరు వ్రాసిన విషయములు చాలపాలు వారివలన వీరివలన విని గుదిగ్రుచ్చిన కట్టుకథల కట్టలు. స్వయముగా భారత దేశమున పర్యటించి ప్రత్యక్ష పరిశీలనమున విషయ సంగ్రహణ మొనర్చిన వారిసంఖ్య చాల స్వల్పము. మూన్నాళ్ళముచ్చటగా దేశపర్యటన నిమిత్త మరుదెంచిన విదేశిబృందముల ప్రభావమువలన భాషాదికములలో పరిణామములు సంభవించుననుట శాస్త్రసమ్మతము కాదు. కావున 'తాయెతు' ఆ తొలినాళ్ళలో ఎరువుతెచ్చిన పదమని ఊహించుట యుక్తిసహముకాదు. ఒకవేళ, ఏట్లో వచ్చివ దని సమాధానము పడినను, ఎన్నెన్నో పదములుండగా ఈ యొక్క 'తాయెత్తు' మాత్రమే ఒంటెత్తుగా తెనుగున జొరబడినదనుట శాస్త్రీయ పరిశీలన విధానము నకు విరుద్ధము. దీనితోపాటు మఱికొన్ని పదములును వచ్చియుండవలెనుగదా! ఇట్లు వచ్చినట్లు గుఱుతులేదు. చారిత్రకముగను, శాస్త్రీయముగను ఆనాటి తెనుగున దీనియునికి సందేహాస్పదమయి, ప్రాచీన కావ్యసందోహమునను, శాసన సంచయమునను కన్పట్టని ఈ పదమునుగూర్చి ద్వితీయాచార్యుడవి

---

9. Dr. R. C. Majumdar, Arab Invasion of India.

10. Dr. S. Md. Husayn Nainar, Arabs knowledge of Southern India.

11. Prof. K. A. Nilakanta Sastri, Foreign Notices of South India.

పేర్కొనబడిన అథర్వణుడు చర్చించెననుట విశ్వాస్యముగా దోపదు. అట్లయిన తెనుగు జనులువాడు పదసామస్త్యమంతయు కావ్యాదుల కెక్కినదా యను ఎదురు వాదము ఎదురుకాక మానదు. కావ్యాదుల పరిమితమగు పదజాలమే ప్రదర్శిత మగుటను కాదనలేము. అప్రసిద్ధములును, వ్రీడా జుగుప్సా మంగళకరములును నగు శబ్దములును కావ్యాదుల గానరానిమాట నిజము ; కాని 'తాయెతు' శబ్ద మీకోవకు జేరినదికాదు. మత విశ్వాసముల ననుసరించిగాని, సాంఘిక సంప్ర దాయముల ననుసరించిగాని నిషిద్ధముకాదు; అతి ప్రసిద్ధమయినది. ఇంకొకటి. అస్తిత్వమువలె అభావము ప్రామాణ్యము కాజాలదని పూర్వపక్షము పలుక వచ్చును. కాని బలీయములగు ఇతరయుక్తుల సన్నిధిలో ఈ శంకకు తావులేదు. ఆలనాటి వ్యాకరణము కావ్యభాషామాత్రానుశాసనమని పండితులు నిర్ణయించి నపుడు సామాన్య లోకవ్యవహారముపట్ల ఈ విధి వర్తింపదు.

ఇక, రామనాదులన్ననో ఇటీవలివారు. మహమ్మదీయ సంసర్గము ముక్కు బంటిగా ముదిరిన దశనాటి వారు. కావున రామన 'తాయెతు'ను గూర్చి వివరించు టయు, అప్పకవ్యాదులు సవరించుటయు తరువాతివారు తలస్పర్శముగా జర్చించు టయు సహేతుకము. వీరికి పూర్వులగు లక్షణకర్తలు--మూలఘటిక కేతన (క్రీ. శ. 1220--1280). విన్నకోట పెద్దన (క్రీ. శ. 1407) మొదలగువారు దీని ప్రసక్తిని గొనిరాలేదు. అసలు వారిట్టిదాని నెఱిగియుండినగదా తద్విషయక విచారము. ఇట్టిచో అంతప్రాచీనుడని మనము నిర్ణయించిన అథర్వణుడు ఇంత అర్వాచీనమగు 'తాయెత' శబ్దసిద్ధికయి దోలేత్యాదిక కారికను రచించుటెట్లు జతనుపడినది? కారికా వళికర్తృత్వమును అథర్వణునకే కట్టిపెట్టు గట్టికాంక్షతో ఈ కారికను అర్వాచీన కృతి ప్రక్షిప్త మను పక్షమున దోలా భూషోత్తరీయార్థక శబ్దములలో ఊయెల, పయ్యెద - శబ్దము లగతికములు కాకతప్పదు. విశేషించి యెత్వాత్వ సందేహ నిర్ణాయకమగు 'భావిక్రియాస్వి' త్యాదికారికా రచనమునందలి వికృతి వివేకకారుని యెత్తుగడ వ్యర్థమైపోవునుగదా ! అంతేకాదు. "ఆహేయ మన్యదేశీయం యత్తదేవ ప్రయుజ్యతే" (వికృతి వివేకము. సంజ్ఞా. 9 సూ.) కారికకు సమా ధానము రావలయును. అన్యదేశ్యము లనుచోట వైయాకరణ నిర్వచనమును

చూడుడు. "తురుష్కాది భాషాశబ్దము లన్యదేశ్యములనుట నిర్వివాదము." 12 అహేయమిత్యాది కారికావ్యాఖ్యావసరమున సంజీవని వ్యాఖ్యలో నుదాహృతములయిన ప్రయోగముల మూలమున అన్యదేశ్యముల స్వరూప స్వభావములు స్పష్టములగుచున్నవి. నింద్యముకానట్టి యనగా వ్యాకరణాది విరుద్ధము కానట్టి అన్యదేశ్య శబ్దము 'రోజు' మున్నగునది ప్రయోగింపబడుచున్నదని కల్పతరు వ్యాఖ్య. 13"యయిరీతి నథర్వణాచార్యు డంగీకరించియున్నను నర్వాచీన మహాకవులు ప్రయోగించియున్నను భారత ప్రయోగ రాహిత్యమునను, చింతామణ్యంగీకృతము కాకుండుటను గావలయు సూరి యన్యదేశ్యము నుపేక్షించె"నని సంజీవని నిర్ణయించినది. 14 తురుష్కాద్యన్య భాషాపదములను అన్యదేశ్యములనుటలో రెండభిప్రాయములులేవు. అహేయమిత్యాది కారికాభిప్రేతము నిదియే యని నిష్కృష్టముగా నిర్ధారింపబడినపుడు వికృతి వివేక మాథర్వణిక మగుట అసంభవము. మీదుమిక్కిలి పూర్వ లాక్షణికు లేరును అన్యదేశ్యముల ప్రస్తావనను తేలేదు. ఆంధ్రభాషాస్థితములగు శబ్దముల విభజనలోగాని, తదవసరమున నుదాహృతములయిన పదపట్టికలలోగాని అన్యదేశ్యములను గూర్చిన నామమాత్రపు సూచనయు గానరాదు. 15 ఈ కారికను సైతము ప్రక్షిప్తమందురు కాబోలు. తమవాదమునకు బాధకములగు కారికల నన్నిటని ప్రక్షిప్తములపేర, పాఠాంతములపేర నిరాకరించుచు వచ్చినచో కారికావళిలో శేషించునది శూన్యము. అందుచే వీనిని ప్రక్షిప్తములనుట పొసగదు. కాగా వికృతి వివేక మథర్వణకర్తృకముగాదని సారాంశము. అహోబల పండితుడే దీనిని సృష్టించి, తత్కర్తృత్వము నథర్వణున కంటగట్టెనను ఊహ త్రోసివేయరానిది. లేక అథర్వణు డంత ప్రాచీనుడు కాక అప్పకవ్యాదులకు దరిదాపుల సమకాలికు డందురా! అపు డింత రగడ యేల? అథర్వణుడు నాల్గయిదు శతాబ్దులు మనవైపు నడచి వచ్చినచో వికృతి వివేక కర్తృత్వము నాయనకే కట్టిపెట్టుటలో నేను మొట్టమొదటివాడను.

---

12. శ్రీ వఝ్ఝల చిన సీతారామశాస్త్రిగారి ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వము, 1 భా. 174 పుట.

13. పైది 61 III విషయము, 173 పు.

14. పైది 61, IV విషయము, 173 పు.

15. కేతన ఆంధ్రభాషాభూషణము, 19-27 పద్యములు. విన్నకోట పెద్దన్న, కావ్యాలంకార చూడామణి, నవమోల్లాసము, 6, 11-21 పద్యములు.

ఆంధ్ర భాష - హకారాది పదములు

'సర్వజ్ఞం తదహం వందే
పరంజ్యోతి స్తమోపహం
ప్రవృత్తా యన్ముఖాద్దేవీ
సర్వభాషా సరస్వతీ'

—నాగవర్మకృత కర్ణాటక భాషాభూషణం.

ఏ భాషయందయినను పదజాలము నిసర్గము (Indigenous), ప్రతిదేయము (Borrowed) అని ద్విధావిభక్తము. మూల భాషనుండి పైతృకముగా సంక్రమించిన పదములు నిసర్గములు; తదితరములు ప్రతిదేయములు. పరిసరస్థములగు సజాతీయ సోదరభాషల (Cognate languages) నుండిగాని, సమీపవర్తి విజాతీయ భాషల నుండిగాని, మత వాణిజ్య రాజకీయాది సంవర్గ సంబంధముల మూలమున దూరవర్తి విజాతీయ భాషలనుండి గాని ఎరవు తెచ్చిన పదములు ప్రతిదేయములు. పైతృకము శుద్ధదేశీయము ; ప్రతిదేయము అన్యదేశీయము.

ఆంధ్రభాషయందలి నిసర్గదేశ్య భాగము [1] ను శుద్ధాంధ్రదేశ్యముగను, తదన్యమును అన్యదేశ్యముగను, పరిగణించుట ఆధునిక భాషాశాస్త్ర పద్ధతులకు సంవాదకమగు సమన్వయము. కాని, సంస్కృత ప్రాకృతములనుండి ప్రతిదేయమయిన పదజాలమును తత్సమ తద్భవములనియు, తదితర

1. 'ఇప్పటికి బహు పండిత సమ్మతమైన సిద్ధాంతము, తెలుగు ద్రావిడభాషా వర్గము లోనిదని. ఆర్యభాషా స్వభావమునకు భిన్నములును, ద్రావిడ భాషకు సాధారణములును అగు లక్షణములు మనభాషలో చాల కలవు. పుట్టుకనుగూర్చి ఈ రహస్యమంగీకరింపక తప్పదు. పోషణలో మాత్రము తెలుగునకు సంస్కృతమువలని యుపకారమే యెక్కువ కలిగినది.' (పింగళి లక్ష్మీకాంతం, గౌతమ వ్యాసములు, ద్వి. ముద్రణము, 1961. పు. 2.)

పదసముదాయమును దేశ్యమనియు వ్యవహరించుట ప్రాక్తనాంధ్ర వ్యాకరణ సంప్రదాయము. ఈ సంప్రదాయమును ప్రాకృత భాషావ్యాకరణ మర్యాదానుసారి. తత్సమ తద్భవ దేశ్యములను విభాగప్రక్రియ ప్రాకృత భాషా పదతత్త్వ ప్రకాశకము.

ప్రాకృత వ్యాకరణములలోని తచ్ఛబ్దము సంస్కృత భాషాపరముగా వ్యవహృతము. ప్రాదేశికమును, అవిజ్ఞాత ప్రకృతికమును నగు పదజాలము ప్రాకృత భాషావ్యాకర్తల దర్శనములో దేశ్యము. ఆంధ్రమునందలి తత్సమ తద్భవ విభాగము ప్రాకృతము నందలి విభాగ ప్రక్రియకు అనుప్రాసము. దేశ్యభాగము ఆంధ్రలాక్షణికుల చూపులో అవ్యుత్పత్తికము. ఆంధ్రమునందలి దేశ్యమునకు ప్రాకృతము నందలి దేశ్యమునకు నామమాత్రపు సాదృశ్యము తప్ప స్వరూప స్వభావములలో యత్కించిత్ సామ్యమును అసంభావ్యము.

ఆంధ్రమునందలి దేశ్యభాగము పైతృకము ; తక్కిన ద్రావిడ భాషలకు సగోత్రకము. విశేషించి, నిత్యవ్యవహారోపయోగి. ప్రాకృతములలోని దేశ్యభాగము వ్యుత్పత్తి దుర్జ్ఞానము గావున ప్రాకృత వ్యాకర్తలు దానిని వేఱుగా పేర్కొనుట. అవిజ్ఞాత ప్రకృతికమని భావించిన ఈ భాగములో చాల పాలు అనార్య భాషా పదచయమని ఆధునిక భాషా పరిశోధకుల సోపపత్తిక నిర్ణయము 2. ప్రాకృతములలో అత్యల్పమయిన ఈ భాగముయొక్క ప్రయోజనము అనుకల్పము కావున నది లుప్తమయినను ప్రాకృతములలో వ్యవహార హాని సంభవిల్లదు. నామమాత్రపు సాదృశ్యము నాధారముగాఁ గొని ప్రాకృతాంధ్రములకు సజాతీయతను స్థాపింప బూనుట వృథా ప్రయత్నము.

ప్రాచీనాంధ్ర లాక్షణికుల నిర్వచన నిరూపణములలో అన్యదేశ్య స్వరూపము అస్పష్టము. దేశ్యమున అన్యదేశ్యమును అంతర్భూతము. ఏ తద్విషయ

---

2. John Beams, A Comparative Grammar of Modern Aryan Languages, 1872, Vol. I, Introduction, p. 12, Rev. Dr. R. Caldwell, Comparative Grammar of the Dravidian or South Indian Family of Languages, 1875, pp. 56-64, Dr. R. Pischel, Comparative Grammar of the Prakrit Languages, Introduction, para 9.

కములయిన మన శాస్త్రార్థములు బహుధా విప్రతిపత్తి మూలకములు— ప్రస్తుత సమీక్షలో ఏ తద్విచారము అప్రసక్తము. నిసర్గము, ప్రతిదేయము— అను సుస్పష్టమయిన విభాగదృష్టితో ఆంధ్రభాషయందలి హకారాది పదజాలము ప్రస్తుత పరిశీలనమున పరామృష్టము. ఇట తత్సమ తద్భవ దేశ్య రూపసగు సమాహారాంధ్రము ఉద్దిష్టము.

ప్రాచీన ద్రావిడ భాషయందు 'హ' వర్ణము ఉనికి సందేహాస్పద మనియు, ద్రావిడ భాషావికాసమున అనంతరదశయం దేర్పడిన నూతన రీతి (Innovation) కిది తార్కాణ మనియు తత్త్వ ప్రవణులు నిర్ధారించిన యంశము 3. తమిళ వ్యాకర్తలలో ప్రసిద్ధుఁడును, ద్రావిడ భాషావ్యాకర్తలలో ప్రాచీనుఁడును అగు తొల్కాప్పియనారు హకారకల్పక మయిన 'ఆయ్దమ్'(ஃ) ను ప్రధాన వర్ణమాలలో పఠింపలేదు. ప్రాచీన తమిళమున దీనివ్యాప్తి ఇంచు మించు అజాగళస్తనమువంటిది. పరాశ్రయ భాగిత్వముకల ఈ 'ఆయ్దమ్' సంస్కృతభాషయందలి విసర్గకు వికృతికాఁబోలు నని డా. సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఊహ. 4 మీఁదు మిక్కిలి అపవాదిగానే దీని అస్తిత్వము ; అదియును అతివిరళము. ఇదంయుగీనమగు తమిళములో హనుమూలీయ స్పర్శ (Velar stop) వర్ణమగు 'క' ను అజ్మధ్యముగా 'హ' గా నుచ్చరించుట తమిళుల అలవాటు. తిరుమాళిహై (< తిరుమాళికై = తిరుమాళిగ). తిర్వడిహళ్ (తిరువటికళ్ = శ్రీపాదములు) సాగరాంధ్రమున ఇహ (= ఇఁక). ఒహటి. (= ఒకటి), మొహం (= మొగము), మొహమాటం (= మొగ మోటము) సహం (= సగము) మొదలగు వానిలోని హకారోచ్చారణము అర్వా క్కాలికము ; సాగరాంధ్రమునకు పరిమితమగు విశిష్టమాండలిక పరిణా మము. 5

3. గంటి జోగిసోమయాజి, ఆంధ్రభాషావికాసము, పు. 356, 357.

4. Dr. P. S. Subrahmanya Sastri, History of Grammatical Theories in Tamil, pp. 65–70.

5. వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వ్యావహారిక భాషా వ్యాకరణం, శబ్ద పరిచ్ఛేదం, సూ. 259.

పదాది పకారము హకారముగా మాఱుట కర్ణాట భాషావికాసమున విశిష్ట లక్షణము. క్రీ. శ. పదియవు శతాబ్దము నుండియు కర్ణాట భాషా వ్యవహారమండలము లన్నింటను ప్రవర్తితమయినదీ ధ్వని పరిణామము. క్రీ. శ. తొమ్మిదవు శతాబ్దాంతము దాఁక కన్నడము నందలి 'ప-' ఈ మార్పునకు లోనుగాలేదు. ఆ పిమ్మట పదాది 'ప' కారము 'హ' కారముగా వికృతినందినది 6. పత్వమునకు హత్వవ్యవస్థ కర్ణాట భాషాలాక్షణిక సమ్మతము. పదునొకండవు శతాబ్దికి చెందిన నాగవర్మకృత కర్ణాటక భాషాభూషణము నందు 'పేహావా' అని సూత్రితము. 7. 'పకారస్య స్థానే హకారోవా భవతి' అని వృత్తి. ఇది వికల్పమనుట స్పష్టము. పదుమూఁడవు శతాబ్దినాఁటి కేశిరాజకృత శబ్దమణి దర్పణము నందును 'అద్విరుక్తమగు పకారమే హకారమగు చున్నదనియు, ఈ పరిణామమును వికల్పమనియు, ఇది కావ్య సౌందర్య హేతువనియు, ద్విత్వపకారము హకారమగుట లాక్షణిక మతమునకసమ్మత'మనియు విప్పులము.8 ఈ పరిణామ ప్రక్రియను స్పష్టపఱుచుట కీ క్రింది పట్టిక.

తెలుఁగునందలి	కన్నడము	
జ్ఞాతిపదము	ప్రాచీనరూపము :	నవీనరూపము ;
పగలు	పగల్	హగలు
పల్లి	పల్	హల్
పాలు	పాల్	హాలు
పాము	పావు	హావు
పిండు	పిండు	హిండు

---

6. Dr. A. N. Narasimhia, A Grammar of the Oldest Kannada Inscriptions, pp. 1–25.

7. సూ. 115, యుష్మదాది విధానం, కర్నాటక భాషాభూషణం. Ed. by R. Narasimhachar, Mysore Govt. Central Press, Bangalore 1903.

8. సూ. 159, నామప్రకరణం, అక్షరపరిణామం, శబ్దమణిదర్పణ, Ed. by Rev. Dr. F. Kittel, Re-edited by P. Mangesh Rau, Mangalore, 1920.

పిసుకు	పిసుకు	హిసుకు
పీర్చు	పీర్	హీర్
పీలి	పీలి	హీలి
పుట్టు	పుట్టు	హుట్టు
పులి	పులి	హులి
పూ, పూవు	పూ	హూ
పూడు	పూడు	హూడు
పెట్టు	పెట్టు	హెట్టు
పెంపు	పెంపు	హెంపు
పేను	పేన్	హేను
పేర్ -(= పెద్ద)	పేర్_	హేర్
పొగ	పొగె	హొగె
పొగరు	పొగర్	హొగరు
పోరు	పోరు	హోరు
పోలిక	పోలికె	హోలికె

దేశ్యములయందే గాక తద్భవముల యందును కన్నడమున ఈ పరిణామము ప్రసారితము.

సంస్కృతము :	ప్రాకృతము :	కన్నడము :
ప్రచ్ఛద-	పచ్ఛడ-	పచ్చడ, హచ్చడ
ప్రహార-	పహార-	పారె, హారె
	(దెబ్బ, = వ్రేటుపడినతావు)	(= పార, భూమిని త్రవ్వెడు సాధనము)

పిష్ట-	పిట్ఠ- (= తండులాదికచూర్ణము)	పిట్టు, హిట్టు
పూర్ణిమా	పుణ్ణిమా	పుణ్ణిమె. హుణ్ణిమె (= పున్నమ)
పోలికా	పోలిఅ	పోళిగె, హోళిగె

అల్ప ప్రాణమును ఉభయోష్ఠ్య స్పర్శము (Bilabial stop)ను అగు 'ప' కారము, మహాప్రాణమగు 'ఫ' గా ఉచ్చరిత మగుచుండి కాలక్రమమున స్పర్శ స్వభావమును గోల్పోయి 'హ' గా పరిణమించియుండునని కర్ణాటభాషా పరిశీలకుల తలఁపు 9. తెలుఁగునందును పదిహేను (< పదిహేను) పదహారు (< పదియాఱు). పదిహేడు (< పదియేడు). పద్దెనిమిది (< పదియెన్మిది) పంధొమ్మిది (< పందొమ్మిది), ఇరభయ్ (<ఇరువది). ముప్ఫయ్ (< ముప్పది). నలభయ్ (< నలువది), యాభయ్ (< ఏఁబది), అరభయ్ (< అఱువది), డెబ్భయ్ (< డెబ్బది) యనభయ్ (< ఎనుబది), తొంభయ్ (< తొంబది)-మొదలగునవి సోష్మ మహాప్రాణ వర్ణఘటితములగుటయు, ఏంభది (< ఏఁబది అను రూపము ప్రాచీనాంధ్ర శాసనములలోఁ గన్పట్టుటయు గమనార్హము 10.

ఆంధ్రమునందలి తత్సమ తద్భవేతరములగు హకారాది పదములతో పెక్కులు కన్నడమునుండి ఎరువుతెచ్చినవి. హకారాది క్రియావాచక పదములు

---

9. Dr. A. N. Narasimhia, op. cit.

10. స్వార్థాతిశయమున కొన్ని పదాల పరుషసరళములకు మహాప్రాణములు వైకల్పికముగా వచ్చుటకు చూ. వడ్లమూడి గోపాలకృష్ణయ్య, పూర్వోదాహృత గ్రంథము, శబ్ది. సూ. 260.

తెలుఁగున రెండే రెండు. హత్తు, హెచ్చు అను ఈ రెండును కన్నడమునుండి ఎరువుతెచ్చిన పదములని డా. భద్రిరాజు కృష్ణమూర్తిగారి నిరూపణము 11. ఇవితప్ప పదాది హకార ఘటిత క్రియావాచక పదములు తెలుఁగున లేవని తాత్పర్యము.

ప్రాచీన దక్షిణ ద్రావిడమున 'చ' వర్ణాది పదముల తొలివర్ణము లోపించి అజాది రూపముగా పరిణమించుట తఱుచగు లక్షము. చవర్ణాది పదమునకును దీనిపరిణతరూపమగు అజాది పదమునకును నడుమ హకారాదిదశ [చ – > హ – > ం – (= లోపము, అభావము)] ఒకటి ఉండి యుండవలయునని వేత్తల అధ్యాహారము. ఈమధ్య దశను సూచించు హకారాది పదములు దక్షిణ ద్రావిడమున సాహితీ వ్యవసాయము సాఁగిన నాగరక భాషలయందును సంగ్రథితము కాలేదు. మధ్య ద్రావిడభాషలలో నొకటియగు 'కువి' యను గిరిజనుల భాష12 లో ఈదశకు చెందిన పదములుకొన్ని నేఁడును వ్యవహృతములు. మచ్చుకు కొన్ని మాటలు ;

కువి :	తెలుఁగు :
హన్ (= పోవు)	చను
హర్కు (= వస్తువులు, ఉగ్రాణపు సామగ్రి)	సరకు
హారు, హారూ (= ఉప్పు)	సోరుప్పు
హిజ్జు, హీచూ (= నిప్పు)	చిచ్చు

11. Dr. Krishnamurthi, Telugu verbal Bases, A Comparative and Descriptive Study, University of California Publications in Linguistics, Vol. XXIV, Berkeley, 1961. p. 23.

12. కువిభాష, ఆంధ్రప్రదేశము విశాఖమండలములోని మన్యప్రాంతముల యందును ఒరిస్సారాష్ట్రము కలహంది, కోరాపుట్టి, గంజాము మండలములలోని మన్య ప్రాంతములయందును గిరిజనుల వాగ్వ్యవహారరూపము. ఈభాషావ్యవహర్తలు 1951 జనాభాలెక్కల ననుసరించి ఇంచుమించు మూఁడు లక్షలు. కూవిజ కోళు, కోందు, జాతాపు, సామంతు అను ప్రాదేశికవ్యవహార నామములు కల పలుతెగల గిరిజనులందఱును కువిభాషా వ్యవహర్తలు.

హీరు	చీర (పోతు)
హుంక, హూక (= నక్షత్రము)	చుక్క
హెల్లో, (= అనుమతి)	సెలవు
హేపొరి	చీపురు
హేరు, హేరూ (= వ్యవసాయసాధనము, నాఁగలి)	సేరీ (= వ్యవసాయము)
	ఏరు = నాఁగలి
హోమ్మొ, హోమ్మూ (= నగలు డబ్బు, సంపద) [13]	సొమ్ము

కాని, 'కువి' భాషనుండి తెలుఁగునకు ఎరువుతెచ్చిన పదములు నాస్తి.

ఆంధ్రభాషయందలి హకారాది పదములలో రమారమి మూఁడింట రెండు వంతులు తత్సమములు, తద్భవములు పదికి బొటాబొటి. కన్నడమునుండి ప్రతిగేయములు నలువది పైచిలుకు. మిగిలిన వానిలో ముక్కాలు మువ్వీసము అరబ్బీ పారసీకాది భారతీయేతర భాషలనుండియు, మరాఠ్యాది నవీనోత్తరాహ భాషలనుండియు సంసర్గవశమున ప్రవేశించిన అన్యదేశ్యములు. ఆంగ్లపదములు ఒకొ కొన్ని. పండితులును, పామరులును సృష్టించిన కృతక ప్రామాణికములు (Hyperforms) మఱికొన్ని, తక్కినవి వ్రేళ్ళమీఁదికి చాలని ధ్వన్యనుకరణములు. ప్రవృత్తి పరముగా ఆంధ్రభాషయందున్న హకారాదిపదములు వెరసి ఇన్ని పద్దులక్రింద చెల్లుపడఁగా, మన సొంతమునకు మిగిలినది హళ్ళికి హళ్ళి, సున్నకు సున్న. కాగా, వ్యుత్పత్తి పరముగా ఆంధ్రభాషయందు హకారాది పదములు లేవని సిద్ధాంతము.

---

13. F. V. P. Schulze, Vocabulary of Kuvi-Kond Language, Madras, 1913; A. G. Fitzgerald, Kuvinga Bassa (the Language of Western Khonds), Catholic Press, Calcutta, 1913.

ప్రవృత్తి పరముగా ఆంధ్రభాషయందున్న హకారాది పదములు వివిధ శీర్షికల క్రింద, అకారాద్యనుక్రమముగా ప్రపంచితము. ప్రాయికముగా కావ్య ప్రయుక్తములే ఇట ప్రదర్శితము. ముఖ్య శీర్షికలివి : i. తత్సమములు, ii. తద్భవములు, iii. కన్నడపదములు, iv. అన్యదేశ్యములు, v. ఆంగ్ల పదములు, vi కృతక ప్రామాణికములు, vii. ధ్వన్యనుకరణములు, క్రమముగా నీ శీర్షికల విస్తరము.

1. తత్సమములు ; తత్సమముల స్వరూప నిరూపణ మనావశ్యకము. మాదిరికి నన్నయ భారతము, ఆదిపర్వమునందలి హకారాది పదములు కొన్ని :

(చరణ) హతిన్ (6_2_7)

(బ్రహ్మ) హత్యయు (6_270)

హయంబు (1_113)

హరణ (హారికయు) (1_34)

హరా (జగజానన) (1_21)

హరిణముల (4_76)

హరితనయుండు (8_201)

హరి దంతరంబులన్ (8_275)

హరిదశ్వుఁడు (6_174)

హరినందను (8_84)

హరి నీల సమవర్ణుఁడు (8_185)

హరియించు 7_103)

హర్మ్యతలంబుల (4_218)

హర్ష పులకలు (4_108)

హర్షంబుగా (4_105)

హర్షించి (5_136)

హవ్యకవ్యములు (1_139)

హవ్యములు (5_79)

హవ్య వాహనుడు (8_249)

హవ్యాసన (8_248)

హంస (1_48; 6_231)

హస్తమ్మున (5_243)

(ముకుళిత) హస్తలమై (8_158)

హస్తిఘటావలి (6_78)

(పృథుదంత) హస్తుఁడై (6_78)

(షష్టి) హాయన (6_207)

(కేయూర) హారాదిభూషణ (6_48)

(హరణ) హారికయు (1_34)

హారి (హూరణ్మయ) (4_53)

హాసాస్పదీభూతుఁడై (7_49)

హితభాషణు (7_157)

హితఘ్నును (3_205)

హితుఁడపోలె (6_146)

హితోపదేశంబు (6_219)

హిమకరు (1_14)

హిమద్యుతి (4_114)

హిమవంతంబు (2_124)

హిమవన్నగ (5_47)

హిరణ్మయ (4_53)

హిరణ్యబిందు (తీర్థంబు) (8_135)
హిరణ్యాది(దానంబుల) (6_136)
హింస (5_59; 7_145)
(ఉపాయ) హీనత (5_210)
హీనమతులు (6_254)
హీనసత్త్వంగా (6_301)
హీనుఁడె (6_68)
హీనులై (6_194)
హుతభుక్ (ప్రళయంబు) (8_305)
హుతాశనంబు (6_90)
హృదయంబు (1_10)
హృద్యంబే (4_90)
హృద్వనజంబు (1_75)
హృష్టహృదయుండై (6_81)
హేతుభూతుండు (1_142)
హేతువు (2_131)
హేమకవచావృతుడు (6_16)
హోత (2_210)
హోమ కర్త (8_194)
హోమ కార్యము (8_128)
హోమ ధేనువు (3_111)
హ్రద ప్రవేశంబు (1_50)

II. తద్భవములు : ఆంధ్రమునందలి సంస్కృత ప్రాకృత భవములు నాలుగువేలు—హకారాదు లీదిగువ ప్రదర్శితము14.

1. హంకారము : అభిమానము, అహంకారము. 'హంకారములకెల్ల నాటపట్టు' (చంద్రా, 2—) (శ. ర.)

ప్రాకృత. అహంకార :- అభిమానము, గర్వము

సంస్కృత. అహంకార—

2. హత్తము : చేయి

ప్రాకృత. హత్థమ్, హత్థో

సంస్కృత. హస్త—

3. హత్తి : ఏనుఁగు. 'హత్తి నాదంతి' (వేంకటే. తిర్య. 93; సాంబ. తిర్య. 72) ; '....సింగంబనా హత్తిగొంగ....' (చౌడప్ప సీసములు 10)15, తా వాచకము. బత్తి వర్తిల్ల నారాచహత్తి వలికె' (బహులా. 3-30).

ప్రాకృత. హత్థి.

సంస్కృత, హస్తిన్.

4. హనుమ : హనుమంతుఁడు. 'హనుమకనిలజుఁ డనియెన్' (అరణ్య 3-345).

ప్రాకృత. హణుమ—, అణుఁఅ.

సంస్కృత. హనుమత్, హనూమత్.

---

14. వీనికి అత్తెము, అనుమ, అరిదళము, అరుసము, అళది, ఆమిక, ఇతవు, ఉడుక్కు ఇట్టి అజాదిరూపములును సిద్ధము. అంచ, ఇంగువ మొదలగు తద్భవములలో హకారాది రూపములు మృగ్యము.

15. చౌడప్ప సీసములు, Ed. by N. S. Sundareswara Rao, Bulletin of the Govt. Oriental Manuscripts Library, Madras, 1950. pp. 55-70.

5. హరిదళము : తాళకము, పీతకము, 'నిద్రమేల్కాంచిన నెత్తమ్మిమొగడల పరువంపుఁ బుప్పొళ్ళు హరిదళములుగ' (కాశీ 1-123) 'హరిదళము చుట్టువెలయ నంతరము గిరి (పార్వతీ. పంచమా. పు 90).

ప్రాకృత. హరి అల, హరి ఆలీ, హరి తాల.

సంస్కృత. హరి తాల-

6. హరుసము : సంతోషము. 'పరహితుఁడైన వానికి శుభంబు లభించినవెల్లవారలున్ హరుసమెకండ్రు...' (ఉ. రా. 2-194). 'హరి రమ్మనియె నటన్నన్ హరుసముతో వారు నలువురతివినయమునన్' (దశా. (9-18).

ప్రాకృత. హరిస -

సంస్కృత. హర్ష -

7. హళ(ళి)ది : హరిద్రావర్ణము. 'హళది పుట్టంబు కటిసీమ నమరు వాని' (పాండు. 3-166). (హళదిపట్టె సమ్మాళిగెల' బహులా 1-105). 'పట్టుతలాడయున్ హళదిపచ్చ...' (పాంచాలీ. 5-10) పై నిండఁబర్విన పద్మపరాగముల్ హళది తాపిత చాయ ననుకరింప...' (వాల్మీకి. ప్రథమా. పు. 29). సబిందుక మనుటకు నిర్ధారక ప్రయోగములు మృగ్యము.

ప్రాకృత. హరిద్దా. హలద్దా, హలద్దీ, హలిద్దా, హలిద్దీ.

సంస్కృత. హరిద్రా

8. హామిక : క్రొవ్వు, గర్వము. మదము. 'హామిక' (రాధికా. 3-3. యామినీ. 4-83), 'హామికల్' సత్యభామా ద్వితీ. : అనిరుద్ధ. 3-102). హామిక సంస్కృతమని శబ్దార్థదీపిక. పు. 1418.

ప్రాకృత. అహమహమిఅ, అహమ హమిగా, అహమహమియా : అత్యుత్కంఠ

సంస్కృత. అహమహమికా.

9. హితవు : శ్రేయము. 'నీవు హితవు క్రియగొనఁగా బల్కెడు వాఁడవు...'

(ఆది. 8-40); యుక్తము. 'హితవుమఱచు రాజులు,..' (శాంతి. 3-247).

ప్రాకృత. హిఅ, హియ -

శౌ. ప్రాకృత. హిద -

సంస్కృత. హిత -

10: హుడుక(కు): చిన్న డమరుకము. 'హుడుకు నాఁదనర్చు హుడుక్కపేరు' (ఆం. భా. 1-128). దేశ్యమనియు, వస్తుతః ఆజాదియనియు ధ్వన్యనుకరణ మనియు దీని వ్యుత్పత్తి వివాదగ్రస్తము.

దే. ప్రాకృత. హుడుక్క: వాద్య విశేషము.

సంస్కృత. హుడుక్కా.

III. కన్నడ పదములు 16: 1. శుద్ధ దేశ్యములు. (ఎ) పతి గన్నడమున పకారాదులుగానుండి, హూసగన్నడమున హకారాదులుగా వికృతులు, తెలుఁగున కర్ణాట దేశానేయములు—

1. హంగు; అనుకూలము, సౌకర్యము, యుక్తము. 'వేసమునకునైన దాసరిగావచ్చు హంగు దప్పువేళ జంగమగును' (వేమన; బ్రౌణ్యము, పు. 1111) 'హంగుగ వేడఁబోయి...' (కవిచౌడప్ప)

కన్నడ, హంగు, పంగు: కృతజ్ఞత, గౌరవము; ఉచితము.

2. హణిగ: నతివిశేషము, ఫాలము వంచి నమస్కరించుట. 'నీలాచలనమున నెలకొను పురుషోత్తమునకు హిణిగలు దండిగఁ జేర్చుచు' (హంస. 4-214)

కన్నడ, హణి; హణె: నుదురు; పణె: నుదురునకు సంబంధించిన.

---

16. రాయలసీమలోని హగరి, హంచన హళ్ళి, హనకనహళ్ళి, హలహర్వి, హవళిగి, హిరేహళ్ళ, హువ్విన హడగలి, హొన్నూరు, హొళగొంది, హొసకోట, హొసపేట, హోతూరు - మున్నగు హకారాది గ్రామనామములు కన్నడ ప్రభావ ద్యోతకములు. హత్తు మువ్వరగండ హన్నిబ్బరగండ ఇత్యాది హకారాది బిరుదావళి ప్రస్తుతపట్టికలో పరిత్యక్తము.

3. హత్తు : జతచేయు, చేర్చు, కలుపు, 'గోదిగజాతిలోఁ గొదమపెంటుల నేర్చిమావుల హత్తించు మార్దవంబు' (విరా. 1-94). 'కుంకుము హత్తించి కొనగోరఁ దీర్చిన...' (ఉ. హరి. 3-86), 'క్రొత్తు లత్తుకహత్తించె...'(నై. 6-44).'మంత్రులీ హత్తియరుగడల నుండఁగ, (ప్రబంధ. 599).

కన్నడ. హత్తు, పత్తు : జోడించు, జతకలుపు.

4. హదను : యుక్తసమయము. అక్కాఱగలతతి. '...మాన్యసుహృజ్జన బంధుకోటికిన్ హదనున మేలు సేఁత...' (నై. 3-14). 'ఓహరి సాహరిం....ఆ హదనం జెలంగు జనమాంతము నూళ్ళకుఁ బోవరామియున్' (ఆము. 4-93, 'హ' ప్రాసఘటితము). 'ముదుసళి లవ్వయుఁ దాతయు, హదనునజనకుండు తీర్థయాత్రకు వెడలెన్' (కృ. శకుం. 3-17).

కన్నడ. హదను, పదను : యుక్తము. తగినది ; కార్యానుకూలము.

5. హరిగోలు : అరిగోలు, ఏఱుదాటుట కుపకరించు తోలుపుట్టి. 'పరంగులహరిగోలు గుంపునా...' (శుక, 3-319).

కన్నడ, హరి గోళ్ : పరుగెత్తు ; హరి = ప్రవహించు ; ప్రవహించుట ; పరి = ప్రవాహము.

6. హరివాణము : తట్ట, పళ్ళెరము. '...కుందనంపు హరివాణమునన్ మధుపర్కమియ్యెడిన్' (వేం. పంచ. 4-356). '...పసిఁడి హరివాణమునన్...మధుపర్కంబునన్' (మను. 5-77). 'పసిఁడి హరివాణముతో' (అచ్చ. రా. బాల. 48). 'తెలెహరివాణంబు తలియ కంచము తట్ట పల్లెరమనఁ జెల్లు భాజనంబు' (వేంకటే. మానవ. పద్య. 47). '...హరివాణమనన్...పళ్ళెరము పేరు' (రామాయణము కృష్ణయమాత్యునిదేశవామార్థకోశము, పద్య. 23). హరివాణము సంస్కృత పదమను కొందఱ (శ. ర... ఆం. వాచ. శబ్దార్థ చంద్రిక, శబ్దార్థ దీపిక, శ. ర. అను.) నిరూపణము నిరాకరము. సంస్కృత కోశములలో మృగ్యము.

కన్నడ. హరివాణ, పరివాణ : పళ్ళెరము, తట్ట.

7. హరువు (ర్వు) : మనోహరము, యుక్తము. 'హరువైనహూణాన్నాణియరఁగుల' (సుదక్షిణా. 5-195). 'జవ్వాది పద విచ్చి క్రొవ్విలుల్మ్రోడిచెఁ

బెన్నెతివేణి కొక వింత హదువు లెసఁగ' (శుక. 1-226). హరువొప్పన్....' (తారాశ. 3-101). 'హరువు మీఱంగఁ గై సేసి...' (దశా. 8-225), 'అందు విశేషములందుహర్వులు' (సారంగ, 2-63).

కన్నడ. హర్వు, హరువు : రీతి ; సాధనము ; యుక్తము.

8. హళ (ళా) హళి : త్వర. 'హళా హళిన్' (మను. 4-98), హళా హళి మెయిరాగ' (సారంగ. 3-117) ; ఉద్ధతి. 'సైనికావళీ హళ హళికిన్ జెడన్విటిఁగె...' (ఆము. 3-16). '...మారుండు తీవ్ర సుమాస్త్ర ప్రహతిన్ హళాహళి యొనర్పన్...' (శుక. 1-199) ; ధ్వని. 'చంచలవీచీ సంచయ సముచిత హళ హళి కలతో రాయంచలు మ్రోయన్....' (కళా. 6-225) 'మంచపు హళ హళలును' (రాధికా. 4-102).

కన్నడ, హళ హళ, హళ హళి, హళ హళికె, ఫళ ఫళ : ధ్వన్యను కరణశబ్దము. తెలుఁగునందలి ఫళ ఫళ, పెళపెళ, ఫెళ ఫెళ — లు దీనికి తోఁబుట్టువులు. 'పెళ పెళ యనుచు నుఱిమె' (విప్ర. 3-54). '... ఫళ ఫళని, దవుడలు కరములఁ దాటించుకొనుచు' (ద్వి. పరమ. ద్వితీ. పు. 138). ఫళ ఫళ పయః పృషత్ప్రరం పరలు గురియ' (హంస. 5-61) ఫెళ ఫెళ ఫెళ మంచు పెటిలు పడిన (దశా. 4-217). 'ఫెళ ఫెళ ఫెళ మంచు విల్లువిఱిఁగె' (దశా. 7-204) తెలుఁగున నివి ఆమ్రేడిత ధ్వన్యనుకరణములు. హళ (ళా) హళి' సంస్కృత సమాసమున నుండుటయె కారణముగా సంస్కృతమని నిరూపించిన నిఘంటుకర్తల నిర్ణయము. అగ్రాహ్యము.

9. హవణికె ; ఒప్పిదము, 'హవణికె' (రాధికా. 1-131); హవణు; రీతి. 'ధవళముల్ విని చొక్కి హవణుఁదెల్పెడు లీల' (విజయ. 1-129): హవణించు ; అందగించు. 'మించు హవణించు కనుంగవ' (సుదక్షిణా. 3-67) 'హవణించు వన్నెదగంవడితట్టు. (సత్యభామా ద్వితీయా.): అలంకరించు. 'పయ్యెద చెంగావి పావడ హవణించి' (తారా. 4-81). 'హవణింపఁగా నేర్చు' (పాండు. 1-52).

కన్నడ. హవణిగె = ఉచితము; ఒప్పిదము; కూర్చుట, చేర్చుట.

10. హాయి; సౌఖ్యము, (హాయిన్నన్ను లాలించి' (సత్యభామా. తృతీయా), 'హాయిగ మను నుచితవృత్తి నచలుండనఁగన్' (పైది. చతుర్థా.) హాయిగా (అహల్యా. 3_97. రాధిగా. 1_145)

కన్నడ, హాయి, పాయ్, పాయి : ఇంపు ; ఆహ్లాదము; సౌఖ్యము. తెలుఁగునందలి 'హాయి' భారతీయేతరమగు అన్యదేశ్యమును చిలుకూరివారి నిర్ణయము (ఆం. భా. చ. పు. 598) ప్రామాదికము.

11. హాళి : వరుస, క్రమము. 'హాళి' నేఁటేఁట మీరు వేటాడుకతన (యయా. 1_106) 'ఆయా వినోదంబులెల్లను హాళిన్ విని' (సారంగ 1_118); ఆసక్తి, ప్రీతి, 'హాళింబుట్టిన కాఁకనొద్దితివి' (జై. 3_42) 'భువనాళిని' హాళిఁ జరింతు' (పాండు. 2_217). 'బ్రహ్మరుద్రాది దేవతా ప్రభులు మీఁది హాళి యును మాని....' (ఉ. రా. 1_28). నీపై హాళిం జిక్కితి' (వి ప్ర. 3_88).

కన్నడ, హాళి, హాటి: క్రమము; నియతి ; యుక్తరీతి

12. హావడి (ళి): ఉపద్రవము. 'సమీపదేశముల్ హావళిఁబోవకుండ ; (విష్ణు పు. 2_132) ...ఇంచుక యల్గెనేని లోకావళి హావళింగను...' (ఉ.రా. 5_76). 'హావడి యావడి యన నుపద్రవసంజ్ఞ...' (ఆం. భా. 2_223): బాధ: చిక్కు. 'వర్షంపు నెవ్వన్ రుజన్ హావళ్ళం దిగుసన్య భూప్రజల... (అము. 4_245). ' మరునిహావళి (హంస. 1_101); కష్టము. 'ఆవర్షాభావిభునకు హావళి దలచయ్యె. (పాండు. 5_309); నాశము, హావడి 'హావడి సేయును. సావడి లింగన్నమంత్రి.' (శేష. 1_84).

కన్నడ, హావళి: కష్టము; చిక్కు ; కలఁత, తొందఱ; హాడు + వళి; హాడు < పాడు; బాధ; నాశము: తద్భవమని డా. చిలుకూరి. కన్నడము నుంచి యని బ్రౌణ్యము, పు 1-129.

హుటాహుటి: గమనవేగము. 'తేరు హుటాహుటింగదలి' (జై. 6_77). 'హుటాహుటిఁజేరనరిగి' (వరాహ. 2_4), హుటాహుటిం బఱచి' (వేం.పంచ. 2-192). ''తవతవలేకరుగుదుము హుటాహుటి నడలన్' (మను. 1_76). హుటాహుటి నడలతో' (శుక. 1_254)

కన్నడ. పుట;పుటపుట, గంతులువేయు; దూఁకు; హుటహుట; 'వీప్సాను కరణా భీక్ష్ణ్య...చాపలాదౌ పదస్య ద్విర్వచనం' అని కర్ణాటక భాషాభూషా భూషణము, 192 సూ, ఇట ధ్వన్యనుకరణము. 'పుటపుటగా వీధివెంట... తిరుగు....' (హంస. 5-24)17.

14. హుళ(ళి)క్కి: అసత్యము, దబ్బఱ; వ్యర్థము. 'ధనము నిప్పచ్చరము విద్యయు హుళిక్కి (కాశీ. 4-111), 'లే దరంబు తత్తడి హుళిక్కి సహాయము సర్వమంగళంబు...' (మను. 4 105), 'హుళక్కి' ('బహుళా. 5-169, యామినీ. 3-129, ఆంధ్రనామసం. మానవ. 58, రాధికా. 4-70), 'హుళక్కి' (అచ్చ. రా. అయో. 32, నీలా. 2-72; రామా. పు.6; పెద్దాడ. శకుం. 1-50) హంస. 2-146, ఆం. భా. 1-119).

కన్నడ. హోళ్ళు. పొళ్ళు.

15. హుసి ; పొల్లు, అసత్యము ; వ్యర్థము '....దివాణపువారి చేతి కాఁకలు హుసివోవఁగా గఱవు కాల మెఱుంగ... ' (శుక. 2-406), 'హుసి యని...పుళిందులు కలుకుమీఱి' (ప్రబంధ. 788).

కన్నడ. హుసి, పుసి ; వ్యర్థము ; పొల్లు, బొంకు ; హుసిగ ; అసత్యవాది ; 'పుసియిల్ల దాట్మ' (వెంకయ చోడని దొంగలసాని కనుమ శాసనము, పంక్తి 21). 'పుసియిల్ల దాట్మ' (= పొల్లుకాని తాలిమి కలవాఁడు) కర్ణాట భాషా ప్రభావద్యోతకమగు బిరుదము. 'నీకేద నిజభక్తి నీకేదపాటి, పుసిగప్పు మాటలఁ బ్రొద్దుపుచ్చితిరి, వసుదేశులే యూరు వ్రతము లేయూరు....' (చిత్తారు-గంగాధర కవికృత మగు భల్లాణ చరిత్ర. పు. 61). పుసి > పొయ్, పొయి ; కృత్రిమము, మాయ ; పొయిదల : కృత్రిమ శిరస్సు, చోరసాధన విశేషము. 'పొయిదల నీలిడిం డొలికి బూడిద ముండులబంతి...' (దశకు. 5-72) ; పొయ్ + ంకు > బొంకు : అసత్యము.

16. హూ : పూవు. 'వలపలి చలిగాలి వలన నల్లాడు, వెలఁది హూబాశెలె వీచో పులుగను' (ద్వి. పరమ. తృతీ. పు. 241).

17. Cf. మరాఠీ. హుట హూరణేఁ. అ. క్రి. ఆత్రపడు, సంస్కృతము నందలి 'హూడ్' గతౌ (ఆత్మనే.) హూడతే - తో ముడిపెట్టుట చింత్యము.

కన్నడ. హూ, పూ; హూవు, హువ్వు : కుసుమము.

17 హెగ్గడి : పరిచర్య నిమిత్తము రాజసన్నిధినుండు వ్యక్తి. హుజూరుత్తైనాతి హెగ్గడి (కువల. 4-40) 'హెగ్గడులు' (కళా. 8-30, బహులా. 3-23). '...వాకిటివారి నచటి హెగ్గళ్ళఁ బరిచారకులఁ బెక్కు భంగుల నడిగి' (ద్వి. పరమ. తృతీ పు. 209). 'హెగ్గడుల్ కైవార ముగ్గడింప' (పాంచాలీ. 2-13), 'హెగ్గడి కత్తియలు' (శుక. 3-315, తపతి. 1-12 రాధికా. 3-5), 'హెగ్గడికత్తెలు' (కళా. 2-73)18.

కన్నడ, హెగ్గడె, పెగ్గడె : ప్రధానమంత్రి; పర్యవేక్షకుఁడు; కంచుకి; పెగ్గడె < పెర్‌గడె. పెర్‌గడ అనునది తెలుఁగున వర్ణవ్యత్యయమునంది ప్రెగ్గడ ప్రెగడ యయినది. కన్నడమున వర్ణసమీకరణమునంది పెగ్గడె, హెగ్గడె యయినది. అమాత్యుఁడు, నియోగి అను నర్థముల తెలుఁగున ప్రెగ్గడ ప్రసిద్ధము. 'దగ్గఱ కొండెము చెప్పెడు ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుఁడై మఱి దానెగ్గు ప్రజ కాచరించుట' (సుమతి). 'ప్రెగడల మనసులు విరసము - లగుగతి...' (ఆశ్రమ. 1-70). భృత్యులుఁగరణముల్ ప్రెగడలుగాగ' ('పండితా పర్వత. పు. 474). అక్కనప్రగడ, అన్నాప్రగడ, కేసనప్రగడ, చెన్నాప్రగడ, తల్లాప్రగడ. మంత్రిప్రగడ, మానాప్రగడ, యల్లాప్రగడ, రామాప్రగడ. రెబ్బాప్రగడ, విస్సాప్రగడ, సిరిప్రగడ - మొదలగు గృహనామములలోని ఉత్తరభాగమగు 'ప్రగడ పెగ్గడకు వికృతి. మన కవులలో ఎఱ్ఱన యొకఁడే 'ఎఱ్ఱాప్రెగడ'గా కీర్తితుఁడు. ఈ 'హెగ్గడి' సంస్కృత 'హేడక' పదజన్యమను అంచనా అగ్రాహ్యము. కన్నడమునుండి యని ద్రావిడ్యము, పు. 1133.

18. హెగ్గాళ; పెద్దకాహళ. '...తద్దళ కంతు వెట్టనెదురున్ రాకాసు లవ్వేళ హెగ్గాళల్ వట్టిరి...' (రామా. 8-74); హెగ్గాళెలు (అ. మ. క. పు. 191).

కన్నడ. హెగ్గాళె, పెగ్గాళె, పెర్‌గాళె; పెర్ (= పెద్ద) + కాళె (= సం, కాహళ).

---

18. హిగ్గడ్తి, హిగ్గడికత్తె, హిగ్గడు, హొగ్గడి (ద్రావిడ్యము, పుటలు 1130, 1133, 1136) అను రూపములు పరిహార్యములు.

19. హెచ్చు : అతిశయము ; అతిశయించు, వర్ధిల్లు. '....అమరవరుల మొనలకున్ హెచ్చుగ దిక్పతిసేసలు వచ్చుటయును...' (నిర్వచ. 6-126). 'రాలచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే హెచ్చగుఁ గుండ గున్....' (విరా. 4-234). 'హెచ్చుగుందాడఁ బని లేదు...' (హర. 4-22). 'మన కనురక్తి హెచ్చ నిదెమందని కంఠముఁ గౌఁగిలించి....' (ఆము. 1-70).

కన్నడ. హెచ్చు, పెచ్చు పెర్చు : అతిశయించు, వృద్ధి యగు, పెంపొందు.

20. హెద్దొర : పెద్దనది ; ఒకానొక నది. 'ఉరవడి నుప్పొంగి యుడు వీథి దాఁకి, హెద్దొర యనునది యిలనిండి పాఱఁ' దద్దయు నుద్వృత్తి ధరఁదన్ని నిలిచి... (బస. పు. పంచమా). 'హిద్దొర యనునది యిల నిండిపాఱ' అని కాశీనాథుని నాగేశ్వరరావుగారి ప్రతి, పు. 160 ; వావిళ్ళవారి ప్రతి, 1952, పు. 376 'హెద్దొర యనునది యిల నిండి పార' (అని తాళపత్రప్రతి, ఆంధ్రవిశ్వ కళా పరిషద్గ్రంథాలయము. నెం. 32377, 281 వ ఆకు. రెండవవైపు, 1వ పంక్తి). హెద్దర యనునది యిలనిండి పార (ఆం. విశ్వ. గ్రంథాలయ తాళ పత్రప్రతి, నెం. 29745, 103 వ ఆకు. రెండవవైపు), బ్రౌనుదొరగారికి లభ్యమయిన తాళపత్రప్రతులయందును 'హెద్దొర' యను పాఠమే ఉండినట్లు స్పష్టము (చూ. బ్రౌణ్యము, పు. 1134) ; తులనాత్మక పరిశీలనము వలనను 'హెద్దొర' యే సాదుపాఠము19.

కన్నడ, హెద్దొఱె, పెర్దొఱె, పెర్ + దొఱె (పెర్ < పేర్ = పెద్ద). కన్నడ బసవపురాణమునను 'హెద్దొఱె' యను పాఠమే కలదు.

21. హేమా హేమీలు : దొరాదొరలు ; అధికులు, పూజ్యులు ; ఘనులు. (వరాహ. 10-8, హంస. 1-212), 'బహుత నన్యులఁ దెల్పు పట్ల హేమా హేములను పల్కు పూజ్యార్థమగుచు నుండు' (ఆం. భా. 3-16). భారతీయేతర మయిన అన్యదేశ్యమని డా॥ చిలుకూరి (ఆం. భా. చ. పుటలు 593, 598).

---

19. 'కనియెన్...స్వర్ధునికిన్ బెన్నుద్ది హొద్దారు పరనది...' (పిడవర్తి బసవ పురాణము, 5-200, వావిళ్ళ, 1925), ఇందలి 'హొద్దారు' సాదు పాఠముగా కన్పట్టదు. 'హెద్దొర' అని యుంట యుక్తము.

హెడ్ మాస్టర్, హెడ్‌మిస్ట్రెస్‌లే (పొడి అక్షరాల కూటమిచే) హేమాహేమీ లయినా రని మిత్రులు, ఏలేశ్వరోపాధ్యాయులు శ్రీ సురభి నరసింహముగారి చమత్కారము.

కన్నడ, హెమ్మె : ఆధిక్యము ; ప్రభుత ; శ్రేష్ఠత ; ప్రభవిష్ణుత ; హెమ్మెగాఱ ; ఉద్ధతుఁడు ; అధికుఁడు ; గర్వి : పెర్మె ; పేర్మి, *హెమ్మె హెమ్మె. వీప్సాద్యర్థేషు వివక్షి దేవ పదస్య దిర్వచనం భవతి' (కర్ణాటక భాషా భూషణ వృత్తి, పు. 70).

22. హేరాళము : ఆధిక్యము ; సమృద్ధి. 'ఎడవెల్లివనులేక పెక్కు-దినముల్ హేరాళమై వర్షముల్ జడిగాఁబట్టి...' (హర. 2-26), 'ఇంద్రాణితోఁ గూడ హేరాళముగఁ దీర్చెఁజాముండదివ్యభూషావ్రజంబు' (పైది 4-90), 'ఘనము హేరాలమబ్బె...' (కాశీ. 7-254). హేరాళపుంగాంతులన్' (మను. 5-48). 'హేరాళములైన మోహపువిరాళి తనంబుల' (విష్ణు పు 6-21). హేరాళంబగు వేడ్క' (దశా. 2-419) ; హేరాళము సంస్కృత మను మన నిఘంటుకారుల నిర్ణయము సత్యదూరము. హేరాళక్రీడా సంచారిణి నూశాంబ భక్తజన రక్షకునై, (భీమ. 1-101), ముక్తికాంతా హేరాళసుఖంబు గోరెవవు' (నిరంకుశో' 3-44) మున్నగు ప్రయోగములు ఉద్ధతులగు ఆయా కవుల ప్రౌఢవాక్పాటవమునకు నిదర్శనముగా స్వీకరించుట సముచితము.

కన్నడ, హెరాళ, పేరాళ : ధారాళము, వెగ్గలము ; ఔదార్యము ; విస్తారము ; ఆధిక్యము.

23. హేళగీఁడు : కథలు చెప్పువాఁడు. 'హొరిఁగులచ్చిరియారు భువి హేళగీఁడు' (బసవ. పు. ద్వితీ. పు. 165)20.

కన్నడ, పేట్, పేటు, హేటు : చెప్పు, పేర్కొను ; పేటికె, హేటికె: కథనము ; ఆజ్ఞ ; హేళిగ.

---

20. హేళగి (K) a large basket, బ. పు. 2-986 అను ప్రౌఢ్యము (పు. 1135) నర్థము సరిపడదు.

24. హొనరు : అందము ; ఇంపు : పొందిక. 'పెంపుమీఱు వసంత షేషవా హుజూరుననుండి చెలామణి హొనరు దెలుప...' (అనిరుద్ధ. 3-19), 'నీ హొన ల్లెల్ల నేర్పుఱుపు నేర్పరి వౌదువు విస్ఫుర ద్వరా రోహయటన్న పేరు దగు రూఢిగ నీ యెడ సుందరీమణీ' (గోగులపాటి కూర్మనాథకవి సుందరీమణి శతకము, పద్య. 37).

కన్నడ, హొణరు, పొణర్, పొణరు : కలయిక, చేర్పు ; జోడు ; అందగింపు.

25. హొన్ను : బంగారము ; బంగారు నాణెము. 'లాలనతో నిచ్చె లక్షహొన్నులను' (చితారు గంగాధరకవి శృంగార భల్లాణ చరిత్ర. పు. 20). హొంగాశె ; హెంగిండ్లను' (కృష్ణరా. 4-75). 'హొంగుబ్బలి' (అచ్చ. రా. యు. 598). 'హొంగోక' (రాధికా 1-78). 'హొందగటు' (యామినీ. 4-70), 'హొన్నంచు' (మను. 5-42, ఘటికా. 2-11, ప్రబంధ-605, దశా. 2-66, హంస. 5-359). 'హొన్నందెలు' (ప్రబంధ. 273). 'హొన్నాణి యరఁగుల' (సుదక్షిణా, 5-195) 'హెన్నాణిపట్టు' (వైది. 2-128). 'హెన్నుజిగిమేనులు' (ఉ. రా. 5-248), 'హొంబట్టుకులాయలు' (దశా. 7-34), 'హొంబట్టు గవిసెన' (వాల్మీకి. తృతీ. పు. 119). 'హొంబట్టుజిలుగు రెండెంబు' (ఆము. పీఠిక. 12), 'హొంబట్టు తలగడ' (ప్రభా. 4-144), 'హొంబట్టు దట్టి' (సారంగ. 1-79), 'హొంబట్టు పట్టెడ' (వైది. 3-147), హొంబట్టుపఱపు' (రంగా. 3-254). 'హొంబట్టుపాగ' (కళా. 8-35). హొంబట్టుపుట్టముల్' (పాండు. 1-165). 'హొంబట్టు బటువులలో' (కళా. 2-157) 'హొంబట్టుబొందు' (యామినీ. 4-70). 'హొంబట్టు రవిక' (పల్నాటి. పు. 65), 'హొంబట్టులోడీలు' ;(హంస. 5-360), 'హొంబట్టు వలెవాటు' (పాండు. 1-198). 'హొంబట్టుహరువుతెర' (భోజ సుతా. 4-112), 'హొంబుట్టము' (రామా. 3-35), 'హొంబొమిడిక' (అచ్చ. రా. సు. 34).

కన్నడ, హొన్, హెన్ను, హొం, పొన్, పొన్ను, పొం : బంగారు ; బంగారపు.

26. హొమ్ము : స్థూలమయినది ; పెంపు ; అతిశయము. 'హొ మ్మైన కుతి నీ గుడారులోన' (సత్యభామా. తృతీ). 'తోరముహొమ్ము...స్థూలము చెలంగు' (సాంబ. మానవ. 49).

కన్నడ, హొమ్ము ; వృద్ధి, పెంపు ; స్థూలమగు, దళసరియగు.

27. హొయలు : విలాసము. 'వివిధ విచిత్ర నవీనవస్త్రముల నవధరించిన లింగ నివహంబు హొయలు' (పండితా. పర్వత. 319). 'హొయలు గుజ్జరినేఁత' (సారంగ. 3-147), "హొయలుగా గంధంబు మెయినిండఁ బూయుచో..." (రాధామాధవ సంవాదము, పు. 10). 'ముద్దు గుమ్మ హొయలు' (హంస. పు. 2-146), 'హొయల్ బండులు' (ప్రబంధ. 605).

కన్నడ. హొయల్, హొయిలు.

28. హొరంగు : విలాసము. 'బంగారు హొరంగు సింగపు రతనంపు గద్దియ' (కృష్ణరా. 1-20), 'మేల్ హొరంగు చందువలు' (తారాశ. 4-170). 'తళుకు హొరంగు పెండియము' (రాధికా. 2-107), 'దానిహొరంగు' (సత్య భామా. తృతీ.).

కన్నడ. హొరె, పొరె = వర్ధిల్లు, అతిశయించు: ఉత్సాహము

29. హొస : క్రొత్త, నవీనము, 'హొసయనంగ మీఱునవంబు' (ఆం. భా. 3-23) 'హొసతమ్మి' (ప్రబంధ-750) హొసపరి : మనోహరము, సుందరము. 'బిసబిస విసరెడి హొసపరి సురటిపిట్టల...' (రాధికా. 4-102) 'ఈహొస' మన అకారాది నిఘంటువుల కెక్కలేదు. క్రొత్తది. నూతనము, నవము, అను నర్థములతో 'హాస'యను ఆరోపము కొన్నింట (లక్ష్మీనా: ఆం. వాచ.) సంగ్రథితమయి ఆంధ్రభాషార్ణవ ప్రయోగమే ఉదాహృతమగుట వింత. ఈ నిఘంటువులను నమ్మిన శబ్దార్థదీపిక (చూ. పు. 1419)యు 'హాస'ను ఆరోపముగా నిచ్చినది 'క్రొత్తమిహి హొసయనంగ మీఱును నవంబు' అను ఆంధ్ర భాషార్ణవము నందలి 'హొస'ను 'హాస'గా పఠించుటవలన కలిగిన తబ్బిబ్బిది. ఆంధ్ర భాషార్ణవము ముద్రిత ప్రతులు – చెన్నపురి, వ - ఎతిరాజులు నాయునిచే శ్రీ చింతామణి ముద్రాక్షరశాలయందు, 1899 లో ముద్రితమయి

ప్రచురితమయిన ప్రతి. (పు. 80). 1912, 1931 నాఁటి వావిళ్ళ ప్రతులు (పు. 88) — 'హాొస' పాఠఘటితములు — 'హా', 'హాొ'లు రెండును కంటికి ఒకటిగా కన్పట్టునవి కావున ఈ ప్రమాదము దొరలియుండ నోపు। లేక లక్ష్మీనారాయణీయ కర్త చూచిన అం. భా. ప్రతిలో 'హాస'యను పాఠమే ఉండిన దేమో ? ఏది ఎట్లుఁయినను 'హాస' పరిహార్యము21.

కన్నడ. హొస, పొస : క్రొత్త; క్రొత్తది. క్రొత్తదనము; హొస గన్నడ ;నవీనకర్ణాటభాష; హొసపేట: క్రొత్తపేట (= ఒకానొక పట్టణ నామము); హొసదు = క్రొత్తది.

29a. హోర; నేర్పు, ఉపాయము; తెలివి. 'హోరగల కోరమీసల హొయలువాని' (కృ. శకుం. 2–45).

కన్నడ, హోరిగె, హోరె, హోరెవు : ఉద్యమము, వ్యాపారము; సామర్థ్యము.

30. హోరాటము : ఆటోపము : వేగిరపాటు, సంభ్రమము; వివాదము. '...వీరోద్రేకంబున దాపలన్ వలపలన్ హోరాటమైయుంచి సర్వద్రోహిం బరిమార్తమంచు...' (నిర్వచనో. 6–132) 'ఒకనాఁడా తమ ముందటన్ బలుమలున్ హోరాటమై నేలయెత్తికొనంగా బవరంబులన్ గెలువఁగా....' (ఉద్యో. 1–280).

కన్నడ : హోరాట, పోరాట : బాహా బాహి యుద్ధముచేయుట ; ద్వంద్వ యుద్ధము. వివాదము, వాగ్వివాదము ; ప్రతిభటత్వము.

---

21. అత్యంతము, మిక్కిలి అను నర్థములతో 'హాలెము' అను ఆరోపమును ఇట్టి తబ్బిబ్బుల వలననే కొన్ని నిఘంటువుల (ఆంధ్రపద పారిజాతము, పు. 792, లక్ష్మీనారాయణీయము, పు. 822, అం. వాచ. పు. 2814, శబ్దార్థచంద్రిక, పు. 931, శబ్దార్థదీపిక, పు. 1419)లో కృతకముగా మూర్తికట్టుట. వాస్తవముగా నిది వాలాయమునకు రూపాంతమగు 'వాలెము'ను 'హాలెము' అని పఠించుటవలన దొరలిన తప్పు. 'హార్యము'ను పరిహార్యము.

31. హోరాహోరి : అవిరామమగు పోరు, నిరంతర కలహము. '...విజిగీషువులై హోరాహోరిం బోరిరి.....' (ఆము. 3_15). 'హోరాహోరిఁగా బోరి రిట్లిరు వాగుం దొరలంత...' (రంగా. 3_76); పట్టినపట్టు వదలకుండుట. '....చవిగాని యిందులకు హోరాహోరిగాఁ బోరి యేలావాలాయము సేయఁగా....' (మను. 3_94).

కన్నడ : హోరు, పోరు; యుద్ధముచేయు; వివదించు; పోరాటము; వివాదము. ఆభీక్ష్ణ్యమందు ద్విరుక్తి[22].

(b) వర్ణవ్యత్యయము వలన పదాదిగా మాఱిన కన్నడ దేశ్యము.

32. హవుదు : రూ. హౌదు. అవును, అంగీరమును దెలుపుమాట. '...బిరుదు పచారించి యచ్చాటుకారుల్ హవు దప్పా పాత్రరాయా యహహా బళి బళీయంచుఁ బెల్లెచ్చరింపన్...' (వైజ. 1_128); 'అమ్మకక్కా శబాసు మేలు హవుదంచు ఫణీశ్వరుఁ జూచి...' (కువల. 4_113).

కన్నడ : హౌదు, హవుదు < అహుదు < అప్పుదు (= అగును; ఇట్లే హీగె < ఇహగె (ఇట్లు. ఈ రీతిగా),

హౌదు : చూ. హవుదు. 'ఔనే ముద్దులగుమ్మ మేల్కొతవునే యందంపు పూరెమ్మ హౌదేనే చక్కదనాలయిక్క....' (బ్రౌణ్యము. 1137). 'సామి చిత్తేశ హౌదయ్యసాహేబు పరాకంచు' (విద్యావతీ దండకము[23], పు. 93). 'హౌదయ్య సంచారి భావంబు లౌనౌను విశ్రామ చాతుర్యమున్...' (పైది. పు. 99).

(c) నిసర్గముగా అజాదిరూపమైయుండి హకారాదిగా మాఱిన కన్నడ దేశ్యము.

---

22. ఇట్టివి ఆమ్రేడిత ధ్వన్యనుకరణములని డా. చిలుకూరి నారాయణరావు, ఆంధ్రభాషా చరిత్రము, పు. 502.

23. విద్యావతీ దండకము, గణపవరపు వేంకటకవి (క్రీ. శ. 1670) కృతము. Bulletin of the Govt. Oriental Manuscripts Library, Madras, vol. I. No. 1, 1948.

33. హడపము: వక్కలాకుల తిత్తి. 'ముప్పిడి హడపంబు' (ద్వి. పరమ. తృతీ. పు. 193), 'కాళాంజి హడపంబు' (పైది. పంచమా. పు 427)24.

కన్నడ, హడప, హడపగాఱ, హడపవళ: అడపమువాఁడు; అడప, అదపగాఱ, అడపవళ; అడకె, అడికె: పోఁకచెక్క; అడకొత్తు. అడకోతు; అడకత్తెర;

తమిళ. అడైప్పై; తాంబూలపుతిత్తి; అడై: తమలపాకు; పై: తిత్తి, పొది,

దే. ప్రాకృత. హడప్ప: తాంబూల కరండము; ఆభరణ కరండము.

అ మాగధీ. హడప్ప: తాంబూలపాత్ర; కాని, యిది శుద్ధద్రావిడ పిండము. అజాది రూపమే నిసర్గము.

II. కన్నడమున సంస్కృత ప్రాకృతభవము లయి తెలుఁగున ప్రతిదేయములు:

34. హజ్జ: అడుగు, పాదము. 'ఏనుంగు హజ్జలోనెల్ల సత్వంబుల హజ్జలు నడఁగినయట్ల పోలె..., (శాంతి. 2-239), 'బలుహజ్జ మెకపుదాఁటులు' (అచ్చ. రా. యు. 184), 'హజ్జలిడున్ గుజ్జు తల్లి యానందింపన్' (దశా. 5-70).

కన్నడ, హజ్జె, పజ్జె < ప్రాకృత. పజ్జ- < సంస్కృత, పాద్య: పాద సంబంధి.

35. హణ: నాణెము. ప్రాఁతహణఁ జూచి నాడెంపుఁ బణ మటంచు' (బహులా. 5-14), 'శాంతుల సొమ్ములు వెలచేఁ గొంత, పడిం గొంత, కొలను గొంత, హణాచిన్ గొంత హరించు...' (పైది. 5-13).

---

24. 'హాదులనియు వీలుగు లోనగువాని తొలి హల్లునకు లోపంబు బహుళంబుగ నగు' (సూ. 10 ప్రకీ; బాలవ్యా.) క్రింది పట్టికలోని 'హడపము' అజాదిగా పరిణతమయ్యె ననుట వ్యుత్పత్తి పరముగా విపరీత రీతి.

కన్నడ. హణ, పణ; సంపద, డబ్బు; నాలుగణాల ఎనిమిది దమ్మిడీల విలువకలిగిన ఒక ప్రాంతనాణెము.25 >(ప్రాకృత. పణ<సంస్కృత. పణ—: ఒకనాణెము:) ఆస్తి, సంపద; జీతము; సంపాదన.

36 హంపి: పంపాక్షేత్రము. పంపాసరోవర తీరస్థము. 'అనగ మాన సమున నుండి హంపినుండి... వచ్చె...' (కకు. 2-78).

కన్నడ హంపె, పంపె: పంపాసరోవర తీరస్థమగు నొక పట్టణము> సంస్కృత. పంపా: దండకారణ్యమందలి ఒక సరస్సు; ఒకనది.

37. హరిగ; కేడెము. 'దురమున లక్ష్మణుండు నిహతుండగుడున్ గుఱుదచ్చలంబునన్ హరిగయువాలుఁ గైకొని...' (జై. 6-189) 'హరిగలు తాటించి' (ప్రబంప. 89). కన్నడ. హరిగె పరిగె: డాలు, అడ్డణము> ప్రాకృత. ఫరఅ. ఫరగ, ఫలగ >సంస్కృత. ఫరక, ఫలక.

38. హసాదు: గొప్పవారి యాజ్ఞను విధేయులు మంచిదని యంగీకరించుటయందు వచ్చునది. (శ. ర.) 'అనిన భీతిలి హసాదని మంత్రులెల్ల -వెను వెనుకకె వచ్చి వెలవెలంబాఱి' (ద్వి. పరమ, తృతీ. పు. 200). 'సామిహసాదని వారలూఁకొనన్' (సారంగ. 1-30) 'అతఁడు హసాదటం చతిరయంబున లంకకుఁ బోయి...' (ఉ. రా. 2-235). '...సృష్టి సేయుమని శ్రీకాంతుండు పంపన్ హసా దని వాణీశ్వరుఁడు...' (దశా. 1-305). అని పద్మాక్షుఁడు పంపఁ జక్రము హసా దంచున్...' (పైది 6-69). కన్నడ, హసాద, పసాద: బహుమతి. ఉడుగర <సం. ప్రసాదః నివేదనము; బహుమతి, ఉపహారము.

---

25. ధ్వనిపరిణామ సూత్రబద్ధములైన స్వల్ప రూపభేదములతో భారతీయ భాషలన్నింట 'అణా' (= రూపాయలో పదునాఱవ వంతు) వ్యవహృతము. దీని వ్యుత్పత్తి యిందాఁక అనిశ్చితము. నాయూహ యిట్లు: కన్నడమున 'హణ', 'పణ' శబ్దజన్యము 'హణా', 'అణ'గా పరిణతమయి కన్నడమున అణా, అణె, అణె రూపములు సిద్ధము. కన్నడమునందలి 'హణ' నాఁటి పెద్ద నాణెమగు వరహాలో పదునాఱవ వంతు. అర్వాచీనకాలపు నాణెమగు రూపాయలో పదునాఱవ వంతు 'అణా'. నా యీ సమన్వయము సమాదరణీయ మగుచో అన్ని భాషలకును కన్నడము పెట్టిన భిక్ష 'అణా'; ఆంగ్లమునందలి 'Anna' హిందీనుండి యని ఆంగ్ల నిఘంటువులు. Vide: Rev. Dr. Skeat, C. T. Onions etc.

39. హోంతకాఁడు (రి) : సాదనకాఁడు ; గరిడి పనులలో పరిశ్రమించి గడిదేరినవాడు. జెట్టి తండంబుతోడఁ జేపట్టి హోంతకారి విరిచినయట్టుల గలిక విఱుతు' (వి. రా. 1_80), 'బ్రహ్మాండమన్ గరిడిన్ గాలపు హోంత కాఁడు....' (మను. 3_59) 'గరళంబు మ్రింగు బింకపు హోంతకారికిఁ గడిఁదియే యవనాళుగ వ్రజములు' (వేల్పూరి - విస్సనకృతమగు విశ్వేశ్వర శతకము[26]. పు. 66), గరిడిలో నెఱహోంతకాఁడులై సాముల మీరిన రాజ కుమార మణులు....' (హంస. 2_10). 'హోంతకారి' (కువల. 4_96). 'హోంతకారి కవీంద్రులు' (తపతీ. 1_14) 'బిరుదువేసిన జెట్టి పరివారమగునట్టి వారొప్పుదురు హోంతకాఁడులనఁగ...' (ఆం. భా. 2_208) : నేర్పరి 'కలికి వయ్యారి బాగుగు హోంతకారి' (ప్రసన్న వెంకటేశ్వర విలాస యక్ష గానము[27].)

కన్నడ. హోంతకార, హోంతకాతి, హోంతగార (తి) : నేర్పరి ; శూరుఁడు ; సమర్థుఁడు ; హోంత : పథము, దారి > సంస్కృత. ? పంథ___.

40. హోళిగ (లు) ఒబ్బట్లు, భక్ష్య విశేషము.

కన్నడ, హోళిగె, పోళిగె < సంస్కృత పోలికా : చూ. ప్రాకృత. పోలిఅ, పోలీ.

IV. అన్యదేశ్యములు[28] : నవీనోత్తరాహ భాషలనుండియు, భారతీయేతర భాషలనుండియు ఎరవుతెచ్చిన పదములు ఇట ఉద్దిష్టము. తిక్కన్న

---

26. శ్రీధరమూర్తి, శరభయ్యగారలచే సంపాదితము. Bulletin of the Govt. Oriental Manuscripts Library, Madras, Vol. XI, Nos. 1, 2, 1958.

27. ప్రసన్న వెంకటేశ్వర విలాస యక్షగానము, కర్ణాట రాయదళవాయి రాయ దుర్గము తిమ్మ భూపాల(క్రీ. శ. 1732) కృతము.

28. అన్యదేశ్యములనుగూర్చి ప్రత్యేక పరిశ్రమ చేసినవారు : ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను, మిశ్ర బ్రౌణ్యము, 1854 ; వా. చిలుకూరి నారాయణరావు, ఆంధ్రభాషా చరిత్రము, 'తెనుఁగునఁ జేరిన యన్యదేశీయ శబ్దజాలము, పుటలు 575_621 ; నిడుదవోలు వేంకటరావు, శ. ర., అనుబంధము, 1958, పుటలు 98_111.

చివరిరోజులలో గాలివాన చినుకుపాటుగా అక్కడొకటి యిక్కడొకటి చెదరు చెదరుగా పడి చెమ్మగిల్లి, శ్రీనాథుని హయామునకు చేరెడు చెలమగా రూపొందిన అన్యదేశ్య బిందురాశి, ప్రబంధ యుగము నాటికి ఆంధ్రభాషా స్రవంతిలో చిఱుపాయగా పెంపొందుట చారిత్రక సత్యము29. క్రీ. శ. పదునెనిమిదవు శతాబ్దాంతమునకు ఆంధ్రకావ్య ప్రయుక్తములగు ఇట్టి అన్యదేశ్యములు వేయికి పైమాట యని ఈపాయ అట్టు పుట్టాన వాళ్ళ నెఱుఁగ కృషి సేయుచున్న మా పరిశోధక విద్యార్థి లకంసాని చక్రధరరావు అంచనా. కావ్యప్రయోగ సహితముగా మదీయ పరిశీలనమున నిర్ధారితమయిన హకారాది పదజాలము ఈ శీర్షిక క్రింద సంగ్రథితము. 'హసనల్లి ఖానుండు' (రంగా. 2–248), 'హసను బేగు' (పద్మనాభయుద్ధము, 117). 'హిరాయత మొహదీన్ ఖాను' (రంగరాట్. పీఠిక, 106). 'హుమామియా' (యయా. 1–16). 'హుసేన్ దాసవర్య' (గంగనపల్లి హుసేన్‌దాను శతకము). 'హైదరుజంగు' (రంగా. 1–142) మొదలగు వ్యక్తి నామవాచకము లిందు పరిహృతము.

1. హజరతి : పూజనీయుఁడు, మాన్యుఁడు. 'హజరతి మొఖిదుంజి ఖాదిరి' (యయా. 1–67), 'హజరతి శేఖు బుదురుది ఖాదిరిని మదిందలంచు శేఖిభరాముండును...' (పైది).

మరాఠీ. హజరత : పవిత్రత, శ్రేష్ఠత; పూజ్యతావాచకము.

పారసి. హజ్‌రత్ : ధర్మదేశికులు, దైవభక్తులు, చక్రవర్తులు మొదలగువారి నామములకు పూర్వము చేర్చు పూజ్యావాచకము.

2 హజారము : రూ. హజ్జారము, హోజారము: కొలువుకూటము. ఆస్థాన మంటపము. 'ఇంద్రుని హజారపుమేడ...' (కాశీ. 1-125), 'వాఁడును హజారంబు వాకిట నిలిచి...' (వరాహ. 11–57), 'హజారపుఁ ద్రోవ' (కళా. 2–16), '...హజారమునందు భేరి...చఱపించె...' (విజయ. 3–160) 'కొలువు హజారమై' (రామా. 1–4).

---

29. 'శ్రీనాథయుగము : అన్యదేశ్యములు', 'ఆంధ్రప్రదేశ్' పత్రిక, 1963, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై సంచికలు.

పా. హాజిర్ : సన్నిధినుండు. సేవకు సిద్ధముగానుండు; హాజిరాన్ : సభాస్తారులు; హాజిరీ = ఓలగము వారు. సభ్యులు.

హజ్జారము : చూ. హజారము. 'నగరి హజ్జారమున వాహనంబు డిగ్గి' (కకు. 3-16).

3. హద్దు : అవధి, మేర, 'ఉభయ పక్షంబుల ఒప్పైనబలము - నివ సించి యున్నది నిశ్చలమతిని - హద్దులు చెప్పెద నవి చిత్తగింపు...దక్షిణదిశ హద్దు తగ వివరింతు...పడమటికిని హద్దు బాలచంద్రుండ. కొదమగుండ్ల యనెడి గురిగ్రామమొకటి' (పల్నాటి. పు 87), 'హద్దు ముద్దు మీఱి' (రాధికా. 3-47). 'పెద్దజీకంబులు ప్రియములు—హద్దుగ...' (శేష. పీఠిక, 48), 'వచ్చెను హద్దుతప్పి బలవర్గము...' (రంగా. 3-62), 'హద్దుపత్రికె' (నెల్లూరు శాసనావళి).

మరాఠీ హద్, హద్ద : మితి, మేర, సీమ.

గుజరాతి. హద, హద్ద, : మేర, అవధి ; అంచు.

పారసి. హద్, హద్ద్ : మేర, పొలిమేర, అవధి ; వేర్పాటు ; అంచు ; లక్ష్యము ; హుదూద్ : హద్దులు.

అరబ్బీ. హద్ : మితి, మేర.

4. హబిశీ : అబిసీనియా దేశీయుఁడు, 'హబిశీ రౌతులనంగఁ దుమ్మెదలు సొంపారెన్' (చారుచంద్రో. 4-46, బ్రౌణ్యమున ఉట్టంకితము, పు. 1123) ; 'హాజీలగు బల్ పదాణి హబిసీల మదంబులు దీఱఁగా...' (పెద్దశిరి విజయము30. పు. 59), 'హబిసీలకు లెక్కలుచూచి' (పైది. పు. 58).

మరాఠీ. హప్శీ, హబ్శీ : అబిసీనియా దేశీయుఁడు ; హబ్ (బ్) సాణ : అబిసీనియా దేశసంబంధి.

---

30. మల్లంపల్లి శరభేశ్వరశర్మ సంపాదితము. Bulletin of the Govt. Oriental Manuscripts Library. Madras, 1952. Vol. V. No. 2.

గుజరాతి. హబ (బ) శీ: అబిసీనియా దేశీయుఁడు; హబ (బ) సణ: అబిసీనియా స్త్రీ, పారసి. హబ్ శ్ = అబిసీనియా వ్యక్తి; హబశీ; అబిసీనియా (ఎథియోపియా) దేశమునకు సంబంధించిన; నల్లజానిస.

అరబీ, హబ్ శ్.

5. హమరావు: రూ. హుమ్మరావు; అంగరక్షకుఁడు; సహచరుఁడు. 'అమిత విక్రముల్లైన హమరావులొకచోట' (రంగ రాట్. పీఠిక, 14). 'ఫౌజు దార్లు హమరావులును కిలాదారులు' (వైది. 112). పారసి. హమ్‌రవ్: సహ యాత్రికుఁడు; హమ్‌రాహీ: సహచరుఁడు, మిత్రుఁడు; హమ్‌రూ: ముఖాముఖి; హమ్; సమత; అన్యోన్యము; రవ్: ప్రయాణము, దారి; ఉమరా?: అమీర్ అనుదాని బహువచనము, రాజకుమారులు అని యర్థము. 'ఉమరా?'ను మూల ముగా భావించినచో ప్రస్తుతారోపము 'హుమరావు' అని యుండనగు; ఈ పక్ష మున 'హుమరావు' కృతక ప్రామాణికము (hyper form) 'హదురావు', 'హుదురావు' అని రంగరాట్. ముద్రిత ప్రతులు-ఇంకను విచార్యము.

6. హమా: అన్ని. ఎల్ల. 'హమాదినుసు మేలుసరకు గలిగి' (హంస. 2-232).

పారసి. హమా: పూర్ణము. సమస్తము; హమ్ జిన్స్: సజాతీయ వస్తురాశి; హమ్ జిన్స్: అన్ని దినుసులు.

6 a హమాము: స్నానద్రోణి. మణికర్ణికా తీర్థ మజ్జనంబా! నీకు — మొనసిహమాములో మునుఁగుటరయ' (వేల్పూరి విస్సనకృతమగు విశ్వేశ్వర శతకము, ప. 89).

పారసి. హమామ్: ఉడుకు నీటితో చేయు స్నానము; హమ్మామీ: స్నాపకుఁడు.

7. హరకాలా: వేగులవాఁడు. 'హరకాలాలిటు వచ్చినారు భవదీయా లోకనేచ్ఛా రతిన్...' (రంగా. 2-143), 'హరకాలాల్గాని వచ్చిన పరవానా చూచి...' (వైది, 2-144).

మరాఠీ. హర్కారా: రాయబారి, దూత, సందేశహారి,

పారసి. హర్‌కార్ : సర్వకార్యములు; హర్‌కార : వార్తాహరుఁడు; నియోగి, ఆజ్ఞప్తికారుఁడు31.

8. హరబ్బీ : అరబ్బీదేశము; ఆ దేశపు గుఱ్ఱము. 'దేశభేద హయావిధలు హరబ్బి తురికి' (ఆం. భా. 2_196); అరబ్బీ దేశపుభాష. 'ప్రాస్సు పుడతకీసు హరబ్బి పార్శి తెనుఁగు... మొదలయిన భాషాంతరముల' (రంగరాట్. పీఠిక, 81).

పారసి. హర్బీ : వీరుఁడు; విరోధము; హర్బ్ : యుద్ధము; జరగడము; హరూబ్ దోఁపిడి; కొల్లవెట్టుట (ఈ వ్యుత్పత్తి యింకను విచార్యము).

9. హరాంకోరు : కృతఘ్నుఁడు; దుర్జనుఁడు : పోకిరి 'దగులుబాజి హరాంకోరు వాజు...' (హంస. 5_117); హరాంఖోలైౘా' (ద. హిం - శా, X. No. 751; క్రీ. శ. 1592.)

మరాఠీ. హరాంఖోర : కృతఘ్నుఁడు; నీచుఁడు.

పారసి. హరామ్‌ఖ్వార్, హరామ్‌ఖుర్ : లంచగొండి; హరామ్‌కార్ : జారుఁడు.

10. హల్లా : కోటను ముట్టడించుట, లగ్గపట్టుట. 'హల్లా సేయుదు బొబ్బిలికిల్లా...' (రంగా. 2-54). '...కించిన్మాత్రన్ హల్లాకు నూలు కొలుపుచుఁ జెల్లాకుం జెదరఁజేతు...' (రంగా. 2_247).

మరాఠి. హల్లా : అల్లరి, సందడి (ధ్వన్యనుకరణము).

10a హవా ; బైబిలు పూర్వ నిబంధన ప్రకారము ఆదిమ స్త్రీ; మానవుల మొదటితల్లి. 'అఖిల జగదంబ యన్నపూర్ణాంబికిలను - వ్యర్థమగు పేరు మామా హవాయనంగ - విజిత పరయూష కాశికా విశ్వనాథ !' (విశ్వేశ్వర శతకము).

పారసి. హవ్వా : మానవమాత; మామీ : తల్లి.

---

31. పారసి. 'హర్‌కార్'కు సంస్కృతము నందలి 'సర్వకార్య' జ్ఞాతిపదము. జెండ్ భాషలో 'హౌర్వ' = సంస్కృత, సర్వ—.

11. హసము : దండుకూచి చేయునపుడు రస్తు సరంజామును మోసి తెచ్చెడి పరిచారకులు — 'జతనంబుతోఁ దేఁటి సంచిణీ హసము భిన్నీదుషుదారుగా నిగుడి నడువ...' (అనిరుద్ధ. 3-19).

మరాఠీ. హాళమ్ : అనుయాయి; తైనాతి, నౌకరు ;

పారసి. హాశ్మ్ : సామగ్రి ; హాశమత్ = సేవకులు.

అరబ్బీ. హాశ్మ్ : సరంజాము, సామగ్రి ; హాశ్మత్ : పరివారము.

12 హాకీము : ఏలిక, ప్రభువు. '...భయోక్తులు పల్కు మీరు హాకీము లొకించు కేని పరికింపక ...' (రంగా. 2-151), హాకిముల్ దమ రిట్లు పల్కుటకు నర్థంబే విమర్శింపకన్' (పైది. 2-218).

మరాఠి. హాకిమ : పాలకుడు ; రాజప్రతినిధి ; యజమాని, అధికారి.

పారసి. హాకీమ్ : న్యాయాధికారి ; సేనాని; పాలకుఁడు ; హాకిమీ : పాలన ; ప్రభుత్వము : హాకీమ్ : పదాధికారి; శాసకుఁడు ; స్వామి.

13. హాజరు : రూ. హాజీరు (రాజ) సన్నిధినుండుట. '...అరంగావనీ భర్తదాఁ బంచెన్వీడే వకీలు హాజరుగ...' (రంగా. 2-86). '...శ్రీకృష్ణ చంద్ర దేవు మహారాజులుం గారు అనే మేము హాజరులమై శేవిస్తిమి' (శ్రీ కూర్మశాసనము, నెం. 1192, ద. హిం. శాసనావళి 5వ సం ; క్రీ. శ. 1866).

మరాఠీ. హాజర, హాజరి : సమ్ముఖమున నుండుట, సమక్షము.

పారసి. హాజిర్ : సన్నిధినుండుట ; సన్నద్ధ మగుట.

హాజారము : చూ. హజారము. 'యోజింపు మనుచుఁ బంచిన హాజారంబునకు వచ్చి యమ్మంత్రివరుం దేజాడ...' (రామా. 2-75), 'వారిఁబిలిపించి కవుంగిట గారవించి హాజారమునన్ వసించి....' (పెదగిరి విజయము, పు. 53), 'హాజారము హజారమను నివి...ముఖశాల కలరు...' (అం. భా. 2-14).

హాజీరు : చూ. హాజరు, 'హాజీరయనెదా నౌరోజర్సు మేజువాణి విల్కారావంతి నిలఁగ, (విశ్వేశ్వర శతకము).

14. హాజీలు : చూ. హాజరు. ఎడబాయకుండుట. 'లోలాక్షియుఁ దోడనె హాజీలై రా నారగించి చేఁదొలఁచి...' (సత్యభామా. ద్వితీ.) ; అంగరక్షకులు ఇరు పక్కియల బవిరిగాఁ గ్రిక్కిరిసి హాజీలై తేజీల నెక్కి కుమారలోకమ్ము

నల్లంద్రు క్రమ్మకొని రాఁగ...' (పైది,) 'హాజీరగు బల్పతాణె హాబిసీల, మపంబులఁ దీటఁగా బిరంగీలఁ దెమల్చికాల్చి...' (పెద్దగిరి విజయము, పు. 59).

మరాఠీ. హాజీర్ : సమ్ముఖము.

15. హాలుసాలు : వర్తమాన సంవత్సరము. 'పేపెత్తిపోకుండ నాలవ వాయిదా హాలుసాలునకు కాపయ్యేనందు' (చాటరాతి లక్ష్మినరసకవి పద్మనాభ యుద్ధము, పద్య 42).

మరాఠీ. హాల్సాల్ : నడచుచున్న యేఁడు.

పారసి. హాల్సాల్ = ఈయేఁడు ; వర్తమాన సంవత్సరము ; హాల్ : వర్తమానకాలము ; హాలా : ప్రస్తుతము.

16. హిజుగు : చిక్కు, బంధము. 'మరుహిజుగులు విచ్చఁగ' (పత్య భామా. చతుర్థా).

పారసి హజ్క్ : త్రాటితో బంధించుట ; నొక్కుట ; అదుముట.

17. హిందూ : ఆర్య (వైదిక) ధర్మానుసారి. 'హిందూరావు సుర థాణి...తిమ్మారెడ్డింగారు' (8వ పంక్తి. A. R. No. 469 of 1915 ; క్రీ.శ. 1496) ; 'హిందూరాజ్య రమా ధురంధర....' (మను. 3-142) ; హిందూ రాజ్యసంస్థాపనా' (కావ్యా. సం. 5-243) ; హిందుఖానునిబలావళి' (కువల. 1-32) తురక దొరలము మాకు హిందువులు భరమె' (రంగా. 2-39). మా కలిక్ష్యములుగా హిందూల దోర్దర్పముల్' (పైది. 2-44). 'హిందూ ముస ల్మాను లేకమై భుజియింపఁగా నిచ్చఁగనె జగన్నాయకుండు' (30 వ పద్యం వేల్పూరి విస్సనకృత మగు విశ్వేశ్వర శతకము). 'శ్రీమదఖిల భువన భూష ణంబగు చెన్నపురంబున నున్న వివేక గుణసమృద్ధిగల శ్రీమంతులచేత నిర్మితం బైన హిందూ విద్యా సభలో సంస్కృత పండితుండైన పుదూరి సీతారామశాస్త్రి చేత...' (బాలవివేక కల్పతరు-నేఁటి పెద్దబాలశిక్షకు పూర్వరూపము - పీఠిక, క్రీ. శ. 1853), 'హిందూనరేంద్రులు నందఱు సభఁజేసి....' (చెన్నపురీ. పు. 5). 'హిందువులను పగనాపురమందలదున మంద విభ్రమాస్పందమ్మై

హిందూ విద్యానిలయము...' (పైది, పు. 66), 'హిందువులు నిల్పు షాపులు నం దలరున్....' (పైది, పు 67).

మరాఠీ, హింవనీ, హిందీ, హిందూ : హిందువులకు సంబంధించిన ; హిందూస్తానీ : హిందూస్తానీభాష ;

గుజరాతి. హిందవాని : హిందూ స్త్రీ ; హిందవీ, హిందీ : హిందువుల భాష ; హిందూస్తానీ : నర్మదానదికుత్తరమునుండు దేశభాగమునకు చెందిన సిపాయి.

పారసి. హిందూ : హిందువు, భారతీయుఁడు, గస్తి తిరుగువాఁడు ; బానిస, సేవకుఁడు ; విగ్రహారాధకుఁడు : హిందవానీ హిందువానీ ; హిందూ దేశపు ఉక్కుతో తయారుచేసిన ; హిందువీ, హిందూవీ : భారతీయభాష ; హిందీ : హిందూదేశమునకు సంబంధించిన32.

18. హుకుము : రూ హుక్కుమ్ము. ఆజ్ఞ ; శాసనము. 'హుకుము చొప్పున నడవక వికటమతినిఁ దిరుగఁబడి...' (రంగా. 2_258). 'భూజను లలరారఁగా హుకుమొసంగిరి క్రమ్మఱ రాజ్యమీయఁగాన్' (చెన్నపురీ. పు. 1). 'కొత్వాలుభానా హుకుం ఖరాలైయుండ ప్రహరి తిర్గుటమానె భైరవుండు' (వేల్పూరి విస్సనకృతమగు విశ్వేశ్వర శతకము).

మరాఠీ. హుకుమ, హుక్మ : అనతి ; శాసనము ; గుజరాతి. హుకామ.
పారసి. హుక్మ్ : అనుమతి ; తీర్పు ; న్యాయాధికారము ; శాసనము ; అరబ్బీ హుకమ్.

19. హుక్కా : పొగాకు పొగను పీల్చెడి సాధనము.

'నీరు హుక్కా పకడోరె గద్దాయని యా హితాగ్నులం నెత్తు లణచకుండ' (సింహాద్రి నారసింహ శతకము, పు. 15). 'హుక్కాల' (భద్రగిరి శతకము, 50. ప.).

---

32. 'హీనందూషయతి హిందూ' అను వ్యుత్పత్తి అర్వాచీనము, అశాస్త్రీయము. సంస్కృతేతర పదములను ఏదోయొక సంస్కృత మూలధాతువుతో ముడిపెట్టనెంచురీతి నిరాకరమను కుమారిలభట్టు ఎచ్చరికను వీరు పాటించినట్లు కన్పట్టదు.

మరాఠీ. హుక్కా.

పారసి. హుక్కా : నగలుగాని మందులుగాని ఉంచెడి గుండ్రని సందుకాపెట్టె; పొగపీల్చెడి గొట్టము.

హుకుమ్మా : చూ. హుకుము. ఇమ్మహిఁ బ్రబలిన ఢిల్లి యహమ్మదుషా పాదుషా ధరాధీశ్వరు హుకుమ్మన...' (రంగ రాట్. పీఠిక, 105).

20. హుజుత్తు : మోసము ; వృథా కలహము. '....పట్టిజిత్తులు సేయు రిత్తమిడి కాంద్ర హుజుత్తనిపించక విత్తహాని సేసితివని...' (నిరంకుశో. 2-139, సరస్వత్యనుబంధము, 22, కాకినాడ, 1913). '....హుజిత్తనిపించక...' అని (ఆంధ్రశిల్పకళాపరిషత్తు సత్తెనపల్లివారి ప్రతి, 1951, పు. 188) ఒక పాఠము.

మరాఠీ. హుజత్, హుజ్జత్ ; వ్యర్థముగా వివదించుట, పేచీపెట్టుట ; జగడము.

పారసి. హుజ్జత్. వాగ్వివాదము ; వ్యర్థ : కలహము ; సాకు, నెపము ; సాక్ష్యము, ప్రమాణము ; తీర్పు, తీర్మానము.

హుజూరు : చూ. హుంజూరు. కొలువుకూటము. 'మహందుదమీను హుజూరుకు వచ్చి' (ద. హిం. శా. X No. 759 ; క్రీ. శ. 1663 'ఒవరు నిభరాము పాదుషా హుజూరుసందు' (యయా. 1-57), హుజూరుపాటకు రాక యున్న జక్కులు వేరు' (సత్యభామా. చతుర్థా.) 'పెంపుమీఱు వసంత పేషువా హుజూరుననుండి చెలావణి హొనరు దెలుప' (అనిరుద్ధ. 3-19) ; 'హుజూరు కొలువులు' (కువల 1-38)

21. హుజూరు : రూ. హుజురు. ఆస్థానము, కొలువుకూటము, '...అవసర సచివుల్ చెచ్చెర హుజూరునకుఁ బిలవచ్చిన...' (రాజవా. (5-37).

మరాఠీ. హుజూర : ఆస్థానము ; అధిపతి, ఏలిక, యజమాని.

పారసి ; హుజూర్ : సమక్షము, సమ్ముఖము ;

అరబ్బీ. హుజూర్ : అస్తిత్వము ; సమ్ముఖము.

22. హుమా : రూ, హుమాయి, హుమాయీ, హుమావు, వాహనము. 'కొక్కుహుమాజోదు' (అచ్చ. రా. పీఠిక, 21), 'చిలుక హుమావజీరు' (గోగులపాటి కూర్మకవి సుందరీమణి శతకము, పద్య .42). 'చిల్కహుమా' (కృ. శకుం. 2-174), సిరిగులెక్కె ఓ చిల్కహుమా' (యామినీ. 4-71). మరాఠీ నుండివచ్చిన పదమని బ్రౌణ్యము రివైజెడ్. 1397 ; ఆం. భా. చ. 620.

మరాఠీ. హుమ్మా : గరుడపక్షి.

పారసి. హుమా : భూమిపై వ్రాలకుండ నిరంతరము ఎగిరెడి ఒకపక్షి ; హుమాయ్ : హుమా పక్షి రెక్కము.

హుమాయి : చూ. హుమా. 'కాయజారాతిగిబ్బ హుమాయినెక్కి' (పరతత్త్వ రసాయనము, 1-111). 'పజార్వన్నెయంచహుమాయి వడిగనెక్కి' (ఉ. రా. 2-178). 'పులుగుహుమాయి జోదు' (అచ్చ. రా. పీఠిక, 4), 'చిల్కహుమాయితేజి' (హంస. 4-86). '...ఘోడాన హుమాయి....' (చౌడప్ప సీసములు, 7).

హుమాయీ : చూ, హుమా. 'ఎలమిన్ బంగరుతెక్కపక్కెర హుమాయీతేజి...' (దశా. 2-67).

హుమావు : చూ. హుమా. 'మలయు వెలిగిబ్బనీలా హుమావునెక్కి' (విశ్వేశ్వర శతకము, 43 ప.).

హుమ్మారావు : చూ. హమరావు. '...గోలకొండకు పోయి...అక్కడ ఉండే అమీర్లు హుమ్మరావులు దివానులు మొదలయిన గొప్పగొప్ప వారిని దర్శనం చేసుకొని...' (దూపాటి కైఫీయతు ; శ్రీ పరమూర్తి, సర్వేశ్వరరావు గారలచే సంపాదితము) 33.

---

33. Bulletin of the Govt. Oriental Mss. Library, Madras, Vols. xiii & xiv.

హురుమంజి : చూ. హురుముంజి. 'హురుమంజి ముత్యాల యొరగు పొగమెఱుంగు' (సారంగ. 1-79). 'గొప్ప హురుమంజి సుప్పాణికూర్ప దంపు' (కృష్ణరా. 3-75). హురుమంజి ముత్యాల కుతికంటు.........' (కవి రాజ మనో. 2-190), 'హురుమంజిపూసల' (హంస. 4-109); 'హురుమంజి పల్లము' రాజవా. 2-46).

హురుమంజీ : చూ. హురుముంజి. 'చెలువంబై కళలన్వెలుంగు హురు మంజీదేశపున్ ముత్తియంబులతోఁ గూర్చిన చేరు చుక్క...' (అనిరుద్ధ. 5-72).

23. హురుమత్తు : గొప్ప, పెద్ద (శ. ర.) 'ఒక్క నిబ్బరముగా హురుమత్తు పరువెత్తు సళ్ళించు కళ్ళెముల్ ఘల్లనంగ' (కృష్ణరా. 1-53), 'ఒక్క హరుమత్తు నను మ్మత్తూరు......నోడించి' (పైది. 3-6). హురుమత్తు వేళల' (పార్వతీ. ప్రథమా. పు. 10). 'సరిఖేలు హురుమత్తుసాపు బాగీలకై మఱచెనప్పటి వృత్తిమాధవుండు' (విశ్వేశ్వర శతకము)

మరాఠీ. హుర్మత్ ; ప్రతిష్ఠ : గౌరవము ; గొప్పదనము.

పారసి. హుర్మత్ : సచ్ఛీలము ; మర్యాద.

24. హురుముంజి : చూ. హురుమంజి. పారసీక జలసంధి చేరువలో క్రీ. పూ. నాలుగవు శతాబ్దినుండియు ప్రసిద్ధి కెక్కిన ఒకానొక రేవు పట్టణము. క్రిందటి దినముల లోపల గుఱ్ఱముల, ముత్యముల ఎగుమతికి ప్రసిద్ధి. 'హురు ముంజి బలుతేజి హరులు దెచ్చె' (హర. పీఠిక. 26).

పారసి. హర్ముజ్, హుర్మ్మజ్, హోర్ముజ్ : పారసీక జలసంధిలో ఈ పేరుగల దీవి ; : ఈ పేరుగల రేవుపట్టణము.

25. హుశారు : చూ. హుషారు. హుసారు. చలాకీతనము, చురుకు దనము. 'చిగురాకు తెగసౌరు వగరాజిలు హుశారు వగమీఱు రత్నాల వహిగు దార్లు' (కృష్ణరా. 3-75). 'నిశ్శంక నలంకరించుక హుశారున వీథికివచ్చు చుండి...' (హంస. 4-85).

మరాఠీ. హుశారీ : చలాకీతనము.

పారసి. హుశ్యార్, హోశ్యార్ : జాకరూకత ; జాణతనము ; హుశ్యారీ : ఎచ్చరిక ; హుశివార్ ; వివేకము ; హోశ్యారీ : నేర్పు, తెలివి.

హుషారు : చూ. హుశారు. 'మనసున హుషారు చెందవామరుని వంతి' (రాధికా. 3_130) 'వెల్పటికి హుషారునంజని' (హంస. 5_164)[34].

హుసారు : చూ. హుశారు. 'అలివేణి నీ పల్కు లాలకించినగాని రాచిల్కల హుసారు సైచఁజాలఁ' (భోజసుతా 3_64), 'హుసారున' (పార్వతీ. షష్ఠా, పు. 120).

26. హేజీబు : ప్రతినిధి ; మంత్రి ; సలహాదారు. 'హేజీబులప్పుడు వచ్చి రగణిత స్తితి' (రాజవా. 5_36). హితులున్ రాజులమాత్యులాదిగములున్ హేజీబు లార్యుల్....' (సత్యభామా. ప్రథమా. పు. 11) 'హేజీబుసనుతురు' (కువల. 1_33) ; కుతుపనమలకవారి హేజీబుఖ (రాయవాచకము. పు. 46).

మరాఠీ. హేజీబ : దూత, రాయబారి ; పరిచారకుడు.

ఉర్దూ. హాజిబ్ ; కంచుకి ; ప్రతీహారి.

పారసి. హాజిబ్ : ద్వారపాలకుఁడు ; కంచుకి ; మంత్రి : హాజిబీ : ప్రతీహారి పదవి.

అరబ్బీ. హాజిబ్ : చోపుదారుఁడు.

27. హేజుబారి : రాయబారి. 'ఇట్లు కనుగొన్న మన్నీని హేజుబారి కప్పరాసుల యెకిమీఁడు చెప్పరాని మెప్పురా...' (రంగా. 2_115) చూ. హేజీబు.

28. హేరామి : హింస, జాఫ. విలువిద్యనేర్చి హేరాములఁదంత్రినాఁట రిపులన్ దునుమాడిన యట్టిరాముఁడో' (భల్లా. 2_. శ. ర. ఉట్టంకితము).

మరాఠీ. హరామీ : వంచన, దుష్టబుద్ధి ; క్రూరత, నిర్దయ.

---

34. 'హుషారునంజని' అని శృంగార గ్రంథమండలి, మచిలీపట్టణమువారి ప్రతి; 'హుసారునం జని' అని వావిళ్ళవారి ప్రతి.

పారసి, హరామ్ : పాపకృత్యము, నిషిద్ధము, న్యాయ విరుద్ధము; హరామీ : ద్రోహచింతనగల ; హంత ; దోఁపిడికాఁడు.

29. హోదా : పదవి ; స్థితి. 'మామాహోదాలో మమ్ముమను వుండుమని మాకు సమ్మతులుచెప్పి....' (రమణప్ప జమీదారీ గ్రామాదుల కరణముకాపుల అర్జీ)35.

మరాఠీ. హోదా :

పారసి. హోద : వాస్తవస్థితి ; సత్యము ; మూలము, ప్రాచీనము.

మూలఘటిక కేతన గ్రామ్యమునకు లక్ష్యముగా నుదహరించిన '...యేగ గొంటూరమ్మ యేదాలు వోదాలు...' (ఆం. భా. భూ. 126) అను పద్యభాగము నందలి 'హోదాలు' కు 'హోదాలు' గ్రాంథిక రూపమను దివ్య ప్రభా వివరణము విచార్యము.

30. హౌదా : ఏనుఁగుమీఁద కూర్చుండుట కనువుగా కట్టిన పీఠము, అంబారీ - 'విలాతి సకలాతి హౌదాల సామజములు' (రంగా. 1-156).

మరాఠీ. హౌదా : ఏనుగుమీఁది గద్దె.

పారసి. హౌజ : ఏనుగు మొదలగువానిపై పయనించుటకు నిర్మించెడి తొట్టెవంటి పల్లకి ; హౌదజ్ : పయనపు ఒంటెలమీఁద కూర్చుండుట కనువుగా నిర్మించిన కొయ్యచట్రముతోడి గుడారము.

అరబ్బీ, హావద : ఒంటెమూపు.

31, హౌదుఖానా : మాడువుపై నీటితొట్టెకల భవనము. 'హౌదుఖానా సిడు లాయెఁగా యుత్తుంగ సౌధగోపుర బహుస్తంభ వితతి' (వేల్పూరి విస్సన కృతమగు విశ్వేశ్వర శతకము).

---

35. Telugu Documents, Ed. by Prof. G. J. Somayaji, Published on behalf of the National Archives of India by the Andhra University, Waltair 1957, pp. 10, 11.

పారసి, హౌజ్‌ఖాన : నీటి తొట్లుగల భవనము; హౌజ్ = జలాశయము.

32. హౌసు : రూ. హవుసు. ఒయ్యారము, సొగసు – 'కోటలా తెలుగంటి పాటలావరలెల్ల నాటలాడఁదలంచ హౌసుమించ' (కృష్ణరా. 2–34), 'ఔరా చక్కఁదనంబు హౌసు....' (తారా. 3–23), 'హౌసుగా స్వారి వెడలు నవసరమున' (రంగరాట్. పీఠిక, 92), 'హౌసుమించి' (సత్యభామా. తృతీ). 'హౌసుమించె నటంచు' (పార్వతీ. ద్వితీ. పుట 24), 'హౌసుతోఁట సింగారపుఁదోఁట....అనంగను పవనమొప్పు' (సాంబ. స్థా. 68). 'హౌసుకాఁడనఁగను నగు భోగి' (అం. భా. 3–10) 'హౌసుకళ' (హంస. 2–45) : ప్రేమ. 'హౌసు చెల్లించిన యందగత్తె' (తారా. 4–59).

మరాఠీ. హౌస : ఔత్సుక్యము; హవస్, హౌస్ (స) ఉత్కంఠ, ప్రబలేచ్ఛ; విలాసము; మోహము.

పారసి. హవస్, హివాస్, హోస్, హౌస్ ; కామము ; తీవ్రవాంఛ ; ఆకాంక్ష.

అరబ్బీ హవస్ : ఉబలాటము : అన్వేషణము. 36

V. ఆంగ్లపదములు : ఆంగ్లభాషతో మనకుఁగల సహవాసము మూఁడున్నర శతాబ్దుల నాఁటిది. ఆంగ్లము అసరాలేనిదే శిష్టసమాజమున పెక్కుర వ్యవహారము అరగడియసేపు గడవదు. తెలుఁగుల పలుకుబడిలో అడుగడుగున చెలామణియగు ఆంగ్లపదములు వేయాలులు. కాని, కావ్యప్రయుక్తములయినవి మిగుల పరిమితము. కథావస్తువులు ఆంగ్లసమాజముతో ప్రత్యక్ష సంబంధము కలవి యగుటచే పద్మనాభ యుద్ధము,37 చెన్నపురీ విలాసము38 వంటి

---

36. అరబ్బీనుండి యని బ్రౌణ్యము, పు. 1137.

37. వత్సవాయి రాయగజపతి వర్మగారిచే ప్రకాశితము, రాజమండ్రి. 1931.

38. మతుకుమల్లి నృసింహశాస్త్రి కృతము, చెన్ననగరము ఆదిసరస్వతీ నిలయ వివేక రత్నాకర ముద్రాక్షరశాలలలో వావిళ్ళ రామస్వామి శాస్త్రులచే దుందుభి, శ్రావణము (క్రీ. శ. 1862) న ముద్రితము.

ఆధునిక కృతులలో ఆంగ్లపదములు విరివిగా ఉపయుక్తము. హకారాది పదములు కొన్ని క్రింద ప్రదర్శితము.

1. హీజు : His, 'హీజు హైనెస్ దీ మహారాజా మిర్జా విజయరామ గజపతిరాజు....' (మార్కండేయ పురాణ39 పీఠిక, పుట, 25).

2. హెర్ : Her. 'హెర్ హైనెస్ శ్రీమదలక రాజాంబా మహారాణీ సాహేబావారు....' (పైది).

3. హేడ్డు : Head. ముఖ్యము, ప్రధానము. '....సదర్కోర్టును హేడ్డు పోలీసును' (చెన్నపురీ. పు. 27), 'పేటలకునెల్ల హేడ్డగు మాంత్రోడ్డు....' (పైది. పు. 28).

4. హైస్కూలు ; ఉన్నత పాఠశాల. '....విచారింప హైస్కూలున్ లోనగు స్కూలు లప్పురి సిరుల్ గుల్కున్....' (పైది, పు. 66).

5 హౌసు : House, బంగళా, కార్యాలయము. 'అలయార్పుత్నైటు హౌసు బెన్నిహవు సొప్పారస్ లయన్ హౌసునా బలుహౌసుల్ మతిషాష్ఠ లస్ ...' (పైది, పు. 66), 'హూణులనుచు హౌసులకు ననుంగుం దమ్ముల హౌసులును...' (పైది, పు 67).

VI. కృతక ప్రామాణికములు (Hyper forms) : హకారాది పదముల తొలివర్ణము లోపించి అజాది రూపములగుట (Deaspiration) సాధారణమగు ధ్వని పరిణామము – హజారము > అజారము ; హజ్జ > అజ్జ ; హత్తు > అత్తు ; హదను > అదను ; హనుమ > అనుమ–; హరిగ > అరిగ ; హరివాణము > అరివాణము ; హరుసము > అరుసము ; హళది > అళది ; హసాదు > అసాదు ; హావడి > ఆవడి ; హితవు > ఇతవు ; హురుముంజి > ఉరుముంజి ; హెచ్చు > ఎచ్చు ; హొమ్ము > ఒమ్ము ; హొసపరి > ఒసపరి ; హోళిగ > ఓళిగ–మొదలగునవి ఈ ధ్వని సూత్రమునకు

---

39. మండ చిట్టి కామేశ్వరశాస్త్రి తెలుఁగుసేత, వైశాఖపట్టణము గరుడా సుందర రామయ్యగారి స్వకీయ శ్రీ వేణుగోపాల ముద్రాక్షరశాలా ప్రచురితము, 1866.

లక్ష్యములు. మీఁది జంటపదములలో హకారాదులు ప్రాథమికములని పూర్వప్రకరణముల నిర్ధారితము. ఇట్టి కొన్ని అజాది రూపములకు హకారాది మాతృకలందు సాదృశ్యము వలన, నిసర్గముగా అజాదులగు రూపములకును హకారాది మూర్తులు సృష్టింపఁబడుటయే కృతక ప్రామాణికమని ఇట వ్యవహృతము. ఇట్టి పదజాలము, వ్యుత్పత్తి స్వభావము ననుసరించి తత్సమములు, తద్భవములు, దేశ్యములు, కన్నడపదములు, అన్యదేశ్యములు. ఆంగ్లపదములు అను ఆఱు ఉపశీర్షికల క్రింద వివృతము.

I. తత్సమములు : వీనికి కావ్యప్రయోగములు మృగ్యము. వ్యావహారాంధ్ర పద ప్రదర్శినియగు బ్రౌణ్యమునుండి ఒకకొన్ని మాటలు.

1. హాంశ : < అంశ (బ్రౌణ్యము, పు. 1121).

2. హంశము : < అంశము (మిశ్రబ్రౌణ్యము, పు. 128).

3. హాశ్చర్యము : < ఆశ్చర్యము (బ్రౌణ్యము, – పు. 1129).

4. హీర్ష్య < ఈర్ష్య (పైది, పు. 1131).

II. తద్భవములు : 1. హక్కసు : పగ. ఈర్ష్య < అక్కసము, అక్కసు : కోపము

ప్రాకృత. అక్కోస :– కటువచనము, భర్త్సనము.

సంస్కృత, ఆక్రోశ :– ఆక్షేపము, తిట్టు శాపము ; అపవాదము. అపదాది 'ఓ' 'అ' గా మాఱుట ధ్వని పరిణామ సూత్రబద్ధము. తెలుఁగు, సంతసము. సంతోసము, సంతొసము < ప్రాకృత. సంతోస – < సంస్కృత. సంతోష–; తెలుఁగు, అందలము < ప్రాకృత. అందోల– < సంస్కృత అందోల – ఆందోల–'హక్కసు' హిందీ పదమను పూర్వ పరిశోధకుల నిర్ణయము (మిశ్రబ్రౌణ్యము, పు. 128, శ. ర. (1912). పు. 1123 : డా, చిలుకూరి, ఆంధ్ర భాషాచరిత్రము, పు. 598, టి. వేం. శివరావు, వ్యవహారకోశము, పు. 268) చింత్యము.

2. హారతి : < ఆరతి. 'పరవిప్ర కాంతలు వడితోడవచ్చి - హారతు లిచ్చినారానంద మొదవ' (పల్నాటి. పు. 71). 'నిశాపతి హారతిండట్టు' (రాజశే విలాస, 1-132), 'హారతి పళ్ళెరంబుల మృగాక్షులు...' (క కు. 4-5), 'నైమిశ పుణ్యవనంబునఁ బొందిన హరికిని మంగళ హారతులెత్తును' (హంస. 4-214).

ప్రాకృత. ఆరత్తియ-

సంస్కృత. ఆరాత్రిక-

'హారతి' ఆరతికి మొదటి రూప' మను శ. ర. భ్రాంత అగ్రాహ్యము40.

III. దేశ్యములు : 1. హడలు : బెదరు, భీతి < అడలు : బాధ; భయము ; శోకము.

2. హౌర : < ఔర (బ్రౌణ్యము. పు. 1137).

IV. కన్నడము : హెచ్చరిక : ప్రభువుల యవధానమునకై వేత్ర హస్తులుపయోగించు మాట. 'హెచ్చరికయ్యె స్వామి ధరణీశ పరాకు' (కృష్ణరా. 2-110), 'హెచ్చరిక దెలుపు' (తారా శ. 3-26), స్వామి పరాకవధారు దేవ హెచ్చరిక' (దశా. 1-234) ; అవధానము, జాగ్రత్త 'తెచ్చు కోలగు హెచ్చరికన్' (శుక. 3-304).

కన్నడ. ఎచ్చరికె : జాగ్రత్త ; ప్రబోధము ; ఎచ్చరిసు : ఎచ్చరించు, ప్రబోధించు ; ఎచ్చరు, కన్నడమున దీని హకారాది రూపములేదు.

హెచ్చు (< క. హెచ్చు. పెచ్చు. పెర్చు). హెచ్చరిక (< క. ఎచ్చరికె, ఎచ్చరు)లు ఏకధాతు జన్యములు కావనుట స్పష్టము. 'హెచ్చరిక' 'హెచ్చరించు' -లు క్రమముగా 'ఎచ్చరిక', 'ఎచ్చరించు' లకు మొదటి రూపము'లను శ. ర. నిర్ణయము ప్రామాదికము. వ్యుత్పత్తిపరముగా శకటరేఫ ఘటిత మగునది సాధురూపము.

---

40. బి. సీతారామాచార్యుల వైకృత దీపిక (1900) యందు 'ఆరతి' (పు.16), 'హారతి' (పు. 116) రెండును ఆరాత్రిక పదభవములుగా నిరూపితము లగుట గమనార్హము.

V. అన్యదేశ్యములు : 1. హంవీరుఁడు శూరుఁడు. '...సమర హంవీరుఁడు....' (తారాశ. 5-72), 'దండ హంవీర తలగుండు గండ...' (శుక. 3-158). 'మంచి హంవీరతాయెతులు...' (హంస. 5-360).' అచ్చన హంవీరుఁడు' (అం. భా. 1-17), 'మన్నె హంవీర పెరమన్నె మదవిభాళ' (రంగా. 1-130). 'మన్నె హంవీరులు' (పద్మనాభ యుద్ధము. 26), '...హంవీరుఁడితండు నాఁజనుము విష్ణుపురానకు...' (పైది. 177); కొమారి హంవీర 'మహాపాత్రుని' (ద. హిం. శా. vi. 248; క్రీ. శ. 1515).

మరాఠీ. అమీర్ : ముఖ్యుఁడు ; శాసకుఁడు.

పారసి. అమీర్ : కులీనుఁడు ; రాష్ట్రాధికారి ; శాసకుఁడు ; రాజులు మంత్రులకు ప్రసాదించు ఒక బిరుదము ; అమిర్ : శాసకుఁడు ; అమారత్ : అమీర్ పదవి ; ప్రభుత్వము ; పరిపాలనము.

'హంవీర' – సంస్కృత మను శబ్దరత్నాకరాదుల నిర్ణయము అగ్రాహ్యము.

2. హస్తిభారము : బునాది. '...మేరువు లెత్తి హత్తి బలిమిం గదపారల హస్తిభారమున్ – దీరిన జంగరాళ్ళ పడఁదీసి...' (పెదశ్గిరి విజయము, పు. 54).

అస్తిభారము, ఆస్తిభారము : అడుగుమట్టు, పునాది. సంస్కృత. 'హస్తిభార –'కు వికృతి యని బ్రౌణ్యము–హస్తిభారము అను ఆరోపమును బ్రౌణ్యమున ఉట్టంకితము41. సంస్కృతమున నిది మృగ్యము.

---

41. బ్రౌణ్యము ప్రథమ ముద్రణము (1852) న అస్తిభారము, అస్థిభారము (పు. 54) హస్తిభారము, హస్థిభారము, హస్తివారము (పు. 1128) లు సంస్కృత పదములను సూచనలేదు. బ్రౌణ్యము పరిష్కృత ముద్రణమున 'హస్తి' (= ఏనుఁగు) అను ప్రథానారోపము (Main entry) క్రింద ఉపారోపము (Sub entry) గా 'హస్తిభారము' ప్రదర్శిత మగుటను బట్టి చూడఁగా నిది పరిష్కర్తల (మల్లాది వెంకటరత్నము, రాఘునాథద్దరు కందుకూరి వీరేశలింగము పంతులుగారల) దృష్టిలో (చూ. పు. 1393) సంస్కృత మనుట స్పష్టము.

పారసి. ఉస్తువార్ : దృఢము, స్థిరము, బలిష్ఠము ; పరిపూర్ణత ; ఉస్తువారీ : బలము ; స్థిరము ; స్థైర్యము ; దృఢీకరణము, సమర్థనము.

తమిళాది ద్రావిడ భాషానిఘంటువులయం దీ పదము విజాతీయముగా పరిగణితము.

తమిళ. అస్తిపారం, అస్తివారం < ఉర్దూ. ఉస్తువార్ : బునాది (Tamil Lex. p. 200.)

కన్నడ. అస్తిభార, అస్తివార : బునాది (కిట్టెల్, పు. 132).

3 హిజారు : కాలికి తొడిగికొను చట్ట. 'పసరు పట్టు హిజారు మిసమిసలు బుతకాల్మెఱుఁగుటంగికి వింత యెఱపునింప' (శుక. 1-249). 'బంగరు వ్రాఁతల పట్టు హిజారు' (వైది. 2-427). 'సాలవదిండ్లు పావలు హిజారులు కత్తులునే జలాయుధాల్ వేఁకొలంది...' (పెదగ్గిరి విజయము, పు. 63), 'పొగడ హిజారు చెంగలువ బొందలము' (హంస. 4-86); 'జఘన దేశముల హిజారులమర' (కువల. 1-86).

పారసి. ఇజార్ : మోకాళ్ళదాఁక సరిపడునట్లు లినెన్, మస్లిన్ గుడ్డతో తయారు చేసిన ముసుగు : ఇజారత్ : లోపావడ ; ఇజార్‌బంద్ : పంట్లాము, గుడిగి ; దేరాగుడారపుటంచు.

'హిజారు,' ఇజారునకు మొదటి రూపమను వ్రాఁత అగ్రాహ్యము.

4. హిరాకి : వాహనము, గుఱ్ఱము, ఇరాకీ సీమనుండి కొనితెచ్చిన గుఱ్ఱము. 'రతిగ నటియించు చిలుక హిరాకినెక్కి-మదన పాదుశ హౌదండు గదలె నపుడు' (అనిరుద్ధ 3-19).

పారసి. ఈరాక్ , యూఫ్రటిస్ టైగ్రిస్ నదుల మధ్య, సౌదీ అరేబియాకు ఉత్తరముగా, ఇరాన్‌కు పడమరగాఁ గల దేశము ; ఈరాకీ : ఇరాక్ దేశమునకు సంబంధించిన.

5. హిరాణీ : ఈరానీ జాతీయుఁడు. ఈరానీ దేశ సంబంధి. '...మహా కాఱుండైనను గాఱుఁడైన నెదుకంగా నో పరిచ్చోట మన్నీలంటున్ బలుకంగ నేటికి పఠాణీలన్ హిరాణీ తురాణీలన్ గోటను జిమ్మలేదె మను...' (రంగా. 2-38).

పారసి; ఈరానీ : ఇరాను దేశసంబంధి.

6. హుజుబెక్ : ఉజ్బేక్ (గ్) దేశ సంబంధి; ఉజ్బేక్ జాతీయుఁడు. 'హుజు బెక్కొమారునియోజహిజారును బుడమి జారెడు నగల్ దొడిగినాడు' (జగన్నా. 1_90, బ్రౌణ్యము ప్ర. ము. పు. 1132 న ఉట్టంకితము). మన సాహిత్యమున ప్రసిద్ధమగు సామ్రాణిదేశ మిదియే. అర్వాచీన కోశముల నీ యారోపము పరిహృతమగుట చింత్యము.

పారసి. ఉజ్బేక్ ; అఫ్ఘన్ స్తానమునకు ఉత్తరదిశను సోవియెట్ రష్యాలోని ఒకరాష్ట్రము ; ఉజ్బేక్ జాతి.

VI. ఆంగ్లపదము : హింగ్లీజు : ఇంగ్లీషు, 'ప్రాంసు హింగ్లీజు డిన మార్గయొలందా ....' (రంగరాట్. పీఠిక, 68).

VII. ధ్వన్యనుకరణములు : 42 1. హా : ఆశ్చర్యాది సూచకము. 'హాయనుచుం బడినోళ్ళఁ దెఱచి యఱచెంబెలుచన్' (అరణ్య 7_186). హా తెలిసికొంటిన్' (ఉ. రా. 2_205). 'వైభవముగాంచి హాయంచు పడిఁ దపించు' (హంస. 3_205). 'హా యటంచు సుమశయ్యన్ వ్రాలె' (విజయ నందన విలాసము, ద్వితీయా. పు. 60).

హాహా : 'హా' కు ద్విరుక్తి. 'హాహాధ్వను లెసంగ (ఆది. 6_86). 'హాహాస్వనము లెసఁగ' (అరణ్య. 1_162). 'హాహారవంబు లెసఁగ (మౌసల. 145). 'అవ్వీరుండు...హాహాయనుటయు...' (ఉ. హరి. 3_64).

---

42. ఈ ధ్వన్యనుకరణములు కొన్ని సంస్కృతాది భాషలయందును ఉపయుక్తము. ధ్వన్యనుకరణ శబ్దములు ఏదోయొక భాషకు పరిమితమనుట సత్యదూరము.

3. హాహా : గుఱ్ఱముల నదల్చుటయందుపయుక్తము. 'హాహా యను నిల్పు' (సిరిప్రగడ ధర్మయ కృతమగు నలచరిత్రము, 3-21).

4. హుమ్మ : హుంకారము. 'కాగి హుమ్మని యసురు యంగంబు పడఁక' (నృసిం. 4-130). 'హుమ్మని యదలించు నొక్కయింతి' (కాళ. 2-18).

హుమ్మరు : చూ. హుమ్మ. 'పరువంపుఁ జిగురాకు బాకఁ జేకొని లేచి హుమ్మరించు నురమ్ముఁ గ్రుమ్మఁ బాన' (కృ. శకుం. 2-227).

5. హూ : ఆవులించుటయందగు ధ్వన్యనుకరణము. 'ఒదిగిలి కను విచ్చి హూయని బిట్టావులించి' (అరణ్య. 7-94).

6. హూత్ : 'వుడత వుడత హూత్' (చిన్నపిల్లల గేయము).

7. హూహూ : చలియందగు ధ్వన్యనుకరణము. 'జనులు హూహూ యను చలివేళఁ గుత్తుకబంటితోయముల లోపల వసించి' (భాగ. 4-648).

8. హే : ప్రభువులకు ఎచ్చరికఁ దెలుపునట్లు వేత్రధరులు వాడునది. 'ఎచ్చరిక పరాకు హేయనుచు వేత్రధరాలి పల్కు...' (సిరి ప్రగడ ధర్మయ కృతమగు నలచరిత్రము, 2-84).

9. హో : ఆశ్చర్యాది సూచకము. 'అలఘు నిశాత శస్త్రమున సంగము లెల్లను నిర్వికారుఁడై యొలువఁ గోడంగె నట్టియెడ హోయని కిన్నర యక్షసిద్ధ సాధ్యులు... పుష్ప వృష్టిఁ గురియించిరి కర్తుపయిన్...' (అరణ్య. 7-374), 'ఎంత దయగలవాఁడు సర్వేశ్వరుండు హోయటంచును నిష్ఠతో నుండునంత' (దశా. 1-170).

10. హోరు : గాలి, వాన, సముద్రము మొదలగు వాని కదలికకు సంబంధించిన ధ్వన్యనుకరణము. 'కడవ వంచినట్లు హోరని ధారౌఘమైక్య మొందె' (ఆము. 4-91), 'మహోగిరుల్ హోరన' (వైది. 6-47). 'ఘన ఘనా ఘన సంఘ మవ్విధమునఁ బూని హోరుమ బెడిదంపు వాన గురియ' (కా. 4-88).

మందకు మందను అమ్మగా మిగిలిన మేఁకవంటిది 'హైసరే' ఇది మెచ్చికోలును దెలుపుమాట! 'మందహాసంబుల యందంబు హైసరే...' (వాల్మీకి. ద్వితీయా. పు. 50). 'మైసిరి హైసరే' (తారా. 3_23), 'హైసరే యతని పేరనిన మాత్రమునసే కురుదేశ మేల్రాజు గుండె లదరె' (కృష్ణరా. 2_45), 'హైసరే హృదయాపహారమో మౌక్తికహారమో యెలనాగ యలఁతి నవ్వు' (పైది, 4_64). 'హైసరే సరే యటం చనంగ యథార్థముగను' (అం. భా. 3_75). 'హై + సరే యని విడదీసి, 'హై' 'హే' వలె సంబుద్ధి వాచకమనవగునా? ఇంతకును ఇది అనుకల్ప వ్యుత్పత్తి యదార్థ వ్యుత్పత్తి యింకను విచార్యము. హైసరుబొజ్జ (అం. వాచా. 2835) అను గోదావరి మాండలికము 'హైసరేమజ్జా' కు వికృతి.

శ్రీనాథయుగము – అన్యాదేశ్యములు

ఆంధ్ర సాహిత్యమున శ్రీనాథయుగ మనఁగా క్రీ. శ. 1350_1500 మధ్యకాలమని వేత్తల భావన. శ్రీనాథుఁడు క్రీ శ. 1370 ప్రాంతమున జన్మించి, చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాఁటి నుండియు సాహితీ వ్యవసాయము సాఁగించినను, ఉపలబ్ధములగు ఆయన కృతులన్నియు పదునైదవ శతాబ్ది ప్రథమ భాగమునందే ఆకృతి దిద్దుకునినవి కావున ప్రస్తుత సమాలోచనమున క్రీ. శ. 1400_1500 నడిమికాలము శ్రీనాథ యుగమని వ్యవహృతము. కోశమును చూడు. అథవా. దేశమును చూడు అను నర్థమున కన్నడమున ఒక సామెత. రెంటిని చూచి, శాస్త్రజన్య జ్ఞానమును స్వానుభవముతో మేళవించి, అష్టభాషా భారతీ సందర్భ సౌభాగ్య గరిమంబు సంగ్రహించిన శ్రీనాథుని సాహితీ సమారాధనము ఆంధ్ర శారదా భాగధేయము. కవిసార్వభౌముని ఆదరించిన సాహితీ పోషకు లందరును హేమా హేమీలు. విస్సనమంత్రి పంక్తిని హేమ పాత్రాన్నము నారగించి, తెనుంగు రాయ రాహుత్తుఁడిచ్చిన కస్తూరిని సేవించి, వీరభద్రారెడ్డి యొసంగిన రత్నాంబరములు ధరించి, సర్వజ్ఞ చక్రవర్తి బిరుదాంచితులగు రెడ్డిరాజుల విద్యాధికారిగా బహుదేశ బుధులతో విద్యాపరీక్షల వేళలందు భాషించి, ఉద్భటవివాద ప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్కా పగులఁగొట్టించి, కర్ణాట క్షితి పాలమౌక్తిక సభాగారాంతరా కల్పిత స్వర్ణస్నాన గతి ప్రసిద్ధివహించి, రావుసింగమహీపాలు నిండుకొలువున మన్ననలంది ఇట్లు తెలుఁగునేల నాలుగు చెరఁగులు తిరిగి, సీమ సీమల తీరుతీయము లెఱింగి, శబ్దార్థగౌరవ శక్తి మరగి, మధురార్థ శ్రీకముగా, ఉక్తి ప్రగల్భ సమీహితముగా తన కృతులను దిద్ది తీర్చి, సమకాలీన కవులను సైతము ప్రభావితము సేసిన ఉత్తమ సాహితీశిల్పి శ్రీనాథుఁడు. ఈ యుగమున సాహితీరథసారథిగా వెలసిన శ్రీనాథుని కృతులు అయిదు - శృంగార నైషధము, భీమేశ్వర పురాణము, కాశీఖండము, హరవిలాసము, శివరాత్రి మహాత్మ్యము – ఇవి అయిదును

శ్రీనాథకృతములనుట నిర్వివాదము. క్రీడాభిరామకర్తృత్వము వివాదగ్రస్తమయి నను, శ్రీనాథయుగ రచనముగా నిష్కర్షించుట నిర్బాధము. పల్నాటి వీరచరిత్రము శ్రీనాథ కృతమనుటకును, అసలా యుగరచన మనుటకును బలమయిన ప్రమాణములు తక్కువ. శ్రీనాథునిపేర 'చెలామణి' యగుచున్న చాటు సాహిత్యమంతయు తత్కృతమని గట్టిగా చెప్పుట కష్టము. అంతా కాకపోయినను, చాలా పాలు ఆయన గంటపు టొరవడుల పంటయని పండిత పరిశోధకుల విశ్వాసము. దీని శయ్యావైయాత్యమును, పండిత పరంపరా యాతప్రతీతియును ఇది శ్రీనాథప్రణీతమనుటకు హేతువులు. శ్రీనాథ చాటువులకు అసంపూర్ణమయిన అర్వాచీన రూపము వీధి నాటకము. తక్కిన మరుత్తరాట్చరిత్రాదులు నామమాత్రావశిష్టములు. చిన్నకోట పెద్దన, మడికిసింగన, కొలని గణపతిదేవుఁడు, నిశ్శంక కొమ్మన, పేరంరాజు జక్కన, అనంతుఁడు, వెన్నెలకంటి అన్నయ్య శ్రీనాథ యుగమున తొలిసగమునకు చెందినవారు. బమ్మెర పోతన, ప్రౌఢకవి మల్లన, కొఱవి గోపరాజు, గౌరన, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుఁడు, దూబగుంట నారాయణకవి, బైచరాజు వేంకటనాథుఁడు, దగ్గుఁబల్లి దుగ్గన, నంది మల్లయ-ఘంట సింగయలు మలి సగమునకు చెందినవారు. భాస్కర రామాయణములోని యుద్ధకాండ శేషకర్త యగు అయ్యలార్యుఁడు దేవరకొండ రాచవారికి ఆశ్రితుఁడగుటవలన క్రీ. శ. 1407 ప్రాంతమున వాఁడను మల్లంపల్లి వారి నిర్ణయము[1] ప్రమాణముగా ఒకటి రెండు అయ్యలార్యుని ప్రయోగములు సైతమీ కృషిలో స్వీకృతములు. వెన్నెలకంటి సూరన కృత విష్ణుపురాణ కృతిపతి యగు రావూరి బసువయ రాఘవరెడ్డి క్రీ. శ. 1528 ప్రాంతము వాఁడని నిర్ణీత మగుటచే ఏతత్కృతియందు ప్రయుక్తములయిన అన్యదేశ్యములిందు పరిహృతములు. నాసికేతూపాఖ్యాన ప్రబోధ చంద్రోదయ కావ్యములకు కృతిపతి చెందలూరి అనంతామాత్యుని గంగయ మంత్రి[2] కావున దగ్గుబల్లి దుగ్గనయు, నంది మల్లయ - ఘంట సింగయలు, సమ్మ సమకాలికులు, తాళ్ళపాక అన్నమయ్య నూటికి నూఱుపాళ్ళు పదునైదవ శతాబ్దివాఁడు. ఫణిభట్టు, భైరవ

1. M. Somasekhara Sarma, History of the Reddi Kingdoms pp. 532, 533.

2. 'ప్రఖ్యాత నాచికేతూ-పాఖ్యాన మహాప్రబంధ పరిమళిత సుధీ-వ్యాఖ్యాన-శ్రవణోదిత-సౌఖ్యా, సంఘటిత చిత్తశంకరసఖ్యా!' (ప్రబోధ. 4-71).

కవి రచనములు ఏతద్యుగీనములగునాయని శంక. అయినను పూర్వపరిశీలకుల నిర్ణయము ననుసరించి ఈ రచనలను ప్రస్తుత చర్చలో ఉదాహృతములు.

పారసీకాద్యన్య దేశభాషలనుండి ప్రత్యక్షముగాఁగాని, పరోక్షముగా మరాఠీభాషాముఖముగఁగాని తెలుఁగునఁ జేరినపదములును, మరాఠీభాషకు నిష్పన్నములయి సంసర్గవశమున తెలుఁగునఁ బ్రవేశించిన పదములును అన్యదేశ్యములని ఈ వ్యాసమున పరిమితార్థమున ప్రయుక్తము. ఈ వ్యాసము చివరి పట్టిక లోని పదములలో ముక్కాలుపాలు పారసీకాద్యన్య దేశభాషలకు నిసర్గములు. తక్కినవి మహారాష్ట్రీ ప్రాకృతజన్యమగు మరాఠీభాషాస్వత్వములు. ఈ యా పదములు హిందూస్థానీ జన్యములని పూర్వ పరిశీలకుల మతము. ఉర్దూపాలెక్కు వయిన సంకీర్ణహిందీ భాషను 'హిందూస్థానీ' యని వ్యవహరించు పరిభాష పరంగుల రాకతో మూర్తికట్టుట. హిందీభాషగాని, దీని మాండలికములుగా సంభావ్యము లగుచున్న అవధీ, బ్రజ, మైథిలీ, ఖడీ బోలీ మొదలగునవిగాని హిందీభాషా వికృతియగు హిందూస్థానీగాని ఆంధ్రుల చరిత్రమునను, సాహిత్య మునను అప్రసక్తములు. అర్వాచీన యుగముల మాండలిక పరముగా 'ఉర్దూ' భాషా ప్రభావము లేకపోలేదు. శ్రీనాథ యుగమునాఁటికి 'ఉర్దూ' ఆలు చూలు లేని సోమలింగము. 'జాతీయ కాంగ్రెసు' ప్రోద్బలమున, దక్షిణ భారత హిందీ ప్రచారసభ పక్షమున ఇరువదియవు శతాబ్ది ద్వితీయ పాదమున ప్రచారము ప్రారంభమగు దాఁక, హిందీ భాషతోఁగాని, తద్వ్యవహార ప్రాంతముతోఁగాని తెలుఁగు జనులకు సంబంధ బాంధవములు మృగ్యము. నాఁటికి నేటికి హిందీ, తెలుఁగునకు పరిసరస్థభాషకాదు. కావున, ప్రాక్కాలికమగు హిందీ బాంధవ మును నిర్వహింప నుద్యోగించుట నిష్ప్రయోజనము; తెలుఁగు నందలి మధ్య యుగ నాన్యదేశ్యములకు హిందీతోడి సమీప మాతృకతను స్థాపింప నమకట్టుట నిరాధారము. కాని, మరాఠ్వాడా-తెలుఁగు నాడులకుఁగల సంబంధ బాంధవ ములు ఇక్ష్వాకుల తాత ముత్తాతల నాటివి. పైపెచ్చు తెలుఁగు - మరాఠీలు భౌగోళికముగా పరిసరభాషలు. శాతవాహన చక్రవర్తులనాఁడు ఇంచు మించు నన్నూటేండ్లపాటు మరాఠ్వాడా, తెలుఁగు నాడులు ఒక గొడుగునీడ కూడి మాడి యుండుట జగమెఱిఁగిన చరిత్ర. మరాఠ్వాడాను ఏకాతపత్రముగా శాసించిన పశ్చిమ చాళుక్య వంశీయుల ఒక రెమ్మయేకదా సాగరాంధ్రసీమల వేంగీ రాజ మహేంద్ర పురములు ఆలవాలములుగా ప్రాచ్య చాళుక్య శాఖగా పరిఢవిల్లుటఁ

నెల్లూరి '...మన్త్రవిభు పంపైచన్న సైన్యంబు '...మహారాష్ట్ర సామంతు సారం గుండోలి తురంగముంగొనిన సంగ్రామము'' (నిర్వచనో. 1-43). తెలుఁగు మరాఠీల సరాసరి సంబంధములకు ఒక చక్కని నిదర్శనము. యాదవ రాజుల పరిపాలన కాలము మరాఠ్వాడా చరిత్రలో స్వర్ణయుగము. దేవగిరి యాదవరాజులలో రామచంద్రదేవుఁడు (క్రీ. శ. 1271-1309) సుప్రసిద్ధుఁడు. ఇతని మహామాత్యుఁడే హేమాద్రి. క్రీ. శ. 1277 నాఁటి పంఢరా పురశిలాశాసనమునను, క్రీ. శ. 1279 నాఁటి ఉన్నాక దేవ శిలాశాసనము (ఆదిలాబాదు మండలము) నను కీర్తితుఁడయిన మహాప్రౌఢ ప్రతాప చక్రవర్తి శ్రీరామచంద్ర దేవుని మహాప్రధాని హేమాడియును, చతుర్వర్గ చింతామణికర్తయగు హేమాద్రి పండితుఁడును అభిన్నులని చరిత్రకారుల నిర్ణయము. వ్రతదాన తీర్థ మోక్ష పరిశేషములను నైదు ఖండముల సంగ్రథిత మయిన విజ్ఞాన సర్వస్వము చతుర్వర్గ చింతామణి. యాదవ రాజుల దేవగిరికి, త్రిలింగ పరమేశ్వరుల ఓరుగంటికిఁగల రాజకీయ సంబంధములు చిరకాల సమీచీనములు. కాకతీయ చక్రవర్తుల కొలువులో మెలఁగి, పాలకుల మెచ్చుకువ వెలయించిన రాజనీతి చతురుఁడు ప్రోలయ వేమారెడ్డి (1300-1353): ఓరుగంటి పతనముతో మధ్యాంధ్ర మహీమండలమున స్వతంత్ర పతాకమెత్తిన ఈరెడ్డి ప్రభువు రెడ్డిరాజుల కుదురునకు మూల పురుషుఁడు. రెడ్డిరాజులకు ఒకటి రెండు తరములు పూర్వుఁడయిన హేమాద్రి పండితుని చతుర్వర్గ చింతామణికి సాగరాంధ్ర సీమలో నుండిన ప్రచార ప్రభావములు అనన్యయము. చతుర్వర్గ చింతామణి త్రిలింగ రాజ పరమేశ్వరు (కాశీ. 3-248) లగు రెడ్డి ప్రభువుల నిత్యానుష్ఠానములకు ప్రమాణ గ్రంథముగా చెల్లుబడి యగుచుండె నట్లును, అది వీరి విమల చారిత్ర శిక్షకా చార్యకము వహించి నట్లును ప్రమాణములు కోకొల్లలు. రెడ్డిరాజు లందఱును హేమాద్రి ప్రోక్తదాన పరులు. హరివంశ కృతిపతియగు ప్రోలయ వేమారెడ్డి 'హేమాద్రి' పరికీర్తితామిత వ్రతదాన నివహంబులన్నియు నిర్వహించె' (హరివంశము. పీఠిక, 19) నని ఎఱ్ఱాప్రెగ్గడ ప్రశంస. ప్రోలయ వేమారెడ్డి తనయుఁడు అనవేమారెడ్డి (1364-1386) 'హేమాద్రి దాననిరత' బిరుదాంకితుఁడు (చూ. శ్రీశైల శాసనము, A. R. No. 20 of 1915; క్రీ. శ. 1377; 132వ పంక్తి) అనపోతారెడ్డి కుమారుఁడగు కుమారగిరిరెడ్డి (1386-1402) యును (చూ. తంగెడ శాసనము, A. R. No. 380

of 1926 ; క్రీ. శ. 1391 ; 9 వ పంక్తి), కొండవీటి పెదకోమటి వేమారెడ్డి (1402-1420) తనయుఁడగు రాచ వేమారెడ్డి (1421-1424) యును (చూ. అమీనబాద శాసనము. A. R. No. 543 of 1909 ; క్రీ. శ. 1415 : 8వ పంక్తి). వీరభద్రారెడ్డి జనకుఁడగు దొడ్డమరెడ్డి అల్లాడరెడ్డి యును (చూ. పలివెల కొప్పేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మంటప స్తంభము మీఁది శాసనము, A. R. No. 503 of 1893 ; క్రీ. శ. 1416 : 41 ; 42 పంక్తులు) 'హేమాద్రి దానచింతామణి' బిరుద విరాజితులుగా కీర్తితులు — వీరభద్రారెడ్డి అగ్రజుఁడు. కాశీఖండకారయిత'.... వేమాంబాల్లమహీశ భాగ్య విభవో వేమ క్షమా ధీశ్వరః...హేమాద్రి దానాని సదాకరోతి...' (చూ. దాక్షారామ శాసనము, A. R. No. 448 of 1893 ; 4, 5, 6...8, 9 పంక్తులు). ఈ అల్లయ వేమారెడ్డి యే '...హేమాద్రి దానక్రియా మహత్వంబున విస్ఫుర సతి యశాన్వితులఁ జేయు ...' నని నిశ్శంక కొమ్మన సాక్ష్యము (చూ. శివలీలా విలాసపీఠిక). కాశీఖండకృతిపతియగు అల్లాడ వీరభద్రయ్య 'హేమాద్రి దానదీక్షితుఁ...' డని రెడ్డిరాజుల విద్యాధికారి శ్రీనాథుని కైవారము (చూ., కాశీ. 5-1). ఈ వీరభద్రయ్య యే 'హేమాద్రి దాన దీక్షా గరిష్ఠుఁడు'గా శివలీలా విలాసకర్త చే కీర్తితుఁడు. వీరభద్రారెడ్డి అనుజన్ముఁడును, శివలీలావిలాస కృతిభర్తయును అగు దొడ్డారెడ్డియును 'హేమాద్రి విశిష్టా దానపరుఁడు'గా వర్ణితుఁడు. ఈ బిరుదములు కేవలము కుల క్రమాగతములని కొట్టివేయ వీలులేదు. ఇవి రెడ్డిరాజుల వితరణ గుణప్రదర్శకములును, ప్రతిపద సార్థకములయిన బిరుదములని వారి శాసనాదికములు ప్రత్యక్ష సాక్ష్యము.

బహమనీ సామ్రాజ్యము బద్ధలగు దాఁక మరాఠ్వాడా తెలంగాణము లొక యేలుబడిలోని మండలములు. మరాఠీభాషయు, తద్వ్యవహర్తలును 'ఆరెము,' 'ఆరె' అను పేరులతో తెలుఁగున వ్యవహృతమగుటకు మధ్య యుగములనుండియు ప్రమాణములు పెక్కులు. పండితారాధ్య చరిత్రయందలి 'ఆరె' పదుసనడకలు సుప్రసిద్ధములు (పుటలు, 381-387, పర్వత ప్రకరణము). '...ఆరెయఁ గన్నడీల రవలఁ దెలుఁగులఁ దన బిరుదందియఁ బగిలి కొలువ వెనడి....' (ద్వా. 1-42)నవాఁడు ననదప్రోలి వెన్నయ మంత్రి. ఈ వెన్నయను, వెలనాటి చోడవంశీయుఁడగు గొంకనృపాలుని మంత్రి ; పదుమూఁడవ శతాబ్ది

వాఁడు. సింహాసన ద్వాత్రింశిక కర్తయగు కొఱవిగోపరాజు ఈ పెన్నయ మంత్రి కేదప్ప తరమువాఁడు. తెలుఁగు సీమలో రెడ్డి (= మునసబు లేక పటేలు), కరణము (= పట్వారి), సెట్టి, తలారి మొదలగు పండ్రెండుగురు గ్రామోద్యోగులను 'బారా బలూతీ' (<మరాఠీ బారా = పండ్రెండు; బలూతేఁ = గ్రామోద్యోగుల హక్కు) అని వ్యవహరించు ఆచారము మహారాష్ట్రులది. నిన్న మొన్నటి దాఁక పశ్చిమాంధ్ర ప్రాంతముల ప్రబల ప్రచారములోనుండిన 'బాళబోడ్' లేక 'బాళబంధు' లిపి సంప్రదాయము మహారాష్ట్రి ప్రభావమునకు మఱియొక మచ్చుతునుక. తెలుఁగువారు కొందరు తమ పేళ్ళ చివర తగిలించుకొను 'రావు' (పీష్వాబాజీరావు, జీవాజిరావు సిందియా, మురారిరావు ఘోర్పడే, యశ్వంతరావు హోల్కార్) మరాఠీ వారిది. ఆంధ్రలో ముఖ్యముగా కర్నూలు, కాకినాడ, గుంతకల్లు పరిసరముల యందలి తోలుబొమ్మలాటలవారు మహారాష్ట్రులు. తెలుఁగు సీమలోని సంచార జీవులగు సుగాలీలు (= లంబాలు, లంబాడీలు) మరాఠీ-గుజరాతీ జాతులకు చెందినవారు; మరాఠీ-గుజరాతీ భాషాసమ్మిశ్రమముతో, స్థానిక భాషాసాహచర్యముతో వికృతినందిన వాగ్రూప వ్యవహారము వీరి భాష. పత్తికొండ సీమకు చెందిన 'ఆరె మరాఠీల' కథయు, పానుగంటి సీమకు చెందిన 'మాయలమరాఠీ' కథయు తెలుఁగులకు సుపరిచితము. తెలుఁగు కన్నడిగుల ఉగాదియును, మరాఠీల ఉగాదియును ఒక్కనాడు. ఏకారణమువలననో గాని తెలుఁగులతోపాటు మరాఠీలును పంచద్రావిడులుగా పరిగణితులు. ఇంకను, ఇట్టి చిల్లర మల్లర పోలికలు సవాలక్ష. ఇది సంక్షేప రూపమయిన చరిత్ర. అనాదియును, అవిచ్ఛిన్నమును అయిన ఇట్టి సమీపసంసర్గ సంబంధము వలన ఈ రెండు ప్రాంతములలోని వ్యవహారభాషలు పరస్పరము ప్రభావితమైయుండు ననుట నిర్వివాద విషయము. తొలినాళ్ళలోని ఆదాన ప్రదానముల మహారాష్ట్రిప్రాకృతము ప్రముఖపాత్ర వహించినట్లు చరిత్ర. మహారాష్ట్రిప్రాకృత పుత్రికయగు మరాఠీ పండ్రెడవు శతాబ్దాంతమునఁ గాని సాహిత్యస్థాయినందికొనలేదు[4]. ఆమాటకు వచ్చినచో, పండ్రెండవు శతాబ్దికి

---

3. తిరుమల రామచంద్ర, మనలిపి పుట్టుపూర్వోత్తరాలు, పుటలు 164-166.

4. శ్రవణబెళగుళ (క్రీ. శ. 983), దివే ఆగర (క్రీ. శ. 1060), అంబేజోగాయి (క్రీ. శ. 1144) శాసనములు మరాఠీ భాషానేపథ్యాలంకారములని కొందఱు (Vide: Prof S. G. Tulpule, An Old Marathi Reader, Poona).

పూర్వము నవీనోత్తరాహా భాషలేవియును పురిటి గదినుండి వెలికివచ్చినవి కావు. ఈ సంసర్గముకారణముగా తెలుఁగు పదములెన్నో మరాఠీ వారి నోళ్ళలో నలుగుడువడి వ్యావహారిక రూపములుగా కోశముల కెక్కియు, పండితకవి సమ్మతిని బడసి సాహిత్యస్థాయిని సంపాదించియు అక్షరరూపమున చిరస్థాయి యయినవి. అడకిత్తా (= అడకొత్తు), ఆటపాట (= బాలికల ఆట), ఊరగుడి, ఓనామా, కట్ట (= అరఁగు), బసవీ, (= వేశ్య), బాగ (= బాగు), వకటి (= విటదాండు–బిళ్ళంగోడి లేక చిల్లకట్టె– ఆటలో 'ఒకటి' అను అంకె), సజ్జగురా (= సజ్జకొఱ్ఱ). ధాన్యవిశేషము–మొదలగునవి మరాఠీలో మచ్చికపడిన కొన్ని తెలుఁగు పదములు5. వీనిలో ఒక కొన్నింటికి కావ్యప్రయోగములును లేకపోలేదు. భక్తకవి యగు జ్ఞానేశ్వర (క్రీ. శ. 1290) కృతమగు 'జ్ఞానేశ్వరి' (భగవద్గీతకు మరాఠీలో విపుల వ్యాఖ్యానము) యందును, మహానుభావ పంథము నెందిన భాస్కరభట్ట కవి (క్రీ. శ. 1305) రచితమగు 'శిశుపాలవధ' యందును పూర్వోక్తములగు తెలుఁగు పదములలో కొన్ని ప్రయుక్తము. 'విటిదాండు' ఆట లెక్కింపులోని వకటి, లేండ, మూండ, నాల, ఆర, వైద–అను అంకెలు క్రమముగా తెలుఁగునందలి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఆఱు, ఐదు–అనువానికి వికృతులు. మరాఠీలో ఈ యాట యందు ఆర (= ఐదు), వైద (= ఆఱు) అని వ్యవహారము. మూలపదముల అర్థము తెలియమి పరిగణన క్రమము నందలి ఈ తబ్బిబ్బునకు మూలము. ఇట ప్రత్యర్థకముగా 'మూండ' అని ప్రాచీనోచ్చారణమునకు గుఱుతుగా పూర్ణబిందు ఘటితరూపము నిర్వాహమగుట గమనార్హము । ఆరేడు శతాబ్దుల క్రిందటిమాట. మరాఠ్వాడాలో పంద్రెండేండ్లు వఱపు పట్టి పెద్దకఱవు రాగా. ఆరె వారు ఆబాల గోపాలము సుభిక్షమగు తెలుఁగు సీమకు వలసవచ్చిరట ; ఆ పంద్రెండేండ్లసావాసము ఊరకపోలేదు. 'సోళా దొప్పియునెత్తమున్ మొదలుగా జూదంబు....'లలోని పరిభాష యంతయు మరాఠీవారి ఆటలనుండి తెలుఁగున దిగుమతి యయినది.6 తెలుఁగు పిల్లల ఆటపాటలు మరాఠీ బిడ్డలు నేర్చిరఁట ; తెలుఁగు అంకెల పరిభాష కలిగిన 'విటిదాండు' దీనికి సాక్ష్యము. ఇది, మన గొప్పకు చెప్పెడి

5. K. P. Kulakarni, Marathi Etymological Dictionary.

6. ఉత్తరహరివంశము, తృతీయా 120–129.

అన్యోన్య ధన్యతా కథనము కాదు. ఇది, మరాఠీ పండితులును, చరిత్రకారులును అంగీకరించిన యంశము.[7] మరాఠీయందలి ఇట్టి తెలుఁగు పదములను గూర్చి వివరించు భారము మరాఠీపండితులది. తెలుఁగునందలి మరాఠీపదములు శ్రీనాథయుగీనములు ఈ వ్యాసమున వివృతములు. తదర్వాచీన యుగీనములగు పదములు : ఉగ్రాణము < మరాఠీ ఉగ్రాణ, ఉగ్రాణీ ; సంస్కృత. ఉద్గ్రాహిణ (ణీ) : చూ. ప్రాకృత. ఉగ్గహాణ : తెలుఁగు. గడమ (వ)ంచు, గెడంచు, గెడమంచ (చి). < మరాఠీ. ఘడమంచ, ఘడోంచీ < ప్రాకృత. ఘడమంచ < సంస్కృత. ఘటమంచ (చక). ఇది దిక్ప్రదర్శనము మాత్రము.[8]

ఇఁక, ఆయుగము నాఁటి పారసీక సంబంధము మాట : ఉత్తరాపథమున మొహమ్మద్ ఘజ్నవీ, షాహబ్-ఉద్-దీన్ మొహమ్మద్ గోరీల మెఱపు దాడులు[9] కడచని, ఖిల్జీసుల్తానుల (క్రీ. శ. 1290–1320) పాలన అంతరించి, తుఘ్లక్ వంశీయుల (క్రీ. శ. 1320–1414)ను సయ్యద్ వంశీయులు క్రీ. శ. (1414–1450)ను, లోడీ వంశీయులు (క్రీ. శ. 1451–1526)ను క్రమముగా ఢిల్లీ సింహాసన మధిష్ఠించిన కాలమది. ఆర్షధర్మ నిర్వాహకములుగా పెట్టని కోటలయిన దేవగిరి, ఓరుగంటి రాజ్యములు పతనము కాఁగా తండములు తండములుగా వచ్చు ముస్లిముల దాడుల నరికట్టుటకుగాను క్రీ. శ. 1336 లో విజయనగర సామ్రాజ్యమునకు విద్యారణ్యుల చేతి మీఁదుగా శంకుస్థాపన జరిగి, విజయ పరంపరలతో, విద్యావినోదములతో తుంగభద్రా సముత్తుంగ తరంగ రంగములు నూత్న భంగిమల నంగీకరించిన స్వర్ణయుగమది. దీనికి పక్కలో

---

7. సురవరము ప్రతాపరెడ్డి, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ద్వి. ము., పుటలు 84, 85.

8. మఱికొన్ని ఉదాహరణములకు చూ. డా. భద్రిరాజు కృష్ణమూర్తి, మాండలికవృత్తి పదకోశం (వ్యవసాయ విభాగం) ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ప్రచురణ, 1962, పుటలు 33, 34.

9. వీరి మెఱపుదాడులవలన ఉత్తర భారత భాషలేవియును ప్రభావితము కాలేదని డా. హరదేవ్ బాహిరి నిర్ధారణము (Vide: Dr. Har Dev Bahri, Persian Influence on Hindi, pp. 3, 4). ఇట్టిచో దక్షిణభారత భాషల ప్రస్తావము అప్రస్తుతము.

బల్లెముగా క్రీ. శ. 1347 లో తెలుఁగు-కన్నడ నాడుల కూడలియగు 'గుల్బర్గా' రాజధానిగా బహమనీ సామ్రాజ్యము అవతరించి నిరంతర ప్రతిభటత్వముతో ప్రభుత నిర్వహించిన స్పర్ధాసమయ మది. కాలము, కర్మము కలసిరాక ఆంధ్ర సురత్రాణ బిరుదాంచితులగు ముసునూరి దొరల రాచసిరి తరలిపోఁగా, కొండ వీడు, రాజమహేంద్రవరములలో రెడ్డిరాజులును, రాచకొండ, దేవరకొండలలో వెలమఱేడ్లును, అహమహమికతో రాచఱికము నెఱపిన రగడ రోజులవి. ఈ యుగమున హిందూ ముస్లిము పాలకులకు జరిగిన సంధి విగ్రహాదులు అసంఖ్యాకములు. వాని నన్నింటిని పేరుపేరున పేర్కొ_నవలయుచో ఇది యొక కంబరామాయణము కాఁగలదు. విస్మృతాంశములు కొన్ని ఇట విస్తృతము.

ఢిల్లీశ్వరులకు నామమాత్రపు సామంతులుగా, పాండువాపట్టణము రాజధానిగా బంగాళా సుబాను పాలించిన సుల్తానులనే శ్రీనాథుఁడు 'పండువాసురతాణు'లని వ్యవహరించుట. వీరికే లక్ష్ణావతీ పాదుషాలనియు వ్యవహారము. వీరిలో ఘియాజ్-ఉద్-దీన్ అజమ్‌షా (క్రీ. శ. 1389-1410), సైఫ్-ఉద్-దీన్ హంజహ్‌షా (క్రీ. శ. 1410 - 1412), షిహాబ్-ఉద్-దీన్ బా యజీద్ షా (క్రీ. శ. 1413-1414). అలా-ఉద్-దీన్ ఫిరోజ్‌షా (క్రీ. శ. 1414-1415), జలాల్-ఉద్-దీన్ మొహమ్మద్ షా (క్రీ. శ. 1415-1431)లు శ్రీనాథునకు సమకాలికులగు 'పండువాసురతాణులు' పదుమూఁడవ శతాబ్దాదినుండియు పండువా - కటకములకు సరిహద్దు వివాదముల మూలమున అప్పటప్పట చిటిపొటికయ్యములు సాఁగుచుండెడివి. పండువాసురతాణులలో పూర్వుఁడగు షంష్-ఉద్-దీన్ ఇల్యాస్‌షా (క్రీ. శ. 1345-1359) ఫౌజులు 1353 లో ఒరిస్సాపై దండెత్తి చిలకసరస్సు దాఁక కూచిచేసినవి.[10] బంగాళమునకును, సాగరాంధ్రమునకును నడిమిడి ఉత్కళదేశము. 'మధ్యాంధ్ర మహీశులగు రెడ్డిరాజులును గౌడాధిపతి గెల్చి గజపతిదళవిజాళాఖ్యాన బిరుదంబు లలవరించి......సింహాచలోత్తరభాగలిఖిత వివిధ జయశాసనాక్షర...సమిద్ధగుణులు.'[11] రెడ్డిరాజులు, పండువాసురతాణులు ఈ ఉభయులును కటకేశ్వరులకు అహితులు. ఒకే శత్రువునకు సామాన్య శత్రువులగుట కారణముగా ఈ యుభయులును పరస్పరము

10. R. C. Mazumdar, Delhi Sultanate.

11. నిశ్శంకకొమ్మన శివలీలా విలాస పీఠిక.

హితులు; సమాన వ్యసనవ్యాపారములచే సన్నిహితులు. తన్మూలముననే 'పండువాసురతాణి పావడం బంపిన భద్రేభములు (రాజమహేంద్ర) వీధిం జాలె ముందు' (భీమ. 1-38; కాశీ. 1-35) టః. ఇంతేకాదు. 'పండువాఢిల్లిరాధాది పట్టణముల యధిపతుల మౌళిఁదాల్చు రత్నాంకురంబులవచి త్రిపురాంతకానీత యానపాత్ర సింహళ ద్వీపమండల క్షేత్రజములు' (హర. పీఠిక 29) ఈ అవచిత్రి పురాంతకుఁడు 'కొమరగిరి నృపవసంతాగమ కేళిగంధసార కస్తూరీ కుంకుమ కర్పూర హిమాంభస్సముదంచిత బహుసుగంధి శాలాధ్యక్షుఁడు' (హర. పీఠిక, 30). అవునో కాదోకాని, అర్వాచీనుఁడును, కావ్యాలంకార సంగ్రహకృతిభర్తయును నగు నరసభూపాలుఁడు 'మక్కామండువ పండువా భయదదోర్మాహాత్మ్య' (కావ్యా. సం. 5-244) ము కలవాఁడఁట! పారసీక భాషావలంబులగు పండువా సురతాణు లిట్లు మన సాహిత్యమున ఉట్టంకితులు.

మఱియొక దిక్కు: ధారా, మండువా పట్టణములు రాజధానులుగా, వింధ్యాద్రి పాదములఁగల మాళవదేశ దక్షిణ భాగమును పాలించిన ఘూరీ వంశీయులగు సుల్తానులు (క్రీ. శ. 1401-1500) ఆంధ్ర సాహిత్యమున ధారాసురత్రాణులుగా వ్యవహృతులు. వీరే మండువా సుల్తానులు. వీరు అటు గుజరాతు నవాబులతోడను, ఇటు హిందూ పాలకులగు ఒరిస్సా ప్రభువుల తోడను నిరంతరము యుద్ధములు చేయుటయందే గడపిరి. ఈ సుల్తానులలో నొకఁడగు హూషంగ్ (క్రీ. శ. 1405-1435) కుటిల రాజనీతి కోవిదుఁడు; క్రీ. శ. 1421 లో కటకేశ్వరుఁడగు నాల్గవ భానుదేవుని (క్రీ. శ 1409 - 1435) కపట ప్రబంధమున ఓడించి, చెఱపట్టినవాఁడు.[12] కటక విజయముతో మత్తెక్కి, భద్రజాతి గజసైన్యముతో రాజమహేంద్రపురమును ముట్టడించి, వొద్దయ అల్లాడరెడ్డి చేత నిర్జితుఁడయినవాఁడు ఈ హూషంగ్. వాస్తవముగా భద్ర జాతి గజముల పెంపకమునకు ధారాసురత్రాణులు పెట్టినది పేరు. కడిమి కత్తుల మ్మనివర్ణించు సందర్భమునందలి 'వాని చన్నుదోయి ధారాసురత్రాణ కటక కుంభి కుంభకలహకారి' యను క్రీడాభిరామకర్త ఉత్ప్రేక్ష దీని కనుప్రాసము. 'ప్రబల ధారాసురత్రాణ భద్రజాతి కరిఘటా సైన్యదుస్సాధ కనక లోహ గోపురద్వాః కవాటప్రదీపి తనదిసాంద్రవిభవంబు రాజమహేంద్రపురము' (కాశీ. 1-58)

12, R. C. Mazumdar, Delhi Sultanate.

రాజధానిగా 'చీకటియున్ గళింగియును చిల్కసముద్రము సింహశైలమున్... ఏకసితాత పత్రముగ నేలిన ఉత్తమ శ్లోకుఁడు......' (కాశీ. 1-60) అల్లాడ వీరభద్రారెడ్డి 'ధారాపట్టణ సార్వభౌమ సురధాణద్వారాపహారక్రియా ధౌరంధర్య పటిష్ఠ నిష్ఠుర భుజాదండభోళి సంరంభ...' (కాశీ. 5-37)ము వలన 'ధారాసురత్రాణ దర్ప ధరణీధ్ర పవి' (కాశీ. 6-309) యని బిరుదందినవాఁడు. వీరభద్రారెడ్డి జనకుఁడగు దొడ్డయ అల్లాడరెడ్డి '...ధారాసురత్రాణుఁ బోర నిర్జితుఁజేసి కొల్లవెట్టించెఁ దద్ఘోటకముల...' అని శివలీలా విలాసకర్త నిశ్శంకకొమ్మన కథనము. 'ధారాసురత్రాణ ఘాటీ సమారంభ గర్వపాథోరాశికలశజులు...వీరభద్రేశ వేమ పృథ్వీధవులు...' (భీమ. 1-29) అని వీరభద్రారెడ్డి విద్వాంసుఁడు కైవారముసేయుట 'ధారాసురత్రాణ పరాజయము' ప్రాధాన్యమును ఆమ్రేడించుటకు '...అల్లాడాధీశు వేమ క్ష్మాధీనాథు భూరి నిష్ఠుర ధాటీ విహార చటుల సైన్యనాసీర తుక్ఖార శఫపుటోత్థ విన్ధ్యపార్శ్వ వసుంధరా విభుఁధూళి' (కాశీ. 1-34) దీనికి ఉపబలకమగు మరియొక ఉపపత్తి.[13] జాఁగామలు నిర్ధారింప

13. చరిత్ర కావచ్చును, కాకపోవచ్చును గాని ఇక్కడ ఒక చమత్కారము. సుమేరుశైలముతో ప్రతిఘటించిన వింధ్యమహీధర వృత్తాంతము రెడ్డిరాజులకు, ధారాసురత్రాణులకు ప్రధానత్వాపేక్ష నడచిన పోరాటములకు వ్యంజకముగా వర్ణ్యమని నా యూహము. సంస్కృత కాశీ ఖండమున వింధ్యాటోపఘట్ట మింత విశిష్టముగా లేకపోవుట నా యూహకు ప్రధానబలము. శ్రీనాథుని సంతరింపునంపలి కొన్ని భంగ్యంతర సూచనలు దీనికితోడు. వింధ్యమువలె 'ఒరుల యైశ్వర్య మీక్షించియు పరితపించునట్టి ఖలుఁడు...' (కాశీ. 3-6) ధారాసురత్రాణుఁడు. వింధ్యము ప్రతిస్పర్థించిన సుమేరుశైలము సురాష్ట్రపాలకుఁడగు గుజరాతు నవాబు అహమ్మదుషాహి (క్రీ. శ. 1411-1443). వీరభద్రేశ వేమ పృథ్వీధవుల మంత్రి బెండపూఁడి అన్నయ పారసి బాసలో కాకితములు వ్రాసినది ఈ అహమ్మదుషాహికే అఁట! (Vide: History of the Reddi Kingdoms, p. 186, Fn. 38). రెడ్డిరాజులకు మిత్రులయిన **గుజరాతు** నవాబులకును, జ్ఞాతిభ్రాతృజ్జిగీషా చింతాగ్రస్తులగు ధారాసురత్రాణులకును నిరంతరము పోరాటములు సాఁగుట చరిత్రప్రసిద్ధము. 'ఉదయ పర్వత కటక గండోపలము అ... ప్రాఁకిన భానుకిరణముల......' (కాశీ. 1-122) కటకేశ్వరుఁడు నాల్గవ భానుదేవుఁడు (క్రీ. శ. 1409-1435) వ్యంజితుఁడు. 'ఒక్క నిమేషము రాహువు పుక్కిటిలోఁ దగులు వడకపోయెడు భానుం డిక్కొండ పక్కఁజిక్కు... (కాశీ. 1-134) టలో వింధ్యపార్శ్వవసుంధరా సురత్రాణుఁడగు హూషంగ్షా చెఱలోఁజిక్కి చీకాకుపడిన నాల్గవ భానుదేవుఁడు సూచితుఁడు. 'భాను...ప్రతిబంధము త్రైలోక్యప్రతిబంధంబై

అనువుపడలేదుగాని '...బోనగిరి చెంచీకొమ్మ ధారాపురీ పెనుగొండాద్యఖిలైక దుర్గహరణ ప్రెంఖత్ప్రతాపోదయుఁడు' (జై. 6-271) అఁట జైమినీభారత కృతిపతియగు సాళ్వగుండ నారసింహరాజు! ఆ పిమ్మట ఉద్ధతుల మధ్య పేదలగు రెడ్డిరాజులకు 'కర్ణాటోత్కల పారసీకనృపసఖ్య' (కాశీ. 3-249) ము అవశ్యమయి, 'ఉత్కల కర్ణాట తురుష్కరాట్పరమమిత్రులు' (కాశీ. 2-165)గా వారు మెలఁగ ప్రయత్నించినను వారి ప్రభుత్వము అనతికాలముననే ఆరతి కర్పూరమయినది. మనకు మిగిలినది 'దాక్షారామ చళుక్యభీమ వరగంధర్వాప్సరోభామినీ వక్షోజద్వయ గంధసార ఘుసృణద్వైరాజ్యభారంబు నధ్యక్షించు' కవిసార్వభౌముని ప్రౌఢసాహిత్యము. ఈ సాహిత్యమే ప్రస్తుత సమీక్షా వ్యాపారమునకు మొదలు సంచి.

బహమనీ సులతానులు, గుజరాతు నవాబులు, ఘూరీ వంశీయులగు ధారా సురత్రాణులు, పండువా పాదుషాలు రాజకీయ భాషగా పారసిని చేపట్టి రాజ్యభార భరణ వ్యాపార దక్షులయిన శతాబ్దమది. ఈ యీ ముస్లిము పాలకులతో రాజకీయ సంబంధములను సమర్థముగా నిర్వహింపవలయుచో, అందఱు కాకపోయినను పరిసర సీమలలోని బాహత్తరి నియోగము వారిలో ముఖ్యులు కొందఱయినను పారసి భాష నభ్యసింపక తీఱదుకదా! శక్తిత్రయ చతురుపాయ షాడ్గుణ్య ప్రయోగ్యయోగ్యవిచారులగు రాయబారులు '.....లిపులెల్లఁ జదువను లిఖియింపవలఁతులై భాషలఁ బెక్కింటఁ బ్రౌఢిగల్గి...' (342) యుండవలయుననియు, గణకుఁడు 'అలఘుచిత్తుఁడు లఘుహస్తుండునై పెక్కులిపులభ్యసించి

విపత్పరంపరలఁబెనచు...'(కాశీ. 1-136)ట భానుదేవుని నిర్బంధము త్రైలోక్యవిజయ మంటపాధిరూఢులగు రెడ్డిరాజులకును విపత్పరం పరలకు మూల మనుట వ్యంగ్యము. వింధ్యమాఁకిడుటవలన నయిన ఆపదను తొలఁగింప అగస్త్యుని వేఁడ కాశికరిగి, 'నిఖిల దేవతా సార్వభౌమునకు త్రైలోక్యసామ్రాజ్య పట్టాభిషేకంబునకుఁ దగిన హేమ పీఠంబునుంబోని యమ్మహాస్థానంబు గలయఁగ్రుమ్మరి' (కాశీ. 2-42)న వారు జంభ మథన పురోగములైనసురలు. 'త్రైలోక్యవిజయాభిధంబైన చంద్రశాలా ప్రదేశంబునందు' (కాశీ. 1-10) కాశీఖండ కృతిస్వామి వీరభద్రేశుఁడు ద్వితీయ శంభుఁడు కొలువుతీరుట భంగ్యంతర సూచన. వింధ్యగర్వాటోప భంజనుఁడు కలశజుఁడు. 'ధారాసురత్రాణ ధాటీసమారంభ గర్వపాథోరాశి కలశజులు...వీరభద్రేశ వేమ పృథ్వీధవులు...' (భీమ. 1-29). 'కలశజులు' వ్యంగ్య వైభవమునకు పతాక.

యేలికకు మిగుల ననుకూలుఁడై...'(303) మెలఁగవలయు ననియు మడికిసింగన (క్రీ. శ. 1430) సకల నీతి సమ్మతము మతము మంచన కేయూరబాహు చరిత్ర కృతిపతియగు గుండనామాత్యునకు '......వాచకత్వము లేఖకత్వము నాంధ్రలిపిరీతిగా సర్వ లిపులయందు – ఫణితి జాతియుఁ దీవ్రభంగియును తెనుంగుబాసపోలిక సర్వభాషలందు......సహజమఁట ; పంచాంగస్థిర మంత్ర రక్షణ కళాప్రౌఢులును, స్వామి కార్యనిర్వహణ ప్రవీణులునునగు రెడ్డిరాజుల అమాత్యులును పరిసర భాషలను, ముఖ్యముగా పారసిని నేర్చి, అభ్యస్తలిపి ప్రపంచులయి నియోగము నెఱపుట తప్పనిసరి ; కొండవీటి మహామాత్యుఁడును, శృంగారనైషధ కృతిభర్తయునునగు మామిడిసింగన 'యవనాదిశ సభానిరంకుశవచో వ్యాపారపారంగతుఁడు' (నైష. 2-144) వీరభద్రారెడ్డి మంత్రియగు బెండపూఁడి అన్నయ (క్రీ. శ. 1423-1447) 'అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్ర గాంధార ఘూర్జర భాషల్ మళయాళభాష శకభాషా సింధు సౌవీర బర్బరభాషల్ కరహాటభాష మఱియుం భాషావిశేషంబులు...' (భీమ. 1-73) గోష్ఠీ సంప్రయోగముల అచ్చెరువుగా నియోగింప నేర్చిన వ్యవహారవేత్త. ఈ 'అన్నయ మంత్రిశేఖరుఁ డహమ్మదు షాహివదాన్య భూమి భృత్సన్నిధికిన్ [14] మదిన్ సముచితంబుగ వేమమహీవరేంద్ర రాజ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ బారసిభాష...' (భీమ. 1-74) లో కాకితములు వ్రాసిన స్వామి కార్యాభిరక్షక్రియాదక్షుఁడు. 'కర్ణాట...ఘూర్జరాది నృపసభాస్థాన బుధవర్ణనీయ సుగుణ మండనుండగు బెండపూఁడన్న మంత్రివరుఁడు...' (భీమ. 1-19) శ్రీనాథుని కృతిపతులలో నొకఁడు. ఈ సమీక్షా కాలమున రాజకీయ సంబంధమేకాక, వాణిజ్యపరమయిన సంసర్గమును లేకపోలేదు. [15] మన బేహారులు, "విలాతి బాజారు దుకాణదారులనుండి జలతారు

14. ఈ పాదము 'అన్నయ మంత్రిశేఖరుఁడహమ్మదుషా గుజరాత భూమి భృత్సన్నిధికిన్...' అని యుండుట యుక్తమని మల్లంపల్లి వారి సూచన (Vide : History of the Reddi Kingdoms, p. 186, Fn. 38).

15. He (Firuz Shah of Bahmani, 1397-1422 A.D.) devoted much attention to the two principal ports of his Kingdom Chaul and Dabhol, which attracted trading ships from the Red sea and Persian gulf, and poured in to the Kingdom articles of necessity and luxury not only from Persia, Arabia and the African coast, but also from Europe (R. C. Mazumdar, Delhi Sultanate, p. 256).

కుల్లాయులు, జరీ శాలువులు, ముఖమల్లు మోజాలు, లాలు జీబులు, పింగాణీ సామానులు, సుప్పాణీ ముత్యములు, గంజాయి, గసగసలు మొదలగు లాహిరి దినుసులు, హురుముంజి తేజీలు, కప్పలి, జోంగు, వల్లి, వలికా, సమ్మాన్లలో తెప్పించి సరిసు వెలలకు విక్రయించి, అసలు ఖర్చు వహితేల్చి కోటికి పడగ లెత్తినవారు. జలపోసనపు జమ్ముఖానములు పరచిన హజారపు చావడిలో జాళువా పైండి తఖ్తుపై తబల, సన్నాయి, దమామలు మ్రోయ ఖుసిమీరన్ సురధాణి నిండుకొలువై కూర్చుండెడివాఁడు. కొజ్జాలు, గులాములు సేవింప, నకీబులు పరాకు లెచ్చరింప, విలాతిఖానులు, సరిహద్దు సహేలు పంపిన రాయబారులు వచ్చి అరబి, అరె, పారసి, రుమీ మొదలగు భాసలలో వ్రాసిన కాకితములను వినిపించెడివారు. విలాతి దుకాణదారులు వచ్చి కుందనపు కమ్మరుబందులు, చికిలిసేసిన అపరంజి మోళపు బాఁకులు, ఓబ్బీల గాగరాలు ఉలుపా చదివించెడివారు. జూటరులు గలబ, జులుము, లూటిసేయకుండ గస్తుకావలివారు కాఁపుండెడివారు. కంఖాణి, కత్తలాని, సామ్రాణి, జిరా తేజీలపై చబుకుసేయు సవాలక్ష పౌజు బరాబరులు సేసెడిది."[16] 'చీని సింహళ తవాయి హురుముంజి చోళంగి తరుణాసీరిగోవ ప్రభృతి నానాద్వీప నగరాకరంబులగు ధనకనక వస్తు వాహన మాణిక్య గాణిక్యములు తెప్పించెడి అవచితిప్పయసెట్టి' (హర. 1-7) హరవిలాస కృతిపతి ; శ్రీనాథునకు బాల్యసఖుఁడు. 'హరిహరరాయ ఫేరోజ జహా సురధాణ గజాధిపాదిభూవరులు నిజప్రభావ మభివర్ణనసేయ కుమార గిర్యధీశ్వరుని వసంత వైభవము సర్వము నొక్కఁడ నిర్వహించు...తిరుమల నాథసెట్టి...' (హర. 1-24) అవచి తిప్పయ కనుజన్ముఁడు.

వ్యాకరణ సంప్రదాయము : తెలుఁగు వ్యాకర్తల విభజనలో శబ్దజాలము తత్సమ తద్భవ దేశ్యములని మూఁడు ముఖ్యవర్గములు. 'ఒక భాషలోని కితర భాషలనుండి సంక్రమించిన పదములన్నిటిని అన్యదేశ్యములుగాఁ బరిగణించినఁ జాలదా అని విచారించినచో వీరికి సాంప్రదాయము ప్రాకృత వ్యాకరణముల ఫక్కి ననుసరించుట వలన వచ్చినదని తెలియకపోదు'[17] తాను, 'త్రాసు' అను

---

16. ఈ యుద్ధరణ చిహ్నముల నడిమి కూర్పు పదపట్టికలో నుద్దంకితమయిన అన్యదేశ్యముల చేర్పు.

17. కోరాడ రామకృష్ణయ్య, ఆంధ్రదేశ్యము – అన్యదేశ్యము, భాషాచారిత్రకవ్యాసములు, పు. 111,

అన్యదేశ్యమును ప్రయోగించియు కేతన, అన్యదేశమును పేర్కొనకపోవుట వింత. అచ్చతెనుఁగు కాక దేశితెనుఁగులు (ఆంధ్రభాషా భూషణము, 24), దేశ్యంపుఁ దెనుఁగులు (పై ది. 25) అను రెండు ఏకములయిన పట్టికల నిచ్చుటలోని పరమార్థము దురూహము. కావ్యాలంకార చూడామణి కర్తయగు విన్నకోట పెద్దన (క్రీ. శ. 1405).

'కవమునఁ దత్సమమును ద
ద్భవమును సహజాంధ్రదేశభవమును
దేశోద్భవమును గ్రామ్యముననఁ బం

చ విధములై తెలుఁగు పలుకుజాతము పరఁగున్' (కావ్యాలంకార చూడామణి. 9-11) అనియు

'శ్రేయములై బహు దేశా
నేయములై చక్కఁదనము నెఱఁదనములునై
యాయా నెలవులఁ జెవులకుఁ

దీయములగు పలుకులెల్ల దేశ్యములరయన్' (పై ది. 9-16) అనియు నిరూపించినాఁడు. దేశోద్భవమనఁగా పరిసర స్థలములగు దేశభాషలనుండి ఎరవుతెచ్చిన పదరాశికాఁబోలు ; బహుదేశానేయములైన దేశ్యములివియే, సహజాంధ్ర దేశభవము అనఁగా తెలుఁగు సీమకు విసర్గములయిన పదములని అన్వయము. కాని, దేశి నామకములైన పదముల పట్టికలో అచ్చెరువు, డిల్ల (పాటు), (నె)మ్మోము మొదలగు తద్భవములుండుటను ఎట్లు సమన్వయింప వలెనో తత్త్వాభిజ్ఞులు నిర్ణయింతురుగాక !

'తజ్జాసమాచ దేశ్యా గ్రామ్యా చేయం చతుర్విధా భవతి.
ప్రకృతిద్వయ జాతజ్ఞాతుల్యాతు సమా ప్రవాహిని దేశ్యా'—

అని ఆంధ్ర శబ్దచింతామణి. 'ఆహేయ మన్య దేశీయం యత్తదేవ ప్రయుజ్యతే' (వికృతి వివేకము, సంజ్ఞా. కా. 9) అను వికృతి వివేకకారుని హృదయమేమో సుబోధముగాదు. ఈ పట్టునఁగల వ్యాఖ్యాతల వివరణమును కారికాతత్త్వ

ప్రకాశకముగా స్వీకరించుట యుక్తియుక్తముగాఁదోఁపదు. తేజీ, నేజా – మొదలగు అన్యదేశ్యములను బాల సరస్వతి దేశ్యములని వ్యవహరించినాఁడు. (చూ. బాల సరస్వతీయము, అజంత, 'నచదేశ్యపదే' అను సూత్రము క్రింది వివరణము), అప్పకవి (క్రీ. శ. 1656) శుద్ధాంధ్రంబులు, అన్యదేశ్య జాంధ్రంబులు అని ఆంధ్రదేశ్యము రెండు తెఱంగు లయ్యెనని చెప్పి (చూ. అప్పకవీయము. 1–105) లక్ష్యములు పేర్కొనినాడు.

'... ఆంధ్రులు నానా
దేశంబుల యందు నిలిచి తెలుఁగులె తత్త
ద్దేశోక్తులంటఁ బలికిన
నా శబ్దములన్యాదేశ జాంధ్రములయ్యెన్ 18'
(పైది. 1–108) అని నిర్వచించి

'ఆలంబు చివ్వ....మక్కువ తెల్లమియనఁ దనరు నిటులన్యదేశ జాంధ్రములు పెక్కు' (పైది. 1–109) అని కొన్ని పదముల నుదాహరించినాఁడు. వాస్తవముగా నివి అన్యదేశ జాంధ్రములు కావు. విన్నకోట పెద్దన నిర్దేశించిన సహజాంధ్రదేశ భవమును, అప్పకవి చెప్పిన శుద్ధాంధ్రంబులు నొక్కటెగ. పెద్దన దేశోద్భవమే అప్పకవి పేర్కొనిన అన్యదేశ జాంధ్రము. కవి జనాంజనకారుఁడగు కిమ్మూరి నరసరాజు (క్రీ. శ. సు. 1800)...కొన్నిటికి హ్రస్వ దీర్ఘములు కూడా కలవు.....లకోరీ మొదలైన దేశ్య పదాలకు యెట్లంటె :

'పాదుశానవలా హూ మాదులు దేశ్యంబు లోలినిందు లకోరీ లకోరి
తేజి తేజీ నేజ నేజా కటారీ–కటారి బాజాది రెంటను జెలఁగు...'అని

'పాదుశా...కటార్యాదులను దేశ్యములుగా నిరూపించినాఁడు.19 కాఁగా, మన వ్యాకర్తల విషయ విభాగ నిర్ణయమున ఏకవాక్యత లేదనియు, లక్ష్యలక్షణ సమన్వితము గాకుండుటచే సుబోధముగా లేదనియు తాత్పర్యము.

---

18. అప్పకవి యీ తీర్పును దృష్టిలో నిలిపికొనియేకాఁబోలు, 'ఆంధ్రులితర దేశముననిలిచి యా యితర భాషలలోని పదములను దమభాషలోఁగలుపు కొనినవి అన్యదేశ్యము' లని సులభవ్యాకరణ కారుఁడు వ్రాయుట. 'ప్రసిద్ధాన్యదేశ్యంబులు ప్రయోగార్హంబు' లని వ్రాయుచు గాణపతసూత్రవివరణ కర్త తమిళకర్ణాటపదములను ఉదాహరించుటయు ఇంచుమించు ఇట్టిదే.

19. కవిజనాంజనము, విశాఖపట్టణము వరవస్తువారి గ్రంథాలయమునందలి తాళపత్రప్రతి. 80 వ ఆకు. 2 వ వైపు.

శబ్దరత్నాకరకారుని దృష్టి

'దేశ్యము ఆంధ్రదేశ్యము, అన్యదేశ్యమని ద్వివిధము. ఆంధ్రదేశ్యము.—తల్లి, తండ్రి లోనగునది. అన్యదేశ్యము.—తావి, మోవి లోనగునది' (పు.xi, భాషాప్రశంస, శ. ర., 1885) ఇదీ శ.ర. కారుని చూపు 'అన్యదేశ్యము దేశ్యముతోఁ జేర్పఁబడినది గాన దానికిఁ బ్రత్యేకముగా సంజ్ఞ యిడఁబడదు.' (4వ నియమము, నియమ విధానక్రమము, పు. xviii, శ. ర.). కాని, శ ర లో ఈ నియమము సక్రమముగా పాటింపఁ బడలేదనుట క్రింది ఉదాహరణముల మూలమున స్పష్టము. శ. ర. తొలి ముద్రణము నందే అటనట 'ఇది అన్య దేశ్యము' అని కొన్ని పదముల యొద్ద సూచితము. శ. ర. మలి ముద్రణము లలో హిం. (= హిందూస్తానీ), అన్యదే. (= అన్యదేశ్యము) అను సంకేత ములు ధారాళముగా ఉపయుక్తము. శ. ర. తొలి ముద్రణము ప్రతినుండి మచ్చు నకు కొన్ని : 1. అచ్చాళు : దే. విణ. (అచ్చము + ఆళు) జంజాటము లేని వాడు...(ఆళు అన్యదేశ్యము). అనుబంధము, పు. 1125. 2. జెండా : దే వి. టెక్కెము, ధ్వజము,....(ఇది అన్యదేశ్యము), అను. పు. 1142. 3. దస్తూరిః దే. వి. వ్రాఁత.... (ఈ యన్యదేశ్య మీ గ్రంథము నందు మాత్రము కనఁబ డెడి), పు. 530. 4. నగాను : దే. వి. చిత్రము (ఇది అన్యదేశ్యము). అను. పు. 1146. 5. నంబెరుమాళ్ళు : దే. వి. బ. (నమ్ + పెరు మాళ్ళు) శ్రీరంగ నాయకులు. (ఇది అన్యదేశ్యము). అను. పు. 1146. మలి ముద్రణములలో 'ఇది అన్యదేశ్యము' అను సూచన తొలఁగింపఁబడి, అర. (= అరవము) దే. వి. బ. గా మార్పఁబడినది. (చూ. శ. ర., 1912 ప్రతి, పు. 575). 6. సలాము : దే. వి. నమస్కారము ... (ఇది యన్యదేశ్యము). పు. 1079 7. హుసారు : దే. వి. జాగ్రత్త... (ఇది యన్యదేశ్యము). పు. 1122. 8. హొన్ను : దే. వి. పొన్ను, బంగారు. ... (ఇది యన్యదేశ్యము.) పు. 1123. 9. హోళి : దే. వి. కామునిపండుగ కడపటినాఁడు తగులఁ బెట్టుటకై పోగుచేసెడి గడ్డి కంప. (ఇది యన్యదేశ్యము). పు. 1124

మీఁది పరిశీలనమును బట్టి నవీనోత్తరాహ భాషా పదములతో పాటు తమిళ, కర్ణాటాది ద్రావిడ భాషల నుండి ఎరవు తెచ్చిన ఆళు, [20] నంబెరు

20. తమిళము. ఆళ్ = వీరుఁడు; సమర్థుఁడు; భక్తుఁడు.

మాళ్ళు,[21] హోన్ను[22] మొదలగు పదములను శ. ర. కారుని దృష్టిలో అన్యదేశ్యములని నిర్ధారించుట యుక్తము. కాని, శ. ర. 'భాషా ప్రశంస' లో అన్యదేశ్యమునకు లక్ష్యములుగా నుదాహృతమయిన తావి, మోవి పదము లీ దృష్టితో చూచినను అన్యదేశ్యము లగుట అసంభవము. శ. ర. కారుని ఈ పరిగణనమునకు పూర్వ వ్యాకర్తల నిరూపణము ఆధారము. అప్పకవి 'మోవి' ని అన్యదేశ్య జాంధ్రముగా నిరూపించినాఁడు. కేతన కెమ్మోవి, కమ్మతావులను దేశ్యంపుఁ దెనుఁగులుగాఁ (ఆం. భా. భూ., 25) పేర్కొనినాఁడు. కేతల కెంజాయ, మంతనము-అను తద్భవములను దేశ్యంపు తెనుఁగులలోను; ఉవిద, జోటి, సరి-అను తద్భవములను దేశి తెనుంగులలోను పఠించుట విచార్యము. తావి, మోవి పదములు ఆంధ్రదేశ్యములుగా ఉట్టంకించిన బాలవ్యాకరణోద్ద్యోత మార్గము శాస్త్రీయము. '....మహారాష్ట్రి మొదలగు విజాతీయ భాషలనుంగి వలెనే (తమిళము, కన్నడము మొ.) సజాతీయ భాషలనుండియు సంక్రమించిన శబ్దములు అన్యదేశ్యములుగనే గ్రహింపఁబడవలసి యుండు' నని శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి సమీక్ష[23] పరిసర స్థములగు సజాతీయ దేశభాషలనుండి ఎరవుతెచ్చిన పదములను 'తిచైచ్చొల్' (= దిశలనుండి వచ్చిన పలుకులు) అని వ్యవహరించుట తమిళ వ్యాకరణ సంప్రదాయము.[24] ప్రస్తుత సమీక్షలో 'తిచైచ్చొల్' - సజాతీయ భాషల నుండి సంక్రమించిన పదరాశి-అప్రసక్తము.

---

21. తమిళము. నంబెరుమాళ్ నమ్ (< నామ్) + పెరుమాళ్) = శ్రీరంగమునందలి క్షేత్రమూర్తియగు విష్ణువు; పెరుమాళ్ = స్వామి; ప్రభువు; విష్ణువు.

22. కన్నడము. పొన్, పొన్ను, పొమ్, హోన్, హొన్ను, హోమ్ = బంగారు. పకారము హకారముగా వికారమునందుట కర్ణాట భాషా విశిష్టస్వభావము. ఇది క్రీ. శ. పదియవు శతాబ్దినాఁటినుండి కర్ణాటభాషలో ప్రవర్తితమయిన ధ్వని పరిణామము. తెలుఁగునందలి హత్తు, హదను, హాయి, హాళక్కి, హెగ్గడి, హెచ్చు, హేరాళము, హోరాటము మొదలగు పదాది హకారఘటితములు కన్నడము నుండి ఎరవు తెచ్చిన పదములు.

23. భాషా చారిత్రకవ్యాసములు, పు. 138.

24. 'చెంతమిట్ చేర్న్త పన్నిరునిలత్తున్। తమ్ కుఱిప్పినవే తిచైచ్చొల్ కిళవి' (తొల్కాప్పియమ్, చొల్లదిగారమ్, సూ. 400)

పూర్వాంధ్రము - అన్యదేశ్యా భాసములు

'గాడీ' (= బండి) అను అన్యదేశ్యము నన్నయ భారత (ఆది. 8-221) ప్రయుక్తమని భావించుట 25 ప్రమాదమనియు, 'గాడీలు' పదఘటిత మపపాఠ మనియు, 'గాడిదలను' అనునదచట మూలానుసార మగుటయకాక, అదియే కవ్యభిప్రేతమనియు సోపపత్తికముగా నిరూపితము. 26 కైవు, తరవారి, బాఁకు (-పాఁకు) లను నన్నెచోడకవికృతిలోని అన్యదేశ్యములుగా శ్రీ వేదము వేంకట రాయ శాస్త్రి, ఎం. ఏ., గారు చేసిన మదింపు కూడ సువిచారితము కాదని నిర్ధారితము. 27

'లేదింకం బగయని ఘను
రాదుల దెస వాహనముల యందు సంత్య
క్తాదరులై పగతురనెఁ
డాదమఱచి నిద్రవోదు రదితజిపోడువన్' (భారతము, సౌప్తిక. 1-51)

అని తిక్కన ప్రయోగించిన 'ఆదమఱచు' 28 లోని 'ఆద' పారసి బాసయందలి 'యాద్' (= జ్ఞప్తి, స్మృతి) తో జన్యజనక సంబంధము కలదను ఆచార్య

---

25 అముద్రిత గ్రంథ చింతామణి మయూఖము, సంపుటి 16, సంచికలు 1-2, జనవరి, ఫిబ్రవరి, 1902, పు. 32; దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డి, వెంకటా దిత్యకవి, పుటలు 76-83.

26. నన్నయ—అన్యదేశ్యాభాసములు, సాహితి, ఫిబ్రవరి-మార్చి 1963 సంచికలు.

27. 'నన్నికవిద్వయము'-అన్యదేశ్యాభాసములు, సాహితి, నవంబరు-డిసెంబరు. 1962 సంచికలు.

28. 'ఆదమఱ' = జ్ఞప్తిభ్రంశే, అకర్మకక్రియ. జ్ఞప్తిదప్పుట' అని ఆంధ్రధాతుమాల, పు. 5. 'ఆదమఱచు'నకు శ్రీనాథయుగ ప్రయోగములు కొన్ని:
'అరగియుచ్చట శయ్యపైనాదమఱచి; నిద్రగూరినతల్లిపై నెపముగొలిపి'
—పద్మపురాణము, ఉత్తరఖండము, 9-116;
'మధురలోన నాదమఱచి నిద్రించిన; నరులనెల్ల నొక్కనాఁటిరాత్రి
ద్వారవతికిఁదెచ్చి...,' —పైది, 9-363;
'కొంత తడవాదమఱచి నిద్రింతురపుడు. —వరాహపురాణము, 11-126,

శ్రీ కోట సుందరరామశర్మ గారి ప్రతిపాదనము 29 విచార్యమానము. తిక్కన నాఁటికి 'త్రాసు' 30 అను మూర్త పదార్థ బోధకమగు అన్యదేశ్యము మాత్రము ప్రతిదేయము. వాణిజ్య పరముగా 'త్రాసు' అతి ముఖ్యమయిన వస్తువు. భాషల సంసర్గము నందలి ప్రథమ దశలో నిట్టిమూర్త పదార్థ బోధకములగు పదములే ఎరవు తేఁబడుచుండు ననుటయు, ఆ మూర్త పదార్థ బోధకములగు పదములు చిరకాల సాహచర్యమునఁగాని ప్రతి దేయములు కావనుటయు స్థితి స్థాపక విషయము. ప్రస్తుత సమీక్షాయుగమునందలి అన్యదేశ్యములును ముక్కాలు మువ్వీసము మూర్తపదార్థ బోధకములగుటయు, వీనిలో పెక్కులు విలాతి సీమలనుండి దిగుమతి యయిన దినుసులను దెలుపు మాటలగుటయు ప్రత్యక్ష ప్రమాణము. విశేషించి, సంస్కృతము నందలి 'ఆత్మన్' శబ్దమునకు వికృతియగు 'అద' శౌరసేనీ ప్రాకృతమున రూఢము. సంస్కృతమునందలి అపదాదితకారము శౌరసేనీ ప్రాకృతమున దకారమగుట సర్వసాధారణ మగు ధ్వని పరిణామము. 31 కావున, తెలుగు నందలి 'అద' 32 ను శౌరసేనీ ప్రాకృత సమముగా నిరూపించి వైకృత మనుట యొప్పు.

అన్యదేశ్య నిరూపణమున తబ్బిబ్బులు

అన్యదేశ్యములు కొన్ని వాని మూలరూపములేవో గుఱుతింపరానంత మార్పాటును పొందినవి. 'లష్కరీ' (= దళవాయి; సేనాని; సైనికుడు; సేనా

29. Bulletin of the Linguistic Circle of New Delhi, Edited by Prof A. C. Sekhar, New Delhi, 1955.

30. చూ. పదపట్టికలోని 'త్రాసు' అను ఆరోపము క్రింద.

31. స్పష్టప్రతిపత్తినిమిత్తమీ క్రింది ఉదాహరణములు ;

సంస్కృత,	దుహితృ	>	శౌ. ప్రా.	దుహిదా, దుహిదరమ్, దుహిదే.
,,	ద్యూత	>	,,	జూద
,,	ద్యూతకార	>	,,	జూదిఅరో
,,	పితృ	>	,,	పిదా, పిదరమ్. పిదరో
,,	మతి	>	,,	మది
,,	మాతృ	>	,,	మాదా, మాదరమ్, మాదాట, మాదే.

32. 'అద' (= విచారము) దేశ్యముగా శ. ర. లో ఉట్టంకితము (చూ. పు. 74); అధి (= మనోవ్యథ) శబ్దభవమని పురుషోత్తమ కవీయము. పు. 8.

సంబంధమయిన) అను పారసి భాషాపదము తెలుఁగున 'లసికిరి' గా పరిణతము-కాకమాని మూర్తి కవికృతమగు రాజవాహన విజయమున నీ పదమిట్లు ప్రయుక్తము.

'లసికిరి జోదులగ్గలిక
లగ్గల కెక్కినఁ గుంతపఙ్క్తులన్
వసుమతిఁ గూల్చియున్ గదల
వైచియుఁగత్తుల వ్రక్కలించియున్
వసుల వధించియున్ ముసల
వర్గములం బడమోది వాలుకల్
మసలక వేసి వంచియును
మందుల తిత్తులు గాల్చివైచియున్' (రాజవా 5-31) [33] ఈ పద్యమున సమాపక క్రియ లేదని కాఁబోలు 'లసికిరి' ని ప్రథమ పురుష మహద్బహు వచము నందలి భూతకాలిక క్రియా రూపముగా భావించి (పిసికిరి-పిసుకు, పలికిరి-పలుకులవలె) 'లసుకు' అను నొక అనిష్ట మూర్తిని సృష్టించి, దే. స. క్రి. అను సంజ్ఞా పత్రమును దాని మొగమునఁ గట్టి, సందర్భమునుబట్టి గుటికి బారెఁడు దూరముగా 'నాశముచేయు' అను ఉజ్జాయింపు టర్థముతో శ. ర. కారులు ఉల్లేఖించుట ప్రామాదికము.[34] శ. ర. కు పూర్వ రచనలగు విల్లియంబ్రౌను కూర్చిన జెంతూ నిఘంటువునఁగాని, ఆంధ్రదీపికలోఁగాని, ఆంధ్ర ధాతు మాల లోఁగాని, కాంబెల్ నిఘంటువునఁగాని, బ్రౌణ్యమునందుగాని, వీనికి పూర్వతన

33. నూతిలోఁబడిన బిందెను తీయుటకు పాతాళభేదివేయఁగా బేతాళములు బయలువడినట్లు, ఏదో యొక ఉత్తమపాఠము చిక్కకపోదను ఆశతో పరిశీలించిన ఒక్క తాళపత్రప్రతి (ఆం. వి. గ్రంథాలయమున 111 నెంబరు గల బొబ్బిలి ప్రతి)లో
'లలకిలి జోదు లగ్గలిక; లగ్గలకెక్కిన కుంత పంక్తులన్; వసుమతి గూల్చియున్ గదలవైచియు...'
అను నీ యసందర్భపు పాఠమొకటి కన్పట్టినది. వ్రాయసకాఁడు ప్రాసభంగమును గమనించినట్లులేదు. 'లలకిలి జోదు లగ్గలిక లగ్గల కెక్కిన' వరకు ఒక యాకు మీఁదను మిగిలిన పద్యభాగము తర్వాతి యాకు మీఁదను లిఖితమగుటచే, ముందు వెనుకలు పరిశీలించి, సవరించుకొనుటకు ప్రతి విలేఖకునకు ఉసులుపాటు లేకపోయినది కాఁబోలు!

34. శ. ర. 1885, పు. 983.

ములగు ఆంధ్ర పద్య నిఘంటువులఁగాని ఈ ' లసుకు ' అడ పొడ కానరాదు. ఇది నూటికి నూఱుపాళ్ళు సీతారామాచార్యుల సృష్టి. పైపద్యము, తర్వాతి దగు '...మాళవాధిపు బలము లిమ్మడిక్కి నొంచె మగధనృపు సేన నొకనాఁటి పగటి లోను (రాజవా. 5-32) తో అన్వయము. ఈ'లసికిరి' (<లష్కరు) జోదులు మగధ నృపు సేనకు చెందినవారు. 'లసికిరిజోదు' లనఁగా మూలబలము (Standing Army) నకు చెందిన యోధులు, కైకూలి బంటులు, దినరోజు జోదులు, ఒంటరి జోదులకంటె 'లసికిరి జోదులు' భిన్నులు. శ. ర. మీఁది ప్రమాణ బుద్ధి వలన అర్వాచీన కోశకారులు, భాషాతత్త్వ పరిశోధకులు, గ్రంథ వ్యాఖ్యాతలు దీని నిశ్లేనకలు దించుట గమనార్హము. ఆంధ్ర పద పారిజాతము, లసుకుట, పు. 698; లక్ష్మీనారాయణీయము, పు. 737; బ్రౌణ్యము - రివైజ్‌డ్. పు. 1106; శబ్దార్థ చంద్రిక, పు. 770; శంకరనారాయణ. పు. 1036 ; ఆంధ్రవాచస్పత్యము. పు. 2212 ; పూతల పట్టు శ్రీరాములు రెడ్డి, తాళ్ళూరి - ఆర్ముగం పిళ్ళగారల 'రామచంద్ర' విద్యార్థికోశము, చిత్తూరు, 1943, పు.303 ; దాచేపల్లి వారి శబ్దార్థ దీపిక, 1956, పు. 1141, తుదకు పరమ ప్రామాణికులయిన సూ. ని. కారులును (చూ. సూ. ని. vi, 1958. పు. 927) సుపరీక్షితము గావింపక ఈ తప్పునట్లే మక్కికి మక్కిగా నకలు వ్రాసి అచ్చొత్తించుట ఆశ్చర్యము. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన ఆంధ్ర క్రియా స్వరూపమణిదీపిక (1962) యందును ' లసుకు ' దేశ్యక్రియగా అవిమర్శముగా అంగీకృతము. ప్రచురితము కానున్న మఱి యెన్ని కోశముల కెక్కనున్నదో ? ఇఁక భాషా పరిశీలకుల, వ్యాఖ్యాతల మాట : శ. ర. వ్రాఁతను అంధ పరంపరగా అనుకరించిన వారు డా. చిలుకూరి నారాయణరావుగారు (చూ. ఆంధ్రభాషా చరిత్రము. సంపుటము 1. పు. 100, ' తెలుఁగు నందలి దేశ్యమూల ధాతువుల పట్టికలో 292 వ నెంబరుగా ' లసుకు ' ఉట్టంకితము). రాజవాహన విజయము - మంజువాణీ ముద్రాక్షరశాలా ప్రతి, 1937 - లోని ' లసికిరి ' = నశింపఁజేసిరి ' అనుటీకకు శ. ర. యే ప్రమాణము. ఒకచోట దొరలిన తప్పు ఎందరెందఱు హేమా హేమీలను తప్పుదారి పట్టించెనో తెలుపుటకీ యొక్క 'లసుకు ' జాతకము చాలు ! ఆచార్య శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తిగారు దీని నిజతత్త్వము నెఱిఁగియే కాఁబోలు

ఆంధ్రదేశ్య క్రియా స్వరూప నిరూపకమగు తమ సిద్ధాంత గ్రంథమునందు 'లసుకు' ను పరిహరించుట. 35

అచ్చముగా కోశసంబంధమయినది కాకపోయినను ఒక ముచ్చట! తంజావూరు మహారాజా శరభోజి సరస్వతీ మహలు లైబ్రరీలోని ఆంధ్రభాషామయమైన తాళపత్ర గ్రంథ సంచయమునకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు వారొక కేటలాగును తయారు చేయించి ప్రకటించినారు. 36 ఆచార్య శ్రీ పి. పి. ఎస్. శాస్త్రిగారు దీనికి ప్రధాన సంపాదకులు. పూజ్యులు, కథావశేషులు శ్రీ కొరుగంటి సీతారామ భట్టాచార్యులవారు దీని నిర్మాణమున ముఖ్య సారథులని వినికి. ఇందులో 275 వ నంబరు కలదిగా సంక్షేప రామాయణ మను పేర తాటియాకుల ప్రతి యొకటి వర్ణితము. ఈ ప్రతి రూపురేకలేవో టూకీగా వివరించిన పిమ్మట 'గ్రంథమసంపూర్ణము. రామాయణ కథ సంక్షేపముగాఁ జెప్పఁబడియెను... గ్రంథమున నెక్కడను గ్రంథకర్తృ నామాదికములు గన్పట్టవు. కృతిభర్త లేఁడు. ఆశ్వాసములు, ఆశ్వాసాంత గద్యములు కూడ మృగ్యములు. This work is samksipta ramayanamu of unknown authorship' 37 అని చివర సంపాదకుల రిమార్కు కలదు. ఈ వ్రాతలను చూచి ఏమనవలెనో తెలియదు. ఎంత తొందరపాటు! వాస్తవముగా నీ తాళ పత్ర గ్రంథ భాగము పోతనకృత భాగవతము, నవమస్కంధము (259-349) నందలి సంక్షేప రూపమయిన రామాయణ కథ! ఇంచుమించు తొంబది గద్య పద్యముల భాగము!!! అంతా అబుపదైదు గ్రంథముల పరిమితికి లోపు మాట!!!. ఎవఁడో రామాయణ కథాపారాయణాభిలాషతో పోతన కృతి నుండి విడిగా ఎత్తివ్రాసికొనిన తాటియాకుల బొత్తి! పోతన భాగవతము. అందును నవమస్కందము, పైగా అతి ప్రసిద్ధ మయిన రామకథ. ఇందలి ఒక్కొక్క పద్యమును పోతన శైలిని పట్టి

35. Dr. Bh. Krishnamurti, Telugu Verbal Bases-A comparative and Descriptive study, Ph. D. Thesis, University of California Publications in Linguistics, Vol. 24, Berkeley, 1961.

36. A Descriptive Catalogve of the Telugu Manuscripts in the Tanjore Maharajah Serfoji Saraswati Mahal Library. Andhra Uviversity Publication, Waltair, 1933.

37. చూ. పైది, పుటలు 79, 80.

యిచ్చెడి శబ్దాలంకార సర్వస్వము. ఏమయిననేమి, కేటాలాగు నిర్మాతల యెఱుకకిది అందలేదు. నిర్మాతలు ఎవరైననేమి, ప్రమాదో ధీమ తామపి! మా ప్రాంతముల నీ రామాయణ కథ_గజేంద్రమోక్షము, ప్రహ్లాద చరిత్రము, రుక్మిణీ కల్యాణములవలె_బడిపిల్ల లందఱకును కంఠోపాఠము. ఒకందుకు సంతోషము. ఘటికా శతవ్యాస కల్పనులగు కొందరు విమర్శకుల దృష్టిలో ఇది పడినట్లు లేదు. పడియుండెనా, 'తంజావూరి రామాయణ' మని అపూర్వ పరిశోధక వ్యాస మొకటి అవతరించి యుండెడిది. 'ఎటువంటి బుద్ధిశాలులకును నిట్టి మహా కార్యముల యందు పొరపాట్లు కలుగక మానవు'. అంతమాత్రమున వారి చిరం తన కృషి సుధీసేవ్యము కాకపోదు. అమర్చిన దానిలో అత్తగారు వ్రేలుపెట్టి నట్లు, ఒకరికృషిలో తప్పులుపట్టుట చాల తేలిక ! తంజావూరి ముచ్చట మనలను చాల దూరము తెచ్చినది. పరదోష కథా పరాఙ్ముఖులగు పెద్దలకు రామాయ ణములోని ఈ పిడుకల వేఁట ఇంపునింపదు గావున, ఈ ప్రసంగము నింత కట్టి పెట్టి ప్రకృత మనుసరింతము.

అన్యదేశ్య ప్రయుక్తియందు శ్రీనాథుఁడు ప్రథముఁడు కాకపోయినను ప్రముఖుఁడు. ప్రధానముగా ఇతనిది గౌడీరీతి - వైదర్భీరీత్యను యాయుల కంటె గౌడీరీత్యనుయాయులకు శబ్దముల కూర్పుపట్ల శ్రద్ధ యెక్కువ. రసాభ్యుచితబంధముగఁ గవిత చెప్పవలయుచో తత్తత్ప్రకరణోచితముగను, తత్తత్పాత్రోచితముగను భాషాప్రయోగపద్ధతి యుండుట అవశ్యకమని యెఱిఁ గిన పద వాక్య ప్రమాణ పారీణుఁడీతఁడు; తత్ప్రయోజన సిద్ధికై 'శబ్దంబు పలకించియు,' అశేష మనీషి హృదయంగమంబుగా శబ్దంబనుసరించియు' (నైష. 8_202) సాహితీ నిషేవణ మొనర్చిన సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి శ్రీనాథుఁడు. క్రొత్తమాటలను ఏర్చి కూర్చుట శబ్దదారిద్ర్యము వలనఁ గాదు. ప్రాతవడ్డ మాటలను పరిహరించుటయు, క్రొత్త పలుకుబడు లను స్వీకరించుటయు కవి సంప్రదాయము. విశేషించి, నూతన వస్తు సన్నిధిని ప్రసన్న వివేకముగా తద్బోధకములగు పదములను ప్రయోగించుటఅర్థవ్యక్తికి. ఝటితిస్ఫూర్తికి అవశ్య కర్తవ్యము. పలుకుల పొందికలో నాజూకు షోకడలకు మోజు పడెడి రసప్రలుబ్ధుల కిట్టి పట్టులు అమృత చషకములు.

ప్రస్తుత చర్చలో పరిశీలితములయిన ప్రధాన గ్రంథములు :

1. అధ్యాత్మ సంకీర్తనలు : తాళ్ళపాక అన్నమయ్య 5-10 సంపుటములు
2. కావ్యాలంకారచూడామణి : విన్నకోట పెద్దన్న
3. కాశీ ఖండము : శ్రీనాథుడు
4. క్రీడాభిరామము : ? వల్లభామాత్యుడు; ? శ్రీనాథుడు
5. చాటువులు (వీధినాటకము): శ్రీనాథుడు
6. ఛందోదర్పణము : అనంతుడు
7. జైమిని భారతము : పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు
8. జ్ఞాన వాసిష్ఠము : మడికి సింగన
9. ద్వి. భాగవతము : మడికి సింగన (దశమస్కంధము)
10. ద్వి. హరిశ్చంద్ర : గౌరన
11. నవనాథ చరిత్ర : గౌరన
12. నాసికేతూపాఖ్యానము : దగ్గుబల్లి దుగ్గన
13. పంచతంత్రము : దూబగుంట నారాయణకవి
14. పంచతంత్రము : బైచరాజు వేంకటనాథుడు
15. పద్మపురాణము : మడికి సింగన
16. పరతత్త్వ రసాయనము : ఈశ్వర ఫణిభట్టు
17. పల్నాటి వీరచరిత్ర : ? శ్రీనాథుడు. (బాలచంద్ర యుద్ధము)
18. ప్రబోధ చంద్రోదయము : నంది మల్లయ, ఘంట సింగయలు
19. భాగవతము : బమ్మెర పోతన
20. భాస్కర రామాయణము : అయ్యలార్యుడు (యుద్ధకాండ శేషము)
21. భీమేశ్వర పురాణము : శ్రీనాథుడు
22. భోజరాజీయము : అనంతుడు
23. రత్నపరీక్ష : బైరవ కవి
24. రసాభరణము : అనంతుడు

25. రుక్మాంగద చరిత్ర : ప్రౌఢకవి మల్లన
26. వరాహపురాణము : నంది మల్లయ, ఘంట సింగయలు
27. విక్రమార్క చరిత్రము : పేరంరాజు జక్కన
28. వీరభద్రవిజయము : ? బమ్మెరపోతన
29. శివయోగసారము : కొలని గణపతి దేవుడు
30. శివరాత్రి మాహాత్మ్యము ; శ్రీనాథుఁడు
31. శివలీలా విలాసము : నిశ్శంక కొమ్మన్న
32. శృంగార నైషధము : శ్రీనాథుఁడు
33. శృంగార శాకుంతలము : పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు
34. శృంగార సంకీర్తనలు : తాళ్ళపాక అన్నమయ్య (4వ సంపుటము)
35. శ్రీరంగమహత్త్వము : భైరవకవి
36. షోడశ కుమార చరిత్రము : వెన్నెల కంటి అన్నయ్య
37. సకలనీతి సమ్మతము : మడికిసింగన
38. సింహాసన ద్వాత్రింశిక : కొఱవి గోపరాజు
39. హరవిలాసము : శ్రీనాథుఁడు
40. దక్షిణ హిందూదేశశాసన సంపుటములు

శ్రీనాథునకు పూర్వులగు కొట్టరువు తిక్కన, నాచన సోమన, పాల్కురికి సోమన, మూలఘటిక కేతన మొదలగువారు ప్రయోగించిన అన్యదేశ్యములను ఆయా తావుల ఉదాహృతము. కేవలము కోశ ప్రయోగములతో సరిపెట్టక ఏతద్యుగీనములను సర్వాంధ్రగ్రంథములను పారముమట్ట పరిశీలించి ఆవశ్యకములగు ప్రయోగ భాగము లిందు ప్రదర్శితము. సాధు పాఠనిర్ణయము అక్కఱ కలదని తోఁచిన పట్టుల వివిధ ముద్రణముల పాఠములును, తాళపత్ర ప్రతుల పాఠములును, అనువాదములైనచో సంస్కృత మూలములును ఉట్టంకితము. ఈ యుగమునకు చెందిన శాసన ప్రయోగములును ఎడనెడ ఉద్ధృతము.

పదపట్టికలోని ప్రధానారోపములు 107, వీని రూపాంతరములు 23, మొత్తము ఆరోపములు 130. ప్రధానారోపపదములకు తప్ప, వీని రూపాంత

రములకు వరుస సంఖ్య వేయలేదు. ఇందులో శ్రీనాథ ప్రయుక్తములు చక్క సగమునకు పైమాట.

అరబీ, అసివారు, కత్తలాని, కప్పలి, కమరు, కాకితము, కిచ్చడి, కుందనము, కుల్లా, కోహళి, ఖుసి, గంజాయి, గసగస, గాగరా, గుల్లాము, గోవ, చికిలి, జబ్బు, జరి, జలపోసనము, జోఁగు, తరుణాసీరి, తవాయి, తేజీ, త్రాసు, దుకాణము, పంజారు, పంజు, పండువా, పరాకు, పారసి, పేషణి, బాజారు, బిబ్బి, బొందిలి, మసీదు, మైజారు, మోళము, రావు, లాహిరి, లుంగ, వలికా, వల్లి, సమ్మాను, సహో, సురతాణి, సేబాసు, హజారము, హురుముంజి మొదలయినవి శ్రీనాథ ప్రయుక్తము. ఇందులో పల్నాటి వీరచరిత్రము (బాలచంద్ర యుద్ధము) నందలి అసలు, ఖర్చు, చబుకు, చామలా, చావడి, డమామి, దేరా, తాయెతు, బరాబరి, బాఁకు, ముఖమల్లు, రోజు, సన్నాయి, సరిహద్దు, హద్దు — ఈ పదునైదును చేరలేదు. సమకాలి కులు వాడఁగా శ్రీనాథుఁడు వాడని అన్యదేశ్యములు సగమున కించుక తక్కువ. అవి ఇవి; అపరంజి,38 ఈనాము, కంఖాణి, కంగారు, కొజ్జా, ఖాన, గలబ, గస్తు, గొంగడి, గోరక్కుఁడు, గోహరి, చవుక, చాడి, జమ్ముఖాణము, జిరా, జీబు, జులుము, జూటరి, తబల, దరిబేసి, దుహిలీ, నకీబు, పింగాణి, పౌజు, బిడారము, మాలిమి, మేకు, మోజా, లాలు, లూటి, వహి, విలాతి, శాలువు, సంగడి, సవా, సామ్రాణి, సుపాణి, సోళాదొప్పి, హుమాయి — మొదలగునవి.

మరాఠీ భాషకు నిసర్గములయి తెలుఁగున ప్రతిదేయములగు అన్యదేశ్యములు : కిచ్చడి, గంజాయి, గలబ, గాగరా, గొంగడి, గోరక్కుఁడు, గోవ,

---

38. 'గురుతైన యపరంజి గొప్పముత్తెపునత్తు
మోవిపై నొకవింత ముద్దుగుల్క' అని క్రీడాభిరామము (గంటివారి ముద్రణము) ఉపోద్ఘాతము (పు. 62)లో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీనాథచాటు పద్యభాగముగా ఉదాహరించినను 'హురుముంజి ముత్యములు, ప్రసిద్ధములగుట వలన, ఈ పద్యపాదము 'గురుతైన హురుముంజి గొప్పముత్తెపునత్తు' అని యుండుట యుక్తమని భావించుటచే 'అపరంజి'ని శ్రీనాథప్రయుక్తముగా పరిగణింపలేదు.

చపుక, చాడి, చావడి, జూటరి, దమామి, దేరా, పరాకు, పేషణి, బాంకు, బిడారము, బొందిలి, రావు, లూటి, వహి, సంగడి, సవా, సుపాణి, సొగటాలు, సోళాదొప్పి – మొదలగునవి.

అరబ్బీ పారసీ కాద్యన్య సీమలలోని భాషలకు నిసర్గములయి ప్రత్యక్షముగా పారసినుండిగాని, పరోక్షముగా మరాఠీ భాషా ముఖమునఁగాని తెలుఁగునకు ఎరవు తెచ్చినవి మొత్తము పదములలో ముక్కాలుంపాలు. ఏవి ప్రత్యక్షముగా వచ్చినవో, ఏవి పరోక్షముగా వచ్చినవో బరాబరిగా గెలగిచి తూఁచి చెప్పుటకు ఉపలబ్ధ సామగ్రి చాలదు. అంచాజు అంచనా యిది: అపరంజి, అరబీ, అసలు, అసివారు, ఈనాము, కత్తిలాని, కమరు, కాకితము, కుందనము, కుల్లా, కొజ్జా, ఖర్చు, ఖాన, ఖుషి, గసగస, గస్తు, గులాము, గోహరి, చబుకు, చికిలి, జబ్బుజరి, జలపోసనము, జిరా, జీబు, జులుము, తబల, తామెతు, తేజీ, త్రాసు, దరిబేసి, దుకాణము, దుహిలీ, నకీబు, పంజా, పారసి, పింగాణి, పౌజు, బరాబరి, బాజారు, బిబ్బి, మసీదు, మాలిమి, ముఖమల్లు, మేకు, మైజారు, మోజా, మోగము, రోజు, లాలు, లాహిరి, లుంగ, విలాతి, సన్నాయి, సరిహద్దు, సహో, సామ్రాణి, సురతాను, సేబాసు, హజారము, హద్దు, హుమాయి, హురుముంజి–మొదలగునవి.

తక్కినవానికి సమీపమాతృక లివి:

కప్పలి, జోఁగులు మలయాభాషలోనివి.

తరుజాసీరి, తవాయి, రమణా – లు బర్మాకు చెందినవి.

'సమ్మాను' చీనీ భాషాజన్యము; పరోక్షముగా మలయూ భాషనుండి ప్రతిదేయము.

వలికా, వల్లి–పదముల మూలములు మృగ్యము.

ఈ పట్టిక సమగ్రమనుట సాహసము, నా యెఱుకకందని అన్యదేశ్యములు మఱికొన్ని యుండవచ్చు. విశేషాంశములు ఆయా ఆరోపములకడ వివృతము.

ఈ క్షేత్రమున సాఁగిన కృషి చాల స్వల్పము.[39] పర్యాప్తమయిన పరిశీలనము వలన అపూర్వములయిన అంశములనేకము ఆవిష్కృతము కాఁగలవని ఆశంస ![40]

పదపట్టిక 41

1. అపరంజి : ఉదిరి. పుటము పెట్టిన బంగారము. 'అపరంజి- యనఁ దగ్తకాంచనమౌ' (సాంబ - స్థా. 67): 'అరయనిత్తడిఁ దెచ్చి యపరంజిఁ జేసే' (అధ్యాత్మసంకీ. సంపుటి v. సంకీర్తన 185), 'అపరంజి పసిఁడి కలరుతావెవలె' (వేం. పంచ 4-92) 'అపరంజి పసిఁడి కామాక్షులు' (పైది 4-101). 'పశ్చిమంబు పన్నీరపరంజి బుంగలనునించి' (పైది. 4-341). < పారసి. అఫ్‌రంజ్ = పడమటి సీమవారు పరంగులు; అఫ్‌రంజ = ఈజిప్టు దేశములోని ఒక పట్టణము. అఫ్‌రంజీ = పాశ్చాత్యుఁడు : వారి రాకపోకలతో ఎక్కువగా వాడుక కెక్కిన ఒక దినుసు మేలిమి బంగారము : అపరంజి < అరబ్బీ అఫ్‌రఁజియ = విలాతి సీమకు సంబంధించిన (బొగ్గిణ్యము, రిపైజ్‌డ్, పు. 1404).

2 అరబీ : ఆరబ్బీ దేశపుభాష, సెమిటిక్ భాషా కుటుంబమునకు చెంది ఆరేబియా యందును ఇస్లాము మతధర్మవాహకముగా తక్కిన ముస్లిము ప్రపంచము నందును వ్యవహారముకల భాష. 'అరబీభాష తురుష్కభాష....' (భీమ. 1-73) < పారసి. అరబ్ = కౌశల్యము. నేర్పు; ధార్మికత్వము; ప్రతిభ; అక్కఱ.

3. అసలు : మూలము, మొదలు. 'అమ్మ నీ యల్లుని నసలేనెరుంగ- ఏరీతి దెలియదు నేయుపాయంబు' (పల్నాటి. పు. 73) < మరాఠీ. అసల్.

---

39. మోదేకుర్తి సత్యనారాయణ, తెలుగుశాసనాలలో అన్యదేశ్యాలు, భారతి. అక్టోబరు, 1959.

40. ఆచార్య శ్రీ గంటి జోగిసోమయాజిగారి పర్యవేక్షణమున లకంసాని చక్రధరరావుఆంధ్ర విశ్వకళా పరిషత్పరిశోధక విద్యార్థి-ఆంధ్ర భాషయందలి అన్యదేశ్యముల తలస్పర్శ విమర్శనమునకు పూనుకొనుట ముదావహము.

41. పదపట్టికలో వాడిన సంకేతములు సుపరిచితములు. '<' ఈ సంకేతము మొన వైపున నున్నది జన్యపదమనిగాని, పరిణతరూపమనిగాని అర్థము.

అస్సల్ = పురాతనము; మూలము; అసలీ = మౌలికము; అరబ్బీ అస్ల్ = మూలము; వాస్తవము; పారసి, అస్ల్ = ప్రాచీనము; అస్లాఫ్ = పూర్వులు; పితృదేవతలు; ఇస్లాఫ్ = సంచకర మిచ్చుట.

4. అసివారు : వాహ్యాళి, సవారీమార్గము. 'ఎవ్వాఁడు నలువతేరెక్కి యష్టాదశ ద్వీపాళి యసివారు దిరిగెలీల' (కాశీ, 4-194), 'ఎవ్వండు నలువతే రెక్కి యష్టాదశద్వీపి యందసివారు దిరిగె లీల' అని పెక్కుతాళ పత్రప్రతుల పాఠము. అసి (= అల్పార్థకము) + పాఱు (= పరుగెత్తు). అసివాఱు = మందగమనము-అను నిట్టి రూపనిష్పాదల రీతి ననుసరించిన ఆంధ్రనిఘంటువుల (శ.ర..పు.65; బ్రౌ.రి., పు. 103 : సూ. ని., సం. 1. పు. 361) వైఖరి ప్రామాదికము. దీనిని శకటరేఫ ఘటితముగా భావించుటయు భ్రాంతిమూలకము, 'అసివారు' ననంతర రూపమగు 'స్వారి' నిదేశ్యమను వజ్ఝలవారి అభిప్రాయము నిర్మూలకము (చూ. వైయాకరణ పారిజాతము, 1937.. పు. 112). 'అస్వార్' అను పారసిపదము దీనికి అసలు మాతృక; < మరాఠీ. అసివార = రౌతు, అశ్వారోహకుఁడు; పారసి. అసూవార్, అస్వార్ = రౌతు. 'అపంచి గౌడ ధాత్రీ పదం బెవ్వాని కసివారుగానేఁగుసట్టి బయలు' (మను చ. 1-11) అను పద్యపాదమును ఎవ్వానికి + అసివారుగా అని విఱుచుటకు మాఱు, ఎవ్వాని + కసివారుగా అని తప్పుగా విఱిచి ఆంధ్రపద పారిజాతకర్తలు 'కసివారు' అను అనిష్టరూపమును సృష్టించిరి. (చూ. ఆంధ్రపద పారిజాతము, 1888పు.132). వీరిని అవిమర్శముగా అనుకరించినవి, లక్ష్మీనారాయణమును (చూ. పు. 223), ఆంధ్రవాచస్పత్యమును (చూ. పు.787). ప్రాచీన వ్యాఖ్యలయందును ఇట్టితప్పు విఱుపు కన్పట్టదు. 'అసివాఱుగాన్ = సవారీ మార్గముగా' అని జూలూరి అప్పయ్య పండితుల ప్రతిపదటీక, పు. 3; (భారతీ ముద్రాక్షరశాల, చెన్నపురి, 1875). ప్రసిద్ధులయిన గురజాడ శ్రీరామమూర్తి, ఓగిరాల జగన్నాథకవి గారలు సంతరించిన ఆంధ్రపద పారిజాతముపై అల్పశోధనలగు కొందఱ చేయిపడియుండుట పరిశోధక విదితము. 'ఆంధ్రపద పారిజాతముఅను శుద్ధాంధ్ర నిఘంటువు ఓగిరాల జగన్నాథకవిగారి చేతను, గురజాడ శ్రీరామమూర్తిగారిచేతను రచియింపంబడి తన్మిత్రులగు పిడుగు సుబ్బరామయ్యగారి చేతను, మఱికొందఱు పండితులచేతను మఱికొన్ని పదములను సోదాహరణముగాఁజేర్పించి' ప్రచురించుట వలన ఈ పొరపాటు దొరలియుండునని నా

యూహ. 'మఱికొన్ని పదములను' సోదాహరణముగాఁ జేర్చిన 'మఱికొందఱు పండితులే' దీనికి కారకులు.

5. ఈనాము : చేసిన సేవలకు మెచ్చి యిచ్చెడి బహుమతి, పసదనము. 'కరిమయూర మరాళికలకు నొయ్యారమీనా మిచ్చి' (వరాహ. 4-159). <మరాఠీ ఇనామ : బహుమతి; పారసి, అరబ్బీ. ఇన్' ఆమ్ : బహుమతులు.

6. కంఖాణి : ఆఫ్ఘనిస్థానపు పరిసరములఁగల సీమనుండి కొనితెచ్చిన మేలి రకము గుఱ్ఱము. 'కంఖాణతురగరింఖా పుంఖిత....' (వరాహ. 5-27). 'సంజ్ఞా కంఖాణీన్' (పైది. 5-96). 'కంఖాణ' సంస్కృతపదమను ఆంధ్ర నిఘంటువుల నిర్ణయము సత్యవిదూరము. సంస్కృతసమాసమధ్యమునఁ బ్రయుక్తమగుటయే వీనికి ప్రమాణముకాబోలు : 'ఈ శబ్దము తెనుఁగు గ్రంథములయందే కానిపించుచున్నది : అని సూ. ని. కారుల జ్ఞాపిక. (చూ., సూ. ని., సంపుటి II పు. 3). ఆంధ్రదేశీయులగు సంస్కృత నిఘంటు కారులు దీనిని సంస్కృతపదముగా భావించుట ఆశాస్త్రీయము. 'కఙ్ఖాణః - అ. పు. గుఱ్ఱము' (సర్వశబ్దసంబోధిని, పు 117), 'కంఖాణః - అదంతః పుంసి॥ అమరః॥ ॥అశ్వే॥ గుఱ్ఱము' (సంస్కృతశబ్దార్థకల్పతరు, పు. 108). అమరకోశమున నీపదము లేకున్నను, శబ్దార్థకల్పతరుకర్త అమర సింహుని పేర్కొనుట ఆశ్చర్యము. వాస్తవముగాఁ అమరమునలేని పదములకును అమరమును ఆకరముగా బ్రదర్శించుట ఈ నిఘంటువునందలి విపరీత వైఖరి. తక్కిన ప్రసిద్ధ సంస్కృత నిఘంటువులలో ఈ యారోపమేకన్పట్టదు. వాస్తవముగా ఈ పదము సంస్కృతము కాదు. అశ్వములకు ప్రసిద్ధినందిన యొక దేశవాచకమిది. శుద్ధదేశ్యములగు పదములను సైతము సంస్కృత సమస్తపదములలోఁ బ్రయోగించుట శ్రీనాథునివచో విలాసములలో నొకదినుసు, కైవారము, హేరాళము మున్నగు సంస్కృతేతరపదములు సంస్కృత సమాసములలోఁ బ్రయుక్తమగుట శ్రీనాథరచనములఁగన్పట్టు లక్షణము. '...శ్రీనాథునకు సంస్కృత సమాసమున సంస్కృతేతరపదములఁ జేర్చు నలవాటుగలదు. ఇట్లే 'హేరాళ' పదమును గూడఁ బ్రయోగించినాఁడు....కయివారము అను రూపాంతరముండుట చేతను అచ్చతెనుఁగు గ్రంథములలోనుండుట చేతను దీనిని (కైవారమును) ఆచ్ఛికముగా గ్రహించుటయే యుక్తము.' అను సూ. ని. మతము (చూ., సూ., సం. II. పు. 460) సూరి జనసమ్మతము.

'...కలిభుపాలుని యొద్ది పాఠకులమీకై వార దుర్భాషణంబులకుంగాని యతండు మెచ్చండు...' (నైష. 7_89), 'ఆవేళను గంధర్వులు - కై వారాపదానుసారక మనీయముగాఁ-బ్రావేశిక ధ్రువాగానావళులఁ బరిఢవించిరి....' (హర. 6_9), భారతీదేవి కై వార వాక్యంబులు పఠియింపుచున్నది ప్రస్ఫుటముగ....' (కాశీ. 7_57) 'ఇచటఁ గై వారశబ్దము సంస్కృత సమాస ఘటితమైయున్నది. ఇది సంస్కృత శబ్దము గూడని శ. ర. న నున్నదిగాని యచ్చకర్ణాట శబ్దముగఁ గర్ణాట నిఘంటువులలో నున్నది. ప్రాచీన సంస్కృత నిఘంటు గ్రంథములలో నెక్కడ నీశబ్దముగనఁబడదు. కావున నిది దేశ్యమొండెఁ గవివార (కవులపలుకులు) శబ్ద తద్భవ మొండెంగావలయు. ఈ శబ్దము స్తుతిపరముగనే యఱవముననుఁ గన్నడముననువాడఁబడుచున్నది.... శ్రీనాథుఁడు (దీనిని) సంస్కృతముగ భ్రమించెనని తోఁచుచున్నది.' (వావిళ్ళవారి కాశీఖండప్రతిలోని అథస్సూచిక). కై వారము దేశ్యమేగాని తద్భవముగాదు. కన్నడమున 'కయ్‌పాజ్, కై పాజ్, కై వార' పదములున్నవి. చేయెత్తి మంగళా శాసనము పలుకుటయని దీని యర్థము 'కై వార' (పంపరామాయణం ఎంబ రామచంద్ర చరితపురాణం, 12_50). తమిళమునందును 'కై వారమ్' అను పదమిదే యర్థమున దేశ్యముగా నుట్టంకితము. తమిళమున 'కై వారిగళ్' అనఁగా నిలిచి చేయెత్తి రాజులను పొగడుటకు నియమితులయిన వారనియర్థము. ఇట్లే '.... హేరాళ క్రీడా సంచారిణి నూకాంబ' (భీమ. 1_101) యను ప్రయోగమును శ్రీనాథుని ప్రౌఢ వాక్పాటవముగాఁ బరిగణింపనగు. హేరాళము సంస్కృత పదమని శబ్దరత్నాకరము (చూ. పు. 1123), కాని యిది పేరాళమ్ (> పేర్ + ఆళమ్) అను శుద్ధ దేశ్యమునకు అర్వాచీనరూపము. 'ప', 'హ'గా మాఱుట ద్రావిడభాషలలో ఒక్క కన్నడమునకు పరిమితము. కన్నడమునను క్రీస్తు పదియవు శతాబ్దమునుండియు ప్రవర్తకమయిన ధ్వనిపరిణామమిది. తమిళమున పేరాళన్, పేరాళి = ప్రసిద్ధవ్యక్తి, యశస్వి. కన్నడమున పేరాళ్ = యుద్ధవీరుఁడు; సమర్థుఁడు; హేరళ = విరివి, విస్తారము. ఇట్టి సమాస రచనలో శ్రీనాథుఁడు అర్వాచీనకవులకు ఆచార్య పీఠము. కంభాణ శబ్దమునకు అర్వాచీనకవి ప్రయోగములు కొన్ని:

'అంబుధి తెరల కొందంబునఁదుటుములై భాసిల్లు కంభాణ బలము లొదవి'

—విజయ 3_152

'గజ కంఘాణ శతాంగ పత్తి బల వర్గంబుల్—' -పైది, 3-174

'సురకుల ధురీణ కంఖాణ కరికృపాణ రమ్యధావళ్య జైత్రపారావతంబు'
-సారంగ. 1-127.

'మదగజ కంఖాణ మాణిక్యగాణిక్య కనకాంబరము లుపాయనములందె'
-ఏనుఁగు లక్ష్మణకవి రామవిలాస పీఠిక.

'అరుణకంఖాణరింఖా ఘాతమైమించు నస్తగైరిక రజోవ్యాప్తియనఁగ'
-రంగారాయ. 3-137.

7. కంగారు: కలవరము; మనః క్షోభము. 'వెంగలి విత్తయి తిరుగుచుఁ—గంగారై చెడక' (భాగ. 9-583); యుద్ధము అని ఆంధ్రపద పారిజాతము, పు. 106 < మరాఠీ. ఖంగార్ = నాశము; శిథిలము; పారసి. కంగర్ = మొండి పట్టుదల; మోటుకుఁదనము.

8. కత్తలా (ళా) (ణి)ని: రూ. ఖత్తులాణము, ఖత్లాన దేశపు గుఱ్ఱము. A horse brought from Khatlan (బ్రౌణ్యము); తెల్లని గొరిజయుఁ దోఁకయు వెంద్రుకలునుగల నల్ల గుఱ్ఱము (శ. ర., పు. 197); కవచము తొడిగిన గుఱ్ఱము (ఆంధ్ర పద పారిజాతము, పు. 116); 'అమర వల్లభుహరితో నల్లన మాడంజాలెడు-తెల్లని యొక కత్తలాని తేజీహయమున్' 42 (నైష. 6-96), (వ్యా. 3-141); 'సాహిణుల్ దెచ్చిన కత్తళాని' (వరాహ. 3-40). 'వేలుపుఁ గత్తళానికి . . .' (పైది 4-145). ఇది కర్తలాణ శబ్దభవమని ఆంధ్ర నిఘంటువుల అంచనా (శ. ర., పు. 197, వైకృత దీపిక, పు. 27; పురుషోత్తమ కవీయము, పు. 22). కాని, ఏ సంస్కృత నిఘంటువునను 'కర్తలాణ' పదము కానరాదు. తుదకు ఆంధ్రదేశీయులయిన సంస్కృత కోశ

42. 'మహేంద్ర ముచ్చైః శ్రవసా ప్రతార్య యన్నిజేన్య పత్యాఽకృతసింధురన్వితమ్
స తద్దదేఽస్మై హయరత్నమర్పితం పురాను బద్ధుం వరుణేనబంధుతామ్'
—(శ్లో. 25, షోడశః సర్గః నైషధ మహాకావ్యమ్ చౌఖంబాప్రతి) అన్నది దీనికి మూలము.

కత్తలను దీనిని పేర్కొనలేదు. శ.ర.లో కత్తిలాణము అను పదము నొద్ద 'సం.వి.అ. పుం-తెల్లని గొరిజ తోఁక వెండ్రుకలుగల నల్ల గుఱ్ఱము, కత్తలాని' అని వ్రాయఁబడి 'పూర్వపత్పర్వ శుక్లాంగ స్త్వచా కృష్ణోభవేద్యది-వరోనామ్నా సవిజ్ఞేయః కత్తలాణ స్తురంగమః' అను శ్లోకము శివతత్వ రత్నాకరములోనిదిగా ఉదాహృతము ఈ శివతత్వ రత్నాకర మెక్కడిదో ఎప్పటిదో యెఱుఁగరాదు. 'ఖత్లాన దేశపు గుఱ్ఱ'మని బ్రౌను దొరగారు చెప్పిన వ్యుత్పత్తి సంగతమగునో కాదో చూడకుండ ఉపేక్షించుట యుక్తము కాదు. <పారసి. ఖత్‌లాన్ = బదఖ్‌షాన్ దేశములోని 'ఖత్‌లాన్' అను మండలము. బదఖ్‌షాన్ ఇండియా-ఖురాసాన దేశముల నడిమి దేశము; పద్మరాగములకు ప్రసిద్ధి; ఖత్‌లానీ = ఖత్‌లాన దేశసంబంధి; 'ఖతలాన' దేశపు మేలిజాతి గుఱ్ఱము; అరబీ. ఖత్‌ల్ = కుటిలప్రవారము, కుటిలగతి: పొంచియుండి ఒడిసిపట్టుట ముఖ్యముగా శృంగార నైషధప్రయోగ మిట పరిశీలనార్హము.

'తెల్లని యొక కత్తులాణ తేజోహయమున్' (భువనగిరి రంగయ్య శెట్టి గారి కుమారుఁడు చెన్నకేశవులు శెట్టిగారి జ్ఞాన సూర్యోదయ ముద్రాక్షరశాలా ప్రచురితమగు నైషధము, ఆ సరస్వతి-నృసింహాచార్యుల వారిచేఁ బరిష్కృతము, మదరాసు, 1889, పు. 95);

'తెల్లని యొక కత్తలాణ తేజో హయమున్' (కత్తలాణము నొద్ద నీఁబడిన శబ్దరత్నాకర పాఠము, 1885, పు. 211);

వేదమువారి సర్వంకష వ్యాఖ్యలో 'కత్తలాని' పాఠము స్వీకృతమయి కత్తలాణ శబ్దభవముగా నిరూపితము, శ. ర. లో నుదాహృతమైన శ్లోకమే యిందును ఉట్టంకితము, 1913;

'తెల్లని యొక కత్తులాని తేజీ హయమున్' (శ్రీమద్దేవ రాజసుధీ పరిశోధితము, కే. వేంకటశాస్త్రి విరచిత టీకా తాత్పర్య సహితము, ఆనంద ముద్రాలయ ప్రచురితము, 1914, పు. 561);

'తెల్లని యొక కత్తలాని తేజీ హయమున్' (ఉత్పల వేంకటనరసింహాచార్య పరిష్కృతము, వావిళ్ళ ప్రచురితము, 1927 వావిళ్ళ, 1951);

ఇఁక, తాళపత్ర ప్రతుల పాఠము లీ దిగువ ఉద్ధృతములు :

'తెల్లని యొక ఖత్తులాణి తేజీ హయమును' (ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయమునందలి తాళ పత్ర ప్రతి నెం. 29672, 79 వ ఆకు, మొదటి వైపు, 3వ పంక్తి) ;

'తెల్లని యొక ఖత్తులాణ తేజో హయమును' (ఆం.వి.గ్రం. తాళపత్ర ప్రతి నెం 29800,95 వ ఆకు, రెండవవైపు, 6వ పంక్తి);

'తెల్లని యొక ఖత్తులాణి తేజీ హయమునూ' (ఆం. వి. గ్రం. తాళ పత్ర ప్రతి, నెం. 32660,80వ ఆకు, మొదటివైపు, 3 వ పంక్తి).

"ఒక తాళపత్ర గ్రంథములో 'ఖత్తులాని తేజో హయమున్ అని పాఠ భేదము....సంస్కృత నిఘంటువులలో ఈ పదము కానరాదు. ఇంకను విచార్యము" (సూ ని., సంపుటి II, పు. 154, కర్తలాణము' శబ్దము నొద్ద). శబ్దరత్నాకరమున 'తేజీ' శబ్దము నొద్ద (చూ. శ. ర.. 1885, పు 498) 'తెల్లని యొక కత్తలాని తేజీ హయమున్' అను పాఠము ఉదాహృతము. పూర్వ ముద్రణ పాఠములను, తాళపత్ర ప్రతుల పాఠములను పరిశీలింపఁగా, 'కత్తులాని/ఖత్తులాణ' ఘటితములే మూల పాఠములనియు, బ్రౌనుదొరగారొసంగిన వ్యుత్పత్తి సుసంగతమనియు, కర్తలాణ శబ్ద నిర్వహణకు శ.ర. కర్త మార్చిన నైషధీయ పాఠమగ్రాహ్యమనియు పిండితార్థము. శ్రీరంగమహత్త్వము (మావ వల్లి సంపాదితము, జ్యోతిష్మతీ ముద్రశాలా ప్రచురితము, చెన్నపురి 1912) నందలి 'వెసఁగదలించి హేయనిన వ్రేల్మిదిలోనన నిల్చు ... వాగె వదల్చినఁ జువ్వనన్ - జవంబెసఁగఁగ గాలి మీఱు భువి నెన్నికకెక్కిన ఖర్తులాణముల్' (చతుర్థా. 1009వపద్యము) లోని 'ఖర్తులాణము'పై శ. ర. కర్త సృష్టించిన 'కర్తలాణము ముద్ర గాఢముగా పడినట్లు స్పష్టము.

9. కప్పలి:- సరకుల రవాణాకు ఉపకరించెడి ఒక దినుసు విలాతి ఓడ, '....కస్తూరికా ద్రవ్యముల్ శరధింగప్పలి జోఁగువల్లివలికా సమ్మాన్లఁ దెప్పించు....' (హర. పీఠిక, 28). మలయా భాషలో 'కప్పల్' అనఁగా ఓడ.

కర్పూరశబ్ద భవముగా పేర్కొనుట (వైకృతదీపిక, పు. 28; పురుషోత్తము కవీయము. పు. 23) ప్రామాదికము.

10 కమను:- ఒడ్డాణము; మొల నూలు. '....కటి మండలము మీఁద వజ్రాల కమరు గర్వంబుసూప' (కాశీ. 3-240). '....వజ్రాల కమరునిల్పి' (పైది. 7-148). 'వజ్రాల కమరుదేవ విడంబనము సేయునే కొండ మొలచుట్టు నిందుతనయ' (శివరా. 2-3); 'నితంబముమీద సవరింపవేల వజ్రాలకమరు' (పైది. 2-26). < మరాఠీ. కమర, కంబర, కమ్మర = నడుము, కటి స్థలము; కమ్మర్ బొంద్ = వడ్డాణము; పారసి కమర్ నడుము; కమర్-బంద్ = ఒడ్డాణము.

11. కాకితము:- లేఖ, పత్రము. అన్నయమంత్రి శేఖరుఁడు...పారసి భాష వ్రాసినన్ - కన్నుల పండువై యమరు కాకితమందలి వర్ణ పద్ధతుల్' (భీమ. 1-74). <మరాఠీ. కాగద్ = కాకితము. పేపరు; పారసి. కాఘజ్, కాఘిజ్ = కాగితము; లేఖ; పత్రము; ఇది కాకలశబ్ద భవమను మన పండితుల నిర్ణయము (వైకృత దీపిక, పు. 32; పురుషోత్తమ కవీయము, పు. 27 ఆంధ్ర పదపారిజాతము, పు. 134; ఆంధ్ర వాచస్పత్యము, పు. 805; లక్ష్మీనారాయ ణీయము, పు. 226) నిరాధారము. కాకల శబ్దమే సంస్కృత నిఘంటువునను గన్పట్టలేదు. 'కాకల' శబ్దము 'కాకితము'అగుట అసంభవము. సంస్కృతమున 'కాఘజ్' పారసి మూలకముగా మోనియర్ విల్యమ్సునఁ బ్రదర్శితము.

12. కిచ్చడి:- నానా వస్తువులు చేర్చివండు చిత్రాన్న విశేషము (శ.ర; సూ. ని.). ' ...చారులఁ దియ్య కూరలఁ బచ్చడులుం గిచ్చడులును . . . ' (కాశీ. 7-185) < మరాఠీ. ఖిచడీ ఖిచిడీ; పారసి. కిచ్‌రీ: పప్పు, బియ్యము, వెన్న - వీనితో తయారుచేయు భారతీయుల వంటకము.

13. కుందనము:- మేలిమి బంగారు. 'దశశతాక్షుఁడు తొడుగు కుంద నపుఁ బైఁడి కంకటముబోలు' (నైష. 6-106). 'పదియారు వన్నెకుందనపుఁ దగడు' (భీమ. 2-55). 'కూర్పించె నల్లిండ్లు కుందనమున' (పైది. (5-188), 'కడాని కుందనంబు' (కాశీ. 7-126). 'కుందనపుఁ బూదె చందాన నందమొందె' (హర. 2-115). 'కోమలి కాంతితోఁ గుందనంబు' (విక్ర, 4-19) 'వలిచన్నుగవతళుకులు కుందనపు నిగ్గుల నొనర్ప'

(రుక్మా 3-145), 'ధగ ధగమించు కుందనమున' (నవనా. పు. 20) 'ఉలూచిదాల్చు కుందనపు మెఱుంగుఁ గమ్మలను' (జై. 7-74), 'చందనంబున బుష్టంబు గుందనమున' (పి. శకుం. 2-62), 'అట్టి యాకుందన మొక్కచోట నిడి' (నా. పంచ. మిత్రభే. 515), 'కుందనపుకాళ' (తాళ్ళపాక, ఆధ్యాత్మ. X. సంకీర్తన, 180), 'కుందనపుఁ గాహళంబులు' (వరాహ. 11-44); 'సకలాకల నొరసిన కుందనపు బూదెయునుబోలె' (ప్రబోధ. 1-29), 'కుందనంపు హరివాణమునన్' (వేం. పంచ. 4-356). < మరాఠీ. కుందన; గుజరాతీ, కుందన్ = మేలిమిబంగారు; పారసి. కుందన్ = పరిశుద్ధలోహము. కన్నడమునందలి 'కుందణ, కుందన' పదములు దేశ్యములని కిట్టెల్ కన్నడ నిఘంటువు. పు. 441.

14 కుల్లా:- పటరచితమకుటము. 'కుల్లాపెట్టితిఁ గోకసుట్టితి ....' (శ్రీనాథుని చాటువు). < పారసి. కులాహ్ = నల్లగొఱ్ఱెపిల్లతోలుతో కూచిగా చేసి ముస్లిము సాధువులు, దర్వేషులు ధరించెడి టోపి; కులాహ్ = రాజు, ప్రభువు; కుల్లాయి, కుళ్ళా (యయి) పదము లర్వాచీనసాహిత్యమున విరివిగాఁ బ్రయుక్తము. ఇది ఖోలకశబ్దభవమని వైకృతదీపిక, పు 35; పురుషోత్తమ కవీయము, పు. 31; చూ కోహళి.

15. కొజ్జా:- షండుఁడు, నపుంసకుఁడు. 'వీథులఁదిరగంగ వెసఁదలారులుపట్టి కొజ్జానుజేసి రోసజ్జవారి....' (భోజరా. 4-319); 'అవుషండునకు కొజ్జాయనంగ....' (వేంకటేశాంధ్రము. మానవవర్గు, 33) < మరాఠీ. ఖోజా, ఖ్వాజా = ఫకీరు; ఏలిక. ఒక బిరుదము; పారసి. ఖ్వాజా = ధర్మదేశికుండు; పూజ్యుఁడు; ఏలిక, నపుంసకుఁడు; అంతఃపురము; ఖ్వాజసరా = నపుంసకుడు; ఖ్వాజా = షండుఁడు; రాణివాసపు కావలివాఁడు; ఖ్వాజా = ఆశీస్సు అంతఃపురము; ఖ్వాజసరా = నపుంసకుఁడు; ఖ్వాజా = ఆశీస్సు.

కోహళి:- చూ. కుల్లా = శిరాచ్ఛాదనము; ఆలవట్టము, ఉల్లడ - అని పూర్వనిఘంటువులు. 'మౌళింగోహళి సంఘటించిన క్రియన్ మధ్యాహ్నవేళన్ మహాకాళంబైన నభో విభాగమున వీఁకంగాసె బీరెండ .... (హర. 7-109), 'పార్వతీపతికిఁ బ్రభాత భూతపతిగొన్న యులరుఁగెందమ్మి కోహళియనంగ___ భానుబింబంబు గన్నులపండువయ్యె' (ఉ. హరి. 3-86). 'పయిరెండు ప్రయోగ

ములు తక్కఁ దెలుఁగున నీపదము నాకెక్కడను గానరాలేదు' అని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వ్రాఁత. (చూ. తెలుఁగు మెఱుఁగులు. పు 120) కాని, మదికి సింగనప్రయోగము—

'ఎనగంగ నుదయాచలేంద్రంబు మౌళి
పసిఁడికోహళియన భానుఁడు వొడమ' (ద్వి. భాగ. పు. 193) శ్రీ శాస్త్రిగారి చూపున కాని నట్టు కన్పట్టదు 'మరుఁడను నైంద్రజాలికుఁడు మానిని నీలముఖ స్తనద్వయీ-నిరుపమ కోహళీ యుగళినించి ....' (కోహళీ యుగళి— తొడుగులు, కుప్పెలు) అను 'వనమాలివిలాస' ప్రయోగము సూ. ని. ఉట్టంకితము-కోహళికి ఆంధ్రశాసన ప్రయోగములు కొన్ని :

'....శ్రీ విక్రమోత్తుంగ రాజేంద్ర చక్రవతిన్ స్వస్తిశ్రీ త్రిపురాంతక శ్రీ మన్మహాదేవరకుం బుత్తెంచిన పహింంచిచతుషున్ఖ కోహాళి' (త్రిపురాంతక శాసనము, A. R. No. 170 of 1905: 2,3 పంక్తులు; క్రీ. శ. 1292);

'....ఈ దినమందు ధర్మలింగానకు పంచవక్త్ర కోహాళి భంగారానం జేయించి సమప్పిన్ంచిరి' (పంచదార్ల లింగేశ్వరాలయ శాసనము, A. R No. 218 of 1899; 17, 18, 19 పంక్తులు; క్రీ. శ. 1422);

'....ఉత్సవ పెరుమాళ శ్రీ ముఖానకు ఐదు తులాలు ౨ భంగారానను కోహాలి సమప్పిన్ంచినాడు' (శ్రీ కూర్మము శాసనము. A. R. No. 347 of 1896: క్రీ శ. 1495). మఱి యొక ప్రయోగము కళింగ శాసనములలో నెక్కడో చూచినట్లు గుర్తు. ఇది సంస్కృత పదము కాదు. దేశ్యము కాదనుటకు దీని రూపమే ఒక తార్కాణము. తొడుగు, గొసెన అను నర్థముల 'కోహళె' కన్నడ కుమారవ్యాస భారత ప్రయుక్తము. మరాఠీ ఖోళ = ఆచ్ఛాదనము; పొది; గుజరాతీ. ఖోళీ = గొసెన, పరుపుగలీబు కులాహ్'అను పారసి పదము వర్ణ పరివర్తనవ న కుహ్లా > కొహ్లీ > కోహళి అయి యుండ నగునేమో? ఇంకను విచార్యము.

ఖత్తులాణము:- చూ. కత్తలానివాస్తవముగా కత్తలానికిదిపూర్వరూపము. '....విగతత్రాణంబులగు ఖత్తులాణంబులును విస్తీర్ణజీర్ణాంగంబులగుమాతంగంబులును....' (పి శకుం. 3-114). తాళపత్రప్రతులను, ముద్రితప్రతులను 43 'ఖత్తు

బాణంబులు'అను పాఠముకాదు. '....విగతత్రాణంబ్బులగు కత్తు బాణంబ్బులును వి_స్తిసన్ జీనన్ంబ్బులగు మాతంగ్గంబ్బులును ....' (ఆంధ్ర విశ్వాకళా పరిష ద్గ్రంథాలయము నందలి తాళపత్ర ప్రతి (బొబ్బిలి ప్రతి) నెం. 111,51 వ ఆకు, రెండవవైపు, రెండవపంక్తి). '.... విగత త్రాణంబులగు ఖత్తు బాణంబులును విస్తీనన్ జీనాన్ంగంబులగు మాతంగంబులును....' (ఆం. వి. గ్ర. తాళ పత్ర ప్రతి, నెం. 29434,172 వ ఆకు, మొదటివైపు, 3వ పంక్తి). చతురంగ బలమున మాతంగములతోఁబాటు తురంగములను పేర్కొనుట సంగతము కావునను, అశ్వార్థమున 'ఖత్తులాణ' పదము అన్యత్రస్థితిస్థాపకముకావునను, ఇట 'ఖత్తు లాణంబులు'అనుపాఠమే యుక్తము. 'ఖత్తుబాణంబులు' లేఖ కల్పితము; పద స్వరూపమును పరిశీలింప పాలుమాలిన పరిష్కర్తల అలసతకు ప్రతిబింబము

16. ఖర్చు:- వ్యయము, 'అన్నపు ఖర్చున కాకుపోకలకు-ఈ నున్న దేమైన ఇపుడె యిప్పింపు' (పల్నాటి పు 69)<మరాఠీ ఖర్చ = వ్యయము; ఖర్చణేఁ = ఖర్చుచేయు ; పారసి. ఖర్చ = ఖర్చు; ఖర్చీ = ప్రయాణ సంబంధమైన వ్యయము; రోవెల<అరబ్బీ.

17. ఖాన:- ముస్లిములలో పఠానీ తెగవారి పట్టపుపేరు. 'ఇమ్మడి సైపఖానాధి రాజ్యభార ధుర్యుండు విఠ్ఠల ప్రభువరుఁడు' (శ్రీరంగమహాత్త్వము పీఠిక, 43).<మరాఠీ ఖాన = ముస్లిముపాలకుల బిరుదము; పారసి ఖాన్ = ఖాత, తూరానీ (తార్తారీ) వంశీయులగు రాజుల బిరుదము; యువరాజు; ఉత్తమ వంశీయుఁడు; ఏలిక, ప్రభువు< తుర్కీ, ఖాన్.

18. ఖుసి:- సంతోషము; విలాసము. 'ఖుసి మీఱన్ సురథాణి సిండు కొలుపై కూర్చున్నచో....' (హర. పీఠిక, 22) < మరాఠీ, ఖుశీ, ఖుశ, ఖూశ (ష) = ఆనందము: సుఖము; పారసి, ఖుసీ.

19. గంజాయి:- గంజాయిఆకుతోఁ జేసిన మత్తుపదార్థము. 'గంజాయి

---

43. 'విగతత్రాణంబులగు ఖత్తు బాణంబులును విస్తీర్ణ జీర్ణాంగంబులగు మాతంగంబులును' —వావిళ్ళవారి 1928 ప్రతి, పు 68; కొండపల్లివారి 1968. 1147 ప్రతులు, పు. 64.

దినఁగ నుత్కంఠఁజేసినవాఁడ' (శివరా. 3-62). 'గంజాయి దినెనేమి....' (ద్వి. హరిశ్చ. ఉ. పు. 241) <మరాఠీ. గాంజా. 'కల (శ)ంజ' పద భవమను పండితుల నిరూపణము అగ్రాహ్యము.

20. గలబ:- అల్లరి, సందడి, కలఁత. 'ఈ మహోత్సవంబులలో నిట్టి గలబలు సేయుదురే' (ద్వా. 7-30.) 'ఎల్లజనులం గూర్చుండనిచ్చి గలబ పుట్టకుండ నెడ నెడదండలపెరుల నిలిపి' (పై ది.7-64) < మరాఠీ, గలబలణేఁ = అల్లరియగు; గలభా = క్షోభము. ధ్వన్యనుకరణమును కావచ్చు.

21. గసగసః- ఒక దినుసు మసాలా విత్తులు; నల్లమందు విత్తులు (ఆంధ్రపద పారిజాతము, పు 184) 'గసగస లివయును. (భీమ. 3-57). 'గసగస యెసక మెసఁగె' (కాశీ. 3-23), 'గసగసలు' (పై ది. 7-185), గసగసలు చాఱపప్పు' (రుక్మాం. 3-6)<పారసి. ఖష్ఖాష్; 'గసగసాలు: the minute seeds of the poppy plants This is corrupted from the Arabic name 'khash khash ' Ainsl. 1.326 (బ్రౌణ్యము, ప్రథమ ముద్రణము, పు. 204). గసగసాలనుట పునరుక్తియను భ్రమవలన కాఁబోలు 'గసాలు' అని అనంతపుర మండలము వారి వాడుక.

22. గస్తు:- దొంగతనము లోనగునవి జరుగకుండుటకై కావలివారు ఊరు తిరిగి కాచుకావలి. 'గస్తు దిరిగి' (ద్వి. హరిశ్చ. ఉ. పు. 252), 'అర్ధరాత్రవేళ-ఖడ్గఖేటకపాణియై గస్తుదిరిగెఁ - బెద్దతలవరి కింకరోపేతుఁడగుచు' (వేం. పంచ. 3-197)<మరాఠీ. గస్త = కావలి, విహారము; పహారా; పారసి. గష్త = అవలోకనము; విహారము; పహారా, కావలి కాయుట; గష్తీ = కావలి; గష్తియా = కావలివాడు; గుల్ గష్త్ = విహారానుగుణమగు గులాబీలతోట; శహర్ గష్త్ = ఊరేఁగింపు.

23. గాగరాః- స్త్రీలు కట్టుకొను పావడ. 'వన్నెలగాగరా జిలుగు వట్రువకుచ్చెళలందు....' (శ్రీనాథుని చాటువు < మరాఠీ. ఘాగ్రా = స్త్రీల పావడ; ఘాగ్రీ = పిల్లల మొలనూలిగంట.

24. గులాము:- రూ. గుల్లాము, దాసుఁడు; దాసురాలు; దానిన 'ఓసి

గులామ నన్నెఱుఁగకుండగ నెయ్యడ కేఁగితి....' (నా. పంచ. మిత్రభే. 183వ పద్యము); హీనుఁడు. 'పెలుసెల్లముల కీక్షింప నిచ్చినసొమ్ము మగుడనీ లేవి కోమటి గులామ' (వేం. పంచ. 1-763)<మరాఠీ. గులామ = కొండెగాఁడు; నీచుఁడు; తొత్తు కొడుకు; బానిస. పారసి. గులామ్ < అరబ్బీ.

గుల్లాము :- చూ. గులాము. నీచురాలు. 'లంజెతల్లియె యిదియు గుల్లాముగాక' (క్రీడా. 265).

25. గొంగడి :- కంబళి. 'గొంగడు లెగురగవైచుచు' (భాగ. 10. పూ.437) 'ముసుఁగిడ్డ యోరగొంగడియు' (నవనా. పు. 27). 'గొంగళ్ళు' (వేం. పంచ.) <మరాఠీ ఘోంగ = దుప్పటి; ఘోంగడీ. 'కంబళ' శబ్దభవమని కవిసంశయ విచ్ఛేదము. పు. 70. ఆంధ్రపద పారిజాతము. పు 201. ఆంధ్రవాచస్పత్యము. పు. 1108; 'పదపడియలతి దుప్పట్లు గొంగెడలు' (పర్వత. పు. 339) అవి పండితారాధ్య చరిత్ర ప్రయోగము.

26. గోరక్కుఁడు :- నవనాథులలో నొకఁడు; మత్స్యేంద్రనాథుని ప్రధాన శిష్యుఁడు. 'గుణరత్న నిధియును గోరక్కుఁడనఁగ' (నవనా. పు. 254). 'అక్కడ మాని తత్పురియుపాంతమునన్ మసనంబులోన గోరక్కుఁడు మీన నాథుడు...' (ద్వా. 12-48)<మరాఠీ. గోరక్ష = నవనాథులలో నొక సిద్ధుఁడు.

27. గోవ :- పశ్చిమ సముద్రతీరమునఁగల రేవు పట్టణము; పడమటి సీమలనుండి వచ్చు బేరపు దినుసులు ఈ రేవుగుండ దిగుమతి యయ్యెడివి. పూర్వనామము గోమంతకమఁట; 'సింధాపూర'యని మధ్య యుగముల వ్యవహారము. గోమంతకము 'గోవ' అయినదఁట; 'గోవజవ్వాది' = గోవా రేవునుండి దిగుమతియయిన జవ్వాది (నైష. 6-120). 'గోవసంశుద్ధ సంకుమద ద్రవముఁ దెచ్చె' (హర. పీఠిక, 26). 'తరుణాసీరి తవాయి గోవరమణాస్థానంబులన్....' (పైది. పీఠిక, 28) > మరాఠీ. గోవేఁ = గోవా పట్టణము.

28. గోహరి : పరాక్రమము. 'హరికిశోరముల గోహరికి శోషిలని దుర్వార గర్వాటోప వీర భటులు' (జై. 6-154)> పారసి, గోహార్ = ప్రతిభ; అంతర్నిహిత శక్తి.

29. చబుకు : కొరడా, చేఱుకోల. 'వాజిళవంబుఁ వడిమీద నెక్కి-చబుకుల గొట్టుచుచనుమను వారు' (పల్నాటి. పు. 119). 'సమరసముఁజూపి నెఱయఁబగ్గములు వదలి. సైంధవంబుల ధేయని చబుకు సేయ' (జై. 6-53) < మరాఠీ, చాబూక = కొరడా, పారసి. చాబుక్ = కొరడా; చాబుక్‌బాజి = చబుకు సేయుట, చబుకుతోఁ గొట్టుట. 'చబుకు' గ్రామ్యమనియు, పారసి జన్యమనియు కాంబెల్. (Campbell, p. 224).

30. చవుక : రూ. చౌక. ఎల్లిదము, లోఁకువ. 'జీవితతుల్యాలం జవుక సేసి' (వేం. పంచ. 1-368) < మరాఠీ, సంవగ (ఘ) = అగ్గువ; గుజరాతీ, సోంఘ = వెల తక్కువ; అపభ్రంశ భాషలో 'సుమగ్ఘ (<సంస్కృత, సమర్ఘ)

31. చాడి :- కొండెము 'చాడిముచ్చు గొల్లెత' (తాళ్ళపాక. శృంగార సంకీర్తనలు, సంకీర్తన, 113),'చాడికి చెవిఁజేర్తురు' (వేం పంచ. 1-532) 'చాడికి నొడంబడి యుండెడి వృత్తికన్నఁ జావుమిగుల లెస్స' (పైది. 2-144) <మరాఠీ, చహాడీ, చాడీ, చాహాడీ = నింద; చాడ, చాడీ = తీవ్రవాంఛ; చాడ = కపటి, మాయావి.

31. a. చామలా :- ఒకరకమైన కడియములు. 'చామలా కడియములు....' (పల్నాటి. పు. 72) < మరాఠీ, శామల = అబిసీనియాదేశపు సోమాలి.

32. చావడి :- కొలువు కూటము; రచ్చ, కార్యస్థానము '..పెద్ద సావళ్ళ - చేరి భాషింపుచు....' (పల్నాటి. పు 28). 'స్వప్నమనే యెడపుఁ జావడిలో' (తాళ్ళపాక. ఆధ్యాత్మ. vi 124), '....నగరిచావడి కడ వాకిటఁ దురగమ్ముడిగం...' (జై. 8-80), లోపలచావిడిం గొలువున్న....' (వరాహ. 6-90), '....అద్దంకి సావడిని ..' (A. R No. 792 of 1922, 5వ పంక్తి క్రీ. శ. 1448) <మరాఠీ, చావడీ = కొత్వాలు చావడి: రచ్చబండ; చాహవడీ (వేళాపూర్ శిలాశాసనము) <సం. చౌహాట (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము, పు. 276)

33. చికిలి-తుడిచి చక్కచేయుట (శ. ర), మెఱుఁగు, పదను; శస్త్ర సమ్మార్జనము. 'చిఱుసానఁ బట్టించి చికిలిచేయించిన గండ్రగొడ్డలి....' (కాశీ.

1-121) 'చికిలి చేసిన యడిదంబు' (శివరా, 4-74). 'చికిలి చేసిన తామ్రంపుఁ జెంబుఁబూసి' (వీధి నాటకము, 17). 'శృంగార రసమునఁ జికిలిసేయించిన కంతుమోహన సాయకంబులన....' (రుక్మాం. 1-71). చికిలి చేసిన మదనాస్త్ర నికరమనఁగ' (పరతత్త్వ రసాయనము, 1-100) < మరాఠీ. సికల = మెఱుఁగు; గుజరాతీ సికల్ = మెఱుగు; సికలీగర = ఆయుధములకు పదను పెట్టువాఁడు; పారసి. సక్కాల్ = మెరుగుపెట్టువాడు; అరబ్బీ. సక్ల్ = మెఱుఁగు.

చౌక :- చూ. చవుక. తక్కువ. లోఁకువ. 'చౌకసేయక క్రుంకి' (నవనా. పు. 205). 'వానిబ్రదుకు చౌకౌగాదే' (ద్వా. 3-194), అచారంబు చౌక సేయు' (పి. శకుం. 5-163).

34. జబ్బు :- అలసము, మందము (శ. ర., పు. 421), అసారము (ఆంధ్ర పదపారిజాతము, పు. 251), జడిమ. 'జబ్బించుకలేని యొడలు' (శ్రీ నాథుని చాటువు) < మరాఠీ. జబూన = పేదవడిన, బీదగిలిన; పారసి. జబ్బ్ = కృశించుట. చిక్కిపోవుట. వట్టిపోవుట. శుష్కించుట. < అరబ్బీ; దేశ్యమని కిట్టెల్ (కిట్టెల్ కన్నడ నిఘంటువు, పు. 636).

35. జమ్మఖాణము :- రంగు రంగుల నూలిపట్టెలుగల ఆస్తరణము. జముఖాణము, '....వస్తువిచారుఁడు....వివేక నృపతి చరణంబులకున్ — వినతుండై తచ్ఛాసనమునఁ జేరువజమ్మఖాణమునఁ గూర్చుండెన్' (ప్రబోధ. 4-13)- ఇది సూ. ని. పాఠము. '....జమ్మఖాణమునఁ గూర్చుండెన్' అని ముద్రిత ప్రతిపాఠము. పు. 35. 'వస్తు విచారః॥ (ఉపసృత్య) జయతు జయతు దేవః ఏషవస్తు విచారః ప్రణమతి.

రాజా॥ ఇహోపవిశ్యతాం.

వస్తువిచారః॥ (ఉపవిశ్య) దేవ!, ఏషతే కింకరస్సంప్రాప్తః, తదాజ్ఞ యాతను గృహ్యతాం'— అని మూలము (కృష్ణమిశ్రయతి, ప్రబోధ చంద్రోదయ-చతుర్థాంకః. పు, 125, త్రివేంద్రమ్ సంస్కృత గ్రంథ మాలిక,

నెం. 122, సాంబశివశాస్త్రి సంపాదితము. 1936) <మరాఠీ. జమ్‌ఖాణ [44]

36. జరి :– వెండి బంగారముల మొలాము. 'జరిగొన్న వెలిపట్టు జన్నిదంబులలుంగ' (క్రీడా. 42). 'జరిపోవి గడితంపుఁ జిఱుతచౌకంబుల' (పైది. 134). 'జరిగొన్న వెలిపట్టు జన్నిదంబుల తోడ రత్నాల తారహారము ధరించి' (శివరా. 2–90), 'వెన్నెలజరియిడ్డ వెఁడితీగెలఁ బోలు యజ్ఞోపవీతంబులు...' (విక్ర. 7–143)<పారసి. జర్, జరీన్ = బంగారు; ధనము; జర్‌తార్ = బంగారు పోఁగుతో చేయఁబడిన: వెండి, బంగారము మొదలగు వానితో మొలాము చేసిన నూలిపోఁగు; జర్ (= బంగారు) + తార్ (= దారము); జర్‌తారీ = బంగారు మొలాము చేసిన నూలి పోఁగుతో నేసిన వస్త్రము; జరబాజీ (జు) = జరీవస్త్రము; తెలుఁగున జరతారు.' 'జలతారు'గా పరిణమించుట వర్ణవిభేదనము (dissimilation)కు లక్ష్యము. జలతారీ (రు). జల్తా (రీ)రు దీని రూపాంతరములు. 'జలకము + తారు' అను శ. ర. వ్యుత్పత్తి అశాస్త్రీయము, తన్మూలమున నిరాకృతము. శ. ర. 'జరి' వివైకృతమనుట నిరాధారము. వైకృతదీపికలో నీపదము కానరాదు. ప్రాచీన పారసీక భాష–అవెస్తా–లో 'రన్య' అనఁగా బంగారము. అవెస్తాకు సోదర భాష యగు సంస్కృతమునందలి 'హిరణ్య', పారసిలోని 'జరన్య'కు జ్ఞాతి పదము (Cognate word). జరీకుచ్చుఁజీను. జరీకోక, జరీబుటాచీర– అన్నవి తెలుఁగున అర్వాచీన ప్రయోగములు; చూ. జలపోసనము.

37. జలనోంగి : ఇది యే పట్టణమో యెఱుఁగరాదు; ఆఫ్రికా తూర్పు తీరము నందలి 'జీలాన్' రేవు పట్టణము కానోపు. 'జలనోంగి బంగారు మొలకఁ దెచ్చె' (హర. పీఠిక, 26).

38. జలపోసనము ; బంగారుపై పూఁత, సువర్ణాచ్ఛాదనము; 'బంగారు జల పోసనముతోడి ప్రన్నని సట్టు తోరము ధరించి' (క్రీడా. 42,). పైఁడి జలి

---

44. పారసి. జామ = మూఁత, తెర; అచ్ఛాదనము; ఖానహ్ = స్థానము, తావు; జామ్ = రంగు రంగుల గాజు తలుపు; జామ్‌కాన్ = స్నానాల గదులలో దుస్తులు భద్రపఱుచు అలమార; స్నాన సమయమున ధరించు ఉడుపులు; జామ్ ఖానహ్ = నేలపై పరచునది.

పోసనపు కసీసంపు పట్టు బంతి' (కాశీ. 6-161), 'పసిఁడి జలపోసనము తోడనె సక మెసఁగు- బిసరుహాసను పుటియ కప్పెరధరించి' (హర. 5-55). 'పైఁడి జలపోసనము వీణె' (రుక్మాం. 4-35), పైఁడి - జలపోసనంబులఁ జాలి నొప్పారు - పల్లనంబులు....' (నవనా. పు. 143). 'సరిలేని బంగారు జల పోసము వీణె' (శ్రీరంగ మహత్త్వము. 2-70) < పారసి, జర్‌పోష్ = బంగారు లేసు పని; జర్ (= బంగారు) + పోష్ (= అచ్ఛాదనము. పూఁత); గుల్‌పోష్ = గులాబీలచే అలంకృతమయిన; జీన్‌పోష్ = జీనుమీఁది ఆచ్ఛాద నము ; పలంగ్‌పోష్ = పరపుపైని దుప్పటి ; పాయ్‌పోష్ = పాదాచ్ఛాదనము. పాదరక్ష (తెలుఁగున 'పాపచ్చులు. పాపోసులు, పాయిపోసులు) మేజ్‌పోష్ = మేజామీఁది ఆచ్ఛాదన వస్త్రము — ఇట్లు '-పోష్' అనునది పారసిలో విరివిగా ఉపయుక్తము. సర్వాంధ్ర పద ప్రదర్శని యగు ఆంధ్రపద పారిజాతము 'జర పోసు' అను పదము నుట్టంకించి 'జరీ' అను నర్థము నిచ్చినది. (చూ. పు-251). 'జలపోసనము = జలకము (< సం. జలమ్) + పోసనము' అనువ్యుత్పత్తి (శ.ర., పు. 423; ఆంధ్ర వాచస్పత్యము. పు. 1296; సూ. ని. III. పు. 407) నిర్మూలము.[45]

'జలపోసనముల మీఁదుల విలాసములఁ
గలశముల్ పట్టుఁగుచ్చుఁ జిత్తరువులు'

—పండితా. పర్వత. పు 310 ;

'సరిరత్న పఙ్క్తుల జలపోసనములఁ
గర మొప్పు తొంగళ్ళగల చల్లడములు'

—పైది. పు. 436 - ఇట్టి ప్రయోగములను బట్టి పండితారాధ్య చరిత్ర పంద్రెండవ శతాబ్ది రచన కానేరదు. సోమనాథుఁడు క్రీ. శ. 1290 ప్రాంతము వాఁడను మల్లంపల్లి వారి నిర్ణయము (భారతి, 1945, ఫిబ్రవరి) తో ఏకీభవింపక తప్పదు.

---

45. పూజ్యులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి ప్రభృతులు ఆ మధ్య 'జనపోసనము'పై కన్నువేసి సాఁగించిన చర్చయెక్కడో చదివినట్లు గుర్తు. వీ రేమి నిర్ణయించిరో స్మృతిలో లేదు. అకారము కొఱకు వెదకినను ఫలితము శూన్యము.

39. జాళువా : మేలిమి బంగారు, 'Fine gold. Probably (like Ophir or Potosi) the name of a place. Thus జాళువా పసిడి' (బ్రౌణ్యము, పు. 327). 'కమ్మ విలుకాని జాళువా బొమ్మ యనఁగ' (శ్రీనాథుని చాటువు). 'చెలగుచు జాళువా చీర ధరించి – రాజిల్లు హొంబట్టు రవికను దొడిగి' (పల్నాటి. పు. 65), 'తోరపు జాళువా పసిఁడి తొట్టుం...' (వేం. పంచ. 4-341). దీని మూలము అవిజ్ఞేయము. బ్రౌను దొరగారూహించినట్లు 'జాళువా' యనునది ఏదో యొక స్థల వాచక సంబంధి కానోపు. ఇంకను విచార్యము.

40. జిరా : ఏనుగుఁలకు, ముఖ్యముగా గుఱ్ఱములకు పైని వేసెడి వస్త్ర కవచము. పక్కెర. 'వాగె వదలి జిరా గనగనం గదలించి తోలిన' (ద్వా. 8-71). 'జిరాల్ గురాలు' (వేం. పంచ. 1-188) <పారసి. జర, జిరహ్, జిరిహ్ = కవచము; జిరిహ్ జామ = మీఁది ఉడుపులు; జిరిహి పోష్ = సైనికుల దుస్తులను ధరించుట.

41. జీబు : వస్త్ర భేదము. '.... శ్రీరామ తోఁపులును.... జీబులును....' (ద్వా. 3-188); 'చందురకావి జీబులు' (ఆముక్త. 5-90). 'హొన్నంచు పైటాణి సన్న జీబులు' (ఘటికా. 2-11), 'మాదాపకలును జీబులును' (కవి. 3-195) – అని అర్వాచీన ప్రయోగములు < పారసి. జేబ్ <తుర్కీ.

42. జులుము : దుండగము, అత్యాచారము. 'సతి నమ్మెదను హరిశ్చంద్రుఁడన్వాఁడ – జులుము లేటికి నొండు సుద్దులు మాని – తొలఁగుము...' (ద్వి. హరిశ్చ. ఉ., పు. 192) 'జులిమి' అని అందే అర్థసూచిక. 'దుడుకు లూటి జులిమి దుండగ మనఁదదు....' (వేంకటేశాంధ్రము, మానవవర్గు'69), 'దుడుకు లూటి జులిమి దుండగమ్మన నుద్ధతాఖ్య లౌ. ....'(సాంబ. మానవ. 43) < మరాఠీ. జులూమ జులుమ = క్రూరపాలనము; ఉగ్ర శాసనము; అరబ్బీ. జుల్మ = చెడుగా ప్రవర్తించుట; బలాత్కారము.

43. జూటరి : కల్లలాడు, మోసగాఁడు. 'కోటి చదువఁగవచ్చు కోపము నిలుపరాదు – జూటరై వాకఁడు దన్నునోఁక నాడితేను' (తాళ్ళపాక. అధ్యాత్మ VII. సంకీర్తన. 240) జూటు + అరి; 'జూటు' వైకృతమని శ.ర. (పు 429)

పరిగణనము.కాని, వైకృత దీపికలో ఈ పదము కానరాదు < మరాఠీ ఝుట్, ఝూట్, ఝూట = అబద్ధము; మోసము.

44. జోఁగు : = వెదురు బద్దలను, వేపబెత్తములను పేర్చి అల్లిన తెర చాపలు మూఁడు నుండి పండ్రెండు దాఁక అమర్చెడి పెద్ద ఓడ. 'మహిత లావణ్య వార్ధిలో మదనుఁడెక్కు-కప్పురపు జోఁగుఁగంటిమి కంటిమనుచు - నర్మగర్భంబుగా నొక్క నలినవదన-పొగడె సఖిచంటి మీఁది యొప్పుల నఖంబు' (నైష. 3-101),46 సుడివడ్డ ముత్యాల జోఁగువోలె' (కాశీ. 1-138), 'కదలి మొగ యక్కలిందగులు వడి చిక్కిన జోఁగునుంబోలె....' (పైది. 2-98), '...శరధిన్ గప్పురి జోఁగు వల్లి వలికా సమ్మాన్లఁ దెప్పించు నేర్పరియై....' (హర, పీఠిక, 28). ఈ 'జోంగ్' జావనీ, మలయా భాషలలోనిది. ఈ ఓడల తయారీకి చీనావారు కారకులఁట! వీని తెరచాపలను అక్కఱలేనిచో దింపివేయక చుట్టగా చుట్టి ఓడ కంబములకు కట్టివేయుదురు. నాటు పడవలు, ఓడలు కొయ్య చీలలతోడను, కొబ్బెర పీచుపురులతోడను బిగింపఁ బడుచుండగా, 'జోంగు'ల కొయ్యపలకలు ఇనుప చీలలతో బిగింపఁబడి బలిష్ఠముగా నిర్మింపఁ బడుచుం డెడివఁట. పదునాలుగవ శతాబ్ది వారగు ఇబ్న్ బతూతా, రషీద్-ఉద్-దీన్ మొదలగు విదేశ పర్యాటకులు 'జోంగు'లను గూర్చి విస్తరించి వ్రాసిరి. మలక్కా మొదలగు ప్రాచ్య ద్వీపములలో భారతీయ వర్తకులు ముఖ్యముగా చోళమండల తీరము వారగు 'జెంతూ' (= తెలుఁగు) సెట్లు చాలమంది నివసించుచుండి రనియు కోటికి పడగలెత్తిన వీరు 'జోంగు'లను పేరుగల పెద్ద పెద్ద సొంత ఓడలను సరకుల రవాణాకు వాడుచుండిరనియు బార్బోజా వ్రాతలు.47 ఈ తెలుఁగు సెట్లలో నెల్లూఁకివారు, అవచి తిప్పయ్య సోదరులు, చామిసెట్టి ప్రభృతు లును ఉండవచ్చు. వ్యుత్పత్తి పరముగా చూచినచో సబిందుకము సాధుపాఠము.

---

46. 'నానాస్మరః కింహరబీతిగుప్తేః పయోధరే ఖేలతి కుంభ ఏవ
ఇత్యర్ధ చంద్రా భ నఖాంక చుంబి కుచా సఖీ యత్ర సఖీభిరూచే'
—(శ్లో. 66, షష్ఠస్సర్గః, నైషధ మహాకావ్యమ్, చౌఖంబాప్రతి) అని మూలము

47. Hobson - Jobson, p. 472.

తాళపత్ర ప్రతుల పెక్కింటను సబిందుక రూపమే కలదు.48 నిర్బిందుకముగా కొందఱు ఉదాహరించుట పొరపాటు.

45. డమామి (యీ) : డిండిమము, డంకాకంటె చిన్నదియయిన చర్మ వాద్యము. 'డమాయీలు' (పల్నాటి, పు. 4), 'తబల....డమామి....ధ్వానంబు' (వరాహ. 3-52) < మారాఠీ. ఢమామి.

46. దేరా : గుడారము 'జగడంపు డేరాలు...' (పల్నాటి. పు. 36); దేర యనఁగ వెలయు పటకుటీరాఖ్య....' (వేంకటేశాంధ్రము, మానవ. 74) < మరాఠీ. డేరా = గుడారము.

47. తబల : ఒకే కన్ను కలిగి మద్దెలను బోలిన చర్మవాద్యము. 'తబల డమామి....ధ్వానంబు....' (వరాహ. 3-52) < మరాఠీ తబలా; అరబ్బీ, పారసి తబ్‌లా, తబ్‌ల = చిన్నమద్దెల; తబ్‌ల్ = మద్దెల వాయించు; చిన్నమద్దెల; తబ్‌ల్‌జన్, తబ్‌ల్‌బాజ్ = మద్దెలకాఁడు.

48. తరుణాసీరి : బర్మాదేశము దక్షిణ భాగమున, తన్నాసరి రాష్ట్రమున, తన్నాసరి నది యొడ్డునఁగల ఒక రేవుపట్టణము. 'తరుణాసీరి తవాయి గోవరమణాస్థానంబులన్....' (హర. పీఠిక, 28) 'తరుణాచీని' యను వేటూరి వారి పాఠము ముద్రా రాక్షసము కాఁబోలు! 'తన్నాసరి మలయ ద్వీపకల్పమున నొక రాష్ట్ర ప్రధాననగరము' అని వేటూరివారి నిర్ణయము. మలయా భాషలో 'తనాసరి' యని వాడుక. 'తనాహ్‌సరి' యనఁగా 'ఆనందసీమ' అని యర్థము. బర్మీలో 'త-నెన్-ధా-రి', 'తనంగ్-సరి' యని వ్యవహారము. అబ్దుల్‌రజాక్, నికోలాదీకోంతి, బార్బోజా-మొదలగు విదేశ పర్యటకుల వ్రాఁతలలో "తన్నా

---

48. 'మహితలావణ్యవాధిన్‌లో మదనుఁ డెక్కు
తప్పరపు జోంగు గంట్టిమి కంటిమనుచు
పమన్గ ఘన్ంబుగా నొక్క నలినవదన
పొగడె సఖి చంటి మీంది యొప్పు లనఖంబు' (శ్రీం. సై., అం. వి. గ్రంథంలోని తాళపత్ర ప్రతి నెం. 29800. 42వ. ఆకు మొదటి వైపు, 4. 5 పంక్తులు);
'....జోంగు గంటిమి గంటి మనుచు....' (శ్రీం. సై., అం. వి. గ్రం. లోని తాళపత్ర ప్రతి నెం. 32660, 39వ ఆకు, మొదటివైపు, 7వ పంక్తి);

స్సరి,' 'తర్నస్సరి.' 'థెనాస్సరిమ్', 'దహ్నసరి' యను రూపములు ఉదాహృతములు (Hobson-Jobson p. 914).

49. తవాయి : బర్మాదేశము దక్షిణ భాగము నందలి తన్నాసరి రాష్ట్రమున తవాయి నది తూర్పు ఒడ్డునఁ గల ఒక రేవుపట్టణము; తవాయిజిల్లాకు ముఖ్య పట్టణము. 'చీని సింహళ తవాయి హురుముంజి చోణంగి ప్రభృతినానా ద్వీప నగరాకరంబులగు....' (హర. పీఠిక. 7), తరుణాసీరి తవాయి గోవరమణా స్థానంబుఖన్....' (పైది. 28) మలయా ద్వీపకల్పమునఁగల రేవుపట్టణమని వేటూరివారు-బర్మీభాషలోనిది 'ధ-వే', 'ధ-వాయ్' అని వ్యవహృతము-బర్మీ పండితులు దీనికి పలురకముల వ్యుత్పత్తి చెప్పిరి. 'ధ-వాయ్' అనఁగా ఖడ్గములను కొనెడిచోటు; హ్తా-వాయ్' = బుద్ధునకుఁ సంబంధించిన', మలయా భాషలో 'తవాయ్' మూలరూపమున 'సయామీ' భాషలోనిదఁట; (Hobson - Jobson. p. 904.) నేఁటి 'తవాయి' పట్టణము జనాభా 36 వేలకు పైబడి.

50. తాయెతు : దండనో మెడనో మొలనో కట్టుకొను రక్షాభూష. 'మేనికి రక్షయై మించు తాయెతులు' (పల్నాటి. పు. 17), 'చెలువొందు చుండెడు చేతుల రెంట-నెత్నాలు చెక్కిన రమ్యాంగదములు - దండకడియములు దంట తాయెతులు-మక్కువతోఁ గట్టి- (పైది. పు 72). 'వక్షఃస్థలంబున రక్షపూసల పేరు దండతాయెతులను దగఁ ధరించి' (ద్వా. 7-45) < మరాఠీ. తావీజ = రక్ష భూష ; పారసి. త'వీజ్ = తాయెతు, రక్షాబంధము; అరబ్బీ, త. అవీజ్ = శరణుకోరుట: రక్షణార్థము సర్వేశ్వరుని ప్రార్థించుట; తాయెత్తు. ద్వ. వి. (తాయి + ఎత్తు) తల్లి బిడ్డలకుఁగట్టు రక్షాబంధము అని శ. ర. (చూ. పు. 468); 'నెలవంక తాయెతులు, లక్క తాయెతులు' అని అర్వాచీన ప్రయోగములు.

'..కప్పురపు జోదు గంటిమి కంటిమనుచు
... పొగడె సతి చంటిమీది యొప్పులనఖంబు' (శృ. నై. ఆం. వి. గ్రం. లోని తాళపత్ర ప్రతి నెం. 29672,30 వ ఆకు, మొదటివైపు. 7, 8 పంక్తులు):
'మహితలావణ్య వాధిన్‌లో మదనుఁడెక్కు
కప్పురపు జోగు కలకంఠి కంటిమనుచు....' అని భువనగిరి వారి ముద్రిత ప్రతి. 1880, పు. 40;
నుడివడ్డ ముత్యాల జోంగువోలె' (కాశీ ఖండము, ఆం. వి. గ్రం. లోని బొబ్బిలి తాళపత్రప్రతి. 24వ. ఆకు, మొదటివైపు, 3వ. పంక్తి).

'తాయెతు' పూర్తిచరిత్రకు చూ. వికృతి వివేకకర్తృత్వము, 'భారతి' జూన్, 1959.

తాసు : చూ. త్రాసు. '...వాలుచును తాసువలెనున్న దిదే – తాలిమిధర్మాధర్మములు' (తాళ్ళపాక, అధ్యాత్మ. సంకీర్తన. 105).

తురక : చూ. తుర్కా. 'ఓపితురకల గెలిచి ప్రతాపరుద్ర – మనుజనాయకు కోట నేమరక కాచె' (శివయోగ సారము, పీఠిక).

తురికి : తుర్కీ దేశమునుండి కొని తెచ్చిన మేలిజాతి గుఱ్ఱము – 'దినమణి తేజీలకంటె నొప్పు తురికి గములుగలిగి' (భాస్కర. యుద్ధ. 2280). గుఱ్ఱపు నడకలలో నొకటి. 'తురికి నడయు' (ద్వా. 8–71). తురంగ శబ్దభవమని వైకృత దీపిక, పు. 59; పురుషోత్తమ కవీయము. పు. 66; చూ. తుర్కా.

51. తుర్కా : రూ. తురక, తులుక తుర్కీజాతీయుఁడు, తుర్కీదేశీయుఁడు: ఇస్లాముమతానుయాయి. 'కర్తారుఁడుండు 49. తుర్కాల మసీదు' (క్రీడా. 149) < మరా. తుర్కా = మ్లేచ్ఛుఁడు; తురుష్కా జాతీయుఁడు; పారసి. తుర్క్ = ఒకజాతి; 'తురుష్కా,' 'తుర్కా',కు సంస్కృతీకరణ రూపము. 'తురుక్కా' పదము క్రీ. పూ. మున్నూఱేండ్ల నాఁటి ప్రాకృత భాషాగ్రంథ

---

49. కర్తారుఁడను పదము హిందీయని కొందఱు. హిందీలో ఇది లేదు. 'కర్తృ' ప్రథమా బహువచన రూపము 'కర్తార'. సృష్టికర్త సర్వేశ్వరుఁడని అర్థము.

1. 'కర్మకర్తారుఁడని కడలేని పుణ్యముల కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా కర్మగతిఁదెచ్చి వెంకట విభుడు మా వుభయ కర్మములఁ జెరిచె నెక్కడి దైవ మితడు' (తాళ్ళపాక. అధ్యాత్మ V. 196);
2. '...సర్వతంత్రములకుం గర్తారుఁడంచున్...' వీరభద్ర విజయము, 4–102);
3. '...ముజ్జగంబులకు నెల్లన్ దాన కర్తారుఁడై...' పైది, 4–222);
4. '... అతఁడు దానైన కర్తారుఁడలమి కూర్మిఁ బ్రోవ' (యయా. 1–16);
5. 'ఏప్రొద్దుఁ గూరిమి హెచ్చఁ గర్తారునిఁ దలఁపులో నిలుపుగతాతఖను' (పైది. 1–47) ;
6. 'ప్రౌఢక'ర్తారు శబ్దంబు రూఢికెక్కె' (కువలయా. 1–40);
7. '...కర్తారుండనుచున్ దురుష్కులు మొదల్గాఁగొల్వ...' (విప్ర. 3–50);
8. 'సారెసారెకుఁ గర్తారు దూఱువారు' (కృష్ణరా. 3–46).

ములఁ గన్పట్టుటవలనను, తెలుఁగునందలి 'తుర్క'కు సమీప మాతృకము నిర్ధారించుట దుస్సాధ్యమగుటవలనను 'తురక,' 'తురికి,' 'తుర్క,' 'తుఱుక' లను వైకృతములుగా సంభావించుటయు సంగతము. 'తురక' తురుష్క-శబ్దభవమని వైకృతదీపిక, పు. 59; పురుషోత్తమకవీయము, పు. 66.

తుఱుక : చూ. తుర్క. '....తుఱుక రాజులు....' (A. R. No. 211 of 1892; క్రీ. శ. 1485; దక్షిణ హిందూదేశ శాసన సంపుటి. iv).

తేజి : చూ. తేజీ. '....క్రాలెడు తేజు లెవ్వనికి....' (కావ్యా. చూ. 5-98), 'తేజుల' (మడికి సింగన, ద్వి, భాగ., పు 83), 'హారుముంజి జలుతేజి హరులు దెచ్చె' (హర, పీఠిక, 26), 'గుఱ్ఱము లెల్లను దేజులప్పు రిన్' (విక్ర. 1-99), 'సాంబ్రాణి తేజులను' (నవనా, పు. 185), 'ఒక సారె యేడు తేజులు....' (ద్వా. 5-83), 'తేజులఁ జామరంబులను' (పైది' 8-5), 'అన్నిటఁ దేజి యాడఁగ దేవుఁడు- తిన్నఁగ వాగెలు దిప్పేవాఁడే' (తాళ్ళపాక. అధ్యాత్మ. vi, 93) 'గబ్బితనమున తేజి మొగంబు గట్టి' (జై. పీఠిక, 32), 'అర్కు తేజుల' (పి. శకుం. 1-80), 'ఎక్కెడు తేజి వ్యర్థమయ్యె' (వరాహ. 4-45), 'తేజికి' (వేం. పంచ. 4-161).

52. తేజి :- రూ. తేజి. మేలుజాతి గుఱ్ఱము. 'దినమణి తేజీలంతె నొప్పు తురికిగములు కలిగి' (భాస్కర. యుద్ధ. 2280), 'అట్లనికినిచ్చె... నమర వల్లభూహరితో నుల్ల సమాదం జాలెడు- తెల్లని యొక కత్తలాని తేజీ హయమునన్' (నైష. 6-96), 'పడివాగెతేజీలు పల్లకీజోళ్ళు' (పల్నాటి. పు. 4), 'తేజీలన్ మదేభంబులన్' (రుక్మాం. 3-81), 'తేజీలు, మదమెత్తి తిరుగు నేనుఁగులు' (నవనా. పు. 25), 'సాంబ్రాణి తేజీలు' (ద్వి. హరిశ్చ. ఉ పు. 283). పడివాగెతేజీలు (తాళ్ళపాక, x, 94), 'చెలువమున నిందు ముఖులు తేజీలనెక్కి, (జై. 5-111), 'అంచతేజీ' (వరాహ. 7-31). 'విభుఁడు తేజీనెక్కెన్' (వేం. పంచ. 2-198) <మరాఠీ. తేజీ = అరబ్బీ దేశపు గుఱ్ఱము; పారసి. తాఝీ, తేఝీ, తాజి = అరబ్బీదేశపు గుఱ్ఱము; తాజీ యాన్ = అరబ్బీ గుఱ్ఱములు.

53. త్రాసు : రూ. తాసు = తుల, తక్కెడ. 'గడసిల్లు ధరయొత్తు గెడపైన నెవ్వాఁడు త్రాసుపైఁగల్లె చందమునవంచె' (భీమ. 2-77), 'సహజ

రీతిఁ బుష్పశరుఁడు త్రాసునఁదూఁచి...' (విక్ర. 4-183). 'భాసుర రూప సంపదలఁ బ్రాఁతిగ నాతని భావసంభవుం-ద్రాసునఁ దూఁన్పవచ్చు....' (పైది. 7-147), 'తాసునంబెట్టి తూచిన' (నాసికే. 3-27), 'బహు శౌర్యముల్ త్రాసునఁ దూఁపవచ్చునన....' (జై; 5-199), 'గంధర్వ బాలికలఁ ద్రాసులం దూఁచు బంగారు ప్రతిమల విధంబుల....' (వరాహ. 12-43) 'ఇసుపత్రాసు' (వేం. పంచ. 1-767, 1-783). 'ఎలుకల్ దినెఁద్రాసని' (పైది. 1-774). శ్రీనాథునకు పూర్వులగు కవుల కృతులయందును 'త్రాసు' ఉపయుక్తమయ్యె ననుటకు క్రింది ఉదాహృతులుచాలు : 'త్రాసులంబోని చిత్తంబుల తోడుతఁ బ్రజవివాదములెడఁ బక్షముడిగి-విని ధనవాంఛమై ధనికుల దెసప్రాలి తీర్పక ధర్మంబు తెరువు దప్పకుండఁ బాడిదీర్చి....'(భారత. శాంతి. 2-374),'ధనము కలిమియు లేమియుఁ ద్రాసునందు - నిలిపి యెత్తంగములుసూపె నిర్ధనత్వ- మెక్కుడై దాని దిక్కున నెట్టులన్న-వినుము గుణదోషముల భంగి విస్తరింతు' (పైది. 4-33), అచ్చులుఁ ద్రాసులుఁ దూములుఁ — బొచ్చెంబుగఁ జేసి....' (విజ్ఞా, ప్రాయశ్చిత్త, 65). 'సత్యదినంబున సరిత్రాసుఁ బూజించి....' (పైది, వ్యవహార, 117), '... త్రాసునం దూఁచువారునుం బోలె....' (ఉ. హరి. 4-256); '...అముదోపదికి త్రాసు నాయమువలన ఇచ్చినది....' (ఈపూరి శాసనము. A- R. No- 531 of 1913, క్రీ. శ. 1278). '....ఓగిరానకూ త్రాసునాయము వల్ల....' (ఈపూరి శాసనము, A. R. No. 531 of 1913, క్రీ. శ. 1278) అని 'త్రాసు'శాసనములయందును ఉపయుక్తము (త్రాసు నాయము = తూనిక వలనవచ్చు లాభము) < మరాఠీ తరాజూ = త్రాసు ; పారసి;తరాజూ = తుల; తూఁకము;సమానత,న్యాయము.'త్రాసు'దేశ్యమని ప్రౌఢ్యము,పు.467. పదాదిరేఫ పరకసంయుక్తత ఆంధ్రభాషా వికాసమున విశిష్ట-పరిణామము. తెలుఁగునందును, మధ్యద్రావిడ భాషలగు కుఇ కువి, కొండదొర భాషలయందును దప్ప, తక్కిన ద్రావిడభాషలలో పదాదిరేఫ పరక సంయుక్తత కన్పట్టదు. తెలుఁగున తద్భవ దేశ్యముల యందును ఈ పరిణామరీతి ప్రచురము. ఉదా : క్రీడి (= అర్జునుఁడు) < ప్రాకృత. కిరీడి < సంస్కృత-కిరీటి; మ్రానుఁ = వృక్షము : తమిళము, మరం : తెలుఁగు. వ్రేలు : తమిళము, విరల్. తెలుఁగునందలి క్రాలు, క్రిందు, క్రొత్త, క్రోవి, త్రాచు, త్రిప్పు, ప్రోలు, మ్రింగు, మ్రొక్కు, వ్రాయు మొదలగు పాదాది రేఫ పరకసంయుక్త రూపములు మఱికొన్ని లక్ష్యములు. అన్యదేశమగు 'త్రాసు'ను ఏతత్పరిణామాను గుణముగ సిద్ధము.

54. దరిబేసి : ముస్లిము ఫకీరు. 'సందులఁ గుండలముల్ గుడిసందిని శివలింగమును నొసలభూతియుఁ బెంపొందఁగ నొక దరిబేసి మరుందెగడెడు నన సమయ విరోధము...' (ఛందో, 4-31).50 'భుజమునఁ గూబరంబు ధరించుకొని సోలు దరిబేసియగుచు బేతాళుఁడొకఁడు' (జై 5-196) దైన్యము గలవాఁడు. దీనుఁడు అని శ. ర; పు - 529; జైమిని భారత ప్రయోగమునకు 'పీర్ల పంజాను ధరించిన జలాలీ' అని అర్థముచెప్పుట యుక్తము < మరాఠీ. దరవేస, దరవేశీ, = దేశసంచారి యగు ముస్లిముభిక్షుకుఁడు; దిక్కులేనివాఁడు, పారసి. దర్వేష్ = దరిద్రుఁడు, నిర్ధనుఁడు; ఫకీరు; సన్యాసి; దర్వేషాన = బిచ్చము, దర్వేషీ = ధార్మిక జీవితము; దర్వేషిసుల్తాన్‌దిల్ = మొహమ్మదు పైగంబరు అన్వర్థబిరుదము.

55. దుకాణము : అంగడి. మళిగ. 'తొలకరిమించుఁ దీవగతి దోఁప దుకాణము మీఁదనున్న యయ్యలి కులవేణితోఁ దములపాకుల బేరములాడఁ బోయి....' (శ్రీనా. చాటువు). '....ఒయ్యారంబుఁ జూపన్ దుకాణముపై బొంది లిదోర్తు నిల్చె....' (శ్రీనా. చాటువు) < మరాఠీ: దుకాణ(న); పారసి, దుకాన్; దుక్కాన్: అరబ్బీ. దుక్కాన్: దుకానీ = దుకాణదారుఁడు.

56. దుహిలీ హస్తాభరణ విశేషము - 'తోరంపువజ్రాల దుహిలీలజాలు' (నవనా-పు. 46), < మరాఠీ. దుహేరా, దుహేరీ, దుహేలీ = జంట; పారసి: దువాల = తోలుపట్టీ; దువాలక్ = చిన్నపట్టీ.

57. నకీబు : చోపుదారి, ఎచ్చరిక దెలుపు వేత్రధరుఁడు; స్తోత్రపాఠకుఁడని బ్రౌణ్యము, పు. 473 'పరతత్త్వరాజు ముందటమొరయు నకీబులవిధాన మ్రోయుచు' (వరాహ. 9-112), మిన్నుముట్టిన ప్రాఁతమినుకు నకీబుల హుంకృతి' (పైది. 10-5) 'కరువలినకీబుగాగ....' (పైది. 10-29); పొదలఁదుమ్మెదనకీపులు బిట్టుమొరయ' (ద్వి. పరమ. తృతీయా. పు. 241) అని అర్వాచీన ప్రయోగము < పారసి. నకీబు = బిరుదుగద్యలు చదివి, దర్శనార్థులను ప్రభువునకు పరిచయము చేయువాఁడు.

---

50. (అమరఁగఁ బులితోలును మ ! స్తమునం బలుజడలు దాల్చి సొగతుఁడొప్పెన్ ! హిమకరశేఖరు గుడి నన ! సమయ విరుద్ధార్థమగుచుఁ జను సత్కృతులన్' !! (6-134) అని సమయ విరోధమునకు లక్ష్యముగా కావ్యాలంకార చూడామణి.

58. పంజార : 'సుమాత్రా' ద్వీపమున 'పజ్జార్' అను పేరుగలది. ఒండే, 'బోర్నియో' ద్వీపమున 'పంజార్ మాసీస్' అను పేరుగలది. ఈ రెండు దేశములు కర్పూర వృక్షములకుఁ బ్రసిద్ధములేయఁట' (వే. ప్ర. శాస్త్రిగారు, హర విలాస పీఠిక, పు. 7) 'పంజారఁ గర్పూర పాదపంబులు దెచ్చె...' (హర. పీఠిక. 26).

59. పంజు : ప్రకాశించు రత్నములు చెక్కిన. 'పంజుమంచము డిగ్గ మఁజుఘోష' (హర. 7-137) దివటీ. 'వెంటి పంజువలె' (ప్రబోధ. 4-48).[51] 'సూరెల వెలుంగు పంజుల' (వేం. పంచ. 4-345) < పారసి. పంజ్ = జ్యోతి; ప్రకాశము; పంజ = ఐదువ్రేళనుపోలిన కాగడా.

60. పండువా : పదునాలుగు పదునైదు శతాబ్దులలో పశ్చిమ బంగాళమును పాలించిన సుల్తానుల రాజధానియగు 'పాండువా' పట్టణము — నేఁటి బంగాళమున మాల్దా జిల్లాలోని ఇంగ్లీషుబజారు(< అంగ్రేజాబాద్)నకు నాలుగున్నర కోసుల దూరమున నీ పట్టణమున్నది. దీనికే ఫీరూజాబాద్ అనియు నామాంతరము. 'పండువాయను దేశము' అని సూ. ని. (చూ. సంపుటి. v. పు. 28). 'పండువా సురతాణి పావడంబిచ్చిన భద్రేభములు వీథిఁబాలెముండు' (భీమ. 1-38). పండువాసురధాని పావడంబంపిన భద్రేభములు వీటఁబాళెముండు' (కాశీ పీఠిక. 35). 'పండువా ఢిల్లి రాఢాది పట్టణముల యధిపతులు' (హర. పీఠిక. 29).

61. పరాకు : ఉపేక్ష, నిర్లక్ష్యము. 'దమయంతి ... పరాకువహించి యుండె' (నైష. 5-106) 'పరాకుసేయకు' (తాళ్ళ. అధ్యాత్మ. Vii. 61) తత్పరత. 'రాకుమారునిఁజూచు పరాకు కతన' (నైష. 6-63); ఏమఱిపాటు '..ముచ్చటల్ ద్రవ్వుచు నొక్క కోమలి పరాకున నుండఁగ...'(నైష. 6-113). '...ఇదియేమి పరాకున నున్నదానవో తొత్తుల తొత్త..' (నా. పంచ. మిత్రభే. 205). 'పరాకుగా' (వరాహ. 4-11). 'అతని పరాకుచూచి రుధిరాక్ష నిశాటుఁడు...' (జై. 6-167). 'నాకెక్కడిది పరాకు...' (వేం. పంచ. 2-91); మఱియొకట మనసు చెల్లుట. 'ఆత్మ నొక్కించుకయుఁ బరాకయ్యెనేనిఁ బ్రాణవల్లభ దన్నేమియనునో యనుచు' (నైష. 7-16). 'కొందఱు పరాకు లేకాకినులై

51. 'వెంటపంజు' అని ముద్రితపాఠము, ప్రబోధ చంద్రోదయము, చింతామణి ముద్రాక్షరశాల. చెన్నపురి, 1900; పు. 40.

మగని మొఱఁగి యెక్కడికేనియుం జనుదురు' (కాశీ. 2-79), 'ఉడుగనివంత నింతతడ వూఱటలేక పరాకువోలె' (వేం. పంచ. 2-74), అచ్చెనఁటి పరాకుఁ బోలె నటు మొగమయ్యెన్' (పైది. 2-88); ఎచ్చరిక దెలుపుమాట. 'బహు పరాకాయ' (తాళ్ళ. అధ్యాత్మ. Vi. 58). [(పార్వతీ ధవ పరమేశ భవపరాకు (పరతత్త్వరసాయనము, 1-118)] < మరాఠీ ప రా ఖ్, పరీఖ్ = శోధన; ఏకాగ్రత ; పర్యవేక్షణ. పరాఙ్ముఖ శబ్దవికృతి కావచ్చునని మా గురువర్యులు శ్రీ మధుసూదన షోడంగీగారు. పరాక్-శబ్ద భవమని వైకృతదీపిక, పు. 73; పురుషోత్తమ కవీయము, పు. 84. ఈ పక్షమున నిది వాక్-వాక్కు, వాకువలె పరాక్-పరాక్కు—పరాకు అని తత్సమముగా సాధింపనగు. పరాక్కు = ప్రతిలోమగామి. పరాఙ్ముఖము.

పవుజు : చూ. పౌజు. 'ఇరులు పవుజులు' (విక్ర. 6-63).

62 పారసి : ఇరేనియను భాషా కుటుంబమునకు చెంది, పారసీకదేశమున ప్రచుర వ్యవహారము కల ఒక భాష.'అన్నయ మంత్రి శేఖరుఁడు...పారసి భాష వ్రాసినన్...' (భీమ. 1-74) < మరాఠీ. ఫారశీ(సీ) = పారసిభాష : పారసివాఁడు (పారసీకము సంస్కృతీకరణ రూపమని మరాఠీ వ్యుత్పత్తి పదకోశము. పు. 526). అరబీలు : ఫర్స్ = పశుపాలన, పారశీక శబ్దభవమని వైకృతదీపిక, పు. 77. పారసీక శబ్దభవమని పురుషోత్తమ కవీయము, పు. 88.

63. పింగాణి : 'ఒక దినుసు తెల్లమట్టి పాత్రము' (శ. ర., 676). 'గాజు పింగాణి' (రుక్మాం. 4-35). 'గంగాళాలు పింగాండ్లు' (వరాహ. 4-112), 'పచ్చల పింగాణిఁ బన్నీరు గులికిన' (పైది. 4-156) < పారసి. పింగాన్ = పళ్ళెరము; ఫింజాన్ = చీనా మట్టిపాత్ర, ఇది మ రా ఠీ లేక క న్న డ పదమై యుండవచ్చుననియు, సీతాకోక చిలుక అని అర్థమనియు, రంగురంగుల సీతాకోక చిలుకల బొమ్మలను చిత్రింపఁబడిన పాత్రలు కావున వీనికి 'పి ం గా ణి' పాత్రలు అను పేరు సిద్ధించిన దనియు మిశ్రబ్రౌణ్యము, పు. 75.

64. పేషణి : దూత, సందేశహారి.[52] 'పేషణి హనుమంత బిరుదాంకు

---

52. 'పేషణీ యనఁగా పన్నెకల్లు—హనుమంతుఁడు పన్నెకంటిమీఁద పచ్చడి నూఱిన నెట్లు నూఱునో శత్రువులను అట్లు నూఱెడువాఁడు అని బిరుదార్థముగా నుండనొపు' (వేదమువారి సర్వంకశావ్యాఖ్య, మదరాసు, 1913 ; పు. 18.).

అగు రాచ వారికి నెయ్యంపు వరసుతుండు...మంత్రి యల్లాడరాజు...' (నైష 1-32)[53] 'పేసని హనుమంత్త బిరుద ప్రతాప వత్సవాయ అయ్యపదేవ మహా రాజులు...' (పెద్దాపురము తిరుపతి శ్రీరంగరాయ (? శృంగారరాయ) దేవాలయ ముఖ మంటప స్తంభము మీఁది శాసనము, 5, 6, 7-పంక్తులు, క్రీ. శ. 1442), 'దానప్రతిగ్రహా దీన బిరుదు మీఁడి-పేషణీ హనుమంత బిరుదనాది' అని అర్వా చీనుఁడగు కందుకూరి రుద్రకవి చాటువు (చాటు పద్య మణిమంజరి, ద్వి. భా. పు. 26) < మరాఠీ. పేషణ = నియోజించుట; పేషణీ = రాయబారి < సంస్కృత- ప్రేషణ = పంపుట; ఆదేశము ; ప్రాకృత. పేసణ = నియోజనము; అజ్ఞ, ఆదే శము-'పేసణంచ కజ్జమ్మి' అని దేశీనామమాల vi. 57.

65. ఫౌజు : రూ. పవుజు. సేన ; ప టా ల ము. 'ఫౌజుపై నడచిరి' (పల్నాటి. పు. 114), 'చిలుక గుఱ్ఱపుఁ బౌజు' (విక్ర. 8-57), 'పుట్టుగులనే పౌజుల కరికి' (తాళ్ళ. అధ్యాత్మ Vi. 25), 'వలరాచ పౌజులు' (పైది. Vii. 52), 'పార్థునిఁ బౌజులు సేయఁబంచి' (జై. 3-98), 'పౌజుల్లాయితంబు చేయు మనిన....' (వరాహ. 11-57), 'విఱిగె నీ పౌజంచు' (పైది. 11-103), 'మనపౌజుల' (ప్రబోధ. 4-60) < మరాఠీ, ఫౌజ = దండు. సేన ; పారసి. ఫౌజ్ = సేన : సర్ ఫౌజ్ = దళవాయి, సేనాపతి ; అరబ్బీ, ఫౌజ్ : తెలుఁగున 'ఫౌజు'ను సబిందుకముగా కొందఱు పఠించుటకు హేతువు, ఇది పుంజ శబ్దభవ ముగా భావింపఁబడుట. నిర్బిందుకముగా స్వీకరించుట యుక్తియుక్తము

66. బరాబరి : ప్రభుదర్శనము నిమిత్తము గుమిగూడు ప్రజలను బగ శము సేసి ఎచ్చటిక దెలుపుట. 'పటువేత్రకుల్ బరాబరి లొనరించి, (పల్నాటి. పు. 16). 'బద్దల వారంత పరుగునవచ్చి-చెలగి బ రా బ రు ల్ చేసిరి మ్రోల' (పైది. పు. 46). 'ప్రజ తండములు బరాబరిసేయ' (ద్వి. హరిశ్చ. ఉ. పు. 283) < మరాఠీ-బరోబర = సదృశము. సమానము : పారసి. బర్-అ-బర్ = సమత : సదృశము ; స్పర్థ ; బర్-ఆ-బరీ = సమత్వము, సాదృశ్యము.

---

53. '[ప్రె]షణి హనుమంత బిరుదాంకుడగు రాచవారికి...' (శృం. నై., ఆం. వి. గ్రం. లోని తాళపత్ర ప్రతి నెం, 28672, 4వ ఆకు, 2వ. పైపు. 6వ పంక్తి) ; 'పెషిణి హనుమంత్త బిరుదాంక్కుండగు రాచవారికి'. (పైది, ఆం. వి. గ్రం. లోని తాళపత్ర ప్రతి నెం. 28800. 4వ. ఆకు మొదటిపైపు, 7వ. పంక్తి).

67. బాఁకు : మొలనుదోపుకొను వంకీకత్తి. 'అలరాజు బాకున కవతార మొంది' (పల్నాటి. పు. 2). 'పరశువుల్ బల్లెముల్ బాకు కాటార్లు-శార్ఙ్గముల్ ధనువులు శరధులుదాల్చి (పైది. పు. 28). 'బాకుల రొమ్ములు పరియలుచేసి- గదలచే శిరముల గదునుగ్గొనర్చి' (పైది. పు. 111) < మరాఠీ. బాఁక, బాక = వంకర, వంపు.

68. బాజారు : విపణి వీధి యందలి జనము. పూఁజారి వారికోడలు తాజాఁఉగ బిందెజాఱి దబ్బున ఁబడియెన్. మైజారు కొంగుదడిసిన-బాజారేతిరిగి చూచి పక్కున నవ్వెన్. (శ్రీనా. చాటువు) < మరాఠీ. బాజా (ఝా)ర అంగడి వీధి; సంత; పారసి. బాజార్ సంత; సంతరోజు; బేరము; బాజారీ = బజారు నకు సంబంధించిన వర్తకుడు. "బాజాఱు" శకటరేఫ ఘటితముగా తెలుఁగు నిఘంటువులు ఉట్టంకించుట పొరపాటు, ఇది ప్రసార శబ్దభవమని వైకృతదీపిక, పు. 85, పురుషోత్తమకవీయము. పు. 99.

69. బిడారము : దండుదిగుటకనువుగా ఏర్పఱిచిన పటకుటీరాదికము... మున్నాయితఁబు సేయించిన బిడారంబుల సకలయాదవుల విడియించి...' (జై. 3-118) మరాఠీ. బిడార, బిఢార = ఇల్లు; విడిది; ఉగ్రాణము, సరకుల కొట్టు; దేశ్యమనికిట్టెల్ 1115.

70. బిబ్బి : తురుష్కులయంతఃపుర స్త్రీ, కులీన. (.... మబ్బుతురు లుబ్బు నగవులు బిబ్బీలకుఁగాక కలవె పృథివీ స్థలిపై, (శ్రీనా. చాటువు) "బిబ్బీగబ్బి మిటారులు" (రాజవా. 2-60) అని అర్వాచీన ప్రయోగము < మరాఠీ. బిబి = ముస్లిము స్త్రీ. యవనకన్య; పారసి, బీబీసత్కుల ప్రసూత యగు స్త్రీ < తుర్కీ.

71. బొందిలి; బొందిలీజాతి, బొందిలి దేశమునకు చెందిన. వన్నెలం గాగరా.... కరకంజములన్ ముసుఁగున్ బిగించి ప్రచ్ఛన్న ముఖాబ్జయైనదచె బొందిలి భామ గోమునన్ (శ్రీనా చాటువు). .... ఒయ్యారంబుఁజూపన్ దుకా ణముపై బొందిలి దోర్తునిల్పె ముఖచంద్రస్ఫూర్తి శోభిల్లగన్ (శ్రీనా.చాటువు). జీవిక నిమిత్తము బుందేల్ ఖండమునుండి పెక్కురు దక్షిణ దేశమునకు తరలి వచ్చిరని చరిత్ర. బహమనీసుల్తానుల ఫౌజులలో శస్త్ర జీవులను బొందిలీలు

అసంఖ్యాకులుండినట్లుఁ.... ఏనుగులు వేయి, బొందిలీ లెంచిచూడలక్ష. పెండారులొలక్ష లక్ష తురక లిచటిబలము....' (కృష్ణరా 3-55) అని కృష్ణరాయ విజయము. నేఁడు విశాఖ మండల పరిసరముల బొందిలీజాతి వారెక్కువగాఁగలరఁట: < మరాఠీబుందేల్ వింధ్య పర్వత పరిసరములందలి ఒక దేశము.

72. మసీదు : ముస్లిముల ప్రార్థన మందిరము. "కర్తాయఁడుండు తుర్కల మసీదు" (క్రీ. జా. 149) యయాతి చరిత్రాద్యర్వాచీన కృతులలో ఈ పదము విరివిగాఁ బ్రయుక్తము. < పారసి. మస్‌జిద్ = ప్రార్థన మందిరము; మసాజిద్ = మసీదులు ప్రణిపాతము నందలి సప్తావయవములు. చేతులు, కాళ్ళు, మోకాళ్ళు, నుదురు, సుజూద్ = శోణితలంబు నెన్నుదురు సోఁక మ్రొక్కుట; సజ్జాద్ = ఉపాసకుఁడు; సజ్జాద = పూజా సమయమున ముస్లిములు సాష్టాంగ పడుటకుపకరించు తివాసి లేక చాప; సాజిద్ = పూజ; ఉపాసన; సుజ్జద్ = భక్తులు; సిజ్‌ద = ఉపాసన; అరబ్బీ. మస్‌జిద్ = పూజా స్థలము, సుజూద్ = సర్వాంగాలింగిత నమస్కారము.

73. మాలిమి : ఓడ నడపు శాస్త్రము నెఱిఁగినవాఁడు. నావికుఁడు. "ఏలికయాత్మ బుద్ధిఁదనకించుకదోఁపని కార్యమాప్తుఁడై చాల వివేకియైన ఘను సన్నిధినూహ యొనర్పనేర్చినన్ బోలఁగ నెల్లభంగులను బొందగుచుండు విఘాత దూరతన్ మాలిమి చేతనోడ జతనంబుగఁ దీరముచేరుచందమై' (నా. పంచ. సంధివి. 61). "అలర శ్రీ వెంకటేశుఁడనియేటి మాలిమి నలుదిక్కులకు నోడనడపఁగాను ములిగెధర్మార్థకామ మోక్షధనము గడించి పలుమాఱు జీవుఁడనే మరకాఁడు" (తాళ్ళ. అధ్యాత్మ. xi, 99), "శీలంబు నడపించు మాలిమి సంచలింపని మానసంబది బరువుగాగ....మురారి చరణ రాజీపగౌరవంబను పేరోడగలిగెనేమి (వరాహ. 5-78) < మరాఠీ. మాలీమ = కర్ణధారుఁడు; నావికుఁడు; గుజరాతీ. మాలమ = కర్ణధారి; తోడి నావికుఁడు, పారసి. మల్లాహీ నావికా సంబంధి: మిలాహత్ = నౌకా యానము; ము; అల్లిమీ = బోధకుడు; కర్ణధారిత; ము, అల్లిమ్. కర్ణధారి; అరబ్బీ. ము, ఆల్లీమ్ = నావికా శాస్త్రము; మల్లాహ్ = నావికుఁడు; మల్లాహి = నౌకాయానము; తమిళము. మాలిమి, మాలుమి = కర్ణధారి: మాలుమి చాస్తిరమ్ = నావికాశాస్త్రము.

ముఖమల్లు : చూ. ముఖమాలు. 'అంతట కింకరులతివేగమునను.... ముఖమల్లు గుడ్డలు మునుకొని తెచ్చి పరచి పీఠముమీద బాగైన దిండ్లు-ఉంచిన గనుగొని....' (పల్నాటి. పు. 17).

74. ముఖమాలు : రూ. ముఖమల్లు. ఒత్తుగా మెత్తగానుండు ఒక తరహా పట్టుగుడ్డ ; దేశాంతర వస్త్ర విశేషము. వెల్వెట్. 'ముఖమాలు పట్టలు మొగములగట్టి-అందెలు పదముల నాయత్తపరచి.... సకల జాత్యశ్వాల సవరణ చేయ' (పల్నాటి. పు. 29).— కూర్చినగంతలు కుదురుగా వెన్ను-పైగప్పి ముఖమాలు పరపులువేసి....' (పైది. పు. 30)< పారసి. మఖ్‌మల్, మిఖ్ మల్ = వెల్వెట్; ముఖ్‌మల్ = బొచ్చుదుస్తులు; మఖ్‌మలీ = వెల్వెట్‌తో చేసిన; వెల్వెట్ వంటి.

75. మేకు : గూటము, చీల. '.... మేకులుగా మెఱయుచు ....' (వరాహ. 6-84)< మరాఠీ. మేఖ = గుంజ, గూటము; పారసి మేఖ్ = గూటము; మేకు, డేరాగూటము; సూది; గుల్ మేఖ్ = రోజా పూవునుబోలిన బొడిపె గలమేకు; తెలుఁగున 'ఏకై వచ్చి మేకై కూర్చున్నాడు' అనుపలుకుబడి అర్వాచీనము. దేశ్యమని బ్రౌణ్యము పు. 804 అన్యదేశ్యమని మిశ్రబ్రౌణ్యము, పు. 98.

76. మైజారు : ఆఁడుదాని కట్టుఁగొంగు, చీర మొదటికొంగు; పైఁట కొంగు అనునర్థము (సూ. ని. vi. 581) చింత్యము. 'పూజారివారి కోడలు తాజాఱఁగ బిందెజాఱి దబ్బునఁబడియెన్ మైజారుకొంగు దడిసిన బాజారే తిరిగి చూచి పక్కునసవ్వెన్ (శ్రీనా. చాటువు)< పారసి. మి' జర్ = ఇజారు; మొలకుకట్టుకొను వస్త్రము; మై (= మేను) + జాఱు = ఒడలినుండి జాఱెడు నది కాఁబోలను భ్రాంతితో మన నిఘంటుకారులు చేసినవిఱుపు, చెప్పిన అర్థము నిరాధారము. ఇట్లే పాదరక్షయను నర్థముకల పారసి 'పైజారు' పదమును పై + జాఱు అని విడదీయుటయు నిర్మూలకము పైజారు, మైజారు-లను శకటరేఫ ఘటితములుగా పఠించి, వీని ఉత్తరభాగమును 'జాఱు' అను క్రియతో ముడిపెట్టుట భ్రాంతి మూలకము.

77. మోజా : మునివైపు వంకగల మలఁకచెప్పు, ముచ్చె, 'చరణములు లేఁత చిగురు యోజాలు దొడిగి' (పి. శకుం. 3-41)< పారసి, మూజ =

పాదరక్ష; కాలి తొడుగు; మోజహ్ = ముచ్చెలు; పష్తావి (= ప్రాచీన పారసీకము). మౌచక్ = పాదరక్ష,

78. మోళము :- వెండి, బంగారము లోనగువాని పై పూఁత, మొలామ. 'జముని నాలుకతో నెకసక్కెమాడఁ దమకపడు క్రొత్తపైడి మోళముగటారి భీమనృపుఁడిచ్చె గారాపుఁబెద్ద పెండ్లి కొడుకుఁ గుఱ్ఱకు నైషధ క్షోణిపతికి' (నైష. 6–94); 54 'పసిఁడి మొల్లాము గుబ్బల కవాటములు' (ద్వి. పరమ. తృతీయా. పు. 146) 'చికిడిపైఁడి మొలామ, చిక్కటారి' (సత్యభామా సాంత్వనము ప్రథమా) అని అర్వాచీన ప్రయోగములు < మరాఠీ. ములామా = ధాతువుల పై పూఁత; ములమ్మా = పై పూఁత; పారసి. ములమ్మా = మెలామ; మల్, అమ్ = పూఁత; లమ్మా = ప్రకాశించుట; అరబ్బీ, ములమ్మ అ.

79. రమణా : బర్మాలోని ఇరావతీనదీ ముఖద్వారమునగల ప్రాంతము 'రమన్యా' యని ప్రాచీన వ్యవహారము– 'తరుణాసీరి తవాయి గోవ రమణా స్థానంబులన్....' (హర. పీఠిక. 28).

80. రావు : నాఁటి వెలమదొరల పట్టపు పేరు; పేరు చివరఁజేర్చు గౌరవ సూచక మగుపదము. నేఁడు సర్వవర్ణములవారి నామముల చివర చేర్పఁబడుచున్నది. 'రావుసింగ మహీపాలు ధీవిశాలు' (శ్రీనా. చాటువు). 'రావు సింగజనపాలునకే' (శ్రీనా. చాటువు). 'రమణమిఁంచిన మేదినీరావు బిరుద...' (శ్రీనా చాటువు). 'తక్కఁక రావు సింగ వసుధావరుఁడు...' (శ్రీనా.

---

54. 'యమేన జిహ్వా ప్రహితేవయా నిజా తమాత్మజాం యాచితుమర్థినా భృశమ్ సతాం దదేఽస్మై పరివార శోభినీం కరగ్రహార్హామపి పుత్రికా మపి' –(శ్లో. 21. షోడశస్సర్గః, నైషధ మహాకావ్యమ్, చౌఖంబాప్రతి) అని మూలము 'జముని నాలుకతో నెకసక్యమాడి దమకపడు క్రొత్త మెళము కఠారి' (శృం. నై. అం. వి. గ్రం. తాళపత్ర ప్రతి నెం. 29672. 79 వ ఆకు మొదటివైపు, మొదటి పంక్తి);
'జముని నాలికెతో నెకసక్యమాడం దమకపడు క్రొత్త పైండి మొలామ కఠారి' (పైది. ఆం. వి. గ్రం. తాళపత్ర ప్రతి నెం. 29800 95 వ ఆకు 2వ వైపు: 4 వ పంక్తి); 'పైఁడిమోళము కడారి' యని భువనగిరివారి ముద్రిత ప్రతి. 'పైఁడిమోడము కటారి' యని కొండపల్లివారి ప్రతి.

చాటువు). '....హిందూరావు సురధాణి... తిమ్మారెడ్డింగారు....' A. R. No. 469 of 1915; 3 వ పంక్తి; (క్రీ. శ. 1496) < మరాఠీ. రాఓ, రావో = ప్రభువు, రాజు; రాహుత్త శబ్ద భవముగా పేర్కొని అశ్వారోహకుఁడను వర్థమిచ్చినది. ఆంధ్ర పద పారిజాతము (చూ. పు. 686); ప్రాకృత- రాయ; సంస్కృత. రాజ-

81 రోజు : దినము. 'ఆ మాట మీదట నమ్మరోసీవు - ముట్టడివేసితి మూర్ఖతతోడ- అయిదు రోజులదాక నంతమామామ....' (పల్నాటి. పు 42); "పగటిగాసంబు దప్పక యుండ దినరోజుమాదిరి నొంటరి జోదు మూఁక' (రాజవా. 5-13). 'అగడతంబడి మునింగి దరిఁజేరి పారి రోఁజు దినరోజు రాహుత్తులును...' (పైది. 5-33)- అని. అర్వాచీన ప్రయోగములు < మరాఠీ రోజ; పారసి-రోజ్ = దినము, పగలు; సూర్యుఁడు రోజన్ = రోజులు; రోజన = ప్రతిదినము; రోజ్ రోజు = దిన దినము; ప్రాచీన పారసి. రౌచ = ఒకరోజు.

82. లాలు : ఎఱుపు. 'లాలు గంధి' (రత్నపరీక్ష. 11). 'లాలు' (పైది. 12) < మరాఠీ, లాల = ఎఱుపు; పారసి, లాల్ = ఎఱుపు; లాలీ = ఎఱ్ఱఁదనము.

83. లాహిరి : మాదక ద్రవ్య సేవనము వలనఁగలుగుమత్తు. మైకము. 'లాహిరి పట్టినభాతి మదంబెక్కినమాడ్కి' (కాశీ. 2-138) < పారసి. లహర్. లహర్ = సారాయి మొదలైన నిషావస్తువులు అమ్మెడికొట్టు; సానికొంప; లహ్ = ద్రాక్ష సారాయము.

84. లుంగ : వస్త్రభారము; బట్టల మోపు. 'జగొన్న వెలిపట్టు జన్నిదంబుల లుంగ యంటుజవాయంగ నఱుతవైచి...' (కీడా 42) < మరాఠీ. లుంగి = మొలను కట్టుకొను వస్త్రము; పారసి, లుంగ, లుంగీ = గళ్ళ గళ్ళ వస్త్రము; లుంగ్ = వస్త్రపు మడత.

85. లూటి : బాధ, ఉపద్రవము 'రమణఁగంసాది యసురులు లూటీ సేయఁగాఁగా-తమిఁగృష్ణావతార మిందరికైతివి' (తాళ్ళ. ఆధ్యాత్మ. vi 60); దోపిడి. 'మమ్ము లూటి సేయరాకు' (వరాహ. 3-92) < మరాఠీ. లూట్, లూటి = కొల్ల, దోపిడి; లుటణేఁ = కొల్లపెట్టు; దొంగిలించు.

86. వలికా : సరకుల రవాణాకు ఉపకరించెడి ఒక దినుసు విలాతి పడవ. '....కస్తూరికాద్రవ్యముల్ శరధిం గప్పలి జోగు వల్లివలికాసమ్మాన్లఁ దెప్పించుసేర్పరియై....' (హర. పీఠిక, 28).

87. వల్లి : సరకుల రవాణాకు ఉపకరించెడి ఒక దినుసు విలాతిపడవ. '....కస్తూరికా ద్రవ్యముల్ శరధింగప్పలి జోఁగువల్లివలికా సమ్మాన్లఁదెప్పించు నేర్పరియై....' (హర. పీఠిక, 28).

88. వహి : లెక్క; లెక్క వ్రాయు పుస్తకము. 'కడమజీత వహియు' (సకల నీతి సమ్మతము, 299), వహి వారణాసి యనఁగా....' (ద్వా. 11-97) 'వహి కెక్కఁదెలియు వారలు లేరా....' (తాళ్ళ. అధ్యాత్మ V, 317); 'కర ణము వహి ప్రమాణానం .జెల్లి...' (A. R. No. 792 of 1922; 7 వ పంక్తి; క్రీ. శ. 1448), 'దినవహి' యనునది 'రోజువారీ లెక్క' వ్రాయు ఉద్యోగము వలన సిద్ధించిన ఇంటి పేరు. పై లెక్క (పై + లెక్క; పై < వయి < వహి) అని జానపద వ్యవహారము < మరాఠీ. వహీ = లెక్క పుస్తకము; హిందీ. బహీ; దేశీయ ప్రాకృతమున 'వహియా' = లెక్క పుస్తకము. Account Book.

89. విలాతి : దేశము, సీమ. '... మాఱు విలాతి కేఁగుచున్....' (వే. పంచ. 1-479)[55] < మరాఠీ. విలాయత = పరదేశము; యూరపు ఖండము: పారసి. విలాయత్ = దేశము; మండలము. దేశభాగము: అరబ్బీ. విలాయత్ = సీమ; రాష్ట్రము.

90. శాలువ : ఉత్తరీయముగా కప్పుకొను సకలాతి. 'ఉదికిన శాలువ నొనర ధరించి' (నవనా. పు. 260) < మరాఠీ, శాలూ; పారసి, షాల్ = టిబెట్టుజాతి గొఱ్ఱెల ఉన్నితో తయారయిన మేలిరకము శాలువ; దర్వేషీలు కప్పుకొను ముదుక గొంగడి; తెల్లని ఉన్నితో నేసిన కంబళి.

---

55. 'పసుపున కిచ్చెనంత వృషపర్వుఁడు కొన్ని విలాతు లింతికిన్' (యయా. 4-122) ఇట సీమలని అర్థము. 'విలాతి సకలాతి హౌదాల సామజములు' (రంగా. 1-156) ఇట పరదేశమని అర్థము.

91. సంగడి : జెట్టిసాధనకు ఉపయోగపడు ఇనుపగుండు. '...సాము చేయుచు దివస్పతి కుమారుఁడు భుజార్గళినెత్తు కెంపు సంగడియనంగ' (వరాహ. 4-145)[56] <మరాఠీ, సంఘాడి.

92. సన్నాయి : నాగసరము. 'శంఖ సమూహంబు సన్నాయిజోళ్ళు' (పల్నాటి. పు. 4) <పారసి, షాహ్నాయ్ = జయకాహళ; యుద్ధకాహళ ; షాహ్నామ్ = ఒకవిధమైన వాద్యము : సంగీత సాధనము.

93. సమ్మ్రాను : చీనాదేశీయుల పద్ధతిలో నిర్మించిన ముక్కొయ్యపడవ. 'తరుణా సీరితవాయి గోవరమణాస్థానంబులన్ జందనా గరు కర్పూర హిమాంబు కుంకుమరజః కస్తూరికా ద్రవ్యముల్ శరధింగప్పలి జోఁగువల్లి వలికా సమ్మ్రాన్లఁ దెప్పించు నేర్పరియై వైశ్యకులోత్తముండవచితిప్పందల్పుడే యిమ్మహిన్, (హర. పీఠిక. 28) < మలయా. సమ్మన్ = మూఁడు పలకల పడవ : చీనీ, సంపన్ = మూఁడు పలకలతో అమర్చిన పడవ, పెద్ద ఓడను అంటి పెట్టుకొనియుండు చిన్న పడవ; సన్ = మూఁడు; పన్ = పలక; వూ-పన్ = ఐదుపలకల పడవ; వూ = ఐదు (Chinese - English Dictionary, Harward University Press, Massachusetts, 1956); 'సంపన్' అనునది సమీకరణమునంది 'సమ్మన్' అయి 'సమ్మ్రాను'గా పరిణమించినది. తమిళమున 'చిన్నపడవ' యను నర్థముగల 'చంపాన్' పదము చీనీ భాషనుండి ఎరువు తెచ్చినదని ఉల్లేఖ్యము (తమిళ లెక్సికన్. పు. 1285). సింటో, బార్బోజా. వర్తెమా మొదలగు విదేశ పర్యటకుల కథనముల 'చయాంపన'ను రూపము సంగ్రథితము. (See : Hobson Jobson, p. 789). '...సమ్మ్రాన్లఁ దెప్పించు....' అను వేటూరివారి పాఠమునకు సుప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లివారి ఆమోద ముద్రకలదు (History of the Reddi Kingdoms,P. 406) '....శరధిం గప్పలి జోఁగులన్ విరివిగా సామాన్లఁ దెప్పించు నేర్పరియై....' అను పాఠము కవ్యభిప్రేతముగాఁ దోఁపదు. '....చందనాగరు కర్పూరహిమాంబు కుంకుమరజః కస్తూరికా ద్రవ్యముల్ శరధిం గప్పలి జోఁగు వల్లివలికా సమ్మ్రాన్లఁ దెప్పించు....' ట యుక్తము. '....విరివిగా సామాన్లు...' అనుట పునరుక్తి. ఒకవేళ '...విరివిగా స్రామాన్లు దెప్పించు...' పాఠమే కావలె

56. 'సంగడము' అని మనుచరిత్ర (3-59) ప్రయోగము.

నని పట్టుబట్టినచోఁ సామానుఁ కూడ అన్యదేశ్యము. మరాఠీ. సామాన = పరికరములు, పనిముట్లు < పారసి. సామాన్ = వస్తువు ; సాధనము.

94. సరిహద్దు ; పరిమితి. మేర: పొలిమేర, సీమ. 'చక్కగా మిరియాల సరిహద్దు దాటి – ప్రజల మేలిమి చింతపల్లెయుదాటి' (పల్నాటి. పు. 33) <మరాఠీ, సర్‌హద్ద = మేర: పొలిమేర; పాసిర. సర్‌హద్ = అవధి. మేర; సీమ.

95. సవా : ఒకటింబావు. 'సవాలక్ష' (= లక్షపాతికవేలు, అపరిమితము) (ద్వి. హరిశ్చ. పూ. పు. 66) <మరాఠీ. సవా, సవ్వా = ఒకటింబావు: ప్రాకృత. సవాయ; సంస్కృత. సపాద.

96. సహా : చక్రవర్తి, సార్వభౌముఁడు 'హరహరరాయ ఫేరోజసహా సురధాణ గజాధిపాది భూవరులు....' (హర. పీఠిక, 24) <మరాఠీ, శహా = రాజు, సుల్తాను; పారసి, షహ్, షాహ్ = అధిపతి, ప్రభువు; షాహీ = రాజసంబంధి; రాజ్యము; రాచ ఠీవి.

సాంబ్రాణి : చూ. సాౖమాణి. 'సాంబ్రాణి తేజీలు' (ద్వి. హరిశ్చ. ఉ. పు. 283); 'పసిఁడిపక్కెర తేజి సాంబ్రాణి నెక్కి' అని రామాభ్యుదయ ప్రయోగము.

97. సాౖమాణి : రూ. సాంబ్రాణి. ఉత్తమాశ్వము. సాౖమాణిదేశపు గుఱ్ఱము. 'సాౖమాణి తేజులును' (నవనా. పు. 185), 'మదవారణముల సాౖమాణి తేజులను' (పైది. పు. 256), '....తంత్రాధిపు నీ సాౖమాణి యెవరిదనవిని నమ్రుఁడగుచు లీలఁగదలి నకులభూవుఁజూడున్' (జై. 7-146) < మరాఠీ, సమరాణ. తుర్కిస్తాన్‌లోని ఒక నగరము. సమర్‌కండినగరము నేటి ఉజ్‌బెక్‌స్తాన్‌లోనిది; గుఱ్ఱములకు ప్రసిద్ధి.

98. సుపాణి : రూ. సుప్పాణి. శుభ్రమయిన నీరు గల ముత్యము. 'సుపాణి ముత్యములు' (నవనా. పు. 56), 'తళుకు సుపాణి ముత్యాల మేల్కట్లు' (పైది. పు. 259), 'అట్టి ముక్తాఫలంబులకు నాణియు' సుతారంబును' సుపాణియు నను గుణంబులు మూఁడు....' (రత్నపరీక్ష, 49), 'తళుకు సుపాణిముత్యాల మించుల....' (శ్రీరంగ మహత్త్వము, 2-46) < మరాఠీ

సుపాణీ = తేజస్వి; వైకృతమని శ. ర; కాని, వైకృతదీపికలో ఈ పదమే లేదు. సుపానీయ శబ్దభవమని పురుషోత్తమ కవీయము, పు. 135.

సుప్పాణి : చూ. సుపాణి 'నెఱయును సుప్పాణి యెప్డుడు నిర్మలకాంతిన్' (రత్న పరీక్ష, 50).

సురతాణ : చూ. సురతాను. 'ధారా సురతాణదర్ప ధరణీధ్రసవీ' (కాశీ, 6-309).

సురతాణి : చూ. సురతాను. వై. వి. ఇంద్రుఁడు ; ఇంద్రాణి అని శ.ర. (చూ. పు. 1095). 'పండువా సురతాణి పావడంబిచ్చిన భద్రేభములు వీథిఁబాఱె ముందు' (భీమ. 1-38), 'నీకుఁగల ప్రసిద్ధి ఢిల్లి సురతాణికిని లేదు' (క్రీడా. 185), 'దండిబిరుదుల సురతాణి గుండెదిగులు' (శ్రీనా. చాటువు), 'సురతాణి ముద్రబోలెను' (సకలనీతి సమ్మతము, 19) '....అలావదీను సురతాణి చేతను ఎఱకేశ్వరదేవర ఉపహతి అయితేని....' (7, 8 పంక్తులు, పిల్లలమఱ్ఱి శాసనము; క్రీ. శ. 1357).

99. సురతాను : రూ. సురతాణ, సురతాణి, సురత్రాణ సురథాణి, సురథాణు, సురదాణి, సురధాణ, సురధాణి, సురధాని. ఈ రూపాంతరములన్నియు వాస్తవముగా నాఁటి వ్యవహారానుగుణములో లేక, లేఖక ముద్రాపక కల్పితములో నిర్ధారించుట దుస్సాధము. పాలకుఁడు, ఏలిక. 'దురములో దక్షిణ సురతాను నెదిరించి' (జై. పీఠిక, 32) < పారసి. సుల్తాన్ = సార్వభౌముఁడు, చక్రవర్తి ; సర్వాధికారి ; సుల్తాన = చక్రవర్తిని, రాణి; సుల్తానీ = సామ్రాజ్యము; చక్రవర్తికి సంబంధించిన < అరబ్బీ, సుల్‌తాన్; తెలుగునందలి 'సులతాని' సురత్రాణ శబ్దభవముగా కవిసంశయ విచ్ఛేదము (చూ. పు. 65) నిరూపించుట ప్రతిలోమ పద్ధతి.

సురత్రాణ ; చూ, సురతాను, 'ధారాసురత్రాణ ధాటీ సమారంభ గర్వాపాధోరాశి కలశజులకు' (భీమ. 1-29), 'దాని చన్నుదోయి ధారాసురత్రాణ కటకకుంభి కుంభకలహకారి' (క్రీడా. 243), 'ప్రబలధారా సురత్రాణ భద్రజాతి కరిఘటా సైన్య....' (కాశీ. పీఠిక, 58), 'ధారాసురత్రాణుఁ బోర నిర్జితుఁజేసి' (కొమ్మనశివలీలావిలాసపీఠిక), 'మధురా సురత్రాణు మడియించి పరపక్షి

సాళువబిరుదంబు జగతినెరపె' (జై. పీఠిక, 32), ధారానగరము రాజధానిగా మాల్వాను పాలించిన హూషంగ్ సుల్తాన్ (క్రీ శ 1405_1435) ఇందలి ధారాసురత్రాణుఁడు. చిత్రభారత కృతికర్తయగు చరికొండ ధర్మన్న శతఘంట సురత్రాణ బిరుద విభ్రాజితుఁడు.

సురథాణి : చూ. సురతాను. '....హిందూరావు సురధాణి........తిమ్మారెడ్డింగారు........' A. R. No. 469 of 1915; 3 వ పంక్తి క్రీ. శ. 1496).

సురథాణు : చూ. సురతాను. 'ప్రయాగ ఉపాధ్యాయుల కొడుకు కళింగవ్యాపారి లడ్డె సురథాణు తమ్మఁడు' (శ్రీకూర్మశాసనము, A. R. No. 299 of 1896; 4. 5 పంక్తులు; క్రీ. శ. 1402).

సురదాణి : చూ. సురతాను. 'భావజ సురదాణి' (నవనా. పు. 10).

సురధాణ : చూ. సురతాను, 'హరిహర రాయ ఫేరోజసహా సురధాణ గజాధిపాది భూవరులు...' (హర. పీఠిక, 24)-ఇందలి హరిహరరాయలు విజయ నగర చక్రవర్తియగు రెండవ హరిహరరాయలు (క్రీ. శ. 1377_1404), ఫేరోజసహా – బహమనీ సుల్తానులలో అతి ప్రసిద్ధుఁడును, బహుభాషా వేత్తయును, కావ్యగీతి ప్రియుఁడును అగు సుల్తాన్. తాజ్_ఉద్_దీన్ ఫీరూజ్‌షా (క్రీ. శ. 1397_1422); 'ధారాపట్టణ సార్వభౌమ సురధాణదర్పాపహార క్రియా ధౌరంధర్య....' (కాశీ. 5_337).

సురధాణి : చూ. సురతాను. 'ఖసిమీఖన్ 57 సురధాణి నిండుకొలువై కూర్చున్నచో....' (హర. పీఠిక, 22) 'గజపతి సురధాణి గడిదుర్గములకెల్ల నేరాజు వజ్రంపు బోరుతల్పు' (ప్రబోధ 1_96)

సురధాని : చూ. సురతాను. 'పందువా సురధాని 58 పాపదంబంపిన భద్రేభములు వీటఁ బ్రాకెనుండు' (కాశీ 1_45).

---

57. 'ఖుసిమీఁదన్...' అని వేటూరివారి పాఠము.

58. 'పందువాసురతాని' అని ఆం. వి. బొబ్బిలి తాళపత్రప్రతి, 7వ ఆకు 2వ వైపు 4 వ పంక్తి.

100. సేబాసు : మెచ్చికోలును తెలుపు మాట '....సంగ్రామాంచల మునసిడె నను మెచ్చించెదవేనపుడు నిన్ను సేబాసందున్' (హర. 7-64).[59] (విక్ర. 8-66). > మరాఠీ. శాబాస = ప్రశంసార్థకపదము; పారసీ. షహ్-బాష్ = స్తుతి; మేలుమేలని ఎలుగెత్తికొనియాడుట.

సొక్కటాలు : చూ. సొగటాలు, నిన్న నాడిసోలి సత్యభామకు మ్రొక్కితివి నేఁడు నాకు మ్రొక్కవలెఁగా (తాళ్ళ. శృంగార సంకీర్తనలు. iv, 163).

101. సొగటాలు : రూ. సొక్కటాలు పగడసాలాట. 'సరిలేనియంజీ సొగటాలరు దగుజూదంబు....' (భోజరా. 5-76) 'తిగుటన్ సొగటాల నేనతి ప్రౌఢుండన్' (ద్వా. 10-91); జూదమాడెడు సారెలు, 'గచ్చకాయలు కొన్నికలిగినయట్టి. తిత్తులు చిరుతలు తీరైనగౌడెలు- జూద మాడుట కయి సొగటాలుకొన్ని... ఆటలసాధానాలవి వెంటరాగ' (పల్నాటి. పు. 45)< మరాఠీ సాగడీ. సాగడా = శకట సంబంధమయిన.

102. సోశాదొప్పి : ద్యూత్యవిశేషము. 'సోశాదొప్పియు నెత్తమున్ మొదలుగా జూదంబునీవాడు నావేళంగాదని బాంధవుల్ శకుని దుర్వృత్తం బెఱింగింపరే'' (జై. ?-42) దీనికి ''సోషాదొప్పి'' యను రూపాంతరము న్నట్లు బాచేపల్లివారి శబ్దార్థదీపిక (చూ. పు. 1390) ఏ మండలమునందైన వ్యవహారము కలదేమో ? < ? మరాఠీ. సోశా = పదునాఱు; పదునాఱవ; థోపా = దెబ్బ: కత్తి; హిం. సోలహ్. సోరహ్.

103. హజారము; ఆస్థానము; మొగసాల. ''...వొడుపుఁగొండపయిన్ రవియొప్పెఁజూడగా సుమధికలీలనింద్రుని హజారపు మేడకు ఁబైఁడికుండయోఁ (కాశీ 1-125). తనరు ముంగిళుల దరి హజారముల'' (ద్వి. హరిశ్చ. ఉ. పు. 320), ''నిరాఘాటమగు హజారంబుకడకు'' (వరాహ. 2-4). 'ఈ రీతి వెడలి వజ్రహజారంబుననిలచి (పైది. 3-39) ''హజారంబు దాయంబోయి'' (పైది. 6-90). ''వాఁడును హజారఁబు వాకిటనిలిచి'' (పైది. 11-57)<

---

59. మెచ్చించెదయేనమ్మ గోలసేవిన పిదపన్? అని వేటూరివారు పరిష్కరించిన ప్రతి యందలి అధోజ్ఞాపికలోని పాఠాంతరము.

పారసి. హాజిరాన్ = సభాస్తారులు; హాజిర్ = సన్నిధినుండు; సేవకు సిద్ధముగానుండు; హాజిరీ = సభ్యులు; ఓలగమువారు: హుజ్రా = కొలువుకూటము, సభాస్థానము; హాజారము, ఆజారము అని తెలుఁగున అర్వాచీన ప్రయోగములు. శకట రేఫ ఘటితముగా కొందఱు దీనిని పఠించుట ప్రమాదము. సామజాగారము (= ఏనుగులసాల) సజ్జాగారము. హజ్జారము. హజారము అను నిట్టి క్రమ పరిణామములను పొంది హజారముగా రూపొందినదని కొందఱు వ్రాయుట అశాస్త్రీయము.

104. హద్దు: అవధి. మేర. చక్కఁగా మిరియాల సరిహద్దుదాటి' (పల్నాటి పు. 33); 'తూరుపుదిక్కుకు తుది మేరసుమ్మ దక్షిణ దిశహద్దు తగ వివరింతు' (పైది. పు. 87,) 'పడమటికిని హద్దుబాలచంద్రుండ కొదమగుండ్లయనెడి గురి గ్రామమొకటి' (పైది. పు. 87), ఉభయపక్షంబుల ఉపైనన బలము నివసించియున్నది. నిశ్చల మతిని హద్దులు చెప్పెదనవి చిత్తగింపు, (పైది. పు. 87)<మరాఠీ, హద్ద = అవధి, మేర; పారసి. హద్ = మేర, పొలిమేర; అవధి: అంచు; వేర్పాటు; అరబ్బీ హద్ = మితిమేర.

105. హుమాయి : వాహనము. 'కాయ జాదాతిగిబ్బ హుమాయినెక్కి' (పరతత్త్వ రసాయనము.1-111)< మరాఠీ హుమా = గరుడపక్షి; పారసి. హుమా = గరుడపక్షి; స్వర్గలోకపు పక్షి; ఇది యెవని తలమీఁద నెగురునో వాఁడు చక్రవర్తి యగునని ఇరానీల నమ్మకము. దేశ్యముల తుది దీర్ఘమునకు హ్రస్వము లేదనుటకు కవిజనాంజన కర్తపాదశా, నవలా, హుమా-లను ఉదాహరించినాడు (చూ. విశాఖపట్టణము, పరవస్తువారి గ్రంథాలయమునందలి కవిజనాంజన తాళపత్ర ప్రతి, 80వ ఆకు. రెండవపైపు)

106. హురుముంజి : పారసీక జలసంధి చేరువ తీరమునఁగల పెద్ద రేవు పట్టణము. క్రీస్తుపూర్వము నాలుగవ శతాబ్ది నుండియు ముత్యముల, గుఱ్ఱముల ఎగుమతికి ప్రసిద్ధి. క్రిందటిదినములలోపల వాణిజ్య విషయముగా ప్రాచ్య పాశ్చాత్య ప్రపంచములకుకూడలి. 'చీని సింహళ తవాయి హురుముంజి చోణంగి ప్రభృతి నానాద్వీపనగరాకరంబులగు ధన కనక వస్తువాహన మాణిక్య గాణిక్యంబులు తెప్పించియు...' (హర. పీఠిక, 7), సింహళంబున గంధ

సింధురంబులుదెచ్చె హొరుముంజి బలుతేజి హరులుదెచ్చె' (పైది. పీఠిక, 26)' 'ముత్యాన హొరిముంజి ముత్యాలముంగర' (శ్రీనా. చాటువు), 'గురుతైన హొరుముంజి గొప్పముత్తెపు నత్తు మోవిపై నొకవింతముద్దు గుల్కి'' (శ్రీనా. చాటువు) <పారసి. హొర్ముజ్ = ఒక రేవు పట్టణము. 'అహూర్ + మజ్‌తా' అని జెండ్ అవెస్తా భాష; ఉర్మజ్ = ప్రతిపద్దివసాధిష్ఠాన దేవత; బృహస్పతి గ్రహము.

—o—

తెలుగులో బుడతకీచు పదములు

ప్రవేశిక

తెలుఁగుపై స్వీయప్రభావమును కొంతలో కొంత ప్రసరింపఁజేసిన ఆధునికములగు యూరపియను భాషలలో 'బుడతకీచు'[1] మొదటిది. ప్రాక్ప్రతీచీసీమలకు క్రీ. పూ. పదియవ శతాబ్దము నాఁటికే సంబంధబాంధవము లుండినవని చరిత్రకారుల యూహము. కాని క్రీ. పూ. నాలుగవ శతాబ్దాంతమున జరిగిన రక్షానర (అలెగ్జాండరు) దండయాత్రలు ఈ సీమలకు సమీప సంబంధములను సమకూర్చినవి. ఆనాఁటి యీ సంబంధములును ఆర్యభాషావ్యవహార మండలమగు ఉత్తర భారతమునకే పరిమితము. రోమకాది మధ్యధరా తీర మండలములతో దక్షిణ భారతమున కుండిన ప్రాచీన వాణిజ్యవ్యవహారము అరబ్బుల ముఖమున నిర్వాహమగుటచే ఆ సంబంధమును పరోక్షమేకాని ప్రత్యక్షము కాదని అనుమేయము. ఆ పిమ్మట రమారమి పదునెనిమిది శతాబ్దుల తరువాతనే ఫరంగుల-యూరపియనుల-తో ప్రత్యక్ష సంబంధములు ఏర్పడినవి.

క్రీ. శ. 1498 లో బుడతకీచులు భారతదేశపు పశ్చిమతీరమున అడుగిడుట ఈ సన్నిహిత సంబంధములకు నాంది యయినది. వీరు క్రమక్రమముగా ప్రబలులై, దేశీయ ప్రభువుల ఆస్థానముల పెక్కింట ప్రవేశము సంపాదించి, దయ్యూ, దామన్, సాల్సెట్టి, బొంబాయి, గోవా, మంగళూరు, కోజికోడు, కన్ననూరు, బత్కల్లు, ఓనావరు, కొచ్చి, తూత్తుకుడి, నాగపట్టణము, శాంతోము,

---

1. ఈవ్యాసమున 'పోర్చుగీసు' అను మాటకు పర్యాయార్థమున 'బుడతకీచు' ఉపయుక్తము. మూలపదము 'పొర్తగీజ్', 'పొ' లోని 'ఒ' సంవృతోచ్చారముగలది. 'పోర్చుగీసు' అని నేఁటి పలుకుబడి; ఇది ఆంగ్లోచ్చారణకు దగ్గర. పురతకీలు, పురతకేలు, బుడతకీసు అని సాహిత్య ప్రయోగములు; 'బుడతకీచు' వీని వికృతి. ఇందలి 'డ' శిథిలోచ్చార్యము; ఒరియా-ఒడియా, కుర్తా-కుత్తా, ఖిడ్కీ-ఖిర్కీ, పర్దా-పద్దా-లలోవలె ర, డ-లు పరస్పర వినిమయ వర్ణములు.

హాంగ్లీ మొదలగుచోట్ల గిడ్డంగులను, క్రయ విక్రయ శాలలను నెలకొల్పిరి. విజయనగర చక్రవర్తులతోడను, వారి సామంతులతోడను దాదాఁపు రెండు శతాబ్దములపాటు బుడతకీచులకు వాణిజ్య రాజకీయ సంబంధము లుండినవి. బుడతకీచు పాదిరీలు రాయబారులుగను, మతబోధకులుగను సలిపిన కృషియును అల్పముగాదు. చారిత్రక విషయ పర్యాలోకన సందర్భమున ఈ యీ యంశములు సోపపత్తికముగా నిరూపితములు. సమీప వర్తిత్వము ననుసరించియు, పాలక పాలిత సంబంధములను బట్టియు, మత వాణిజ్యాది సాహచర్యముల ననువర్తించియు రెండు భాషలకు సంసర్గ మేర్పడినప్పుడు పరస్పరము భాషా విషయకములయిన ఆదాన ప్రదానములు సంభవించుటయు, సంసర్గ ప్రభావమున కనుగుణములగు నుడులే వినిమయము లగుటయు సర్వ సామాన్యము. తెలుఁగు బుడతకీచు వ్యవహర్తల ప్రత్యక్ష పరోక్ష సంసర్గము కారణముగా తెలుఁగున ప్రవేశించిన బుడతకీచు నుడుల సమాలోకన ఫలమే ఈ వ్యాసము. యథాస్థితములగు భాషా విషయముల సత్య స్వరూప నిరూపణమే ఈ పరామర్శలోని పరమార్థము. ఈ నుడులలో చాలపాలు మూర్తపదార్థ బోధకములు; అమూర్త పదార్థ బోధకములు మిక్కిలి అరుదు. అనఁగా భావప్రధానములకంటె వస్తుప్రధానములకు ప్రాచుర్యమధికమని తాత్పర్యము. భాషల సంసర్గమునందలి ప్రాథమిక దశలో ఇట్టి లక్షణము సార్వత్రికము. సమాజ వ్యవస్థలో ఆయా వస్తువుల ఆవశ్యకతను బట్టియు, ఆయా భావముల ప్రాబల్యమును బట్టియు తత్తద్బోధకములగు పదముల వ్యవహార యోగ్యత ఆధారపడి యుండును: వీని ప్రాధాన్యము క్షీణించినను, ఏతద్బోధకములుగా శక్తిమత్తరములగు పదములు మఱొక బాసనుండి సంక్రమించినను పూర్వ వ్యవహారమున నుండినవి వ్యవహార విదూరము లగుట చారిత్రక సత్యము. దేశ్యములు, అన్యదేశ్యములు అను విచక్షణతో నిమిత్తములేక, వ్యవహార వశమునఁ గల పదసామస్త్యమునకంతకు ఈ పరిణామము సర్వవ్యాపకసూత్రము. భారతదేశములో బుడతకీచుల రాచఱికము వలని బాగోగులను గూర్చి వితర్కించుట ఇట అప్రస్తావికము.

పోర్తుగాలు చరిత్ర

ప్రధాన విచారణీయాంశమును గూర్చి వివేచించుటకు పూర్వము బుడతకీచుల ఆట్టుపుట్టానవాళ్లు నెఱుఁగుట అత్యంతావశ్యకము. యూరపు ఖండము

నైరృతిదిశను ఐబీరియా ద్వీపకల్పము పశ్చిమ భాగమున అట్లాంటిక్ మహాసముద్రమున కభిముఖముగా ముప్పదియైదువేల చదరపు మైళ్ల వైశాల్యముతో[2] ఐదు వందల మైళ్ల సముద్రతీరముతో విస్తరించిన దేశము పోర్తుగాలు[3]. ఎనిమిది శతాబ్దములకు మునుపు పోర్తుగాలు అను దేశము కాని, బుడతకీచు అను జాతి కాని రూపొంది యుండలేదు. నేటి పోర్తుగాలు ప్రాంతము కాస్తీలియను రాజ్యములో పశ్చిమరాష్ట్రముగా నుండినది. ఐబీరియా ద్వీపకల్పములోని ఈ పశ్చిమ ప్రాంతమునకు ఐతిహాసికయుగమున 'లూసితేనియా' యని వాడుక. ఐతిహాసిక దృష్టిలోతప్ప సామాన్యవ్యవహారమున నేఁడీ వాడుక అంతరించినది. ప్రాచీన యుగమున 'లూసితేనియా' 'కెల్టు-బాస్కు' భాషీయులగు ఆదిమ వాసుల వాసస్థానము.

క్రీస్తునకు చాలా పూర్వమే 'లూసితేనియా'కు ఫోనిషియను వర్తకులయు, గ్రీకు యాత్రికులయు రాకపోక లుండినను వీరి భాషాదిక ప్రభావము అనాగరులగు ఆదిమ వాసులపై అంతగా ముద్రితము కాలేదు. ఆ పిమ్మట జరిగిన కార్థిజియను దండయాత్రలు 'లూసితేనియా' దక్షిణ భాగములలో కార్థిజియను పరిపాలనను నెలకొను జేసినవి. క్రీ. పూ. మూఁడవు శతాబ్దాంతము (218-202)న నడచిన రోమకసూయాణముల మూలమున కార్థిజియను పాలన అంతమొఁది, 'లూసితేనియా'తో పాటు మొత్తము ఐబీరియా సీమ లన్నియు రోమనుల-లాటిన్ భాషీయుల-హస్తంగతము లైనవి. రోమనులనేకులు తండములు తండములుగా వలస వచ్చి 'లూసితేనియా'లో స్థిరపడిరి. రోమక పరిపాలన రీతులు, రోమక సాహితీ సంస్కృతులు 'లూసితేనియా' సర్వవ్యవస్థలలోను సంపూర్ణ పరిణామములను కొని వచ్చినవి. రోమనుల క్రైస్తవమత గ్రహణముతో 'లూసితేనియా' యును రాజానుమతముగా బాప్తిస్మమును స్వీకరించినది.

---

2. అనఁగా ఆంధ్రప్రదేశ వైశాల్యము-110 వేల చదరపు మైళ్లు-లో రమారమి మూడవవంతు.

3. ఐదంయుగీనాంధ్రవ్యవహారములో 'పోర్చుగల్'; ఇది ఆంగ్లోచ్చారమునకు సమీపము. పోర్తుగా లనుట బుడతకీచు బాసకు సదృశోచ్చారము, స్వరభక్తి సూత్రానుగుణముగా 'పోర్తుగాల'ను రూపము 'పోరతగాలు' గా పరిణతము; అదే 'పురతకాలు', పురతకాలు, బురతకాశి, బురతకాలు అనునవి ఆంధ్రసాహిత్య ప్రయుక్త రూపములు.

క్రీ.శ. 410 తరువాత రోమక సామ్రాజ్యమునకు క్షీణదశ పట్టినది. ఆ వెనుక 'లూసితేనియా'లో గోథికు జైత్రయాత్రలు ప్రవర్తిల్లి గోథికు పాలన ప్రారంభ మయినది. ఇస్లాముమత విజృంభణముతో క్రీ శ ఎనిమిదవు శతాబ్దిని సాఁగిన అరబ్బుల దాడుల వలన గోథికు పాలన అంతర్ధాన మయినది. మధ్య ప్రాచ్యము నుండియు, ఆఫ్రికా ఉత్తర పార్శ్వములనుండియు ఇస్లాము మతానుయాయులగు అరబ్బులు గుంపులు గుంపులుగా వచ్చి 'లూసితేనియా'లోని అరబ్బుల పెత్తనమునకు అండగా నిలిచిరి. దాదాఁపు నాలుగు శతాబ్దులపాటు అవిచ్ఛిన్నముగా చెల్లిన అరబ్బుల అధికారము—అరబ్బు పాలకులకును స్వాతంత్ర్యాభిలాషులగు ఐబీరియను స్థానిక ప్రభువులకును జరిగిన పెక్కు పోరాటముల వలన—పండ్రెండవు శతాబ్దము ప్రథమపాదమున కడముట్టినది. బొర్గోనా (బర్గండి) మండలేశ్వరుని సోదరుఁడగు హెన్రీ (1087-1112) ఈ తిరుగుబాటు పోరాటములలో ఐబీరియనుల పక్షము వహించి ఎస్పఁనోలా—స్పెయిను—పరిపాలకుని మెప్పునకు పాత్రుఁడయి అతని తనయయగు 'తెరెసా' ను పెండ్లాడి, 'పొర్తుకాలెన్సు' మండలేశ్వరుఁడు (Count of portocalensis) గా కుదురు కొనినాఁడు. పోర్తుగాలు వాయవ్యమున 'దోరు' (Douro) నదము ఉభయకూలముల వ్యాపించిన సీమకు అనాఁడు 'తెర్రా పొర్తుకాలెన్సు' అని వ్యవహారము. 'దోరు' నదము ముఖద్వారము నందలి రేవుపట్టణము 'ఓ పోర్తు' ఈ వ్యవహారమునకు ప్రాతిపదికగా సంభావ్యము. బుడతకీచు బాసలో 'కల్లి' యనగా మార్గము. 'పొర్తుకల్లి' యనగా 'బుడతకీచుల రేవు' అని యర్థము. 'ఓ పోర్తు' నగరము ప్రవేశ మార్గముగా ప్రపంచితమయిన ప్రాంతము గావున, దోరు నదము ప్రవాహమండలమునకు 'పోర్తుకాలెన్సు' అను వాడుక సిద్ధించినదని ఒక సిద్ధాంతము. 'లూసితేనియా'లో ఏకదేశమగు ఈ ప్రాంతమునకు ఆ నాఁడు ఉద్దిష్టమయిన వ్యవహారనామము కాలక్రమమున 'పోర్తుకాలెన్సు' సీమావిస్తరణముతో 'లూసితేనియా' సమస్తమునకును సంక్రమించినదని ఈ సిద్ధాంత ప్రవచనము. 'పోర్తుకాలెన్సు' అను పదబంధము వలననే 'లూసితేనియాకు' పోర్తుగాలు' అనియు, తద్వాస్తవ్యులకును వారి వాగ్వ్యవహారమునుకును 'పోర్తుగీజు' అనియు వాడుక. తొలినాళ్లలో ఈ 'తెర్రాపోర్తుకాలెన్సు' మండలేశ్వరుఁడయిన హెన్రీ అరబ్బులను పూర్తిగా ఓడించి దేశమును పరదాస్యమునుండి తప్పించినాడు. 'తెరెసా' వలన ఇతనికి కలిగిన కుమారుడు 'అఫొన్సు హెన్రిక్సు'(1109-1185) 1128 లో మండలేశ్వరుఁడుగా

అధికారము చేపట్టి, అంచె లంచెలుగా రాజ్యమును విస్తరింపజేసి క్రీ శ. 1143 లో 'పోర్చుగాలు' ను స్వతంత్ర రాజ్యముగా ప్రకటించినాడు. స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రత్యేక దేశముగా క్రైస్తవ జగద్గురువగు పోపు అంగీకారమును, ఆశీర్వాదమును క్రీ.శ. 1179 లో 'పోర్చుగాలు' కు లభించినవి. నాటి నుండి బర్గండి వంశీయులు (1143_1385)ను, అవిజ్ వంశీయులు (1385_1580) ను స్పెయిను చక్రవర్తులు (1580-1640) ను బ్రిగాంజా వంశీయులు (1640_1910) ను 'పోర్చుగాలును'ను పాలించినారు. క్రీ. శ. 1910 లో రాచరికము సమసించి అధ్యక్షపాలన ఆరంభమయినది. 1925 నాటి ఎన్నికలనుండి అంతోని దీ ఓలివైరా సాలాజార్ నియంతృత్వము చెల్లుచున్నది. ఇదీ బుడతకీచు పురాణము.

వాస్తవముగా స్పెయిను-పోర్చుగాలు దేశములకు భౌగోళికమయిన సరిహద్దు లేవియు పరిగణింపదగినవి లేవు. బుడతకీచుల అల్ప ప్రకృతియును, సంకుచిత ప్రవృత్తియును, తదనురూపముగా రేఖాంచితమయిన వారి పురాచరిత్రమును పోర్చుగాలు అవతరణమున పురాణించిన మూలకారణములని చరిత్రకారుల నిర్ధారణము. అరబ్బుల మంకుపట్టును, గోథికు విజేతల కొల్లలపెట్టు బుద్ధియును, బాస్కు జాతీయుల ఒంటెత్తు తనమును, రోమను భాషీయుల బడాయికోరు తనమును బుడతకీచు జాతికి పురుడుపోసిన పైతృకలక్షణములు. ఎట్టి అవరోధములు తటస్థపడినను స్వీయ విశిష్టతను స్థాపించి, స్థిరపరచుకొన నుద్యోగించు తీవ్ర స్వభావము బుడతకీచులది. పరంపరీణమగు వీరి ఈ నిసర్గ లక్షణమే పోర్చుగాలు ఉనికికి, మనుగడకు జీవగఱ్ఱ.

బుడతకీచు భాషాచరిత్ర

బుడతకీచు భాష స్పానిషు భాషకు చాల దగ్గఱది. ద్రావిడ భాషలగు తమిళ, మళయాళముల కెట్టి సమీప సాజాత్య సంబంధము కలదో, స్పానిషు బుడతకీచు భాషలకును అట్టి సామీప్య సాజాత్య సంబంధమే కలదు. కర్ణాటాంధ్ర భాషలు తమిళమళయాళములకు వలె, ఫ్రెంచి, ఇటాలియను భాషలు స్పానిషు బుడతకీచులకు సద్దెతోఁబుట్టువులు. ఇటాలియను, ఫ్రెంచి, బుడతకీచు, స్పానిషు భాషలు ఇండో_యూరపియను భాషా కుటుంబగతమగు లాటిన్‌భాషా శాఖా జన్యములు. వీనికి 'ఇటాలిక్' లేక 'రొమాన్సు భాషలు' అనీ, 'లాటిన్ మాండ

లికములు' అని సమాహార వ్యవహారము. ప్రాక్తన యుగముల రోమక సామ్రాజ్య సీమలలో వ్యవహారమున నుండిన లాటిన్ భాషకు 'రొమాన్సు' భాష అని పేరు. లాటిన్ భాషా పుత్రికలగు స్పానిషు బుడతకీచు భాషలకు దక్షిణ అమెరికాలోని సమస్త రాజ్యములలోఁగల ప్రచుర వ్యవహారము హేతువుగా ఆ ఖండమునకు 'లాటిన్ అమెరికా' అను అన్వర్థనామము రూఢము. ఇంగ్లీషు, డచ్చి, జర్మను స్కాండినేవియను భాషలకు సమీప మాతృకయగు జర్మానిక్ (ట్యూటానిక్) భాషా శాఖ లాటిన్ శాఖకు సగోత్రకము. రోమక యుగము (క్రీ. పూ. 218 క్రీ. శ. 410) న 'లూసితేనియా' భూభాగమున వ్యవహృతమయిన లాటిన్ భాషా మాండలిక రూపము మాతృకగా, కెల్టు బాస్కు భాషావశేషముల సమ్మిశ్రమముతో క్రమవికాసము నంది, పదమూఁడవ శతాబ్దము నాఁటికి బుడతకీచు పృథగ్భాషగా రూపొంది పెంపొందినది. రోమక యుగానంతరము (క్రీ. శ. 710_1200) బలీయమయిన అరబ్బీభాషా సంసర్గమును, మధ్యయుగములనాఁటి ఫ్రెంచి భాషా సాహితీ సాహచర్యమును బుడతకీచు భాషను ఇతోధిక పరిపుష్టముగా, స్పానిషు భాషా విశిష్టముగా వికసింపఁజేసినవి. ఫొనీషియను, కార్థేజియను, గోథికు వాసనలును బుడతకీచు భాషావతారమున ఒకపాటి నేపథ్యమును నిర్వహింపకపోలేదు. పోర్చుగాలు, స్వతంత్ర దేశమయినను పదమూఁడవు శతాబ్దము దాఁక లాటిన్ భాషయే రాజకీయ భాషగా నుండినది. కాని, బుడతకీచు చక్రవర్తులలో అయిదవు వాఁడయిన మూఁడవు అఫొన్సుకాలము (1248_1279) న లోకయాత్రా నిర్వాహ మాత్రముగా నుండిన బుడతకీచును రాజభాషగా రూపొందింపవలెనను ఉద్దేశ మంకురించినది. ఆఱవు వాఁడగు దినీజ్ చక్రవర్తి (1279_1325) పాలన కాలమున బుడతకీచు రాజభాషయయి, తన్మూలమున కవిపండిత పరిషదవలంబనమునందె. సాహిత్య స్థాయిని సంపాదించి సర్వతోముఖముగా వర్ధిల్లినది. కాని, తాత్త్విక చింతనములలోను, తార్కిక విచారములలోను లాటిన్‌భాష తన అధికారమును యథాపూర్వముగా నెఱపుచునే యుండినది. బుడతకీచునకు లాటిన్ కేవలము మాతృకయే కాదు, బుడతకీచు మూలశాఖనుండి పార్థక్యము నెంది ప్రవృద్ధమగు చుండిన నాఁడు కూడ మతధర్మ వాహకముగా, ప్రాచీన సంస్కృతి దర్శకముగా లాటిన్, బుడతకీచుపై తన ప్రభావమును ప్రసరింపఁజేసినది. వైదిక మతధర్మ ప్రబోధమునను ఆర్ష విజ్ఞాన ప్రకాశమునను గీర్వాణవాణివోలె, క్రైస్తవ

మతధర్మస్థాపనమునను ప్రతీచీ విజ్ఞాన వ్యాపనమునను లాటిన్ వాణి ప్రముఖ భూమికను నిర్వహించినది. లాటిన్ భాషా పుత్రికయగు బుడతకీచును మొదట అట్టి వ్యాపారమునే కొనసాగించినది. బుడతకీచుల ప్రాచీన సాహితీ వ్యవసాయము లోకగాథపారమ్యము; శృంగారరసప్రచురము; ఆఖ్యానరూపము. మధ్యయుగము నాఁటి సాహితీ సమారాధనము, దేశభక్తి ప్రబోధ సాధనము; వీరరస పరిప్లావితము; వర్ణన ప్రధానము. ఆధునిక యుగము అంగ్ల ఫరాసు సాహితీ వైభవప్రభావితము. వివిధ సాహితీ ప్రయోగ విభూషితము; అక్షర రమ్యతా పరాయణము. వష్కోఁడ గామా ప్రాచ్యసీమా యాత్రా చరిత్రమును బుడతకీచుల మహేతిహాసము (Dusiads) గా రూపొందించిన బుడతకీచుల జాతీయకవి కామోన్సు (1524–1580), రొమాంటిక్ యుగ ప్రవర్తకుఁడు బర్బోజా బొకాజి (1765–1805). బుడతకీచు నాటక పితామహుండు జోజీ అల్మీదా గారీ (1799–1854), నవయుగ వైతాళికుడు జువోన్ దీద్యూన్ (1830–1896) బుడతకీచు సాహితీ చరిత్రలో యుగపురుషులు; అంగ్లమువలె బుడతకీచును ప్రపంచ వ్యాప్తమయిన భాష. ఒక్కఁ ఆస్ట్రేలియా ఖండములో తప్ప తక్కిన ప్రపంచము నాలుగంచులను చెదరు చెదరుగా నిది మాతృభాషగనో, రాజభాషగనో వ్యవహృతము. ఇట్టి బుడతకీచు భాషా వ్యవహర్తల సంఖ్య ఇంచుమించుగా ఏడు కోట్లు: నేఁటి పోర్చుగాలు జనసంఖ్య కోటికి లోపలిమాట; మిగిలిన యారుకోట్ల పైచిలుకు అంగోలా, గినియా, గోవా, బ్రెజిలు, మకావో, మొజాంబిక్ మొదలగు బుడతకీచు వలసరాజ్యములలోనివారు. వక్ష్యమాణ విషయ పురస్కారమున కిది పూర్వరంగము.

పదునైదవు శతాబ్దమునాఁటికి పట్టుమని పదిలక్షల జనసంఖ్యలేని బుడతకీచు జాతి నూతన సీమాన్వేషణలో ప్రదర్శించిన సాహసము ఆశ్చర్యకరము. భౌగోళికముగా పోర్చుగాలు వ్యాపించిన భాగము మిగుల ప్రాముఖ్యము కలది. బాల్టిక్, మధ్యధరాసాగర తీరదేశముల తోడి పోర్చుగాలు వర్తకము చాలపాలు సముద్రము ద్వారముననే సాఁగుచుండినది. ప్రాగిస్లామిక యుగము నుండియు ప్రాక్ప్రతీచీ ఖండముల వాణిజ్యము అరబ్బుల చేతులలో నుండినది. అరబ్బు వర్తకులు గడించిన ధనరాసులు, ప్రాచ్యసీమల ఐశ్వర్యమును గూర్చి అరబ్బుల వలన వినిన గాథలు బుడతకీచులను ప్రలోభపఱచినవి. మఱియొక విశేషము, అన్వేషిత సీమలలో కాతలిక్ క్రైస్తవమును వ్యాప్తిపఱచు నిబంధన మీఁద

నూతన సీమల సార్వభౌమాధికారము ఆ సీమలను మొదట కనుగొనిన రాజ్యములవారికి సర్వస్వత్వములతో సంక్రమించునని పోపు శాసనము. బుడత కీచులు రోమనుకాతలిక్కులు; అనఁగా మత పరముగా పోపు అనుయాయులు. ప్రభువు పవిత్ర వాక్యమును ప్రాచ్యభూములలో ప్రచార మొనర్పవలెనను ప్రబల వాంఛ యొకటితోడయినది. తీరప్రాంతమును, విశాలసాగర తీరములలో సబురులు సేయు తమ వాణిజ్యనావలను సముద్రపు దొంగల బారినుండి రక్షించు నిమిత్తము పోర్తుగాలుకు శక్తిమంతమయిన నావికాదళ నిర్మాణ నిర్వహణము అత్యంతావశ్యకము లయినవి. 1453 లో కాంస్టాంటినోపులు తురుష్కుల వశ మగుటచే మధ్యధరాజలముల ద్వారమున సాఁగుచుండిన ప్రాచ్యసీమలతోడి వాణిజ్యమున కాటంకము కలిగినది. వేరుదారులు వెదకుట కిది మొదలు. ఈ వెదకుటలో స్పెయిను చక్రవర్తుల ప్రోత్సాహముతో కొలంబను పోయి పోయి అమెరికాను కనుఁగొనుట యాదృచ్ఛికము. సాహసులును, ఉత్సాహపరులును నగు దేశీయులకు అన్వేషితసీమల పాలనాధికారములు వాగ్దత్త మొనర్చియు, ఆర్థికసాహాయ్యము సేసియు, ఉత్తమ బిరుదములు ప్రసాదించియు, ఎగుమతి దిగుమతి సుంకములను పరిహరించియు, ఓడల నిర్మాణమున కావశ్యకమగు కలపను ప్రభుత్వపు టడవులనుండి ధర్మార్థముగా నొసంగియు బుడతకీచు చక్రవర్తులు నూతన దేశాన్వేషణమును మిక్కిలిగా ప్రోత్సహించిరి. ఈ ప్రయత్నములు పారము ముట్టి, గుడ్‌హోప్ అగ్రము (Cobo de Buena Esperanza) ను చుట్టి బుడతకీచులు వష్కోడ గామా నాయకత్వమున క్రీ. శ. 1498 లో భారతదేశము పశ్చిమ తీరము నందలి కోజికోడులో అడుగిడిరి. "కోవిల్యామ్' అను మఱియొక బుడతకీచు వాఁడు భూమార్గమున పయనించి 1487లో లోనే కోజికోడును చేరియుండె నట! తుళువ నరసరాయలు సంరక్షకుఁడుగా సాళువ నరసింగరాయల తనయులు (1493_1503) విజయనగర సామ్రాజ్యమును, వీర రుద్రగజపతి సాగరాంధ్రముతోపాటు కళింగసీమను, కోజికోడు రాజధానిగా 84 వ జామొరిన్ మలబారు తీరమును, యూసఫ్ అదిల్‌షా బీజాపురమును, ఉమ్మత్తూరు రాజధానిగా చన్న నంజరాజు మైసూరు దక్షిణ ప్రాంతమును, భూతల శ్రీవీర ఉదయమార్తాండవర్మ (1494_1535) తిరువాడి (తిరువాన్కూరు) సీమను, జటిలవర్మకులశేఖర పాండ్యుఁడు తిరునల్వేలి ప్రాంతమును, ఉన్నిగోదవర్మ కొచ్చి ప్రాంతమును, లోడీ వంశీయులు

(1470–1516) ఢిల్లీని పాలించుచుండిన కాలమది; విజయనగర సామంతులగు తిమ్మోజా ప్రభృతులు పశ్చిమ తీరము నందలి ఓనావరు, బంకాపురము, బత్కల్లు మొదలగు నాడులకు మండలేశ్వరులుగా నుండిన సమయమది.

ఇఁక బుడతకీచులతో తెలుఁగు నాడునకును, తెలుగువారికిని ఉండిన ప్రత్యక్ష పరోక్ష సంబంధములను వ్యక్తీకరించు కొన్ని చారిత్రక సన్నివేశములను గుఱించి ప్రస్తావించుట అప్రస్తుతము కాదు. బర్బోజా (1500–1517), పేయిజ్ (1520–1522), న్యూనీజ్ (1537), సౌజా (1674–1675) మొదలగు బుడతకీచ చరిత్రకారులును, బుడతకీచుల జాతీయకవి కామొన్సు (1553–1570) ను, కోతిన్యో (1598–1611), సీమోను (1600–1611) మొదలగు బుడతకీచ పాదిరీలును విజయనగర సామ్రాజ్యమున పర్యటించి వ్రాసిన వ్రాఁతలు ప్రత్యక్ష కథనములు. బుడతకీచుల వ్రాఁత లన్నింటను విజయనగర సామ్రాజ్య ప్రశస్తి పలుతావుల ప్రస్తావితము. విజయనగర సామ్రాజ్యము 'నర్సింగ' రాజ్యమనియు, రాజధానియైన విజయనగరము 'బిస్నగ' అనియు ఈ లేఖనముల వ్యవహృతము. బుడతకీచుల రాకకు పూర్వము సాళువ నరసింగరాయలు (1487–1493) విజయనగర చక్రవర్తి. అల్ప వయస్కులగు నీతని తనయులు తుళువ నరస రాయల సంరక్షణలో పదేండ్లపాటు నామమాత్రపు పాలకులు. (1493–1503); 1505 దాఁక నరసరాయల పాలన. నరసరాయల పిమ్మట అతని కుమారుఁడును, కృష్ణదేవరాయల సవతి సోదరుఁడును అగు వీర నరసింహరాయలు (1505–1509) పాలకుఁడు. బుడతకీచులు కొజికోడులో దిగినది 1498లో. అనఁగా వీరి రాక కటునిటు పది పదేండ్లుగా విజయనగర సామ్రాజ్యమును పాలించిన వారు నరస, నరసింగ, నరసింహ నామధేయులు. ఇందుచేత విజయనగర సామ్రాజ్యమును 'నర్సింగ' రాజ్యమను వాడుక బుడతకీచుల వ్యవహారములో స్థిరపడినది. విజయనగర చక్రవర్తులు హిందూధర్మ రక్షణ దీక్షా కంకణ బద్ధులు; ఉత్తరమునుండి వచ్చు ముస్లిము దాడులను అరికట్టుటలో వీరు ప్రధాన పాత్రను నిర్వహించిరి. బుడతకీచులకును, ఇస్లాము మతానుయాయులు అందును అరబ్బులు ప్రబల విరోధులు. బుడతకీచులు కోజికోడులో అడుగిడుసరికి ఆగర్భ శత్రువులయిన అరబ్బులు ప్రత్యక్షమయిరి. జామొరిన్ నెచ్చెలులగు ఈ అరబ్బులు బుడతకీచులపై స్పర్ధవహించి జామొరిన్‌కును, బుడతకీచులకును మైత్రి పొసగకుండ చేసిరి. ప్రతీకార వాంఛాపూరితులయిన బుడతకీచ పాలకులు

వషోకా ద గామా, కేబ్రల్ (1500_1505), అల్మీదా (1505_1509), అల్బూ కర్కు (1509_1515) మొదలగువారు అరబ్బులపై ఎదురుదెబ్బ తీసిరి. ఇస్లాము మతానుయాయుల ఉద్ధతి నణచుటలో సమశీలవ్రతయుతులగు విజయనగర చక్రవర్తుల తోడి సఖ్యము బుడతకీచులకు ఉభయతారకముగా తోచినది. 1500_1650 ల మధ్య బుడతకీచులకును, విజయనగర చక్రవర్తులకును పలువారములు రాయబారములు నడచినవి. మొదటి బుడతకీచు గవర్నరగు అల్మీదా 1506 లో పశ్చిమ తీరమునందుగల బత్కలులో ఒక గిడ్డంగిని నిర్మించుకొనుటకు అనుమతిని కోరుచు విజయనగరముతో నెరపిన రాయబారములు ఫలింపలేదు 4. 1510 జనవరిలో అల్బూ కర్కు, లూయిజ్ అను బుడతకీచు పాదిరీని రాయబారిగా కృష్ణదేవరాయల (1509_1530) కొలువునకు పంపెను. ఉభయ పక్షములకును సాధారణ విరోధులయిన మూడు (తురక) రాజులను అణచుట ద్రొక్కుటలో పరస్పర సాహాయ్యమావశ్యకమనియు, బిజాపురము సులతానగు ఆదిల్‌షా యాధీనమున నున్న గోవాను తిరిగి జయించి స్వాధీనపఱుచుకొనుటలోను, వలయునంత అశ్వబలమును సమకూర్చుకొనుటలోను తాము విజయనగరమునకు తోడ్పడగలమనియు, మంగళూరు బత్కల్లుల నడుమ గిడ్డంగిని స్థాపించుటకు అనువగు తావును తమకిప్పించవలెననియు ఈ రాయబారము 5. ఈ ప్రతిపాదనలయెడ తాను ఔత్సుక్యము నగపఱిచినట్లు బుడతకీచు లెఱింగినచో వారికి పట్ట పగ్గము లుండవని దూరదర్శియగు రాయలు వేచి చూచు నీతిని అవలంబించినాఁడు. పది మాటలకొక మాటగా రాయల రాయబారములు సాగినవి 6. రాయలు పట్టాభిషేకము (1509 నవంబరు) జరిగి నాఁటికి రెండేరెండు నెలలు గడచియుండినవి. అన్ని దిక్కుల శత్రువులు; అంతః కలహములు. అందువలన రాయలు స్పష్టమగు సమాధానమీక బుడతకీచు రాయబారిని తన కొలువున చాలాకాలము నిలిపి

---

1. Robert Sewell, Forgotten Empire. p. 117
5. Commentaries of Afonso Dalboquerque Vol. II, pp. 74 . 77.
6. Fr. Heras, Early Relations Between Vijayanagara and the Portuguese, Quarterly Journal of the Mythic Society Vol. XVI, p. 65.

యుంచెనని కొందఱి వ్యాఖ్యానము 7. ఈలోగా అల్బూకర్కు విజయనగర సామంతుడును, అపర చాళుక్యుఁడును నగు తిమ్మోజు అండదండలతో గోవాను జయించి స్వాధీనపఱుచుకొనినాఁడు. అయేటఁ ఒకటి రెండు మాఱులు చేతులు మాఱినను నాఁటి నుండియు నేటిదాఁక గోవా బుడతకీచుల ప్రధానకేంద్రము 8. ఇమ్మడి హరిహరరాయల కాలము (1375–1404) నుండియు గోవా విజయ నగర చక్రవర్తుల యేలుబడిలో నుండినది. అంతకుపూర్వ మది బహమనీ సామ్రాజ్యములోని బిజాపురము భాగమునందలిది. ఇమ్మడి హరిహరరాయల మహోత్యుఁడగు మాధవమంత్రి గోవాను బహమనీ సులతానులనుండి జయించి యుండెను. అసమర్థుఁడగు విరూపాక్షరాయల పాలనకాలము (1466–1485)న 1468 లో గోవా మరల బహమనీ అధికారము క్రిందికిపోయినది. పశ్చిమ సముద్రతీరమునందలి సహజ నౌకాశ్రయమగుట చేత పాశ్చాత్య సీమలతోడి భారతీయ వ్యాపారము అధిక భాగము ఈ రేవు ద్వారమున జరుగు చుండెడిది. బాహ్లీక పారసీక శకధారా రట్ట ఘోట్టాణములయిన మేలిదినుసు గుఱ్ఱము లన్నియును గోవా రేవునకు వచ్చుచుండెడివి. నాఁటి యుద్ధ పద్ధతులలో అశ్వ దళమునకు అత్యంత ప్రాధాన్య ముండెడిది. అప్పటికి అరేబియా సముద్ర తీరము నంటియున్న కీలక స్థానములగు రేవు పట్టణము లన్నియును బుడత కీచులకు వశీకారము లయి యుండినవి. ఇందుమూలమున గోవాకును, తద్విజేతలగు బుడతకీచులకును భారతరాజకీయములలో ప్రాముఖ్యము హెచ్చినది. గిడ్డంగులు స్థాపించిన తావులం దెల్లను అల్బూకర్కు బలిష్ఠమైన దుర్గములను నిర్మించి సాయుధులును సుశిక్షితులును నగు సైనికులను కాఁపుగా నుంచెను. దేశీయ పాలకులను పోర్చుగాలు చక్రవర్తికి అరిగాపులనుగాఁ జేసి తన్మూలమున ప్రాచ్యసీమలలో బుడతకీచు సామ్రాజ్యమును స్థాపింపవలెనను తీవ్రకాంక్ష

---

7. Prof. G. Venkata Rao, Krishnadevaraya and the Portuguese, Journal of the Andhra Historical Research Society, Vol. X pp. 74–85, 1937.

8. ఈ వ్యాసరచన నాఁటికి గోవాపై మన బావుటా ఎగురలేదు.

9. Commentaries, Vol. IV, pp. 74, 75 అల్బూకర్కు వ్యాఖ్యానములలో ఈ పట్టున నుట్టంకితమయిన పాదిరీ లూయీజ్ లేఖాభాగమును చదువుటలో డా. ఓరుగంటి రామచంద్రయ్యగారి వివరణము మిగులు నుపకరించినది.

అల్బూకర్కు కుండినది. 1510 నవంబరులో బత్కల్లులో గిడ్డంగిని నిర్మించు కొన ననుమతించుచు కృష్ణదేవరాయలు పంపిన విజయనగరము రాయబారి పాదిరీలూయిజ్ వ్రాసియిచ్చిన పరిచయ లేఖతో గోవా వెడలినట్లాధారములు కలవు 9. రహస్య భంగము సేయుట కారణముగా పాదిరీ లూయిజ్‌ను 1511 లో రాయలు హత్య సేయించెనట 10; "మంత్రవేత్తకు నాజ్ఞ మఱచియుంట.... వలదు పతికి" అను రాజనీతి కిది 11 లక్ష్యము కాఁబోలు! ఈ హత్యాదోషము బిజాపురము సులతానుల కారోపిత మగుట రాయల రాజనీతి చతురత; 1512 లో విజయనగరము నుండి మఱియొక రాయబారి గోవా వెడలినట్లును, రాయల ప్రతిపాదనల నంగీకరించుచు అల్బూకర్కు పంపిన బుడతకీచు రాయబారి విజయనగరము వచ్చినట్లును తెలియుచున్నది 12. 1513 లో అల్బూకర్కు నిర్వ హించిన ఏడెన్ దండయాత్రలో పదునేడు వందల బుడతకీచు సైనికులతోపాటు ఎనిమిదివందల మంది దేశీయులగు సిపాయిలును పాల్గొనినట్లు అల్బూకర్కు వ్యాఖ్యానములు 13. 1514 నవంబరులో గోవాకు వెడలిన విజయనగర రాయబారి (Retelim Chetim) కి ఉచిత రీతిని సత్కారములు జరిగినట్లును, ఈ సుహృద్భావమును దృఢపఱుచు నిమిత్తము అదే యేఁడు అంతోనీ డీ సౌజా అను బుడతకీచు రాయబారి గోవానుండి విజయనగరము వచ్చినట్లును పూర్వోక్త వ్యాఖ్యానములలో ప్రస్తావితము 14.

"సింధుర మహాశ్వ ముఖ్యముల్ చేర్చు దౌల
దీవి వణిజుల కూళ్ల సద్గృహములు పురిఁ
గొలువుఁ దేజంబు వెలమేలు గలుగఁ బ్రాత
వారిగాఁ జేయు మరినవి చేరకుండ" 15 ఇది రాయల రాజనీతి!

(9 వ ఫుట్‌నోట్ 224 వ పేజీలో)

10. Dr. O. Ramchandrayya, Studies on Krishnadevaraya, A. U. Publication.
11. ఆముక్తమాల్యద, 4—252
12. Fr. H. Heras, Aravidu dynasty pp. 58, 59
13. Commentaries, Vol. IV, p. 1..
14. Commentaries. Vol. V. pp. 121. 124.
15. ఆముక్తమాల్యద, 4—258.

ఇందలి దొలదీని వణిజులు ముఖ్యముగా బుడతకీచులనుటలో విప్రతిపత్తిలేదు. రాయలీ నీతిని ప్రత్యక్షరమును పాటించిన వ్యవహార దర్శి యనుటకు ప్రమాణములు కోకొల్లలు [16]. Christovam de Figueiredo అను నొక బుడతకీచు వాఁడు 1515 లో రాచోలును వశపఱుచుకొనుటలో కొన్ని బుడతకీచు పటాలములతో రాయలకు తోడ్పడినట్లు తెలియవచ్చుచున్నది [17]. బుడతకీచుల తోడ్పాటునకు సంతసించి కృష్ణదేవరాయలు తాని జైత్రయాత్రలో సాధించిన రాచోలు ప్రాంతమును ఆ మఱునటియేఁడు బుడతకీచు వైస్రాయికి బహుమతిగా నొసంగెనఁట [18]. Christavao be Figueiredo అను నొక బుడతకీచు ప్రముఖునకును అతని పరివారమునకును కృష్ణరాయల పేరోలగమున ఘనమయిన సన్మానము జరిగినట్లు ఆ పరివారములో నుండిన బుడతకీచు చరిత్రకారుఁడగు పేయీజ్ వ్రాతలు [19]. అన్యభూప్రజల రాజాయాయి జాత్యోచితిన్ బ్రోవంగాదగు... [20] ననికదా రాయల రాజనీతి. 1520 లో జరిగిన రాయల రాయచూరు దండయాత్రలలో విజయనగరములో విడిసియుండిన Christopher de Figueiredo అను నొక బుడతకీచు అశ్వవర్తకుడు రాయలకు సాయపడెనఁట [21]. పూర్వోక్తములయిన మూఁడు సంఘటనలలోని పేర్లు మూఁడును ఏక వ్యక్త్యుద్దిష్టములో భిన్న వ్యక్త్యుద్దిష్టములో నిర్ణయించుట చారిత్రకుల పని. 1520 లో విజయనగరములోని ఒక తటాక నిర్మాణము సందర్భమున కృష్ణదేవరాయల కోరిక మేరకు గోవాలోని బుడతకీచు గవర్నరు పంపిన జువోన్ దెలా పొంతి (Joan della

16. 'గడినృపుల రాయబారుల మెడఁ గొలువున సరస సల్లాపములు రాజు సలుపవలయు' అముక్తమాల్యద, 4_259.

17. F- C. Danvers, Portuguese in India. Vol. I. P. 347; also Fr. Heras Aravidu dynasty, p. 59.

18. 'Rachol lies to the east of province of Salsette...Wrested from the king of Bijapur in 1520 (?) by Krishna Rao of Vijayanagar, it was shortly ceded by the latter to the Portuguese' (History of Goa.)

19. Sewell, Forgotten Empire, pp, 251,252.

20. అముక్తమాల్యద, 4_245.

21. Sewell, Historical Inscriptions of Southern India, p. 242.

ponte) అను బుడతకీచు ఇంజినీయరొకండు విజయనగరమువచ్చి తోడ్పడినట్లు తెలియుచున్నది[22]. సదాశివరాయల కాలమున 1543 లో విజయనగర సామ్రాజ్యములోని తిరుమల తిరుపతి దేవస్థానమును దోఁచుకొనవలెనని చోళమండల తీరమున బుడతకీచు సేనాని యగు మర్టిన్ అఫొన్సు దీ సౌజా తలపెట్టిన ఉద్యమము విజయనగర చక్రవర్తుల ప్రతిఘటన సన్నాహముల వినికితో విరమింపఁబడినట్లు తిరుపతి చరిత్రలో ప్రసక్తము[23]. జువాన్ దీ కస్త్రో (Joao de Castro; 1545_1548) గోవాలో బుడతకీచు వైస్రాయిగా నుండి అళియ రామరాయలతో సఖ్యము వహించి తూర్పుతీరమున వర్తకమును వృద్ధి పఱచినాఁడు. 1546_1549 ల మధ్య సుహృద్భావ సూచకముగా నాలుగైదు పర్యాయములు గోవా విజయనగరముల రాయబారములు ప్రవర్తిల్లినవి. శత్రువులతోడి యుద్ధములలో పరస్పర సాహాయ్య మొనర్చుకొనుటకును, శాంతియుతమైన సహజీవన విధానము ననుసరించుటకును, గోవా రేవులో దిగుమతి యయిన అరబ్బీ, పారసి గుఱ్ఱముల నన్నిటినీ విజయనగరమునకే విక్రయించుటకును, విజయనగర సామ్రాజ్య సీమలోని కోస్తా వర్తకు లందరును ఓనావరు, బార్సెలూరు మొదలగు రేవులకు తమ సరుకులను విధిగా పంపుటకును, విజయనగర సామ్రాజ్యములో తయారగు బట్టలు, పెట్లుప్పు, ఇనుము మొదలగు వానిని బుడతకీచు వర్తకులకు మాత్రమే అమ్ముటకును, బుడతకీచు వర్తకులు వీనిని సకాలములో సలీసు వెలలకు కొనుటకును పైన పేర్కొనిన రాయబారములు ఒప్పందములను కుదిర్చినవి[24] అళియరామరాయలు విదేశీయుల పట్ల విశేషౌదార్యమును ప్రదర్శించెడివాఁడనియు, శాంతోములో గిడ్డంగిని నిర్మించుకొని వర్తకము చేసికొనుటకు బుడతకీచుల ననుమతించుచు ఆయన బంగారు తగడుల మీద వ్రాయించి ప్రసాదించిన దానశాసనము బుడతకీచులయొద్ద నుండినట్లు ప్రత్యక్షముగా

22. Prof. G. V. Rao, op. Cit.

23. Dr. S.K. Aiyangar, History of Tirupati, Vol. II, pp. 294-298; also Fr. H. Heras, Aravidu dynasty pp. 60. 61, 'శత్రు సంహార వేంకటాచల విహార' యను మకుటము గల శతకములోని 'సాముడిగ్గియ నీటిచల్లు లాటలు గావు, పాశ్చాత్య భటుల తుపాకి గుండ్లు' అనుట ఈ సంఘటనకు సంబంధించినది కాదేమో?

24. Fr. H. Heras, Aravidu dynasty, pp. 61-64.

చూచిన వెనీషియను వర్తకుఁడగు నికొలావ్ మనూచి(1653_1708) వ్రాఁతలు[25]. శాంతోములో నూటికిపైగా బుడతకీచు కుటుంబము లుండినట్లు 1545 లో ఈ ప్రాంతమును దర్శించిన సెయింట్ ఫ్రాన్సిస్ గ్జేవియరు లేఖల వలన స్పష్టము[26]. సెయింట్ తామస్ సమాధి యున్న తావును 1517 లోనే గుర్తించితిమని బుడతకీచులు ప్రకటించుచుండిరట[27]. ఇచట 1547 లో బుడతకీచు లొకగిడ్డంగిని నిర్మించి తామస్ స్మృతి చిహ్నముగా ఆ తావును 'శాంతోము' అని వ్యవహరించిరి[28]. పదునెనిమిదవ శతాబ్దము దాఁక తూర్పు కోస్తాలో బుడతకీచులకిది ముఖ్య స్థావరముగా నుండినది. కాని, నేఁడు దాని గుఱుతులును కన్పట్టవు. మైలాపురములోని బుడతకీచు పాదిరీలు దుండగములు సేయుచున్నారని ప్రజలు మొఱలిడగా 1558లో అళియరామరాయలు స్వయముగా గొప్ప సేనతో మైలాపురము విచ్చేసినట్టు సూయెల్ వ్రాఁతలు[29]. తల్లికోట యుద్ధము వరకు గోవా విజయనగరముల మధ్య భారీ ఎత్తున వ్యాపారము జరగుచుండినది. గోవా విజయనగరముల రహదారులు వర్తకుల బిడారులతో తీర్థప్రజగా కిటకిట లాడెడివట। శాంతోము నుండి గోవాకు గల 150 లీగుల (ఇంచుమించు ఐదువందల మైళ్లు) భూమార్గ మంతయు విజయనగర సామ్రాజ్యాంతర్గతము విజయనగర చక్రవర్తులకును, గోవాలోని బుడతకీచు పాలకులకును గల సఖ్యభావము కారణముగా గోవా శాంతోముల మధ్య రాకపోకలు నిరాటంకముగా, నిర్భయముగా సాగుచుండెడివి[30]. 1532లో బుడతకీచు పాదిరీలు తిరునల్వేలి కోస్తా ప్రాంతములోని ఇరువదివేల మంది జాలరులను క్రైస్తవ మతములో చేర్పించిరి. 1532_1542 పరిసరముల తూర్పు తీరములోని 'తూత్తుకుడి' బుడతకీచులకు ప్రముఖ స్థావరమయినది. ఆనాఁటికి విజయనగర సార్వభౌమాధికారము దూర దాక్షిణాత్య సీమల యందును నిరాఘాటముగా చెల్లుచుండినది. చోళమండలము

---

25. Niccolao Manucci, Storia Do Mogor, Vol. III p. 97
26. Heras, op cit. p. 67.
27. Ibid, p. 64. fn.
28. Manual of Administration of the Madras Presidency (MAMP) Vol. III, f 447.
29. Sewell, Forgotten Empire, p. 193: also Heras, pp. 67-69.
30. Heras, op. cit. pp. 71, 72.

విజయనగర సామ్రాజ్యములోని భాగమని బుడతకీచులే వ్రాసిరి. మధుర, తంజాపుర పాలకులు ఆంధ్రవచోనాధులు; తిరుచ్చిరాపల్లి, తిరునల్వేలి మండలములోని పాళియగాండ్రందఱును తెలుఁగువారు. వీరి ప్రతినిధులును, స్థానాపతులును సామ్రాజ్య కేంద్రమగు విజయనగరములో నుండెడివారు. బుడతకీచు పాదిరీ యగు సెయింట్ గ్జేవియరు లేఖలలోను ఇతర లేఖ్యములలోను పలుతడవలు 'బడగె, వడగ' యని పేర్కొనఁబడినవారు విజయనగర సామంతులగు ఈ తెలుఁగు నాయకులే; తమిళములో 'వడుగర్' అనఁగా వెంగడమునకు ఉత్తర సీమవారయిన తెలుఁగువారని ప్రాచీన కాలమునుండియు వ్యవహారమున్నట్లు తమిళ సాహిత్యము ప్రమాణము [31]. అళియరామరాయల సోదర పుత్రుఁడగు రామరాజ విఠలదేవ మహారాయలు విజయనగర సర్వసేనానిగను, రాజప్రతినిధి (1543-1558) గను దాక్షిణాత్య సీమలలో సామంతుల ఉద్ధతి నణఁచి విజయనగర సార్వభౌమాధికారమును స్థిరపఱుచుటకును, బుడతకీచులను అదుపులో నుంచుటకును తిరుచ్చిరాపల్లి, తూత్తుకుడి పట్టణములు విడిదలలుగా గొప్ప సేనతో పండ్రెండేండ్లపాటు విడిసి యుండెనట [32]; స్వార్థపరాయణులగు బుడతకీచులతో అప్పటప్పట కొన్ని ఘర్షణలు, చిటిపొటి కయ్యములు సాఁగుచునే యుండినవి. విజయనగర చక్రవర్తియగు ఇమ్మడి వెంకటపతి రాయల (1586-1614) యొద్ద కిరువురు ఏసియ పాదిరీలు (Jesuit fathers) గోవా నుండి 1598 లో వచ్చి రాయల ఆస్థానమున పండెండేండ్లు ఉండిరట [33]; విజ్ఞాన జిజ్ఞాసువగు రాయలు వీరికి మడులు మాన్యములిచ్చి, గుడులు, గోపురములు కట్టుకొన సాయపడెనఁట; చంద్రగిరి, రాయవేలూరులలో రెండు పాదిరి గుడులును ఈ ఉద్యమ ఫలముగా వెలసినవి. కాని, ఇందువలన క్రైస్తవమత వ్యాప్తి సాఁగినట్టు కన్పట్టదు. దీనికి ఈ పాదిరీల అశక్తత కాని, ప్రయత్నలోపము కాని కారణములు కావు. నాఁటి ప్రజల సంస్కారబలము కడు దొడ్డది. పరిపాలకుల ప్రాజ్ఞతయు మేరలు లేనిది. పరమత సహనము వారి ఉదారత కొక చిహ్నము. హైందవము నెడ వారికిఁగల అచంచల భక్తి విశ్వాసముల బలిమి క్రైస్తవము పట్ల ప్రదర్శించిన ఔదాసీన్య

31. 'కదనాయ్ వడుగర్' (శీఘ్ర గమనముగల కుక్కలు గలిగిన తెలుగువారు) నట్రిణై, 212.
32. Heras, op. cit. ff. 140.
33. ibid, pp. 435-437.

మునకు హేతువనుట కేవలము స్వభావోక్తి. వెంకటపతిరాయల కాలమున గోవా చంద్రగిరుల మధ్య పరస్పర స్నేహాభిలాషతో రాయబారము లనేకములు నడిచినవి. ఏసేసు పాదిరీలకు విజయనగర రాజధానిలో ఆశ్రయమిచ్చి ఆదరించి నందులకు కృతజ్ఞతను ప్రకటించుచు స్పెయిను-పోర్చుగాలుల చక్రవర్తి ఫిలిప్పు 1607 లో వెంకటపతిరాయల కొక లేఖను పంపెనట[34]. వెంకటపతిరాయల అవసాన దశలో ఈ పాదిరీలు శాంతోమునకు వెడలిపోయిరట! సెవ్వప్పనాయకుని కాలము (?-1532; 1550-80) నుండియు బుడతకీచులు తంజాపుర రాజ్యమున నాగపట్టణము కేంద్రముగా వాణిజ్యము సేయుచుండిరి. 1611 లో శాంతోములోని బుడతకీచులను ఆపదలో ఆదుకొని కాపాడినందులకు కృతజ్ఞతా సూచకముగా స్పెయిన్-పోర్చుగాలు చక్రవర్తియగు ఫిలిప్పు తంజాపురము రఘునాథనాయకునకు ప్రత్యేకముగా నొక లేఖను (ఫిబ్రవరి, 20, 1614) వ్రాసి గోవాలోని బుడతకీచు వైస్రాయి ద్వారమున అందజేసెనట[35]. కాని, ద్రోహచింతకులగు బుడతకీచులు తంజాపుర రాజ్యమునకు వ్యతిరేకముగా కుట్రలు పన్ని స్థానిక ప్రజలను కొందఱిని ప్రభుత్వముపై తిరుగుబాటు చేయ ప్రోత్సహించిరి. రఘునాథనాయకుఁడు వీరి పన్నుగడల నెఱిఁగి బుడతకీచులను వారి వాణిజ్య కేంద్రమగు నాగపట్టణమునుండి తఱిమి వేసెను. ఈ కుట్టును మనసునఁ బెట్టుకొనియున్న బుడతకీచులు తంజాపురముపై కసిపూని చోళగుఁడను దొంగల నాయకుని ప్రేరేపించి, రాజ్యమునందు దొంగతనములను బందిపోటులను ప్రోత్సహించిరి. ఈ చోళగుఁడు బుడతకీచుల అసరాతో కావేరీ సాగర సంగమము నొద్దగల దేవి కోటయను దీవిని కేంద్రముగాఁ జేసికొని అరాజక చర్యలను సాగింపగా రఘునాథ నాయకుఁడు చోళగుని శిక్షించి బుడతకీచుల యెత్తులను భగ్నమొనర్చుట ప్రఖ్యాతము. వెంకటపతిరాయల అనంతరము విజయనగర సింహాసనము కొఱకై జరిగిన అంతర్యుద్ధములో కుటిలబుద్ధులగు బుడతకీచులు క్రమానుయాయి యగు రామదేవరాయల (1616-1630) కు విరుద్ధముగా, దేశద్రోహియగు జగ్గరాయని పక్షమున పనిచేసి రనుట జగ మెఱిఁగినమాట!

బుడతకీచులచే పదభ్రష్టుఁడయిన సింహళ ద్వీపము నందలి జాఫ్నా (సేపాళ) పాలకుఁడు తంజాపురమును శరణు వేఁడఁగా, రఘునాథ నాయకుఁడు

34. ibid, p. 445.

35. ibid, pp. 402, 403, 448, 449.

బుడతకీచుల నోడించి జాఫ్నా పాలకుని గద్దె నెక్కించి నేపాళ నృపాల స్థాపనచణ దిరుదాంకితుఁ డయ్యె ననుటకు సాహిత్యము సాక్ష్యము [36]. రామభద్రాంబ (1600-1630) కృతమగు రఘునాథాభ్యుదయము నందును, యజ్ఞనారాయణ దీక్షితుల (1580-1630) సాహిత్యరత్నాకరము నందును ప్రస్తావితులగు 'ఫరంగి' వంశ్యులు బుడతకీచు లనుట స్థితిస్థాపకాంశము. ఆ పిమ్మట బుడతకీచులు తంజాపురము పట్ల సఖ్యముతో మెలఁగినట్లు స్పష్టమగుచున్నది [37]. పులికాటు రేవునుండి ఒళందా (డచ్చి) కుంఫిణివారిని తఱిమి వేయుటకుగాను గోవాలోని బుడతకీచు వైస్రాయి అభ్యర్థన మీఁద, బుడతకీచులకును, విజయనగర చక్రవర్తి యగు మూఁడవ వెంకటపతిరాయల (1620-1642) కును 1635 లో ఒక ఒడంబడిక కుదిరినది. చెన్నపట్టణమున కుత్తరముగా పదికోసుల దూరములోఁ గల రేవుపట్టణము పులికాటు. ఒళందా వారిచ్చట 1609 లో తొలి గిడ్డంగి (Geldria) ని నిర్మించియుండిరి. ఈ ఒడంబడికను ఆచరణలో అనువదించుటకై గోవా రాయవేలూరుల నడుమ బహువారములు రాయబారములు చెల్లినవి. కాని, విజయనగరము వారి యసడ్డవలన బుడతకీచుల ఎత్తికోలు తుది దాఁకా లేదు [38]. గోలకొండ వజీరగు మీర్ జుమ్లా 1652లో గండికోటను మోసగించి, బుడతకీచుల మద్దతుతో ఆక్రమించుకొని, కోటలోని దేవతా విగ్రహములను గరఁగించి ఫిరంగులు చేయవలసినదని 'మైలే' యను బుడతకీచు వానిని కోరినట్లు సురవరము ప్రతాపరెడ్డిగారి వ్రాఁతలలో సూచితము [39]. కాని 'మైలే' ('మైయే'

---

36. విజయవిలాసము, పీఠిక, 62; 'నేపాల భూపాల స్థాపనాచార్య' రఘునాథ నాయకుని రామాయణము, అశ్వాసాంత గద్యము.

 కదనంబులో చోళగని గెల్చినట్టి
 పేదలికల్ నేపాళ భూపాలకునకు
 దొరతనం బిచ్చిన దోర్విలాసములు...' విజయ రాఘవ కృతమగు

రఘునాథ నాయకాభ్యుదయము, పు, 19,

37. Letter to the King of Portugal from Conde de Linhares, then Portuguese Vice-roy in India, dated 30th Nov. 1635.

38. Danvers, Portuguese in India, Vol. II. pp. 249, 250.

39. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ద్వితీయ ముద్రణము, పుటలు, 320, 321.

అని సాధూచ్చారము) బుడతకీచువాఁడు కాఁడు. ఫ్రెంచి జాతీయుడు 40. అయినను, పరంగులు-ఇటాలియనులు, ఒళందాలు, పరాసులు, బుడతకీచులు-పలువురు తుపాకులు, ఫిరంగుల నిర్మాణము నందును తత్సంబంధి ప్రయోగములయందును స్థానికులగు పాళెయగాండ్రకును, సామంతులకును తోడ్పడుచుండిన మాట వాస్తవము 41. నికోలాయి మనూచి (1653-1708) కథనములో గోవా, చెన్నపట్టణము, నాగపట్టణము, శాంతోము మొదలగు ప్రాంతములలో నివసించుచుండిన బుడతకీచులవ్యక్తిగతజీవితములకు సంబంధించిన బహూపాఖ్యానములును, క్రైస్తవమతధర్మపరీక్ష (inquisition) పేర సాగుచుండిన అత్యాచారములును బుడతకీచుపాలనలోని అవకతవకలును ప్రత్యక్షవ్యాఖ్యానములుగా సంగ్రథితములు 42. విజయనగరసామ్రాజ్యములోని శాంతోము, మైలాపురము, నాగపట్టణములు బుడతకీచులకు ప్రముఖ స్థావరములుగా నుండినట్లు విల్లియము ఫించ్ (1608) స్పష్టపరచినాడు 43. చెన్నపట్టణములో బుడతకీచు లనేకులు మంచి మంచి బవంతులలో నివసించుచుండినట్లును, శాంతోములోని కొండమీఁద ఒక చిన్న పాదిరిగుడి (చర్చి) యును, ఇరువురు బుడతకీచు పాదిరీలును ఉండినట్లును జాన్ మార్షల్ (1668) వ్రాతలు 44. జయరామపండితుని సంస్కృత రాధామాధవ విలాస చంపు అవతారికలో కర్ణాటక సీమలో బిజాపురము సులతానుల గవర్న

---

40. vide. Tavernier, Book I, p. 228. '.... It was from them we heard that there was a Freneh gunner then in town named Claude Maille of Bourges and that he was engaged in casting some cannon which the Nawab wished to leave in the fort.'

41. ibid, p. 228:

    K. V. Krishna Ayyar, The Zamorins of Calicut.

    '...పోఁత పిరంగిలోన...పరాగపుమందు నించి....
    ...కంతుఁడనేఁటి పరంగిభామ గుబ్బ లనెడు దుర్గము,
    ల్బిగిలి పొర గుభిల్లున నేపి యార్చినన్.' (హంస, 1-231)

42. Niccolao Manucci, op. cit., pp. 112-24; pp. 428-480.

43. Early Travels in India. p. 182.

44. John Marshall in India, pp. 50, 51.

రగు షహాజీ (1651–1664) ఫరంగులపై జరిపిన దండయాత్రలు ప్రస్తావితము; ఈ ఫరంగులు బుడతకీచులే యని చరిత్రకారుల యూహము 45. మొగలు చక్రవర్తుల దండయాత్రలకు బిజాపురము సులతానులు చేసిన ప్రతిఘటనోద్యమములో బుడతకీచుల చేయి యుండినది 46. 1670 లో మచిలీపట్టణములో కాతలిక్ శాఖకు చెందిన ఒక పాదిరి గుడియును, సెయింట్ అగస్టిన్ అనుయాయి యగు నొక పాదిరియును, కొందఱు బుడతకీచులును ఉండినట్లు 'ఫెర్నాండి నవరి' యను క్రీస్తుమత ప్రచారకుడు వ్రాసెనఁట 47; ఆ కాలమున అరబ్బులు, ఆర్మీనియనులు, ఇంగిలీసులు, ఒళందాలు, దినమార్కులు (డేను జాతీయులు), పరాసులు, పారసీకులు, బుడతకీచులు మొదలగు వివిధ దేశ వేష భాషా మతములకు చెందిన అరదేసి పరదేసి సెట్లు ఎందరో మచిలీపట్టణమున గిడ్డంగుల కట్టుకొని, 'పైగో వరకంగు మలాక తరుణాసీరితవాయి యాడాముల'తో ఓడ బేరములు సేయుచుండిరి. గుంటూరు మండలము బాపట్ల తాలూకాలోని పెదగంజాము సమీపమునఁగల 'ఫిరంగి దిబ్బ' లేక 'ఫిరంగుల దిన్నె' ఒకప్పుడు బుడతకీచుల వాసస్థానముగా నుండినదఁట 48. ఇంగ్లీషు కుంఫిణీ దొరతనమువారు చెన్నపట్టణములో ఏర్పఱిచిన మేయరు కోర్టుకనుబంధముగు నగరపాలక సమితి (1687–1726) లోని పండ్రెండుగురు సభ్యులలో ముగ్గురు తెలుఁగు వర్తకులతోపాటు ఇరువురు బుడతకీచు వర్తకులను సభ్యులుగా నియమించుట ఆచారముగా నుండినది 49. వాణిజ్యరంగమున ఇంగిలీసులును, ఒళందాలును పరాసు (ఫ్రెంచి) వారికి ప్రతిస్పర్థులు. ఇంగిలీసులకు, ఒళందాలకు బద్ధ విరోధులయిన బుడతకీచులు పరాసులకు పరమ మిత్రులయిరి. పరాసువారి ప్రభ వెలిగిన నాళ్ళలో వారికి మిత్రులుగా నుండిన బుడతకీచుల రాకపోకలు చోళ మండల తీరమున అధికముగా నుండినవి. చంద్రనగర్,

45. Patwardhan and Rawlinson, A Source Book of Maratha History, p. 22.
46. English Factories in India (1630-36), pp. 59, 60.
47. Henry Morris, Godavery District, p. 182.
48. MAMP, Vol. III, p 77.
49. Despatch of Court of Directors dated the 28th Sep. 1687, MAMP, Vol. I, p. 220, fn.

[30]

మాహీ, మచిలీపట్టణము మొదలగు రేవుపట్టణములకు సరకులను, తపాలులను, సంపుటకుగాను పరాసువారు బుడతక్రీచుల నౌకలను ఎక్కువగా వినియోగించు చుండిరి 50. పరాసులు ఉచ్ఛదశలో నుండిన నాఁటికి బుడతక్రీచుల వెలుఁగు కొడిగట్టి యుండినది. బలహీనులతో చెలిమిచేసి, బలవంతులతో పంతమాడుట పరాసు గవర్నరయిన డూప్లే (1742–1754) రాజనీతి. పరాసుల నెచ్చెలియును, కర్ణాటక నవాబును నగు చందాసాహేబు (1734–1752) మఱుగు పడుచున్న బుడతక్రీచు ప్రాభవమును పునరుద్ధరించు తలంపుతో డూప్లే సూచనల మేరకు మైలాపురములోని 'అంతోనీ' యను బుడతక్రీచు పాదిరీని మైలాపురమునకు అమల్దారుగా నియమించినట్లును, నూరేండ్ల నుండి చెన్నపట్టణములో స్థిరపడిన ఇంగిలీసు కుంఫిణీ అధికారులకు ఈ నియామకము నచ్చక 1749లో 'అంతోనీ' ని చెఱపట్టినట్లును ఆనందరంగపిళ్లై దినచర్యా గ్రంథావళిలో ఉట్టంకితము 51. రామచంద్ర పెరుమాళ్లు తిరునాళ్ల వేడుకలఁ జూడవచ్చిన వారితో 'పరంగు లింగులీసులు పరాసులు వళంద' లున్నట్టు 'హంసవింశతి' కథనము 52. ఇచటి 'పరంగులు' బుడితక్రీచులని ఊహించుట సత్యదూరము గాదు. 'సాధారణముగా విదేశీయులు అను నర్థమున చాలకాలము వాడుకలో నున్న 'పరంగి' అనుమాట మొట్టమొదట పోర్చుగీసువారికి ప్రయోగింపబడి కాలక్రమమున మిగిలిన పాశ్చాత్యుల కందఱికిని సామూహికార్థమున ప్రయోగింపబడినది' 53. చంద్రగిరి, రాయవేలూరులలో క్రైస్తవమత ప్రచారకులుగా నుండిన కోతిన్యో, సీమోను మొదలగు బుడతక్రీచు పాదిరీలు (1598–1611) తిరుపతి మొదలగు క్షేత్రముల జరుగు రథోత్సవాదులను స్వయముగా దర్శించి వ్రాసిన వ్రాఁతలు పై యూహకు ప్రోద్బలకము 54. చెన్నపట్టణములోని రాబర్ట్సన్ పేట నివేశన స్థలము ఇరువదెకరములును ఇంగిలీసు కుంఫిణీ దొరతనమువారిచే దానముగా ఈఁబడినదఁట! ఈ స్థలమంతయు 1804 లో

---

50. ఆనందరంగపిళ్లై దినచర్యా గ్రంథావళి. Vol. III, P. 315; 1747 A. D.

51. Ibid, Vol VI, pp. 219, 225.

52. హంసవింశతి. 3–28.

53. డా కొత్తపల్లి వీరభద్రరావుగారు : "తెలుగుసాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము" పు 17.

54. Heras, op cit. pp. 315, 316.

D'Frouze అను బుడతకీచ జాతీయుని స్వాధీనములో నుండినది 55. రోమను కాతలిక్కుల ఆంధ్ర ప్రాంత కేంద్రములలో కొన్ని వందల మంది బుడతకీచ భాషీయు లున్నట్లు 1880 నుండి తీసిన జనాభా లెక్కల నివేదికలు స్పష్టపఱచు చున్నవి. పూర్వోక్తములగు చారిత్రకాంశము లన్నియును విజయనగర చక్రవర్తుల తోడను, తత్సామంత మండలేశ్వరులతోడను బుడతకీచుల కుండిన సంబంధములను, ఆంధ్ర ప్రాంతములో బుడతకీచ భాషీయుల ఉనికిని ఆవిష్కరించునట్టివి.

బుడతకీచ భాషా వ్యాప్తి

పదునాఱవ శతాబ్ది నుండియు దక్షిణ భారత రాజకీయములలో బుడతకీచు లాక్రమించిన కీలకస్థానము ననుసరించి, వారితో రాజకీయాదికముల సుహృద్భావ సంబంధములను స్థాపింపవలయుచో పరిసర సీమల రాజకీయోద్యోగు లందఱును బుడతకీచు బాసను విధిగా అధ్యయనము చేయవలసి యుండినది. స్వామికార్య నిర్వహణ ప్రవీణులు పరదేశ భాషలను నేర్చుట బుడతకీచుల రాకతో పుట్టలేదు. ఇది సర్వ దేశకాల సంబంధి. ఆ నాఁటి ఏలికలు 'అశేష నృపసేవం దత్తద్భాష లెఱిఁగి' 56 'ఎల్ల నృపులా గొలువ బాసాడ' 57 నేర్చిన వారు. 'పరదేశభాషలు ప్రభువుకు వినిపింప నేర్పు గల్గిన మంత్రులు నీతి పరులుగా 58 పరిగణింపఁబడిరి. 'సకల భాషలు మాటాడఁ జదువ, వ్రాయ నిపుణత వహించి' 59 తమ ప్రభువులను మెప్పింప వారు పాటుపడెడివారు. స్వామి కార్యాభిరక్షాక్రియాదక్షులగు వారి కిది శ్రీరామరక్ష. 'పారసీకోక్తులు ప్రణుతి కెక్కిన నాడు' 'అరబీ, పారసి, కన్నడము, రుమీ, కనోజి, తెనుఁగు మొదలగు బాసల్ పరికించి' 60 నియోగము నెఱపినవారెందరో కలరు. రెడ్డి రాజులు వీరభద్రేశ వేమ పృథ్వీధవుల యనుంగు మంత్రియగు బెండపూఁడి

---

55. MAMP, Vol. III, P. 448.
56. ఆముక్తమాల్యద, పీఠిక, 18.
57. Ibid, పీఠిక.
58. చాటువు.
59. కస్తూరి రంగకవి, ఆనందరంగరాట్ ఛందము, పీఠిక, 59.
60. పొన్నిగంటి తెలగన్న, యయాతి చరిత్రము, 1–58.

దేవయయన్న మంత్రివరుండు (1423_1447) 'అరబీ భాష తురుష్క భాష గజ కర్ణాటాంధ్ర గాంధార ఘూర్జర భాషల్ మళయాళ భాష శకభాషా సింధు సౌవీర బర్బర భాషల్ కరహాట భాష మఱియుం భాషా విశేషంబులు' 61 గోష్ఠి సంప్రయోగంబుల నియోగింప నేర్చిన వ్యవహారవేత్త. ఈ 'అన్నయ మంత్రి శేఖరుఁ దహమ్మదుసేను వదాన్యభూమి భృత్సన్నిధికిన్ ష:దిన్ సముచితంబుగ వేను మహీసురేంద్ర రాజ్యోన్నతి సంతతాభ్యుదయ మొందఁగ బారసి భాష' 62 లో కాకితములు వ్రాసెడివాఁడు. గోలకొండ సులతానుల కాలము (1512_1687) న ప్రముఖ రాజకీయోద్యోగులు 'అరబి పారసి గుజరాతి యారెమచ్చ తెనుఁగు కన్నోజి మొదలుగా దెలిసి వ్రాయ దారి గన్నట్టి' 63 వారు. బుడతకీచుల ప్రాముఖ్యము హెచ్చిననాఁడు తద్వ్యవహార భాషను నేర్చుట ఆవశ్యక మయినది. బుడతకీచు నేర్చిన దేశీయ క్రైస్తవులకు 'దుబాసి' పదవు లీవలసినదని పోర్తుగాలు చక్రవర్తి నుండి 1571 లో గోవాలోని బుడతకీచు అధికారులకు ఆజ్ఞాపత్రిక వచ్చియుండినది 64. దుబాసీలకు ఆనాఁడు రెండు పర్దాలు_అనఁగా సుమారు రెండురూపాయలు_నెలసరి జీతమట! 65 దేశీయులు పెక్కురు దుబాసీలుగా పనిచేయు నిమిత్తము బుడతకీచును నేర్చుచుండిరనుట దాని విపుల ప్రచారమునకు ప్రబల ప్రమాణము 66. 1602 నాఁటి ఒక ఏసీయ పాదిరి ఉత్తరములో వెంకటపతిరాయల (1586_1614) ఆస్థానమున నుండిన బుడతకీచు దుబాసిని గూర్చిన ప్రసక్తి కలదు 67. చెన్నపట్టణములో ఇంగిలీసు కుంఫిణీ దొరతనము నెలకొనిన క్రొత్తలో కుంఫిణీ పాలకులు స్థాపించిన కొత్వాలు చావడుల_తొలి న్యాయస్థానముల_(1678_1726) లో బుడతకీచు

---

61. శ్రీనాథుని భీమేశ్వర పురాణము, 1_73.

62 Ibid, 1_74.

63. యయాతి చరిత్రము, 1_47.

64. S. R. Dalgado, p 348; fn.

65 'To a lingua of the factory at Goa two pardaus monthly...' Simao Botelho, Tombo do Estado da India, p. 63: quoted by Dalgado , p 63, fn.

66. Dr. Robert Caldwell, History of Tinnevelley p. 233.

67. Heras, op. cit., p. 437.

భాషయే వ్యవహారమున నుండినది [68]. దినసరి వక్కాణలు, వాది ప్రతివాదుల అభియోగములు, ధర్మాసనము వారి తీర్పులు బుడతకీచు భాషలో లిఖితము లగుచుండినవి. ఆస్తిపాస్తుల క్రయవిక్రయములును, అన్యాక్రాంతములును, దానధర్మాదుల వివరములును తెలుఁగు, బుడతకీచు బాసలలో సంగ్రథితములగు చుండినట్లు (1670–1681) నాఁటి ఇంగిలీసు కుంఫిణీ రికార్డులును సాక్ష్య మిచ్చు చున్నవి [69]. బానిసల వ్యాపారమును నిషేధించుచు కుంఫిణీ దొరతనమువారు 1682 లో చేసిన శాసనము ఇంగ్లీషు, తెలుఁగు బుడతకీచు భాషలలో ప్రకటిత మయినది [70]. 1687 లో సీమనుండి ఇంగిలీసు కుంఫిణీ నిర్వాహకులు చెన్న పట్టణములోని ఫోర్టు అధికారులకు పంపిన ఆజ్ఞాపత్రిక మేరకు మేయరుకోర్టు చెన్నపట్టణములో స్థాపితమయినది. ఈ కోర్టులోని ప్రధాన లేఖకుడు (Town-clerk) ను నగర వ్యవహారదర్శి (Recorder) యును ఇంగ్లీషు జాతీయులయి, తెలుఁగు బుడతకీచు భాషాజ్ఞానము కలవారయి యుండవలయునని విధించిన నిబంధన నిర్వాహమగుటచే బుడతకీచు భాషకు గల వ్యవహార బలము సుప్రతిష్ఠితము [71]. పెరంబూరి ఆనందరంగపిళ్లై (1700–1750) తండ్రియగు తిరువెంగడప్రభుకిరీటి "ఫ్రాంసు భాషను కథల్పుల్కా ముద్దు" [72] గలిగి జాతి దొరల మెప్పు లందిన వాఁడే కాక 'ఫ్రాంసు హింగ్లీజు దిన మార్గ యొలందా యంపరుదొరు పురతకేశు –' మొదలయిన జాతి భాషా విశేషంబులఁ బ్రవీణతఁ గాంచి యాయా జాతి పాదరులకుం దెలియవి గూఢార్థంబులఁ దెలియఁజేసి వారిచే మేలుమేలని పొగడికలు గాంచి యితర మతంబుల మర్మ కర్మంబు లన్నియుం బరిశీలించిన' [73] ప్రౌఢయునఁట! ఆనందరంగపిళ్లై సహజన్ముఁడగు తిరువెంగళేంద్రుఁడును 'ఫ్రాంసు పుడతకీసు హారబి పార్సి తెనుఁగు నరవమును మొదలయిన భాషాంతరముల మాటలాడఁ జదువ

---

68. MAMP, Vol. I, p. 265, fn.

69. Notes and Extracts from the Govt. Records in Fort. St George (1670-1681), Part III, 33 ; Sept- 9, 1680.

70. Pringle, the Diary of the Agent, 1682.

71. MAMP. Vol. I, p. 220, fn.

72. ఆనందరంగరాట్ ఛందము, పీఠిక.

73. ibid. పీఠిక, 58.

వ్రాయ మేటియగుచు—' 74 మెప్పు లందినవాఁడు. 'సీమలో నుండి ఫ్రాంసు రాట్ఛేఖరుండు—కుంపిని దుబాసి తన మీయ సొంపుమీఱి' 75 న ఆనందరంగ పిళ్లెయును 'ఫ్రాంసు మహారాజేంద్ర హృదయానుగత చరత్కుంపినీ ప్రభువర్య సర్వకార్య నిర్వహణ చణ మనీషా విశేషుఁడు' 76 అగుటకు బుడత కీచును సైతము నేర్చియుండెనని ఊహించుట కవకాశము కలదు. పులికాటులో ఒళందా కుంఫిణీవారి దుబాసి—ధరణి దేవుల రామయామాత్య కృత దశావతార చరిత్ర కృతిభర్త—యగు మగదల కృష్ణ మంత్రియును, మచిలీపట్టణములో వరాసుకుంఫిణీ వారి దివాను—మంగళగిరి ఆనంద కవి రచిత వేదాంతరసాయన కృతిపతి—అగు నిడుమామిళ్ల దాసయామాత్యుఁడును, పుదుచ్చేరిలో పరాసుకుంఫిణీ వారి కార్యస్థులు—దాసయామాత్యు సోదరుఁడు—అగు నిడుమామిళ్ల రాజప్ప (1740—1790) యును 'మూసా బూసీ వారి దుబాసీ లక్ష్మణ సమాఖ్యుఁబరగు నతఁడు' 77 (1750) ను ఆనందరంగపిళ్లె వలె బుడతకీచును నేర్చియుండనగును. బుడత కీచులకు పిమ్మట వచ్చిన పాశ్చాత్య వాణిజ్య సంఘ ప్రతినిధులు స్థానికా భాషా సాహచర్యముచే వికృతి నందిన బుడతకీచును నేర్చియు 78 దీని నెఱిఁగిన వారిని దుబాసీలుగా నియమించుకొనియు 79 వ్యవహరించుట మీఁది ప్రతిపాదనమునకు ఉపబలకముగాక పోదు.

---

74. ibid. పీఠిక, 81.
75. ibid. పీఠిక. 78.
76. ibid. పీఠిక, 15.
77. రంగారాయ చరిత్రము, 2—61.
78. Captain Alexander Hamilton (1650 A. D.), A New Account of the East Indies, Preface p. XII.
79. 'The Portuguese language contributed many words to the vocabularies of Indian languages, and a bastard form of it was for a long time a lingua Franca in the sea-ports and European settlements along the coast. Both the Dutch and the English in the Seven-teenth century had to employ Portuguese interpreters.' ('The Impact of European civilisations' by L.S S.O' Malley, in the book 'Modern India and the West' Oxfoad, 1941, p. 47. quoted by Dr. K. V. Rao),

పాదిరీల కృషి

ఏసీయ పాదిరీలు (Jesuit fathers) గోవాలో విద్యాలయములను స్థాపించి, బోధన కావశ్యకములగు గ్రంథముల ప్రచురణ నిమిత్తము రాచోలు, సెయింట్‌పాల్ మొదలగు స్థలముల అచ్చు కూటములను నెలకొల్పిరి. 1557 నాఁటికి క్రైస్తవ మత పారమ్యములగు అనేక గ్రంథములను బుడతకీచు భాష లోను, దేశీయ భాషలలోను అచ్చొత్తించిరి. ఈ యచ్చు కూటములు పదునేడవ శతాబ్దాంతము దాఁక నిలిచియుండినవి. గోవా రాజధానియగు 'పంజిమ్' పట్టణము లోని ప్రభుత్వ గ్రంథాలయమునందు తమిళ మలయాళ కొంకణి బుడతకీచు భాషామయములగు ప్రాచీన ముద్రితాముద్రిత గ్రంథము లనేకము లున్నట్లు తెలియు చున్నది [80]. ఏసీయ పాదిరీలు గోవాలో స్థాపించిన విద్యాలయములలో గోవా వాసులే కాక, తక్కిన ప్రాచ్య దేశముల వారును పాశ్చాత్య భాషలను నేర్చు చుండిరఁట [81]. ఉత్తరోత్తర కాలముల భారత దేశమున కరుదెంచిన విదేశీయులు—వర్తకులు, మత ప్రచారకులు—ఇండో—బుడతకీచు భాషను నేర్చుచుండి రని యును, వివిధ భాషా జాతులకు చెందిన క్రైస్తవ మతబోధకులు భారతదేశీయ భాషలను అభ్యసించుటలో బుడతకీచు అనుసంధాన భాషగా నుండినట్లును, తన్మూలమున నది ప్రథమ పాఠ్యముగా నుండినట్లును విదేశ యాత్రికులును, పరిశీలకులును వ్రాసిరి [82]. మైలాపురములోని సెయింట్ ఫ్రాన్సిస్ శాఖీయుఁడును, ఫ్రెంచి జాతీయుఁడును, బహు భాషావేత్తయునగు ఎఫ్రాయిమ్ (1642–1651) అను పాదిరి క్రొత్త నిబంధన గ్రంథములోని గూఢార్థ గ్రథితములగు ఘట్టములను ఏరి, వానికి భాష్యముగా ప్రశ్నోత్తర రూపమున బుడతకీచు భాషలో వ్రాసినట్లును, అతని అనుయాయులు వానిని కంఠస్థము సేసి ప్రచారము సలుపు చుండినట్లును సమకాలికులగు క్రైస్తవ మతాధికారుల లేఖనముల నుట్టంకితము [83] నిర్ణీతములయిన ప్రచారక మండలములలోని వ్యవహార భాషలలో కొంత పరి

80. History of Goa p. 102.
81. ibid, pp. 56-58.
82. Maturin Veyssiere La Croze, Histoire du Christianisme des Indes, tome ii, ff. 384.
83. Manucci, op. cit, p. 471.

చయము సంపాదించిన తరువాత గాని క్రైస్తవమత ప్రచారకులు గోవా నుండి ప్రచార ప్రాంతములకు పంపబడిడెవారు కారు [84]. క్రీ. శ. 1600 ప్రాంతముల రోమన్ కాతలిక్ పాదిరీలు తెలుఁగు నేర్చి, పూర్వ వేదము_బైబిలు ప్రాతనిబంధన గ్రంథమును_తెలిఁగించి, తెనుఁగులోనే మతప్రచారము గావించుచుండిరనుట ఆలోచింపఁదగిన యంశము [85]. డచ్చి మిషనరీలు (1600) ను తూత్తుకుడి, నాగపట్టణము ప్రాంతములలో బుడతకీచు భాషయందే తమ మత ప్రచారమును సాగించుచుండిరఁట [86]. పదునెనిమిదవ శతాబ్దిని క్రైస్తవమత ప్రచారము చేసిన లూథరన్ తెగ పాదిరీలు బుడతకీచు భాషను అభ్యసించు చుండిరఁట. వారు అడప దడప బుడతకీచునందే తమ ప్రచారము సలుపుచుండినట్లు వారి దినచర్యా గ్రంథములలో ఉల్లేఖ్యము [87]. పదునెనిమిదవు శతాబ్దివిని దినమార్గ (డెన్మార్క్) మత సంస్థ తరఫున తమిళనాడులో పనిచేసిన 'జీగెన్ బర్గ్' (Bartholo-mew ziegendalg, 1683-1739) ను, అతని సహచరుఁడగు 'ప్లుట్‌షా' (Plutschau) యును బుడతకీచు భాషాముఖమున తమిళ భాషను నేర్చుటలో పడిన పంచకర పాట్లు ఫ్రెంచి పరిశోధకుఁడగు లక్రోజ్ (1661-1739) వ్రాఁతలలో వివృతములయినవి [88].

"As the portuguese language has a strong hold in India for more than two centuries, they considered it appropriate to learn it first. With the aid of the portuguese they applied themselves to the study of Tamil, but found the books in this

---

84. Dr. R. Caldwell. op. cit, p. 102.

85 C. P. Brown, A Review of Mss. of Purvavedamu and Rajulacharitra Madras Journal of literature and Science' No 28, July, 1840, quoted in the Introduction to the 'Bible History, Part I, Nellore 1942.

86. Dr. Caldwell, op. cit, p.238

87. Hobson Jobson, 1903, Introductory Remarks p. XVIII

88. La Croze, op. cit, ఈ ఫ్రెంచి రచనలోని ఆవశ్యక భాగములను అనువదించి యిచ్చిన శ్రీ జె. ఎస్. ఆర్ ఎల్. నారాయణమూర్తి_ఆంధ్ర విశ్వకళా పరిషత్కళాశాలలో తత్త్వశాస్త్రోపన్యాసకులు _ గారికి కృతజ్ఞత.

language on palm leaves. It was all the help they were able to reckon, understanding by it the living voice of some country people... They made little progress so they engaged a Tamil school master, who brought his school of small children with him, and the two missionaries began to write like them the Malabari Tamil, letters on sand with the fingers and Join them as the school master dictated them. Unfortunately the master knew no portuguese, so they were left in the dark as to the meanings of most ot the words they learned to write and pronounce But eventually they found a Tamilian who knew portuguese, Danish, Dutch and German! This man had rendered them a great help..."

పూర్వ ప్రచారకులగు బుడతకీచు పాదిరీల ప్రచారరీతుల మూలముగా ప్రచురవ్యవహారము సంపాదించిన మాటలను, విషయ సుబోధకమునకును దేశీయుల విశ్వాసమును చూఱగొనుటకును అర్వాచీన ప్రచారకులు తమ ప్రచార సందర్భములలో వాడుచుండుటచేత మత పరమయిన ఆయా మాటలు అటులే స్థిరపడినవి. చెన్నపట్టణములోని పరంగులపేటలో బుడతకీచు పిల్లల కొరకు ఒక పాఠశాలను స్థాపించుటకు 1717 లో కుంఫిణీ దొరతనమువారు మత సంస్థల కనుమతి నిచ్చినట్లు ఆధారము లున్నవి. 89. దేశీయుల పిల్లల నిమిత్తము కడలూరులో కుంఫిణీ దొరతనమువారి గ్రాంటుల తోడను, అనుచరుల తోడ్పాటు తోడను 'ట్సీగెన్ బల్గ్' ప్రారంభించిన పాఠశాలయందు Radewitz (1680—1732) అను నతఁడు బుడతకీచును బోధించిన ఉపాధ్యాయుఁడు. చెన్నపట్టణము పోర్టులో 'ట్సీగెన్ బర్గ్' స్థాపించిన బుడతకీచు పాఠశాలలో ఇతడు చిరకాలము పనిచేసినవాఁడు 90 అనంతపురము మండలములోని ఆమూరు, పదమటి యాలేరు, మడిగుబ్బలు రోమన్ కాథలిక్కులకు ప్రధాన కేంద్రములుగా నుండినవి. అనంతపురము పాలకుఁడగు హండే ప్రసన్నప్పనాయని (1680-1719)

---

89. Proceedings Book of the Madras Govt, Monday the 27 tb May, 1717; MAMP, Vol, I. p. 566, fn

90 MAMP: Vol. I, p. 66. fn.

సాయము వీరి కుండినదఁట [91]. ఆంధ్ర క్రైస్తవులచే అధికనాథస్వామి[92] యను పేర వ్యవహృతుఁడయిన గోవా వాస్తవ్యుఁడు రెవరెండు జో అకిమ్ దీసౌజా (Joachim D'souza (1776–1829) యను పాదిరి 1784 లో బళ్లారికి వచ్చి, కడప, బళ్లారి, అనంతపురము మండలములలో కాతలిక్ క్రైస్తవమును ప్రచారము సేసి, పలు తావుల పాదిరిగుడులు నిర్మించినట్లు జిల్లా గెజెటీర్ల కథనము [93]. ఆ యూఁళ్లలో ఆదోని, బళ్లారి, ముద్దణగేరి, రామదుర్గము, సత్యాపురములలో పలువురు బాప్తిస్మము స్వీకరించుటచే అవి కాతలిక్ క్రైస్తవమునకు ముఖ్య కేంద్రము లయినవి [94]. రోమన్ కాతలిక్ శాఖానుయాయులయి, ఇంగిలీసు కుంఫిణీకి చెందిన సైనికుల ప్రార్థనాదికముల నిమిత్తము ఆర్చిబిషప్పు పర్యవేక్షణమున 1828 లో రెవరెండు పెద్రోజా (1828–1844) బళ్లారిలో పాదిరిగా నియమితుఁడయి యుండెను [95]. 1887 లో ఈ కాతలిక్ కేంద్రములపై గోవా యాజమాన్య మంతరించినది. పదునేడు పదునెనిమిది శతాబ్దములలో క్రైస్తవ మత ప్రచారము సలిపిన పాదిరీలు పెక్కురు కేవలము వాగ్రూప ప్రచారముతో తృప్తిపడక ఇండో-బుడతకీచు కోశవ్యాకరణాదులను రచించి భాషా విషయక కృషిని సైతము కావించిరి. బుడతకీచు భాషా ప్రభావమునకు పరమ ప్రమాణము ప్రధానముగా సాగరతీర ప్రాంతములే వారి ముఖ్య ప్రచారసీమ గుట వలన తత్తద్వ్య వ్యవహార భాషా పరముగా వారి కృషి సాఁగినది. పారసి-హిందూ

---

91. W. Francis, Gazetteer of Anantapur District, P. 27.

92. ‘అదికణాద’ యని లిప్యంతీకరణము, తెలుగు భాషా సమితి వారి విజ్ఞాన సర్వస్వము, సంపుటము, III పు. 573.

93. W. Francis, Gazetteer of Bellary District, Vol. I, p. 57; C. F. Brackenbury, Gazetteer Cuddapah District, Vol. I, p. 55.

94. గోవాలోని ఆర్చిబిషప్పు అధికారమునకు లోఁబడిన రోమను కాతలిక్ ప్రచారకులు ఆంధ్ర ప్రాంతములో ఆ నాఁడు 21 మంది ఉండిరట! (MAMP, Vol I, p 629)

95. 1500 లో మొట్టమొదట పోర్చుగాలు నుండి రోమను కాతలిక్ ప్రచారసంస్థవారు భారతదేశమునకు వచ్చిరి. దు ఆర్తి న్యునీజ్ (1514–17) మొదటి బిషప్పు. జువాన్ దీ అల్బూకర్కు (1538–1551) గోవాలో మొదటి ఆర్చిబిషప్పు. సెయింట్ గ్జేవియర్ యాజమాన్యమున 1542 నుండి ఈ పాదిరీల ప్రచారము చురుకుగా సాఁగినది.

స్పాని-ఇంగిలీసు-బుడతకీచు భాషలలోని సమానార్థక పదజాలము కలిగి రోమక లిపిలో 1630 (?) సంగ్రథితమయినదను ప్రతీతికల సూరతు 96 నిఘంటువును, 1679 లో కొచ్చినులో అచ్చయినట్లు అర్వాచీనములగు పాదిరీ వ్రాతల వలన తెలియుచున్న పాదిరీ అంతిమ్ దీ ప్రోయెన్కా (Antem de Proenca) రచిత మగు తమిళ-బుడతకీచు నిఘంటువును 97, 1743 లో బుడతకీచు బాసలో రోమకలిపిలో సంధానితమయిన బంగాళీ-బుడతకీచు వ్యాకరణ (పుటలు -1-40) బంగాలీ-బుడతకీచు (పుటలు 47-306), బుడతకీచు-బంగాళీ (పుటలు 307-577) నిఘంటు సంపుటమును 98, వీరపల్లిలోని బుడతకీచు పాదిరీలు 1746 లో అచ్చువేసిన మలయాళ-బుడతకీచు, బుడతకీచు-మలయాళ నిఘంటు సంపుట టములను 99, బార్నబైటు (Italian Barnabite) పాదిరీల తెగకు చెంది బర్మాలో ప్రచారము చేసిన Johannes Maria Percoto (1761-1776)అను పాదిరీ రచించిన బర్మ-లాటిన్-బుడతకీచు నిఘంటువును 100, గుంటూరు మండల పరిసరములలో ఏసీయ పాదిరీలు పదునెనిమిదవు శతాబ్దమున కూర్చిన తెలుగు నిఘంటువును 101 అక్షర రూప మెత్తిన పాదిరీల కృషికి నిదర్శనములు. ముద్రితా ముద్రితములయిన ఇట్టి కోశ వ్యాకరణములను, వీనికి పూర్వరంగమున

---

96 G A Grierson Linguistic Survey of India. Vol IX, part i, pp 4-11

97. Introduction to the Tamil lexicon, p xxxvi

98. G A Grierson, op. cit., Vol. V, Part i, p 23.

99. MAMP Vol. I, p 550; also Rev H Gundert, A Malayalam and English Dictonary, Mangalore, 1872, Preface, p iv.

100. E Luce, A short note on the Alphabetum Barmanorum, Journal of the Burmah Research Society, August, 1914, p 144; quoted by J. R Firth in his 'Papers in Linguistics', p 57.

101. A.D. Campbell, Advertisement to his Dictionery of Telugu language, commonly termed the Gentoo, College Press, Madras, 1821.

సాగిన కృషి ఫలితముగా రూపొందిన అముద్రిత రచనలు పరిశీలకుల దృష్టికి అందక ఎన్ని అంతరించినవో? ప్రాచీన క్రైస్తవమత ప్రచారకుల భాషా విషయకములైన అముద్రిత రచనలు అర్వాచీన కోశవ్యాకరణ నిర్మాతల చేతులలో పడి, వీరి రచనా సంప్రదాయమునకు మాతృకలయి యుండునని ఆచార్యఫర్త్ గారి ఆశంక 102.

గోవా ప్రభావము

భారత దేశములో బుడతకీచు స్థావరముల వైశాల్యము పదునైదు వందల చదరపుమైళ్లు. జనసంఖ్య తొమ్మిది లక్షలు. ఈ ప్రాంతములోని ముఖ్యపట్టణముల యందలి పరంగులును, మిశ్రజాతీయులును, క్రైస్తవమతస్వీకర్తలును, విద్యార్థులైన దేశీయులును బుడత కీచును మాట్లాడుదురు. దేశీయులలో బుడతకీచుల వివాహములను అల్బూకర్కు ప్రోత్సహించుటచే 103 ఈ సంబంధముల వలన నొక మిశ్రజాతి ఉద్భవించినది. ఈ మిశ్రజాతీయులు అటు బుడత కీచునందును, ఇటు దేశీయ భాషలయందును మంచి ప్రవేశము కలవారుగా నుండిరి. బుడత కీచులకు పిమ్మట భారత దేశమునకు వచ్చిన ఇతర పాశ్చాత్య జాతుల వారికిని, దేశీయులకును వీరు 'తొపాసులు' 104 (ద్విభాషులు) గా పనిచేయుచుండిరి. అందువలననే ఈ మిశ్రజాతీయులకు 'తొపాసి' అను పేరు కలిగినది. గోవాలో నాటికి నేటికి నాలుగున్నర శతాబ్దులుగా బుడత కీచు రాజకీయ భాష. బుడతకీచు సేనలలోని సైనికులు, బారకాసులలోని బానిసలు, ప్రభుత్వకార్యాలయములలోని కార్కూనులు, బంట్రోతులు, ఆస్పత్రులలోని ఆయాలు, నౌకరులు,

---

102. J. R. Firth, 'Papers in Linguistics', p. 57.

103 Commentaries, Vol. III, p. 41.

104. ప్రభువు అను నర్థమున ఈ 'తొపాసి' యను మాట ఆంధ్ర పద్య నిఘంటువుల కెక్కినది. చూ. వేంకటేశాంధ్రము (1658) మానవర్గు; సాంబ నిఘంటువు (1750)మానవర్గు; ఈ నిఘంటు కర్తల కాలమునను,వారికి కొంత పూర్వమునను పరంగుల కుంఫిణీలలో తొపాసులు-దుబాసులుగా పనిచేసిన దేశీయులను ప్రజల దృష్టిలో—అందును క్రైవారపు కవుల సృష్టిలో ప్రభుకల్పులుగా పరిగణితులగుటలో వింత లేదు.

సరకుల గిడ్డంగులలోని సిబ్బంది, కప్పలిజోగులలోని కళాసులు, సరంగులు 105 పాదిరిగుడులలోని ప్రచారకులు, పరిచారకులు, ఉన్నతోద్యోగుల చాకరులు, శ్రీమంతుల సేవకులు అందఱును ఆ నాఁడు బుడతకీచులు కారు. తొలుత వీరి సంఖ్య అధికముగా నుండినను క్రమక్రమముగా దేశీయులును, మిశ్రజాతీయులును ఈ యీ కొలువులలో విరివిగా నియోజితులైనట్లు ఊహించుట కాధారములు కలవు. మతప్రచార సంస్థలలోను, ఇతర ధనవంతుల ఇండ్లలోను పరిచారకులు కావలసి వచ్చినపుడు పోర్తుగాలునుండి భారతదేశమునకు సబురులు చేసెడి నావలలో ఏడెనిమిదేఁడుల యీడుగల బాలురను ఆయా నావికాధికారులు వెంటఁగొని తెచ్చి, వీరి కప్పగించి, ప్రతిఫలముగా కొంత ధనమును స్వీకరించెడివారు ఆ నాఁడు గోవాలోని మత సంస్థలు మిక్కిలి ధనవంతములు. నెలసరి జీతములు సరిగా అందనందునను, అందిన జీతములు సుఖజీవితమునకు చాలనందునను బుడతకీచు సైనికులు పలువురు మతప్రచార సంస్థలలో చేరుచుండిరి. తమతో చేరుఁడని కూడ మతాధికారులు సైనికులను ప్రోత్సహించెడివారు. తిండి, తిప్పలు సరిగా లేక, ప్రాణములను అరచేతఁబెట్టుకొని సైనికుడుగా బ్రతుకుట కంటె, చీకు చింత లేని మత సంస్థలలో చేరి కాలము గడుపుట వారికి హాయిగా కన్పట్టినది. 1635 లో గోవాలో తీసిన లెక్కల ప్రకారము సైనికుల, సాధారణ పౌరుల మొత్తము కంటె మత ప్రచార సంస్థలలోని సిబ్బంది ఎక్కువని తేలినది 106. పెద్ద పాదిరీలు మత ప్రచార పర్యటనకు బయలుదేరునపుడు వారి పరివారములో ఈ సజ్జంతియు చేరుచుండెడిది. ఇఁక, గిడ్డంగుల ప్రాంగణములలో కన్పట్టెడి కోపుదారులు, మాలుబేరగాఁడ్రు, ఓడలు రేవులో నుండగా సరకులెత్తి దించు బత్తాయిలు, అమాలీలు, రేవులలోని ఇసుకమేటలు త్రవ్వు ఉప్పరులు, వడ్డరులు

---

105. ibid. Vol. IV, p. 1; also vide: 'The Portuguese make a marvellous profit all over India. Where they are well received they associate with the natives of the country, who in their turn accompany them in theri voyages, so much so, that even all the crews of their ships and pilots are Indians...... Pyrad Francisco de Laval. Viagem, Vol. I, p. 438.

106. F. C. Danvers, op. cit.. Portuguese in India, pp; 252-254.

అందఱును అచ్చముగా దేశీయులు. మే, జూన్, జూలై, ఆగస్టులు సబురులకు సరిపడని ముసురు నెలలు. ఈ నాలుగు నెలలును ఓడల మరమ్మత్తులు 107, క్రొత్త పడవల, తెప్పల కట్టుబడులు, సిబ్బంది ఉడుపుల తయారీలు, ఇట్టి సర్దుబాటులకు సరిపోయెడివి. ఇటిక పనివారు, ఓడ బలిజెలు, కమ్మరులు, కాసె పనివారు, దర్జీలు, ముచ్చిపనివారు, వడ్రంగులు 108—ఇట్లైన్నో వృత్తులవారు పలునాడులనుండి పరంగి వాడలకు వలస వచ్చెడివారు. ఈ నాల్గు నెలలును వీరికి చేతినిండ పని. తమ కిచ్చెడి జీతబత్తెములు చాలమిని, బారకాసులయందే నివసింపవలెనను నియమము లేమిని బుడతకీచు సోల్దాదులు (Soldiers) చౌకబారు పూట కూటిండ్లలో అద్దెల కుండెడివారు. బ్రదుకుఁదెరువు చూచుకొన వచ్చిన పరిసరసీమల వృత్తివిద్యల వారికిని ఈపూటకూటిండ్లే ఆహార విహారముల కాశ్రయములుగా నుండినవి. జూదసాలలు, పూటకూటిండ్లు, లాహిరి దుకాణములు అన్నివాడలలో నుండినవి. ఇవి యన్నియు ముప్పూటలును కిటకిట లాడెడివి. ఈ వాడలలో 'బొమ్లేరు బుడతకీచు' పుట్టినది. ఇంటి కంటె గుడి పదిలమని దిగఁబడిపోయినవారు పోఁగా, మిగిలినవారు 'సుగ్గి' చూచుకొని తక్కిన ఋతువులలో తమ తమ వీడులకు తరలి పోయెడివారు. ఈ రాకపోకలు ఏఁటేఁట జరిగెడివి. ఈ రాకపోకల వలనను కొన్ని బుడతకీచు నుడులు ఇరుగు పొరుగు నాడుల బాసలలో వాడుక కెక్కి యుండనగును. 1878 లో జరిగిన ఆంగ్లో—బుడతకీచు గోవా ఒడంబడికలోని ఆఱవ నిబంధన ప్రకారము రెండు ప్రాంతములను కలుపుచు, బళ్లారి, హుబ్బళ్లి పట్టణముల ద్వారమున మార్మగోవా దాఁక ఇనుపదారిని నిర్మింపవలసి యుండినది. 1882 లో ఈ ఇనుపదారి పని మొదలయి 1887 లో రాకపోకలకు తెఱవఁబడినది. మార్మగోవానుండి కొల్లాం, కాజిల్‌రాక్,..

---

107. 1497_1612 ల మధ్య పోర్తుగాలు నుండి భారతదేశమునకు వచ్చిన నౌకలు 806 అనీ, వీని కపితానులు 107 అనీ లెక్కలు. వీనిలో 425 నౌకలు పోర్తుగాలుకు తిరిగి పోయినవి. 285 నౌకలు భారతదేశములోని బుడతకీచు స్థావరములలో ఉండిపోయినవి. తక్కిన 96 ను ప్రమాదములకు గుఱియయి మునిగిపోయినవి. (History of Goa, p 37.)

108. బయలాబట—వీధి నాటకములలో పంచాణము వారి ప్రసక్తి కల ఘట్టములలో మా మండలమున కొంకణ దేశీయులను ప్రవేశపెట్టుట సంప్రదాయము. కొంకణము పోలు కంకణము తెచ్చిన కొంకణాచార్యులని వీరు ప్రశంసితులు.

ధార్వాడ, హుబ్బళ్లి, గదగు, హొసపేట, బళ్ళారి పట్టణముల ద్వారమున ఈ దారి గుంతకల్లు చేరుచున్నది. 1885 నాటికే బళ్ళారి గుంతకల్లు ఇనుపదారి తయారయి యుండినది. బళ్ళారి–హొసపేటల మధ్య నలుబది మైళ్ల ఇనుప దారియును 1877–1878 లో కఱవు పనిగా మొదలయి 1884 నాటికి పూర్తయి యుండినది. గుంతకల్లు–బెజవాడ దారియును 1882 మొదలయి 1893 లో సిద్ధమయినది. గుంతకల్లు నుండి బయలుదేరి, ద్రోణాచలము, నంద్యాల, కంభము, మార్కాపురము, దొనకొండ, గుంటూరుల మీఁదుగా బెజవాడను చేరి, ఆపిమ్మట గుడివాడ మీఁదుగా మచిలీపట్టణము వరకు సాఁగి ప్రాక్పశ్చిమ సముద్రములను కలిపిన ఈ ఇనుపదారి ఆంధ్రప్రాంతమునకును, బుడతకీచు ప్రాంతమునకునుఁ గల సంబంధమును ఇనుమిక్కిలిగా పెంపొందించినది.

బుడతకీచులు కొని తెచ్చిన మొక్కలు, చెట్లు

అరబ్బులు, బుడతకీచులు విచిత్రస్వభావము కలవారు. వీరు అడుగు పెట్టని సీమలు లేవు కాలూనినచోట కనిపెట్టిన క్రొత్త వస్తువులను సేకరించి తదభావకములగు సీమలకు గొంపోయెడివారు 109 పదునారవ శతాబ్దాంతము నాటికి బ్రెజిలులో బుడతకీచుల అధికారము స్థిరపడినది. ఆఫ్రికా, పనామా, పెరూ, బ్రెజిల్, మలయా, మెక్సికో మొదలగు సీమల నుండి తరుగుల్మలతాదులను పెక్కింటిని బుడతకీచులు మన దేశమునకు కొనితెచ్చిరి. అనాస, గొయ్యా (జామి), గోబి (క్యాబేజి), చిలగడదుంప, జీడిమామిడి, పొగాకు, బంగాళాదుంప (ఉరలగడ్డ), బొప్పాయి (పరంగికాయ), మిరెప, మొక్కజొన్న, రామములగ (టొమాటో, ఆవగూడుకాయ), రామాఫలము, వంకాయ, వేరుసెనగ, సీతాఫలము మొదలగునవి బుడతకీచులు తెచ్చిన వానిలో కొన్ని. ఇవన్నియు మన సీమలకు క్రొత్తలు. ఇంచుమించు దక్షిణ అమెరికా ఖండమునకు నిసర్గములయినవి. 1500–1850 మధ్య నివి మన దేశమునకు తేఁబడినవి. వీనిలో కొన్నింటిని బుడతకీచు మాటలతో పెంచితిమి; కొన్నింటికి క్రొత్త పేర్లు పెట్టితిమి. అనాస, గొయ్యా, గోబి, బొప్పాయలు మూర్తితో పాటు తద్బోధక పదమును ఎరవు తెచ్చిన కోవ లోనివి. వానివాని స్వరూప స్వభావ సహవాసముఁమ బట్టి మిగిలిన వానికి నామకరణము జరిగినది. ఇవి విదేశీయుల భావనాశక్తికి మచ్చు

109. Tavernier, Travels in India, Book II, p. 130.

దునకలు, వీనిలో జీడిమామిడి, పొగాకు, మిరప, వేరుసెనగ పంటలకు గల ఆర్థిక ప్రాధాన్యమును వేరుగా వివరింప నక్కరలేదు విదేశీయము లగుట మూలమున కాబోలు వీనిలో చాల పాలు శ్రాద్ధాదికముల నిషిద్ధములు బంగాళా దుంప ఇప్పుడిప్పుడు గదా అందరకు ఆహారయోగ్యముగా అంగీకార్యమగుట. వచ్చిన క్రొత్తలో నిది మ్లేచ్ఛ సాంగిత్యము కలదని యెఱిగి కాబోలు అభోజ్య వస్తువుగా పరిగణితము. బంగాళా రాష్ట్రమున తొలుత దిగుమతి యయ్యె. ఆ సీమలో బాగుగా వేరూని, ఆ పిమ్మటనే ఈ మొక్క తక్కిన రాష్ట్రములకు వ్యాపించినది. ప్రథమ సహవాసమువలన దీనికి 'బంగళాదుంప' యను పేరు అన్వర్థము. 'ఉరలగడ్డ' యన్నది దీని ఆకారము (గుండ్రదనము) ను బట్టి కన్నడిగలు కల్పించిన పేరు. రాయలసీమలో దీనిని 'ఉరలగడ్డ' యని వాడుట కన్నడ ప్రభావము వలన. తెలంగాణమునను, సాగరాంధ్ర మండలముల కొన్నింటను కల 'ఆలుగడ్డ' యను వ్యవహారము ఉర్దూ ప్రభావద్యోతకము మామిడిపండ్లు మనకు సొంతములే యైనను, వానికి అంట్లు గట్టుట మొదలగు నూతన దోహద క్రియల మూలముగా వానిలో క్రొత్త దినుసులను సృష్టించినది బుడతకీచులు[110]. గోవా మామిడిపండ్లు మిగుల ప్రసిద్ధములు. బుడతకీచు బాసలో ఈ యీ తరుగుల్మలతాదిబోధకములగు పదములు నిసర్గములు కాక పోయినను, ఇతరభాషలతో బుడతకీచునకుఁ గల సంసర్గ సంబంధమువలన నివి బుడతకీచునకు సంక్రమించినవి. బుడతకీచుల ద్వారమున మనము స్వీకరించితిమి కావున వీనిని సైతము బుడతకీచు నుడులనుట నిర్బాధము. ఇన్ని మార్గముల బుడతకీచు నుడులు తెలుఁగు నుడికడలిని జేరినవి. ఇట్టి పొడి నుడుల ఉనికి తప్ప, బుడతకీచు సాహిత్య ప్రభావము మనపై పడలేదు.

పూర్వకృషి: విహంగావలోకనము

తెలుగులోని బుడతకీచు నుడులనుగురించి ఇంతకు మునుపు ప్రస్తావించి అంతో యింతో చెప్పినవారు ఈ వ్యాసకర్త యెఱిఁగినంతవరకు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను (1798–1884)[111], డక్టర్ సేబష్టియాన్ రోదల్ఫొ దల్గాదు (1855–

110. Manucci, op. cit., Vol. III, pp. 180, 181.

111. C. P. Boown, Dictionary of Mixed Telugu, Christian knowledge Society Press, Madras, 1854.

1922), గాలెటి (1935)[112], డాక్టర్ చిలుకూరి నారాయణరావు (1937)[113], ఆచార్య గంటి జోగి సోమాజి (1947), డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావు (1960, ఈ యారుగురు మాత్రమే. వీరి పరిశీలన వివరణము వక్ష్యమాణము. బ్రౌనుదొర తన మిశ్ర భాషా నిఘంటువున అమారు, ఏలము (యాలం), చెవి(—తాళముచెవి), మరియాన్ను (ఆట), మాదా—పదములను బుడతకీచ నిష్పన్నములుగా పేర్కొనినాఁడు. చెవికి రూపాంతరముగా చూపిన 'శావి'ని ఇటాలియను, బుడతకీచు భాషా సంబంధిగా ప్రదర్శించినాఁడు. I'గమేళా' 'బాతు'—పదములను బుడతకీచు జన్యములుగా నుదాహరించి, వీని చరిత్ర సందేహాస్పదమని కాఁబోలు ప్రశ్నార్థక చిహ్న ముంచినాఁడు 'అల్మారి' శబ్దము నొద్ద ఫ్రెంచి, స్పానిషు, బుడతకీచు భాషాగతములగు జ్ఞాతి, శబ్దముల నిచ్చుటచే దీని మాతృక యిదమిత్థమని నిర్ణయము కాలేదు, మేస్తరి, మేస్త్రి పదములకు ఫ్రెంచి, బుడతకీచులు మూల భాషలుగా చూపబడినవి. న్యాయముగా బుడతకీచు జన్యములుగా పేర్కొనఁదగిన పదము లనేకములు బ్రౌను వివరణమున ఆంగ్ల పరాసు భాషా భవములుగా నిరూపితము లయినవి. కొన్ని ఆరోపముల (entries) యొద్ద ఉర్దూలిపిలో మూలరూపములు కాబోలు ప్రదర్శితము లయినవి. మఱి యీ లిపిలోని మాటలు అరబ్బీ, ఉర్దూ, తుర్కీ, పారసి, హిందూస్థానీలలో ఏ భాషకు చెందినవో నిర్ణాయకములు కాలేదు కొన్నిటి అర్థనిర్ణయము అసంపూర్ణము. ఆయా ఆరోపముల క్రింది ఉదాహరణములు చూడనగును ఈ వ్యాసమున కనుబంధమగు పద పట్టికలో నుట్టంకితములయిన అనేక పదములకు మిశ్ర బౌణ్యమే ముఖ్యమగు ఆకరము. కాని వీని మూలరూపములను బ్రౌను దొర చూపలేదు బ్రౌను దొర రచించిన ఇంగ్లీషు—తెలుగు నిఘంటువులో[114] ఆరోప పదముల అర్థనిర్ణయ సందర్భమున ప్రయోక్తములయిన తెలుఁగు వాక్యములలో దొరలిన బుడతకీచు మాటలు కొన్ని యీ వ్యాసకర్తచే ప్రత్యభిజ్ఞాతము లయినవి గోవా, సింహ

---

112. Galletti's Telugu-English Dictionary, Oxford University Press, London, 1935.

113. Dr. C Narayrna Rao, History of Telugu Language, 2 Vols, Andhra University publication, 1937

114. C. P. Brown, English-Telugu Dictionary, Revised by M. Venkataratnam, 1895.

శములలో క్రైస్తవ మతాధిపతి (1884-1906) గను, లిజ్బాను విశ్వ విద్యాలయములో సంస్కృతాచార్యుడు (1906-1922) గను ప్రసిద్ధి నందిన డాక్టర్ దల్గాదు బుడతకీచు బాసలో రచించిన 'ఆసియా భాషలలోని బుడతకీచు పదముల ప్రభావము' (Influencia do Vocabulario portugues em Linguas Asiaticas) అను ఉత్తమ పరిశోధక గ్రంథము పోర్తుగాలులోని కోయింబ్రా విశ్వవిద్యాలయమున ముద్రితమయి లిజ్బాను నగరములోని వైజ్ఞానిక పరిషత్తు (Academy of Sciences) పక్షమున 1913 లో ప్రచురితమయినది. 'Influence of Portuguese Vocables in Asiatic Languages" అను పేర దీని ఆంగ్లానువాదము గైక్వాడు ప్రాచ్యగ్రంథమాలలో 1936 లో వెలువడినది[115]. డాక్టర్ దల్గాదు పూర్వులు కొంకణ దేశీయులయి, దేశాయి కుటుంబమునకు చెందిన బ్రాహ్మణులు; బుడతకీచుల రాకతో క్రైస్తవమును స్వీకరించినవారు. దల్గాదు కొంకణి, మరాఠి, గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, హీబ్రూ, సంస్కృత భాషలలో మహాపండితుడు. బుడతకీచు మూలములుగను తత్ప్రభావితములుగను దల్గాదు గ్రంథమున ఆంధ్రభాషా గతములుగా డెబ్బదియేడు పదము లుదాహృతములయినవి. వీనిలో పదునొకండింటి చరిత్ర వివాదగ్రస్తమని సూచితము. తక్కినవానిలో అస్పత్రి, కనాతి, పోలీసు, రసీదు మొదలగు వానిని ఆంగ్లభవము లనుట యుక్తము. ఆయా (= దాది), కాప్పిరి (= కాఫర్), తురంజా (= దూదినిమ్మ), నిమ్మ, సాపాసు, పింగాణి మొదలగునవి బుడతకీచు మాటలు కానేకావు. గలన్ (= gold lace), సపాథ్ (= పాదుక)—వీనికి ఆకరములు చిక్కలేదు. తెలుగునాట మాండలికములుగా ఏప్రాంతమునందైన వీనికి వ్యవహారముకలదేమో? 'బాతు' విషయములో శంకకు కొంత తావుకలదు. ఇయ్యదాముక్తమాల్యదలో ప్రయోక్తము. డా. దల్గాదు పట్టికలలోని అనాస, అమారు, అల్మారు, ఆన, ఇస్త్రి, ఏలము, కలపతి, కాతరుసు, కాతలిక్, కామరా, కుమాందన్, కుంబాద్రి, కుసిని, కోపా, కోమాను, చెవి, జన్నలు, తారము, తువాల, నొవేనా, పయాలు, పరంజు, పాదిరి, పాపు, పాన్కా, పీత (= నాడా), పీపా, పురోయి, పేనా, బంకటి, బత్తేరి, బసి, బాల్ది, బిస్కోతు, బురుమా, బొత్తాము, బోడమన్నా, మయోరు, మరియాన్న (ఆట), మాదిరి (= ఒక దినుసు పేక),

---

115. Translated into English with notes, additions and comments by Prof. Anthony Xavier Soares.

మెలాము, మేజా, మే (జోడు), వైను, సక్రీస్తు సగ్గు, స్పీరితుసాంతు—లను బుడతకీచు నుడులుగా అంగీకరింపనగును. 'బుడతకీచులలో భారత దేశమునకు చిరకాల సంబంధ ముండినను 'కమీజా', 'కుశిని' (—వంటయిల్లు) ఈ రెండే రెండు బుడతకీచు పదములు తెలుగున నిలచిన వని గాలెటి నిర్ణయము 116. డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు తమ ఆంధ్రభాషా చరిత్రము మొదటి సంపుటము 618-619 పుటలలో తెలుగులో 34 బుడతకీచు పదము లున్నట్లుగా చూపిరి ఇందులో కటారి, కాఫి, చదర, తపేలా, మఱక (= మచ్చ) యీ యైదును బుడతకీచు మాటలు కావు. ఈ పట్టికలో బుడతకీచు పదములుగా పేర్కొనబడిన అనాస, అమారు (త్రాడు), అల్మారా, ఇస్త్రిరి, కమీజు, కాఫి, గోదాము, తపేలా, తురుపు, తువాలు, పాదిరి, బిస్కోతు, బొత్తాము, బొప్పాయి, సగ్గు—ఈ పదునైదిటికి అదే సంపుటమున వేర్వేరు పుటలలో వేర్వేరు మూలములు ప్రదర్శితము లయినవి. అవి ఇవి.

1. అనాస — బుడతకీచు (పుట. 618)
   హిందీ (పుటలు. 592, 594),
   పారసీ (పుట. 592).
2. అమారు (త్రాడు) — బుడత (పుట. 618).
   హిందీ (పుట. 593),
3. అల్మారా — బుడత (పుట. 618).
   హిందీ (పుట. 595).
4 ఇస్త్రిరి — బుడత (పు. 618),
   హిందీ (పు 595).
5. కమీజు — బుడత (పు. 618).
   అరబ్బీ (పు. 580).
6. కాఫి — ఇంగ్లీషు (పు 605, 6?7)
   బుడత (పు 618).
7. గోదాము — బుడత (పు. 618),
   ఇంగ్లీషు (పుటలు. 612, 616).

116 Galletti, op. cit., pp. 55, ?9.

8. తపేలా హింది (పు. 595).
బడగ (పు. 618),
9. తురుపు బడగ (పు. 619).
ఇంగ్లీషు (పు. 617).
10. తువాలు బడగ (పు. 618).
ఇంగ్లీషు (పు. 616),
11. పాదిరి బడగ (పు. 618).
ఇంగ్లీషు (పు. 617).
12. బిస్కోతు బడగ (పు. 618, పుట అడుగున నుండి రెండవ పంక్తి)
ఇంగ్లీషు (పు. 618, పుటమీఁది నుండి ఎనిమిదవపంక్తి)
13. బొత్తాము బడగ (పు. 618),
ఇంగ్లీషు (పు. 616),
14. బొప్పాయి బడగ (పు. 618).
హింది (పు. 592, 594).
15. సగ్గు (బియ్యము) బడగ (పు. 618),
హింది (పు. 581).

'కాఫీ'ని ఆంగ్ల సమముగను 'కటారి', 'తపేలా' లను హిందీ భవములుగను చూపుట యుక్తము. చదర సంస్కృతమునందలి 'చతురస్ర' శబ్ద సంబంధియేని, 'చత్వర' శబ్ద సంబంధియేని కానగు మచ్చ మఱకలు శుద్ధ ద్రావిడ పిండములు. మసక, మసి, మాపు, మాయు, మాసిన పదవర్గమునకు మూలమగు ప్రాచీన ద్రావిడ మచ్ ధాతు నిష్పన్నము మచ్చ. మఱచు, మఱపు, మఱుగు, మఱువు—మొదలగు పదముల కోవకు చెందినది మఱక. తక్కినవి బడగకీచు పదములు. బడగకీచు బాసలోని గుణింతపు సంప్రదాయములు మనకు క్రొత్తలగుటచే లిప్యంతీకరణమున శ్రీ నారాయణరావుగారి వ్రాఁతలలో కొన్ని చోట్ల తబ్బిబ్బు కలిగినది. ఇవి అచ్చు తప్పులో, అసలు తప్పులో చెప్పలేము కోవె, గ్రాదె, చావె, పాద్రె, బాల్దె—ఇట్టి ఏవంతోచ్చారణముగాని, కనొ, బిస్కోయ్‌తో ఇట్టి ఒదంతోచ్చారణముగాని బడగకీచులో లేదు. వీనిని కోవి, గ్రాది, షావి-పాద్రి బాల్ది, కొను, బిష్కోతు—అని క్రమముగా ఇదువంతములుగా ఉచ్చరించుట బడగకీచు భాషాసంప్రదాయము. 'కమీజు' కు 'చమీప' అనియు 'చదర' కు

'చదెయ్‌ర' అనియు మఅక (= మచ్చ)కు 'మార్చ' యనియు మూలరూపములు ప్రదర్శితములు. బుడతకీచులో వీనిని (Camisa, cadeira, marca) అని ఇట్లు రోమక లిపిలో వ్రాయుట వాడుక. బుడతకీచులోని ఉచ్చారణ మర్యాదల ప్రకారము 'C' అను లిపిచిహ్నము ఆంగ్లములోవలె 'క', 'స' అని రెండు ప్రత్యేక వర్ణములకు పరస్పరపరిపూరక (Complementary) సంకేతము. అనగా ఈ రెండువర్ణములను పరస్పర వ్యావృత్తిగా 'C' అను లిపిచిహ్నముచే ఉచ్చారితములు. తాలవ్యేతరస్వరములు పరముగా నున్నచో 'క' వర్ణముగను తాలవ్యస్వరూపములు పరముగా నున్నచో 'స' వర్ణముగను ఈ 'C' ఉచ్చరితము కావున పూర్వోక్తపదములను కమీజా, కదేరా, మర్కా అని ఉచ్చరించుట శాస్త్రపద్ధతి. స్త్రీల పడక ఉడుపు, లోకొంగు, మొలగుడ్డ అను నర్థములుకల షమీజ్ (Chemise) అను ఆంగ్లపదవాసన వలన 'చమీస' యని పొరపడియుందురని యూహించుట నిరవకాశము. Caderia ను 'చదెయ్‌రా' గా చదువుట శబ్దమాత్రసారూప్య భ్రాంతి తమిళములో కుర్చి యను నర్థములో కల 'కదిరై' యనుమాట బుడతకీచునుండి వచ్చినది 117. ఇంగ్లీషు భాషలో ఆచార్యపీఠము అనునర్థముకల 'కెథీడ్ర' శబ్దమునకు మూలమగు గ్రీకు 'కైథీడ్ర', బుడతకీచు Cadeira కును అసలు మూలము. బుడతకీచులోని diccanario (dictionary), direccao (direction) పదములలోని 'C' అను లిపిచిహ్నమునకు 'కు' కారోచ్చారణము మాండలిక భేదముల ననుసరించి వికల్పవిధి. తెలుఁగులోని 'చెవి' (= తాళపుచెవి) కి బుడతకీచులోని (chave) మూలరూపము. దీనిని 'చావె' అని పఠించుట తప్పు; బుడతకీచులో 'చ' వర్ణమేలేదు. 'షావి' అని పఠించుట ఒప్పు. తపేలా, తువాల, వెసల–లకు వరుసగా తాల్హా, తొఅల్హా, వసిల అని బుడతకీచు రూపములు చూపిరి. బుడతకీచులోని 'lh' అను లేఖనచిహ్నము. 'l', 'h' అను రెండు లేఖన చిహ్నముల కలయికకు గుఱుతుకాదు. 'l', 'h' ల కంటెను, వీని సంయోజనము కంటెను భిన్నమయిన వర్ణమున కిది సంకేతము. ఆంగ్లభాషలోని 'million' పదమునందలి 'lli' భాగపు సదృశోచ్చారణ మిట వివక్షితము. ఒలాందులు (డచ్చివారు) అను పదమునకు బుడతకీచు మూలముగా 'హొల్లెన్డెజ్'

---

117. Tamil Lexicon, Vol. II, 714.

ప్రదర్శితము. కాని, బుడతకీచులో 'h' పలుకఁబడదు. ఆచార్య శ్రీ గంటి జోగి సోమయాజిగారు తమ ఆంధ్రభాషా వికాసము 'తెనుఁగునందలి పదజాలము' అను నధ్యాయమున 'పాశ్చాత్య భాషా పదములు' అను ఉపశీర్షిక క్రింద 'పోర్చుగీసు వారే మొదట భారతదేశమునందలి పడమటి తీరమును గాలూఁదిన వారయ్యును వారి నాగరికతా ప్రభావము గాని, భాషా విశేషముగాని నిలువలేదు. తెలుఁగు, అరవము, కన్నడము, అను మూఁడు భాషలయందును అల్పసంఖ్యాకములయిన పదములు నిలిచినవి' అని ప్రతిపాదించి, అమారు, అలమారు, కక్కూసు, కమీజు, జన్నల్, పాదిరి, బాల్చి, బొత్తాము—ఈ ఎనిమిదింటిని బుడతకీచు మాటలుగా పేర్కొనిరి. వీటిలో, ఒక్క 'కక్కూసు' (= మలుగు పెరడు, పాయిఖానా) తప్ప తక్కిన వన్నియు బుడతకీచుమాటలు. ఇది 'కఖుస్' అను ఒళందా (డచ్చి) భాషాపద నిష్పన్నము. కక్కుసు (అనంత; చిత్తూరు), కక్కూసు (బళ్ళారి), కక్కూసు (గుంటూరు), అని దీని మాండలిక రూపములు—'తెలుఁగునగల ఒకేఒక డచ్చి పదమని, ఆంధ్రలోని దక్షిణమండలములో దీనికి విశేష వ్యాప్తిగలదనీ' గాలెటీ వ్యాఖ్యానము [118]. తమిళ మలయాళ కన్నడ నిఘంటువులయందును నిది డచ్చి పదముగా ఉట్టంకితము [119]. ఈ మాట దక్షిణ భారతమునకే పరిమితము, ఉత్తరహిందూస్థానభాషలో మృగ్యము. డచ్చిభాషలో కక్ (kak = మలము) + హుయిస్ (huis = ఇల్లు, స్థానము) అను పదములచే నేర్పడిన సమస్త పదమిది. ఇట్లే పక్ (pak = బంగీ, మూట) + హుయిస్ = పఖుస్ = పార్సిల్ ఆఫీసు, బఖుస్ (bakhuis = bake house) మొదలగు సమస్త పదములు ఒళందా (డచ్చి) భాషలో ఏర్పడినవి [120]. డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావుగారు తమ తెలుగు సాహిత్యము పై ఇంగ్లీషు ప్రభావము అను పరిశోధక వ్యాసమున మిశ్రబ్రౌణ్యము నాధారముగాఁగొని, గమేళా, చెవి, బాతు, మరియాప్ప (ఆట), మేస్త్రి పదములను బుడతకీచు మాటలుగా ఉదాహరించి బ్రౌను అభిప్రాయములను ఆమ్రేడించిరి. బుడతకీచులకును భారతీయులకును గల చారిత్రక సంబంధములను శ్రీ వీరభద్రరావుగారు విస్తరించి వ్రాసిరి.

---

118. Galletti, op. cit, pp. 51, 79.

119. తమిళ. కక్కూచు (సు); డచ్చి—కఖుస్. (Tamil Lexicon Vol. II, p. 634) మల. డచ్చి. కఖుస్; కన్నడ. కక్కూసు; కక్కూసు; డచ్చి లేక డేనిష్.

120. తెలుగులోని డచ్చి నుడులను గూర్చి మరియొక వ్యాసమున.

ఇండో-బుడతకీచు భాషను గుఱించి మొదట ప్రస్తావించిన తెనుఁగులలో శ్రీ రావుగారే ప్రథములు 121. ఇంతే వీరి కృషి.

ప్రస్తుత పరిశీలనమునందలి మొత్తము పదములు : 150

వీని రూపాంతరములు : 152.

అనాస, అలమారు, ఇస్త్రీ, ఏలము, కాజా, కుంపిణి, క్రీస్తు, పరంజు, పాదిరి, పిరంగి, పీపా, పేనా, మే (జోడు), మేస్త్రీ, మోస్తరు మొదలగునవి సర్వాంధ్ర వ్యవహారములు. అల్పి, కమీజు, కానా, గుదామ్, బాల్చి, బొత్తాయి, సోల్దాదు మొదలగునవి విశాఖ, శ్రీకాకుళములకు వ్యావర్తకములు. ఆన. ఒళందా, కమాను, కోస్తా, గమేళ 2, గోదాము, తురుపు, బంకు, బాల్దీ, బొత్తాము, బొప్పాయి మొదలగునవి సాగరాంధ్రమున ప్రచుర వ్యవహారము కలవి. అనారస, గడంగు, గొయ్యా చప్పాతి (కల్లి) జొన్నలు, బిస్కత్తు, సోడిదేవు మొదలగునవి రాయలసీమకు విశిష్టములు.

పదస్వభావ విభజనము

సైనిక సంబంధములు : ఆర్మదా, ఓకు, కపితాను, కమాను, కుమందను, పటాలము, బత్తేరి, బారకాసు, బొంబాసు, మయూరు(లు), సార్జంతు, సోల్దాదు మొ.

నావికపదములు : అమారు, అర్యా, (చేయు), కామరా, కుంపాసు, కూర్వ, గమూతు, గమేళా 1, గావాయి, బుడుదు, బొంబా, బోడిద, బోయా, ముర్ర, రంబ్రాలు, మొ.

క్రైస్తవ మతపరములు : అపొస్తలు, ఏనోబు, కాతోలికు, కిరూబు, కుంబాద్రి, కోపా, క్రీస్తు, క్రీస్తువు, నొవెనా, పాదిరి, పాపు, మరియ మాదా (గుడి), సబ్బాతు, స్పిరుతు సాంతు, మొ.

121. Dr. K. Veerabhadrarao, Influence of English on Telugu Literature, pp. 5,20.

గృహనిర్మాణ సంబంధములు : కానా, గమేళా, 2. చెవి, జన్నలు, పయాలు, పరంజు, బొరిగ, మాదిరి, మేస్త్రీ, రీపా (లు), మొ.

ఉడుపులు : ఇస్త్రిరి, కబాయి, కమీజు, కాజా, తువ్వాలు, బొప్పళి, బుర్గతకాళి, బొత్తాము, మే (జోడు), మొ.

వర్తకము : ఏలము, కుంపిణి, కోస్తా, గిడ్డంగి, గోదాము, తారము, బంకు, రతులు, మొ.

వ్రాతకోతలు : ఆలపనాళి, అల్పి, కాతరసు, పురోయి, పేనా, మొ.

మొక్కలు, చెట్లు : అనాస, గొయ్యా, గోబి, బిలిబిలి, మెలామ, సాంత్రా (నారింజ), మొ.

గృహోపకరములు : పీపా, బసి, బాల్దీ, బొంబాయి, మేజా, వెసల, సబ్బు, మొ.

చరిత్ర ప్రసిద్ధములు : జామొరిన్, జెంతు, పరంగి, పురతకాలు, శాంతోము, మొ.

ఆటలు : కుదేలు, బేస్తు, మరియాన్ను, (ఆట), మొ.

ప ద ప ట్టి క

1. అగతమ్మ : రూ. ఏగాత్తా, యాగాత (గాలెటి, 137) చెన్నపట్టణము పరిసరముల క్రిందితెగల కులదైవ మగు ఒక గ్రామదేవత; St. Agatha.

2. అగస్తు : రోమక పంచాగములో ఎనిమిదవు మాసమగు 'అగస్టు < బు. అగోస్తు స్పా. అగోస్తు—ఇం. ఆగస్టు (టన్ను, టాప్, టిన్, టేప్, టోల్, ష్టన్, ష్టేషన్, ష్టోరు, ఔంట్, కోట్, లేట్, ఫష్ట్ (తారీఖు), పోష్టు—ఇట్లు ఇంగ్లీషు పదములను దాదాపు మూర్ధన్య వర్ణ ఘటితములుగా ఉచ్చరింతుము; బుడతకీచులోని 't' వర్ణోచ్చారణము మన దంత్యవర్ణోచ్చారణమునకు దగ్గఱ; అందుకే 'అగస్తు'ను బుడతకీచు సంబంధిగా పేర్కొనుట ఉచితము. 'పదునెనిమిది వందల తొంబది

యెనిమిది క్రీస్తుశకము మాసమగ స్త్రిర్వదిమూడు తేది..................
అను వసురాయల చాటువులోని 'అగస్తు'ను 'అగస్తి'గా చదివి శ్రీ వెంకటరావుగా రిద్దానిని ఆశ్వయుజ మాసమను నర్థములో సంస్కృత పదముగా ప్రదర్శించిరి. (చూ. శ. ర. అను., పు. 2)

3. అంకారించు : క్రి. ఓడదావయెత్తిపోవు. < బు. అంకోరా; కోస్పా. అంరా; ఫ్రె. అఁక్ర్; డచ్చి. అంకర్ (హిం.శ.ర.)

అనప (సూది) : చూ. అలపనాతి (బ్రౌ.ఇం.తె., 904) గుండుసూది (ఇట- 'ల'-'న' గా మాఱినది; ఈ రెండు వర్ణములును దంతమూలీయములు; 'న' స్పర్శానునాసికము, 'ల' పార్శ్వికాంతస్థము).

అనానాసు ; చూ. అనాస (మిశ్రబ్రౌ).

అనారస : చూ అనాస (అనంత). బెంగాలి. అనారసి. విఙ. అనాస రూపుగా నుండు; అనరస అనియు కొందఱు.

4 అనాస : రూ. అనానాసు, అనారస, అనాసపనస, అనాసపనాస, అనాసు, (కృ., గుం., గో.) మొగలిపనస: Ananas sativus (Flora of Madras, III, P. 1046). (యయాతి. 1_36: హంస. 4_134) < బు అననాష్; స్పా. అననా, అననాస్, ఫ్రె. అననా; డచ్చి. అననస్; పెరూవియన్-ననస్; బ్రెజిలియన్-ననస్; అరబ్బీభాషాముఖమున తెలుఁగును జేరిన బ్రెజిలియన్ పదమని MAMP, Vol III p. 28;- పారసి (ఆంభాచ, 592);- దే.వి (శ.ర; బ్రౌ రి.); హిం. (బ్రౌ); మెక్సికో, పనామా, బ్రెజిల్ మొదలగు ఉష్ణమండల ప్రాంతములలో ఎక్కువపంట; అక్బరు కాలమున బుడతకీచులు దీనిని మలక్కా దీవుల నుండి తెచ్చి మొదట బంగాళమున ప్రవేశపెట్టిరఁట. (MAMP, Vol. III, p. 28); 1594లో బుడతకీచులు బంగాళరాష్ట్రమునకు తెచ్చిరని జార్జివాట్ (George Watt, The Economic products of India Vol. I, P 236): దక్షిణ భారతమునను, బంగాళమునను విరివిగా పైరు చేయబడుచుండినట్లు వెనిషియను వర్తకుడు నికోలాయ్ మనూచి (1653_1708) వ్రాఁతలు (Storia Do Mogor,

Vol. III-p. 183); అనాస ఆకులనుండి తీసిన తెల్లనినార చేపల వలలకు, గాలము త్రాళ్లకు ఉపయోగించును. నీటిపై తేలును; తడి అంటదు; త్వరగా తెగదు; పండు(అం. వాచ., కాంబెల్, మిశ్రబ్రౌ.)

అనాసపనస : చూ. అనాస (అం. వాచ., గో.) అక్కాపచ్చని చిలుకవచ్చె, కోందామా? తిందామా? అంగట్లో పెట్టుకొని అమ్మదామా' — అనాసపనసపండు'. గోదావరి మండలములో వాడుకలోని ఈ 'పొడుపుకథ' అర్వాచీనమని స్పష్టము.

అనాసపనాస : చూ అనాస (కోరాపుట్టి).

అనాసు : చూ. అనాస (మిశ్రబ్రౌ).

5.అపొస్తలు (లు) : రూ. అపోస్తులుడు. క్రీస్తు ముఖ్యశిష్యుడు; దేవదూత. <బు. అపొస్తోలు; స్పా: అపోస్తోలు; అపొస్తలుడు అనగా పంపబడనవాడు' (యోహాను, అధ్యా. 13); 'ఆ పన్నెండుమంది అపొస్తలుల పేళ్లు ఏవనగా....' (మత్తయి, అధ్యా. 10) 'ఏసుక్రీస్తు అపొస్తలుడైన పేతురు...' (పేతురు. అధ్యా. 1) అపొస్తలత్వము' (అపొస్తలుల కార్యములు, అధ్యా. 1)

అపోస్తులుడు : చూ అపొస్తలు (కర్నూ.)....'అపోస్తులు లోకమునకు వెలుతురు వలె నున్నారు', 'అపోస్తుల చర్యలు'—అని బైబిలు నెల్లూరి ప్రతిలో 'అపోస్తులు' అనుమాట, 'లు' వర్ణాంతమగుటచే అది బహువచన ప్రత్యయముగా భ్రాంతిపడుట జరిగినది.

6 అమారు : ఓడలంగరుమోకు, 'నావ లంగరులో నున్నప్పుడు కదలకుండ నుంచు పెద్ద బలమైన త్రాడు' (అంభాచ 624) < బు. అమర్ర మోకు; స్పా. అమర్ర; దే. వి. (శ. ర., అం. వాచ.)— హిం. (అంభాచ. 593); త్రాడు (మిశ్రబ్రౌ); చూ. అమారు త్రాడు (అంభాచ. 618, చూ. అమారు.

అరమర : చూ. అలమారు (శ్రీకా.)

అరమార : చూ. అలమారు (గుం)—బు. అర్మారి.

అరమాలు : చూ. అలమారు ('దుల్పా' అను ఆరోపముక్రింద మిశ్రబ్రౌ. పు. 54, చూ.).

7. అరుగోలా (లు) : ఇనుపకడియము (లు) నావకు రెండు ప్రక్కలను పైకి వచ్చునట్లు అమర్చఁబడిన స్థలములు; వీనిలో బెజ్జములు పొడిచి 'నేజా' పటాలు ఉంతురు. (అంభాచ., 624) < బు. అర్గోలా–పెద్ద ఇనుప కడియము; స్పా. అర్గోలా

8. అర్యా (చేయు) : క్రి ఓడతెరచాపలుదించు (అంభాచ, 624) < బు. అర్జియార్–తెరచాపలుదించు; స్పా అర్జియార్; (బు. లో–అర్, ఈర్–ఏర్ లు క్రియాధాతు సూచక ప్రత్యయములు. బు షూవా–వర్షము, షోవేర్–వర్షించు); చూ. ఇస్త్రిరి

9. అలపనాతి : రూ అనప (సూది). అల్పి. గుండుసూది (బ్రౌ.ఇం.తె. 904)– బు అల్ఫినేతి–గుండుసూది; స్పా అల్ఫిలేర్.

అలమర : చూ. అలమారు (గుం.).

అలమార : చూ. అలమారు; బీరువలు–ఇం. అల్మైరాబీరో–అలమర లుండే బీరువాలు (శ. ర. అను.)

10. అలమారు : రూ. అరమర, అరమార, అరమాలు, అలమర, అలమార, అల్మార, అల్మారా, అల్మారు (అనంత, చెంగల్పటు). సామగ్రుల నుంచుటకై గోడలో ఏర్పఱిచిన బీరువా, గోడబీరువా < బు. అల్మారి అర్మారి; స్పా. అల్మారియో; ఫ్రె. అర్మ్వార్–ఇం. శ. ర. అను. పు. III: భారతీయ భాషలనుండి 1878లో ఇంగ్లీషునజేరిన పదమని శ్రీ జి. వి. సుబ్బారావుగారు (Indian words in English, p. 123)

అల్పి : చూ. అలపనాతి (కోరాపుట్టి. విశా., శ్రీకా.) గుండుసూది; ఁపిన్ను చూ. అల్పి. రూపనిర్మాణములో ఈ 'అల్పి పిన్ను' అనునది అగ్గి నిప్పు, గేటువాకిలి, స్లేట్ పలక మొ వానితో సదృశ్యము.?–హిం. ఆల్పిన్, అల్పిన్.

11.అల్మాని : (మిశ్రబ్రౌ.) ఒకానొక జర్మను దేశీయునిచే పోత పోయబడిన దని ఊహింపబడిన రూపాయి నాణెము, మునుపటి రూపాయి.—బు. అలేమానా, అలేమాన్—జర్మను దేశీయము; ఇర్మాను (King Duarte's Leal Conselheiro) జర్మనుదేశ సంబంధి; స్పా. అలేమానా—జర్మనుదేశ సంబంధి; అలేమానీయా — జర్మను దేశము; ఫ్రె. అల్‌మఞ్; కన్నడ. అలేమాని: ఉర్దూ, అల్మానియ—జర్మనీ దేశము; బెంగాలి. ఏలేమాన్.

అల్మార : చూ. అలమారు (మిశ్రబ్రౌ.) ఈడ్పులుగల పెద్ద పెట్టె; ంకోనేరు' నాలుగుపక్కల మెట్లుగల దిగుడుబావి, తిరుకోశము.

అల్మారా : చూ. అలమారు (కృ., గో., శ.ర., మిశ్రబ్రౌ., MAMP. III, 20) సొరుగులుగల యెత్తయిన కట్టుపెట్టె; హిం. (శ.ర. 'అంభాచ.' దిగవల్లి వేంకటశివరావుగారి వ్యవహారకోశము. పు. 240)

అల్మారు : చూ. అలమారు; హిం. (శ. ర., గాలెటి, ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము).

12.ఆన : (కృ., గుం., గాలెటి, మిశ్రబ్రౌ.) క్రీస్తుశక సూచమగు పదము—బు. ఆను (క్రీస్తు) ప్రభువు స్మృతి సూచకమగు శకపరిగణనము, సంవత్సరము; బుడతకీచుల శకపరిగణనములో ఈమాట విరివిగా వాడుక (చూ. గోవా శాసనములు. History of Goa): ఆణు; ఫ్రె. అనే—ఏఁడు; లాటిన్ anno కు వికృతియని బ్రౌను (బ్రౌ.రి., 115); అన్యదే. ఆని (అం. వాచ., 256; శ.ర. అను., 98).

13.ఆరిమాని : ఉ. ఆర్మాణి (అనంత). పియ్యానిపెట్టె, హార్మోనియము—బు. ఆర్మోనీ, స్పా. అర్మోనియో, ఫ్రె. ఆర్మోనీ.

14.ఆర్మదా : (టౌట్, బ్రిటీషు చరిత్రము, ఆంధ్రామవాదము) యుద్ధనావ.—బు. అర్మాదా; స్పా. ఆర్మాదా—సేన, నౌకాదళము; అర్మా—ఆయుధము; డచ్చి. అర్మద—నౌకాదళము; బెంగాలి. హార్మాద్—బుడతకీచులదోంపిడి ఓడ; —బు. అర్మాదా—అరబ్బీ 'అల్—మదీ—య' అని Hobson Jobson. p. 15.

15.ఇస్త్రి : రూ. ఇస్త్రీరీ, ఇస్త్రీ (అనంత., కృ, గుం., గో.) బట్టలను నిప్పులపెట్టెతో నునుపుచేయుట.—బు. ఎష్తిరాల్, క్రి. విస్తరించు; వ్యాపించు; చాచు; స్పా. ఎస్తీరార్; స. క్రి. లాగు; విస్తరించు; బట్టలను నునుపుచేయు; ఎస్త్రీకోన్, వి. లాగుట; ఫ్రె. ఎతీరే, స.క్రి. లాగు, గుంజు;—హిం. (శ.ర., బ్రౌ.రి., గాలెటి, ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము); మల. ఇస్త్రి—హిం. (గుండర్టు, 115); కన్నడ. ఇస్తరి, ఇస్త్రీ—హిం., మరా. (కిట్టెల్, 202) తమిళ. ఇస్తిరి—ఉర్దూ (TL, 373)? సం. స్తృధాతుసంబంధి.

ఇస్త్రీరీ : చూ. ఇస్త్రిరి (దేశ్యమని., శ. ర. అను.,).

ఇస్త్రీ : చూ. ఇస్త్రిరి (ఆం వాచ.)

ఏగాత్తా : చూ. అగతమ్మ. 'చెన్నపట్టణములో ఏగత్తా అనే దేవత..........' (బ్రౌ. ఇం. తె., 444).

16.ఏలము : రూ. యాలం, వేలము, వేలాం. అమ్మకములో నొక విధము; పేకాటలోని ఒకఆట (Auction bridge) (పలనాడు)—బు. లేయ్‌లాం,—హిం. శ.ర., అం.భాచ; ఆం.వాచ., సూ. ని., ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము; దేశ్యమని బ్రౌ.రి., 201; తమిళ., మల. ఏలం—బు ; కాని, దీనిని బుడతకీచుమాట అనుటకు ఉపపత్తులు చాలవు తక్కిన రోమాన్సు భాషలలోగాని, బుడతకీచునకు సమీపమాతృకయగు 'లాటిన్' లోగాని ఈమాటగాని, ఏతత్సంబంధి పదసముదాయముగాని కానరాదు; అరబ్బీ లీలాం—ఏలము, ఇల్—ఇ—లామ్ = ప్రకటన—దీనికి మూలము కానగునని బ్రౌను (మిశ్రబ్రౌ., 101).

17 ఏసోబు : రూ. హిస్సోప్పు. (బై) యూదీయుల సోమలత; —బు. ఇసోపి; స్పా ఈసోపు; 1841లో కలకత్తాలో అచ్చయిన పరిశుద్ధ గ్రంథము—సంస్కృతానువాదమునందును 'ఏసోబు' అనియే కలదు.

18 ఒలందా : రూ. ఒలాందా. ఒగాందా, వలందు (బాజు), వలందేజు, వళందదచ్చి (జాతి.—దేశము.—భాష) (రంగరాజ్, పీఠిక 58);—బు ఒలందా,

ఒలందేష్; స్పా. ఒలందా; ఫ్రె. హొలందె; ౦దిబ్బ (గా లెటి 130); °పాలెము మచిలీపట్టణములో రజకులెక్కువగా నివసించుపేట.

ఒలాందా : చూ. ఒలందా (మిశ్రబ్రౌ):—ఇం. హాలండ్ (శ. ర. అను 112); ౦కమలము డచ్చి పద్ధతిలో చెక్కబడిన వజ్రము; వజ్రములసానకు 'ఒలందా' దేశము ప్రసిద్ధి; ౦మల్లె ఒకదినుసుపువ్వు; °వాండ్లు బ. వి. డచ్చివారు (మిశ్రబ్రౌ)

ఒళాందా : చూ. ఒలందా.

19. ఓకు: దుర్భిణీయద్దము (శ ర. ఆం. వాచ., మిశ్రబ్రౌ). — బు ఓకు లుష్—కంటియద్దములజోడు; ఓకు—వివరము; పుటాకారము; స్పా. ఓకూలాక్ - కంటి యద్దము ఫ్రె. ఆకూలెర్ 'ఓకులు' లోని 'లు'ను బహువచన ప్రత్యయముగా భావించుటచే 'ఓకు' సిద్ధించియుండనగు. చూ. రతులు.

20. కంత్రాటు : పనిచేయుటకు ఒడంబడిక (అనంత) —బు. కంత్రాతు; స్పా. కంత్రాతా-ఒడంబడిక. ఒప్పందము; ఫ్రె. కాంత్రా; ఇం. కంట్రాక్—ఇం. వి. (శ. ర. 190).

21. కాతోలికు : పోపు అనుయాయులగు క్రైస్తవులశాఖ (బ్రౌ, ఇం. తె.) -బు. కతోలీకు; దల్గాడ (పు. 88) 'కథోలికు' అను తెలుగు నుడిని ఉదాహరించినారు; ఆ పక్షమున నది ఆంగ్లభవము.

22. కందీలు : రూ. కానదీయలు. దీపము, ప్రమిద (నిజామాబాదు) — బు. కందీల్—దీపము; స్పా కందేలా; కందీల్—చమురుదీపము; ప్రమిద; ఫ్రె. షాందెల్—పాదిరి గుడి దీపము; డచ్చి. కందెలార్—క్రొవ్వువత్తి.

23. కపాతు : రూ. కబాతు విత్తులు తీసినకోడె; కచ్చితీసినకోడె (మిశ్రబ్రౌ.)— బు కపాదు—కచ్చి (విత్తు) తీయుట : కపార్.—కచ్చితీయు; స్పా. కాపాదోర్; క్షాపాదురా—కచ్చితీయుట (బుశతకీచులోని 'p' ఇంగ్లీషులో కంటే స్ఫ్యానస్ఫోటనముకలది).

కపాయి : చూ. కబాయి (మిశ్రబ్రౌ.)

24. కపితాను : రూ, కప్తాను. సేనాని; అధికారి; వ్యవహర్త (రంగరాట్. పీఠిక. 59 : రంగా. 2-75).—బు. కపితాను—దళవాయి, పడవాలు; స్పా. కాపీతాన్—దళవాయి; కాపీతానీయా — దళవాయి తనము; ఫ్రె. కపీతన్—ముఖ్యుడు; ఏలిక, యజమాని; డచ్చి. కప్టేన్; మల. కప్పితాన్—బు. (గుండర్టు 204); పరాసుభాషా పదమని కొందఱి తలంపు. పదనాఱవు శతాబ్దము నాటికే తూర్పిండియా దీవులలో ఈ పదమునకు వ్యాప్తియున్నట్లు ఆధారము లున్నవి. పదునేడవు శతక మునగాని పరాసువారు రాలేదు. కావున, నిది పరాసు భాషనుండి వచ్చినదనుటకు బలముచాలదు. చారిత్రకముగను, ధ్వనిపరిణామ సూత్రము ప్రకారముగను ఈ పదము బుడతకీచు భాషాజన్యమనుట సయుక్తికము.

కప్పా : చూ. కమీజ (కదిరితాలూకా, అనంత.)

కప్తాను : చూ. కపితాను. ఓడకప్తాను (బ్రౌ. ఇం. తె. 147) : (ఆం భాచ. 618),

25. కప్పు : ఒకదినును పాదిరి ఉడుపు (క్రైస్తవజన వ్యవహారము)—బు. కాపా—పాదిరి అంగీ : స్పా. కాపా—దుప్పటి, పచ్చడము.

కబచ : చూ. కమీజు (హోసూరు తాలూకా, సేలము).

కబాతు : చూ. కపాతు (మిశ్రబ్రౌ) °కోడి—విత్తులుతీసినకోడి.—హిం. (బ్రౌ. రి., 245).

26. : కబాయి : రూ. కపాయి, కబాయీ, కబ్బా, కబ్బాయి, ఖబ్బాయి—తురకలు తొడిగే ఒకచొక్కా ; శృంగారార్థము అన్నిటిపైన వేసికొనుచొక్కా—(మిశ్రబ్రౌ;) దే. వి. అంగి (శ. ర., కళా. 5-179; దశా. పీఠిక 42) బు. కబైయ — ప్రాచ్యసీమలలోవాడు నిలువుటంగి (హిం. బ్రౌ. రి, 245; ఆంభాచ., 592).

కబాయీ : చూ కబాయి (హంస, 5-360).

కబ్బా : చూ. కబాయి. 'చేతులులేని పొట్టికోటు?' — అరబ్బీ (ఆంభా. చ., 591).

కబ్బాయి : చూ. కబాయి. (ద్వి. పరమ., పు. 482).

27. కమాను: అన్యదే. వి. ప్రయాణము (శ. ర., 211; ఆం. వాచ) °పోవు- ప్రయాణముచేయు (బ్రౌ. రి. 247)-బు. కమీన్యార్ — పయనించు; స్పా. కమీనో — ప్రయాణము; మార్గము; ఫ్రె. కామాఁ — దండయాత్ర;— ఫ్రె. (మిశ్రబ్రౌ., బ్రౌ రి., ఆం. భా. వి.)

28. కమిస్సెరి : సైనికోద్యోగి. 'కమ్మిస్సెరీ దొరలు' (చెన్నపురీ., పు. 75 'కమిస్సెరీజెనరలు' (పైది. 7) — బు. కమిసార్సెరి; స్పా. కమీసారీ- పోలీసు అధికారి; న్యాయాధిపతి.

29. కమీజు : రూ. కప్పా, కబచ, కవిసె. లోనధరించుచొక్కా; చొక్కా; (విశా., శ్రీ కా.)— బు. కమీజా (Portu. camisa)బుడతకీచులో అజ్మధ్యము (inter vocalic) గా 's' అనులిపి చిహ్నము 'Present' లోని 's' వంటి ఉచ్చారణము కలది); స్పా. కమీసా — చొక్కా; కామీసేరియా-చొక్కాలమ్ము దుకాణము; ఫ్రె. కమీజాల్ — రైక; డచ్చి. క్రమీజోల్ — స్త్రీల కూర్పాసము; - ఇం. (శ. ర.,-ఆం. వాచ.)— బు. (గాలెటి); అరబ్బీ ద్వారమున వచ్చిన బుడతకీచు. పదము (MAMP, Vol, III, p. 121); టర్నర్ నేపాలీ నిఘంటువున 'కమిజ్' శబ్దమునొద్ద బుడతకీచు మూలముగా ప్రదర్శితము (చూ. పు. 75;) మరా. ఖమిస్ — బు.

కమేల : చూ. గమేళా (మిశ్రబ్రౌ.).

30. కర్మాయి : కుంకుమ వర్ణము (మిశ్రబ్రౌ);— బు. కర్మి: స్పా. కర్మేసీ, కర్మిన్;— రక్తవర్ణము; ఫ్రె. కార్మైి ('మై' లోని 'ఎ' మామూలు 'ఎ' కంటే వివృత స్వరము; open or lowel) డచ్చి. కార్మొఇయన్.

31. తలపతి : లప్పము, 'జనపనారను, పీచును కీలులో తడిపి ఓడసందులలో పొడుగుట'; (బ్రౌ. ఇం. తె, 156) —బు. కలాఫాతి; స్పా.

కలాఫాతి: అరబ్బీలోని 'కాలాఫన్' బుడతకీచుద్వారమున భారతీయభాషలో ప్రవేశించినదని Hobson-Jobson, pp. 149.

కవిసె : చూ. కమీజు (కదిరి తాలూకా, అనంత).

32. కాకాతువ్వా : పసుపుపచ్చని జుత్తుగల పెద్దతెల్లచిలుక (ఆంభాచ. 619)— బు.కాకాతూ స్పా. కాకాతూ ఆ; ఫ్రె. కకతొఎస్; డచ్చి. కకెతొ; 'కాకాతూవా' యను మలయా భాషాపదము లన్నిటికి అసలు మూల మని వేత్తల మతము.

33. కాజా (లు) : బొత్తాము (గుండీ)లు తగిలించుటకు చొక్కా మొ. వాని ఎదపట్టి మొ. చోట్లనుండు కన్నము (లు) (అన్నిమండలములు)- బు. కాజా; స్పా. కాహా-కన్నము; పెట్టె; మరా. కాజే—బు కాజా.

34. కాతరుసు: ముదుకకాగితము(మిశ్ర బౌ.) —బు కర్తూషు—ముదుకకాగితము; కర్తాజ్—అనుమతి పత్రము; కాకితము: స్పా. కర్తూచో; ఫ్రె. కర్తూష్: అరబ్బీ. కిర్తాస్—కాకితము; ఒడంబడిక పత్రము.

కానా : చూ. కాను ('కానా గట్టుమీద....' 'మూడుస్థలాల్లో' అను శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి కథ; విశాఖ లో ప్రచురవ్యవహారము.) వంతెన క్రింద నీరు పోవుట కేర్పడిన గొట్టము లేక తూము: వంతెన.

35. కాను : రూ. కానా. 'ఓడతట్టుమీద చేరిననీరు మరల బయటకుపోవుట కేర్పఱిచినదారి' (ఆంభాచ 627) —బు. కాను-గొట్టము; తూము; జలదారి; స్పా కాఞు- పొడుగైన గొట్టము: చిమ్మన గొట్టము; గరాటి

కానుదీయులు : చూ. కందీలు (అనంత) 'కందీలు' 'దీయలు' (= దీవియలు) అను సమానార్థకశబ్దముల కలయికవలన 'కానుదీయులు' అను రూప మేర్పడి యుండనగు.

36 కామరా : రూ. కామిరీ. మాలీము, సరంగులు పరుండు గది; ఇది అమరము (ఓడవెనుక భాగము) దగ్గరనుండును (ఆంభాచ, 627)-బు. కామరా- గది; అర; స్పా. కామారా - ఓడలోని గది; గది; ఫ్రె. షాంబ్రె - గది. భాగము; డచ్చి. కమెర్; ఇటా. కామెర; ఇం. ఛేంబర్.

కామిరీ : చూ. కామరా (ఆంభాచ)

కిరస్తానము : చూ. కిరస్తాను (అనంత). క్రైస్తవ ప్రజాసమూహము; ఇట్లే తురకల సమూహము 'తురకాణ్యము'.

కిరస్తానీ : చూ. కిరస్తాను – ఇం. (ఆంభాచ, 617)౦ చదువుల – పాశ్చాత్య విద్యలు; °పిల్ల–క్రైస్తవులబాలిక; °పోకిళ్లు – సనాతనాచార పరాయణులకు సరిపడని పోకడలు; °వేషాలు–పాశ్చాత్యవేషములు, పాశ్చాత్యరీతులు.

37.కిరస్తాను : రూ. కిరస్తానము, కిరస్తానీ, కిరస్తు. విణ. క్రైస్తవమత సంబంధి; కిరస్తానులు; క్రైస్తవులు. బు. క్రిస్తాను: ఫ్రె క్రేత్యం; దల్గాదు గ్రంథమున 'క్రిస్తన్ను', 'కిరస్తువను' అనునవి తెలుగు రూపములుగా ఉదాహృతములు (చూ. పు. 128)

కిరస్తు : చూ. కిరస్తాను (మిశ్రబ్రౌ)

38 కిరూబు : దేవమాత (బ్రౌ. ఇం. తె. 169). – బు కెరూబిమ్— దేవదూత; స్పా. కేరూబిన్; ఇం. చెరబ్; హీబ్రూ కెరూబ్; అరబ్బీ. కిరుబ్; పారసీ. కరూబి: క్రైస్తవమునకే పరిమితముగావున అరబ్బీ, పారసీ మాటలను మూలముగా చూపుటపొసగదు.

39.కుదీలు : రూ కుదేలు. 'కాకితముల ఆట (పేకాట)లో అయిదుపట్లు పట్టు తాననిచేసే ప్రతిజ్ఞ' (మిశ్రబ్రౌ.)–బు. కొదీల్యు. కొదీలి—పేకాట లోని ఒక పరిభాషా పదము: 'ఓంబ్రి' అను ఆటలో ఆటగానికి ప్రతికూలముగా గెలుపు కలుగుట

కుదేలు : చూ కుదీలు (బ్రౌ. ర. 294) 'ఆదెబ్బతో వాడు కుందేలయిపోయాడు'.

40 కుమందమన్ : దళవాయి; పైనికోద్యోగి— బు. కొమందంతి; ఫ్రె. కోమాందాం;–ఫ్రె (మిశ్రబ్రౌ); కుముందము ఫ్రెంచి పదమని వీరభద్రరావుగారు;

41.కుంపాసు : దిక్సూచి (బ్రౌ. ఇం. తె. 205)–బు. కుంపస్సు; ఇం. కంపాస్.

కుంపిణీ: చూ. కుంపిని–ఇం. (ఆంభాచ., 615).

42.కుంపిని : రూ. కుంపిణి, కుంఫిణి, కుంఫిణీ, కుంభిణీ; పాశ్చాత్య వర్తక సంఘము; ఆంగ్లేయ ప్రభుత్వమువారు; 'పుదుచ్చేరి కుంపిని' (రంగరాట్ పీఠిక 107). — బ్రి. కుంపన్యీ; స్పా. కొంపనీయా; ఫ్రె కోంపేఁఞి; మల. కుప్పిణ్ణి, కుంబణ్ణి — ఇం. కంపెనీ (గుండర్టు, పుటలు, 265, 266).

కుంఫిణి : చూ. కుంపని (మిశ్రబ్రౌ.)

కుంఫిణీ : చూ. కుంపిని (Annals of Hande Anantapuram, p. 99)

43.కుంబాద్రి : జ్ఞానపిత; శిశువు పెరిగి పెద్దయయి క్రైస్తవమత ధర్మానుసారము గా ప్రవర్తించుటకుగాను నామకరణ సందర్భమున పూటపడువాఁడు: 'జ్ఞానతండ్రి' యని కర్నూలు మండలము వాడుక — బ్రి. కుంపాద్రి; స్పా. కుంపాద్రే — జ్ఞానపిత; మిత్రుడు; ఇరుగుపొరుగు వాఁడు.

కుంభిణి ; చూ. కుంపిని (మిశ్రబ్రౌ.)

కుశిని ; చూ. కుసిని (గారెటి, MAMP, III, 223) °వాడు—వంటవాడు (మిశ్రబ్రౌ)

44.కుసిని : రూ. కుశిని. వంటయిల్లు; °వాఁడు. అన్యదేశి హీనజాతు... వంటచేయువాఁడు (ఆం. వాచ.) — బ్రి. కుజినా; కోజిదు... బడిన; స్పా. కోసేనా — వంటయిల్లు; కోసేఁలా — చిన్న... గది; ఫ్రె. క్వీ జీన్ — వంటయిలు; క్వీజీ... ; ... కుసినా — వంటయిల్లు; ఫ్రె. (మిశ్రబ్రౌ MAMP, III, 223; ఆం. భా. వి; ఆం. భాచ). అన్యదే. (ఆం వాచ.); తమిళ కుసిని— వంటవాఁడు —బ్రి.

45.కూర్వ : వాడ (ఓడ) కూర్పుకు వేసే వంకర కొయ్య; వంకరకొయ్య (మిశ్రబ్రౌ.)—బ్రి. కుర్వా—ఓడవంపుకొయ్య; స్పా. కూర్వా—వంకర; వంకరగల; కోర్వ—మోకాలివంపు; వంకరైన; ఓడపక్కల బిగించు వంపుబద్ద; ఫ్రె. కూర్వ్—వంకర; వంకరయిన: ఇం. కర్వ్

46.కౌన్సేలు : మంత్రాంగసభ; సభాస్థలము; 'జాతికౌన్సేలు' (రంగరాట్. పీఠిక 58)—బ. కౌన్సేల్యు- మంత్రాంగము; స్పా. కౌన్సీలియో—పాదిరి గుడికి సంబంధించిన సంఘము; ఫ్రె. కోన్సెయ్యే; బుడతకీచుల వలసయగు 'త్రైమర్' దీవిలో 'కౌన్సేలు' శబ్దము ప్రచురముగా నున్నది. (Port - Voc - p. 116),

కోప : చూ. కోపా. 'కోప' ఇది ఇంగ్లీషుమాట (బ్రౌ. ఇం. తె. 262).

47.కోపా : రూ. కోప. పాదిరిగుడులలో వాడుగిన్నె (మిశ్రబ్రౌ); - బు. కోపు —పంచపాత్ర. గళాసు; స్పా. కోపా—సారాయపు గిన్నె; ద్రవద్రవ్య మును కొలుచు ఒక పరిమాణము; ఫ్రె. కూప్; మల. కోప్ప;-బు. (గండర్డు)

48 కోబీ : రూ. కోసు, గోబి. క్యాబేజి (ఆంభాచ.)—బు. కోవి.

49.కోమాను : ఆజ్ఞ, ఉత్తరువు—బు. కోమందు; ఫ్రె. కోమాఁద్;

50.?కోర్జ : ఇరువది గుడ్డముక్కలు; జవళీ అంగడులలోని పరిభాష (మిశ్ర బ్రౌ.)—.బు కొర్జా-'ఇరువది' యనుటకు వర్తకుల పరిభాష.

కోసు (గడ్డ) : చూ. కోబీ. (అనంత, చిత్తూ., నెల్లూ,) — ఇం. Cabbage (బ్రౌ. రి.) తమిళ, కన్నడ. కోసు.

51 కోస్తా : సముద్రతీర ప్రాంతదేశము; 'ప్రఖ్యాతంపు కోస్తాల' (చెన్నపురీ. పు 25) ంజిల్లాలు, ్వర్తకము—బు. కొస్తా — సముద్రతీరము; స్పా. కోస్తా- తీరము, ఒడ్డు;—ఇం. (శ ర , ఆంభాచ)

52 క్రిస్మ ; జ్ఞాన స్నానము —బాప్తిస్మము — న వాడు పవిత్రతైలము. 'ఒక తరహా తైలము; దీనిని రోమన్ కతోలికు వాండ్రు అవసానకాల మందు ఆయా అవయవములలో చరుముదురు' (బ్రౌ ఇం తె 173) —బు. క్రిజ్మా; ఇం క్రిజమ్; చర్చికి సంబంధించిన పదజాలములలో చాలపాలు బుడతకీచు భాషనుండి సంక్రమించినదని సిద్ధాంతీకరించుట కారణముగా దీనిని బు గా పేర్కొనన యినది ధ్వని పరిణామ సూత్రముల ప్రకారము ఆంగ్ల భవమనియు అననగు.

53. క్రీస్తనుడు : కిరస్తువాఁడు, క్రీస్తుమతస్థుఁడు (మిశ్ర బ్రౌ.) చూ. కిరస్తాను.

54. క్రీస్తు : కిరస్తానీ మత ప్రవక్త; 'క్రీస్తు శబ్దమునకఁ అభిషిక్తుఁడని యర్థము.' 'క్రీస్తు అనబడిన యేసు పుట్టెను' (మత్తయి. అధ్యా.1); మమ్మును రక్షించ్చేకతన్ అయిన యెసుక్రీస్తు యొక్క శుభ సమాచారము' (దేవుని యొక్క సమస్తమైన వాక్యము, 1812 లో శ్రీరామపురములో క్రైస్తవమత ప్రచారకులు ప్రచురించిన బైబిలు); 'లూకా చేత వ్రాయబడిన యేసుక్రీస్తు శుభసమాచారం' సి. పి. బ్రౌను 1838;...'యీ గ్రంథము....యేసు క్రీస్తుయొక్క నూతన నిబంధనాయమైయున్నది మొ....' (British and Foreign Bible Society/ Madras, 1818); క్రీస్తుసంబంధమైన' (మిశ్ర బ్రౌ.); °జయంతి– ఏసుక్రీస్తు పుట్టిన పండుగు; °శకము–హూణశకము; – బు. క్రీస్తు; ఫ్రె. క్రీస్; ఇం. (ఆంభాచ.);–గ్రీక్ (బ్రౌ. రి. 334).

క్రీస్తువు : క్రీస్తుమతానుయాయి; రోమన్ కాతలిక్ శాఖీయులు క్రీస్తువులు, ప్రొటెస్టాంట్ శాఖీయులు క్రైస్తవులు – అను విభాగము వ్యవహారములో కలదు (కర్నూ., నెల్లూ.); 'ఆరంభక్రీస్తువులు' క్రీస్తు మతానుయాయులలో మొదటివారు 'సత్య క్రీస్తువులు' నిజమయిన క్రైస్తవులు.

క్రైస్తవులు : క్రీస్తుమతానుయాయులు (నానా. 232) (బ్రౌ. రి., శ. ర అను) –ఇం. (ఆంభాచ)

ఖబ్బాయి : చూ. కబాయి 'ఖబ్బాయి దట్టీలు...' పెమ్మసాని తిమ్మానాయనిపై చాటువు.

గడంగు : చూ. గిడంగి, (అనంత). సరకులు నిలువయుంచెడి పెద్దకొట్టు; సారా నిలువయుంచెడి కొట్టు; కన్నడ. గడంగ (గు)–మదిరా గృహము (కిట్టెల్ 519).

గబేళా : చూ గమేళా (గుం).

గమాతు : చూ గామత్తు (మిశ్ర బౌ).

55.గమేళా 1 : 'ఓడ స్తంభములో మనిషి నిలిచేట్టుగా కట్టియుండే అంతస్తు' (మిశ్రబ్రౌ)—బు. కమేరా-ఓడగది, అర; స్పా. కామారా.

56.గమేళా 2 : ఉ. గంవేళా; రూ. గబేళా, బేల్దారి పనివారు వాడు ఇనుపగంప; ఇనుప పళ్ళెరము. (గో., విశా, శ్రీకా.)-బు గమేలా - కొయ్య తొట్టి, కొయ్యసానిక; స్పా. గామేల — పెద్దకొయ్యగాబు; ఫ్రె. గమెల్—భోజన పాత్రము.

57.గామత్తు : రూ. గమాతు. ఓడు, చిల్లి ఊట (మిశ్రబ్రౌ.)—బు. గామోతి—చిల్లిపడుట, కాఱుట; స్పా. గోతియో; ఫ్రె. ఫీత్; మల. కమ్మత్—చిల్లి, ఊట—బు. (గుండర్టు 206).

58.గావాయి ; ఓడకొన స్తంభము; సైతాంగావాయి — ఏకాండముగా చేయబడిన ఓడ స్తంభము (మిశ్రబ్రౌ.)—బు. గావియా; స్పా. గావీయా; గుజ. హిం. గావీ; అరబ్బీ. గబియ; మల. కప్పప్పాయి; — కప్పల్‌పాయి (గుండర్టు, పు. 204).

59.గిడ్డంగి :రూ. గడంగు, గుదాం; గోదాం, చెఱసాల. 'గిడ్డంగిన వేయించి' (రంగరాట్. పీఠిక. 58: మిశ్రబ్రౌ; శ. ర., కాంబెల్) కొట్టు, గది, సరకులుంచి అమ్మేడియిల్లు—బు. గుదమ్—అన్యదే. (శ ర); దేశ్యమని కాంబెల్ (చూ. పు 203): జావానుండి వచ్చి వారిచే కొని తేబడిన మలయా భాషాపదమని గాలెట్టి, పు. 130; మల. కిడఙ్ఙు—చెఱసాల; సరకులు నిలువ యుంచెడికొట్టు, కొటారు—బు (గుండర్టు, పు. 247) కన్నడ. గిడంగి, గిడ్డంగడి. గిడ్డంగి.

గుదాం : చూ. గోదాం (శ్రీకా)

60.గుళాపు (లు) : అలంకారార్థము కట్టు రంగురంగు గాజు గోలీలు (అనంత) —బు. గ్లోబు; స్పా. గ్లోబో; ఇం. గ్లోబ్

గొయ్యో (పండు) : చూ. గొయ్యా (పండు) (గాలెటి)

61.గొయ్యా (పండు) : రూ. గొయ్య (పండు). గోవ. గోవా (పండు) (చిత్తూ. చెంగల్పట్టు): జామపండు; గొయ్యాచెట్టు జామ (MAMP.

III, 333)—బు. గొయాబ; స్పా. గూయాబా (మెక్సికో దేశపు పండు); ఫ్రె. గొయావ్ ; ఇది అమెరికా ఖండమునకు నిసర్గమయిన పండ్ల మొక్క; 'గుయావ' అని బ్రజిలు దేశీయులవాడుక. జామ ఫలము 'హంసవింశతి' నాఁటికేకలవు (హంస 4_134) బుడతకీచులచే ఇండియాకు కొని తేఁబడి విస్తారముగా పెంచుచున్న పండ్ల మొక్క (MAMP. III, 333); 'మెక్సికో' దేశమందలి 'గొయ్యా' పండు స్పానిషుద్వారా తెనుఁగునఁజేరినది' (ఆంభాచ. 618) అను వ్రాఁతకు బ్రౌను ఆధారము (బ్రౌ. ఠీ. 388); కన్నడ. కొయ్యా, గొవ — స్పాష్ — మెక్సికన్ (కిట్టెల్, 488); మల. కొయ్యా; తమిళ. కొయ్యాప్పళమ్ — జామపండు — బ్రెజిల్ (TL, 1155); చిత్తూ. చెంగల్పట్టులలో ఈమాట ఉనికికి హేతువు తమిళభాషా ప్రభావము.

గోవా : చూ. గోదాం. కార్యరంగము; వివాదము; పోట్లాట (కృ. గో.).

62. గోదాం : రూ. గుదాం, గోదా. చూ. గిడ్డంగి. సరకులు విలువయుంచెడి కొటారు (కృ. గో.)—మలయా (బ్రౌ ఇం. తె. 534).

గోబి : చూ కోబీ (మహబూబ్ నగరము)

గోవ (చెట్టు) : చూ. గొయ్యా (పండు) (MAMP. III. 333) కన్నడ. గోవ, గోవగిడ.

గోవ (పండు) ; చూ గొయ్యా (పండు) (మిశ్ర బ్రౌ)

63. గ్రాది ; కిటికీ కమ్మిలు; ఇనుపకటకటాలు, కటాంజనము (మిశ్ర బ్రౌ.); ఇనుపగ్రాది. ఇనుపకటాఁజనము (బ్రౌ. ఇం. తె. 451)-బు. గ్రాది—ఇనుప చువ్వలవరుస; స్పా. గ్రాదా, గ్రాదో-మొట్లు; బంగాళీనుండియని మిశ్రబ్రౌ. 31. (ఆంభాచ. 620)

చపాతు ; చూ చప్పాతి (కళ్ళి) (బ్రౌ. ఠి. 405).

64. చప్పాతి (కళ్ళి) : రూ. చ పా తు. నాగజెముడు, Opuntia dillenii (అనంత). చపాతీవలె ఉండెడి కళ్ళియని కొందరి వ్యుత్పత్తి. కాలి

ఫోర్నియా ద్వీపకల్పము (ఉత్తర అమెరికా) నుండి 1786 ప్రాంతముల తెచ్చిన ముండ్లకంచెమొక్క (Flora of Madras I. :8‾)- బు. సపాతు-పాదుక; చెప్పు; ఫ్రె. సబో-కొయ్య పాదుక.

——చెయ్ : చూ. చెవి: తాళంచెయ్ (కృ, గుం, గో.) అను సమస్తపదము లోనే ప్రయుక్తము.

——చెయి : చూ. చెవి. తాళపుచెయి; బీగము: బ్రౌ. 354),

——చెయ్యి : చూ. చెవి, బీగము; 'తాళపుచెయ్యి' (బ్రౌ. ఠి. 429)

65.చెవి : రూ.—చెయ్,—చెయి. చెయ్యి, చేయి—, శావి బీగము. వైకృతమని శ. ర., 'పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను' (మత్తయి. అధ్యా 16;) 'జ్ఞానమను తాళపుచెవిని ఎత్తికొని పోతిరి' (లూకా. అధ్యా.11): తాళపుచెవి (బ్రౌ. 410); తాళముచెవి; A key is more usually called బీగపుచెవి (బ్రౌ. 616); బీగము చెవి (బ్రౌరి., 344); బీగము చెవులగుత్తి (పైది; 132): చెవిమారుక్కు నూనె; తాళం చెవులు;—బు. షావి; ఫ్రె. క్లే.

——చేయి : చూ. చెవి 'బీగంబు చేయిచే బీగముల్ దెఱచి' (ద్వి. పరమ పు. 319); తాళంచేతులు — బహువ. (కృ, గుం., గో.)

జనలు : చూ. జన్నలు (చెంగల్పట్టు) 'బహుళః—జిల్మిల్ కిటికలు' (మిశ్ర భా.)

జనార్లు : చూ. జన్నలు. జనార్లగూడు (అనంత.)

జనాలు : చూ. జన్నలు (బళ్ళారి).

66.జన్నలు : రూ. జనలు, జనార్లు,జనాలు, 'జన్నల్' (ఆం. భా. వి. 608)— బు. జన్నెల—చిన్నతలుపు; జనెల—కిటికి; తక్కిన రోమాన్సు భాషలలో నిది మృగ్యము గవాక్ష గృహాక్ష జాలక వాతాయనములు సంస్కృత పదములు సోరణములు, సోరణ (గండ్లు) సం. సౌరాయన (= సూర్యపథము),—ప్రా. సోరాయణ, సోరాణ, తె. సోరణ (ము) కావచ్చు; (సం భోజన—ప్రా. భోయణ, భోణ—తె. బోనము—వలె); కిటికి (కీ) హిందీ 'ఖిడ్కీ' పదజన్యము; 'విండో'

(1810–1960) మధ్య వెలువడిన అనేక ముద్రణములు; భీమ. భీమేశ్వర పురాణము; యయాతి; యయాతిచరిత్రము; రంగరాట్. రంగరాట్ ఛందము; రంగా. రంగారాయచరిత్రము; విజయ. విజయవిలాసము: శుక; శుకసప్తతి; హంస, హంసవింశతి.

భాషలు

ఇం. ఇంగ్లీషు; ఇటా. ఇటాలియను; కన్నడ. కన్నడము; గుజ. గుజరాతి; తమిళ. తమిళము; తె. తెలుగు: ప్రా. ప్రాకృతము; ఫ్రె. ఫ్రెంచి; బు. బుడతకీచు; మరా, మరాఠి; మల. మలయాళము; సం. సంస్కృతము; స్పా. స్పానిషు; హిం. హింది.

మండలములు

అనంత. అనంతపురము; కర్నూ. కర్నూలు; కృ. కృష్ణా; గుం. గుంటూరు; గో. గోదావరి; చిత్తూ. చిత్తూరు; నెల్లూ. నెల్లూరు: విశా. విశాఖపట్టణము; శ్రీకా. శ్రీకాకుళము.

ఇతరములు

అన్యదే. అన్యదేశ్యము; ఉ. ఉచ్చారణ భేదము (లు); క్రి. క్రియావాచకము; చూ. చూడు; దే. దేశ్యము; పర్యా. పర్యాయపదము; పు. పుట: మొ. మొదలగు; రూ. రూపాంతరము (లు); వి. విశేష్యము; విశే. విశేషణము వై. వైకృతము: fn. foot note; p. pp. Pages; – దీనికి పరమునంగల దానినుండి అనుటకు గురు;– దీనికి పూర్వమునంగల దానినుండి అనుటకు గుఱుతు; °[ప్రధానారోపపదమును దీనికి పూర్వభాగమున కలిపి చదువుకొనవలయును]

81. పస్కా; రూ పస్ఖా, పాస్క, పాస్కా. ఐగుప్తుచక్రవర్తుల దాస్యము నుండి విముక్తులయి ఇస్రాయేలీయులు తరలివచ్చిన ముహూర్తము సంస్మరణార్థము చేసెడి ఏడురోజులపండుగు, మేషసంక్రాంతి పౌర్ణిమ నాఁడు మొదలయి వరుసగా ఏడుదినము లీ పండుగ జరుగును. '... రెండుదినములైన పిమ్మట పస్కాపండుగ, అనగా పులియని రొట్టెల పండుగవచ్చెను' (మార్కు. అధ్యా. 14); 'అది యోహా

71. తారము—'కట్టలు తూచడముకో గోనె, దారము మొదలైన వాటికి గాను తోసియిచ్చేటిది. (మిశ్రబ్రౌ)—బు. తారా—తూనికత్రోపుడు; స్పా. తారా; ఫ్రె. తర్; ఇం. టేర్; డచ్చి. తర్ర; అరబ్బీ. టర్హా

తురుపు:—గుఱ్ఱపుపండు—బు. త్రూప్—సైనిక దళము.

తువాల(—లా—లు): ఉ. తువాలు. చూ. తువ్వాల (—లా—లు), తుండుగుడ్డ (మిశ్రబ్రౌ); '....యేసు....ఒక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను—'(యోహాను, అధ్యా. 13): '—తువాలుతో తుడుచుటకును—'(పైది): తుండుకస్త్రమని నెల్లూరి ప్రతి.—బు. తోవాల్య; స్పా. తోవల్ల; ఫ్రె. తువ్వాయ్యి; ఇటా. తొవా లియోలొ; కన్నడ. తువాల్—ఫ్రె. (కిట్టెల్—735); తమిళ. తువాలై—బు. (TL. 1996): సింహళీలోని 'తువాయ' ఫ్రెంచి 'తువ్వాయ్యి' శబ్దభవము: Port. Voc. లో తువాలా గుట్ట (పు. 346), తువాలాగుత్త (పు. 505) యని తప్పుగా అచ్చుపడినది.

తువ్వాల (—లా; లు): చూ. తువాల (కృ.) టువ్వాలు (—ఇం.) అనంత పురము.

74. దినమార్గ; దేనుజాతి; వారి మాతృభూమి 'ప్రాంసు హింగ్లీజు దినమార్గ యొలందా—' (రంగరాట్—పీఠిక, 58): డెన్ మ్యారు (ఏనుగుల వీరస్వామయ్య (క్రీ. శ. 1780—1836) (కాశీయాత్రా చరిత్ర. పు. 268)—బు. దినమార్కా—డెన్మార్క్: దినమార్కిష్—దేనులు; స్పా—దీనమర్కా—డెన్మార్క్: ఫ్రె. డెన్‌మార్క్; బెంగాలి దినెమార్.

75. నొవేనా:—తొమ్మిది రోజులపూజ (క్రైస్తవ పరిభాష)—బు. నోవేనా' నోవి—తొమ్మిది; నోవెంతా—తొంబది. నోను—తొమ్మిదగు; స్పా. నోవేనా.

76. పటాలము:—రూ. పటాళము, పతాను. సైనిక దళము, దండు(మిశ్రబ్రౌ). ('........ఇటలీ పటాలము....') (అపొస్తలుల. అధ్యా. 10)—బు. బతాల్లియం; స్పా. బాతల్లోన్; ఫ్రె. బత య్యాం; వైకృతమని శ. ర., మూల రూపమేదో శ. ర. కారులు చూపలేదు. వైకృత

దీపికయందీ పనిమేలేదు:—ఇం. (మిశ్రబ్రౌ...... ఆంభావ); —హెం. దిగవల్లి వేంకటశివరావుగారి వ్యవహార కోశము. పు. 254.

పటాశము:— చూ. పటాలము '.......పటాశముల్....(చెన్నపురీ. పు. 26)

77. పంట్లాము:— ఉ. పంట్లాం. బిగుతయిన ఇజారు (కృ. గో. విశా)—బు. పంతలోనా; స్పా. పంటాలోమ్;. ఫ్రె. పాంతలో; ఇం. పాంట లూన్—ఇం. (ఆంభావ).

పతాను:— చూ. పటాలము (బందరు).

పపయ:— చూ. బొప్పాయి (మిశ్రబ్రౌ.)

పప్పశము:— చూ. పొప్పళి (మిశ్రబ్రౌ.)

పప్పళి:— చూ. పొప్పళి. వస్త్రమునందలి చిత్రవర్ణ విశేషము; చిత్రవర్ణ వస్త్రవిశేషము. (శుక. 1—148. ఆంభా. 2—15౹); ౦పచ్చడము (పాంచాలీ—3—77); దేశ్యమని శ. ర., ఆం వాచ.

పపొప్పయ (పండు)—చూ. బొప్పాయి (మిశ్రబ్రౌ., గాలెటి).

పప్పిళి;—చూ. పొప్పళి; ౦చీరె (మిశ్రబ్రౌ); ౦బట్ట (బ్రౌ. ఇం. తె.)

78. పయాలు : అరుగు, తిన్నె: వేదిక (మిశ్రబ్రౌ.)—బు పొయాల్ — పంచట రంగు; తిన్నె: స్పా. పోయో—రాతి అరంగు; ఇం. ప్యాల్ (1873)— పంచటరంగు (దక్షిణ భారత దేశభాషలు—బు. (G. V. Subbarao. Indian words in English p. 130): ఆంగ్లో ఇండియానులోని 'పయల్'—బు, పొయాల్. (Hobson - Jobson, p. 703): పయల్ (pial; Anglo-Indian, గాలెటి, పు. 20.).

79. ? పరంగి:—పాశ్చాత్యజాతి (హంస. 1—231); ముఖ్యముగా బుడతకీచు జాతి; ౦కత్తులు (హంస. 5—360); ౦కాయ—బొప్పాయికాయ (అనంత), పర్యా బొప్పాయి: ౦కొండ—శాంతోముకొండ (చెన్నపురీ, పు. 11.): ౦పీట (కువల 5—91): ౦పేట, ౦పేట వరహా. ౦మనిషి, ౦ముడాసు (హంస, 4—427); ౦వరహా — ఒక నాణెము: ౦వరాంగులు—పరంగి స్త్రీలు (చెన్నపురీ. పు; 59); ౦వాడు—సంకర

జాతీయుడు; (Asiatic Journal, p 445 1823) °వెధవ-ఒకతిట్టు సోమరి (పిఠా—శ్రీకా.); పరంగీలాగి: పరంగుల్ (చెన్నపురీ పు 59): 'పరంగులతోడి నెయ్యమున' (శుక. 1—196); పరంగులు (చెన్నపురీ; పు. 53); 'పరంగి' శబ్దము తొలుత 'బుడతకీచులు' అను పరిమితార్థముననే ప్రయుక్తము.

'And when he heard this he said that such man could be no other than the Frances, for by this name they call us in these parts' (Roteiro da Viagemde, p. 99, 1838;)

'Pointing out that since the Portuguese-Frangues, as they call them-were so powerful it would be no wonder if they enter this port...('Duarte Barbosa, Livro, p. 248.)

మల. పరంగిమావు, పొర్తుకిమావు — జీడి మామిడి; తుళు. పెరెంగి పెలకాయి—బొప్పాయికాయ; కన్నడ. పరంగిహణ్ణు — బొప్పాయి కాయ;—మొదలగునవి 'పరంగి' శబ్దమునకు బుడకీచులతోగల అవినాభావ సంబంధమును వెలార్చునవి;—హిం. (ఆంభాచ); వై. వి. (శ. ర., ఆంవాచ); వైకృతదీపికలో లేదు.

80. పరంజ:—రూ. పరంజా, పరంజు, ఇల్లు కట్టునపుడు పరివారల కొఱకు కొయ్యలతోఁ గట్టిన కట్టడము, సారువ— బ. ప్రాంష్—సారువ; కొంకణి. గుజ. పరాంచ్; మరా. పరాంచి; తుళు. పరెంజి; వై. వి (శ. ర, ఆం. వాచ); కాని వైకృత దీపికలో ఈ పదము కానరాదు; —హిం, (ఆంభాప.)

పరంజా;— చూ. పరంజి (కృ. గో) °గూడు, °బొక్క (ఆం. వాచ) సారువ; కొయ్యలుంచెడి గోడ కన్నము.

పరంజా:—చూ. పరంజ (గుం)

ప్రధానారోప పదమునకు తప్ప ఏ తద్రూపాంతరములకు వరుస సంఖ్య వేయలేదు.

పదపట్టికయందలి ఆరోపరచనా రీతికి డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తి— తెలుగు రీడరు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము, తిరుపతి—గారి సంపాదకత్వమున ఆంధ్రప్రదేశ సాహిత్యఅకాడమీ, హైదరాబాదు వారిచే ప్రచురితము కానున్న 'వ్యవసాయ వృత్తిపదకోశము'న డా. కృష్ణమూర్తిగారు రూపొందించిన విధానము ప్రధానాధారము. డా. కృష్ణమూర్తిగారికి కృతజ్ఞతాభివందనములు.

పదపట్టికలో వ్యవహృతములయిన సంకేతముల వివరణము.

కోశాదికములు

ఆం. భా. ఆంధ్రభాషార్ణవము; ఆం. భాచ. ఆంధ్రభాషాచరిత్రము; ఆం, భా. వి. ఆంధ్రభాషావికాసము; ఆం. వాచ. ఆంధ్రవాచస్పత్యము; కాంబెల్— ఎ. డి. కాంబెల్, తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు, 1821; కిట్టెల్—డా. కిట్టెల్. కన్నడ—ఇంగ్లీషు నిఘంటువు 1894: గుండర్టు—డా. గుండర్టు, మలయాళ— ఇంగ్లీషు నిఘంటువు 1872; బ్రౌ. బ్రౌను: A. Dictionary of Telugu and English, బ్రౌ: ఇం. తె.—బ్రౌను, ఇంగ్లీషు—తెలుగు నిఘంటువు, 1895; బ్రౌ. రి —బ్రౌను, తెలుగు—ఇంగ్లీషు నిఘంటువు, రివైజ్డ్,1903: మిశ్రబ్రౌ.— బ్రౌను, మిశ్రభాషా నిఘంటువు, 1854: వి బ్రౌ.—విల్లియంబ్రౌను, తెలుగు— ఇంగ్లీషు నిఘంటువు, సంస్కృతి ప్రచురణ, 1953; శ. ర.—శబ్ద—రత్నాకరము 1912; శ. ర. అను. శబ్దరత్నాకరము, అనుబంధము (అనుబంధకర్త:—శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు); సూ. ని. —సూర్యరాయాంధ్ర నిఘంటువు; MAMP–Manual of Administration of the Madras Presidency, 1885; Port. Voc,–Influence of Portuguese Vocables in Asiatic Languages; TL. Tamil Lezicon.

సాహిత్యము

ఆముక్త. ఆముక్తమాల్యద; ఉ. రా. ఉత్తరరామాయణము; కళా. కళాపూర్ణోదయము; కువల. కువలయాశ్వ చరిత్రము; చెన్నపురీ.చెన్నపురీ విలాసము: దశా. దశావతార చరిత్రము; ద్వి. పరమ. ద్విపద పరమయోగి విలాసము; నానా. నానరాజసందర్శనము: బేరీజు. బేరీజు పద్యములు: బై. తెలుగు బైబిలు

(1810_1960) మధ్య వెలుపడిన అనేక ముద్రణములు; భీమ. భీమేశ్వర పురాణము: యయాతి; యయాతిచరిత్రము; రంగరాట్. రంగరాట్ ఛందము; రంగా. రంగారాయచరిత్రము; విజయ. విజయవిలాసము: శుక; శుకసప్తతి; హంస, హంసవింశతి.

భాషలు

ఇం. ఇంగ్లీషు; ఇటా. ఇటాలియను; కన్నడ. కన్నడము; గుజ. గుజరాతీ; తమిళ. తమిళము; తె. తెలుగు: ప్రా. ప్రాకృతము; ఫ్రె. ఫ్రెంచి; బు. బుడతకీచు; మరా, మరాఠి; మల. మలయాళము; సం. సంస్కృతము; స్పా. స్పానిషు; హిం. హిందీ.

మండలములు

అనంత. అనంతపురము; కర్నూ. కర్నూలు; కృ. కృష్ణా; గుం. గుంటూరు; గో. గోదావరి; చిత్తూ. చిత్తూరు; నెల్లూ. నెల్లూరు; విశా. విశాఖపట్టణము; శ్రీకా. శ్రీకాకుళము.

ఇతరములు

అన్యదే. అన్యదేశ్యము; ఉ. ఉచ్చారణ భేదము (లు); క్రి. క్రియావాచకము; చూ. చూడు; దే. దేశ్యము; పర్యా. పర్యాయపదము; పు. పుట: మొ. మొదలగు; రూ. రూపాంతరము (లు); వి. విశేష్యము; విణ. విశేషణము వై. వైకృతము: fn. foot note; p. pp. Pages; — దీనికి పరమునఁగల దానినుండి అనుటకు గుర్తు;— దీనికి పూర్వమునఁగల దానినుండి అనుటకు గుఱుతు; ˚ప్రధానారోపపదమును దీనికి పూర్వభాగమున కలిపి చదువుకొనవలయును]

81. పస్కా; రూ పస్ఖా, పాస్క. పాస్కా. ఐగుప్తచక్రవర్తుల దాస్యము నుండి విముక్తులయి ఇశ్రాయేలీయులు తరలివచ్చిన ముహూర్తము సంస్మరణార్థము చేసెడి ఏడురోజులపండుగు, మేషసంక్రాంతి పౌర్ణిమ నాఁడు మొదలయి వరుసగా ఏడుదినము లీ పండుగ జరుగును. '... రెండుదినములైన పిమ్మట పస్కాపండుగ, అనగా పులియని రొట్టెల పండుగవచ్చెను' (మార్కు. అధ్యా. 14): 'అది యోహో

వాకు పస్కా బలి' (నిర్గమ. అధ్యా. 12); 'పస్కా పశువును వధించుడి' (పైది); 'మొదటినెల (అబీబునెల) పదునాలుగవదినము యెహోవాకు పస్కాపండుగ' (సంఖ్యా. అధ్యా. 29); 'పస్కాపండుగలోని బలిసంబంధమైన మాంసమును ఉదయకాలము వరకు ఉంచకూడదు' (నిర్గమ. అధ్యా. 34); 'యూదుల పస్కాపండుగ సమీపింపఁగా' (యోహాను. అధ్యా. 2); 'ఇది పస్కాపండుగను గూర్చిన కట్టడ... అన్యుడెవడును దానిని తినకూడదు....పరదేశియుడును కూలికి వచ్చిన దాసుడును దానిని తినకూడదు' (నిర్గమ. అధ్యా. 12);–బు. పస్కోఅ; స్పా. పాస్కుఅ = క్రిస్మసు పండుగు, క్రీస్తు పునరుత్థాన చిహ్నముగా జరుపఁబడు పండుగు. పస్కాపండుగువారమునందే ఏసు సిలువ వేయఁబడుట; ఆ వారమునందే ఆయన పునరుత్థానమును. కావున పస్కా, ఈష్టరులు సమానార్థకములయినవి; ఫ్రె. పేక్ (పే లోని 'ఏ' మామూలు 'ఏ' కంటే వివృతము); తెలుఁగులోని ఈ 'పస్కా' లాటిన్ భాషా పదమని బ్రౌ. (A few Latin words are used as... Pascha, Baptisma etc...' C P Brown, Madras Journal of Literature and Science, No. 28, July 1840).

పస్థా : చూ. పస్కా (బ్రౌ. ఇం. తె., 877).

పాదరి : చూ. పాదెరి (బ్రౌ. ఇం తె.) '....పాదిరులున్....' (చెన్నపురీ పు. 14); పాదరీలు (బ్రౌ. ఇం. తె.).

82. పాదిరి : రూ. పాదరి. క్రీస్తు మతబోధకుఁడగు గురువు; °గుళ్ళు (చెన్నపురీ పు. 53); °తనము °వారు, °వృత్తి, పాదిరులు, పాదిర్లు (బ్రౌ. ఇం. తె.); గ్రామపాదిరి, చిన్నపాదిరి, పెద్దపాదిరి ఇత్యాదులు ప్రచుర వ్యవహారము కలవి.–బు. పాద్రి.; స్పా. పాద్రె; ఇటా. పాద్రె; ఫ్రె. పెర్ ('ఎ' 'ఎ' కంటే వివృతము). బుడతకీచులకంటెను భిన్నులయిన క్రైస్తవమత బోధకులకును 'పాద్రి' యను వ్యవహారముండినట్లు ఎడ్వర్డుటెర్రీ (1616–1619) అను ఆంగ్లమత ప్రచారకుని వ్రాఁతలు (Early Travels in India, p. 331).

ఇటాలియను 'పాద్రె' ఇంగ్లీషు ద్వారమున తెలుఁగున జేరినదని గాలెటి, (263). గాలెటి ఇటాలియను జాతీయుఁడగుటయు, ఆ భాషలో 'పాద్రే'యను పద ముండుటయు ఈ నిర్ణయమునకు హేతువులు. ఇది చరిత్రను మఱచి చెప్పినమాట: ఫ్రె లేక ఇం. (బ్రౌ. రి., 743)–బు. MAMP. ఆంభాచ. (అం. భా. వి.); కన్నడ. పాదరి, పాద్రి–బు. (కిట్టెల్ 971); మల. పాదిరి–బు. (గుండర్టు, 644); పాదిరి మావు, పోర్చుకిమావు = జీడిమామిడి (MAMP); తమిళం. పాతిరి–బు. (TL, 2608).

83. పాపు (గారు): కాతలిక్ క్రైస్తవ జగద్గురువగు పోపు. (కొత్త నిబంధన. నెల్లూరిప్రతి; కర్నూ; నెల్లూ)–బు. పాపా = పోపు; స్పా. పాపా.

పాస్కా: చూ. పస్కా; ాగొర్రెపిల్ల, °పండుగ, °బలి, °యజ్ఞము, °యాగము, °వ్రతము, పాస్కోత్సవదినము (పూర్వనిబంధన)

పాస్కా: చూ. పస్కా; °మహోత్సవము (పూర్వనిబంధన).

84. ?పిరంగి: రూ. పిరంగీ, పీరంగి, ఫిరంగి. 'సిపాయిలు యుద్ధమప్పుడు మందుగుండువేసి గట్టించి కాల్చెడి ఇనుపక్రోవి' (శ. ర); పిరంగి (శుక. 2–410, హంస, 5–59), పిరంగుల బారులు (చెన్నపురీ. పు. 26), పిరంగులు (శుక. 1–222)–ఫ్రె (గాలెటి, ఆం భావి); గ్రామ్యమనీ పరంగుల సంబంధము కలదికావున పిరంగి అనీ కాంబెల్ (చూ. 367).

పిరంగీ: చూ. పిరంగి దే. వి, (శ. ర.).

85. పీత: వాడా, బద్దె (మిశ్రబ్రౌ.)–బు ఫీతా = నాడా; స్పా. పీతా; ?పెరూవియను పదము: ఒకదినుసు కలబంద (agave) మొక్కనుండి తీసిన నారతో వేసిన త్రాడు.

86. పీపా: రూ. పీపాయ, పీపాయి. కొయ్యచెక్కలకూర్పుతో, ఉక్కురేకు బిగింపుతో పెద్ద మద్దెలరూపుగా నిర్మించిన భాజన విశేషము;

°కట్టు = మూఁత పలకల నడుమ వేసెడి ఇనుపబద్ద; ఇట్టి బిగింపు (కృ.,); °రేకు = సరంబీ బల్లకూర్పులో బల్లలనడుమ అనుకుగా వేసెడి ఉక్కు—రేకు; బేలుకట్టు (విశా.)—బు. పీపా; స్పా. పీపా; కన్నడ. పీప. పీపాయి, పీపు—బు (కిట్టెల్ 988); మల. పీప్ప—బు. (గుండర్టు '670); తమిళం. పీప్పా. పీప్పాయ్—బు (TL, 2735); మరా, పీప—బు. (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము, 502); గుజ. పీప—బు. (బెల్సారె. గుజరాతీ వ్యుత్పత్తి పదకోశము, 488); హిందీ పదమని ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము, పు. 255.

పీపాయ : చూ. పీపా, పీపాయలు (బ్రౌ. ఇం. తె.).

పీపాయి : చూ. పీపా; °కట్టు, °గిండి, ౦నోరు.° బిరడా, పీపాయిలు(బ్రౌ.ఇం.తె.)

87. పీపీ ; రబ్బరు బూరా (అనంత)—బు. పీపా.

పీరంగి : చూ. పిరంగి (ఆం. భా. 2—218).

పుడతకీసు : చూ. బుడతకీచు; 'ప్రాన్సు పుడతకీసు హరబి పార్సి తెనుఁగు—నరవమును మొదలయిన భాషాంతరముల—మాటలాడఁజదువ వ్రాయ మేటియగుచు....తిరువేంగ దేంద్రుఁడమరె' (రంగరాట్. పీఠిక,81).

88. పురతకాలు : రూ. బురతకాళి, బురతకాలు. విశే. పోర్తుగాలు దేశీయము. పోర్తుగాలులో తయారయిన (—పట్టు మొదలయినవి): ఒక రకము పట్టుగుడ్డ. ధరణీస్వరునకు గుందనపుఁ బీఠమునఁ బరపుగాఁ బురత కాల్పులపు ఘటించి' (తంజాపుర విజయరాఘవ (1633—1673) కృతమగు రఘునాథనాయకాభ్యుదయము, పు. 54), 'పురతకాల్ పట్టు పావోసులుతెచ్చి—మురువుగా నొక యింతి మునివేళ్ళఁజేర్చ' (పైది; పు. 74), 'మృదుహంసతూలికా మిళితంబులైన—పురతకాల్ తలగిడల్....' (పైది. పు. 80), 'పురతకల్వా పతిమలుపట్టు చాపలు....' (కామేశ్వరకవి (1670) కృతమగు సత్యభామాసాంత్వనము, 3—4).— బు. పోర్తుగాల్; ఇటా. పోర్తుగాల్లో; పోర్తుగాలు నారింజ; మల. పోర్తుగాల్, ప్రతుగాల్; మరా. పూర్తగాల్ =

పోర్తుగాలు దేశము; పారసి_పుర్తుఘాల్. నారింజలో ఒక దినుసు; తుర్కీ_, పోర్తుగాల్; నారింజలో ఒక దినుసు.

పురతకీలు (లు) : చూ. బుడతకీచు;_ఇం (శ. ర: అను).

పురతకేలు (లు) : చూ. బుడతకీచు 'ప్రాంసు హింగ్లీజు దినమార్గ యొలందా యంపరు దొరు పురతకేలు మొదలయిన జాతిభాషా విశేషంబులు....' (రంగరాట్. పీఠిక. 81)

89. పురోయి : ఒడంబడిక పత్రము; ధ్రువపత్రము (మిశ్రబ్రౌ.)_బు. ప్రోవా: ప్రమాణము, దృష్టాంతము; స్పా. ప్రూయేబా = నిదర్శనము; రుజువు; గురుతు; తార్కాణము; ఫ్రె. ప్రెవ్ = రుజువు; మరా. పురావా = సాక్ష్యము; గుజ. పురావో; కన్నడ. పురావె; తార్కాణము, రుజువు.

90. పేనా : ఊటకలము. రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి (1770_1837) తెనుఁగు వ్యాకరణమున అన్యదేశ్యముల పట్టికలో 'పేనా' పేర్కొనబడినది. (పు. 69. వావిళ్ళవారి ప్రతి, 1951. _బు. పేనా; _ఇం. (మిశ్రబ్రౌ., బ్రౌ. రి, శ. ర., ఆం. వాచ, ఆంభాచ., గాలెటి);

పొప్పడ : ఉ. పొప్పడి చూ. బొప్పాయి 'పొప్పడికాయ మన దేశానిదికాదు. దక్షిణ అమెరికానుంచి 17వ శతాబ్దమందు మనదేశానికి వచ్చెను....' (సు. ప్ర. రెడ్డిగారు, ఆంధ్రుల సాంఘికచరిత్ర, ద్వి. ముద్రణ. పు. 486).

91. పొప్పళి : రూ. పప్పళము. పప్పళి, పప్పిళి, పొప్పిళి. స్త్రీలుధరించు గళ్ళుగల సన్నని వస్త్రవిశేషము (సూ. ని), చచ్చౌకపు టెండ్లగుడ్డ; 'ఎరుపుతెలుపు మళ్ళుమళ్ళుగా వుండేచీర' (మిశ్రబ్రౌ); 'చిలుతపొప్పళి' (శుక. 1_237), పసరుపొప్పళి' (పైది); 'ముయ్యంచుల పొప్పళ్ళు' (హంస. 5_39);_బు. పొపిలీనా; స్పా. పోపెలీనా; ఫ్రె. పోపేలేఁ; డచ్చి. పొపెలిన్; ఇం. పాప్లిన్; కన్నడ. పప్పళి, పొప్పళి, పొళ్ళి_ఇం. (కిట్టల్, 940).

పొపాయి (పండు) : చూ. బొప్పాయి (మిశ్రబ్రౌ.)

పొప్పళి : చూ. పొప్పళి (అనంత).

92. ఫ్రాంచీ (లు) : బహూవ, పరాసువారు, ఫ్రెంచిజాతీయులు;—బు. ఫ్రంసేష్ = పరాసువ్యక్తి; స్పా. ఫ్రాంచేస్ = ఫ్రెంచివ్యక్తి: ఫ్రె. ఫ్రాంసె మల. పరందిరియస్సు—బు francez (గుండర్టు, 617)

ఫత్తేరి : చూ. బత్తేరి (మిశ్రబ్రౌ.)

బంకడీ : చూ. బంకు (మిశ్రబ్రౌ). 'బంకతీ' యని (Port. Voc., p. 37).

93. బంకు : రూ. బంకడీ. హజారము, మొగసాల (రంగరాట్. పీఠిక 116); కక్ష్య, ఇంటిలోపలిభాగము 'కొదుకక బంకు బంకులు దాఁటి చనుచు, (తిమ్మకవి ద్వి. సారంగ. పు. 129); 'బంకంవాకిలిగుండా....' (Annals of Hande Anantapuram, p. 23); సందువీథి (శ. ర.); 'తలవాకిటి పహారా' (మిశ్రబ్రౌ); కిళ్ళీ. బీడీకొట్టు (విశా.); జూదసాల (కృ, గుం); పెట్రోలుబంకు; —బు. బంకు = కొయ్యపీఁట. బెంచి; ఖజానా; స్పా. బంకొ = బెంచి, బ్యాంకు; ఇటా. బంక; డచ్చి. బంక్ = బెంచి; కిళ్ళీకొట్టు: తమలపాకులంగడి; మరాఠీ పదమగు 'బంకా' నుండియని—(శ. ర. అను. 108); మరా. బంక = పహారా, చోకీ, గస్తు; పారసి. బంకి.
బత్తాసు : చూ. బొత్తాము (బ్రౌ. ఇం. తె.).

94. బత్తేరి : రూ. ఫత్తేరి, బత్రి. ముట్టడిదిబ్బ; 'ఫిరంగులు పెట్టి కాల్చడమునకు యెత్తుగావేసిన దిబ్బ' (మిశ్రబ్రౌ); అరగడి బత్తేరి.—బు. బతేరియా, స్పా. బాతేరియా డచ్చి. బత్తెరిజ్.

బత్రి : చూ. బత్తేరి (మిశ్రబ్రౌ):—?ఫ్రె. బెత్రీ.

బంబాస : చూ. బొంబాసు (మిశ్రబ్రౌ).

95. ?బరమా : రూ. బర్మా, బురమా, బురమ, బురుమా. పిడిసాన, తొలి పణము, కండాణము: 'వజ్రంగిమున్నగువారు కొయ్యలు మొదలగు వానికిని, తాలపనివారు రత్నములకును బెజ్జమువేసెడు సాధనము'

(సూ. ని.)—. వెఱ్ఱుమా = తొరపడము; స్పా. బత్తేనో, బెత్తీమా; —పారసి. హిం. (కాంబెల్ 409);— హిం. (బ్రౌ. రి., ఆంభాచ.); దేశ్యము (శ. ర., ఆం. వాచ), ? సం. భ్రమర.

బర్మా : చూ. బరమా (మిశ్రబ్రౌ.).

బసి : చూ. వెసర (మిశ్రబ్రౌ). బు. బసీయ, బాసి = భోజనపాత్రము; స్పా. బాసీయ = పళ్లెరము, సానిక; ? సం. భాజన.

96. ?బాతు : జలపక్షివిశేషము. బాతువులు (ఆముక్త. 1—65); బాతులున్ (చెన్నపురీ. పు. 37); °కలంబు (బేరీజు. పు. 31) °కోడి = బాతు (సేలము); గూడబాతు (హంస. 3—12); చింకుబాతు (మిశ్రబ్రౌ); పెద్దబాతు (గాలెటి); పొట్టిబాతు, బాపనబాతు = చక్రవాకము (MAMP, III, 337);—బు. పాతు; స్పా. పాతొ, పాతా = బాతు; పాతీకా = చిన్నబాతు; కన్నడ బాతు, బాతె; తుళు. బాతు; తమిళ. వాత్తు; హిం. బతఖ్, బదక్; గుజ. బతక్; మరా. బదక్; పారసి. బతక్; అరబ్బీ. బత్; దేశ్యము (కాంబెల్, శ. ర., ఆం. వాచ., —హిం. (MAMP, బ్రౌ. రి., గాలెటి, ఆంభాచ.).

బాడ్లీ : చూ. బాల్దీ:—బెంగాలి (మిశ్రబ్రౌ);

బార (కచేరీ) : చూ. బారకాసు. సైనికులుండు వసారాయిండ్లు. (ది. వేం. శివరావుగారి వ్యవహారకోశము. పు 258); 'బారకాసు'తో 'కచేరీ. చేరుటచే'.—కాసు' జారిపోయి 'బార (కచేరి)' అను క్రొత్తమాట సృష్టి యయినది.

97. బారకాసు : ఉ. బార్క్సు, బార్కాసు, బార్క్చు; రూ. బారకీసు, బ్యారకుసు (లు); పర్యా. బార (కచేరీ) = సైనికులుండు నివాసములు; 'సిపాయిలువుండేశాల' (మిశ్రబ్రౌ.): °లంజ = దండులంజ (మిశ్రబ్రౌ.).—బు. బఱ్ఱాకాష్ = గుడిసె; గుడారము; డేరా; స్పా. బారాకాస్ = పాక, కుటీరము; పందిరి; బఱ్ఱాకా = కుటీరము; బారాకోస్ = గిడ్డంగి; జానిసల నివాసములు; ఫ్రె. బెరెక్ = పాక; సంత

గుడారము; డచ్చి. బరక్ = పాక; -ఇం. (మిశ్రబ్రౌ., శ.ర., ఆం భాచ); కాని 1686 కు పూర్వ మీమాట ఆంగ్లమున వాడుకలో నున్నట్లు సాక్ష్యములేదు; రొమాన్సు భాషలనుండి పదునేడవు శతాబ్దాంత మున ఆంగ్లమునఁ జేరినదని పరిశీలకులసిద్ధాంతము.

బారకీసు ; చూ. బారకాసు, 'బుడతకీసులు సోల్జరుల్ పొదలుచుండ—బార కీసుల గదుల పెంపారునందు' (చెన్నపురీ. పు. 24) 'సోజర్లవి బార కీసులు' (పైది)

బాలిత : చూ. బాల్ది (మిశ్రబ్రౌ.).

బాలిది : చూ. బాల్ది (మిశ్రబ్రౌ.).

బాల్చి : చూ. బాల్ది (గో., విశా., శ్రీకా., ఆంభాచ., ఆం. భా. వి.).

బాల్టి : చూ- బాల్ది (తూర్పుగో., విశా., శ్రీకా., కోరాపుట్టి ఖర్గపూరు, రాయ పూరు).

98. బాల్ది : రూ. బాల్దీ, బానిత, బాలిది, బాల్చి, బాల్టి. బొక్కెన — బు. బల్డి = బొక్కెన; స్పా. బాల్డి = బొక్కెన; కొయ్యతొట్టి; గుజ. బాలదీ = తోలుబొక్కెన:—బెంగాలి (మిశ్రబ్రౌ.).

99. బిలిబిలి : ఊరగాయకు పనికివచ్చు పుల్లనికాయల చెట్టు, పులుసుకాయచెట్టు (MAMP, III. 98), — బు. బిలింబిమ్ = బిలింబి చెట్టు పండు; కన్నడ. బిలింబి; తుళు. బింబులి; కొంకణి. బిలంబి; మలయా. బ్లిమ్ బ్లింగ్; Averrhoa bilimbi, Linn; బుడతకీచులు మలయానుండి తెచ్చియుందురు. దీని జన్మదేశమేదో తెలియదఁట. (Flora of Madras, Vol. I, p. 95).

బిస్కత్తు ; ఉ. బిసకత్తు; చూ. బిస్కోతు (అనంత., కృ., గో).

100. బిస్కోతు : రూ. బిస్కత్తు, బిస్కోతు (బ్రౌ. ఇం. తె.)—బు. బిష్కో ఌతు; స్పా బీథ్కోచో (ఇందలి 'థ్', ఇంగ్లిషు thank, think-లలోని 'th-'ను పోలిన ఉచ్చారణముకలది; దంతోష్మము, శ్వాసము, మహాప్రాణము): ఫ్రె. బీస్క్వి: బుడతకీచులరాకతో 'బిస్కత్తులు'

ను వచ్చినవి. 'పరంగులు' అప్రాచ్యులు కావున వారు తెచ్చిన ఈ 'బిస్కాతు'ను బంగాళీలు (విషకూటము) గా భావించి, వీనిని 'బిష్ కూట్' అని వ్యవహరించిరఁట!; బిస్కట్—ఇం.

బిస్కోతు : చూ. బిస్కాతు (ఆంభాచ. 618).

101. బుడతకీచు రూ. పుడతకీసు, పురతకీళు, పురతకేళు పోర్తుగాలు దేశ సంబంధి; పోర్తుగాలు దేశపుభాష: బుడతకీచుజాతి. 'బుడతకీసులు సోల్జరుల్ పొదలుచుండ' (చెన్నపురీ. పు. 24); —బు. పోర్తుగీజ; ఫ్రె. పోర్త్యుగె; ఇటా. పొర్తొఘీస్; డచ్చి. పొర్తుగీస్; అరబీ. బుర్తూకాన్ = తీయని నారింజ; హిం. పుర్తగీస్; = 'బుడతకీచు—భారతీయ' సంసర్గముచే కలిగిన మిశ్రజాతి; మరా. పూర్తకేళ = బుడితకీచు; మల. పొర్తుకి (మావు) పడుమటి ఇండియా దీవులనుండి బుడతకీచులు తెచ్చిన జీడిమామిడిచెట్టు. బుడతకీచులను 'పొర్తుంగలేస్' అని నికోలస్ విథింగ్టన్ (1612—1616, Early Travels in India, p. 203). బుడతకీచులో 'త' 'ద'లకు పూర్వముననుండి రేఫము భారతీయ భాషలో 'డ' 'డ'లుగా మారినది.

బుడిదీ : చూ. బుడుదు; 'బుడిదీ వేయుట'—సీసపు ముక్కను నీటిలో వదలి లోతు కనుగొనుట (ఆంభాచ., 638).

102. బుడుదు రూ. బుడిదీ; నీటిలోతును కనుగొనుటకు నావికులు వాడు సీసపు గుండు. '...ఓడవారు...బుడుదు వేసి చూచి యిరువది బారలలోతని తెలిసికొనిరి' (అపొస్తలుల. అధ్యా. 28); 'నెళవుసూత్రము' అని బైబిలు నెల్లూరిప్రతి:—బు. బొర్డు; స్పా. బోర్డో.

బుతాము : చూ. బొత్తాము (మిశ్రబ్రౌ.)

బురతకాళి [1] : చూ. పురతకాలు. వస్త్రవిశేషము; [పోర్తుగాలు దేశపుపట్టుగుడ్డ.

---

1. ఒక తాళపత్ర ప్రతిలో 'పురుతకాళలు' అని కలదు.
"...పురుతకాళలు మహాముదులు నిలాకీలు
పరినేయరాని హంసావళులు లాకీలు

'బురతకాశిలు మహామూదులు నిలాచీలు—సరిసేయరాని హంసావళిలు లాకీలు' (హంస. 5—360, శృంగార కావ్యగ్రంథమండలి వారిప్రతి); బుడతకాసీలు మహముదులు నిరాసీలు—సరిసేయరావి హంసావళులు లాకీలు...' (వావిళ్ల వారిప్రతి 1920); 'బుడతకాసీలు మహముదులు నిరాసీలు—సరిసేయరాని హంసావళులు లాకీలు....' అని వావిళ్ల ప్రతి ననుసరించి సూ. ని. పాఠము. ఈ పాఠమున ప్రాసభంగమును సూ. ని. కారులను గమనించినట్లులేదు. (చూ. సూ. ని. లో 'బుతడకాసీలు' అను ఆరోపముక్రింద), 'బురతకాశీలు క్రొత్తప్రతిపాఠము అని సూ. ని.

బురమా : చూ. బరమా (ఆం. వాచ.)

బురుతకాలు [2] : చూ. పురతకాలు; 'కొమరొందునేకరంగు మెఱుంగు తలగడల్ బలితంబు బురుతకాల్పట్టు బటుపులమరు మగతాలపని చప్పరము....' (ఉ. రా. 6—160, క్రీ. శ, 1650.); 'బలితంపు బురుకకాల్పట్టె బటువులమరు....'అని రాయలువారి ప్రతి (చూ. పు. 245):'....బలితంబు బురుక కాల్పట్టి బటువులమరు...' అని సూ. ని. పాఠము. పొర్తుగాలు దేశసంబధియగుపట్టు 'బుడుతకాలు' మనవారి చేతుల

మాదళములు..." (హంస విశంతి, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, వారి గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతి, నెం. 70; 130 వ పత్రము, రెండవవైపు, చివరి పంక్తి.)

2. పెక్కు తాళపత్ర ప్రతులలో నిట 'బురుత కాల్పట్టు' అనియే కలదు.

"...కొమరొందునే కరంగి మెరుంగు దల్గడల్ బలితంప్పు బురుత కాల్పట్టు బటువులమరు మగరాతి వని చప్పరము..." (ఉత్తర రామాయణము, ఆంధ్ర విశ్వకళా పరిషద్గ్రంథాలయములోని తాళపత్ర ప్రతి, Acc. No. 29204; పత్రములు, 202, 203.)

"...కొమరుందు నేకరంగి మెరుంగు తలగడ బలితంపు బురుత కాల్పట్టు బటువులమరు మగరాతి పనిచప్పరము..." (ఉత్త. రా. , ఆం. వి. క గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతి, Acc. No 29702; పత్రములు 208, 209.)

"...కొమరొందు నెకరంగు మెరుంగు తలగడ బలితంపు కాల్పట్టు పటువులమరు మగరాతి పని చప్పరము" (ఉ. రా., ఆం. వి. క. గ్రంథాలయము నందలి తాళపత్ర ప్రతి, Acc. No 29413; పత్రము; 199, మొదటివైపు).

లోఁబడి బుడక (= చిన్న), కాల్ (= కాలు) అగుట లేఖక ప్రమాదమును; ముద్రారాక్షసమును.

బురుమ : చూ. బరమా (మిశ్రబ్రౌ.).

బురుమా : చూ. బరమా (కాంబెల్, బ్రౌ. ఠి., శ. ర., సూని., ఆం. వాచ.)

103. బురుసు : కుంచె, తూలిక; 'ఒళ్లుతోముకొనే బురుసు' (బ్రౌ. ఇం. తె.); —బు; బ్రూస = గుడ్డలమీఁది దుమ్ము ధూళి తుడుచు పనిముట్టు; స్పా. బ్రోచా = తూలిక; —ఇం. (ఆం. భాచ.); Port. Voc. లో తె, 'బరుసు' ప్రదర్శితము. ఇది ఇంగ్లీషు 'brush' కు వికృతి

104. బేస్తు : పేక, జూదము లోనగువాని యందలి కొద్దిగెలుపు, బొటాబొటి గెలుపు. బేస్తుకంటే తగ్గిన కుందేలు, బేస్తుకంటె హెచ్చిన ఆట. చిన్నబేస్తు, పెద్దబేస్తు, పైబేస్తు అనివాడుక.—బు. బస్తు = చీట్లాట లోని పరిభాష; స్పా. బాస్తో = చీట్లాటలోని పరిభాష; కాకితములలో కళావరు; బాస్తోస్ = కళావరుకాకితము అపోస్తర్ = పందెము వేయు.

బొంగు : చూ. బొంబు. ఎండిన లావుబోలు వెదురు (శ. ర.); 'కీచకసంజ్ఞయైతోఁచు బొంగన....' (ఆం. భా. 2-74); ఓడ బేహారియగు విష్ణుదాసుఁడు 'జాతి విలాయతీ' దీవులనుండి తెచ్చిన సామానులలో ....'పొలుపొందు నందలపు బొంగులను....' (హంస. 5—360) ఉండినవి. డేరాబొంగు, పాలకీబొంగు (వి. బ్రౌ, 247).

బొత్త : చూ. బొత్తాము, బెజ్జము (బ్రౌ. ఇం. తె.).

బొత్తాను : చూ. బొత్తాము (మిశ్రబ్రౌ., శ. ర.)

"...కొమరొందు నెకరంగి మెరుంగు తలగడల్ బలిదంపు పురత కాల్పట్టు బటువులమరు..." (ఉ. రా., ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, వారి గ్రంథాలయమునందలి తాళపత్ర ప్రతి, నెం. 42, పత్రము, 254, మొదటివైపు, 1, 2 పంక్తులు).

(అకాడమీ ప్రతులను పరిశీలింప ననుమతించిన శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి కృతజ్ఞతాభివందనములు).

105. బొత్తాము : రూ. బత్తాసు, బుతాము, బొత్త, బొత్తాను, బొత్తాయి, బొత్తాసు గుండి. (తూర్పుగో., శ. ర., మిశ్రబ్రౌ., ఆంభావి., ఆం. వాచ.); కాను బొత్తా=చుక్కాణి ఉండుబెజ్జము (ఆంభావ):-బు బొత్తాము (ను); స్పా. బోతోన్; ఫ్రె. బూతాఁ; —ఇం. బటన్ ఇం; (శ. ర.. గాలెటి); - ఫ్రె (మిశ్రబ్రౌ.); గుజ. బుతాన— ఇం. (బెల్సారి, 547); బొత్తాము, ఏతద్రూపాంతరములు బుడతకీచు జన్యములు; 'బటన్' ఇంగ్లీషుల నుండి ఎరువుతెచ్చినది. 'గుండీ' హిందీనుండి దిగుమతి యయినది గుండీని వైకృతముగా శ. ర. (పు. 332) చూపినది; కాని వైకృత దీపికలో దీని అడపొడ లేదు. 'గుండ్రముగానుండు వస్తువుకాన గుండీ' యని వ్యుత్పత్తి చెప్పి దీనిని దేశ్యముగా నిరూపింప యత్నించినవారు గాలెటి (చూ. పు. 48.); పూర్వము బందుల చొక్కాలు అనఁగా తాళ్ళతో ముడి వైచుకొనునని—ఉండెడివి. దారాబందీ చొక్కాలు ప్రసిద్ధములు.

బొత్తాయి : చూ. బొత్తాము, బొత్తాయిలు (బహువ) (శ్రీకా.).

బొత్తాసు : చూ. బొత్తాము (మిశ్రబ్రౌ., ఆం. వాచ.)

బొప్పర : చూ. బొప్పాయి. (నల్లగొండ).

బొప్పాయ : చూ. బొప్పాయి (మిశ్రబ్రౌ). °పండు=వై. వి. ఒకజాతి ఫలము (శ. ర).

106. బొప్పాయి : రూ. పపయ, పప్పాయ, పొప్పడ, పొప్పాయి, బొప్పర, బొప్పాసి, బొప్పాయ (పండు), బొబ్బాయి (కృ., గుం., నెల్లూ.); పర్యా. పరంగికాయ. ఒకజాతి ఫలము, మదనానప. కారు బొప్పాయి = బొప్పాయిలో ఒకదినుసు. 'అబ్బాయిగారి దొడ్లో బొప్పాయికాయ పడితే పరుగెత్తలేక పదిమందిచచ్చారు'—పిడుగు. ఈ పొడుపుకథ అర్వాచీనము.—బు. పపైయా (Carica Papaya, Linn.; Caricaceae కుటుంబములోని ఒకేఒక మొక్క - Flora of Madras, Vol, I. p, 371); దక్షిణ అమెరికా ఫలవృక్షము; కరీబ్ మాండలిక మీ పదము; కన్నడ. పప్పాయి; మల. పప్పా

యం; తుళు. ఒప్పంగాయి; కొంకణి. పొప్పాయి; మరా. పపఈ, పోపఈ; గుజ. పపవోఁ, బపాయో; వివరములకు చూ. 'బొప్పాయి' 'క్రమమహారాజు' పత్రిక, అనంతపురము 1938.

బొప్పాసి : చూ. బొప్పాయి (తూర్పుగో).

బొబ్బాయ (పండు) : చూ. బొప్పాయి (గాలెటి).

బొబ్బాయి : చూ. బొప్పాయి. (ఆం వాచ.)

బొంబసు : చూ. బొంబాసు (మిశ్రబ్రౌ); ౦గుండు (మిశ్రబ్రౌ).

107. బొంబా : తంజా_ఓడలోపలి ప్రదేశము _ లోని నీటిని వెలికితోడు గొట్టము (ఆంభాచ.)_బు. బొంబా = నీటి కుళాయి

108. బొంబాయి : కిరసనాయిలుతోడు గొట్టము, చెవ్వంగము (అనంత); నీరు వెలువరించుగొట్టము, కుళాయి (ఆం. వాచ); _బు బొంబా = నీటికుళాయి. స్పా బొంబా = కుళాయి; ఫ్రె పోఁప్ = కుళాయి; బోఁబ్ = బాంబు;. డచ్చి.పొంప్; ఇం పంప్.

బొంబాస : చూ బొంబాసు (మిశ్రబ్రౌ).

109. బొంబాసు : రూ. బంబాస, బొంబసు, బొంబాస, రోటివంటిపిరంగి (మిశ్రబ్రౌ);_ బు బొంబా = బాంబు, బొంబాష్; స్పా. బోంబాసి = పిరంగి_ఇం. బాంబ్ (బ్రౌరి).

110. బొంబు : రూ. బొంగు, వెదురు (సేలము, కన్నడ ప్రభావద్యోతకము); కాలునపుడగు ధ్వనిని అనుకరించి పుట్టిన శబ్దమట (MAMP III, 65).—బు. బంబూ; స్పా బంబూ; ఫ్రె. బాఁబా; ఇం. బేంబూ; మలయా. సమాంబ; కన్నడ. బంబు, బొంబు; మరా. బాంబూ = వెదురు_కన్నడ. బంబు; జావా. బాంబు (మరాఠీ వ్యుత్పత్తి పద కోశము 544).

111. ? బొరిగ = : రూ. బొరిగము, బొరిగె. గడ్డి త్రవ్వు చిన్న సాధనము (ఆంభాచ); గోకుడుపార, త్రవ్వుకోల; గడ్డి పెల్లగించెడు గుద్దలి

(శ. ర., సూ. ని., ఆం. వాచ)—బు బొరొగ (ఆ భాచ., 619), కాని బుడతకీచు కోశములలో ఈ మాట మృగ్యము.

బొరిగము : చూ. బొరిగ (మిశ్ర బ్రౌ)

బొరిగె : చూ. బొరిగ (వి. బ్రౌ; కాంబెల్, మిశ్ర బ్రౌ.)

బోడ : చూ. బోడిద; ఉజియబోడ = ఓడ కుడిపక్క; దావు బోడ = ఓడ ఎడమపక్క (మిశ్ర బ్రౌ).

112. బోడిద, : రూ. బోడ. ఓడ పక్కవైపు. జమ్నా బోడిద = ఓడ కుడి తట్టు, డావుబోడిద = ఓడ ఎడమతట్టు; మేబోడిద = గాలి వీచువైపు కాక రెండవవైపు ఉన్న పక్క (ఆంభాచ) — బు. బొర్డు = ఓడ పార్శ్వ భాగము; స్పా. బోర్డో = ఓడ పార్శ్వ భాగము; బోర్దే = అంచు, చివర. బుడతకీచులోని 'ర్త' 'ర్ద' లు భారతీయ భాషలలో 'ట్ట' 'డ్డ' లుగా మారుట ధ్వని సూత్రము; మరా. బోడద్ = ఓడ పక్కవైపు.

113. బోము : చూ. బోంబు. జీబీలు (తెరచాపలు) తగిలించు పెద్ద కఱ్ఱ (ఆంభాచ).

114. బోయా : 'ఇది ఒక పెద్దపీపా, లేక కర్రదుక్క; దీనిని లంగరుకు కట్టుదురు. దీని స్థానమును బట్టి లంగరు నీటిలో ఎక్కడున్నదో తెలియును' (ఆంభాచ 639)—బు. బోయా = తరండము, స్పా. బోయా: °కట్టె : లంగరు గుఱుతు; 'లంగరు మొదలైనవి మునిగిపోయిన చోటు గురుతు తెలిసే నిమిత్తమై తేలికగా నుండే కొయ్య కొణతలకు బరువుకట్టి నీళ్లలో వేసిన గురుతు' (బ్రౌ. ఇం. తె. 132); °చుట్ట: పడవమునుకలలోను, తక్కిన అక్కఱలలోను, ఆపదలలోను ఉపయోగించు ఈఁతకాయ, life - buoy.

బ్యారకుసులు : చూ. బారకాసు (ఏనుగు వీరాస్వామయ్య కాశీయాత్రచరిత్ర. పు. 64).

115. మణేలా : పేకాటలోని పరిభాష, ఏఱము ఆటలో తొమ్మిది–బు మనిల్యా: పేకాటలోని పరిభాష; పేకాట పందెములోని ఏడు పాయి.ట్లు.

116. మనేలా : రత్నాల వర్తకుల జాతి. 'మనేల' యను ప్రాంతమునుంచి వచ్చి వర్తకము చేసినవారు కాన ఈపేరు' అని బౌ్రను (మిశ్రబౌ్ర 88). – బు. మనిల్యా = కడియము; స్పా. మానిల్లా = కడియము; మానో = చేయి; మానోహో = పిడికెడు, °వాండ్లు = పైన పేర్కొనిన రత్నాలవర్తకులు (మిశ్రబౌ్ర.); బు. మనిల్యా + తె. వాండ్లు అని Hobson - Jobson p. 558.

117. మన్నా : క్రైస్తవమత పరిభాష, అమృతము, దివ్య ప్రసాదము, ఐగుప్త దాస్య విముక్తులయి ఇశ్రాయేలును గూర్చి వలస వెడలుచుండిన యూదులకు యెహోవా ప్రసాదించిన ఆహారము 'ఆహారమునకై ఆయన (యెహోవా) వారిమీద మన్నాను కురిపించెను.....' (కీర్తన, 78); 'ఇశ్రాయేలీయులు నివసింపవలసిన దేశమునకు తాము వచ్చు వరకు నలుబదియేండ్లు మన్నానే తినుచుండిరి ....(నిర్గమ. అధ్యా. 17); 'ఆ మన్నా కొతిమెర గింజలవలె నుండెను...జనులు తిరుగుచు దాని కూర్చుకొని తిరగట విసిరి లేక రోటదంచి పెనముమీద కాల్చి రొట్టెలు చేసిరి. దానిరుచి తైలభక్ష్యముల రుచివలె నుండెను' (సంఖ్యా. అధ్యా. 11); 'దాని (మన్నా) రుచి తేనెతో కలిపిన అపూపమువలె నుండెను....' (నిర్గమ. అధ్యా. 16); '....మీ పితరులు అరణ్యములో మన్నాను తినినను చనిపోయిరి...' (యోహాను అధ్యా. 6); °గింజలు, °పాత్రము, ౦భోజనము °సంకటి.; 1841 కలకత్తాలో అచ్చయిన క్రొత్తనిబంధన గ్రంథము—సంస్కృతానువాదమునందును 'మన్నా' ప్రయుక్తము; —బు. మానా = దివ్య ప్రసాదము; స్పా. మనా; హిబ్రూలోని 'మాన్' వీనికి మూలము.

118. మయూరు (లు) : ఒక సైనికోద్యోగి (రంగా. 1-145)–బు. మయోర్; స్పా. మయోర్ = ప్రధానాధికారి, ముఖ్యుడు; ఫ్రె మజెర్;– ఫ్రె. (మిశ్రబౌ్ర, కొ. వీరభద్రరావుగారు); –ఇం. (శ. ర., అను)

119, మరియ : ఏసుక్రీస్తు తల్లియగు మరియ. 'అనుపమి తార్చ్ఛశిష్ట మరియాం బకు నందనుఁడై ...' (వేదాంతరసాయనము, పీఠిక). బైబిలు నెల్లూరి ప్రతిలో 'అపొస్తలు' అనుమాట 'అర్చ్యశిష్ట'గా అనూదితము. 'అర్చ్యశిష్ట మత్తేయుని సువిశేషము'; ....'మరియా కుమారునిన్...' (వేదాంత. 4 అశ్వా.); 'మరియ భర్తయైన యోసేపు ...' (మత్తయి. అధ్యా. 1); '....ఇతడు మరియ కుమారుడు కాడా ...' (మార్కు. అధ్యా. 6); 'మగ్దలేనే మరియయు, వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి ...' (మత్తయి. అధ్యా. 28); ఆ కన్యక పేరు మరియ....' (లూకా. అధ్యా. 1); — బు. మరియా; స్పా. మరీయ; ఫ్రె. మరీ; ఇం. మేరీ; అంతోనీ, అంద్రె, ఇన్నయ్య ఎలీనా, తోమాసు, దలీలమ్మ, దానియేలు, దావీదు, దోరతి మొదలగు వ్యక్తిబోధకనామములను ప్రత్యేకారోపములుగా నొసఁగలేదు,

120. మరియాన్ను (ఆట) : పేకాటలో ఒక రకము. బుడతకీచు మూలకమగు పదము కానోపునని బౌ్రను (మిశ్రబౌ్ర.).

121. మల్గోబా : ఉ. మల్గూబా, మల్గోవా ? (మలయా + గోవా) మామిడిలో ఒకదినుసు. మామిడికి నేర్పుగా అంట్లు కట్టుట బుడతకీచులనుండి నేర్చిన విద్య అఁట. ఆయా పద్ధతులను దెలుపుటకు బుడతకీచు మాటలే వాడఁబడినవఁట. (Port. Voc. p. 7)

122. మాదా (గుడి); 'మరియ' పేర అంకితమయిన ప్రార్థన మందిరము, మాదా. కోవిల్, మాదాగుడి (మిశ్రబ్రౌ) 'మాదాగుడి మూడు సాల్పులుగా నుండును' (బ్రౌ. ఇం. తె. 28); 'మాదా' మీఁద 'మాతృ' శబ్ద ప్రభావమును ఉన్నట్లు తోచుచున్నది. — బు. మాద్రి క్రైస్తవ సన్యాసిని; స్పా. మాద్రే.

123. మాదిరి : ఒకదినుసు పేకు; 'చదరముగా వుండే పెద్ద పేకుమాను' (మిశ్రబౌ్ర.)—బు. మాదేరా = కొయ్య, కలప; స్పా. మాదేరా = కొయ్య, కలప; మాదేరో : కొయ్యదూలము; కలపవర్తకుఁడు; ఫ్రె మద్రీఏ = దూలము, దంతె, గట్టిబల్ల.

124. మిస్సయాన్ : సంఘము, సమాజము. 'చర్చి = మిసయాన్ ప్రెస్సులో అచ్చు వేయించబడ్డది' (రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారి (1770—1837) తెలుఁగు వ్యాకరణము, ప్రథమ ముద్రణ పీఠిక. 1836); —బు. మిస్సయాను = ధర్మప్రచారకసంఘము; స్పా. మీసియోన్.

125. ముర : తెరచాపక్రింది యంచు? (మిశ్రబౌ్రి.)—బు. అమూరా = తెరచాపం మూల కొసలను బిగుతుగా కట్టియుంచు త్రాడు ; స్పా అమూరా = ఓడ దూలము; అమూరాదా ఓడ లోపలియంచు: మూరో = గోడ; అలంగము.

126. మెలామ : రూ. మొలాము (పండు) : కలంగడిపండు — బు. మెలామ్; స్పా. మెలోన్; ఇం. మెలన్.

127. మేజా (—జ—జు) : బల్ల; 'మేజాపల్కా' (రంగరాట్. పీఠిక. 59) —బు. మేజా; స్పా. మేసా : బల్ల; పీఠభూమి; —ఇం. మెస్ : వడ్డించిన విస్తరి (బౌ్రి. రి.); —పారసి. (కాంబెల్); —హిం. (శ. ర., ఆంభాచ.); ఉత్తర హిందూస్థాన భాషలన్నింటను 'మేజ్' 'మేజ', 'మేజు' శబ్దములున్నవి; కన్నడ మేజా—పారసి (R. Narasimhachar, History of Kannada Language, 119); మరా. —పారసి (మరాఠీవ్యుత్పత్తి పదకోశము); గుజ. మేజ—పారసి (బెల్సారె); మల. మేశ—బు. మేజా; అరబ్బీ. మేజ (గుండర్టు. 863); తమిళ. మేశై—బు. (TL. 3350).

128. మే (జోడు) : మేజోళ్ళు (బహువ.) = పాదరక్షలకు లోపల కాలికివేయు జోడు (శ. ర.) — బు. మేయాష్; — హిం. (బౌ్రి. రి., గాలెటి); మెయి + జోడు అని కొందఱు విడఁదీసిరి. మేజోడును 'మే—జోడు' అని విఱిచి కిట్టెల్ కన్నడములో దేశ్యముగా ఉట్టంకించినాఁడు (పు. 1295); మే + తె. జోడు.

129. ? మేత్రాణులు : క్రైస్తవ పీఠాధిపతి, ఏలినవారు(కర్నూ. నెల్లూ). కాథలిక్ క్రైస్తవ వ్యవహారము; సిరియను క్రైస్తవులలో విపుల ప్రచారముగల ఈమాట బుడతకీచు పాదిరీలద్వారమున ఆంధ్రదేశమునకు వచ్చినది.

130. మేస్తరి ; రూ. మేస్త్రి, మేస్త్రీ, మేస్రి. అన్యదే. వి. పనివారలమీఁద పెద్ద(శ. ర.). నేర్పరియగు పనివాఁడు.—బు. మేష్త్రి = ముఖ్యుఁడు; స్పా. మాఏస్త్రి = చేతిపనుల కొట్టులో ప్రధానశిల్పి; మాఏస్త్రో = నేర్పరి. ఫ్రె. మెత్ర్; — బు. లేక ఫ్రె. (మిశ్రబ్రౌ.); ఇం. (బ్రౌ రి.); కన్నడ. మేస్త్రి — బు. (కిట్టెల్, 1300). మల మేస్తరి—బు. (గుండర్టు, 863); తమిళ్ మేస్తిరి = పర్యవేక్షకుఁడు; ప్రధానశిల్పి; చిప్పవాఁడు; కొని; కులములలో పట్టపుపేరు; ఇం. మెయ్స్త్రి = (1798) నేర్పరియగు పనివాఁడు (G. V. Subbarao. Indian words in English, p. 121).

మేస్తరు : పరంగిజాతి పురుషుల పేర్లకు ముందుచేర్చు గౌరవసూచక పదము. 'మేస్తరు కళలోదొరగారు' (పుదూరి సీతారామశాస్త్రిగారి (1852) ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణపీఠిక); పరవస్తు శ్రీనివాసాచార్య విరచితమగు సర్వశబ్ద సమ్బోధిన్యాగ్రంధ పీఠిక (1875) లో 'మేష్టరు' అనియు; సంస్కృత పీఠికలో 'మేస్తరు' అనియు ప్రయుక్తము. 'మేస్తర్ కార్మైకల్ నామక ప్రభుణా...' పు. 7; 'మేస్తర్ హేనామ్నస్తుప్రభు...' పు. 9; 'మేస్తర్ చార్లెసు పాళ్యోల్యాంరీ డాఖ్యస్తు...' పు. 9; 'మేస్తర్ కార్మైకెలాఖ్యస్తు ప్రభు...' పు. 10; 'మేష్టర్ కార్మైకల్‌దొరవారి....' పు. 14; 'మేష్టర్ డీ. యఫ్. కార్మైకల్ దొరవారు....' పు. 15; మేష్టర్ హే దొరగారి...' పు. 17; 'మేష్టర్ చార్లిస్ ఫిల్లియంరీడ్డు దొరవారు....' పు. 17; 'మేస్తర్, బుడతకీచు భవము; 'మేష్టర్' ఆంగ్లజన్యము.—బు. మేస్త్రి = అధ్యాపకుఁడు; యజమాని; స్పా. మాఏస్త్రో.

మేస్త్రి : చూ. మేస్తరి (మిశ్రబ్రౌ.); పరంగిమేస్త్రి (Arden's Telugu Grammer. p. 354); ....ఇం. (గాలెటి).

మేస్త్రీ : చూ. మేస్తరి (బ్రౌ. రి., అంభావ.)

మేస్రి : చూ. మేస్తరి (అనంత.).

131. మొలామ (పండు) : చూ. మెలామ (మిశ్రబ్రౌ);—ఇం. (బ్రౌ. రి.)

మొ_స్తరు : చూ. మో_స్తరు (మిశ్రబ్రౌ., గాలెటి., శ్రీకా.) ఒకమొ_స్తరు, కొ_త్త మొ_స్తరు (శ్రీకా.).

132. మో_స్తరు : రూ. మొ_స్తరు. మాదిరి, విధము, రీతి; నమూనా; స్వభావము; 'మామూలు రైతులు సైతము ఈ మాటను వాడుదు'రని మిశ్రబ్రౌణ్యము (చూ. పు. 100): బు. అమో_ష్త్రి, మొ_ష్త్రి = పద్ధతి, రీతి; మొష్త్రా్ర్ = ప్రదర్శించు; స్పా. మూఏ_స్త్రి = మాదిరి, మచ్చు; నమూనా. తమిళ. మో_స్తరు = రీతి; నమూనా; —ఉర్దూ. మో_స్తర్. —అరబ్బీ. మౌజాన్ (TL, 3389); ము_స్తరు, మూ_స్తరు —లు తెలుఁగు పదములుగా Port. Voc.P. 233 లో ఉదాహృతము లగుట ప్రమాణము.

యాగాత ; చూ. అగతమ్మ (మిశ్రబ్రౌ.).

యాలం : ఉ, యాలాం, యెలాం; చూ. ఏలము (మిశ్రబ్రౌ., MAMP, III, p. 1026).

133. రతులు : రత్నముల తూనికయందుపయోగించు పరిమాణ విశేషము, పచ్చలతూనిక యందొకయెత్తు. 'అతివినోదముగాఁగ రతులమెప్పించు నీ పచ్చల కడియాల పద్మగంధి' (విజయ. 1—16) —బు. ఆఱ్తల్ = ఒక పరిమాణవిశేషము; మరా. రతల్, ర_త్తల్ —బు; గుజ. హిం. రత్‌ల్; 'రతులు' లోని చివరి 'లు' వర్ణమును బహువచన 'లు' ప్రత్యయముగా భ్రాంతిపడి 'రతి' యను కృతకరూపము తెలుఁగున సిద్ధమయినది. అనుచిత విభాగముచే సిద్ధించిన ఈ 'రతి' నే తెలుగు నిఘంటువు లన్నియు (కాంబెల్ 488; బ్రౌ. 836; శ.ర. 922; బ్రౌ. రి. 1070; లక్ష్మీనారాయణీయము 720; ఆం.వాచ. 2143; సూ. ని. V, 750; శబ్దార్థచంద్రిక, 749) ను స్వీకరించినవి. ఇంగ్లీషునందలి 'కాన్‌స్టేబుల్' లోని అవయవికమైన 'ల' ను బహువచన ప్రత్యయముగా భావించుటవలన కళింగసీమలో 'కనిస్టీపు' అను మాట వాడుక కెక్కినది. కాంబెల్ 'రతి' ని సంస్కృతపదముగా పేర్కొనినాఁడు.

రంబరాళ్లు : చూ. రంబ్రాలు 'వాడ (ఓడ) స్తంభానికి కట్టే నూలు నిచ్చెన' (మిశ్రబ్రౌ.).

134. రంబ్రాలు : రూ. రంబరాళ్లు. 'తట్టుదగ్గఅనుండి చాపలకు అడ్డుగా సమాన దూరములలో కొయ్యల కొనల వరకును పోవు త్రాళ్లు; ఇవి నిచ్చెన వలె ఉపయోగించి కొయ్యల కొనలవరకు నెక్కుటకు పనికివచ్చును. (అం.ఖాచ)—బు. రామాల్ = పగ్గపు చిక్కుము; స్పా. రామాల్ = త్రాటి నిచ్చెన.

135. రీపా (లు) : సన్నని కొయ్యబద్దలు (అనంత); —బు. రీపా = ఇంటి కప్పుక్రింద పెంకులకు ఆసరాగా దంతెలమీఁద వేసెడి పలచని కొయ్యబద్ద (లు): స్పా. రీపియా; కన్నడ, తుళు రీపు: గుజ. మరా. రీప్.

రొదము : చూ. రోదా (మిశ్రబ్రౌ.) = కప్పీ (చక్రము)యొక్క గాడి (రేవు)

రోజా : చూ. రోదా (తెలంగాణము).

136. రోదా : రూ. రొదము, రోజా. బండిచక్రము, రథాంగము (కృ.); 'ఒక దిమ్మలో అమర్చఁబడిన త్రాడు జారుటకు ఏర్పరుపబడ్డ చక్రము' (ఆంబాచ. 641). —బు. రోదా = చక్రము; స్పా. రోదా = బండి జాడ; రోదాజా = చిన్నచక్రము, పళ్లెరము; రోదార్ = అ. క్రి. భ్రమించు, తిరుగు: రూఏదా—చక్రము; ఫ్రె. రో; సం. రథ: కొంకణి, రోదా = బండిచక్రము; సింహళీ. రోదా, రోదె = చక్రము.

137. ? లాంచీ : మోటారు పడవ (గుం., గో.) —బు. లాంష; స్పా. లాంచ = తెడ్ల పడవ; మలయా భాషానిఘంటువులలో నిది బుడతకీచు పదముగా ఉట్టంకితము. బుడతకీచు నిఘంటుకారు లిద్దానిని ప్రాచ్యసీమల పదముగా పేర్కొనినారు.

138. లీస్తు ; పట్టిక, జాబితా (మిశ్రబ్రౌ.) —బు లీస్త: స్పా. లీస్త; ఫ్రె. లీస్త్; ఇం. లిస్ట్, డచ్చి. లియిస్త్; —ఇం. (మిశ్రబ్రౌ.)

వలందు (బాజు) : చూ. ఒలందా (శ.ర.అను). ఒలందావారి ఫౌజు (రంగా. 1—151).

వలందేజా : చూ. ఒలందా (మిశ్రబ్రౌ); మరా వలందేజా - ఇం. హాలండ్ (మరాఠీ వ్యుత్పత్తి పదకోశము 644); గుజ. వలందా-ఇం. హాలండ్ (బెల్సారె, 700).

వళంద : చూ. ఒలందా; 'ఈడము వళంద బందర యింగిలీషు-కళము మొదలైన పేటల గొరలెల్ల .... (హంస. 1-112); 'వళందలు' (పైది 3-28).

వెసలె : చూ వెసల. వెడల్పు మూతిగల చిన్నమట్టిపాత్రము (కాంబెల్ 543; బ్రౌ. 917).

వేలము : చూ. ఏలము (శ.ర., ఆం.వాచ., గాలెటి). ఎన్ను-వెన్ను, ఆరతి-హారతి, అరబ్బీ-హరబ్బీ, అడపము-హడపము, తెంచు-త్రెంచు; ఈ జంటలలో మొదటివి ప్రాచీనములు; సహజములు. ద్వితీయములు అర్వాచీనములు, కృతకములు. మొదటి వరుసలోనివి అప్రామాణిక ములను భ్రాంతి, రెండవ వరుసలోని వికృతిక ప్రామాణికరూపముల సృష్టికి హేతువు. ఇట్లే 'ఏలము' అను దానికి ఈ 'వేలము' కృతక రూపము.

వేలాం : చూ. ఏలము (మిశ్రబ్రౌ).

140 వైను ; ద్రాక్షరసము; క్రైస్తవపరిభాష (బ్రౌ. ఇం. తె.) -బు. వైన్యు = వైను సారాయి; డచ్చి; విఝన్; ఇం. వైన్; ఆంగ్లశబ్దభవమని అనరాదా యనుట స్థూలదృష్టి. దీని మూలరూపము హిబ్రూ భాషా గతము. బైబిలు ద్వారముననే తొలుత దీని పరిచయము. పారిభాషిక పదములను వీలయినంత దాక భాషాంతరీకరింప రాదను నియమ మును నాటి బైబిలు అనువాదకులు చాలవరకు పాటించిరి. (C. P. Brown, Preface to his English-Telugu Dic. P, IX) క్రైస్తవమత ధర్మవాహకముగా భారతీయ భాషావ్యవహర్తలకు ప్రప్రథమమున పరిచయము కలిగినది బుడతకీచులతో. ఈ చూపుతో 'వైను'ను బుడతకీచు భాషా సంబంధిగా ఇచట పేర్కొనుట.

141. శాంతోము : చెన్నపట్టణములో నొకపేట; పరంగికొండ పరిసర ప్రాంతము; జువోన్ దీ కస్త్రు (1545-48) గోవాలో బుడతకీచు గవర్న

రుగా నుండిన కాలమున పోర్చుగాలు చక్రవర్తి మూడవ జాన్ వేయించిన ఒక బంగారు నాణెము. —బ. సాంతోమి; ఇం. సెయింట్ థామస్ మౌంట్.

శావి : చూ. చెవి. చెవికంటె 'శావి' యే ఐరోపీయ పలుకుబడికి చేరువ; —ఇటా బ (మిశ్ర బ్రౌ. 122).

142. సక్రీస్తు : రూ. సంక్రిస్త. పాదిరిగుడిలో పవిత్ర పాత్రములు. వస్త్రములు భద్రపఱచు విభాగమునకధికారి. —బ. సక్రిస్తాన్, సక్రిస్తి; కన్నడ. సక్రిస్తీ; తమిళం. సక్రిస్తీ.

143. సగ్గు : రూ. సబ్బు ¹. ఒకరకము చెట్టుపాలనుండి తయారుచేసెడి కృత్రిమ ధాన్యము, సగ్గుబియ్యము; °బియ్యము, చూ. సగ్గు (అనంత.); —బ. సాగూ; స్పా. సాగూ, సాగో; డచ్చి. సగొ; ఫ్రె సాగూ; ఆంగ్లము ద్వారమున తెలుగున జేరిన మలయా భాషాపదమని బ్రౌ. రి., గా లెటి.

సంక్రిస్త : చూ. సక్రిస్త (కర్నూ., నెల్లూ.); కొంకణి. సాంక్రిస్త

సంత్ర : చూ సాంత్రా (నారింజ) (కడప, తెలంగాణా).

సబ్బతు : చూ. సబ్బాతు; °దినము, సబ్బతోత్సవము (పూర్వ నిబంధన. 6, 7 కాండములు, నెల్లూరి ప్రతి).

144. సబ్బాతు : రూ. సబ్బతు. బైబిలు పూర్వనిబంధనలో శనివారము, క్రొత్త నిబంధన ప్రకారము ఆదివారము; క్రీస్తు పునరుత్థాన చిహ్నమగు సబ్బాతు పుణ్యదినము, ఆదివారము. —బ. సాబాదు = సర్వేశ్వరుని విశ్రాంతి దినము. శనివారము; స్పా. సాబాదో = శనివారము; హిబ్రూ. షబ్బాత్; తిరునల్వేలి మండలములోని 'Hindu Church of the Lord Jesus' శాఖీయులు పాతనిబంధన ప్రకారము శనివారమునే సబ్బాతు దినముగా పరిగణింతురు (MAMP, Vol I p.).

సబ్బు1 : చూ. సగ్గు. ంబియ్యం (సేలము); 'బియ్యము (కాంబెల్); సబ్బియ్యం (గుం); సబ్బీము (అనంత); మరా. సాబూదాణా, సాబు+దాణా; -దాణా = ప్రా. ధాణ = సం. ధాన్య-.

145. సబ్బు2 : దే. వి. జిడ్డును పోఁగొట్టెడి ఒక విశేషమైన క్షారము (శ. ర.); 'తనరి యుండును వస్త్రధావన పదార్థసంజ్ఞ చౌకార మనఁగను సబ్బు నాఁగ...' (ఆం.భా. 2-301); సబ్బిళ్ల, సబ్బుబిళ్ల.-బు. సబాను; స్పా. హాబోన్: ఫ్రె. సవోఁ; కన్నడ. సబ్బు; -హిం. (కాంబెల్, అంభాచ.); -ఇం. (బ్రౌ.రి., శ.ర. అను., గాలెటి).

146. సాంత్రా (నారింజ) : రూ. సంత్ర. మేలిదినుసు నారింజ బు. చింత్రా = పోర్తుగాలులోని 'చింతా' పట్టణ పరిసరముల పండెడి నారింజపండ్లు ప్రపంచ ప్రసిద్ధము; 'సంగ్‌తారా'అను పారసి పద భవమని కొందరు; భూటాను కొండల దిగువను గల 'సంత్రబారీ' యను గ్రామము నుండి ఈ పేరని కొందరు.

147. సార్జంతు : రూ. సార్జెంతువు. భటులమీఁది ఉద్యోగి, జాతి బంట్రోతు (మిశ్రబ్రౌ.); 'సార్జంతుల్' (రంగా. 1-147);-బు. సర్జెంతు; స్పా. సార్జెంతో; ఫ్రె. సర్‌జాఁ;-ఇం. (బ్రౌ. రి., శ. ర. అను) పరాసు భాషా పదమని వీరభద్రరావుగారు.

సార్జెంతువు : చూ సార్జంతు (మిశ్రబ్రౌ).

148. సోడిదేవు : జూదము మొదలైన వానిలో సర్వస్వమును వెచ్చపెట్టి బీద వడినవాఁడు (అనంత). -బు. సోర్తి = లాటరీ; స్పా. స్వేర్తే = చెట్టు పుట్ట కొట్టి క్రొత్తగా సాగిఁన భూఖండములో చీట్లువేసి పంచుకొనిన భాగము; చీట్లు వేయుట, లాటరీ; మరా. సోడిత = లాటరీ-బు. కొంకణి. సోడ్తి, సోర్తి = లాటరీ.

సోలుదాదు (లు) : చూ. సోల్దాదు (లు). పరంగి సైనికులు; 'సోలుదాదులు' (రంగా. 1-147).

149. సోల్దాదు (లు}:రూ. సోలుదాదు (లు).పరంగి సైనికులు; సోజరు (మిశ్ర బ్రౌ.;) సోలాదివాండ్లు. - బు. సోల్దాదు = సైనికుఁడు; స్పా.

సోల్దాదో = సిపాయి; సోల్దాదా = జీతములు; సోల్దాదేరా = సిపాయి యైన మగనిని అనుసరించిపోవు భార్య; ఫ్రె. సోల్ద; దచ్చి. సొల్దాత్: —ఫ్రె. (మిశ్ర బ్రౌ.); వీరభద్రరావుగారును ఫ్రెంచినే మూలముగా నిర్ధారించిరి.

150. స్పిరితుసాంతు : పరిశుద్ధాత్మ (క్రైస్తవ పరిభాష; కర్నూ.. నెల్లూ.); సాంక్త స్పిరిత = సత్పురుషుఁడు; సాంక్తుఁడు మహాపురుషుఁడు అను వాడుకలును కలవు: 'స్పిరితు సాంక్తువు' (మత్తయి సువిశేషము); 'స్పిరితు సాంక్తు ప్రేరేపకము' (మార్కు సువిశేషము); ఇవి లాటిన్ మాటలు; —బు. స్పిరితుసంతు.

హిస్సోపు : చూ. ఏసోబు; °కుంచె (నిర్గమ. అధ్యా. 12); °పుడక (యోహాను. అధ్యా. 20); °మొక్క (రాజులు 1. అధ్యా. 15); ?— ఇం. హిసప్.

మరాఠీలోని తెలుఁగు నుడులు

'యద్వై వాఙ్ నాభవిష్య
న్న ధర్మో నాధర్మో వ్యజ్ఞాపయిష్యత్
న సత్యం నానృతం నసాధు నాసాధు
న హృతయజ్ఞో నాహృదయజ్ఞో
వాగే వైత త్సర్వం విజ్ఞాపయతి
వాచ ముపాస్స్వేతి.

—ఛాందోగ్యోపనిషద్, 7-2-1.

పదునాలేండ్ల క్రిందటిమాట. 1954 లో పూనా దక్కన్ కళాశాలవారి ఆధ్వర్యమున నిర్వాహకుయిన భాషావిజ్ఞాన విద్యాలయము (Linguistic School) లో ఈ వ్యాసకర్త విద్యార్థిగా శిక్షణము నందుచుండిన కాలము.

ప్రస్తావన

1954 డిసెంబరులో పాతికమంది మిత్రులతో పాటు అజంతా ఎల్లోరాలు దర్శించుట తటస్థించినది. ఆ బృందములో ఆంధ్రులేగాక ఓఢ్రులు, కన్నడిగలు, కశ్మీరీయులు, తమిళులు, బెంగాలీలు, మరాఠీలు, మలయాళీలు మున్నగువారుండిరి. పూనా తిరుగుపయనములో సహాధ్యాయులు మిత్రులు శ్రీ కె. జి. గుజరాతిగారిని ఉబుసుపోకకు జ్ఞానేశ్వరిలోని కొన్ని ఓవీలు— మరాఠీ సాహిత్యములో ఓవీయను ఛందములో వ్రాయఁబడిన పద్యములు ఓవీలు —చదివి వివరింపఁదని కోరుట జరిగినది. ఆ ప్రసంగ మాంగ్లమునందే సాగినది. అప్పటికి జ్ఞానేశ్వరిని గూర్చిన స్థూలమయిన చారిత్రక జ్ఞానము వ్యాసకర్త కుండెడిది. ప్రసిద్ధమయిన భగవద్గీతకు మరాఠీ భాషలో భావార్థ దీపిక యను పేర ఓవీఛందములో సంతరింపఁబడిన విపుల వ్యాఖ్యాన రూప మిది. కర్త

నామమును పురస్కరించికొని భారవి మాఘముల వలె సంక్రమించినపేరు జ్ఞానేశ్వరి. ఇది ఇంచుమించు పదివేల ఓవీల గ్రంథము. ప్రసిద్ధ భక్తకవి జ్ఞానేశ్వర కృతము. మహారాష్ట్రీయ భాగవత ధర్మపంథకు పరమప్రమాణము. అతిగహనమయిన వేదాంత తత్త్వరహస్యములను అరఁటి పండొలిచి చేతికం దిచ్చిన రీతిగా అలఁతి యలఁతి పలుకులతో అమృతంపు గుళికలవంటి ఉపమలతో దిద్ది తీర్చిన రుచిర రచనము జ్ఞానేశ్వరి.

గుజరాతిగారు మొట్టమొదట చదివినది జ్ఞానేశ్వరి సంపాదకుఁడయిన ఏకనాథుని పద్యము. ఏకనాథుఁడు పదునాఱవ శతాబ్దివాఁడు. జ్ఞానేశ్వరి అనేకములయిన పాఠాంతరములతో, ప్రక్షిప్తములతో నిండియుండఁగా బహుప్రతులను పరిశీలించి కవి హృదయము నెఱిఁగి శాస్త్రీయముగా సాధుపాఠములను సవదరించిన సత్య సంశోధకుఁడు ఏకనాథుఁడు. గుజరాతిగారు పఠించిన ఆ పద్య మిది :

"జ్ఞానేశ్వరీ పాఠీ జో వోవీ కరీలా మరాఠీ
తేణేం అమృతాచియో తాటమ్ జాణవరీటీ తేవిలీ"

'జ్ఞానేశ్వరి పాఠములో ప్రక్షిప్తములను ఇముడ్చు వాఁడు అమృత పాత్రమున కొబ్బెర చిప్పను చేర్చువాఁడు' అని దీని అర్థము. ఆయన వివరణము విన్న తరువాత 'చాంగు భళా' యను ప్రశంసాపదావళితో నా మెచ్చికోలును దెలిపితిని. "మీకు మరాఠీ వచ్చునా ?" యని గుజరాతి మహాశయుని ఆశ్చర్యభరితమయిన ప్రశ్న ! 'అరెబాస'తో నాకు బొత్తిగా పరిచయములేదని చెప్పితిని. ఆయన నమ్మలేదు. కారణమేమనఁగా 'చాంగు భళా' యను రెండును మరాఠీ మాటలు: పాల్కుఱికి సోమనాథుని రచనములలో ప్రశంసార్థకములుగా బహువారము లివి ప్రయుక్తము. 'ఏకనాథుని కెంత తెలుఁగు వచ్చునో నా కంత మరాఠీ వచ్చు' నని చమత్కరించితిని. 'ఏమి టేమిటి ?' యని ఆయన కుతూహలము. 'తాటిమ్'లోని 'తాట' తెలుఁగువారి 'తట్ట' యని వివరించితిని. మాతో పాటు పయనము సేయుచున్న సహప్రతులు మంగ్రూల్కర్ మొదలగు మరాఠీ మిత్రులను, పూనాలో ఆచార్యబాపత్ మున్నగు పండితులను సంప్రతించి 'తాట' తెలుఁగువారి సొంత మాట యని తీర్మానించిరి. ఆ తరువాత కొంత కాలము మరాఠీమిత్రుల శుశ్రూషచేసి మరాఠీలో మిడిమిడి జ్ఞానమును సంపాదించితిని.

నేఁటికిని ఆ భాషలో పరిమిత పరిచయము (working knowledge) తప్ప పరిగణింపదఁగిన ప్రవేశము నాకలవడలేదు. నాఁటినుండియు నేఁటిదాఁక ఆ చూపుతో జరిగిన పరిశీలనము వలని ఫలిత మీ వ్యాసము. భారతీయ భావసమైక్యము నావశ్యకత ప్రబలుచున్న ప్రకృతయుగమున ఈ రెండు భారతీయ భాషల పరస్పర ప్రభావమును గూర్చి పరిమిత పరిధులలో ప్రదర్శించిన యీ వ్యాసము మున్ముందు జరుగవలసిన పర్యాప్త పరిశీలనమునకు ప్రస్తావనా ప్రాయము కాఁగలిగినచో వ్యాసకర్త ఉద్యమము ధన్యము.

తెలుఁగు - మరాఠీల సంబంధము

తెలుఁగు - మరాఠీ భాషలు భౌగోళికముగా పరిసరస్థభాషలు. వ్యుత్పత్తి పరముగా పరస్పర విజాతీయములయిన ఈ రెండుభాషల మధ్యఁ గల కొన్ని సాదృశ్యములు చారిత్రక భౌగోళిక మత విషయక సాంస్కృతికాద్యనేక సంబంధముల మూలమున సంభావ్యములయిన ఆదాన ప్రదానములకు ప్రధాన నిదర్శనములు. మరాఠ్వాడా-తెలుఁగు నాడులకుఁ గల ఇట్టి సంబంధ బాంధవములు ఇక్ష్వాకుల తాతముత్తాతల నాఁటివి. దక్షిణాపథ పతులగు శాతవాహన చక్రవర్తుల పరిపాలనా కాలమునాఁడు మరాఠ్వాడా - తెలుఁగు నాడులు ఇంచుమించు నన్నూటేండ్లపాటు ఒక గొడుగుసీడ కూడిమాడియుండుట జగమెఱిఁగిన చరిత్రము. ప్రాకృత సాహితీక్షేత్రమున మధుర దర్శనమగు 'సత్తసఈ'-గాథాసప్తశతి-పై గాఢమయిన తెలుఁగు ముద్రకలదని సాహితీ సుగతుల స్వగతము.

ప్రాక్కాలిక బాంధవము

మరాఠ్వాడాను ఏకాతపత్రముగా ఏలిన పశ్చిమ చాళుక్యవంశీయుల ఒక రెమ్మయేకదా సాగరాంధ్ర సీమల వేంగీ రాజమహేంద్రవరములు ఆలవాలములుగా ప్రాచ్యశాఖగా ప్రవర్తిల్లుట! ఆనాఁటి నుండియు ప్రాక్పశ్చిమ చాళుక్య ప్రభువంశముల మధ్య సాగిన నిరంతర జ్ఞాతి కలహములు చరిత్ర ప్రసిద్ధములు. పూర్వ చాళుక్య ప్రభువగు గుణగ విజయాదిత్యుని మహామాత్యుఁడును, సేనానియునునగు 'పండరంగు' ఈయదనున ముఖ్యముగా పేర్కొనవలసిన వ్యక్తి. ప్రభుపరముగా పండరంగు (క్రీ.శ. 849) నిర్వహించిన జైత్రయాత్రలు -

నేటి మధ్యప్రదేశమునందలి మరాఠీమండలములకును విస్తరించినట్లు శాసన ఫలకముల కథనము ధర్మవరము శాసనము ఎత్తుగీతియందు ప్రసక్తమయిన స్థలనామములనేకము మరాఠ్వాడాలోనివి [1]. కిరణపురము మధ్యప్రదేశములోని 'బాలేఘాటు' మండలమునందలి కిరణపుర మను గ్రామము. చేది మండలము నకు అర్వాచీన నామము దహాలదేశము. ఈ దహాలము మధ్యప్రదేశములోని బుందేలు ఖండప్రాంతము. శాసనము నందలి 'దహాలనిరుతము' దహాల మండలములో నైరృతి భాగము. మధ్య ప్రదేశములోని నేటి 'ఏలిచ్‌పూర్' నాటి అచలపురమంట! [2] మరాఠ్వాడా తూర్పుజిల్లలోని దత్తవాడ, బార్శూరు, బైరంఘడ్ (బస్తరు) ప్రాంతములు నాటికిని నేటికిని అధిక సంఖ్యాకులగు ఆంధ్రుల కావాసములు. పూర్వోక్త ప్రాంతములలో చోడ వంశో ద్భవులు, కరికాలాన్వవాయులు నిలిపిన ఆంధ్రభాషామయ శిలాశాసనములు ఆ భూములయందలి తెలుగు ప్రభుతకు శాశ్వతాశాసనములు. పశ్చిమ చాళుక్య ప్రభువగు సోమేశ్వరదేవుని 'అభిలషితార్థచింతామణి' త్రిలింగ పరమేశ్వరులగు కాకతీయ చక్రవర్తుల రాజ్యతంత్ర నిర్వహణమునకు మార్గదర్శకముగా నుండి నట్లు చరిత్రకారుల నిర్ణయము.

నెల్లూరి '......మన్మ విభు పంపై చన్న సైన్యంబు....... మహారాష్ట్రి సామంతు........ సారంగున్ దోలి తురంగమున్ గొనిన సంగ్రామము ....' (నిర్వచనో. 1-43) తెలుగు - మరాఠీల సరాసరి సంబంధములకు చక్కని సాక్ష్యము. దేవగిరి యాదవరాజుల పరిపాలనము మరాఠ్వాడా చరిత్రములో స్వర్ణయుగము. రామచంద్రదేవుడు (క్రీ శ. 1271 - 1309) ఈ యాదవ రాజులలో సుప్రసిద్ధుడు. ఇతని మహామాత్యుడే హేమాద్రి. క్రీ శ. 1277 నాటి పంఢరపుర శిలాశాసనమునను, క్రీ. శ. 1279 నాటి ఉణ్కకదేవ శిలా శాసనము (ఆదిలాబాదు మండలము) నను పరికీర్తితుడయిన మహాప్రౌఢ ప్రతాప చక్రవర్తి శ్రీరామ చంద్రదేవుని మహాప్రధాని యగు హేమాదియును, చతుర్వర్గ చింతామణికర్త యగు హేమాద్రి పండితుడును అభిన్నులని చరిత్రకారుల నిర్ణ

---

1. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ధర్మవర శాసనములు, భారతి, విభవ చైత్ర సంచిక.
2. ఖండవల్లి ఈశ్వరదత్తు, ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదువారి ప్రచురణ, 1963, పుటలు3, 84,156.

యము. వ్రత దాన తీర్థ మోక్ష పరిశేషములను నైదుఖండములలో సంగ్రథిత మయిన విజ్ఞాన సర్వస్వమీ చతుర్వర్గ చింతామణి. యాదవరాజుల దేవగిరికిని, త్రిలింగ పరమేశ్వరుల ఓరుగంటికిని గల రాజకీయ సంబంధములు చిరకాల సమీచీనములు.

రెడ్డిరాజుల కాలము

కాకతీయ పాలకుల కొలువులో మెలఁగి పాలకుల మేఁకువ లెఱిఁగిన రాజనీతి కోవిదుఁడు ప్రోలయవేమారెడ్డి (క్రీ. శ. 1300 – 1353). ఓరుగంటి పతనములో మధ్యాంధ్ర మహీమండలమున స్వతంత్ర పతాకమెత్తిన ఈ రెడ్డి బిడ్డ రెడ్డిప్రభువుల కుదురునకు మూల పురుషుఁడు రెడ్డిరాజులకు ఒండు రెండు తరములు పూర్వుఁడయిన హేమాద్రి పండితుని చతుర్వర్గ చింతామణికి సాగరాంధ్ర సీమలో నుండిన ప్రశస్తి ప్రచార ప్రభావములు అనన్యములు. చతుర్వర్గ చింతామణి త్రిలింగరాజ పరమేశ్వరు (కాశీ. 3–248) లగు రెడ్డిరాజుల నిత్యానుష్ఠానముల యెడ ప్రమాణ గ్రంథముగా చెల్లుఁబడి యగుచుండినట్లును, అది వీరి విమల చారిత్ర శిక్షకాచార్యకము వహించినట్లును ప్రమాణములు బండ్లకొలఁది. రెడ్డిరాజులందఱును హేమాద్రి ప్రోక్త దాన పరులు; హేమాద్రి దాన చింతామణి బిరుద విరాజితులు. ఈ బిరుదములు కేవలము కులక్రమాగతము లని కొట్టివేయ వీలులేదు. ఇవి రెడ్డిరాజుల వితరణ గుణ ప్రదర్శకములయి. ప్రతి పదసార్థకములయిన బిరుదము లని వారి శాసనాదికములు ప్రత్యక్ష సాక్ష్యము.[3]

రెడ్డిరాజులు పెక్కురు 'ధారాపట్టణసార్వభౌమ సురధాణర్పాపహార క్రియా

3. శ్రీశైల శాసనము. A. R. No. 20 of 1915. క్రీ. శ. 1377; కుమారగిరిరెడ్డి అనపర్తి తామ్ర శాసనము, క్రీ.శ. 1390, రెడ్డి సంచిక పు.381; తంగెడ శాసనము A.R.No. 380 of 1926, క్రీ.శ. 1391; అమీనబాద శాసనము, A. R. No. 543 of 1909, క్రీ.శ. 1415; పలివెల కొప్పేశ్వరస్వామి దేవాలయ కళ్యాణ మంటప స్తంభము మీఁది శాసనము, A. R. No. 508 of 1893; క్రీ. శ. 1416; మన్యమాపురపు శాసనము, Local Records, Vol III; రెడ్డి సంచిక పు. 41; ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశము, పీఠిక. 19; నిశ్శంకకొమ్మన శివలీలా విలాసము, పీఠిక; శ్రీనాథుని కాశీఖండము, 5–1.

ధోరంపర్యము' కలవారు 4, ధారానగరము రాజధానిగా మరాఠ్వాడాలోని ప్రాగ్భాగములందలి మాల్వామండలము నాకాలమున పరిపాలించిన సులతానులే ధారాపట్టణ సార్వభౌములు. బహమనీ సామ్రాజ్యము బద్దలగుదాఁక మరాఠ్వాడా తెలంగాణము లొక యేలుబడిలోని మాగాణములు. మహారాష్ట్ర విజృంభణముతో దాక్షిణాత్య సీమలపై జరిగిన మరాఠీల దండయాత్రలు చరిత్ర ప్రసిద్ధములు. టిప్పు సులతానుతో జరిగిన మైసూరు యుద్ధములలో విజయలక్ష్మిని చేపట్టుటకు ఇంగ్లీషు కుంఫిణీ వారికి బాసటగా నిలిచినందున పశ్చిమాంధ్ర ప్రాంతము (అనంతపురము, కడప, బళ్ళారి మండలములు) మహారాష్ట్ర పాలకులకు పసదనపు వాటాగా నిర్ణీతమయినను కొన్ని రాజకీయ కారణముల వలన ఈ నిర్ణయము ఆచరణమునందననూదితము: అనూదితమయి యుండినచో ఈ ప్రాంతముమీఁద మరాఠీ ప్రభావము ఇప్పడిగా ముప్పడిగా పడి యుండెడిది. ఆనంద రంగరాట్ఛంద కృతిస్వామియగు విజయానందరంగ పిళ్ళె 'తన పేరు విన్నంత దద్దరిల్లి మరాఠి పౌజు చీకాకుగాఁ బరువులెత్త....వాసి చెందిన (రంగరాట్. పీఠిక, 119) వాఁడు: నిజాముహయాములో మరాఠ్వాడాలోని ప్రాగ్దక్షిణ సీమయును, ఉత్తరాంధ్ర భూమియును రాజకీయాది సంబంధములు కలవి. తంజావూరు నేలిన మహారాష్ట్ర ప్రభువుల ఆంధ్ర భాషాసేవ దక్షిణాంధ్ర యుగమున ఒక విశిష్ట లక్షణమునకు లక్ష్యభూతము.

ఆరెబాస

మరాఠీ భాషయును తద్వ్యవహర్తలును 'అరెము', 'ఆరె' అను నామములతో తెలుఁగునాట వ్యవహృతమగుటకు మధ్యయుగముల నుండియు ప్రమాణములు కోకొల్లలు. పండితారాధ్య చరిత్రమునందలి 'అరెపరుస' నడకలు సుపరిచితము (పండితా. పర్వత. పుటలు 381–387)'....ఆరెలుఁ గన్నడీలరవలుఁ దెలుఁగులుఁ దన బిరుదందియఁ దవిలికొలువ నెగడి...'(ద్వా. 1-42) న వాఁడు సనదవ్రోలి వెన్నయమంత్రి. వెలనాటి చోడవంశాలంకారుఁడగు గొంక నృపాలుని కూర్చు మంత్రియగు నీ వెన్నయామాత్యుఁడు పదుమూఁడవ శతాబ్దివాఁడు.

---

4. శ్రీనాథుని కాశీఖండము, 1–34, 1–68, 5–237, 6–309; భీమేశ్వర పురాణము, 1–29; నిశ్శంకకొమ్మన శివలీలావిలాస పీఠిక.

సింహాసన ద్వాత్రింశికాకర్త యగు కొలని గోపరాజు (క్రీ. శ. 15వ శతాబ్ది) ఈ వెన్నయమంత్రి కనంతరమేడవ తరమువాఁడు. అమీనుఖానుని తనయుఁడగు గతాతఖానుఁడు 'అరబి పారసి గుజరాతి యారె మచ్చ తెనుఁగు కన్నడి మొదలుగాఁ దెలిసి వ్రాయ దారి గన్నట్టివాఁడు .... (యయా. 1-47). అమీనుఖానుఁడు యయాతిచరిత్ర కృతి పతి; గోలకొండనవాబు మల్కిభరాము (క్రీ. శ. 1550-1581) నొద్ద రాజకీయోద్యోగి. ఆఁనాటి రాచవారలలో అనేకులు 'ధీరులు సన్నుతింప బహుదేశ లిపుల్ బహుదేశ భాషలన్ సార కవిత్వ సౌష్ఠవ రసజ్ఞతయున్ దమసూక్ష్మ బుద్ధిచే నేర్చినట్టి....' (రామవిలాసము, పు. 35) వారు.

పాండురంగ విఠలుని ప్రభావము

మరాఠ్వాడా నడిగడ్డలో పంఢర పురమున వెలసిన పాండురంగవిఠలుని యెడ తెలుఁగు వారికిఁ గల భక్తి ప్రపత్తులను గూడ ఈ సందర్భమున లక్ష్యీకరించుట ఆవశ్యకము. మరాఠ్వాడాలోని భాగవతపంథవారు విఠలేశ్వరోపాసకులు. ఈ పంథలో ముఖ్యుఁడగు జ్ఞానేశ్వరుఁడు (క్రీ. శ. 1275 - 1296) ప్రముఖవ్యాఖ్యాత. కాకతీయుల కాలమునాఁటి ద్విపద రామాయణకర్త బుద్ధారెడ్డి యొక్క తండ్రి విఠ్ఠలాధీశుఁడు పాండురంగ విఠలనాథనామ చిహ్నితుఁడని పెద్దల యభిప్రాయము[5]. బుద్ధారెడ్డి పుత్రులలో విఠ్ఠల భూపతి నామాంకితుఁ డొకఁడు కలఁడు[6]. ద్విపదరామాయణ కర్తృత్వ వివాదమున బుద్ధారెడ్డికి ప్రతివాది యగు రంగనాథుఁడొకఁడు మన తెలుఁగు కవుల జాబితాలో చేరినాఁడు. మఱి, ఈ రంగనాథుఁడు భీమరథీ సరిత్తటమునందలి పాండురంగ విఠ్ఠలనాథుని పేరిటివాఁడో, ఉభయ కావేరీ మధ్యమునందలి శ్రీరంగనాథుని పేరిటివాఁడో చెప్పలేము. రెండవ యూహామే సత్యస్వరూపమునకు సమీపము

5. 'మా తండ్రి విట్ఠల క్ష్మాధీశు పేరా...... శ్రీరామ చరిత - మొప్పఁజెప్పెద... ...' అని రంగనాథ రామాయణావతారిక, క్రీ. శ. 13వ శతాబ్ది.

6. 'భూనుతుఁడగు గోన బుద్ధ భూవిభుని - సూను లుదారులు సుగుణ భూషణులు ఘనుఁడు మీసరగండ కాచ భూవిభుఁడు - వినుత పుణ్యుండగు విట్ఠ భూపతియురచియించిరుత్తర రామాయణంబు ...... కాండాంతము, ఉత్తర కాండము, ద్విపద రామాయణము).

కావచ్చు. పాండురంగ విఠ్ఠల నామధేయులగు శతాధికవ్యక్తు లానాఁడు తెలుఁగు నాట నున్నట్లా నాఁటి శాసనములు సాక్ష్యము.

తెలుఁగుసాహితి :

పాండురంగ విఠలుని ప్రశస్తి

శిల్ప కళాసీమ యనఁదగిన విఠలరాయ దేవాలయమును పాండురంగి సేవాసావధానులగు విజయనగరాధీశులు హంపి విజయనగరములో నిర్మించుట తెలుఁగువారికి క్రొత్తకాదు. తెనాలి రామకృష్ణుఁడు (క్రీ. శ. 1510 – 1580) పాండురంగక్షేత్ర మాహాత్మ్యమును ప్రబంధరూపమున పంచాశ్వాస పరిమిత ముగా నాంధ్రమునఁ బ్రపంచించినాఁడు. పాండురంగక్షేత్ర మూర్తుల ప్రసక్తి విడిగా ఆంధ్ర సాహిత్యములో లేక పోలేదు. 'పండరంగి నుండి వచ్చి ....' (తాళ్ళపాక. శృంగార సంకీర్తనలు, కీర్తన 26, పు. 19). 'పాండురంగ మండలి విఠలునకు సాష్టాంగంబు' (పంబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము. 880). 'వినోదకాఁడ వౌదువు విఠలేశ్వరా – వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా ....పాండురంగమునా చల్లగా నెలకొంటి జయ విఠలేశ్వరా (తాళ్ళపాక. ఆధ్యా. సంకీ. సంపుటి X, సంకీర్తన 171), 'పాండురంగమునఁ బాటిలు విఠ్ఠలదేవునకు సదా దిగ్విజయము లని.' (హంస. 4-214). 'వసుధఁ జూడఁ జిన్నవానివలె నున్నవాఁడు – వెస నన్నివిద్యలాను వెలసె విఠ్ఠలుఁడు.... గట్టిగాఁ బుండరీకుడు' కడువేడుకఁ బెట్టిన – ఇట్టికపీటపై నున్నాఁడీ విఠ్ఠలుఁడు' (తాళ్ళపాక. అధ్యా. సంకీ. సంపుటి VI. సంకీ. 217). '....భైమి దక్షిణదిక్తట ప్రాంతభూమి సకల దివిజులతోడ సాక్షాత్కరించి పుండరీకుని మనిచిన పాండురంగ విఠలాధీశు....' (ఘటికా. 1–65).

మాహూరమ్మ

కాకతీయుల కాలమున ఏకశిలానగరమునసేగాక తెలుఁగు సీమలో పలు తావుల కాకతమ్మకు సైదోడుగా, మాహూరమ్మక్కనాచిగా, ఎల్లమ్మదేవరగా, బవనీల జవనికపాటల పరశురాముని కథలెల్ల పాడించిన ఏకవీరా మహాదేవిగా జాతరలలో తెలుఁవారి పూజలఁగొనిన (క్రీడా. పు 41-45) దేవతామూర్తి మరాఠావారికిని పరదేవతామూర్తి మాహూర గ్రామ నివాసిని యగుటచే పరశు

రాముని తల్లి రేణుకాదేవి మాహూ(హూ)రమ్మగా వ్యవహరింపఁబడినది. ఈ మాహూర ఆదిలాబాదు మండలము కిన్వట్ తాలూకాలో నేఁటి 'మాహూర' యను గ్రామము. మాతాపురము దీని పూర్వనామము. సమస్తలోక జనని శ్రీ ఏకవీరాంబికకు సంవాసస్థాన మగుటచే మాతాపురనామము సర్వథా సార్థకము. క్రీ. శ. 1279 నాఁటి ఉఖ్ఖాకదేవ (<ఉక్షోదక దేవ = శ్రీరామచంద్ర) శిలాశాసనమున మాతాపుర నివాసియును, శరణనాయకుని కుమారుడును నగునొక శిల్పి పేర్కొనఁబడినాఁడు. మాతాపురమే మరాఠీ భాషలో మాహూరగా మార్పు చెందినది (మాతాపుర > మాఆవుర > మావుర > మాహూర). ఉఖ్ఖాకదేవక్షేత్రమునకు పడమరగా పదికోసుల దూరమున మాహూర గ్రామ మున్నది. పంచకృష్ణపంథ (మహానుభావ పంథ)కు చెందిన దత్తాత్రేయ భక్త కోటికి నేఁటికిని మాహూర ముఖ్యకేంద్రము.[7] 'మండపాకను బెనుఁబాక మాహూరమున — నాగవరమున వోలాస ననిచె నింతి — ఓరుగంట వసించె నీలోత్పలాక్షి—కాకతమ్మకు సైదోడ ఏకవీర' (క్రీడా. పు. 42) అను క్రీడాభిరామ కర్తృ సాక్ష్యము నైతమిట అనుసంధింపఁ దగినది. 'నెయ్యంపుఁ గొడుకుచే ముయ్యేడుసారులు సుక్షత్త్రియ కులంబు నిక్షత్త్రముగఁ జేయించి హైహయరాజ దంతాస్థి పటలంబు గవడ పేరుగఁ జేసికొన్న కోపకర్తె' కావున మాహూరమ్మయే ఏకవీరాదేవి. మాహూరమ్మయే నేఁటి తెలుఁగునాటి గ్రామదేవత యగు మారెమ్మ. ఏతద్దేవీ ప్రభావ సూచకములగు మారెక్క. మారెప్ప, మారెమ్మ యను వ్యక్తినామములు పశ్చిమాంధ్రమున అతిప్రచరములు. తెలుఁగునాట బవినీంద్రు మొదలగువారు పాడు రేణుకకథ, పరశురామపురాణములు కూడ నిందులకు ప్రబల నిదర్శనములు.

మరాఠీ సంస్కృతి ప్రభావము

తెలుఁగునాటిని చనిననాథుల ఉఖ్ఖాత లూఁగించిన నవనాథ సంప్రదాయమునకు మరాఠ్వాడా జన్మభూమి. ఈ సంప్రదాయమున కాద్యులయిన మత్స్యేంద్ర గోరక్షనాథుల గాథలు, బోధలు ఆంధ్ర సాహిత్యక్షేత్రమున ఒకనాఁడు ముక్కారు పంటలు పండించినవి. పత్తికొండ సీమ (కర్నూలు మండలము)కు చెందిన ఆరె

7. Prof. S. G. Tulpule, An old Marathi Reader, Venus Prakashan Poona, 1960, p. 94.

మరాఠీల కథయు, పానుగంటి సీమ (తెలంగాణా)కు చెందిన మాయలమరాఠి కథయు తెలుఁగు పిల్లలకుసైతము కొట్టినపిండి। తెలుఁగు దేశములో రెడ్డి (మునసబు లేక పటేలు), కరణము (పట్వారీ), వెట్టి, తలారి మొదలగు పండ్రెండుగురు గ్రామోద్యోగులను 'బారాబలూతి' (<మరాఠీ – బారా = పండ్రెండు; బలుతేఁ = గ్రామోద్యోగుల స్వామ్యము)అని వ్యవహరించువాడుక మహారాష్ట్రులనుండి సంక్రమించిన సంప్రదాయము. నిన్న మొన్నటిదాఁక పశ్చిమాంధ్ర ప్రాంతముల ప్రబల ప్రచారములోనుండిన 'బాళబోధ్' లేక 'బాళబంధు' లిపి సంప్రదాయము మహారాష్ట్ర సంస్కృతి ప్రభావమునకు మఱియొక మచ్చుతునుక.[8] ఇప్పటి తెలుఁగువారు చాలమంది తమనామముల చివర తగిలించికొను 'రావు' (<మరాఠీ. రావ, రావో<ప్రాకృత రాయ –<సంస్కృత. రాజ-) మరాఠీ వారిది (జీవాజీరావు సిందియా, పీష్వా బాజీరావు, మురారిరావు ఘోర్పడే యశ్వంతరావు హోల్కార్, సిద్ధోజిరావు ఘోర్పడే). ఆంధ్రదేశములో-ముఖ్యముగా ఆవులన్న, కడమలకుంట, కర్నూలు, కాకినాడ, గుంతకల్లు, మాధవరము, దామదుర్గము - పరిసరముల యందలి తోలుబొమ్మలాటలవారు మహారాష్ట్రులు. పశ్చిమాంధ్ర ప్రాంతములఁగన్పించు హరికథా కథకులు చాలమంది మహారాష్ట్రులు. తెలుగు సీమలోని సంచారజీవు (Gypsy Tribes) లగు సుగాలీలు(=తండాలు, లంబాడీలు, బంజారాలు) మరాఠీ గుజరాతీభూములకు చెందినవారు. మరాఠిగుజరాతీ భాషాసమ్మిశ్రమముతో, స్థానికాంధ్ర మాండలిక సాహచర్యముతో వికృతి నొందిన వాగ్రూప వ్యవహారము వీరిభాష. మరాఠ్వాడాకు వలసపోయి స్థిరపడిన తెలుఁగులు నేఁటికిని నాగపురము, పూనా, బొంబాయి, షోలాపురము - మున్నగు నగరములలో లక్షలకొలఁదిగాఁ గన్పట్టుచున్నారు. మరాఠీభాషా ప్రభావముచే మార్పాటొందిన తెలుఁగు మాండలికములు కామాటీ, కోంటావు, బేరాది, వదరి - మున్నగునవి తెలుఁగు – మరాఠీభాషల పరస్పర ప్రభావమును మఱింత త్వరితపఱిచియుండుటయు సుసంభవము.[9] తెలుఁగు కన్నడిగల ఉగాదియును మరాఠీల ఉగాదియును ఒకనాఁడే। ఏకారణము వలననో తెలుఁగులతోపాటు మరాఠీలును పంచద్రావిడులలో ఒకరుగా పరిగణితులు.

---

8. తిరుమల రామచంద్ర, మనలిపి పుట్టు పూర్వోత్తరాలు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1957, పుటలు 164 - 166.

9. Sir G. A. Grierson. Linguistic Survey of India, Vol. IV, pp. 594 - 618.

మరాఠీపై తెలుగు ప్రభావము

మరాఠీ బాలుర 'విటిదాండు' (గోడుంబిళ్ళ, చిల్లాకట్టె లేక బిళ్ళంగోడి) ఆట లెక్కింపునందలి వకట, లేండ, మూండ, నాల, అర, వైద—అను అంకెలు క్రమముగా తెలుంగునందలి ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఆరు, ఐదు— అనువానికి వికృతులు. మరాఠీలో ఈ ఆటయందు 'అర' అనంగా 'అయిదు' అనియు 'వైద' అనంగా 'ఆఱు' అనియు వ్యవహారము. మూలభాషాపదముల అర్థము స్పష్టముగా తెలియక పోవుటయే పరిగణన క్రమమునందలి ఈ తబ్బిబ్బునకు మూలము. ఆరేడు శతాబ్దముల క్రిందటిమాట! మరాఠ్వాడాలో పండ్రెండేండ్లు పెద్ద వఱపు పట్టి, కఱవురాంగా 'ఆరె' జనులు ఆబాలగోపాలము సుభిక్షమగు తెలుంగు సీమకు వలసవచ్చి నిమ్మళముగా బ్రదికి బట్టంగట్టిరంట! తెలుంగువారితోడి ఆ పండ్రెండేండ్ల సావాసము ఊరకపోలేదు. "సొళాదొప్పియు నెత్తమున్ మొదలుగా జూదంబు" లలోని పరిభాష యంతయు మరాఠీవారి ఆటలనుండి తెలుంగున దిగుమతి యయినది.[10] తెలుంగు పిల్లల ఆటపాటలను మరాఠీ బిడ్డలు నేర్చిరంట! తెలుంగు అంకెల పరిభాషతోం గూడిన నేంటి మరాఠీ బాలుర 'విటిదాండు' ఆట దీని కొక సాక్ష్యము. ఇది తెలుంగువారి గొప్పకు ఆచార్యదేశీయులు చెప్పెడి అన్యోన్య ధన్యతా కథనము వంటిదికాదు; ప్రత్యక్షరమును ప్రమాణబద్ధము. విశేషించి మరాఠీ పండితులును, చరిత్రకారులును అంగీకరించిన యంశము,[11] 'These words (Vaket, lend, mund nal, ar, vaid) are of Telugu language as the game is sopposed to have originated in Telangana, a province in Southern India'[12]

---

10. నాచన సోమన, ఉత్తర హరివంశము, వావిళ్ళవారి ప్రచురణ, చెన్నపురి, తృతీయా. 120, 129.

11. కృష్ణాజి పాండురంగ కులకర్ణి, మరాఠీ వ్యుత్పత్తికోశ్, ఐతిహాసిక వ తౌలనిక, కేశవభికాజీ ధవళేవారి ప్రచురణ, ముంబఈ 1946, పు 596; సురవరము ప్రతాపరెడ్డి, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదువారి ప్రచురణ, ద్వితీయ ముద్రణము, పుటలు 84, 85.

12. Dattatreya Chintamani Mujumdar, Encyclopaedia of Indian Physical Culture, Shree Ram Vijaya Printing Press, Rospura, Baroda, 1950, p. 85.

దంత్య చజల ఉనికి

మరాఠీభాష యందలి దంత్య చ, జ (ౘ, ౙ)ల ఉత్పత్తి వికాసములకు తెలుఁగు భాషతోడి సంసర్గ సంబంధమే హేతువని కాల్డ్వెల్, జాన్ బీమ్స్, హోయర్నెల్, ట్రంప్–మున్నగు భాషాతత్త్వ పరిశీలకుల నిర్ణయము. 13 భారతీయ భాషలలో తెలుఁగు మరాఠీలలో మాత్రమే దంత్య చజలు ప్రచురము. ఈ రెండు భాషలలోను దంత్య చజలు (దంత్య స్పృష్టోష్మములు) (tip alveolar affricates) తాలవ్య చజల(తాలవ్య స్పృష్టోష్మముల) (Blade alveolar affricates) కు సవర్ణములే (allo phones) కాని ప్రత్యేకవర్ణములు (phonemes) కావు. తాలవ్యాచ్చులు (Front vowels ఇ ఈ ఎ ఏ ఐ) పరముగా వచ్చినపుడు తాలవ్యములుగాను, తాలవ్యేతరాచ్చులు (non-front or Back vowels అఆ, ఉఊ, ఒఓఔ) పరముగా వచ్చినపుడు దంత్యములుగాను చజలు పరస్పర పరిపూరక సన్నివేశముల (complementary distribution) లో ప్రవర్తితములు; మరాఠీలో ప్రాచీన తద్భవములందలియు, అవిజ్ఞాత ప్రకృతికములగు దేశజములందలియు చజలు తాలవ్యేతర స్వరఘటితము లయినపుడు దంత్యస్పృష్టోష్మములు. మరాఠీలోని ప్రాచీన తద్భవము లందలియు, అవిజ్ఞాత ప్రకృతికములగు దేశజములందలియు చజలు తాలవ్య స్వరఘటితములయినపుడు తాలవ్య స్పృష్టోష్మములు. స్పృష్టోష్మము లనఁగా తెలుఁగున చవర్గీయధ్వనులు.

---

13. John Beams, A comparative grammar of the Modern Aryan Languages of India, London 1872. Vol. I, Introduction, p. 72; Rt. Rev. Dr. Robert Caldwell, A comparative Grammar of the Dravidian or South Indian Family of Languages, Trubner & Co, London, Second Edition, 1875, p. 25; Sir George A. Grierson, Lingustic Survey of India, Calcutta, 1905, Vol VII, Introduction, p. 22; R. V. Jahagirdar, Kanerese Influence on old Marathi with special. reference to Jnaneswari. Annals of the Bhandarkar Oriental Research Institute, Vol XL pp 374-397; Dr. C. Narayana Rao, History of Telugu Language, A-U. Publication, Waltair 1937, Vol I pp. 195 196; కులకర్ణి, పూర్వోదాహృతము. ప్రస్తావన, పుటలు 62, 63.

మరాఠీ భాషావిజ్ఞాన చరిత్రకారుల పరిభాషలో ధ్వనులు అర్థస్ఫోటకములు.[14] వీని యుచ్చారణమందు స్థానకరణముల సంపూర్ణస్పర్శ ఒక ముఖ్యలక్షణము. నిశ్వాస స్తంభన సమయము (on set)నందు స్పర్శస్వభావమును, నిశ్వాసస్ఫోటనసమయము (release, మోక్షణము) నందు ఊష్మస్వభావమును క్రమముగా నీధ్వనుల యుచ్చారణ రీతియందిమిడి యుండుటచే స్పృష్టోష్మములను పరిభాష వీని యెడల సార్థకము. చవరీ (= సవరము), చావడీ (= చావడి), చునా (= సున్నము). చోఖ (= చొక్కము). చోజ (= చోద్యము), చౌదా (= పదునాలుగు). జవక (= జంట). జాఇ (= జాజి), జువార (= జొన్న), జూం (= జూదము), జోడీ (= జోడు)—ఈ మరాఠీ మాటలయందలి చజలు దంత్యములు. చిముటా (= మంగలివాని చిమ్మట), చేటా (=పిశాచి), జిణేం (=బ్రదుకు). జీభా (=జిహ్వ). జేథ (= ఎక్కడ, యత్ర) — ఇందలి చజలు తాలవ్యములు.

మరాఠీ కవుల పాత్రము

అనాదియును, అవిచ్ఛిన్నమును అయిన ఇట్టి సమీప సంసర్గ సంబంధముల వలన ఈ రెండు ప్రాంతములలోని వ్యవహారభాషలు పరస్పరము ప్రభావితమయి యుండుననుట నిర్వివాద విషయము, తొలినాళ్ళలో ఈ ఆదాన ప్రదానముల మాహారాష్ట్రిప్రాకృతము ప్రముఖ పాత్రము వహించినట్లు చరిత్రము, క్రీ.శ. పండ్రెండవ శతాబ్ద్యనంతరము మాహారాష్ట్రి ప్రాకృత పుత్రికయగు మరాఠీభాష ఆస్థానము నాక్రమించుట సుస్పష్టము. ప్రగాఢమయిన ఈ సంబంధముల మూలమున తెలుఁగు నుడులెన్నియో మరాఠీ వారి నోళ్ళలో నలుగుడువడి వ్యావహారిక రూపములుగా మరాఠీకోశముల కెక్కియు, మరాఠ్వాడాలోని కవి పండితుల సమ్మతిని బడసి సాహిత్యస్థాయిని సంపాదించియు అక్షరరూపమున చిరస్థాయి యయినవి. చక్రధరుఁడు, జ్ఞానేశ్వరుఁడు, తుకారాము, నామదేవుఁడు, భాస్కరభట్టు, మోరోపంతు—మొదలగువారు మరాఠ్వాడాలో విశేషవ్యాప్తినందిన మహానుభావ పంథ, మహారాష్ట్రీయ భాగవత ధర్మపంథ, భక్తిమార్గము—లకు

---

14. నారాయణ గోవింద్ కాళేల్కర్, మరాఠీ ధ్వని విచార, పూనా, 1955, పుటలు 4, 46. 159; స్పృష్టా స్పృష్టములని, శుద్ధతాలవ్య దంతతాలవ్యము లని కులకర్ణి వ్యవహారము, చూ. కులకర్ణి, ప్రస్తావన, పు, 62.

చెందిన భక్తకవులు. తెలుఁగునాట శివకవులవలె మరాఠ్వాడాలో వీరు మాన్యులు. ప్రబోధ వాహకముగా వీరు స్వీకరించినది ప్రజారంజకమయిన సమకాలిక వ్యావహారిక భాష. ఝటితిస్ఫూర్తిని, చమత్కార సమృద్ధిని దృష్టియందిడికొని మాతృభాషలో ప్రచుర వ్యవహారముగల అన్యభాషాపదములను సైతము సాహితీలోకశ్రీకములుగా తమ రచనములలో పొందుపఱిచి రససిద్ధిని, లక్ష్యశుద్ధిని సాధించిన కీర్తిమూర్తులు మరాఠీమహాకవులు.

పూర్వ పరిశీలకుల కృషి

ఇట్టి ఆదాన ప్రదానములు నిదానముగా మరాఠీభాషలో మచ్చికపడిన తెలుఁగుమాటల తీరుతెన్నులను గూర్చి విశదీకరించుట ఈ యుద్యమము పర మార్థము ఆచార్య శ్రీ కృష్ణాజీ పాండురంగ కులకర్ణి—బొంబాయి ఎలిఫిన్స్టన్ కళాశాలలో మరాఠీభాషా శాఖాధ్యక్షులు—తమ మరాఠీ వ్యుత్పత్తి పదకోశము ప్రస్తావన (పు. 100)లో మరాఠీలోని తెలుఁగు పదములనుగూర్చి చర్చించుచు, అడసణ, అనారస, అరవార, ఆర, ఓదు, కరడా, కావకా, కుడుక, మిడుక, కోడీ, గజగా, చక, చావమ్యావ, చేక, జాడ, ఝూక్క, టాలా (తాళా), నాలబరడ, బురగుండా, ముండ; లేండ, వకట, వయిద, శికేకాయి – ఈ యిరువదినాలుగును తెలుఁగునుండి మరాఠీవారు ఎరవుతెచ్చుకొనిన మాటలుగా పేర్కొనిరి, అదేమి మాయమోగాని ఇందులో అడసణ, అనారస, ఓదు, కావకా, కోడీ, చావమ్యావ, చేక– ఈ ఏడును కులకర్ణిగారు కూర్చిన నిఘంటు భాగమున గైరుహాజరు. ఈ గైరుహాజరు బాపతు తెలుఁగు సరకు కూడ కాదు లెండి! అరవార (పు. 40), కరడా (పు. 140), కుడుక (పు 172), గజగా (పు. 217), శికేకాయి (పు. 710)– ఇవి కన్నడ పదవికృతులని ఏతన్నిఘంటు భాగమున ఉట్టంకితము. జాడ (పు. 309) సంస్కృత 'జాడ' శబ్దభవముగా నిరూపితము. తాళ(ళా) (పు. 318) సంస్కృత 'తాళక శబ్దజన్యమని ప్రదర్శితమయినది. దీని రూపాంతరముగా అంగీకృత మయిన టాళా (శే()) (= తాళము) తెలుఁగు తాళమునుండి యని నిర్ణీతమగుట చింత్యము. బరడ (పు. 637) తమిళపదముగా నిర్ధారితము. చక (చకనామ, చకబంది), ఝూక్క ఇవి తెలుఁగుమాటలు కానేకావు. కాగా వీరి సూచనముల మూలమున ప్రకృత వ్యాసకర్తకృషిలో ప్రత్యక్షముగా ఉపకరించిన ఆరోపములు (entry

words) ఆఱున్నొక్కటి మాత్రమే తక్కినవి వ్యాసకర్త సుదీర్ఘ పరిశోధనము వలన నిర్ణీతములు. ఈ పట్టిక సమగ్రము కాకపోవచ్చు. వ్యాసకర్త చూపున కందని ఎరవుమాటలు మఱికొన్ని యుండవచ్చు. పదపట్టికలోని ప్రధానారోపములు (main entry words) ఏఁబది; ఉపారోపములు (sub-entry words) ఇరువది యెనిమిది. ఉపారోపములు ప్రధానారోపములకు రూపాంతరము (Variants) లగుటచే ప్రధానారోపములకు మాత్రమే పదపట్టికలో వరుససంఖ్య ఈయఁబడినది. సమీప మాతృకను స్థాపించుటలో స్పష్ట ప్రతిపత్తి నిమిత్తము ఇతర భారతీయ భాషాపదము లావశ్యక స్థలముల నుద్ధృతములు.

పదపట్టిక[15] (Etymological Index)

అడకితా ; చూ. అడకిత్తా (Candy[16] పు 83).

1. అడకిత్తా : రూ. అడకిత, అడకిత్తా-పోకలను ముక్కలు చేయుటకు వాడు కత్తెరవంటి సాధనము (కులకర్ణి పు. 19). < తె. అడకొత్తు; క. అడకొత్తు అడకోతు, అడగత్తి.

2. అడాలు : భయము (జ్ఞానేశ్వరి). జ్ఞానేశ్వరిలో ఈ పదము ప్రయుక్తమని కులకర్ణి, కాని జ్ఞానేశ్వరిలో నిది మృగ్యము. అడదరు (= భీతి, కంపము) అనుపదము మాత్రము జ్ఞానేశ్వరి (అధ్యా. 1 ఓవీ, 107) లో ప్రయుక్తము. కులకర్ణిగారు పరిశీలించిన ప్రతిలో 'అడాలు' ఘటిత పాఠము కలదేమో ?

< తెలుఁగు, అడలు : భయము. మరాఠీమాట కన్నడమునుండి ఎరవు తెచ్చిన పదమని కులకర్ణి (మరాఠీ వ్యుత్పత్తికోశ ఐతిహాసిక వ తౌలనిక, కృష్ణాజీ పాండురంగ కులకర్ణికృతము, కేశవభికాజీఢవళే, ముంబఈ వారి ప్రచురణము. 1946, ప్రస్తావన, పు. 99) కాని కన్నడము నందలి 'అడలు' నవీన

15. < ఈ సంకేతము మొనవైపున నున్నది జన్యపదమని గాని పరిణత రూపమని గాని అర్థము. పదపట్టికలోని తక్కిన సంకేతములు స్పష్టము.

16. Major Thomas Candy & Captain Molesworth, A Dictionary English-Marathi, second edition, Poona, 1873.

మనియు, తెలుఁగునుండి ఎరవు తెచ్చినది కానగు ననియూ ఆచార్య శ్రీ భద్రిరాజూ కృష్ణమూర్తిగారి ప్రతిపాదనము [17].

3. అల్లడ : అల్లరి (కులకర్ణి 43). అమాయకత్వము.

< తె. అల్లరి. అఌరి = దుస్స్వభావము; కొంటెతనము.

4. ఆటపాట : బాలికల ఒక ఆట (కులకర్ణి 62)

< తె. ఆటపాట, ఆట + పాట (= ధ్వనివాచక శబ్దముఌ కానోపునని కులకర్ణి).

5. ఆటా : ఆట. క్రీడ (కులకర్ణి 62).

< తె. ఆట. కానడి నాటకాల ప్రభావమువలన 1841లో మరాఠీలోఁజేరి యుండునని కులకర్ణి వ్యాఖ్యానము.

ఆడకిత్తా : చూ. అడకిత్తా (K. B. Dhavale పు. 220 [18].)

6. అర : 'విటిదాండు' అను మరాఠీ బాలుర ఆటలో 'ఐదు'.

< తె. ఆఱు = ఆయిదు నొకటి. మరాఠిభాషలో శకటరేఫము లేదు గావున సాధురేఫ ఘటితముగా ఉట్టంకితము. విశేషించి తిక్కన్న నాఁటికే రేఫ సాంకర్యము కలుగుటచే శకటరేఫోచ్చారణము వ్యవహార విదూరమయి యుండ నోపు.

ఉండ : చూ. ఉండా (కులకర్ణి, పు. 95).

7. ఉండా : రూ. ఉండ, ఉండీ, గుండ్రని వస్తువు; పిండిముద్ద (కులకర్ణి పు. 95) < తె. ఉంట, ఉండ = గుండ్రముగాఁజేయఁబడిన వస్తువు; కన్నడ. ఉండె; తమిళ; ఉండై, ఉరుండై ద్రావిడీశబ్దము కానోపునని కులకర్ణి పు. 95)

---

17. Dr. Bh. Krishna Murti, Telugu Verbal Bases : A comparative and Descriptive study, University of California Publications in Linguistics, Vol XXIV, University of California Press, Berkely, p. 279.

18. Keshava Bhikaji Dhavale, Students' Modern Dictionary English and Marathi, Karnatak House, Bombay, 1954.

ఉండీ : చూ. ఉండా. ముద్ద; గుళిక (జ్ఞా[19]. 11-457).

ఉరగుడేం : చూ. ఊరగుడేం. పల్లెటూరిలోని కోయిల, దేవళము (కులకర్ణి, పు. 107).

8. ఊరగుఢేం : రూ. ఊరగుడేం 'జేణేం కైలాసదుర్గా పాడిలేం సత్యలోకేం ఘాతలేం సోన కానేం ఊరగుఢేం ఫేతలేం వైకుంఠీచేం' శిశు. [20] 160.

< తె. ఊరగుడి : పల్లెటూరి దేవాలయము.

9 ఓనామా : ఆరంభము. మొదలు పెట్టుట (కులకర్ణి, పు. 119.)

< తె. ఓనమాలు = 'ఓం నమఃశివాయ' అను షడక్షరితో మొదలయ్యేటి అక్షర సముదాయమున (alphabet) కు వాడుక పేరు, వర్ణ సమామ్నాయము. 'గిరిసుత దొలుపలుకుల సుస్వర మొదవగ నోం నమశ్శివాయ సదాస్మద్వరదాయ నమః శంకర శరణు మహాదేవ నీవ శరణనఁజొచ్చెన్' (కు. సం. 3-34). 'వన్నయ్యవార లోనామాలు దిద్దుకొమ్మనినచోఁ గడుపు నొప్పనుచు నేడ్చి' (హంస 3-140). 'ఓనామాలు పఠించియుండు ననిలో నూహింపఁగా వచ్చు...' (హేమ సుందరోపాఖ్యానము. ప్రథమా.) ఇత్యాదులు ఆంధ్ర కావ్య ప్రయోగములు.

10. ఓరకల : రూ. వరక్కల, వరఖల, వోరఖల, ఒరపట్టెడురాయి, గీటురాయి (కులకర్ణి, పు. 120).

< తె. ఒరకల్లు, ఒరగల్లు; కన్నడ. ఒరెగల్, ఒరెగల్లు; తుళు, ఉరెకల్లు ఒరెకల్లు, తమిళ. ఉరైకల్; మలయాళ. ఊరకల్లు. ఉరవుకల్లు కన్నడము నుండి యని కులకర్ణి. పు. 120.

11. కట్టా : కొయ్యతోగాని, రాతితోగాని కట్టిన ఎత్తయినతావు, వేదిక (కులకర్ణి, పు. 128).

---

19. జ్ఞా. = జ్ఞానేశ్వరి, జ్ఞానేశ్వరకృతము, మరాఠీ సాహిత్యములో మణిపూస - 'భావార్థదీపిక' యన్నది దీని యసలుపేరు.

20. శిశు = శిశుపాలవధ, మహానుభావ పంథకు చెందిన కవీశ్వర భాస్కరభట్ట కృతము, క్రీ.శ. 1305.

<తె. కట్ట = అరుగు, వేదిక, చెఱువులోనగువానిగట్టు, ఎత్తయిన ఒడ్డు; కన్నడ. కట్టె.

12. కవ : ఆలింగనము. కౌఁగిలింత; ఏకత్వము (జ్ఞా. 13-61).

<తె. కవ = జోడు, జత, మిథునము; కవగూడు = జతగాకూడు; కవగొను = కవియు. జతగూడు; కవయు = కూడు; కవవాయు = జతవిడుచు.

13. కవళీ: కౌఁగిలించికొను 'తయా విరహ విషాచీ ఉకళీ' ప్రాణాతేఁకవళీ' (ఉద్ధవగీతా 21). కౌగిలింత (జ్ఞా. 5-133). కవళణే (= కౌగిలించుకొను.)

<తె. కౌఁగిలించు, కౌఁగిలి; కవియు = పైకొను, పొదువు: సమీపించు; కవిదల = తాఁకుడు, స్పర్శ; కప్పు = ఆచ్ఛాదించు; పరివేష్టించు; వ్యాపించు; వ్యవహారాంధ్రమున 'కావిలించుకొను'; సంస్కృత. 'కవలయతి' నుండి పరిణతమని తుల్పుళే, పు. 194

14. కాలవా : కాలువ, ప్రవాహము (candy, పు. 123 కులకర్ణి, పు 162.)

<తె. కాలవ. కాలువ; కన్నడ. కాలివె; తుళు. కాళివె; తమిళ. కాల్, కాల్వాయ్ = కాలువ; కాల్ = ప్రవహించు; కాలువ.

15. కావ : కావిరంగు (<తె. కావి. కులకర్ణి, పు. 162).

<తె. కావి : ఎఱుపు; ఎఱ్ఱనిది; కన్నడ. తుళు. తమిళ. మలయాళ. కావి.

కావడ : చూ. కావడీ (తుల్పుళే, పు 195)

16. కావడీ : కావడ. కావడి, నీళ్ళు లోనగునవి మోయుటకై రెండు కొనలయందును ఉట్లనో, త్రాళ్ళనో అమర్చినవెదురుబద్ద 'భరతి మహాచియా కావడీ' (వివేకసింధు 22, అధ్యా. 1, సం. 14; జ్ఞా. 16-77)

21, ఉద్ధవగీతా, భాగవతము ఏకాదశ స్కంధాంతర్గతము, కవీశ్వర భాస్కరభట్ట కృతము, క్రీ. శ. 1035.

22. వివేకసింధు, ముకుందరాజకృతము ఓవీ వృత్తములలో సంతరింపఁబడిన తాత్త్వికకృతి. కాలము వివాదగ్రస్తము, క్రీ. శ. పదుమూఁడు, పదునాలుగు శతాబ్దులని స్థూలనిర్ణయము.

<తె. కావడి, కావడికాలు, కావడికొమ్ము, కావడితట్లు, కావడిటప్పాలు, కావడిబద్ద, కావడిమోత, కావడించు = భుజముమీఁద మోయు; కావడి, కాండి, కాఁడి; కన్నడ,తుళు. కావడి; కన్నడ. కాగడి; తమిళ. కా = కావడి; మలయాళ కావు = కావడి; తమిళ. కావు = భుజము మీఁద మోయు; దేశీప్రాకృత–కాయ, కావ, కావడ, కావడి, కావోడి (పాఇఅ సద్దమహణ్ణవో, పు. 240). కావడియా, 'కావడి' వాఁడు, (పైది).

కురల : చూ. కురళా (Candy, పు. 205).

17. కురళా : రూ. కురల, కురళ = వంకరలు తిరిగి మొగముపై పడెడి వెండ్రుకలు, నొక్కుల జుత్తు.

<తె కురులు = అలకలు; కన్నడ, కురుళు, కుడులు, కుర్ళు; తమిళ కుఱుళ్; మలయాళ, కురుళ్; దేశీప్రాకృత. కురూలో = వక్రకేశములు (దేశీనామమాలా, 2–63); కుటిలకుంతలములు (పా ఇఅ. పు. 1255); అలయా కురలా : (పాఇఅ లచ్ఛినామమాల, 905; ధనపాలకృతము, శాదీ లాల్ జైన్, బొంబాయి ప్రచురితము, 1960).

కురుళ : చూ. కురళా .(candy; 205).

18. కైవార : రూ. కైవారా. పక్షాభిమానము, పక్షపాతము (జ్ఞా. 10–25) వాగ్దానము; స్వీకారము (candy, 286).

<తె. కైవారము = స్తుతి, పొగడ్త: కైవారి = స్తోత్రపాఠకుఁడు: కైవారము సంస్కృత పదమని కొందఱ భ్రాంతి; అచ్చతెనుఁగు కృతులలోని వాడుకను వీరు గమనింపరు; వ్యుత్పత్తిపరముగా ఆలోచించు ఆసక్తి అల్ప బోధనులకు అరుదు; కన్నడ. కైవ్వార = చేయెత్తి పొగడుట; తమిళ. కైవారమ్ = స్తుతి; ప్రశంస: మరాఠీ పండిత పరిశోధకులు రాజవాడే గారిచే 'కృపాకర' >కింవారక >కింవార; కింవారస్య భావః–కైవార' అని నిరూపితము. ఇది పాండిత్య ప్రకర్ష కావచ్చును కాని, శాస్త్రీయ ప్రక్రియకాదని కులకర్ణి నిర్ణయము (కులకర్ణి. పు. 184). కన్నడమునుండి ప్రతిదేయమనినను తప్పులేదు.

క్తైవారా : చూ. క్తైవార (ఉద్ధవగీతా, సం. 118).

19. కోదగా : నిర్లజ్జ, సిగ్గులేమి; బండ బాఱిన (కులకర్ణి, పు. 185).

<తె. కోడిగము = కొంటెతనము; పరిహాసము; కోడంగి, కోణంగి = విదూషక ప్రాయుఁడు; కన్నడ. కోడగ = కోతి.

20. కోమటీ : జాతి విశేషము; వ్యాపారి (కులకర్ణి, పు 187).

<తె. కోమటి 'అంగడులఁ గోమటుల' (ఆంధ్రభారత. ఆది. 8-73). కోమటుల మాతృభాష 'ఏదేశమేఁగినా ఎందు కాలిడినా' తేటతెనుఁగు, కోమటులు అచ్చముగా తెనుఁగువారు కన్నడ. తుళు. మలయాళ, కోమటి; తమిళ. మల యాళ, కోమట్టి.

21. కోంప : రూ. కోంపట, ఖోంప. గుడిసె, పాక (కులకర్ణి, పు. 188).

<తె. కొంప. 'కొంపం టోరుదయించి రావు గద నాకుంజెప్పుమా' (వేం. పంచ. 4-125), '... అరిభయంకర లంక యంబేదకొంపయే....' (రామా 7-7), 'దోసెడు కొంపలోఁ బసుల త్రొక్కిడి...(శ్రీనాథుని చాటువు), మకర ధ్వజుని కొంప ఒక చెంప గనిపింప చీరగట్టిన దయా చిగురుఁబోణి' (శ్రీనాథుని చాటువు) '....కొంప చెఱుపు....' (హంస 5-117) ఇత్యాది కావ్యప్రయోగము లేగాక, కొంపకు ముప్పు, కొంపకు రెండు వాకిండ్లు, కొంపదీయు, కొంపపీకు, కొంప ముంచు, కొంప మునిగినది, కొంపలకొఱవి, కొంపలంటుకొను, కొంపా గోడూ, పల్లెగొంపలు, 'సుపుత్రః కొంపపీకరః' 'హంపికి బోయెదానికంటె కొంపలో వుండేది మేలు'—మొదలగు పదబంధములు పలుకుబడులు తెలుఁ గున ప్రసిద్ధము. కన్నడ, కొంపె = చిన్నగుడిసె, పల్లెటూరు; కొప్ప, కొప్పళ = పల్లెటూరు: తుళు. కొప్ప-హీనజాతులవారి గుడిసె; తమిళ. కుప్పమ్ = పల్లె; కుంపై = అస్పృశ్యులవాడ; కురంపై = చిన్న గుడిసె; దేశీప్రాకృత. ఖుంపా = వానజల్లునుండి తప్పుకొనుటకై వాడు తృణమయోపకరణము (పాఇఅ సద్దమహణ్ణవో, పు. 277.)

కోంపట : చూ. కోంప. చిన్నగుడిసె (జ్ఞా. 14-218).

22. కోల (ణేఁ) : చిల్లకట్టెను దూరముగా చిమ్ము (కులకర్ణి, పు. 188)

<తె కోల = కట్టె; కోలాటము = కోలలతో ఆడెడియాట; కన్నడ. తుళు. తమిళ. మళయాళ. కోల్ = కఱ్ఱ

కోల (కాఠి) : దడికివేసెడి కొయ్య, ఒక రకమయిన ఆయుధము (జ్ఞా. 15_547). చూ. కోల (జేc).

కోలదండా : పశువుల మెడలో కట్టిన గుదికోల (కులకర్ణి, పు. 188). చూ, కోల (జేc).

ఖోంప : చూ. కోంప. గుడిసె. ఆశ్రయస్థలము. గుహ; రేవు (జ్ఞా. 7_103). పదాదియందలి అల్పప్రాణములు మహాప్రాణముగుట (aspiration) మరాఠిలో ప్రచురమగు లక్షణమని జాకోబి, బ్లాక్ మున్నగువా రంగీకరించిన యంశము ఉదా : సంస్కృత పాంశః - మరాఠీ_ఫాంశా(డా. మురళీధర్ గజాననపాంసే Linguistic Peculiarities of Jnaneswari, Deccan College Dissertation Series 13. Samarth Bharat Press, Poona, 1953. పు 45. 46).

23. గడ్డా : దుంప; ముద్ద (కులకర్ణి పు. 219).

<తె. గడ్డ; కన్నడ. తుళు. గడ్డె; తమిళ. మలయాళ. కట్టి = ముద్ద.

24. గుంటా : రూ. గుంఠా. భూపరిమాణము (కులకర్ణి. పు. 236).

<తె. గుంట = గుంత్రడ; భూపరిమాణవిశేషము; క. గుంటే. ఎకరములో నలువదియవవంతు.

గుంఠా ; చూ. గుంటా (కులకర్ణి పు. 236)

25. చచ(జేc) : చచ్చు. మరణించు (కులకర్ణి. పు 264)

<తె. చచ్చు, చా, చావు; కన్నడ సత్తు, సాయ్. సాయు; తమిళ. చా; మలయాళ. చా. సంస్కృత, చంచ్ = గతౌ నుండి కానోపునని కులకర్ణి.

చండూ : చూ. చేండూ (జ్ఞా. 16_100)

చపల : చూ. చప్పల (కులకర్ణి. పు. 267).

చపలీ : చూ చప్పల (ప్రైది, పు 753).

26. చప్పల : రూ. చపల. చపలీ, చేపలీ, పలుచని కాలిజోడు; అక్కఁ జెప్పులు (కులకర్ణి. పు. 263).

<తె. చెప్పులు = పాదరక్షలు; కన్నడ కెర, కెరవు కెర్పు; కాల్కెర్పు = కాలిచెప్పు; తమిళ చెరుప్పు = తోలుచెప్పులు; మలయాళ, చెరిప్పు; ధ్వన్యనుకరణ మని కులకర్ణి.

27. చంబూ : నీరు త్రాగెడిపాత్ర (కులకర్ణి, పు. 268).

<తె. చెంబు=నీరుత్రాగుటకువాడు రాగిపాత్ర; కన్నడ. చంబు. చెంబిగె తామ్రపాత్ర. కన్నడ. తుళు. చెంబు = రాగిపాత్ర. ఈ కన్నడ పదము తెలుఁగు నుండివచ్చిన ఎరవుమాటకావచ్చు. తమిళ. చెంపు=రాగి; బంగారు, ఎఱ్ఱని లోహము; పాత్ర; రాగిపాత్ర; మలయాళ. చెంపు=రాగి, రాగిపాత్ర. ఎఱ్ఱని అను నర్థముకల 'కెంపు' తాలవ్యీకరణమంది 'చెంపు. చెంబు'గా పరిణతము సంస్కృత 'జంబూలక' శబ్దభవమని కులకర్ణి. ప్రాకృత. జంబూలయ = నీరు త్రాగెడిపాత్ర (పాఇఅ సద్ద మహణ్ణవో పు 421) మరాఠీలోని 'జాంబ' (= నీరు త్రాగెడి పాత్ర) 'జంబూలయ' శబ్దజన్యము కానోపు. పశ్చిమాంధ్ర ప్రాంత వ్యవహారమునందలి 'జాము' (=tumbler) మరాఠీనుండి ఎరవు తెచ్చినమాట.

చవ : చూ. చవీ, చవదార్ = రుచియయిన; చవ = ప్రీతి, సమ్మతి (Candy p. 866), చవ (కులకర్ణి. పు. 270.)

28. చవీ : రూ. చవ. రుచి 'కాపురకేళీచాఁఘడీఁ_అమృతాచీ చవీలాగే పుడీ' కర్పూరపు టరఁటి ఫలములు అమృతమువంటి రుచికలిగినవి (మూర్తి ప్రకాశ 23; జ్ఞా. 15_272).

<తె. చవి=రుచి; చప్పరించు, చవిగొను, చవిచూపు, చవులుదప్పు. చవులూరు; చవులొలుకు; కన్నడ. సవి, సవె, తుళు,సవి. సబి; సంస్కృత. చమ్ ధాతువునుండి యని తుల్పులె (vide : Prof. S. G. Tulpule, An Old Marathi Reader, Venus Prakashan, Poona, 1960. p. 202.) సంస్కృత. చమ్-అదనే అని కులకర్ణి పు. 270.

---

23. మూర్తి ప్రకాశ, కేసో బసకృతము, క్రి. శ. 1285.

29. చిక్కూ : కృపణత్వము; లోభి (కులకర్ణి. పు. 278.)

<తె. చిక్కు = ఆపద, బాధ; కార్శ్యము; కన్నడ, సిక్కు.

30. చిల్లర : చిలుకు నాణెముల మొత్తము; చిల్లర సామానులు, సంబారవస్తువులు (కులకర్ణి; పు 284).

<తె. చిల్లర : మిగిలినది; సామాన్యపు సరకు; చిలుకు; శేషము, సత్ర కాయ బాపతు; (అల్లరి, చిల్లరి, చిల్లరమల్లర, చిల్లరవెచ్చములు; చిల్లర సేవాం లిచ్చిమి (శ్రీమహాలక్ష్మి)

31. చుట్టా : పొగచుట్ట, బీడీవంటిది (Candy పు. 139; కులకర్ణి. పు. 285).

<తె. చుట్ట = పొగచుట్ట; కన్నడ. చుట్ట, చుట్టి; తుళు. చుట్ట; తమిళ. మలయాళ. చురుట్టు కన్నడము నుండి యని కులకర్ణి ప్రస్తావన, పు. 99; ఆంగ్లమునందలి 'cheroot' కు తమిళ 'చురుట్టు' మాతృక.

చేండు : చూ చేండూ. 'మగశ్రీ కృష్ణచక్రవర్తీ సంఘాతేం చేండుఫళీ ఖేళోం లాగిన్హలే' 'శ్రీకృష్ణునితో 'చేండుఫళీ' ఆటనుమొదలిడిరి' (శ్రీకృష్ణ చరిత్ర [24]).

32. చేండూ : రూ. చండూ, చేండు, బంతి; బంతి యాట (candy, 67, కులకర్ణి). శ్రీకృష్ణ చక్రవర్తి గోపాళాంసి చేండూఫళీ ఖేళత' గోపాలురతో శ్రీకృష్ణుడు చేండూఫళీ ఆటను ఆడుచుండఁగా' (శ్రీకృష్ణ చరిత్ర జ్ఞా. 11-580); చేండూఫళీ = బంతియాట.

<తె. చెండు = బంతి; కన్నడ. సెండు; తుళు. చెండు; తమిళ. మలయాళ. చెంటు = బంతి: మలయాళ. చెంటు = దారపు బంతి. సంస్కృత. 'కందుక' - భవమగు ప్రాకృత 'చండుఅ' జన్యమని కులకర్ణి వ్యుత్పత్తి. చూ.

24. శ్రీకృష్ణ చరిత్ర, కర్తృత్వము వివాదగ్రస్తము, భాస్కరుఁడని కొందఱు, మ్హాఇభట్ట (మహీంద్రభట్ట) అని కొందఱు, పంచకృష్ణపంథ- మరాఠ్వాడాలోని ఒక భక్తి సంప్రదాయము - (లేక మహానుభావ పంథ) కు ప్రధానాచార్యుఁడయిన చక్రధరుని అనుయాయులు, క్రీ. శ. 1300.

పు. 289; కాని ప్రాకృతములలో 'చంఢుఅ' మృగ్యము; కందుక-ఫలికా జన్యమని తుల్పూళే. పు. 204.

చేపలీ : చూ. చప్పల (candy. పు. 753).

33. డావ(వా) : ఎడమ. సవ్యము (జ్ఞా. 7-126): - డావీబూజో = ఎడమవైపు; డావకా. డావఖురా, డావరా = ఎడమచేయి వాటముగల; డావ్యా హాత్‌చా = ఎడమ చేతిలోనున్నది (candy. పు. 477) డావియే శ్రీకరీ చేయా = ఎడమచేతి (పూజావసర),[25] డాపా డోళానిముఁటే = ఎడమకన్ను అదిరినప్పుడు (రసకౌముది)[26]

<తె. డా. విణ. సవ్యము. ఎడమ. డాకడ, డాకాలు, డాకెలను. డాకేలు, డాచను, డాచేయి. డాతొడ, డాపల, డాపలికేలు, డాపలిసున్న, డా మూ పు. మరాఠీలోని ఈ 'డావా' వ్యుత్పత్తి అనిశ్చితము, సందిగ్ధము అని ఆచార్య తుల్పూళే అభిప్రాయము (vide. పు. 208). దేశీప్రాకృత. డావో = ఎడమచేయి (దేశీనామమాల, 4-6); టర్నరు దొరగారి నేపాలీ నిఘంటువున,[27] <దేబ్రే (= ఎడమ) ఆరోపము క్రింద ప్రదర్శితములయిన పదము లన్నియు ద్రావిడ మూలకములని ఆధునికుల సోపపత్తిక నిర్ణయము[28] (ద్రావిడ భాషలలో పదాది డకార ఘటితములు ముఖ్యముగా తెలుఁగునకే పరిమితము).

---

25. పూజావసర, నాగదేవాచార్య శిష్యుఁడగు బైదేవబస విరచితము చక్రధరుని సహచరులలో నాగదేవాచార్యుఁ డొకఁడు.

26. రసకౌముది, వైద్య గ్రంథము. అళజపూర (నేఁటి ఎలిచ్‌పూర్) వాస్తవ్యుఁడును విజయనగర బుక్కరాయల ఆస్థాన వైద్యుఁడును అగు విఠ్ఠలుఁడు దీనికి కర్త క్రీ. శ. 1350-

27. Sir. R. L. Turner, A Comparative and Etymological Dictionary of Nepali Language, London, 1931, P. 318- suggests borrowing from an aboriginal language.

28. Prof. T. Burrow and Prof. M. B. Emeneau. A Dravidian Etymological Dictionary, Oxford University Press, London 1961, Entry No. 381.

34. తాట : భోజన పాత్రము, పళ్ళెరము (జ్ఞా. 5_107, 6_2, 13_423); తాటభర = తట్టెఁడు (స్మృతిస్థళ 29); తాటకేలేఁ (పైది).

<తె. తట్ట = పళ్ళెరము, కంచము; తాట[30] = బల్లపరపు. కన్నడ తట్టె తమిళ. తట్టం, తట్టు; తుళు. తట్టుగ; కన్నడమునుండి యని కులకర్ణి, పు. 372; సంస్కృత 'తత' - నుండి యని తుల్పుళే, పు. 209.

35. తాటీ కంచె, వెలుగు (జ్ఞా. 2_310); వెదురుబద్దల చట్రము (కులకర్ణి. 372).

<తె. తట్టి = దడి; తట్టిగోడ = ఊరి చేరువ పొలముచుట్టు కట్టెడి రాతి కంచె; కన్నడ. తట్టి, తడికె; తమిళ. తట్టి.

తుక : చూ. తూక. బరువు (జ్ఞా. 14_141; 18_640).

తుక (ణేఁ) : తూకముచేయు (కులకర్ణి, పు. 382) చూ. తూక.

36. తూక : రూ. తుక. బరువు. తూఁచి నిర్ణయింప వలసిన పరిమాణము (జ్ఞా. 9_261).

<తె. తూకము = బరువు, భారము; తూకు = కొలఁది, ప్రమాణము. బరువు; తూకువ = భారము. తెలుఁగు నందలి తూకము మొ. వి. వ్యుత్పత్తి పరముగా సబిందుకములగుట శాస్త్రీయము; ఇవి తూఁగు ధాతుజన్యములు. కన్నడ. తూక, తూకు. తూంకు.

37. తేలగూ : ఒకానొక ద్రావిడ భాషా నామము (కులకర్ణి, పు. 387).

<తె. తెలుఁగు. ప్రాకృత. తేలంగ—.

38. దింధ : బట్టలమూట (candy, పు. 67; కులకర్ణి, పు. 460)

<తె. దిండు; కన్నడ. దిండె: తమిళ, మలయాళ. తిఁటు.

---

29. స్మృతిస్థళ, నరేంద్ర పరశురాములను జంటకవులచే రచితము, క్రీ. శ. 1809.

30. కోరాడ రామకృష్ణయ్య, Dravidian Cognates, Madras University Telugu Series No. 11. Madras, 1944. P. 111.

39 నాల : 'విటిదాండు' ఆటలో పరిగణన క్రమములో 'నాలుగు' (కుల కర్ణి. పు 596; ముజుందార్, పు. 85).

<తె. నాలుగు.

40. పైకా : డబ్బు, సంపద. '...నానాభక్తమాలి ఆఁదత్త పైకాచా వివరు...' (= నానా భక్తులచే సమర్పితమయిన పైకము వివరము). (పంఢర పుర శిలాశాసనము, క్రీ. శ. 12_73).

<తె. పైకము = ధనము; ఒకనాణెము; పసిఁడి నాణెము. లేఁత, పచ్చ అను అర్థములు కల పచ్చ పచ్చటి, పచ్చని, పచ్చి, పచ్చిక, పయిఁడి, పసరు, పసి, పసిఁడి, పసిమి, పసిరిక, పసుపు, పెయ్యపెసర, పెసలు, పైకము, పైఁడి, పైద, పైదలి, పైరు_ఈ పదరాశి సమస్తము *పచ్_/*పయ్ _ అను ద్రావిడమూలధాతు జన్యము. పసిఁడి యనఁగా పసుపు పచ్చని లోహము (= బంగారు) దీనితో చేసిన నాణెముల రాసియేపైకము అని మౌలికార్థము, కన్నడ. పయ్క, పైక; తమిళ. పయిక్కం.

41. బురగుండా : బాలుఁడు (కులకర్ణి. పు. 653).

<తె. బురుకఁడు = స్తనపాయి, బిడ్డఁడు; బురుక = పసిపాపఁడు, పోర గాఁడు. తెలుఁగు 'బరగేఁ' నుండి యని కులకర్ణి.

కన్నడ. పోర, శిశువు; తుళు. పోర, పోరె = బాలుఁడు; పోరి = బాలిక.

42. మాందీ ; గుంపు, సమూహము (జ్ఞా. 7_104; 8_56. 'ఈశ్వర నిష్ఠాంచీఁ మాందియలీఁ' 18_1775).

<తె మంది = జనులు, జనుల గుంపు; సేనా భాగము; మంది మార్బలము; మంద = గుంపు, ఆలమంద, పసులమంద; కన్నడ. మందె = జనులు, పశువులమంద; తుళు. మందె = జనులు, పత్తుమందె = పది మంది, తమిళ. మంతై = గుంపు, తెలుఁగున మను, మనికి, మనికిపట్టు, మన్నిక. మంద, మంది_మొదలగునవి ఏకధాతు జన్యములు.

(సంస్కృత_మండ్ (= శోభాయామ్) నుండి యని కులకర్ణి, పు. 588; సంస్కృత, మండలిక (=సమూహము, రాశి) నుండియని తుల్పాశే, పు. 234)

43. ముండ : 'విటిదాండు' ఆటలో మూఁడు (కులకర్ణి. పు 596) (ముజుందార్ పు. 85).

<తె. మూండు, మూఁడు. పూర్ణబిందు ఘటితోచ్చారణము ప్రచురముగా నుండిన కాలమున మరాఠీలో ప్రతిదేయమనుట స్పష్టము. 'పోండిగ నగజ తప శ్శిఖి–మూండు జగఁబులను దీవ్రముగఁబర్విన బ్ర-హ్మాండముగాఁచిన గాంచన–ఖండము క్రియఁ దాల్చెఁ దత్ప్రభా భాసితమై' (కు. పం. 6–158) కన్నడ. మూరు; తుళు. మూజి. తమిళం. మూన్రు = మూఁడు; మలయాళ. మూన్ను.

44. ముదలు : రూ. ముద్దల. మూలధనము (జ్ఞా. 8–25 'తైసేం మన వణ ముదల జాయో' (= తాదృశమయిన మనస్థితి మొదలుసంచి)(మూలధనము) అగుచున్నది. పైది 5-157).

<తె. మొదలు : మూలధనము. సంస్కృత. ముద్రా శబ్దభవము కావచ్చునేమో యని పాంసే. పు. 41.

ముద్దల : చూ. ముదలు, మూలధనము. బండవలము, సంస్కృత. మూలద (?), 'మూలదేయమ్' మూలము కానోపునని కులకర్ణి. పు. 596.

45. యలమ్మా : రేణుకాదేవి, ఒకానొక గ్రామదేవత(కులకర్ణి పు. 607)

<తె. ఎల్లమ్మ : ఒకానొక గ్రామదేవత, ఎల్లలయందుండు పొలిమేర దేవత (?). ఎల్లయందును (= అంతటను) కలదేవత; కన్నడమునుండి యని కులకర్ణి.

46. లేండ : 'విటిదాండు' ఆటలో రెండు (కులకర్ణి, పు. 635. ముజుందార్, పు. 85). మరాఠీలో హ్రస్వమగు ఎకారములేదు గావున దీర్ఘస్వరాది.

<తె. రెండు : కన్నడ. ఎరడు; తుళు. రడ్డు; రడ్డనె = రెండవు; తమిళ. ఇరంటు; మలయాళ. రండు. తెలుఁగు 'రేండ్' నుండి యని పీఠిక పు. 100 లోను, రోండూ నుండి యని నిఘంటు భాగము (పు. 635) నను కులకర్ణి నిర్ణయము. ఇట దంతమూలీయ తాడిత (alveolar flap) మగు రేఫము దంతమూలీయపార్శ్విక (alveolar lateral) మగు లకారముగా పరిణతము. 'రసోర్లశౌ' మాగధీ ప్రాకృతములో ప్రసిద్ధమగు ధ్వని పరిణామము. గుణ్ఱం–గుల్లం,

రాను_లాను, రాఘ - లాఘు, రాములు - లాములు ఇత్యాద్యుచ్చారణము పిల్లల వాడుకలో ప్రసిద్ధము

47 వకట : 'విటిదాండు' ఆటలో ఒకటి (కులకర్ణి, పు. 637, ముజుం దార్. పు 85).

<తె. ఒకటి; వ్యవహారరూపము 'వకటి'; కన్నడ. ఒందు; త. ఒణ్ణు; మ. ఒన్ను.

వరకల : చూ. ఓరకల (Candy, పు 889).

48. వాళ : బహిష్కారము, జాతిభ్రష్టత (కులకర్ణి, పు. 655).

<తె. వెలి = కులబహిష్కారము. వెలిచవి, వెలివాడ, వెలివేయు, వెలి సంత, వెలుపల, వెలువడు, వెలువరించు, సంస్కృత. వృ-, వార-లు దీనికి మూలమని కులకర్ణి.

49. షైద : 'విటిదాండు' ఆటలో ఆఱు (కులకర్ణి. పు. 671; ముజుం దార్ పు. 85) 'ఆర' అనఁగా ఐదును. 'షైద' అనఁగా ఆఱును అను నర్థ ములు తబ్బిబ్బు వలన నేర్పడినవి,

<తె. ఐదు = నాలుగు నొకటి. అజాదిరూపము హలాదియగుటయు అర్థవిపరిణామము కలుగుటయు మరాఠీ 'షైద' విశిష్టత.

వోరకల : చూ. ఓరకల (జ్ఞా. 17_405)

50. సజగురా : ధాన్యవిశేషము (కులకర్ణి. పు. 701).

<తె. సజ్జ + కొఱ్ఱ. సజ్జలు, కొఱ్ఱలు అను ధాన్యములు. సజ్జ, కొఱ్ఱ రాయలసీమలో ప్రచురమగు పంటలు.

తెలుఁగు నందలి
కృతక ప్రామాణిక రూపములు

"యద్య దాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః
సయత్ప్రమాణం కురుతే లోకస్త దనువర్తతే"

స్వల్ప సంఖ్యాకులు కావచ్చును గాక ప్రాఁత సంప్రదాయములను పునరుజ్జీవింపఁ జేయవలయుననియు ప్రాచీన ప్రమాణములను పునః ప్రతిష్ఠ సేయవలయుననియు ప్రాఁతలాడు పశ్చిమ బుద్ధులు సర్వదేశకాలములకు సంబంధించినవారు. పూర్వౌన్నత్యమును యథార్థీకరించుననెడి కట్టుకథలను. పుక్కిటి పురాణములను బడ్లకెత్తి 'జాతిన జాతి గౌరవము చక్కన దిద్దుటకై' కవులు ప్రజలను ప్రబోధించుట కూడ పరిపాటి. ఆ రంగ మీరంగ మను వివక్ష లేకుండ అన్ని రంగములలో నీ ప్రాచీన వ్యవస్థా సముద్ధరణ సముద్యమ ప్రభావము ప్రసరించుచుండుట సర్వ సామాన్యము.

పరిణామము ప్రకృతికి నైజగుణము. మార్పు తాకిడికి అందఱును తట్టుకొనుట కష్టము. క్రొత్త వాతావరణములో కొందఱకు ప్రాణములు లేఁవచ్చిన పగిదిగా నుండును; అందే కొందఱకు ఉక్కిరి బిక్కిరిగా నుండును. క్రొత్తకు కొలువు సింగారమొనర్చుట కొందఱకు పరమావధి; ప్రాఁతకు పట్టము గట్టుట మఱికొందఱకు పవిత్రవిధి. ఒకఁడు పురోగామి; వేఱొకఁడు తిరోగామి. పురోగామి నూతన వ్యగ్రబుద్ధి; తిరోగామి ప్రాచీన పక్షపాతి. ఇట్లిరువురును ఏదోయొక మార్పుపట్ల అభిముఖ్యము కలవారు. ఎవరికి వారు ఉత్తమ సంస్కరణాభిలాషులు. రుచిభేదమునుబట్టి మతభేదము. అన్నివర్గముల యందును, అన్ని మార్గములయందును సంస్కారదృష్టి ఏనాఁటి కానాఁడు నిత్యనూతనము.

తమ సాంఘికస్థాయి యొక్క బహిశ్చిహ్నములను మెఱుఁగుపఱచికొను నిమిత్తము వ్యక్తి నామములను, సంఘ నామములను, కులనామములను, గోత్ర

నామములను సంస్కరించికొనుటకై జనులు ఏమము వెఱ్ఱిగా నెగఁబడు విశిష్ట మనస్తత్త్వ మీ సంస్కరణము నందలి యొక భాగము. ఈపాటి మార్పులతో తమ దైన్యమును హైన్యమును తొలఁగిపోవునని అల్పసంతోషులగు నీయమాయికజనుల వెఱ్ఱినమ్మకము. తమ కంటె ఉత్తమ సంస్కారులననపేక్షతో పైయంతరువు వారిని అనుకరింప నుబలాటపడుటయు. తమ కంటె అల్పసంస్కారులను నుపేక్షతో క్రింది యంతరువు వారి నీసడించుటకు వెనుకాడకుండుటయు జనుల సహజ మనోధర్మము. పూర్వోట్టంకితమగు గీతావాక్యమీ సందర్భమున నూటికి నూఱు పాళ్ళు నిజము.

ఇటు లోక తెగగాని. వర్గముగాని సభ్యప్రపంచమున తత్తత్కాలోచితముగా సమర్థస్థానమును సంపాదింప నుద్యోగించుటలో తప్పులేదుగాని సారాసారముల వివేచింపనేరక గొఱ్ఱెదాటుగా అంధానుకరణ మొనర్చి పైపై వన్నెల్పచరించెడి సమాజము పరిహాస భాజనము కాక తప్పదు. సాధారణముగా వేషభాషాదికముల పట్టుల నగరవాసులను జానపదులు, పండితులను పామరులు, శిష్టులను సగటు మానిసులు, పురుషులను స్త్రీలు, పెద్దలను పిల్లలు యథామతిగా ననుసరింప వ్యామోహపడుట సైతము సర్వవ్యాపకమయిన చిత్తవృత్తి. జనులు తమ భాషా వ్యవహార పైఖరులను మహాజన వ్యవహారానుసారులుగా- మక్కికి మక్కిగా- మలఁచికొన మనసుపడుటయు స్వాభావికము.

వాస్తవముగా పై యంతస్తు నందికొనఁ గలిగిన పట్టులు ప్రశస్తములుగాఁ గన్పట్టుట సరియకాని, అంది కొనలేని తావుల 'శతాంధాః కూపంప్రవిశన్తి' అను నాభాణకము చొప్పున అవహేళనముతో పాటు అనర్థములును తప్పనిసరి. అనుకర్తల అధికారమును బట్టియు, అనుకార్యముల యందలి అంతస్సారమును బట్టియు ఈ అనుకరణ ఫలము భాసించునని వెరసి తాత్పర్యము. భాషా వ్యవహారమున మహా చమత్కారమయిన ఈ పునరుజ్జీవనోద్యమ ప్రభుతను యుక్తి నిదర్శనాదులతో ప్రకటించుట ప్రకృత సమీక్షా వ్యాపారము పరమార్థము.

పూర్వాచార పరాయణములగు కొన్ని బ్రాహ్మణ శాఖల భాషా వ్యవహారములలో విశిష్టమాండలిక భేదములుగా పేరూనిన వింత వింత ఉచ్చారణరీతులు వీనికి కొన్ని ఉదాహరణములు. 'వేమయ్యా, వింద్రయ్యా వేబుళం వొగాకు వెంతకు విస్సావు'- అని యిట్లు అజాదిరూపములను వకారాదులుగా మార్చి

'వ్రాత్తి వ్రాత్తి' యుచ్చరించుట ఈ యున్నత వర్గములవారి యలవాటు. 'వైదీకుల యింటి పిల్లిగూడ మ్రావు మ్రావు మంటుం'దని యభియుక్తులు కొందఱు చమత్కరించుట కద్దు ఇట్లే షకార ప్రాబల్యమును అగ్రహారీకులగు వైదికుల పలుకుబడిలో పరిస్ఫుటమగు వైశిష్ట్యము * నిరంతర వైదికవాణీ భాషణప్రవణతయు, సనాతన సంప్రదాయ పరిరక్షణ వ్యగ్రతయు వీరి యీ 'బాణి'కి కారణము కానోపు. ప్రాయికముగా పదాంత టకారస్థానమున షకారమును వాడుట వీరి యుచ్చారణ మర్యాదయందలి వైశేష్యము.

అషబడీ' యిషబడి. నమలరాదషవో, నేనెషైనా పోయి, శివరాత్రి పుణ్యకాలము కాదషవే, పంచనదీశ్వరుని గుళ్ళోనష శహజి మహారాజు వచ్చినాడష. యోగ్యం దవషరా, అదేఁషిరా, యెషెషో, నీకు ఒక పాలుబాల దషరా, వింటివోషే జందేఁబుచ్చక్క, ఔనషె తిప్పా వఝుల యెల్లమ్మా, ఔనషో వదినగారు. పెండ్లి చేస్తున్నారష, కట్న విస్తున్నారష.... వేస్తున్నాడు మనోభవుండషిషుగా వేమారు నీవున్ననన్ చూస్తుం దానవు నీకు ధర్మమషవే... ఇత్యాదులు తంజాపుర యక్షగానములలోని వైదిక బ్రాహ్మణ పాత్రముల పలుకుబడులు

అవునషే నను వివాహము గమ్మ విద్వాంసు
రాలవయ్యెదవు శీతాంశు వదన (శుక. 1-500)

వేదముల్గడుఁ జదివిననోరు నీమోవి
యానినఁ గాదషే యబ్జవదన (వైది 2-477)

మొగమిషు ద్రిప్పవే ముద్దుగాను....
(అహల్యా సంక్రందనము 1-68)

అషు యిషు బోవకే యిషువుల చేనిన్ను
కుసుమాస్త్రుఁ దేచీని కట్టుఁదుచ——

వాజపేయ ఫలంబు వనదషే యోయోష
యింద్రుఁడే మిచ్చిని యిషునిలువవె——

---

* Dr. Mahadeva sastry, Historical grammar of Telugu, Page-66.

మేము ఋంతబ మషే మీరు నేర్చినపాటి
యెరుగ మషే వేదమెల్లఁ జదివి—
అనుచు ఛాందసులగు సోమయాజి వరులు (పైది 1-69)

ఆస్పేచూసిపషేవొప్పె ఏస్పావజ్ఝలవారి బుఝ్ఝినష అవిస్పాయికిస్పా ఢుషే విస్సం దెంతటివాడె యేళ్ళు పదిషే....' అను దాసు శ్రీరాములుగారి పద్యములోని వైదిక బ్రాహ్మణభాషా ప్రయోగవిన్యాసము పైదాని కనుప్రాసము. యథార్థమగు ప్రాచీనోచ్చారణ రీతిని అక్షరాల పాటించి అతిస్వచ్ఛముగా ఉచ్చరించుచున్నామని వీరి యుద్దేశము. జగదీశ జనార్దన మధుసూదన మల్లికార్జున సుదేష్ణ - ఈ వ్యక్తి నామములను క్రమముగా జగధీశ జనార్ధన మధుసూధన మల్లిఖార్జున సుధేష్ణ- అని మహాప్రాణవర్ణ ఘటితములుగా వ్యవహరించు నభ్యాసము కూడ నీకోవకు చెందినదే.

ప్రతిభాషయందును కాలక్రమమున కొన్ని ధ్వని పరిణామములు ప్రవర్తిల్లుట సర్వసాధారణము. పదాది పకార హకారములు లోపించి అజాది రూపములేర్పడుట, పదాది సంయుక్తత యందలి ద్వితీయ వర్ణమగు రేఫములు లుప్తమగుట, శకట రేఫ ఘటితములు సాధు రేఫ ఘటితములుగా వాడుకపడుట, ఇయాంతము లెదంతము లగుట-మున్నగునవి తెలుఁగునందలి కొన్ని ధ్వని పరిణామములు. పరిణత రూపములకంటె వాని ప్రాచీన రూపములే పవిత్రములని, ప్రామాణికము లని కొందఱ ప్రగాఢ విశ్వాసము. అందువలన వారు పరిణతరూపముల స్థానమున వాని ప్రాచీన రూపములను ప్రయోగించుటకౌత్సుక్యమును ప్రదర్శింతురు. నియమము సంస్కారరామని లాక్షణికోక్తి. నియమములను కల్పించుకొనుటలో,వానిని పాటించుటలో దోషములేదు. కాని నియమము పేర, సంప్రదాయము పేర అప్రమాణ రీతులను ప్రమాణీకరించుట భ్రాంతిమూలకము. ఇట్టిది Overcorrection లేక Hyper-urbanisam అని శాస్త్రవేత్తల ప్రకథనము. ఈ మేరకు ప్రమాణీకరింపఁబడిన భాషాపదములు కృతక ప్రామాణికములని శాస్త్రవ్యవహారము. ఒక యథార్థ రూపముకంటె మిక్కిలి విర్దుష్టమను మిథ్యా బుద్ధివలన యేతద్యథార్థ రూపమును త్రోసి రాజు సేయునిచ్ఛతో పునర్నిర్మించిన రూపము కృతక ప్రామాణికరూపము (Hyper Form or super - standardised form) అని భాషాశాస్త్ర కారుల నిర్వచనము*

---

* Mario A. Pei, Dictionary of Linguistics, P. 94.

ఇట్టి సంస్కారకాభిలాషుల యనుకరణ పారవశ్యములో, ఆయారూపముల పౌర్వాపర్య నిర్ణయపుటడావిడిలో ప్రాచీనమేదో అర్వాచీనమేదో, ప్రకృతిసిద్ధమేదో, పరిణతరూపమేదో పరమ సూక్ష్మముగా పర్యాలోచించినంగాని వస్తుతత్వము నిదమిత్థమ్మని నిష్కర్షించుట కష్టసాధ్యము. వీని స్వరూప స్వభావములను ఆర్యవ్యవహారములం దెలియుట శ్రేయమను మితహితవాచోయుక్తి కేవలసత్యముకాదు; కారణమీ యార్యజనులు సర్వజ్ఞులు కాకపోవుట; భ్రాంతి లోక సహజము, విశేషించి 'ప్రమాదో ధీమతామపి' యథోత్తరముగా, సోపపత్తికముగా నీ యంశము లీ క్రింద నిరూపితము.

వ్యాకర్తల అలసత, అనవధానత, శబ్దార్థ సుస్వరూపానభిజ్ఞులగు గ్రంథపరిష్కర్తల మిథ్యా పాండిత్యము, లిఖిత ప్రతులలోని చేతప్పులు, ముద్రిత ప్రతులలోని ముద్రా రాక్షసములు — మున్నగు అనేకానేక దోషముల మూలమున కూడ నీ తబ్బిబ్బు ప్రవర్తిత మగుచుండుట గమనింపందగినది. పూర్వపూర్వయుగములలోని కవిపండితుల మీంది ప్రమాణ బుద్ధినలన ఉత్తరోత్తర యుగములలోని కవిపండితులు ఆయా ప్రయోగరీతులను యథాతథముగా స్వీకరించి ప్రయోగించుటయు నీకృతక ప్రామాణిక రూపముల ఉనికికి ఒక ముఖ్య కారణము. కొన్నింటిని అచ్చుతప్పులో, అసలు తప్పులో నిశ్చయించుట దుశ్శకము. చాలమట్టుకు నిర్ధారకములును, ప్రామాణికములును నయిన సుపరీక్షిత రూపములే ప్రకృత సమీక్షలో ప్రదర్శింపంబడినవి.

కృతక ప్రామాణిక రూపములను అచ్చముగా విద్వద్వేశ్యుల విశ్వామిత్ర సృష్టియని వివక్షించుట పాక్షిక సత్యము. వ్యాకర్తలమాట యటుంచి, భాషా వ్యవహర్తలలో అక్షరశిక్ష నెఱుంగని పామరులు మొదలుగా ఊహాపోహ విచక్షణులగు పండితులదాంక వీని సృష్టిలో భాగస్వామ్యము గలవారే. మూఢులతో పాటు ప్రౌఢులుకూడ నీ విషయమున పాలు పంచికొనినవారనుట స్పష్టము, విపుల శబ్దశాసనులును, సత్యోక్తి శీలురను నగు విద్వత్కవులును, పరిశోధనలో తలలు పండినపెద్దలును శబ్దార్థముల నిర్దుష్ట స్వరూపజ్ఞానము నెడల భ్రాంతికి లోనగుచుండంగా, ఉపరిశోధనలో ఉద్దండులయిన చిన్నల సంగతి చెప్పనక్కఱ లేదు.

ఈ కృతక ప్రామాణిక రూపముల ప్రయోగ యోగ్యతను గూర్చిన సందేహము తలయెత్తుట సహజము. 'ప్రయోగ-శరణం వ్యాకరణ' మ్మనునది

భాషా విజ్ఞానవేత్తల దృష్టికూడ. భావప్రకటనావగాహనములే భాషకు ప్రాథమిక ప్రయోజనములు గావున వ్యవహారహాని కలుగనంతవరకు ఎట్టి భాషాప్రయోగ పక్కి నయినను సాధువుగా యంత్రించుట వీరికిని సమ్మతము వ్యవహారహాని కలిగినప్పుడు మాత్రమది ప్రయోగార్హతను కోల్పోవుననుట విస్పష్టము. కృతక ప్రామాణిక రూపములు చాలపాలు లోక వ్యవహారమున రూఢములయి యున్నవి. కావున వీనిని గ్రామ్యము లనియో, అనింద్య గ్రామ్యములనియో పరిగణించి పరిహరించుట యుక్తి సహముకాదు. ఇవి అవశ్యము సుపరి గ్రాహ్యములే. వీని పుట్టుక భ్రమ ప్రమాదముల మూలమున సంభవించినవని స్పష్టపఱుచుటయే ఈ వ్యాసము నుద్దేశము. ప్రసిద్ధములును, పండితలోక వ్యవహార నిబద్ధములును నగు కతిపయ కృతక ప్రామాణిక రూపముల దిక్ప్రదర్శన మిది.

1. పదాది రేఫ ఘటితములు :

పదాదిరేఫ ఘటిత సంయుక్త వర్ణ నిర్మాణము ఆంధ్ర భాషావికాసమున విశిష్టపరిణామము.

క్రొత్త-కొత్త, గ్రద్ద-గద్ద, త్రాడు-తాడు, ద్రొబ్బు-దొబ్బు, ప్రొద్దు-పొద్దు, బ్రతుకు-బతుకు, మ్రొక్కు-మొక్కు, వ్రేలు-వేలు అని యిట్లు పదాది సంయుక్తత యందలి ద్వితీయవర్ణమగు రేఫము లుప్తమగుట అర్వాచీనాంధ్ర భాషా లక్షణము, శ్లేషనిర్వహణ పారవశ్యమున ప్రయుక్తమయిన "ముసలి మానుల్" (వసు ౧-౪౫) అను ప్రయోగము నందలి "మాను" "మ్రాను" నకు పరిణత రూపము. అంగుళియను నర్థముగల "వ్రేలు" శబ్దమునకు రూపాంతరముగా "వేలు" శబ్దముగూడ కొన్నినిఘంటువులు గ్రహించుట గమనింపఁ దగినది. (చూ. వేంకటేశాంధ్రము, మానవవర్గు-౩౯; సాంబనిఘంటువు మానవ వర్గు-౧౭). కాని క్రీడి, క్రోవి, ద్రోవది, ప్రతిన, వ్రేఁడు మున్నగు తద్భవముల యందును, త్రాసు మున్నగు అన్యదేశ్యముల యందును రేఫము లోపింపలేదు. వ్రణము' వ్రాయు ప్రేవల్లెలోని తొలి వ్రాయి యగు వకారము లోపించి రవర్ణము శేషించుట విశిష్ట ధ్వని పరిణామము. పైన పేర్కొన్న పదముల జంటలలో రేఫరహిత రూపములకు రేఫఘటిత రూపములు మూల మాతృకలు. నిసర్గముగా రేఫఘటితములుకాని కొన్నిపదములను రేఫఘటిత

ములుగా భావించి సృష్టించిన కృతక ప్రామాణిక రూపములు పెక్కులు. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారీ విషయముల చేసిన వ్యాఖ్యానము పేర్కొనఁదగినది.

'చిన్నయసూరి మొదలయిన దక్షిణాది తెలుఁగుపండితులు వ్రేల్చు (= హోమము చేయు), త్రోలు, త్రావు, వ్రేయు (= వైచు) అని లేనిరేఫము చేర్చి ప్రయోగించినారు. మహాకవులు 'వేల్చు' అనే శబ్దము 'వే' ప్రాసస్థానమందుంచి ప్రయోగించడము ఎరుగుదుము.

క॥ పావకునకు నభిమంత్రిత
మైవేల్వఁగఁబడిన హవ్యమధిక....

(హరివం. పు. ౮-౯౩)

క॥ కావున నిత్తను వనలము
లోవేల్చెదననిన విని యులూచివలికె....'

(జై. భా. ౯-౬౬)

నన్నయాది ప్రాచీనకవుల ప్రయోగములున్నవి; కాని ప్రాస స్థలమందు లేవు గనుక చూపించలేదు. చూ. శ. ర. వేలుచు. అట్టి స్థలమందీ 'వ్రే' గల శబ్దము కనబడేదాఁకా 'వ్రేల్చు' సాధువని అంగీకరించలేముగదా' (బాలకవి శరణ్యము, ద్వి. ము. ౧౯౫౮ పు. ౨౩౪)

పెక్కు లక్ష్యములు బహు వారములు సావధానముగాఁ బరిశీలించిన చిన్నయసూరి వంటి లాక్షణిక చక్రవర్తియే యీ భ్రాంతిలో పడఁగా తక్కిన వారినిగూర్చి తడవనక్కఱలేదు. మచ్చునకు త్రావు, త్రుళు, త్రెగు, త్రోము, ద్రిఁడు, ద్రుడ్డు, ప్రక్క, వ్రేల్చు, శ్రీ కుసుమ మున్నగు కృతక ప్రామాణికముల యనువర్ణన మీ దిగువ ప్రదర్శితము.

౧. త్రావు < తావు, స్థానమని యర్థము 'ఈ యెలుక యిక్కడ నొక లాఁగ త్రావుచేసికొని' (నీతిచంద్రిక, పు. ౨౬) 'ఈ త్రావు తాతముత్తాతలు సంపాదించిన కొణాచిగాదు' (వైది. పు. 30)[1]

---

1. < ఈ సంకేతము మొనవైపున నున్నది. జన్యరూపమనిగాని, పరిణత రూపమని గాని అర్థము.

౨. త్రుళ్ళు < తుళ్ళు. ఎగిరిపడు, గర్వించు; ఎగిరిపాటు, గర్వము. రేఫ ఘటిత మనుటకు నిర్ధారక ప్రయోగములు లేవు. సజాతీయ ద్రావిడ భాషలలోని జ్ఞాతిపదావళి (cognate words) యందును రేఫము కానరాదు. 2

౩. త్రెగు, త్రెంచు < తెగు, తెంచు. 'చిత్రాంగుని బంధనములు త్రెగఁ గొట్టికి' (నీతిచంద్రిక పు. ౩౮) 'ఉచ్చు త్రెంచుకొని' (వైది. పు. ౪౨) 'ఇంచు కృత్తుప్పగా గమంబులు పరంబులగునపుడాగమాదేశ లోపంబులు పెక్కు దెఱంగులం గానంబడియెడి' (బాల వ్యా. క్రియా. సూ. ౮౮) సూత్రముక్రింద లక్ష్యములలో త్రెగు - త్రెంచు - త్రెంపు ఉదాహృతములు. బాలవ్యాకరణ వ్యాఖ్యాత లందఱు గూడ నీ రూపముల నంగీకరించుట పరిశీలనార్హము. తెగు, తెంచులు క్రమముగా తెగు, త్రెంచులకు రూపాంతరములని శ. ర. పేర్కొనుట అవిచారిత రమణీయము. (చూ. శ. ర ప్రథమ ముద్రణము ౧౮౮౫, పుటలు ౪౮౦, ౪౯౨, ౫౯౯) అది సంయుక్త రేఫములు లోపించెననుటకు శ్రీ చిలుకూరి నారాయణరావుగారు తెగు తెంచుల నుదాహరించుట ప్రామాదికము (చూ. ఆంధ్ర భాషాచరిత్రము. ప్ర. సం. పు. ౨౮౬) రేఫఘటితములనుటకు నిర్ధారక ప్రయోగములు మృగ్యము; వ్యుత్పత్తిపరముగా చూచినను రేఫము కన్పట్టదు.

౪. త్రోము < తోము మురికిపోవునట్లురుద్దు. 'చంద్రబింబముకాంతి నవరించి యా లేమ మోమును నునుపుగా ద్రోమిరొక్కొ' (భోజరా ౩-౨౪) ఈ పాఠము చిన్నయసూరి నిఘంటూట్టంకితమని సూ. ని సంపుటము ౪. పు. ౧౯౫ 'తోమిరొక్కొ' యని ముద్రితపాఠము. రేఫ ఘటితమనుటకిది నిర్ధారకముకాదు. 'అకవర్ణకంబు మాఱ్వాదులకగు (బాలవ్యా. కృదంత సూ. ౧౯. అను సూత్రము క్రింద 'త్రోము-త్రోమకము'లు లక్ష్యీకరింపబడుట శాస్త్ర విరుద్ధము. 'తోము-తోమకము అను సవరణములు సరికావు, అనివంతరాం వారి వత్తాసి (ఘంటాపథవ్యాఖ్య పు. 373) ఆయా పాఠముల సాధ్వసాధుతల నిర్ణయాధికారము వినా చిన్నయ సూరివి కాదుకదా ఏ కవి పాఠములను దిద్దుట కెవరికిని హక్కులేదు.

---

2. This is a clear case of hyper standardisation in Telugu by introducing an r in the form (Dr. Bh. Krishnamurthi, Telugu Verbal Bases P. 399).

చిన్నయసూరి ఉదాహరణములను సవరించుట తప్పు, ఈ రూపములు తప్పులని వివరించుటొప్పు. రేఫఘటిత మనుటకు బలము చాలదు. జ్ఞాతిభాషలలో ఇప్పట్టుల రేఫరూపము కానరాదు. దీనినిగూడ కృతక ప్రామాణిక రూపమనుట లెస్స. ఈ రేఫఘటితరూపమును శ. ర. కారుఁడు స్వీకరింపకుండుట గమనింపఁదగినది.

౫. ద్రిండు < దిండు = తలగడ. దట్టి, చుట్ట, పదాది రేఫఘటితమనుటకు నిర్ధారక ప్రయోగములు లభ్యము కాలేదు వ్యుత్పత్తి పరముగా 'దిండు' ప్రాథమిక రూపము.

౬. ద్రుద్దు < దుద్దు = ముద్గరము '....ఆ లెంకలినుప ద్రుద్దులగుదియలఁ బిడికిళ్ళ రోకళులను' (అచ్చ. రా. యు ౨-౨౭). ఇచ్చట పదాది రేఫ నిర్వాహము నిరాధారము.

౭. ప్రక్క < పక్క = పార్శ్వము. వైపు. ప్రాకృత, పక్ఖ-; సంస్కృత. పక్ష - 'నిఖిల ప్రపంచంబు నిక్క మీవని డొక్క ప్రక్కకుమెతుకు మాత్రమ్మ సుమ్మ.' (పాంచాలీపరిణయము, ౨ - ౨౭,) శ. ర. (౧౮౮౫) లో పక్క, ప్రక్కలు రూపాంతరములుగా ప్రదర్శింపబడినవి. వైకృతదీపికలో పక్క (పు ౭౦) ప్రక్క (పు ౮౧)లు రెండును పక్షశబ్ద భవములుగా నిరూపితములు. శ్రీ చిలుకూరివారు: ప్రక్కయే ప్రాచీనమనియు 'పక్క' పరిణతరూపమనియు భావించుట సరికాదు. (చూ. పు. ౨౮౬) పక్కయనియే నీతి చంద్రికా ప్రయోగములు. 'ఒక పక్క కొదిగి నిలుచుండి' (పు ౬౩) 'పక్క వెనుకలు కలయం జూచి' (పు. ౭౯) 'చెఱియొక పక్క ముక్కొనంగరచికొని' (పు. ౯౭)

౮. వ్రేల్చు < వేల్చు = హోమముచేయు, వేలిమివేల్పు మున్నగునవి. 'వేల్చు' ధాతు జన్యములు. 'ఇమివర్ణకంబుకలుగ్వాదులకగు' (బాలవ్యా. కృదంత సూ. ౪.) సూత్రము క్రింద నీఁబడిన 'వ్రేలుచు-వ్రేలిమి, శబ్దములు కృతక ప్రామాణికములు వేలుచు-వేలిమి అని వజ్ఝల వారి బాలవ్యాకరణోద్ద్యోతపాఠము (చూ. పు. ౪౪౦) 'వేలుచు వేలిమి' అనియే యుండ దగునని వంతరాం వారి వ్యాఖ్యానము (చూ. పు ౪౬౭) సూ. ని - ప్రదర్శించిన రేఫఘటిత ప్రయో

గములు నిర్ధారకములు కావు. లేఖకప్రమాదములు, ముద్రా రాక్షసములు, వస్తు తత్త్వమును తార్మాఱు సేయఁజాలవు. శబ్దాలంకార తత్పరత్వమున గూర్పబడిన 'ప్రేలిమి గలుగఁగముదముల ప్రేలిమి గులనవల ప్రేలిమొనర్పన్' అను ముకుందవిలాసపద్య భాగము (౩-౨-౭౬) నిర్ధారకము; కృతకప్రామాణికము (చూ. బాలకవి శరణ్యము, పు. ౨౩౪.)

౯. శ్రీ కుసుమ <సికుసుమ = (C-కుసుమ. వడ్లరకములలో నొకటి కుసుమ. కుసుమతో నవాంతర భేదము C-కుసుమ MTU 19(మాట్రేరు ౧౫వ నెంబరు కుసుమ) రకము పరిశీలకుల పరిగణనమున C- కుసుమ, శ్రీ కుసుమ. అవి కోస్తామండలముల వాడుక (చూ. మాండలిక వృత్తిపదకోశం, సంపుటము ౧ పు ౩౦౯). C- కుసుమను శ్రీకుసుమగా వాడుట కృతకము సీరామ - శ్రీరామ, సివాలచ్చిమి, సీమాఁలచ్చిమి-శ్రీ మహాలక్ష్మి. సీనయ్య - శ్రీని వాసయ్య - ఈ జంటలలోని ధ్వని పరిణామమునందలి సాదృశ్యము ననుసరించి C-కుసుమకు శ్రీ కుసుమ కృతకముగా కల్పితము.

౧౦. ఇంకను ద్రయ, ద్రేహము, బ్రందిఖానా, ప్రెందుకు - మొదలయిన కృతక ప్రామాణిక రూపములు వాడుకలో నున్నవి. 'తమవంటివారి ద్రయ వల్ల గురూ,' 'ద్రేహం గాజుకుప్పె' 'ద్రేహంలో వుండేది. పరమాఁత్మ', 'తెలిసినట్టి వారి ద్రేహంబులందును' ఇవి కన్యాశుల్క నాటకములో దుకాణదారుని వ్యవహారములు. 'ప్రెందునాకై వుంచీనావో బ్రంధిఖానాలో' అను దాసరులపాట తెలుఁగునాట ప్రసిద్ధము. తెలుఁగునందలి మార్మిక తాత్త్విక గేయరచనములనిట్టి ప్రయోగము కోకొల్లలు.

2. ఎదంతము లియాంతములగుట :

తెలుఁగునందలి ఇయాంతములగు తద్భవములు చరిత్ర మిట ప్రసక్తము, కఁటియ-కంటె, గడియ-గడె, చేడియ - చేడె' దీవియ-దీవె, పట్టియ - పట్టె బూమియ-బూమె, మల్లియ-మల్లె, వన్నియ-వన్నె, సాలియ-సాలె ఈ జంట లలో ఇయాంతములు ప్రాక్కాలికములు. ఎదంతముల ర్వాక్కాలికములు. మలిరూపములు తొలిరూపములకు పరిణత రూపములు, తొలి రూపములు

క్రమముగా ప్రాకృతములోని కంటి అ, ఘడిఅ, చేడిఅ, దీవిఅ, పట్టిఅ, భూమిఅ, మల్లిఅ, వణ్ణిఅ, సాలిఅ, లనుండి నిష్పన్నములు. సంస్కృతమునందలి కంఠికా, ఘటికా, చేటికా, దీపికా, పట్టికా, భూమికా, మల్లికా, వర్ణికా, శాలికా, - లు వీనికిమూల మాతృకలు ఇట్లు ఇయాంతములగు తద్భవ పదముల కన్నింటికిని తెలుఁగున నెదంత రూపములు గన్పట్టుచున్నవి. ఇట్లు ఎదంతము లన్నింటికి ఇయాంతము లుండునను భ్రాంతివలన తెలుఁగున శుద్ధదేశ్యములును నిసర్గముగా నెదంతములుననగు. తేనె, నూనె, పదములకు కృతక ప్రామాణికములుగ తేనియనూనియ వంటి ఇయాంత రూపములు సృష్టింపబడినవి. ఈ దేశ్యపదములలో ఎదంతములే ప్రాచీనములు కావున జన్యపదములు (derivatives) వీనిమీఁదనే అత్యధికముగ రూపొంది పెంపొందినవి. 'తేనె' యను ఎదంతరూపము మీఁద సుమారు పాతిక జన్యపదములును, 'నూనె' యను పదముమీఁద ఆఱు జన్యపదములును కావ్యాదికముల గోచరించుచున్నవి అర్వాచీనములును, కృతక ప్రామాణికములును నగు తేనియ, నూనియల మీఁద ఒండు రెండు జన్యపదములు మాత్రమే కన్పట్టుచున్నవి.

కృతక ప్రామాణిక రూపములయిన తేనియ, నూనియలు పండ్రెండవ శతాబ్దినుండి లభ్యమగుచున్నవి, 'కామియ బోయుణ్డు అచంద్రార్కం నూనియ నతిపంగలవాణ్డు' (ద. హిం. శా. సంపుటి ౫ సంఖ్య ౧౦౮౩. క్రీ. శ. ౧౧౧౦౮) 'తేనియ ముసురో యమృతపు వానయొ' (కు. సం. ౯-౩౬) 'అతఁడు తైలాభ్యంగ మడిగినఁ బతి గమ్మ నూనియఁ దెప్పించిమేను శిరము నభ్యక్తములు సేయ—' (భారత - అను. ౨-౩౦౮) 'ఉన్నత. తరువెక్కి జున్ను సేకుటఁ గొనితేనియ యానవివాని భంగి' (భారత, శాంతి ౧-౬౪) 'తేనియయుఁబచ్చిచవల' (విజ్ఞానే. ఆచార. ౮౯) 'తేనియఁబడ్డ యీఁగ గతి ధీరతఁ గోదడిక్వ. (దశకు. ౬-౩౦) 'తేనియ కాలువల్ తెరలిపాటు' (విక్రమా. ౧-౮౯).

తేనె నూనెల మీఁద నేర్పడిన జన్యపదముల కాకరములను కావడింపవచ్చు. వ్యుత్పత్తిపరముగా నయితము తేనె-నూనెలు ప్రాచీనములని ధ్రువపడుచున్నది. తీ + నెయ్ = తీయని చమురనియు, నూ + నెయ్ = నూవులనుండి తీసిన చమురనియు అర్థము. ద్రావిడభాషలలో నెయ్ అనఁగా చమురు. తమిళ

మున తిమ్ = తీయని; తేమ్ తీవు = తీపి: తేన్, తేనెయ్ = తేనె, కన్నడమున జేను, తేను = తేనె; మళయాళమున తేన్: తుళు తీపెశీపె ≤ తీపి; కోలామి నాయకి భాషలలో తేనె.

౩. తాలవ్య వ్యంజనముల మీఁది తాలవ్యేతర స్వరములు తాలవ్య స్వరములగుట

తెలుఁగునందలి చవర్గీయ ధ్వనులు తాలవ్య స్పృష్టోష్మములు. వీని మీఁద తాలవ్యేతర స్వరములు (అ, ఆ లు) వచ్చినప్పుడు అవి తాలవ్యస్వరములకు ఎ, ఏలుగా మాఱుచున్నవి.

౧. చేదస్తము < చాదస్తము < ఛాందసము: ఛాందసమనగా ఛందస్సంబంధి. ఛందస్సనఁగా వేదము. వేదము చదివినవారి గుణము ఛాందసము. దీని వ్యవహారిక రూపము చాదస్తము. వాస్తవముగా నొకవ్యక్తి నిశ్చఁదుఁడయినను సనాతనాచారపరాయణ ప్రవణత్వమున ఛాందసుఁడనీ ఛాదస్తుడనీలోకవ్యవహారము. మిశ్రబ్రౌణ్యమున ఛాదస్తమనఁగా వెఱ్ఱితనమనియు, జడత్వమనియు వివరింపఁబడినది '(చూ. పు. ౩౪) ఛాందసుఁడనఁగా బ్రహ్మయనియు' అమాయకుఁడనియుకావ్యప్రయోగములు. 'సారథి ఛాందసుండు బడిసాఁగదు. చక్రయుగంబు...' పాండు (౧-౧౧౪) ఇట ఛాందసుఁడనఁగా బ్రహ్మ మందుఁడనియు, జడుఁడనియు కవివ్యంగ్యోక్తి. ఈ తబ్బిబ్బుల కప్పల తక్కెడలో తాలవ్యస్వరములు తాలవ్యేతర స్వరములుగాను మాఱుట పరిశీలనార్హము. మౌలికముగా తాలవ్యస్వరఘటితములయిన చేట, చేత, చేఁప, చేయంగళ వంటివి క్రమముగా చాట. చాత; చాప, చాయంగల-గా వాడుకపడినవి. (చూ. విలియం బ్రౌను నిఘంటువు, పుటలు ౮౩, ౮౪)

౨. చేరు < చారు = మిరియాలు మున్నగువాని పొడిచేర్చి కాఁచిన చింతపంటి రసము. ఇది సంస్కృతము నందలి సారశబ్ద భవము తెలుఁగు నిఘంటువులలో చారు చేరు-లు రెండుకూడ స్వీకరింపఁబడినవి. కాని నిర్ధారక ప్రయోగములు మృగ్యము. తాలవ్యస్వరఘటిత రూపము యుక్తముగాఁదోఁపదని శ. ర. కారుల యభిప్రాయము. ఈ చేరు నెవరు తయారుచేసిరోకాని దీనిని

గూర్చిన రుచిభేదములు పండితలోకమున బహుధా విప్రతిపత్తిధీకలితములుగా వెలసినవి. (చూ. దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి సాహిత్య సమీక్ష, పుటలు ౧౬, ౨౧ నిడదవోలు వేంకటరావు. శ. ర, సవరణలు : వివరణలు, పుటలు ౭౩౮, ౭౩౯).

౩. జెలగ<జలగ. '....జెలగలు గఱచుటయుఁ జావుచేటొదవు....' (ద్వా. ౯-౩౬) ఇది ప్రాకృతము నందలి 'జలూగా' శబ్దభవము. సంస్కృతము నందలి జలూక - దీనికి మూల మాతృక, ఇట్లే తెలుఁగు నందలి చెత్త, చెర వము చెలగము సమీపమాతృకయగు ప్రాకృతమునందలి చెత్త సరావ, సలగ - శబ్దభవములు త్యక్త, శరావ, శలక యను సంస్కృతపదములు వీనికి మూల రూపములు.

4. సాధురేఫములు శకటరేఫములుగ పరిణమించుట :

ప్రాచీనాంధ్రము నందలి శకటరేఫఘటితరూపములు అర్వాచీనాంధ్రమున సాధురేఫ ఘటితములుగా మాఱుట ఒక ధ్వని పరిణామము. కొఱకు - కొరకు, జాఱు - జారు, మాఱు - మారు ఈ జంటలలో మొదటివి ప్రాచీనములు. తరు వాతవి అర్వాచీనములు. ధ్వని పరిణామ ఫక్కినిబట్టి పై జంటలలోని మలి పదములు తొలిపదములకు పరిణత రూపములు. ఇట్టి ధ్వనిపరిణామము ప్రవర్తిత మయిన తావుల మలిపదమునకు మూలరూపము శకటరేఫ ఘటితము. నిసర్గముగా సాధురేఫ యుక్తములగు పదములను శకటరేఫ ఘటితములుగా మార్చి వ్యవహ రించుట కూడ తెలుఁగున కలదు. 'ఆంధ్ర వాక్యముల యందుఁ బాదుకొనిన దీర్ఘముల మీఁది బండిఱా'ల నుదాహరించుచో అప్పకవి పేర్కొన్న బాజాఱి, ఱేవు, స్త్రాన్నాఱి. కోటబుఱుజు, హజాఱము- (అప్పకవీయము. ౨౧౯౬)- మున్నగునవి వ్యుత్పత్తిపరముగా శకటరేఫయుక్తములు కావు. తత్త్వాసక్తుల పరిశీలనము కొఱకు కొన్ని మాదిరిపదము లీ క్రింద నిరూపితములు.

౧. ఆసివాఱు < ఆసివారు. సవారి, సవారీ మార్గము. 'ఆసివాఱు తిరుగు' (కాశీ. ౪-౧౯౪) 'ఆసివాఱుగా నేఁగుసట్టి బయలు' (మను. ౧-౧౧) ఆసి (= అల్పార్థకము)+పాఱు (= పరుగెత్తు), ఆసివాఱు = మందగమ

నము అను నిఘంటుకారుల విలుపుగాని, వివరణముగాని శాస్త్రదృష్టికి గుఱికి కోసెఁడు దూరము. (శ. ర. ౬౫; లక్ష్మీనారాయణీయము, ౭౮ సూ.ని. ౧-౩౬౧; వావిళ్ళ, ౧-౨౧౩) సవారి, సవారులు, స్వారి, స్వారిచేయు మున్నగు నవి తెలుఁగున ప్రచురములు. పారసిభాషలో 'రౌతు' అను నర్థముగల 'అస్వార్' దీనికి మూలము. శకటరేఫ ఘటితమనుట నిర్యుక్తికము (చూ. శ్రీనాథయుగము-అన్యదేశ్యములు, ఆంధ్రప్రదేశ్ పత్రిక, ౧౯౬౩ ఏప్రిల్ పుటలు ౬౦౬౧).

౨. పైజాఱు < పైజారుపాదరక్షలు, 'పయిజాఱు, దీని రూపాంతరముగా ప్రదర్శితము. పై + జాఱు అని దీనిని అనుచిత విభాగ మొనర్చుటవలన శకట రేఫము సందుచేసికొనినట్లున్నది. ఈ విలుపుకాని, బండిఱాతో దీనిని ఉట్టం కించుటగాని సరికాదు. ఇది అన్యదేశ్యము. పారసిభాషలోని 'పాయ్‌జార్' దీనికి మూలరూపము. పాయ్ అనఁగా పారసిలో పాదము. పాయ్‌పోష్ అనఁగా పాదములను అచ్ఛాదించునవి.

౩. బాజాఱు < బాజారు. అంగడి వీధి. 'బాజాఱి కన్నియలు' (అప్ప. ౨-౧౯౭) శకటరేఫఘటిత మనుటకు నిర్ధారక ప్రయోగము మృగ్యము. 'బజాఱు' దీని రూపాంతరము. విపణియను నర్థముకల పారసి బాసలోని 'బాజార్' దీనికి మూలము. ఉర్దూ, హిందీ భాషలలో కూడ ఇదే యర్థమున 'బాజార్' వ్యవహృతము. మన నిఘంటుకారులిది ప్రచార / ప్రసార శబ్దభవమని నిర్ణయించుట అశాస్త్రీయము. (చూ. వైకృతదీపిక, పు. ౮౫, పురుషోత్తమ కవీయము, పు. ౯౯ సూ. ని. ౫-౧౦౪౬)

౪. బురుజు < బురుజు, కోట కొత్తళము మూల దిబ్బ. కావ్య ప్రయో గములలో శకట రేఫము కానరాదు. ఇది అన్యదేశ్యము. అరబ్బీ పారసీ భాషలలోని 'బుర్జా' దీనికి మూల మాతృక. 'బుర్జ్' అని ఉర్దూ, హిందీ భాషా రూపములు.

౫. మైజాఱు < మైజారు. ఆఁడుదాని కట్టుకొంగు. శ్రీనాథుని చాటువు లలో తడిసినది మైజారు కొంగుకాని మైజాఱు కొంగుకాదు. మై (= మేను,

శరీరము) + జాఱు; ఒడలినుండి జాఱువస్త్రము. ఇది మన పరిశీలకుల కత్తిరింపు. కాని ఇదికూడ అన్యదేశ్యము. పారసిలో మొలకు కట్టుకొను వస్త్రము అను నర్థముకల 'మిజార్' దీనికి మాతృక.

౬. ఱేవు < రేవు. నద్యాదులలో దిగుట కేర్పఱిచిన దారి. ఘట్టము. 'ఱేవు దాఁటి చెంచుఱేని నచట' (అచ్చ. రా. అయో. ౧౦౧), 'ఱేవులుగా నతని తల గొఱిగి పోవిడిచెన్' (వి. పు. ౮-౬౩). ఈ నిర్ధారక ప్రయోగముల మూలమున 'ఱేవు' కృతకప్రామాణిక రూపము దీనికి మూలమగు 'రేవు' శుద్ధ దేశ్యము. తెలుఁగున విడిది, స్థానము, స్థిరము అను నర్థములుగల 'ఇరవు' 'రేవు' నకు పూర్వరూపము. 'ఇరవు' నందు వర్ణవ్యత్యయము కలుగఁగా 'రేవు' సిద్ధించినది. తక్కిన సోదర ద్రావిడ భాషలలోని సామగ్రి వలనను దీనిని స్పష్టపఱుపవచ్చు. తమిళమున 'ఇరు' అనఁగా ఉండుట, ఇరుప్పు అనఁగా స్థానము, నివాసము అని వ్యవహారము. కన్నడము నందును అస్తిత్వము, ఆశ్రయము— అను నర్థములతో 'ఇరవు' శబ్దము ప్రచురము. మలయాళము నందు ఇరిప్పు అనఁగా నివాస స్థలము.

౭: వఱకు < వరకు. మేర, హద్దు, దాఁక. ఇది శుద్ధాంధ్ర దేశ్యపదము. నిర్ధారక ప్రయోగములు మృగ్యము. ముద్రిత ప్రతులలోఁ గన్పట్టు శకట రేఫ ఘటిత పాఠములు ప్రామాదికములు.

క॥ దేవరకంటెను మించునొ
దేవరకు సమానుఁడగునొ తెలియఁబడదు మే
మీవర కావిభుఁ బోలిన
భూవరుఁగని యెఱుఁగమనిన బుద్ధి చలింపన్.

(ఉ. రా. ౩-౨౨౬)

క॥ కావరమునఁ గానవు నీ
కా వర మఱుఁడిచ్చె ననుచు నది చెల్లెను నీ
కీవరకును విడువు మిఁకన్
నీ వరదర్పము నణంగ నేఁడు మృగాంకా.

(శశాం. ౫౬౧)

మీఁది పద్యములలో మూఁడవ పాదములలోని ఈ వరకును అన్నది ద్విప్రాస చమత్కారముచే సాధురేఫ ఘటితమని నిశ్చయించుట సుసంగతము. దీనిని శకట రేఫ ఘటితముగ మార్చుట పరిష్కర్తల కౌఱమాలినపని. వ్యుత్పత్తిపరముగా 'వరకు' ప్రామాణికరూపము: 'వఱకు' కృతకము. ఈ సందర్భమున ఇతర ద్రావిడ భాషలలోని జ్ఞాతిపదము లుకూడ పరిశీలనార్హములు. తమిళము, వరంపు, చేవిమేర, వరై, గట్టు, ఒడ్డు, వరైప్పు, మేర, సీమ, గోడ, కన్నడము.వరి, వరె, హద్దు, అవకాశము, దనుక, మలయాళము. వరువర, చదరంగపుగడి: వరు, హద్దు, అంచు, ఈ 'వఱకు' తల్లి గండానబుట్టిన తనయ. తక్కిన కృతక ప్రామాణిక రూపములయెడ మాతృకలుకూడ పుత్రికలతోపాటు నిలచియుండగా ఇది పుట్టి మాతృకయగు 'వరకు' ను మ్రింగి వేయుట వింత. పట్టుదలగల పెద్దల వ్రాఁతలలో 'వఱకు' తప్ప వరకు చూపట్టదు. ఈ పెద్దల చూపులో 'వరకు' గ్రాహ్యము అగ్రాహ్యము.

౮. సౌన్నాఱి <సౌన్నారి. స్వర్ణకారుడు. బంగారు పనివాడు. అప్పకవి దీనిని శకటరేఫఘటితమనుట కాధారము దురూహము. ఇది ప్రాకృత భవము, శకటరేఫము తత్సమ తద్భవములందు లేదను సూరిమతము మాకును సమ్మతము. ప్రాకృతమున సుణ్ణయార, సుణ్ణార, సౌన్నయార, సౌన్నార, సోణార - అను రూపములు కలవు. అపభ్రంశ అర్ధ మాగధీ ప్రాకృతములలో సొణ్ణార శబ్దము ప్రచురము. సువణ్ణకార శబ్దము పాలీ భాషలోని వాకుక, సంస్కృతము నందలి స్వర్ణకార శబ్దము వీనియన్నింటికి మూలము.

౯. హజాఱము <హజారము,ముఖశాల.అజారము,ఆజారము.హాజారము అనునవి రూపాంతరములు. ఇది అన్య దేశ్యము. శకటరేఫ ఘటితముగా స్వీక రించుట కృతక ప్రామాణికము. 'హజాఱంబులోన' (అప్ప. ౨-౧౫౩). ఆంధ్ర పద పారిజాతము (పు. ౭౯౦) నందును లక్ష్మీనారాయణీయము (పు ౮౨౦) నందును శకటరేఫఘటిత రూపమే ప్రదర్శింపఁబడినది. దీని మూల మాతృక పారసికభాషాపదము. పారసిలో 'హాజర్' = సన్నిధినుండు, సేవకుసిద్ధముగా నుండు; హాజిరాన్. హాజరే = సభ్యులు సభాస్తారులు। హజారా = కొలువు కూటము.

5. అజాది పదములు వకారాదులుగా మాఱుట.

పూర్వాంధ్రమునందలి వకారాది రూపములు అనంతరకాలమునను, అశక్తుల వ్యవహారమునందును అజాదులుగా మాఱిపోవుట కలదు. వాఁడు ఆడు. వీఁలు-ఈఁలు, వెద-ఎద, వెక్కిరించు-ఎక్కిరించు. వేడి-ఏడి మున్నగునవి మీఁది ప్రతిపాదనమున కుదాహరణములు. ఆడు, యినుతి. యిందాము. యేగ, యేదాలు మున్నగు వకారలుప్త రూపములు తన కాలమునాఁటి గ్రామ్యపదములని మూలఘటిక కేతన తన ఆంధ్రభాషా భూషణమున పేర్కొనుట గమనింపదగిన యంశము. (చూ. ఆంధ్రభాషా భూషణము. దివ్యప్రభావివరణము పుటలు ౩-౨౩౪) పైయుదాహరణములలోను, కేతన వివరణములోను నిరూపింపబడిన అజాది రూపములకు వకారాదులు మూలమూర్తులు, ఈ సాదృశ్యమును దృష్టి యందిడికొని సహజముగా అజాదులగు రూపములకు కృతకముగా సృష్టింపబడిన వకారాదులు లోక వ్యవహారము నందును, కావ్యలోక వ్యవహారము నందును ప్రత్యక్షమగుచున్నవి.

సామాన్య జనుల వాడుకలోనివిల్లు (ఇల్లు) వెండ (ఎండ), వెంత (ఎంత)లును, వైదిక బ్రాహ్మణ వ్యవహారములోని వింద్రయ్య. వేబుళం, విస్సావు,-మున్నగు రూపములును కొన్ని ఉదాహరణములు. అజాది రూపములగు ఎలుగుగొడ్డు, ఎలుగుబంటి, మన నిఘంటువులలో వెలుగ్గొడ్డు (బ్రౌణ్యము, పు. ౯౭౫), వెలుగుబంటి (విలియం బ్రౌను నిఘంటువు, పు. ౩౪౮, లక్ష్మీనారాయణీయము పు. ౨౮౩; ఆంధ్ర వాచస్పత్యము పు. ౨౪౦-౨,)వెలుగుమంటి (బ్రౌణ్యము: పు ౯౭౫) అని ఇట్లు వకారాదులుగా ప్రదర్శితమగుట మఱియొక నిదర్శనము. ఇచ్చట అజాది రూపమే ప్రాచీనము. తమిళమున ఎలు; తెలుఁగున ఎలుగు, ఎలువు, ఎల్గు, మధ్యద్రావిడ భాషలలో 'ఇలి'యను రూపములు ప్రసిద్ధములు. ఆడెలు-ఆడేలు, కుందెలు-కుందేలు, తోఁడెలు-తోడేలు, తాఁబెలు-తాబేలు, పొట్టెలు-పొట్టేలు మున్నగు జంతువాచక శబ్దములలోని ఉత్తర భాగములగు -ఎలు, -ఏలు అనునవి ఎలుగు శబ్దముతో వ్యుత్పత్తి సంబంధమును కలిగియున్నట్లూహించుట కవకాశము కలదు. కావున 'ఎలుగు,' 'ఎలుగుబంటి' అన్నరూపములే ప్రాథమికములని వెలుగుబంటి మున్నగు వకారాది రూపములు కృతక ప్రామాణికములని నిర్ణయించుట యుక్తియుక్తము.

మిశ్ర బ్రౌణ్యనిఘంటువున ఉట్టంకింపబడిన విరి పార్శ్వంబులు (< ఇరు పార్శ్వములు) వెంద్రకాయ (< ఎంద్రకాయ)లు కూడ కృతక ప్రామాణికములే.

ఇఁక సాహిత్యవ్యవహారము నవలోకింతము

౧. వెకచెకాలు <ఎకసక్కెములు. పరిహాసపు మాటలు. 'కిరీటితో వెకచెకాలాడుటకు రంగనాథము పిలిచెను. ఇంతలో సుమాపతీ సారథులు వచ్చిరి. వెకచెకాలు పోయి ప్రత్యక్షముగా సారథిని లొచ్చుపఱుచుటకు దాను ప్రయత్నము చేసెను.' (విశ్వనాథ సత్యనారాయణ, తెఱచిరాజు పు. ౨౬౫) "వాడిపవి పట్టిస్తాసు. నాతో వెకాస్యాలా,... వైదీకపగుంటడి వెకాశ్యాలు నిజం అమకుంటా వేవిఁట్ ?" (గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కములో రామప్పంతుల సంజాయిషీ. వెకిలి + హాస్యాలు వెకాశ్యాలు అను రీతిలో ఇది ప్రయోగింపబడినదా?) ఇక్కడ "ఎకసక్కెము" అనునదియే ప్రాచీన రూపము. తమిళములో ఎక్కచ్చెక్కమ్; మలయాళములో ఎక్కచ్చెక్కమ్, ఎక్కచ్చెక్కు; కన్నడమునందు ఎకసక్క, ఎక్కసక్కి ఎకిసక్కె; తుళుభాషలో ఎక్కచక్క అను వాడుకలు ప్రసిద్ధములు.

౨. వెడము <ఎడము. అవకాశము, సందు. "వెడమువెట్టకరావి ప్రియుఁగూర్పుమని రంభకిచ్చకమ్మలు పల్కి తెచ్చు విటుఁడు" (శ్రీరంగ. ౧౦-౫౮) తెలుఁగు నందలి ఎడ (= చోటు) ఎడపక, ఎడమ, ఎడము, ఎడయు మున్నగునవి "ఎడయు" ధాతు సంబంధులు. ఎడము అనఁగా అవకాశము. స్థలము, సందర్భము. అవి యర్థములు. ఎడమచేయి అనఁగా ఎడముఁగా నుంచవలసిన చేయి. కుడిచేయి = కుడుచు (భోజనము చేయు) చేయి. తమిళములోని ఇటమ్, మలయాళములోని ఇటమ్, ఎటమ్, కన్నడములోని ఇడె, ఎడ, ఎడెరూపములు తెలుఁగునందలి 'ఎడము'నకు పరంపరా సంబంధులు. ఇక్కడ ఎడము ప్రామాణికము; వెడము కృతక ప్రామాణికము.

౩. వెన్ను <ఎన్ను. వరిమొదలగువాని కంకి. 'కమలగర్భంబు లింతి జంఘలకు నోడి వేగఁ దృణమూని తలవంచె వెన్నుఁజూపి' (రుక్మిణీపరిణయము ౪-) 'వెన్నుచూపి తృణంబూని యెన్నరాని' (రసిక పు. ౧౧౧) 'చెఱకువెన్ను

పుట్టి చెలుపదా తీపెల్లి' (వేమన) 'చెలకుతుదవెన్ను పుట్టిన చెలకున తీపెల్లి చెలుచు (సుమతి) 'జొన్న వెన్నువిడుస్తూ వున్నది' (విలియం బ్రౌను నిఘంటువు' పు. ౩౪౬) 'వరివెన్ను దీసినది' (బ్రౌణ్యము పు. ౯౭౭౧) 'మన్నువెళ్ళకుండా దున్నితే వెన్నువెళ్ళకుండా పండును' (గెలెటి పు ౩౯౭) మధ్య ద్రావిడ భాషలలో నీపదము చ/శ కారాదిగాఁగన్పట్టు చున్నది. కోలామి, పర్జి భాషలలో వరికంకి అను నర్థమున. 'చెన్' పదమును, గదబభాషలో నదే యర్థమున 'చెన్ను' అనుపదము, జొన్నకంకి అను నర్థమున గోండి నాయకీ భాషలలో 'శెన్' అను పదమును వాడుకలోనున్నవి. ప్రాచీన మూలద్రావిడ భాషలోని పదాది చకారము మధ్యద్రావిడ భాషలలో లోపింపలేదు. తెలుఁగునందును, తమిళ, కన్నడ మలయాళాది దక్షిణ ద్రావిడ భాషలందును మూలభాషలోని చకారము చెదరు చెదరుగా లోపించినది. ఇట్లు మూల ద్రావిడభాషలోని పదాది చకారము లోపింపఁగా నేర్పడిన రూపమే సస్యాదిమంజరియను నర్థముగల తెలుఁగునందలి 'ఎన్ను'. దీని కృతక ప్రామాణిక రూపమే మన చర్చలోని 'వెన్ను'. వీఁపు అను నర్థముగల 'వెన్ను' దీనికంటెభిన్నము. తెలుఁగునందలి ఆకలి ఇచ్చు, ఉప్పు మున్నగు దేశ్యపదములు పదాది చకారలోపము వలన రూపొందినవే.

౪. వెంపలి < ఎంపలి. చింతాకువంటి ఆకు గల చిన్న అడవిమొక్క, బాణపుంఖి. 'మద్దులు మునింగి పాలు వెంపళ్ళు తమకెంత బంటియనుట' (ఉ. హరి. ౪౧-౨౪) జిడ్డు వెంపలి, పెద్దవెంపలి, ముల్లు వెంపలి, వెలివెంపలి మొదలయిన వెంపలి భేదములు బ్రౌణ్యము (పు. ౯౬౫) లో ఉదాహృతములు. హంస వింశతి కావ్యమునందును 'జిల్లేడు వెంపలి జిడ్డు వెంపలి... ముల్లు వెంపలి....' (౪౪౦) మొక్కలు పేర్కొనఁబడినవి. కాని 'ఎంపలి' యను అజాది రూపమే ప్రాచీనము. కన్నడమునందు ఎంపలియే కలదు. 'ఏనుఁగు చిక్కెనేని మఱి యెంపలి చెట్టునఁగట్ట వచ్చునే'. (ద్వా. ౧౧-౨౭) 'లంపటుఁ బడఁగఁదాళ్ళకుఁ దలబంటి యెంపటి చెట్లకు నికనెంతబంటి' (ద్విపద పరమయోగి విలాసము పం. ఆ. పు. ౩౬౧) ఈ నిర్ధారక ప్రయోగములనుబట్టి గూడ నిది అజాది రూపమని నిర్ణయించుట యుక్తి యుక్తము.

౫. వెసరు < ఎసరు. వంటకొఱకు కాచెడినీరు. 'దేశకాలపాత్రములు గుర్తించక పెద్ద కుండకు వెసరుపెట్టి....' (ఆర్. వెంకటేశ్వరరావు, పుట్టపర్తి

సాహిత్య విమర్శ. పు. ౭౮). 'తలకు మీఱిన పనికి పూనుకొనుట' అని ఇందలి జాతీయమున కర్థము. ఇచ్చట 'ఎసరు' అను అజాది రూపమే ప్రాథమికము. తెలుఁగున అత్తెసరు, ఎసటికుండలు, ఎసటిపోఁతలు అని వ్యవహారము. తమిళమున 'ఎచర్' కన్నడమున ఎసర్, ఎసరు, కొలామి నాయకీభాషలలో ఎసర్ అనురూపము లుండుటచే అజాది రూపమే ప్రాచీనమని స్పష్టపడుచున్నది.

౬. వేట < ఏట. దేవతకు బలి యిచ్చుటకై, ఏర్పఱుపఁబడిన మేఁకపోతు. 'వెలయన్ వేటలు బోనముల్ సిదులుగావించెన్ సుతోత్పత్తికై' (హంస ౨-౯౨) 'వేటయనుమేషమృగయలు వెలయుచుండు' (ఆంధ్ర భాషార్ణవము. ౩-౫౮) నిఘంటువులలో వేటయను వకారాది రూపము కూడ గ్రథిత మొనర్పఁబడినది. (చూ. విలియం బ్రౌను. పు. ౩౪౬; బ్రౌణ్యము ౯౭౬;: శ. ర. ౧౦౨౨. లక్ష్మీనారాయణీయము. పు. ౭౮౫; ఆంధ్ర వాచస్పత్యము, పు. ౨౪౦౬; సూ. ని. ౬-౫౩౭) ఏట యను అజాది రూపమునకు ప్రాచీన ప్రామాణిక ప్రయోగములు గలవు. 'ఏట వెంట్రిక తన కీశ్వరుండనుచు' (బసవ పు. ౪-౪౧౭) 'ఏట వెంట్రికయుఁదానిల లింగమయ్యె' (పండితా దీక్షా. పు. ౫౩) ఏటకు ఏడి, ఏడిక – యను రూపాంతరములును గలవు. 'శరభసింహ వ్యాఘ్ర సత్త్వచయంబుల నేడిక లెట్లట్లయెక్కియాడి' (భారత. ద్రోణ. ౨-౨౧౦) ఇఁక సోదర ద్రావిడ భాషలలోని జ్ఞాతి పదములను పరిశీలింతము. తమిళము. ఆటు, యాటు = గొఱ్ఱె; ఆట్టాళ్ = గొఱ్ఱెల కాఁపరి; మలయాళము. ఆటు = గొఱ్ఱె. ఆట్టుకారన్ = గొఱ్ఱెలకాపరి; కన్నడము, ఆడు; తుళు; ఏడు; ఈ వేట సబిందుకమనుట దుర్బలయుక్తి. వెంపలి. వేట–లు ప్రాథమిక రూపములనియు ఎంవలి. ఏట–లు పరిణత రూపము లనియు తెనుఁగు వ్యాకరణ వికాసము (ప్రథమ సంపుటము పు. ౧౨౫) విర్ణయించుట చింత్యము.

6. అజాది పదములు హకారాదులగుట :

హకారాది పదముల తొలివర్ణము లోపించి (deaspiration) అజాది రూపములగుట తెలుఁగున సర్వ సాధారణమగు ధ్వని పరిణామము. హనుమఁడు–అనుమఁడు, హరుసము–అరుసము, హళది–అళది, హితవు – ఇతవు మున్నగు తద్భవములయందును, కన్నడనుండి తెలుఁగులో ఎరవు పదములుగా ప్రవేశించిన హజ్జ–అజ్జ, హత్తు–అత్తు, హదను–అదను, హసాదు–అసాదు, హంకక్కి–

—ఉళక్కి, హెగ్గడి-ఎగ్గడె, హేరాళము—ఏరాళము, హొసపరి—ఒసపరి, హోళిగ—ఓళిగ ఇత్యాది పదయుగళములందును, అన్యదేశములయిన హకీము – అకీము, హజారము – అజారము, హురుమంజి – ఉరుమంజి మున్నగువానియందును పూర్వోక్త ధ్వని పరిణామము ప్రవర్తితమగుట ప్రస్పష్టము. మీఁది జంట పదములలో అజాదులకు హకారాదులు ప్రాచీన రూపములు; సమీపమాతృకలుగూడ, ఇట్లు అనేక అజాది రూపములకు హకారాది రూపములుండు సాదృశ్యమును పురస్కరించికొని నిసర్గముగా హజాదులగు కొన్నిపదములకు కృతకముగా హకారాది రూపములు కల్పింపఁబడినవి.

హకారాదులగు నిట్టి కృతక ప్రామాణిక రూపములు ఇతర భారతీయ భాషలలోను లేకపోలేదు. మచ్చునకు కొన్నింటి ముచ్చట: అర్ధమాగధీ ప్రాకృతమున హుట్టాయనఁగా పెదవి. ఇది సంస్కృతమునందలి ఓష్ఠశబ్దమునకు వికృతి. విశిష్టమగు ఈ ధ్వని పరిణామరీతిని వరరుచి, హేమచంద్రుఁడు, క్రమదీశ్వరుఁడు మున్నగు ప్రాకృత భాషా వ్యాకర్తలు గుర్తించిరి. దీనిని హకారము యొక్క (Prothesis) వర్ణాదిత్వము – అని పిషెల్ మహాశయుని పరిగణనము. (*R. Pischel, Comparative grammar of Prakrit Languages, Para 338). మహారాష్ట్రీ ప్రాకృతము నందును ఓష్ఠ శబ్దవికారముగా హోట్ట ప్రామాణికరచనములలో ఉపయుక్తము (చూ. పాఇఅ సద్ద మహణ్ణవో, పు ౧౧౯౫.)

తులసీదాసు, మాలిక్, మొహమ్మద్ జాయసీ, నూర్ మొహమ్మద్ మొదలయిన ప్రసిద్ధకవులు కావ్యరచనోపయోగిగా స్వీకరించిన అవధీ భాషలోఁ గూడ నీ ధ్వని పరిణామము ప్రవర్తితము. 'సుతహిరాజ్ రామహి, బనబాస్, దేహులేహు సబ్ సవతి హులాసూ' అని తులసీదాసు ప్రయోగము. 'తజమన చింత బఢ్ హోవ. హులాసు' (త్యజించు చింతను పెంచు ఉల్లాసము) అని నూర్ మొహమ్మద్ అభిభాషణము. 'హులసీ లంక్ లంక్ సఖమ్ లసీ'— పద్మావతీ కావ్యమున మాలిక్ మొహమ్మద్ జాయసీ ప్రయోగమిది. అవధీ భాషలో ఓష్ఠ శబ్ద భవముగా హోఁఠ్ అను పదమున్నట్లు పరిశీలకుల నిర్ధారణము. (** Baburam Saksena, Evolution of Awadhi, P. 109)

మైథిలీ భాషలో సహితము హాక్రోస్ < ఆక్రోశ—, హులాస్ < ఉల్లాస రూపములు వ్యవహారములో నున్నట్లు తెలియుచున్నది. (* Subhadra Jha, The Formation of Maithili Language, London. 1958, P. 192).

బంగాళీభాషయందును హభిలాష్ < అభిలాష: హరితా < అరిష్టా; హాకులీ < ఆకుల; హుల్లాస్ < ఉల్లాసవంటి కృతక ప్రామాణికములు వాడుకలో నున్నవి

హిందీలో హులాస్ = ఉల్లాసము, ఆహ్లాదము, హులాసీ = ఉత్సాహి (శబ్ద సాగర్, పు. ౩౮౩౨) హోఁఠ్ = ఓష్ఠము (పైది, పు. ౩౮౪౧), మరాఠీ భాషలో ఓష్ఠ శబ్దభవమగు హోఁటా, హోఁటాళీలు వాడుకపడినవి. గుజరాతీలో హులాస ప్రయుక్తము. (M. B. Belsare, Gujarati - English Dictionary, P. 842)

తెలుఁగునకు సజాతీయభాషయగు కన్నడమునుండి ధ్వని పరిణామము లాక్షణిక సమ్మతిని బడయుట విశేషము. 'పదాదె యందలి అత్వమునకు .... హత్వమాపాదితమగు' నని కర్ణాట భాషాలాక్షణికుఁడగు కేశిరాజు తన శబ్దమణి దర్పణమున 'ఆదియొళిర్ద త్వక్కం...హత్వమాపాదితమక్కుం', (సూ. ౨౬౯); అని నిరూపించినాఁడు. ఈతఁడే తన కృతి యందలి అపభ్రంశ ప్రకరణమున అగ్నికి 'హగ్గి' యను తద్భవమును సూచించుట గమనింపఁదగినది. చీల్చు, విదారించు అను నర్థములుకల తెలుఁగునందలి 'ఒడియు' క్రియాధాతువునకు కన్నడమున జ్ఞాతిరూపమగు 'ఒడె' యను రూపమునకు 'హొడె' యను కృతక ప్రామాణికరూపము సలక్షణభాషలో ప్రయోగింపఁబడినది. కన్నడమున 'హడప' అనఁగా చిన్నసంచి, 'హడపగార' 'హడపిగ, అనఁగా అడపమువాఁడు. 'హడపవళ' 'హడపాళి' అనఁగా అడపగత్తె. ఈ పదములన్నియును కన్నడమున కృతక ప్రామాణిక రూపములు. ఇవి సహజముగా అజాదులు. కన్నడము అడకి, అడికె = పోకచెక్క; అడకొత్తు, అడకోతు అడగత్రి = అడకొత్తు, తమిళము అడైప్పై = తాంబూలపుతిత్తి; అడై = తమలపాకు; పై = తిత్తి, పొది; మలయాళము. అడప్ప = తాంబూలపుసంచి। తెలుఁగున అడప, అడపగత్తె, అడపము వాడు, అడకత్తెర, అడకొత్తులతోపాటు 'హడపము' కూడ ప్రచురము; ఇది కన్నడమునుండి ప్రతిదేయము. అర్ధమాగధీ ప్రాకృతమునందును, దేశీ ప్రాకృతమునందును తాంబూలపాత్ర, ఆభరణకరండము అను నర్థములతో వాడుకపడిన 'హడప', 'హడప్ప' రూపములు కర్ణాట భాషాప్రభావ సూచకములు (చూ, అభిదాన రాజేంద్రః, సప్తమభాగః, పు. 1173).

ఇఁక తెలుఁగువైపు చూచినచో తత్సమములు, తద్భవములు. దేశ్యములు, అన్యదేశ్యములు అను భేదములతో నిమిత్తములేక అన్నింట నీ కృతకప్రామాణికరీతి ప్రవర్తితము. ఇట్టి హకారాది పదములు అన్యత్ర[1] విపులముగా వివరింపఁబడి యుండుటచే ప్రకృత చర్చలో అందలి సారము మాత్రము సంగ్రథితము.

హంశ (<అంశ), హంశము (<అంశము), హాశ్చర్యము (<ఆశ్చర్యము). హిద్ధమ్ము౯[2] వు (<ఇద్ధమున్వు), హీర్ష్య (<ఈర్ష్య), హీస్వార వరప్రసాదుఁలు[3] (<ఈశ్వర వరప్రసాదులు) మున్నగునవి తత్సమముల మీఁద నేర్పడినవి. హక్కసు (<అక్కసు <ప్రాకృత. అక్కోస> సంస్కృత. ఆక్రోశ-), హారతి (<ఆరతి <ప్రాకృత. ఆరత్తియ <సంస్కృత, ఆరాత్రిక-) ఇవి తద్భవముల మీఁద రూపొందినవి. హడలు (<అడలు = బెదరు, భీతి) పులహోర (< [4](పులియోర, పులి + ఓరెము పులియోగిరము = పులుసు మొ॥ కలిపిచేసిన యన్నము; 'పులిహోర' కొందఱ కిష్టము). హిరువది[5] (< ఇరువది), హౌర (<ఔర)—ఇవి దేశ్యపదముల మీఁద కల్పింపబడినవి. హుడయరు[6] (<ఉడయర్) తమిళపదమునకు వికృతి. హెచ్చరిక (<కన్నడ. ఎచ్చరికె) అన్నది కన్నడపదము నాశ్రయించి అవతరించినది. శ్రీ చిలుకూరి నారాయణరావు గారు ఆదిహల్లోపమునకు లక్ష్యములుగా ఎచ్చరిక, ఎచ్చరికించు, ఎచ్చరించు లను ఉదాహరించుట. (ఆంధ్రభాషా చరిత్రము, సంపుటము 1, పు. ౨౦౭) అవిచారమూలకము. హెచ్చరిక, హెచ్చరికించు, హెచ్చరించు-లు

---

1. హకారాది పదములు, ఆంధ్రప్రదేశ్ పత్రిక, 1964 మే పుటలు 17-19.
2. దక్షిణ హిందూదేశ శాసనావళి సంపుటము 5, సంఖ్య 50.
3. పైది.
4. చక్కెర పొంగలితోపాటు తెలుగువారి పులిహోర కూడ హిందీవారి నోటికి హితవయినది. (చూ. హిందీ శబ్దసాగర్, పు. 2162)
5. దక్షిణ హిందూదేశ శాసనావళి, సంపుటము 5, సంఖ్య 50. పదిహేను (<పదియేను) పదిహైదు (<పదియైదు), పదహారు (<పదియారు), పదిహేడు (<పదియేడు) అను హకార ఘటిత రూపములు కూడ వాడుకలో ప్రచురములు.
6. పైది.

క్రమముగా వీనికి కృతక ప్రామాణిక రూపములేగావి యథార్థ రూపములు కావు. ఇంత రగడ చేసి 'పదాదిహల్లోప హలాగమములలో నేది కలిగెనో యింకను విచారింపవలసి యున్నది.' (పై ది. పు. ౨౭౦) అవి చిలుకూరివారు చివరి మాటలో తేలిపోవుట చింత్యము.

హంవీఁరుడు(<మారాఠీ. అమీర్ < పారసి.అమీర్);హస్తిభారము(< పారసి. ఉస్తువార్ = పునాది) హిజారు (<పారసి ఇజార్ = చిన్నలాగు)హిరాకి (<పారసి. ఈరాక్ = దేశనామము) హిరాణీ (<పారసి. ఈరానీ = ఇరాన్ దేశసంబంధి) హుజుబెక్ (<పారసి. ఉజ్‌బెక్ = ఉజ్‌బెక్‌స్థాన్) — ఇవి అన్య దేశ్యములపై ఏర్పడినవి. 'హింగ్లీజు' అన్నది 'ఇంగ్లీషు' అనుమాటకు కృతక ప్రామాణికము.

సర్వజ్ఞులమని విఱ్ఱవీఁగు మన యేమఱిపాటును దెలుపుట కివి చాలు. 'శేషంశిష్ట ప్రయోగత్వాత్' అవి తృప్తిపడకుండ జిజ్ఞాసువులు ధీరమతియుతుల తోడ విచారముచేసి తత్త్వము నెఱుఁగుట మేలు.

'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చయత్ స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే.'